

# వైకుంఠపాళి

'**VAIKUNTHAPALI**' – A novel in Telugu that
attempts to decipher the hidden purports of
ancient game called 'Vaikunthapali' or 'Paramapada Sopana Patam.'

By: C. Raghothama Rao,
Founder Editor www.newaavakaaya.com & www.madhvahistory.com

Pages: 328

© Author

Coverpage Design by : Kuchi Sai Sankar [colormaster05@gmail.com]

First eBook Release : 2012
Second Release : 2016

# మరొకడు రఘోత్తమ రావు ...

మరొకడు రఘోత్తమ!

★★★★★★★

"ఒకడు నాచన సోమన" అని విశ్వనాథ అన్నారు.

"మరొకడు రఘోత్తమ" అని నేను అంటున్నాను.

ఈ మాట నేనేదో  సెన్సేషన్ కోసం అంటున్నది అంతకన్నా కాదు.

అవును  ముమ్మాటికి విశ్వనాథ కు కొనసాగింపు రఘు రచనలు.

కొంచెం వివరంగా చెప్పాలంటే లేదా రీసెర్చ్ మెథొడాలజీని అడ్డం పెట్టుకొని పలకాలంటే 'వేయిపడగలు' లో విశ్వనాథ ఎక్కడ ఆగిపోయారో రఘు తన వైకుంఠపాళిని అక్కడితో మొదలు పెట్టాడు. దీనర్థం విశ్వనాథను తగ్గించడమో లేదా రఘు ని పొగడడానికో అనే దుర్బుద్ధి ఈ ఇక్బాల్ కి లేదని ముందే మనవి.

విశ్వనాథ ఓరియెంటేషన్ ఏదైతే వుందో దాన్ని సానబట్టి మెరుపులు మెరిపిస్తున్న ఫిజికల్, మెటాఫిజికల్ స్టోరీ ఈ 'వైకుంఠ పాళి.'

రఘు పై ప్రేమ తో కానీ పగ తో కాని నేనీ వాదన చేయడం లేదు. రఘు రచనలు మరీ ముఖ్యంగా 'వైకుంఠపాళి' నవల చదివిన తర్వాత మీరూ ఇదే నిజమని ఒప్పుకుంటారు...

ఈ రోజు 'వేయిపడగ'ల్ని చదివితే దాని ముగింపు సమగ్రంగా వుందని అనిపించదు. ఏదో లోపం వుందని అనిపిస్తుంది. లోపం అనడం కన్నా దాన్ని గ్యాప్  అనడం సబబు. ఆ ఖాళీని రఘు పూరిస్తున్నాడు. కొన్ని విషయాల్లో 'వేయిపడగలు' ని మించిన  వైనమూ చూడొచ్చు.

బహుశా మరో 30–40 ఏళ్ళ తర్వాత 'వైకుంఠపాళి' కి ఆనాటి సమాజానికి మధ్య వున్న ఖాళీని పూరించడానికి మరో విశ్వనాథ, మరో  రఘోత్తమ రావు అవసరం రావొచ్చు కదా.. రావాలి కూడా..!

సాహిత్యం మడుగు నీటిలా ఒకే చోట నిశ్చలంగా వుండదు, వుండరాదు కూడాను. నిత్య ప్రవాహశీలమై వుండాలి.

అలా చూస్తే నిన్నటి ప్రవాహానికి మరో లింకు నేటి ప్రవాహం పేరు – కడప రఘోత్తమ రావు.

అయితే రఘు పై విశ్వనాథ ప్రభావం కానీ 'వేయిపడగలు' ప్రభావం కాని ఇసుమంతయినా లేదని నేను కచ్చితంగా చెప్పగలను. షేక్స్పియర్ లో కనిపించే చాలా అంశాలు పింగళి సూరన లోనూ వుంటాయి. మరి సూరన పై షెక్స్పియర్ ప్రభావం వున్నట్లా?

ఇదీ అంతే...

విశ్వనాథ కొనసాగింపు మాత్రమే రఘు లో  చూస్తాము.

శైలి విషయంలో ఎవరికి వారే..

ఇద్దరిలోనూ కాన్సర్వేషన్ మెథడ్ కనిపిస్తుంది.

అయితే విశ్వనాథ శైలి కన్నా రఘు శైలి కి ప్రవహ వేగం ఎక్కువ. అలాగే బ్రీవిటి కూడా ఎక్కువే...విశ్వనాథది 5 రోజుల ఆట అయితే రఘు వచన శైలి 20-20.

'దేత్తడి ధనాధన్'. మొత్తం 300 పేజీల్లో 3000 పేజీల సారాన్ని పిండాడు రఘు.

★★★★★

రచయితగా రఘు విశ్వనాథ ను ఇమిటేట్ చేయలేదు. స్వతహాగా రఘు వ్యూ ఆఫ్ లైఫ్ స్టైలే అల్లాంటిది. వృత్తి పరంగా తన నవల్లోని అనంత్ పాత్ర లానే కార్పోరేట్ కంపెనీల్లో ఉద్యోగాలు చేసాడు..అయినప్పటికీ నిజ జీవితంలో కేశవశర్మ వంటివాడు. అలా అని అన్య సంప్రదాయల పట్ల విషం గక్కడం తెలీదు.

రఘు కి ఆధ్యాత్మికత వొక ఫిలాసఫి మాత్రమే. అంతే కానీ రాజకీయం కాదు. వ్యాపారం అంతకన్నా అసలే కాదు..

మనోడికి వున్న జ్ఞానం/విజ్ఞానానికి యే బాబా/స్వామీ వేషమే వేస్తే అతి తక్కువ కాలం లోనే ఇప్పుడు వున్న చిన్నా చితకా బాబాలు/స్వాములు తన దుకాణాల్ని మూసుకోవడం గ్యారంటీ.

కాకపోతే మనవాడి కమిట్మెంట్ అలాంటిది. గత 13 యేళ్ళుగా రఘులో నేను చూస్తున్నది ఈ శైలే.

★★★★★

కన్నడిగుడైన  రఘు ఆంగ్ల సాహిత్యం లో ఎం.ఏ చదివాడు.

సంస్కృత, ఆంగ్ల భాషల్లో ప్రవేశంవున్న రఘు ఇప్పుడు తెలుగు సాహిత్యం లో తనదైన శైలి తో వచన రచన లో తనదైన బలమైన ముద్రను వేస్తున్నాడు. బహుశా రఘు సాహిత్య భావజాలంతో సంప్రదాయేతర వాదులకు కన్నా సంప్రదాయ వాదులకే ఎక్కువ నొప్పి కలగవచ్చు అని నా అనుభవం చెబుతున్న అనుమానం.

ఎందుకంటే ఇదొక ఇగో కి సంబంధించినది. ఎప్పటి నుండో వాళ్ళకి తెలీని విషయాల్ని ఇప్పుడొక కుర్ర విశ్వనాథ వచ్చి ఆ కఠిన, కఠోర సత్యాల్ని పొట్లంలా విప్పి అలవోకగా చెబుతుంటే కరిగిపోతున్న వాళ్ళ పెద్దరికాన్ని చూసుకుంటూ విద్యార్థుల్లా వినాల్సివస్తున్నదనే సైకలాజికల్ ఫోబియా అది.

ఈ నవలలో చర్చించిన అనేక విషయాలు శాస్త్రం పట్ల రఘుకి వున్న సమగ్ర పరిశీలన, పరిశోధనను చూపుతుంది.

ఒక విషయాన్ని అనేక రకాలుగా పరీక్షించిన తరువాతే కాగితం మీద పెట్టే అలవాటు వుంది ఈ రచయితకు.
'వైకుంఠపాళి' ఒక మనోవైజ్ఞానిక నవల.

దీనిలోని పాత్రలు కేవలం సింబాలిక్ షేడ్స్ మాత్రమే.

మనో గర్భం లో నిక్షిప్తమైన నిగూఢ రహస్యాల్ని మనోరంజకంగా దారి చూపే మోహదీపాలు. మోక్ష మార్గాలు కూడా!

అందుకే ఒక్కో సారి పాత్రలు తమ పరిధికి మించి ప్రసంగాలు చేస్తున్నాయా అనే అనుమానం కలుగుతుంది. అయితే ప్రతిభావంతుడైన రచయిత చేతిలో సృష్టించుకొన్న పాత్రలకు ఆ మాత్రం  స్వేచ్ఛ ఆమోదయోగ్యమే కదా!

ఈ నవల లో ముఖ్యమయిన పాత్రలు మూడు జంటలు.

శ్రీ మహా విష్ణువు, శ్రీ మహాలక్ష్మి ... ఇవి అలౌకికాలైన పురాణ పాత్రలు.
కేశవ శర్మ, సుమతి  ... ఒక  ఆదర్శ జంట
అనంత్, రంజని ___. ఆధునికోత్తర జంట

మొదటి జంట ఆడిస్తుంటే మిగిలిన ఇరు జంటల చుట్టూ మానవీయ కథా కథనం చక్కర్లు కొడుతుంది.
కేశవ శర్మ, సుమతిలు నిజంగా అసూయ కలిగించే పాత్రలు. ఇవి బహుశా రచయిత మనసులో పుట్టిన ప్లాటానిక్ పాత్రలేమో!

వీరి దాంపత్యంలో ఒక్కోసారి ఆదర్శ దాంపత్యం, మరోసారి గురు–శిష్యుల రిలేషన్‌షిప్ తో పోటీ పడుతుంటాయి. ఈనాటి కాలంలో ఇలాంటి పాత్రలు నిజ జీవితంలో ఆశించడం అత్యాశే అవుతుంది. ఇప్పుడు కేశవ శర్మల కంటేనూ అనంత్ లే ఎక్కువ కనిపిస్తారు.

అనంత్, రంజనిల జంట కొంచెం కల్లోల ప్రవాహం వంటిది.

ఆటుపోట్లు, కుదుపులు, సరసాలు, విరసాలు కలగలిసిన దుఃఖిత పాత్రల సుఖాంత కథనం వీరిది.

వీరేకాక సుబ్బు మధ్యలోమధ్యలోనే వెళ్ళిపోయే అతిధి ..

విశ్వేశ్వర్, అతని చెల్లెలు, పావని, స్టెల్లా, ముకుల్, రంజని బాస్ ఇలా అన్నీ అలా వచ్చి తమ తమ ప్రత్యేకతలను చూపించి రంగం వదిలి పోతుంటారు.

కథా పరంగా రచయిత జోక్యం ఎక్కడా కనిపించదు. పాత్రల పరంగా చూస్తే–––

కథ లో 2 ముఖ్యమయిన మలుపులు వున్నాయి.

మొదటిది రంజని సుమతి ని కలవడం.(వీరు ఒకే ఒక్కసారి కలుస్తారు, మరోసారి ఫోన్లో కొన్ని క్షణాలు పలకరించుకుంటారు)

రెండోది: సుబ్బు ఆత్మహత్య...

ఈ రెండు ఘట్టాలే కథా కథానంలో మరింత వేగాన్ని పెంచుతాయి. కథకు మూలం కూడా ఈ రెండు సంఘటనలే అని నా నమ్మకం.

★★★★★

ఒకే మనిషి లో  అనేక కోణాలు వున్నట్లు గానే ఒకే మనిషి లోని ఒక్కక్క కోణాన్ని ఒక్కక్క పాత్రలోకి పరకాయ ప్రవేశం చేసి ఎంతో ప్రేమతో, నేర్పరితనంతో ఈ పాత్రల్ని రఘు సృష్టించాడు.

మిత్రుడి రచన అనే అభిమానంతో ఒకసారి, పాతకుడిగా ఒకసారి, విమర్శకుడిగా మరోసారి, సహృదయునిగా ఇంకోసారి , లొసుగులు వెదుకుదామనే దురుద్దేశంతో మరోసారి  – ఇలా అనేక సార్లు ఈ నవల్ని చదివాను. అందుకే ఈ నవలలోని అన్ని పాత్రల్తోనూ స్నేహం కుదిరింది.

ఈ రచన కు ఒక ప్రత్యేకత వుంది.

మొదటి 10–15 పుటలు పాఠకుడు ఓపిగ్గా చదవాలి, తరువాత ఆగే పని వుండదు. దీనికి ముఖ్య కారణం -- మనకు అలవాటు అయిన వర్తమాన సాహిత్య ధోరణి కి భిన్నంగా ఉండటమే. కాబట్టి కొంచెం హృదయంతో చదవాలి.

ఆవకాయ.కామ్ లో సీరియల్ గా అచ్చయినప్పుడు సుమారు 15000–20000 మంది చదివినట్లు ఒక లెక్క..నెట్ లోకం లో విశేష ప్రాచుర్యం పొందిన ఈ నవల ఇప్పుడు పుస్తక రూపంలో వస్తుంది.

మిత్రులు రఘుకి అభినందనలు.

**పి.ఎస్:**

మిత్రమా!

ఏ ఉత్తమ రచయిత కూడా మొత్తం పొట్లం విప్పి చెప్పడు. మీరు అదే చేసారు. ఇంకా అనేక విషయాల చర్చ కొనసాగించ వలసి వుంది. నా లెక్క తప్పు కాకపోతే ఆంధ్ర పాఠకులు త్వరలో వైకుంఠపాళి–2 ని చదువుతారు.

శెలవ్...

**–ఇక్బాల్ చంద్**

★★★★★

**||శ్రీః||**

**|గణేశాయై నమః|**

ఒక్క విసురులో మొత్తం ముగిసిపోతుంది.

అది కల కావొచ్చు. ఆట కావొచ్చు. జీవితం కావొచ్చు. లేదూ ఈ సృష్టే కావొచ్చు.

ఆధారమే లేక ఉన్నచోటునే వేళ్ళాడుతున్న ఈ ప్రపంచంలో, మారుమూల ఏ నట్టడవిలోనో, ముక్కుమూసుకుని తపస్సు చేసుకునే ఒకానొక ఋషి మేధస్సులో చటుక్కున మండిన నిప్పుకణిక వంటి ఆలోచన, పెరిగి పెద్దదై, మూడు కాలాలనూ చుట్టొచ్చి, ఐదు భూతాలనూ ఆవహించుకుని, రంగు–రుచి–వాసన–శబ్ద–స్పర్శల్ని అనుభవించి, కోపాన్ని తరిమేసి, మోహాన్ని అదిమేసి, మతిమరుపును రూపుమాపేసి, తనలో తాను, తన కోసమే తాను, తన వల్లనే తానుగా నిలబడినప్పుడు ఒక చిన్న మెరుపు. మిణుగురు పురుగంతే!

విశాలమైన ఈ ప్రపంచాన్ని విడగొట్టి చూస్తే మిగిలేది అణువే. మిణుగురు వెలుగూ అణువంతనే. మనసులోని వెలుగూ అణువంతనే! అప్పుడే పుట్టిన పసిపాప కూడా అణువంతనే! అణువులోని మహత్తు అణువుకే తెలుసు!

సముద్రపుటొడ్డున ఇసుకరేణువులు. ఒక్కొక్కటీ అణుమాత్రం. ఒక్కక్కటే కూడితే అనంతం. అణువులో అనంతం. అనంతానంత అణువులు. పేర్చుకొంటూ...కూర్చుకొంటూ...ఒక అణువు మరొకదాన్ని ఢీకొడుతుంది. ఒకటి + ఒకటి = ప్రళయం. ఇది నమ్మలేని నిజం. అణువు సామాన్యమైనది కాదు.

ఈ విశాల విశ్వంలో భూమి ఎంత చిన్న పరమాణావో!

వేలెడంత మానవుల్లో ఎన్ని కోట్ల అణువులో!

ఒక్కో అణువునూ కదిపి, కుదిపి, నడిపించే “అహం” పరమాణువా? మహత్తా?

★★★★★

వైకుంఠం...

ఆ సౌధం ఆ మూలెక్కడో లేదు.

సరిగ్గా వైకుంఠం నడిమధ్యలో, సర్వమూలమై, భవ్యంగా వెలుగుతూ నిలబడుంది.

ప్రధానద్వారం వద్ద ద్వారపాలకులైన జయ–విజయులు భక్తితత్పరులై, విష్ణుగుణ సంస్మరణ పారవశ్యులై, కానీ జాగురూకులై నిలబడివున్నారు.

వారిని దాటి వెళ్తే...

"అహోభాగ్య మహోభాగ్యం.." అంటూ చేతులెత్తి మ్రొక్కుతున్న ముక్తభక్తకోటి.

"దైవయోగేన పూర్వపుణ్యేన..." వచ్చామని కన్నులు మూసి తన్మయత్వంతో స్థాణువుల్లా నిలబడిపోయిన మునులు.

"యద్గత్వా న నివర్తంతే తద్ధామ పరమమ్..." అనే పుణ్యధామమిదేనా అని సంభ్రమాశ్చర్యాలతో చూస్తున్నారు ఋషులు.

"అంభస్య పారే భువనస్య మధ్యే..." అనే ఉపనిషత్కీర్తనలను ఉచ్చకంఠంతో పాడుతున్న గంధర్వబృందాలు.

"నమో విష్ణవే బృహతే..." అని కేలు మోడ్చి నిలబడ్డ ఇంద్రుని అంతరంగ గానం సాగుతోంది.

"నాహమ్ జానే...నాహమ్ జానే" అని హరి అనంతగుణగానాన్ని చెయ్యలేక ఆగిపోతున్నాడు వేలనాల్కల శేషుడు.

"ఏకమ్ సత్..." అని నాల్గుముఖాలతో చతుర్ముఖుడు చేస్తున్న జపం వాయుసంచారంతో కూడి వైకుంఠమంతా తేలి వస్తోంది.

"త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మోసి..." అని అందరి ప్రార్థనలనూ ఏకసూత్రంగా నివేదిస్తోంది జగన్మాత.

కనురెప్పపాటులో సమస్త సృష్టినీ పుట్టించి, నడిపించి, లయింపజేసే ఆ జగన్నాటక సూత్రధారి...అదిగో...అక్కడే ఉన్నాడు.

అక్కడొక్కచోటేనా?

ఆహా...ఆ ప్రక్కనా ఉన్నాడు. ఈ ప్రక్కనా ఉన్నాడు.

అంతేనా!

లేదు..లేదు..జగన్మాతలో ఉన్నాడు. బ్రహ్మలో ఉన్నాడు. అక్కడ నిండిన వాయువులో ఉన్నాడు. ఇంద్రాది సమస్త దేవతల్లోనూ, గంధర్వాదుల్లో మనోనేత్రమై, ఋషుల హృత్కమలాల్లో మెరుస్తూ, మునుల మనోవీధుల్లో సంచరిస్తూ, మానవుల మస్తిష్కాల్లో కనబడీ కనబడక, జంతుజాలాల్లో ప్రేరకుడై, చెట్లల్లో రసమై, పర్వతాల్లో శిఖరమై, చివరకు గడ్డిపోచల్లోని అమాయక సౌందర్యసిక్త అస్తిత్వంలోనూ...ఆ మహావిష్ణువే...అలరారుతున్నాడు.

★★★★★

"ఎంత బాగా చెప్పారండీ!" అంది సుమతి.

పూజాసామగ్రిని ఆమె కడుగుతున్నంతసేపూ అక్కడే కూర్చొని వైకుంఠవర్ణనం చేస్తున్నాడు కేశవశర్మ.

"మహానుభావులు వ్రాసినదాన్ని బట్టీయం వేసిన బడుద్ధాయిని నేను. వారి ఎంగిలిని తిని, దాన్నే అరిగించుకొలేని అల్పుణ్ణి. నేను చెప్పడమేమిటే పిచ్చిదానా!" అన్నాడు కేశవశర్మ.

ఆయన "పిచ్చిదానా!" అన్నప్పుడల్లా సుమతికి ఏదో సంతోషం. తిట్టులో కూడా అభిమానాన్ని పొదిగితే అది పొగడ్తే అవుతుందని ఆమె అభిప్రాయం.

"మీరన్నది నిజమే! కానీ ఎదుటివాళ్లకు అర్థమయ్యేలా, మనసుకు హత్తుకునేలా చెప్పడం అందరికీ రాదు కదండీ!" అంది సుమతి.

"మీరన్నది నిజమే" అంటూనే తన పొగడ్తను నిలబెట్టుకునే భార్యను చూస్తే అలవిమాలిన ప్రేమ పుట్టుకొస్తుంటుంది శర్మకు. అమాయకత్వంతో కూడిన అజ్ఞానం కూడా అందమైన సుఖమేనని పెళ్ళయ్యాకే తెలిసింది అతనికి.

తను చేస్తానని భార్య అన్నా పూజాపాత్రలన్నింటినీ ముందేసుకుని తుడవడం మొదలెట్టాడు శర్మ.

దైవసేవలో ఎవరి భాగం వారిదేనన్న నిరంహకార స్వార్థాన్ని అర్థం చేసుకున్న సుమతి వంటింట్లో మిగిలిపోయిన పనుల్ని చేసుకోవడానికి వెళ్ళింది.

★★★★★

"ఏకాంతిక జన ప్రియా.." అన్నది జగన్మాత.

చిరునవ్వు నవ్వాడు శ్రీహరి.

క్షణమాత్రంలో లక్ష్మి కోరుకున్న ఏకాంతం ఏర్పాటయింది.

బ్రహ్మాది దేవతలు, మనుష్యాది జీవరాశులూ జగన్మోహనుని మన్మనోరథంలో లీనమైపోయారు.

"తత్క్షణంలో మీలా భార్య హృదయాన్ని తెలుసుకునేవారు లేరు!" అంది లక్ష్మి, కృతజ్ఞతాపూర్వకంగా.

"నా హృదయంలో వాసమున్నదెవరో మరి?" అన్నాడు శ్రీవత్సధారి.

సిగ్గుపడింది హరిపాదసేవోద్యమి.

"ఏకాంత వినోదం కావాలన్న నీ మనోసంకల్పం నెరవేరుస్తున్నాను...ఇదిగో..." అంటూ ఓ వస్తువును పరిచాడు జగత్పతి.

"వైకుంఠపాళీ..." అన్నది జగదంబ.

"నేను వీరవైష్ణవుణ్ణి...." అని నర్మగర్భంగా నవ్వాడు ఏకో నారాయణుడు.

"ప్రకృతి వికృతి గాకుండా నిలుపుతున్నశక్తి అదేగా..." అంది వేదాభిమానిని.

“అన్నీ తెలిసినా, నేటి ఆటలోని పావులేమిటో తెలియవుగా!” అన్నాడు సర్వంతర్యామి.

“మీ కుమారుని సృష్టిలో మీకు తెలియని పావులా!” అంది మహామాయ.

“నే నన్నది పద్మసంభవుని సృష్టిలోని పావులు కాదు. పద్మజాదేవి దృష్టిలోనివి.” అన్నాడు మాయాదూరుడు.

“అబ్బాయి సృష్టిలో పుట్టినవాటినే ఎంచుకోవాలని ప్రార్థన!” అంది వేదపీఠ.

“అవశ్యం. నా పావును ఎంచుకున్నాను. నీవూ ఎంచుకో!” అన్నాడు వేదవేద్యుడు.

“ఒక్క పావేనా? ఆట రక్తి కట్టడానికి నావి రెండు, మీవీ రెండు ఉండాలి.” అంది చతురానన జనని.

“రెండే చాలా?” అన్నాడు చతుర్వేదోదితగుణసంపన్నుడు.

“చాలు” అంది పద్మావతి.

“పాచికలివిగో...” అన్నాడు పద్మహస్తుడు.

పద్మాక్షిఒక్క విసురు విసిరింది.

ఖణ్ మంటూ పడ్డాయి పాచికలు.

★★★★★

“ఏమిటి? ఉద్యోగం పోయిందా?” షాక్ కొట్టినట్టుగా ఉలిక్కిపడింది రంజని.

“అవును. రాత్రికి రాత్రే కంపెనీని మూసేసారు.” నిస్తేజంగా కూలబడ్డాడు అనంత్.

“అదెలా మూస్తారు అనంత్! కంపెనీ స్టార్ట్ చేసి ఆరునెల్లేగా అయ్యింది?” అంది రంజని.

“ఇల్లాజికల్గా మాట్లాడ్తావే! కంపెనీ క్లోజ్ అవ్వడానికి, దాని ఒపెనింగ్ సెరెమనీకి సంబంధమేంటి?” అని తల అడ్డంగా ఊపుతూ విసుక్కున్నాడు అనంత్.

“ఎందుకు నా పై విసుక్కొంటావ్? నే మాట్లాడిందాంట్లో వాలిడ్ ఆర్గ్యుమెంట్ నీకర్థం కాలేదు. నీకంతా దూకుడే!” అంది రంజని.

“హుష్! నన్ను విసిగించొద్దు. ఇప్పటికే ఆలోచించి ఆలోచించి బుర్ర వేడెక్కింది.” అన్నాడు అనంత్.

“ఈ కంపెనీ చేర్తానని నువ్వన్న రోజే చెప్పాను. ముక్కూమొహం తెలియనివాళ్ళెవరో స్టార్ట్ చేసినదాంట్లో చేరొద్దని! చెప్పానా లేదా? కంపెనీకి మన క్రెడెన్షియల్స్ ఎంత అవసరమో, మనకూ కంపెనీ క్రెడెన్షియల్స్ ముఖ్యమేగా! అసలా కంపెనీకి సొంత వెబ్‌సైటు కూడా లేదు. ఐనా జీత మెక్కువిస్తున్నారని జంపయ్యావు.” అంది రంజని.

చేతిలో ఉన్న మొబైల్ను విసిరికొట్టాడు అనంత్. అది నేరుగా వెళ్ళి ఫ్లవర్ వేజ్ కు తగిలింది. ఆ పింగాణీ వేజ్ భళ్ళుమని పగిలింది.

ఆ రభసకు భార్యాభర్తలిద్దరూ ఉలిక్కిపడ్డారు.

రంజని ఏడుస్తూ బెడ్రూంలోకి పరుగెత్తినట్లుగా వెళ్ళిపోయింది.

విరిగిన ఫ్లవర్ వేజ్ ముక్కలు, చెక్కలైన మొబైలును చూస్తూ రెండు చేతుల్తో జుట్టు పీక్కున్నాడు అనంత్.

★★★★★

“నీ రెండు పావుల్లో మొదటి పావు వరాహమయింది.”

“అది మీ అవతారమే స్వామీ! మరి మీ పావేమౌతుందో? పాచిక విసరండి.” అన్నది లక్ష్మి.

నవ్వుతూ పాచికల్ను విసిరాడు నారాయణుడు.

★★★★★

వంటింటి పని ముగించుకొచ్చిన సుమతి, పరుపు మీద కూర్చొని కళ్ళుమూసుకున్న భర్తను చూసింది.

“ఏకాంతాసన జపమ్..జయజయ రామ్..” అని, తన ఛలోక్తికి తనే గలగలా నవ్వింది సుమతి.

చిరునవ్వుతో కళ్ళు తెరిచి "కువిదంగ్" అని గట్టిగా అంటూ ఆగిపోయాడు శర్మ.

"అదేమిటండీ? అదేమైనా రాక్షసి పేరా?" అని అడిగింది సుమతి.

ఫక్కున నవ్విన శర్మ "కువిత్ అంటే సంస్కృతంలో ఏకాంతమని అర్థం. ఏదో మంత్రాన్ని గుర్తుచేసుకొంటుంటే నీ చప్పుడైంది. దాంతో ఆ చివరి పదాన్ని గట్టిగా అనేసాను." సంజాయిషీలా అన్నాడు కేశవశర్మ.

అతని పక్కనే నడుంవాల్చిన సుమతి "ఈరోజుతో పెళ్ళై పన్నెండేళ్ళు నిండి పదమూడో ఏడు మొదలైందండీ!" అంది.

ఒక అరనిముషం ఆగి "అవును. ఎండ, వానా తప్పించి వసంతం రాలేదింకా" అన్నాడు.

భర్త మాటల్లోని అంతరార్థం తెలుసుకొన్న సుమతి మౌనంగా ఉండిపోయింది.

"పౌరోహిత్యం మొదలుపెట్టిన ఈ పదిహేనేళ్ళలో పెళ్ళిళ్ళు, గర్భాదానహోమాలు, నామకరణాలు ఎన్నెన్ని చేయించానో! చివరకు పెరటి చెట్టు వైద్యానికి పనికిరాదన్న పెద్దల మాట నిజమైంది." అన్నాడు శర్మ.

"ఇలాగంటున్నానని తప్పుగా అనుకోకండి. మీలాంటి మంచిమనిషికి భార్యనైనందుకు నాకెంతో సంతోషంగా ఉంది. నాకు తెలిసీ ఎవ్వరికీ అపకారం చెయ్యలేదు నేను. మన అమ్మానాన్నాలు కూడా అంతే. మరెందుకు మనకీ శిక్ష? మంచివాళ్ళను ఏడిపించడమే దేవుడికి ఇష్టమైన పనా?" – సుమతి గొంతులోని దైన్యం శర్మను కదిలించింది.

"సుమతీ! దేవుడు ఎవ్వరినీ శిక్షించడు. పరీక్షిస్తాడంతే!"

"ఇది చాలా ఆశ్చర్యంగా ఉందండీ! ఎవ్వరినీ శిక్షించకపోతే యమధర్మరాజు ఎందుకున్నాడు? ఆయన లోకంలో ఏవేవో నరకాలున్నాయని మీరే చెబుతారుగా! అందులో పున్నామ నరకం అనేది పిల్లలు లేనివారికోసమే ఉన్నట్టు పురాణాల్లో చెప్పారుగా! అపుత్రస్య గతిర్నాస్తి అని కూడా అంటారు కదా?"

ఆ ప్రశ్నలు విన్న శర్మ “పిచ్చిదానా!” అంటూ నవ్వాడు. తల తిప్పి తన వైపే చూస్తున్న భర్తను చూస్తూ లేచికూర్చుంది సుమతి. దానర్థం టక్కున సమాధానం చెప్పాలనే.

తనూ లేచి కూర్చున్నాడు శర్మ.

“సుమతీ! నరకంలో వేసేవన్నీ పరీక్షలే. ఆ పరీక్షలకు ఫలితం పశ్చాత్తాపం పుట్టడమే! ఏ జీవి తన చేసిన తప్పును తెలుసుకొని పశ్చాత్తాపం ప్రకటిస్తుందోనని ఆశగా చూస్తుంటారట యమభటులు. ఎందుకంటే అన్నన్ని కఠినమైన పరీక్షల్ని నిర్వహించడం వారికి శిక్షలాంటిదట. జీవులు పడే ఆ యాతనలను చూడలేని యముడు కూడా సంవత్సరానికొకసారి అన్ని యాతనలనూ రద్దు చేసి, జీవులందర్నీ తన సభలో కూర్చోబెడ్తాడట...”

“అవునా...ఎందుకు కూర్చోబెడ్తాడు?” ఉత్సాహం ఆపుకోలేక అడ్డు తగిలింది సుమతి.

“చెబుతానుగా...” నవ్వాడు శర్మ.

“అయ్యో...చెప్పండి చెప్పండి...” అంది సుమతి.

“యమలోకంలోని జీవులందర్నీ తన సభలో కూర్చోబెట్టిన యుముడు, తాను విధిస్తున్నఆ శిక్షలు జీవులలోని అజ్ఞానాన్ని పోగొట్టి సుజ్ఞానాన్ని పెంచడానికేనని చెబుతాడట. జీవులేమో ఆయన చెప్పే మాటల్ని శ్రద్ధగా వినవట. దానికి నిరాశ చెందక కనీసం హరినామస్మరణనైనా చేస్తాయేమో, ఆవిధంగానైనా తన లోకం నుంచి ఆ జీవుల్ని స్వర్గానికి పంపొచ్చని తలచిన యముడు “అచ్యుతం కేశవం రామనారాయణం శ్రీధరం మాధవం వాసుదేవం భజే “ అని నామస్మరణ మొదలుపెడతాడట! ఆయనతో బాటు ఆయన కింకరులు కూడా భక్తితో గొంతు కలుపుతారట. కానీ ఏవో కొన్ని తప్పించి చాలా జీవులు మాత్రం యమునికి వీపు చేసి కూర్చుంటాయట. తనతో బాటు శ్రుతి కలిపిన జీవుల్ని నరకలోకం నుండి విముక్తుల్ని చేసిన యముడు, వీపు తిప్పి కూర్చున్న జీవుల్ని మళ్ళీ యాతనాగృహాల్లోకి తీసుకెళ్ళమని తన భటులను ఆజ్ఞాపిస్తాడట! ఇప్పుడు చెప్పు, యమలోకంలోనివి

శిక్షలా? అలాగే, అపుత్రస్య గతిర్నాస్తి అంటే పుత్రులు లేనివారికి గతులు లేవనేది మాత్రమే అర్థం కాదు. పుత్రులు లేనివాళ్ళు నారాయణుణ్ణి నమ్ముకుంటే వారికి వాడే గతి అవుతాడన్నది అంతరార్థం!"

"ఈ విషయం నేను అస్సలు వినలేదండి. నిజమే! మీరన్నట్టు అవి శిక్షలు కావు. కానీ భూలోకంలో మనలాంటివారికి కలిగే కష్టాలు కూడా శిక్షలు కావా? వాటన్నింటినీ పరీక్షలేనని సర్దిచెప్పుకోవాలా? అలా సర్దుకోవడం నాలాంటి సామాన్యులకు చేతనౌతుందా?" – ప్రశ్నల పరంపరను సంధించింది సుమతి.

అమాయకత్వం నిండిన ఆమెలోని కోపం కూడా చాలా అమాయకంగా కోప్పడుతోంది.

"సుమతీ! పదినెలల పంట కోసం పన్నెండు సంవత్సరాలుగా నీలో ఎంత కోపం పేరుకుపోయిందో..." అన్నాడు శర్మ.

"కోపమా? నాది కోపమా?" అంది సుమతి ఆశ్చర్యంగా.

"కాదులే...కోరిక." అన్నాడు శర్మ, మాట మారుస్తూ.

"నిజంగా చెప్పండి నాది కోపమా? మీ మీద ఎప్పుడైనా కోప్పడ్డానా?" మళ్ళీ అడిగింది సుమతి.

"లేదులే! నీది కోపం కాదన్నానుగా!" సర్దిచెప్పబోయాడు శర్మ.

సుమతి మౌనంగా పడుకుంది. అనునయంగా ఆమెను దగ్గరకు తీసుకొన్నాడు శర్మ.

వెచ్చటి నీటి బొట్లు అతని ఛాతీకి తగిలాయి.

చల్లటి నీళ్ళను అదేపనిగా వేడి చేయాలి. చేసినా వెంటనే చల్లబడతాయి. వేడెక్కి ఉబుకుతున్న ఈ నీటిని చల్లార్చడం ఎలా?

"నేను నా మాటల్తో ఈమెను శిక్షించడం లేదు కదా?" – నిద్రను పోగొట్టుకొన్న శర్మ ఆలోచిస్తూనే ఉండిపోయాడు.

★★★★

ఐదోగడిలో చిలుక బొమ్మ దగ్గరకొచ్చిన నారాయణుని పావును చూసి, "మీ పావు, చిలుక పలుకులు పలుకుతోందే!" అన్నది లక్ష్మి.

"బాలాదపి...శుకాదపి" అన్నాడు నారాయణుడు.

"నిజమే! పిల్లలు చెప్పినా, చిలుక చెప్పినా నీతిని గ్రహించాల్సిందే! చాలా చక్కటి తత్వాన్నే చెబుతోంది మీ పావు." అన్నది లక్ష్మి పాచికల్ని చేతిలోకి తీసుకొంటూ.

"నీ రెండో పావు చెప్పబోయే రహస్యమేంటో చూడాలి దేవీ!" అన్నాడు నారాయణుడు.

అమ్మ చేతి గాజుల చప్పుడుతో కలసిపోయింది పాచికల చప్పుడు.

★ ★ ★ ★ ★

బైట తిరిగి, తిరిగి వచ్చిన అనంత్ హాల్లో కూర్చున్న రంజనిని చూసి తలదించుకొని ఎదురుగా కూర్చున్నాడు.

రంజని కళ్ళు ఎర్రగా ఉన్నాయి. చేతిలోని కర్చీఫుతో మాటిమాటికీ ముక్కు తుడుచుకొంటోంది.

"అంటే ఎక్కువగానే ఏడ్చిందన్న మాట. ఐనా నా తప్పేముంది? చచ్చీ చెడి ఇంటికొస్తే అలానా మాట్లాడేది! ఇంతకూ సారీ చెప్పనా వద్దా? చూద్దాం. తన మూడ్ ను బట్టి మన మూవ్!" అని అనుకుంటూ ఇండియాటుడేను చేతిలోకి తీసుకున్నాడు.

"నాతో మాట్లాడవా? ఒక్క మాటతో అంత చెడ్డదాన్నైపోయానా?" అంది రంజని, గొంతులో ఉక్రోషాన్ని ప్రదర్శిస్తూ.

"మాట్లాడకుండా బిగుసుక్కూర్చుంది ఎవరు? నేనా?" అన్నాడు అనంత్, కావాలనే నిర్లక్ష్యాన్ని ధ్వనిస్తూ.

“అదే వద్దనేది! ఎందుకలా ఎప్పుడూ తగవులాడే ధోరణిలో మాట్లాడ్తావ్? ఇంత హార్ష్ గా మాట్లాడి, తప్పంతా నాదేనంటావా?” ఈసారి నిజంగానే ఏడుస్తూ అడిగింది రంజని.

“అబ్బా! ఏడవొద్దు తల్లీ! అలా మాట మాటకీ కన్నీళ్లు చిలకరిస్తే నాకు ఒళ్ళు మంట.”

“ఆహా! నీ ఒళ్ళు గురించే ఆలోచిస్తున్నావ్. నా మనసు గురించి కూడా ఆలోచించు.”

టక్కున లేచాడు అనంత్. వెర్రిగా చూసింది రంజని.

ముందుకువచ్చి రంజని నెత్తి మీద మొట్టికాయొకటి వేసి “మొద్దూ! కన్నీళ్లు ఎక్కువయ్యే కొద్దీ ముక్కు కూడా ఏడుస్తుంది. అలా ఏడ్చే ముక్కంటే నాకు చిరాకు. ప్లీజ్! ముక్కునలా ఏడ్పించొద్దు. ప్లీజ్!” అన్నాడు.

నవ్వలేక నవ్వింది రంజని. హమ్మయ్య అని అనుకొన్నాడు అనంత్.

“నీ ఈగో హర్ట్ కాకుండా ఎంత తెలివిగా మాట్లాడావ్!” అంది రంజని.

ఏమిటన్నట్టు కనుబొమలెగరేసాడు అనంత్.

“సారీకి బదులుగా ప్లీజ్ వాడావు చూడూ! ఆ తెలివిని మెచ్చుకుంటున్నాను. రా టీ పార్టీ చేసుకుందాం” అంటూ వంటింట్లోకి నడిచింది రంజని.

“వార్నీ! చంద్రముఖిలోని రజనీకాంత్ స్టైల్లో నా మనసులోని మాట దీనికెలా తెలిసింది?” అని అనుకొంటూ రంజని వెనకే వెళ్లాడు అనంత్.

★ ★ ★ ★ ★

“నీ పావు అయింది మండూకం..” అన్నాడు నారాయణుడు.

నవ్వుతూ తన రెండో పావును నాలుగో గడిలోనికి తోసింది లక్ష్మీదేవి.

“ఈ మాండూకోపనిషత్ సారమేమిటో?” అన్నాడు పార్థసారథి.

“తన గురించి కూడా తెలుసుకోలేని అంధుడని అర్థం ప్రభూ! నూతిలోని కప్పకు బైటి లోకం మాత్రమే తెలీదు. అంతఃచక్షువులు తెరుచుకోని మానవునికి తన తప్పొప్పుల గురించి కూడా తెలుసుకోలేడు.” అన్న విద్యాలక్ష్మి “మీ రెండో పావుతో ఏ జ్ఞానోపదేశం చేయబోతున్నారో?” అని అడిగింది.

“పావులు కదు స్వతంత్ర్యులు!” అన్నాడు గీతాచార్యుడు.

“పాపులూ కదుంగడు స్వతంత్ర్యులే స్వామీ!” అన్నది శంకరపితామహి.

పాచిక కదిపాడు హరి.

కరకంకణ నినాదాన్ని అనుకరిస్తూ చప్పుడు చేసాయి పాచికలు.

★ ★ ★ ★ ★

తెల్లవారుజామునే ఇంటిపనల్లో మునిగిపోయిన సుమతిని చూసి, మాట్లాడించబోయిన శర్మ ఆగిపోయాడు. మౌనంగా పెరట్లోకెళ్ళి నాలుగు తుళసీదళాల్ని కోసుకొచ్చి, దేవుడి మండపం ముందు పెట్టి “స్నానానికెళ్తున్నాను” అన్నాడు. సుమతి మాట్లాడకుండా తల వూపింది.

స్నానం ముగించుకొచ్చి దేవతార్చనకు కూర్చున్నాడు శర్మ. అతనికి కావలసినవన్నింటినీ ఆలోపే సిద్ధం చేసేసింది సుమతి. పెళ్ళైన కొత్తల్లో భర్త పాటించే ఆచారాలేవీ తెలియని ఆవిడ రెండు నెలల్లోపే ఆ కర్మఠుని కఠిన నియమాలకు తనను తాను ఒదిగించుకునేసింది. తెలియనిదాన్ని కప్పిపుచ్చుకోకుండా అడిగి తెలుసుకునేది. ఒక్కసారి తెలుసుకున్నదాన్ని వీలైనంతగా గుర్తుపెట్టుకుని ఆచరించేది.“నీ పేరు సుమతి కాదు సుగుణ” అని తనెన్ని సార్లు అన్నాడో శర్మకే తెలియదు.

“నైవేద్యం!” అన్నాడు శర్మ.

ఇత్తడి పళ్ళెంలో అన్నం, పరమాన్నం, కొద్దిగా పప్పు, చారు వేసుకొచ్చింది సుమతి. ఆపై చెయ్యి కడుక్కుని చిన్ని చిన్ని వెండిపాత్రల్లో పాలు, పెరుగు, నీళ్ళు తీసుకొచ్చిపెట్టింది.

శర్మ నైవేద్యవిధిని నెరవేర్చాడు. మహామంగళారతి చేసాడు.

సుమతి హారతి కళ్ళకద్దుకుని అక్కడే నిలబడింది.

పూజ మొత్తం ముగించి, సాలగ్రామాలను, ప్రతిమల్ని జింకచర్మం చుట్టిన చెక్కపెట్టెలో పెట్టి, వాటిపై రెండు పూలు, తుళసీపత్రాన్ని పెట్టి మూసాడు. ఆ పెట్టెను ఓసారి తల మీద పెట్టుకుని మండపంలో ఎత్తైన పీట మీద పెట్టాడు.

శర్మ తీర్థాన్ని తీసుకున్న తర్వాత, అతని కాళ్ళకు దండం పెట్టి చెయ్యి చాచింది సుమతి. తీర్థాన్నిచ్చి, ఆమె చేతిలో చిటికెడు గంధం, పూలు వేసాడు.

“ఇప్పుడే వడ్డించనా? లేక...” ఆగిపోయింది సుమతి.

గడియారం వైపు చూసాడు. పదకొండు కావస్తోంది. ఏం చెప్పాలో తోచలేదు శర్మకు.

“పాలు తీసుకురానా? కాసేపాగి తిందురుగానీ!” అని అంది సుమతి. వంచిన తల ఎత్తకుండానే మాట్లాడుతోంది ఆవిడ.

నోటిమాటగా చెప్పక తలాడించాడు శర్మ. తలయెత్తని సుమతి, అతని మాటల కోసం వేచి చూస్తోంది.

శర్మ మౌనంగా ఉండిపోయాడు. కొన్ని క్షణాల తర్వాత తలెత్తింది సుమతి.

ఆవిడ కళ్లలోకి చూసాడు శర్మ. ఎప్పుడూ నిర్మలమైన మెరుపుతో కూడివుండే ఆ కళ్ళలో పల్చటి నీళ్ళ తెరలు. మెరుపుల్ని మూసేస్తూ...మాయంచేస్తూ.

ఎన్నడూ సుమతిని ఆవిధంగా చూడలేదు శర్మ. క్రితంరోజు జరిగిన ఘటనల్ని తల్చుకుని అదేపనిగా ఏడ్వడం, సాధించడమన్నది సుమతి చర్యల్లో ఏరోజూ కనబడలేదు. కానీ ఈరోజూ, ఇంతలా బాధపడుతుందంటే ఏదో బలమైన కారణమేవుండాలి అని అనుకున్నాడు.

పీట మీద కూర్చునే సుమతి చెయ్యి పట్టుకున్నాడు. ఆమాత్రం ఓదార్పుకే సుమతి గుండెల్లోని దుఃఖపు చెరువు కట్ట తెంచుకుంది. వెక్కిళ్లని అదుపుచేసుకోవడానికి అతిప్రయత్నం చేయసాగింది.

శర్మ సుమతిని కూర్చోమని చెప్పాడు. కూర్చున్నాక చుబుకం పట్టుకుని "ఏమిటిది సుమతీ? నన్ను చాలా భయపెడుతున్నావ్! ఏమైనా అనుకోనిది జరిగిందా? దేన్నైనా చూసి జడుసుకున్నావా? నాతో చెబితే పరిష్కారం వెదుకుతాను కదా? ఇలా బెంబేలెత్తిస్తే నాకెలావుంటుందో ఒక్కసారి ఆలోచించు! నిన్న రాత్రి నేనన్న మాటలకు ఇంత సాధించాలా? తప్పైతే క్షమించొచ్చుగా!" అన్నాడు.

"అయ్యొయ్యో! అలా అనకండి! మిమ్మల్ని భయపెట్టాలని కాదు. నిన్నేమైందంటే..." మళ్ళీ ఎగదన్నిన దుఃఖం, మాటల కడ్డు పడింది.

"ఏమైంది?" అన్నాడు శర్మ.

"నిన్న, మన ఎదురింటి వెంకాయమ్మ పిన్నిగారు నీకు ముప్పైయేళ్లు దాటిపోయాయిగా, ఇక పిల్లలేం పుడ్తారు? ఒకవేళ పుట్టిన చాలా బలహీనంగా పుడ్తారు. తొందరగా ఎవర్నైనా దత్తు తీసుకోండి అని అన్నారండీ!" అని మళ్ళీ సుడులు తిరుగుతున్న దుఃఖాన్ని ఏమాత్రం ఆపుకోలేక గట్టిగా ఏడ్చేసింది సుమతి.

శర్మకు పరిస్థితి అర్థమైంది. నిన్నటి సుమతి ప్రశ్నలో ఆమెకు తగిలిన గాయం లోతేమిటో ఇప్పుడు అర్థమవసాగింది. సుమతి తలను తన భుజానికి ఆనించుకుని, చిన్నపిల్లను జోకొట్టినట్టు ఆమె వీపు మీద నెమ్మదిగా తట్టసాగాడు. అలా ఓ ఐదునిముషాల సేపు ఉండిపోయారా దంపతులు.

సుమతి కొద్దిగా తేరుకొని "ఏమండీ! మీరు ఇంకో పెళ్ళెందుకు చేసుకోరాదు?" అని అడిగింది సుమతి.

జోకొడుతున్న శర్మ చేతులు టక్కున ఆగిపోయాయి. సుమతి మళ్ళీ అడిగింది "నావల్ల మీరెందుకు పిల్లల్లేకుండా ఉండాలి? ఇంకో పెళ్ళి చేసుకోండి!" అంది.

శర్మ సుమతి తలను తన భుజం మీద నుండి తీసి, ఆమె రెండు చెంపల్నీ పట్టుకుని, కళ్ళలో కళ్ళు పెట్టి చూసాడు.

సుమతి బేలకళ్ళు భర్త కళ్ళలోకి చూడలేక అటు ఇటూ చాలా చంచలంగా తిరుగుతున్నాయి. "పిచ్చిదానా!" అని నవ్వాడు శర్మ – "ఇంకో పెళ్ళి చేసుకుంటే నాకు పిల్లలు పుడతారని నీకెందుకంత నమ్మకం?" నవ్వుతూనే అడిగాడు.

"పిల్లల్ని కనేది ఆడవాళ్ళేగా అందుకని" అంది సుమతి.

అది వ్యంగ్యమో లేక సుమతి అమాయకత్వమో అర్థం కాలేదు శర్మకు.

"నీకు వెర్రి ముదిరింది. అందుకే ఇలా మాట్లాడుతున్నావ్. ఆ ఎదురింటి వెంకాయమ్మ అసలు పేరు వంకాయమ్మ. నీకు వంకాయంత వెర్రిని తాలింపు పెట్టి మరీ ఎక్కించింది." – వాతావరణాన్ని తేలిక చేయడానికన్నట్టు మాట్లాడాడు శర్మ.

"నాలోనే లోపముందని వెంకాయమ్మగారన్నారు." గొప్ప నిష్టుర సత్యాన్ని చెప్పేసాను వినుకో అన్నట్టుగా అంది సుమతి. ఆమె అంత గట్టిగా మాట్లాడ్డం అదే మొదటిసారి.

విషయం తీవ్రతను చూసిన శర్మ ముఖంలో నవ్వు మాయమయింది. సుమతి కేసి చూసి – "నీలో లోపముందా? మరి నాలో లేదా? నా గురించి వెంకాయమ్మగారు చెప్పలేదా?"

సుమతి ఏమీ మాట్లాడలేదు.

"ఏం మాట్లాడవ్? వెంకాయమ్మ గారో పెద్ద డాక్టర్ కదూ! ఈ వెధవ గురించి ఏమీ చెప్పలేదా అని అడుగుతున్నాను!" గద్దించినట్టు అడిగాడు శర్మ.

సుమతికి బెదురు పట్టుకుంది. ఆమె కూడా శర్మలోని గద్దింపు ధోరణని మొదటిసారిగా చూస్తోంది. పెళ్ళైన కొత్తల్లోనే కాదు, ఇప్పటికి కూడా తన నుంచి ఏ తప్పు జరిగినా కోప్పడకుండా సర్దుకుపోయే తత్వాన్నే చూసింది.

"చెప్పలేద"న్నట్టుగా తలను అడ్డంగా ఊపింది.

“చచ్చు వంకాయమ్మలతో మాట్లాడ్డం తగ్గించు. మనిద్దరం డాక్టర్ దగ్గరకు వెళ్దాం. లోపమెవరిదో అక్కడ తేల్తుంది. ఏం? సరేనా?” అదే గద్దింపు స్వరంతో హుంకరించాడు శర్మ.

ఏం చెప్పాలో తోచని సుమతి జోరుగా తలూపింది.

“ఇక వడ్డిస్తావా? లేక నేన్నీకు వడ్డించనా?” అంటూ పక్కనే ఉన్న విసనకర్రను చేతిలోకి తీసుకున్నాడు శర్మ.

వంటింట్లోకి పరుగుగెట్టింది సుమతి.

లోలోపలే నవ్వుకున్నాడు శర్మ.

★★★★★

“మీ రెండో పావు వానరమయ్యింది స్వామీ!” అని అన్నది కమలప్రియ.

“వారేగా నిన్ను వెదికి, నాకు దక్కించింది!” అన్నాడు కమలాసనవంద్యుడు.

“మీ నోట ఆ చిన్ని కోతుల కథ వినాలని ఉంది. చెప్పరూ!” అని గారాబుగా అడిగింది జనక కుల పావని.

“మరి ఆట?” అన్నాడు శివధనుర్భంగధీరుడు.

“కాసేపు విరామం. ఆటకాయలు గడులు దాటి, దాటి అలసిపోయాయి.” నవ్వుతూ అన్నది ఊర్మిళాగ్రజ.

“ఐతే విను. హనుమ నిన్ను కనుగొన్న వార్త తెచ్చాక, సుగ్రీవుడు సమస్త వానరుల్నీ దండు కట్టాడు. ఆ సైన్యంలో హనుమ, సుగ్రీవ, అంగదాది భారీకాయులతో బాటు సింగిలీక లనబడే మరుగుజ్జు వానరులూ ఉన్నారు. వారు ఒక్క అడుగు ఎత్తు మాత్రమే ఉంటారు. వారిని యుద్ధానికి తరలకుండా నేనే ఆపలేకపోయాను. అంతటి రామసేవాసక్తులు వారు. యుద్ధానికి వెళ్ళేముందు నేనొక ప్రతిజ్ఞ చేసాను. ఎంతమందిని తీసుకువెళ్తున్నానో అంతమందినీ ప్రాణాలతో వెనక్కు తెస్తానని. రామ–రావణ యుద్ధం

మహాఘోరంగా జరుగుతోంది. యుద్ధరంగంలోకి కుంభకర్ణు డొచ్చాడు. వాడు మా అందరికంటే భారీకాయుడు. ఆకాశమంత ఎత్తున్న రథమెక్కి వచ్చాడు. నేను వాడిని పడగొట్టాను. వాడు చచ్చి, నేలరాలుతున్న సమయంలో, వాడి రథానికి అలంకరించిన చిరుగంట ఒకటి తెగి నేలన పడింది. దాని క్రింద వెయ్యిమంది సింగిలీక కోతులు ఇరుక్కుపోయాయి. రావణుడూ చచ్చాడు. యుద్ధం ముగిసింది. నేను నిన్ను చేరేందుకు మునుపు నా ప్రతిజ్ఞ నిలుపుకోవడానికి గాను వానరసైన్యాన్ని లెక్కించమన్నారు. ఓ వెయ్యి సంఖ్య తక్కువస్తోంది. ఎన్నిసార్లు లెక్కించినా వెయ్యే తేడా! గణన చెయ్యడానికి నేనే వెళ్ళాను. ఒకవేళ యుద్ధరంగంలో ఎవరైనా గాయాల పాలై, బ్రతికేవున్నారేమోనన్న అనుమానం వచ్చింది. రక్తసిక్తమైన ఆ ఆహవరంగంలో ముందు హనుమంతుడు వెళ్తుండగా నేను, సుగ్రీవాదులూ వెళ్ళాం. విరిగిపడ్డ కుంభకర్ణుడి రథంకు కొద్దిదూరంలో పడివున్న గంట దగ్గర ఆగి హనుమను ఆ గంటను ఎత్తమన్నాను. తన తోకతో దాన్ని ఎత్తాడు హనుమ. ఆ గంట క్రింద, రామనామ జపంలో మునిగివున్న వెయ్యిమంది సింగిలీకులూ కనబడ్డారు. నా వెంటనున్న కపివీరులంతా జయజయధ్వానాలు చేసారు. ఆ జయఘోషకు ధ్యానభంగమై, కళ్లు తెరిచాయి ఆ చిన్ని కోతులు. ఆవిధంగా తక్కువ వస్తున్న వెయ్యి సంఖ్యను లెక్కలోకి వేయమని సుగ్రీవునికి చెప్పి ముందుకు కదిలాను.” అని ఆగాడు సింధుబంధనా దురంధరుడు.

“మీరెంత ఉదాత్తులు స్వామీ! ఆ సింగిలీకుల గుణగానమే చేసారు. దోషాన్ని దాచేసారు. భక్తవశంకరులంటే మీరే.” అన్నది సింధుకన్య.

“దోషమా? నా దృష్టిలో దోషాలేవీ లేవు దేవీ! అల్పజ్ఞానంతో చేసేవన్నీ సరిదిద్దుకోగల లోపాలే! పోనీ నువ్వే చెప్పు. తనయుల దోషాలను తల్లి ఎంచవచ్చులే!” అన్నాడా సింధుకన్యాపతి.

“గంటలో చిక్కుకున్న సింగిలీకలు, తమను ఎవరైనా రక్షిస్తారేమోనని ఎదురుచూసాయి. ఎంతకాలం గడిచినా ఎవ్వరూ గంటను ఎత్తలేదు, వాటిల్ని రక్షించలేదు. అప్పుడు అవి తమలో తాము మాట్లాడుకోసాగాయి. ఒక చిట్టి కోతి అంది ’చూసార్రా! ఈ మానవుల్ని నమ్మకండిరా అని ఆనాడే చెప్పాను. ఆ రాముడికి పెద్ద కోతులు కనబడతాయి గానీ మనలాంటి మరుగుజ్జులు కనబడ్తారా?’ అని

అంది. మరో కుర్రకోతి 'రాముడి సంగతి వదిలెయ్యిరా! ఆ సుగ్రీవుడూ, ఆ హనుమంతుడూ మన రాజు–మంత్రులు కదా! వాళ్లకైనా మనం గుర్తుండాలి కదరా! యుద్ధానికేమో గుర్తున్నాం, ఇప్పుడు రక్షించాల్సివస్తే మనం కనబడం. తప్పంతా మన రాజు, మంత్రులదేరా' అని అంది. మిగిలిన కోతులన్నీ ఆ ఇద్దరికీ వంత పాడాయి. ఓమూలగా ముడుచుకు కూర్చున్న ముసలి కోతి ఒకటి లేచి 'అబ్బాయిలూ! ఎందుకు అనవసరంగా నోరు పారేసుకుంటారు! ఆ రాముడు ఆడిన మాట తప్పని వాడని నా నమ్మకం. పెద్దల మాట చద్దిమూట కదూ! అంచేత నేను చెప్పినట్టు చేసి చూడండి. నేటి నుంచీ అఖండ రామనామ జపం చేద్దాం. రాముడి కన్నా ఆయన పేరు గొప్పది. నా మాట నమ్మండి' అన్నది. ఏ కళనున్నాయో లేక చేసేందుకు వేరే పనేమీ లేదనో మిగతా కోతులన్నీ ముసలి కోతి మాటల్ని ఒప్పుకుని రామనామస్మరణ మొదలెట్టాయి. ఏ ముహూర్తానికి అవి ముక్తిని పొందేంతగా మీ నామస్మరణ పుణ్యాన్ని సంపాయించాయో, అదే సమయానికి మీ నీడయైన హనుమంతుడు గంట వద్దకు చేరుకున్నాడు. మీరు ఆనతినిచ్చారు. హనుమ దయవల్ల ఆ పొట్టికోతులకు గంట అడ్డంకితో బాటు అజ్ఞానమూ తొలగిపోయింది. తమ ఎదురుగా నిలబడ్డ మీ దివ్యమంగళరూపాన్ని చూసి, తాము ఆడిన చెప్పుడు మాటలు గుర్తుకువచ్చి, కళ్ళనీళ్ళతో మనసుల్ని ప్రక్షాళితం చేసుకున్నాయి. మీరు ఆదేశించినట్టుగా అనాటి నుండేగా అంజనాసుతుడు తన వాలంలో గంటను ధరించడం మొదలుపెట్టాడు!" అని ముగించింది నిత్యసుమంగళదేవత.

చిరునవ్వు నవ్వాడు సర్వలోకశుభంకరుడు.

మళ్లీ ఆట మొదలైంది.

తన వంతుగా పాచిక విసిరింది మహాలక్ష్మి.

★★★★★

"ఇప్పుడేం చేస్తావ్?" టీ కప్పును సింక్ లో పడేస్తూ అడిగింది రంజని.

"ఇంకా ఆలోచించలేదు. ఐ నీడ్ సమ్ టైమ్!" అన్నాడు అనంత్.

“సమ్ టైమ్ ఓకే! కానీ హౌ మచ్ టైమ్ అని?” అడిగింది రంజని.

“అట్లీస్ట్ వన్ వీక్”

“ఆలోచించుకోవడానికే వారం రోజులా? ఆలోపు ఓ ఉద్యోగం సంపాదించుకోవచ్చు!” అసహంగా అంది రంజని. దాటవేసే ధోరణంటే ఆమెకు నచ్చదు.

“అవున్లే! మీ ఆడవాళ్ళకు ఉద్యోగాలు వారంలోనే దొరికిపోతాయేమో! మాకట్లా కాదులే. ఐనా నా ప్రాబ్లం గురించి నువ్వింత వర్రీ అవ్వాల్సిన పన్లేదు. నా పాట్లేవో నేనే పడతాను. యూ జస్ట్ రిలాక్స్ అండ్ లుక్ ఆఫ్టర్ యువర్ జాబ్.” అన్నాడు అనంత్.

తమ మాటలు అర్థం లేని విధంగా సాగుతున్నట్టు అనిపించింది రంజనికి. ఆ విషయాన్ని అక్కడికే వదిలేసింది.

రెండు వారాలు గడచిపోయాయి. అనంత్ పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడేనన్నట్టు ఉంది. తనేం చేస్తున్నాడో రంజనికి తెలియనివ్వకుండా, గుంభనంగా ఉంటున్నాడు. రంజని కూడా గిరి గీసుకుని ఉండిపోయింది.

నెలరోజులూ గడిచిపోయాయి. అనంత్ దాదాపు ఇంటి పట్టునే ఉంటున్నాడు. అప్పుడప్పుడూ రంజని ముఖప్రీతి కోసమన్నట్టు నీట్‌గా డ్రెస్ చేసుకుని బైటకెళ్ళి వస్తున్నాడు. అడపాదడపా రంజని అడిగే ప్రశ్నలకు ముక్తసరిగా సమాధానమిచ్చి తప్పించేసుకొంటున్నాడు. భర్త చేస్తున్నదేమిటో పూర్తిగా అర్థం కాని రంజని అనవసరపు గొడవలెందుకని మౌనంగా ఉండిపోసాగింది. రానురానూ ఇద్దరి మధ్యా ఏదో గోడ ఉన్నట్టుగా వాళ్ళకు అనిపించసాగింది. మొహాల్లో నవ్వులు తగ్గిపోయాయి. రంజని ఆఫీసులోనే తినేసి వచ్చేసేది. అనంత్ ఏం తింటున్నాడన్న విషయాన్ని కావాలనే పట్టించుకోవడం తగ్గించేసింది. ఒకట్రెండుసార్లు ఈ విషయంపై గొడవపడ్డాడు అనంత్. రంజని గొడ్డు మౌనాన్ని ప్రదర్శించింది. ఆ మౌనం అనంత్ ఈగోను మరింత దెబ్బకొట్టింది.

ఒకరోజు రంజని ఆఫీస్ కొలీగ్ నుండి అనంత్ కు ఫోన్ వచ్చింది. అర్జెంటుగా ఆఫీస్‌కు రమ్మని సారాంశం. అనంత్ కావాలనే నింపాదిగా వెళ్లాడు. రంజని టీమ్ మేనేజర్ ఆఫీస్ రిసెప్షన్లో వేచివున్నాడు. అతని మొహంలో చిరాకు, కోపం ప్రస్ఫుటంగా కనబడుతోంది.  ఏమాత్రం గౌరవం ధ్వనించని మాటల్తో హటాత్తుగా మూర్ఛపోయిన రంజనిని అర్జెంటుగా హాస్పిటల్‌కు తీసుకెళ్ళినట్టు చెప్పాడు. హాస్పిటల్ చిరునామా ఇచ్చి త్వరగా అక్కడి కెళ్లమన్నాడా మేనేజర్. అనంత్ బయల్దేరబోతుండగా "ఆమెలో చాలా మెంటల్ డిస్టర్బెన్స్ ఉన్నట్టుంది. ఐ హోప్ యూ నో ఇట్. ప్లీజ్ టేక్ ఎ గుడ్ కేరాఫ్ హర్." అని చెప్పి, షేక్ హ్యాండ్ కూడా చెయ్యకుండా తన కేబిన్ తలుపు మూసేసాడు మేనేజర్.

తల కొట్టేసినట్టైంది అనంత్ కు. "అంటే వీడితో మన విషయాలన్నీ మాట్లాడేసినట్లుంది! లేకపోతే వీడెందుకు ఇంత లెవెల్ చూపిస్తున్నాడు? నాగురించి చెప్పేటప్పుడు నేనో ఐ.ఐ.టియన్ అని చెప్పినట్టు లేదు. దీని సంగతి చూస్తా!" అని లోలోపలే పళ్ళు కొరుకుని అక్కడి నుంచి కదిలాడు అనంత్.

హాస్పిటల్ కు వచ్చి, రంజని ఎక్కడుందో కనుక్కునేసరికి పదిహేను నిముషాలపైనే పట్టింది. ఐ.సి.యు బైట కుర్చీలో కూర్చుని, డాక్టర్ కోసం ఎదురుచూస్తున్నాడు. అప్పటికి రంజని ఆఫీస్ నుంచి ఫోన్ వచ్చి నాలుగు గంటలపైనే ఐపోయింది. ఐనా అనంత్ లో ఎలాంటి ఉద్వేగమూ లేదు. భార్య ఎందుకలా హటాత్తుగా మూర్ఛపోయిందన్నదానిపై ఆలోచన కూడా చేయడం లేదు. అతని మనసంతా మేనేజర్ అన్న చివరి మాటల చుట్టూనే తిరుగుతోంది.

ఐ.సి.యు. వార్డ్ తలుపుల్ని తోసుకుంటూ ఓ లేడీ డాక్టర్ బైటకొచ్చింది. అనంత్ లేచి నిలబడ్డాడు. "అనంత్?" అని అడిగింది డాక్టర్. "యా! ఐ యామ్ అనంత్!" అన్నాడు.

షేక్ హ్యాండ్ ఇచ్చింది డాక్టర్ "ఇ యామ్ డాక్టర్ దీప్తి నారంగ్" అంది. "నైస్ మీటింగ్ యూ డాక్టర్!" అన్నాడు అనంత్ ముక్తసరిగా.

“రంజని, మీ భార్య, షీ ఈజ్ రెస్పాండిగ్ టు ద ట్రీట్మెంట్. కానీ వుయ్ కుడ్ నాట్ సేవ్ ద డే. అందువల్ల ఈరోజంతా ఆవిడ మా అబ్జర్వేషన్లో ఉంటే మేలు. నా కేబిన్ కు వెళ్ళి మాట్లాడుకుందాం. ప్లీజ్ వైట్ హియర్. ఇంకో పేషంట్ ను చూసేసి వస్తాను.” అని మళ్ళీ వార్డ్ లోకి వెళ్లిపోయింది డాక్టర్ దీప్తి.

అప్పటికి కూడా అనంత్ రంజని గురించి ఆలోచించడం లేదు. ఆ క్షణంలో అతను దేని గురించీ ఆలోచించడం లేదు. అతని హాస్పిటల్ వాతావరణం, ఆ వాసనలంటే ఎలర్జీ. అదోరకమైన భయం కూడా!

పది నిముషాలు గడిచాక డాక్టర్ దీప్తి ఐ.సి.యు నుంచి బైటకు వచ్చింది. అనంత్ ఆమె వెంటే కేబిన్లోకి వెళ్ళాడు.

“ఐయామ్ ఎక్స్ ట్రీమ్లీ సారీ ఫర్ ద లాస్ అనంత్! “ అంది డా. దీప్తి.

అర్థం కానట్టు చూసాడు అనంత్. ఆ అర్థంకానితనాన్ని పలికిస్తూ “డాక్టర్?” అన్నాడు.

ఏవో రిపోర్టుల్ని చూస్తున్న దీప్తి “రంజనికి అబార్షన్ అయింది. యూ షుడ్ బీ బ్రేవ్ నౌ. ఆవిడకు మీరే ధైర్యం చెప్పాలి.” అంది.

గుండెలో కలుక్కుమన్నట్లైంది అనంత్ కు. “అ..బా.ర్ష..న్...రంజనీకి!”. అనంత్ ఆ మాటల్నే మాటిమాటికీ అనుకోసాగాడు.

రిపోర్టుల్ని చూడ్డం ఐపోయినట్టుగా వాటిల్ని పక్కకు పెట్టి అనంత్ ముఖంలోకి చూస్తూ “మీ ఫీలింగ్స్ నాకర్థమౌతున్నాయి అనంత్. రంజనికి రెండో నెల నడుస్తున్నట్టుంది. ఈమధ్యకాలంలో ఆవిడ చాలా సైకలాజికల్ టెన్షన్స్ కు గురైనట్టుంది. ఆల్సో, ఆమె చాలా అండర్ నరిష్డ్ గా కనిపిస్తోంది. రంజని బాడీ ఇమ్యూనిటీ కూడా నాట్ గుడ్. ఐ థింక్ యూ వుడ్ బీ నోయింగ్ ఆల్ దీజ్ థింగ్స్. మీరు ఆవిడతో కొద్దిగా ఎక్కువ టైం గడపాలి. నాకు తెల్సు, భార్యభర్తలిద్దరూ ఎంప్లాయీస్ ఐతే టైమ్ దొరకడం చాల కష్టమని. బట్, జస్ట్ మన కోసం బతికితే అది లైఫ్ కాదు. వుయ్ హావ్ టు సాక్రిఫైస్ ఫ్యూ థింగ్స్ ఫర్ అదర్స్. మీరు కొద్దిరోజులు లీవ్ అప్లై చేసి రంజనితో ఉంటే బాగుంటుంది. అబార్షన్ వల్ల ఆమె హెల్త్ పై

ఎఫెక్ట్ ఎక్కువగా ఉండదు. కానీ సైకలాజికల్ ఎఫెక్ట్ చాలా ఎక్కువుండొచ్చు. కాబట్టి యూ షుడ్ బీ వెరీ నైస్ టు హర్. యూ కెన్ సీ రంజని నౌ." అని బజర్ నొక్కింది.

లోనికి వచ్చిన నర్స్‌తో అనంత్‌ను రంజని ఉన్న వార్డ్‌కు తీసుకెళ్ళమని చెప్పింది. వాకిలి తీసి బైటికెళ్ళబోతున్న అనంత్‌తో "అనంత్! మీ ఇద్దరి మధ్య ఎలాంటి సమస్యలున్నా, వాటిల్ని మీరు మర్చిపోయి రంజనికి ఈ టైమ్‌లో హెల్ప్ చేయాలి. ఓకే!" అంది డా. దీప్తి. "ఎస్! డాక్టర్!" అన్నాడు అనంత్.

నర్స్ వెనకే నడుస్తున్న అనంత్ మనసులో ఆలోచనల తుఫాను. "రంజని గర్భిణా? ఈ విషయాన్ని తన నుంచి ఎందుకు దాచింది? ఇప్పుడేం చెయ్యాలి? రంజనిని ఎలా పలకరించాలి?"

ఎనిమిది పడకలున్న ఐ.సి.యు 'బి' వార్డది. ఐదు పడకలు ఖాళీగా ఉన్నాయి. రంజని కాక ఉన్న మరో ఇద్దరూ పెద్దవయసు మగవారు. ఆ ఇద్దరూ మంచినిద్రలో ఉన్నట్టున్నారు. రంజని మేలుకునేవుంది. నర్స్ రంజని బెడ్ దగ్గరకు వచ్చి సెలైన్ బాటిల్ను ఒకసారి చెక్ చేసి వెళ్ళిపోయింది.

బెడ్ పక్కనేవున్న ప్లాస్టిక్ చైర్లో కూర్చున్నాడు అనంత్. రంజని అతని వైపు ఒకసారి చూసి కళ్లు తిప్పేసుకుంది. అనంత్ తికమకలోనుంచి ఇంకా తేరుకోలేదు. ఒక్కమాట కూడా అతని నోట్లో నుండి రావడంలేదు. ప్రయత్నపూర్వకంగా రంజని కుడిచేతిని తాకాడు. ఆమె వేళ్లు సన్నగా వణుకుతున్నాయి. నెమ్మదిగా ఆ వేళ్ళను తన అరచేతిలో తీసుకుని కొద్దిగా వొత్తి పట్టుకున్నాడు.

రంజని కళ్ళు మూసుకుంటే, రెండువైపులా వెచ్చటి ప్రవాహాలు జలపాతాల్లా దూకాయి. అమితమైన తమితో మెత్తటి దిండు వాటిల్ని తనలో కలిపేసుకుంది.

అనంత్ రంజనిని నిర్వ్యాపారంగా చూస్తున్నాడు!

★★★★★

మహాలక్ష్మి రెండో పావు పదిహేడో గడి చేరితే అక్కడే నక్కివున్న "రావణాసురుడు" అనే పాము ఆ కాయను మింగేసింది. జర్రున జారిన పావు "కుక్క" ను చేరుకొంది.

“రావణుడి దృష్టిలో పడ్డ నీ ఆటకాయ శునకమైపోయింది. దీనర్థమేమిటి?” అని అడిగాడు నిత్యతృప్తుడు.

“అహంకారం, మూర్ఖత్వం ఒకేసారి చెలరేగితే ఆ వ్యక్తి పతనం నీచత్వానికి దారి తీస్తుంది ప్రభూ!” అంది నిత్యతృప్తుని సత్యప్రియభామిని.

“మరి దీనికి తరుణోపాయం?”

“కుక్కలోని గొప్ప గుణం విశ్వాసం. నీచజన్మ సంభవించినా మీ పట్ల మొక్కవోని విశ్వాసాన్ని ప్రదర్శించడమే తరుణోపాయం, మహాభాగా!” అన్నది లక్ష్మి.

నవ్వాడు నారాయణుడు.

“మీ పావుకు దిశానిర్దేశం చేయండి.” అన్నది ఆవిడ.

దిక్కుతోచని వారికి నేనే దిక్కు అన్న మాటల్ని ధ్వనిస్తున్నట్టుగా ఖణేల్మని పడ్డాయి పాచికలు.

★★★★★

హాస్పిటల్ రిసెప్షన్లో కూర్చునువున్నారు కేశవశర్మ, సుమతి.

ఇద్దరూ వారివారి పరీక్షల్ని పూర్తిచేసుకున్నారు. ఫలితాలు రావడమే తరువాయి.

సుమతి ముఖంలో ఆత్రుత స్పష్టంగా కనబడుతోంది. శర్మ మాత్రం లోపలి ఆత్రుతని దైవస్మరణతో అణిచిపెట్టే ప్రయత్నం చేస్తున్నాడు.

“శర్మగారూ! రండి” అని పిలిచాడు డాక్టర్. ఇద్దరూ లోనికెళ్ళారు.

“శర్మగారూ! మీరిద్దరూ పర్ఫెక్ట్‌లీ ఆల్రైట్. ఇద్దరిలోనూ ఎలాంటి సమస్యా లేదు. బహుశా మీరు తీసుకొనే ఆహారం బలవర్ధకంగా లేనట్టుంది. కొద్దిగా దానిపై శ్రద్ధపెట్టండి. ముఖ్యంగా సుమతిగారు మంచి ఆహారాన్ని తీసుకోవాలి. మానసికమైన ఒత్తిళ్ళను దూరం పెట్టుకుని హాయిగా సంసారం

చేసుకుంటే మీరు కంటున్న కల తప్పకుండా నిజమౌతుంది.” – అచ్చమైన తెలుగులో, హాయైన నవ్వును పెదాల మీద వెలిగించి చెప్పాడు డాక్టర్.

మెడికల్ రిపోర్టుల్ని తీసుకుని బైటకొచ్చారు శర్మ దంపతులు.

ఇంట్లోకి రాగానే, సుమతి భర్తను గట్టిగా కౌగిలించుకుంది. శర్మ కూడా ఆవిడని గట్టిగా పొదివిపట్టుకున్నాడు. “నీ అనుమానం తీరిందిగా! రేపే మరో అమ్మాయిని పెళ్ళి చేసుకుంటా!” అన్నాడు చిలిపిగా. సుమతి ఏం మాట్లాడలేదు. ఆవిడకు ఏదీ వినబడ్డం లేదు...ఒక్క అందమైన భవిష్యత్తు తప్ప.

★★★★★

నారాయణుని రెండో పావు కదిలి “సుగుణము” అనే గడిని చేరుకుంది.

“సుగుణం సాలోక్యాని సోపానం!” అంది లక్ష్మి.

“భార్యాభర్తలిద్దరూ ఒకే ఆలోచనా తరంగాలపై విహరించడమే సాలోక్యం! అవునా దేవీ?”

“మీకు చెప్పేంతదానినా ప్రభూ!”

“మరి నీ మొదటిపావు సంగతేమిటో చూద్దాం. నడిపించు” అన్నాడు సర్వజీవప్రేరకుడు.

పాచికలను వేసింది ప్రకృతినియామకురాలు.

★★★★

రంజనిని ఇంటికి తీసుకువచ్చాక అనంత్ కొన్నిరోజుల పాటు ఆమెతో మాట్లాడలేక ఇబ్బందిపడ్డాడు. ఇంటికి వచ్చి వారం పైమాటే ఐనా ఇప్పటిదాకా రంజని ప్రెగ్నెన్సీ గురించి గానీ, దాన్ని దాచిపెట్టడం గురించీ ఒక్కమాట కూడా అనలేదు. అలాగని అనంత్ హటాత్తుగా ఖుషిలా ఐపోలేదు. లోలోపలే కోపంతో ఉడికిపోతున్నాడు.

మొగుడన్న కనీస మర్యాద లేకుండా ముఖ్యమైన విషయాన్ని దాచిపెట్టిన రంజనిని చూసే కొద్దీ అతనిలో ప్రేమ స్థానంలో కోపం పుట్టుకొస్తోంది. రంజని ఇలాగే రహస్యాన్ని దాచిపెట్టివుంటే, కడుపు పెరిగి, ముందుకొచ్చేదాకా కూడా తనకు తెలిసేది కాదు. అలా తెలుసుకున్న తర్వాత తను ఓ వెర్రివాడే! తనను వెర్రివాడిగా చెయ్యడమేనా రంజని ఉద్దేశం? ఆమె తల్లిదండ్రుల్ని పిలుద్దామన్న తన సలహాను కూడా కొట్టిపారేసింది. అంటే నేను తనకు నౌకర్నేగా? తలచుకునే కొద్దీ అతనిలో కఠినత్వం పెరిగిపోసాగింది.

రంజని ముడుచుకొని పడుకునుంది.

“ఏం? జ్యూస్ తాగవా! అక్కడపెట్టి గంటకావస్తోంది!” కోపంగా అడిగాడు అనంత్.

రంజని మాట్లాడలేదు.

అనంత్ బెడ్రూం బైటికెళ్ళిపోయాడు. అతని వెనకే ధడార్ మంటూ తలుపులు మూసుకున్నాయి.

రంజని కళ్ళు మూసుకుంది.

“అనంత్ కు చెప్పకుండా దాచిపెట్టి తప్పు చేసాను. ఇప్పుడు చెబితే మీనింగ్‌లెస్ అనిపిస్తుంది. కనీసం అతనైనా దీనిపై మాట్లాడితే చెబుదామంటే, అంటీముట్టనట్టుగా ఉంటున్నాడు. ఓ గాడ్! ఒక్క క్షణంలో వచ్చే కోపంతో ఎన్నెన్ని కష్టాలు!”

ఆమె మనసులో ఎడతెగని ఆలోచనలు.

లేచి జ్యూస్ గ్లాస్ ను తీసుకుని నెమ్మదిగా తాగుతోంది. అప్పుడే లోపలికి వచ్చిన అనంత్ వాకిలి దగ్గరే నిలబడి చూడసాగాడు. అనంత్ ను చూడగానే రంజనిలో సారీ చెప్పాలన్న ఆత్రుత పెరిగిపోయింది.

“అనంత్! ఒక్కసాగి ఇలారా!” అంది.

అనంత్ వచ్చి కుర్చీలో కూర్చోబోయాడు.

“నా పక్కనే కూర్చో, ప్లీజ్!” అంది రంజని.

అనంత్ కూర్చోగానే, జ్యూస్ గ్లాస్ ను పక్కనపెట్టి అతని భుజం మీద తలపెట్టి ఏడ్వడం మొదలు పెట్టింది. అనంత్ కదలకుండా బిగుసుకు కూర్చున్నాడు.

“సారీ అనంత్! నా ప్రెగ్నెన్సీ విషయం నీకు చెప్పకుండా దాచిపెట్టాను. అప్పుడున్న సిచుయేషన్లో వెర్రికోపంతో అలా చేసాను. ప్లీజ్ ఫర్గివ్ మీ!”, వెక్కిళ్ళు అడ్డుపడుతుంటే అతికష్టం మీద వాక్యాన్ని పూర్తి చేసింది రంజని.

“సర్లే! ముగిసిపోయిన విషయాన్ని ఇప్పుడు డిస్కస్ చేసి ప్రయోజనం లేదు. టైమ్ కు తగ్గట్టు తిని, రెస్ట్ తీసుకో!” అన్నాడు అనంత్.

“నీకింకా కోపం తగ్గలేదు! నీ మాటల్లోనే తెలుస్తోంది. ప్లీజ్ అలా మాట్లాడకు!” అంది రంజని వేడుకోలుగా.

“ఓకే ఓకే! లంచ్ తీసుకొచ్చాను. తింటావా?” వీలైనంత మెత్తదనాన్ని పలికిస్తూ అడిగాడు అనంత్.

సరేనన్నట్టు తలనూపింది రంజని “నువ్వూ నాతోటే తినాలి!” అంది.

రంజనీని ఇమిటేట్ చేస్తున్నట్టు అనంత్ కూడా తలూపుతూ “నీతో పాటే తింతాను…ఆకలి తీరకపోతే నిన్నూ తింతాను…సలేనా?” అన్నాడు. భర్త క్రాఫ్ పై చెయ్యి వేసి చిందరవందర చేసింది రంజని.

భోజనమయ్యాక, అనంత్ పక్కనే ఒదిగి పడుకుంది రంజని. అనంత్ లో ఉన్నట్టుండి ఆమెపై అవ్యాజ ప్రేమ పుట్టుకొచ్చింది. రంజని ముంగురులని చూపుడువేలితో రాస్తూ ఉండిపోయాడు.

★★★★★

“రావణుడు మింగిన ఆటకాయ, కుక్కను చేరి, ఇప్పుడు సెలయేరయింది. దీనర్థమేమిటి దేవి?” అడిగాడు సర్వజ్ఞ శేఖరుడు.

"ప్రభూ! అహంకారం నీచత్వానికి దిగజార్చినా, మీ కరుణాదృష్టి అనే కుంభవృష్టిలో తడిసిన మానవహృదయం ఆ కరుణరసాన్ని పిల్లకాలువ రూపంలో మోయగలదేగానీ సముద్రంలా జీర్ణించుకోలేదు." అంది శాంతిస్వరూపిణి.

"మరి నీ ఆకతాయి ఆటకాయ శాంతత్వాన్ని పొందుతుందా?"

"మీ దృష్టి పడిన తర్వాత పొందకపోతుందా శ్రీమాన్!"

"ఒక్కొక్కసారి, మానవుల బుద్ధిబలం కన్నా పక్కవారి సౌశీల్యం వారిని కాపాడుతుంది. నా మొదటి కాయను కదుపుతాను. ఏమౌతుందో చూద్దాం!" అన్నాడు ఉత్తుంగబదరీశిఖరవాసుడు.

"నమో నమః" అన్నది మందాకినీమాత.

ధ్వనిర్వినిర్ముక్త వేదాక్షర క్వణంలా నినదించాయి నారాయణుని చేత పాచికలు.

★★★★★

దాదాపు పదిహేనురోజుల తర్వాత ఇంటి నుండి బయటకు వచ్చింది రంజని.

మొట్టమొదటగా దేవుడి గుడి కెళ్ళాలనిపించింది. దగ్గర్లోనున్న వేంకటేశ్వరస్వామి గుడికి తెల్లవారుజామునే వచ్చింది. ఇంటర్వ్యూ వుందని ఇంట్లోనే ఆగిపోయాడు అనంత్.

అదో పురాతనకాలపు గుడి. పెద్దగా ప్రసిద్ధిలేదు. తామిద్దరూ ఆ ఊరికి వచ్చిన కొత్తల్లో ఒక్కసారి వచ్చారు. ఆ మాటకు నాలుగేళ్ళు గడిచిపోయాయి. ఆ తర్వాత ఉద్యోగాలు, అక్కడి సవాళ్ళు, ప్రమోషన్లు, ఇల్లు కొనుక్కోవడం వంటి వాటిల్లో పడిపోయి గుళ్ళకు వెళ్ళడం అరుదైపోయింది.

అనంత్ ఒక అగ్నోటిస్ట్. దేవుడున్నాడని గానీ లేదని గానీ వాదించడు. ఇంట్లో పూజలు చేసినప్పుడు దండం పెడతాడు. చెయ్యనిరోజున పెట్టడు. తనేమో దేవుణ్ణి నమ్ముతుంది. దుర్గాదేవి అంటే చాలా ఇష్టం. రోజూ బెజవాడ కనకదుర్గ పటానికి దండంపెట్టుకుంటుంది. కానీ ప్రతిరోజో, ప్రతివారమో

గుడికెళ్ళాలన్న నియమం పెట్టుకోలేదు. పండుగలప్పుడు తనకు వెళ్ళాలనివున్నా అనంత్ మూడ్ ను బట్టి తనూ సర్దుకునేది.

"ఇన్నేళ్ళకు మళ్ళీ గుడిలోకి కాలుపెట్టడం జరిగింది. ఇకనైనా ప్రతి శనివారం ఈ గుడికి రావాలి." అని అనుకుంది రంజని.

గుడిగంటను ఎవరో మోగించారు. ఆ శబ్దానికి ధ్వజస్థంభం పైనున్న పావురాళ్ళు తపతపా సవ్వడి చేసుకుంటూ ఎగిరాయి.

గర్భగుడి వద్దకు వెళ్లి, ఇద్దరి పేరునా అర్చన చేయించుకుంది రంజని. అర్చకుడు ఇచ్చిన ప్రసాదాన్ని బ్యాగ్ లో వేసుకుని ప్రధానాలయం మెట్లు దిగుతూ వస్తుంటే ఎక్కడినుంచో సన్నగా, సుశ్రావ్యంగా వేదనాదం వినిపించసాగింది.

చల్లటి వాతావరణం. స్తబ్దుగా ఉన్న పరిసరాలు. ఆ వేదస్వరం. సుస్పష్టమూ, సుశ్రావ్యమూ ఐన ఆ గాత్రం.

రంజని ఒళ్ళెందుకో ఒక్కసారి ఝల్లుమంది.

అది భయంవల్ల కలిగింది కాదు. ఊహించని విలువైన వస్తువు అనుకోకుండా దొరికినప్పుడు కలిగే జలదరింపు. మరీమరీ కోరుకునే సుఖం అసంకల్పితంగా లభించినపుడు మనసు చేసే కేరింతల వెల్లువ.

ప్రధానాలయం మెట్ల ప్రక్కనేవున్న పచ్చిక బయల్లో కాసేపు కూర్చుందామనిపించింది రంజనికి.

మార్గశీర్షపు తెల్లవారి లేత ఎండకు, చలిగాలి తోడై విచిత్రమైన ఉత్సాహాన్ని కలిగిస్తోంది. ఎండ, తాపాన్ని కలిగిస్తే చలిగాలి చల్లారుస్తోంది. సంసారబాధలకు వేడెక్కిన ఆత్మ, చల్లని దైవసాన్నిధ్యంలో సేద తీరుతోంది.

సన్నగా వినవస్తోన్న వేదఘోషకు అర్థం తెలియకపోయినా ఆ లయలో, ఆ ఆలయంలో, బాధలన్నీ లయమౌతుంటే సమస్యల వలయం విడిపోతున్న భావం కలుగుతోంది. అర్థం కానివన్నీ వ్యర్థం కావన్న కొత్తవిజ్ఞానం కళ్ళువిప్పుతోంది.

నిటారుగా నిలబడివున్న ధ్వజస్థంభం ఆకాశాన్ని మోస్తున్న మొనగాడి భుజస్థంభంలావుంది.

గాలిలో తేలివస్తున్న సుదూర భక్తుల విజ్ఞాపనల్ని గోపుర కలశం సాదరంగా స్వీకరిస్తోంది.

"*మౌనమ్ చైవాస్మి గుహ్యానాం*" అన్న గీతాచార్యుని పలుకులా గర్భగుడిలోని దైవం నిశ్శబ్దంగా తన పనేదో చేసుకుపోతోంది. పూజారి గంట వాయించినా, మంత్రం చదివినా ఆ మూలవిరాట్టు తదేకమౌనం చెదరడం లేదు.

ఆ సనాతన మౌనాన్ని తమ లోనికి ఆహ్వానించేవారి కోసం ఎదురుచూస్తున్నది గర్భగుడి గడప.

పుష్కరిణిలో బద్దలవుతున్న నీటి బుడగలు జీవితసత్యాన్ని బోధిస్తున్నాయి. తేలుతున్న పండుటాకులు కర్తవ్యబోధ చేస్తున్నాయి. ఆహారంకై నిలువకుండా తిరుగుతున్న చేపలు మానవులు దిద్దుకోవల్సిన విషయాల్ని విశద పరుస్తున్నాయి.

"ప్రసాదం తీసుకొంటారా?"

రంజని ఏకాగ్రమౌనం చెదిరింది, ఆ మాటల్తో.

తలెత్తి చూసిన రంజని. ఎదురుగా చక్కటి సాంప్రదాయపు కట్టుబొట్టుతోవున్న ఓ స్త్రీ. అప్రయత్నంగా అరిచేతుల్ని ఒక్కటిగా చేర్చి దోసిలి పట్టింది. ఆమె నవ్వుతూ అరిటాకులో వున్న పొంగలిని ఆ దోసిలిలో వేసింది.

"కూర్చోండి!" అంది రంజని, ఆ ప్రసాదాన్ని కళ్ళకద్దుకుంటూ. ఆవిడ కూర్చుంది. రంజని మరోమారు ఆవిడవైపు చూసింది.

భుజాల నిండుగా కప్పుకున్న చీర చెరుగు. నుదుటన దీపపు జ్యోతిలా కుంకుమ బొట్టు, నిలువుగా మెరుస్తోంది. చెంపలకు అంటుకుని పచ్చగా కనబడుతున్న పసుపుచారలు. భుజాలమీదనుంచి కప్పుకున్న చెరుగులోనుంచి లీలగా కనబడుతున్న మాంగల్యం. అన్నిటికీ మించి ఆ కళ్ళలోనున్న నిర్మలమైన భావం రంజనిని ఆకట్టుకుంది. "ముత్తైదువంటే ఇలా ఉండాలి!" అని అనుకుంది రంజని.

"మీరు కూడా ప్రసాదం తీసుకునేవుంటారు. కానీ దేవుని ప్రసాదాన్ని ఒకరికి పంచిరావాలని మావారు చెప్పారు. ఈరోజు మీరే మొదటగా కనబడ్డారు." అంది ఆవిడ.

"నా అదృష్టం" అంది రంజని.

కొద్దిసేపు ఇద్దరి మధ్యా మౌనం. ఆవిడేదో చెప్పుకుంటున్నట్టుగా పెదవుల్ని మెల్లిగా కదిలిస్తోంది.

రంజని ఆ మౌనాన్ని, ఆ ముత్తైదువ ఉపస్థితిని ఎంతగానో ఆస్వాదిస్తోంది. "ఎందుకో ఇంత ఎంజాయ్మెంట్?" అని తనని తాను మాటిమాటికీ ప్రశ్నించుకుంటోంది కూడా.

దైవస్తుతి చెప్పుకోవడం ముగిసినట్లుగా ఆ ముత్తైదువ రెండు చేతుల్నీ జోడించి, గుడివైపు చూస్తూ నమస్కారం చేసింది. ఆ తర్వాత తలత్రిప్పి రంజని వైపు చూసి నవ్వి "ప్రసాదం తీసుకోండి!"

మాట్లాడే అవకాశం కోసమే కాచుకున్నట్లుగా "ఇంతకీ ప్రసాదమంటే ఏమిటండి? సారీ, తమాషా కోసం అడగడంలేదు. ఆ పదానికి ఎగ్జాట్ మీనింగ్ తెలీదు. తెలుసుకోవలనే ఇంట్రెస్టుతో అడుగుతున్నాను. తప్పుగా అనుకోకండీ." అని అంది రంజని.

"అయ్యో! తమాషాకై అడిగినా మనకు తెలిసినంతలో సమాధానమివ్వాలని చెప్పారు మావారు. " అంది ఆవిడ.

"దట్స్ వెరీ నైస్. ప్లీజ్...చెప్పండి." అంది రంజని.

"మానవులు కడుపు నింపుకోవాలంటే పళ్ళు, ఆకుకూరలు, ధాన్యాలు మొదలైనవాటినే తీసుకోవాలికదండీ. ఆ పళ్ళచెట్లు, పంటలు అన్నీ జీవులేనట. అంటే అవి కూడా మనలాగే

ప్రాణమున్నవే. మనం కడుపు నింపుకునే నిమిత్తం వాటిల్ని కోసి, నలిపి, పిండి చేసి హింస కలిగిస్తాం కదా. అవన్నీ కూడా పాపాలేనంట. కానీ అవి మనం తప్పనిసరై చేసే హింస. అందుకని మనం తెచ్చుకున్న పళ్ళు, వండుకున్న పదార్థాలనూ దేవునికి నైవేద్యం పెడితే, దేవుడు ఆ పదార్థాలలో ఉన్న జీవులందరికీ కలిగిన బాధను పోగొడ్తాడంట. అలాగే మనం చేసిన హింసను కూడా పుణ్యంగా మార్చేస్తాడంట. దాన్నే ప్రసాదం అంటారు. ప్రసాదమంటే ప్రశాంతిని కలిగించేది, శుభాన్ని కలిగించేది, ఉపశమనం కలిగించేది...ఇలా చాలా అర్థాలున్నాయి. మావారికి అన్ని అర్థాలు తెలుసు. నాకు ఇన్నే గుర్తున్నాయి." అంది ఆవిడ.

రంజని విశాలంగా నవ్వింది.

"అయ్యో! మీకు అర్థం కాలేదనుకుంటా. మావారైతే చాలా చక్కగా చెబుతారు. నాకు అలా చెప్పడం చేతకాదు. నిజానికి ఆయన ఎన్నో చెబుతారు. కానీ నాకే పూర్తిగా గుర్తుండవు." అంది ఆ ముత్తైదువ.

అందుకు రంజని – "మీరు కూడా చాలా బాగా చెప్పారు. ఒక్క ఇంగ్లీషు ముక్క కూడా లేకుండా ప్యూర్ తెలుగు మాటలు. చాలా బాగున్నాయి. మీ పేరు?"

"సుమతి."

"నా పేరు రంజని."

"రంజని అంటే ఆకర్షణీయమైనది, రమణీయమైనది అని అర్థం. మీకు సరిగ్గా సరిపోయే పేరు పెట్టారు." అంది సుమతి.

రంజని తన పేరుకు గల అర్థం గురించి ఏనాడూ ఆలోచించనేలేదు. నిజానికి రంజని చాలా అందంగా ఉంటుంది. కాలేజ్ బ్యూటీ అని పేరుపొందింది కూడా! స్నేహితులు బ్యూటీ కాంటెస్టుల్లో పాల్గొనమని తెగ బలవంతం చేసినా, తనకు నచ్చక మానేసింది. ఇప్పుడు తన పేరుకు ఇంత అందమైన అర్థముందని తెలుసుకుని చాలా సంతోషపడింది.

“థాంక్స్ సుమతిగారు! నా పేరుకు ఇంత గొప్ప మీనింగ్ ఉందని నాకే తెలీదు. అసలు మా అమ్మానాన్నకి కూడా తెలిసుండదు. బేబీ నేమ్స్ బుక్ లో చూసి పెట్టారు. ఫన్నీ పార్ట్ ఏంటంటే నాకు నా పేరుకు అర్థం తెలియకపోయినా మీ పేరుకు అర్థం బాగా తెలుసు!” అని పకపకా నవ్వింది.

సుమతి కూడా నిశ్శబ్దంగా నవ్వింది.

“ఇంతకు ముందు, మీరు మంత్రాలేవో చదివారు కదా! వాటిల్ని గట్టిగా చెప్పలేదు ఎందుకు?” మళ్ళీ ప్రశ్నించింది రంజని.

“అదా! మంత్రమైనా లేదా ఎలాంటి ప్రార్థనైనా మౌనంగా చెప్పుకుంటే ఉత్తమఫలం. కొద్దిగా వినబడేట్టు చెప్పుకుంటే మధ్యమ ఫలం. బిగ్గరగా చెబితే అధమఫలం. పెదవుల్ని మెల్లగా కదిలిస్తూ చెప్పుకున్నా అది మౌనంలోకే వస్తుందట. మావారు చెప్పారు.” అంది సుమతి.

“వెరీ నైస్ ఇన్ఫో! చక్కని విషయాలు చెప్పారు. మీకు చాలా తెలుసండీ” అంది రంజని. సుమతిలోని నిజాయితీతో కలిసిపోయిన అమాయకత్వాన్ని చూస్తుంటే రంజనికి తెగ ముచ్చటేస్తోంది.

“మీరు బయల్దేరాలేమో!” అంది రంజని.

“మావారితో బాటూ వచ్చాను. ఆయన దగ్గర్లోనే పని మీద వెళ్ళారు. వచ్చి తీసుకెళ్తారు. అప్పటిదాకా ఇక్కడే ఉంటాను.” అంది సుమతి.

“ఓహ్! వండర్ఫుల్! నాకూ ఇంట్లో పనేమీ లేదు. మీవారు వచ్చేంత వరకూ మీకు కంపెనీ ఇస్తాను. నాకు మాటలెక్కువ. కాలేజ్ లో సుత్తి రంజని అని పిల్చేవాళ్ళు. బట్, ఈరోజు సుత్తి కొట్టను. మీరు ఏం చెబితే అది వింటానని హామీ ఇస్తున్నాను.” అంది రంజని ఉల్లాసంగా. తెలియని దగ్గరితనమేదో ఆమెను సుమతితో స్వేచ్ఛగా మాట్లాడింపజేస్తోంది. సుమతి మాటల్లోని సాదరభావం రంజనిలోని మొహమాటాన్ని మటుమాయం చేసింది.

సుమతి మళ్ళీ నిశ్శబ్దంగా నవ్వింది.

మాటలు కొనసాగించాలన్న తపనతో మరో ప్రశ్నను సంధించింది రంజని. “మీకెంతమంది పిల్లలు?”

సుమతి పెదవులపై నవ్వు నెమ్మదిగా మందగించింది. “ఇంకా లేదు.” అంది, దాదాపు గొణుక్కున్నట్టు.

“సారీ! సారీ అండి!” రంజని తప్పుచేసినట్లు.

“మీరడిగింది నా మనసుకు కష్టమైన విషయమే! కానీ తన సాన్నిధ్యంలో మీ నోట పిల్లల గురించి ఆ దేవుడు అడిగించాడంటే....త్వరలో మంచే జరగబోతుంది.” విశ్వాసం నిండిన గొంతుతో పలికింది సుమతి.

రంజని తల వంచుకుని, నిస్సారంగా నవ్వి “దేవుడే ఉంటే మంచివారికి కష్టాలనిస్తాడా?” అంది.

“ఆశ్చర్యం! సరిగ్గా ఇరవైరోజుల క్రితం నేనూ ఇవే మాటలు మావారితో అన్నాను_ _ _.”

సుమతి మాటలకు తలెత్తి చూసింది రంజని.

“అవునండి. పోయిన నెలలో మాకు పెళ్ళై పన్నెండేళ్ళు నిండాయి. ఆరోజున, పిల్లలేరని ఎదురింటి పిన్నిగారు ఏమేమో అన్నారు. ఆ బాధతో మావారిని చాలా నిష్టూరాలాడాను.”

“ఓహ్! తర్వాత?”

“మావారు నన్ను చాలా సమాధానపర్చారు. ఎన్నెన్నో పురాణ కథలు చెప్పారు. రెండువారాల క్రితం ఆసుపత్రిలో పరీక్షలు కూడా చేయించుకొన్నాం. ఇద్దరిలోనూ ఎలాంటి లోపమూ లేదని డాక్టర్ చెప్పారు. నాకోసమని నా నిష్టూరాల్ని భరించి ఇన్ని చేసారాయన.” చివరి వాక్యం పలికినపుడు సుమతి గొంతులో భర్త పట్ల గల ఆరాధనా, అభిమానం స్పష్టంగా పలికాయి.

“సో నైస్! మీరన్నది వింటుంటే ఫైరీ టేల్ వింటున్నట్టుంది.” అంది రంజని.

“ఫేర్ టెల్ అంటే?” అర్థం కానట్టు అడిగింది సుమతి.

రంజనికి ఫెయిరీకి తెలుగుపదం తట్టలేదు దాంతో "ఫెయిరీ టేల్...అంటే....అంటే...దేవతల కథ" టక్కున చెప్పేసింది.

సుమతి మెల్లగా నవ్వి "ఓ! ఫెయిరీ టేలా... నేను పెద్దగా చదువుకోలేదు. మీ ఇంగ్లీషు ఉచ్చారణ కొద్దిగా కష్టంగా ఉంది నాకు."

"మీ అంత సులభంగా అచ్చమైన తెలుగును మాట్లాడలేను. బట్, మీరు నా తెంగ్లీషును బాగా అర్థం చేసుకుంటున్నారు. సో, మీరే గ్రేట్. మీ భర్తగారు ఇంకా గ్రేట్. మీ ఇద్దరి కాంబినేషన్ రియల్లీ డివైన్. మీకు పిల్లలు కలగకపోవడమేంటి. జస్ట్ సరైన టైమ్ కోసం వెయిట్ చేయాలి. మీరిద్దరూ చాలా ఆప్టిమిస్టుల్లా కనబడుతున్నారు. గాడ్ విల్ ఆల్వేస్ సపోర్ట్ ఆప్టిమిస్ట్స్." ఆవేశంగా మాట్లాడింది రంజని.

"అవును. తన సన్నిధిలో మీతో పిల్లల గురించి అడిగించాడు భగవంతుడు. మీ మాటలతో ఏమూలో నాలో ఉన్న నిరాశ పోయినట్టుగా అనిపిస్తోంది." చివరి వాక్యం పలుకుతున్నప్పుడు సుమతి కళ్ళలోనూ, గొంతులోనూ తొణికిసలాడిన భావాన్ని చూసిన రంజనికి స్వచ్ఛత అంటే ఏమిటో అర్థమైనట్టు అనిపించింది.

"మీరు చాలా లక్కీ సుమతిగారు! మీ భయాల్ని పోగొడుతూ, మంచి మంచి విషయాల్ని చెప్పే భర్త దొరకడం మీరు చేసుకున్న పుణ్యం." స్వచ్ఛమైన మనసుతో అన్నది రంజని. "ఇఫ్ యూ డోంట్ మైండ్ సుమతిగారు! మిమ్మల్ని ఓదారుస్తూ మీవారేం చెప్పారో తెలుసుకోవాలనివుంది."

"అయ్యో! చెబుతాను. నేను ఏడ్చి, గోలపెడుతుంటే మావారన్నారు – పిచ్చిదానా! కుంతి కంటే ముందే తనకు పిల్లలు పుట్టాలని ఆశ పడ్డ గాంధారికి నూరుమంది దుష్టులు పుట్టారు. దేవకీదేవి కడుపున పుట్టిన ఆరుమందిని ఆమె అన్ననే చంపాడు. కానీ యశోద వద్దకు నారాయణుడు తానే స్వయంగా వచ్చి తన బాలలీలన్నీ చూపించి మురిపించాడు. నేనే దేవుడినని విర్రవీగిన హిరణ్యకశిపుడి కడుపున పరమవిష్ణు భక్తుడైన ప్రహ్లాదుడు పుట్టాడు. అతని కడుపున తాతను మించిన క్రూరుడైన విరోచనుడు పుట్టాడు. కానీ విరోచనుడి కడుపున ప్రహ్లాదుడి లాంటి భాగవతోత్తముడైన బలిచక్రవర్తి పుట్టాడు. మృకండ మహర్షి ఘోరమైన తపస్సు చేస్తే బ్రహ్మదేవుడు అనుగ్రహించింది అల్పాయుష్కుడైన

మార్కండేయుణ్ణి. కనుకనే పిల్లల్ని కంటాం గానీ వాళ్ళ తలరాతల్ని కంటామా అనే సామెత పుట్టింది. పిల్లలు కావాలనుకోవడం మన ఆశ. కానీ మంచివాళ్ళు, సంఘానికి మేలు చేసేవాళ్ళు బిడ్డలుగా కావాలనుకోవడం తపస్సు. ఆశ త్వరగా తీరుతుందేమోగానీ తపస్సు అంత తొందరగా నెరవేరదు. కంచం ముందు కూర్చోగానే అన్నం వచ్చి పడదు కదా! కాబట్టి ఓపిక పట్టాలని చెప్పారు." అంది సుమతి.

"వెల్ సెడ్...ఎక్సలెంట్..." అని చప్పట్లు కొట్టింది సుమతి. "నో డౌట్ సుమతిగారు! మీరు, వన్ ఆఫ్ ద లక్కియెస్ట్ వుమెన్. మీ హజ్బెండ్ గారు రియల్లీ వండర్ఫుల్ పర్సన్." చప్పట్లు కొడుతూనే అంది రంజని. "ఇంకా ఏం ఏం చెప్పారు? ముఖ్యంగా మంచి ఇన్స్పిరేషనల్ విషయాలుంటే చెప్పండి." – అల పుట్టే క్షణంలో సముద్రంలో ఉండే ఉత్సాహం ఇప్పుడు ఆమెలోనూ ఉవ్వెత్తున ఉంది.

"మీరు కొత్తతరం వాళ్ళు. మావన్నీ ఛాదస్తాలుగా అనిపిస్తాయేమో?" అంది సుమతి.

"నా వయసు ఇరవై ఐదు. మీకు ఓ ఇరవై ఏడు-ముప్పై ఉంటాయా?" – రంజని లోని అల వేగం పుంజుకొంటోంది. ఆ వేగం ఆమె మాటల్లో దూకుడుగా మారుతోంది. లోకంలో అరుదుగా ఎదురుపడే నిక్కమైన అమాయకత్వం ఆమె ఎదురుగా ఉండి, గురుత్వాకర్షణలా పనిచేస్తోంది.

"నాకు ముప్పై రెండేళ్ళు." అంది సుమతి.

"మీరు నాకన్నా ఏడేళ్ళు సీనియరా! ఐతే మీరు నన్ను మీరు అనకూడదు. జస్ట్ రంజని అని పిలవాలి. ఛాదస్తమో, గీదస్తమో...వాటెవర్ ఇటీజ్...మీవారు చెప్పిన మంచి విషయాలు చెప్పాల్సిందే...ప్లీజ్...ప్లీజ్" అంది రంజని.

"సరే! సరే! చెబుతాను..." నిష్కల్మషాన్ని నవ్వుగా మార్చి అంది సుమతి.

రంజని రెండు చేతుల్నీ గడ్డం క్రిందకు చేర్చి కూర్చుంది.

"ఆయన కొన్ని సంస్కృత సుభాషితాలను చెప్పారు. సూర్యుడు ఒంటి చక్రం వున్న రథాన్నెక్కి ఆకాశంలో తిరుగుతాడు. సూర్యుడి రథసారథియైన అనూరుడికి తొడల నుండీ కిందకు దేహం లేదు. ఒంటి చక్రపు

రథం, వికలాంగుడైన సారథితో, ప్రతిరోజూ తన ప్రయాణానికి అడ్డుపడే రాక్షసుల్ని దాటుకుని ప్రయాణిస్తాడు సూర్యుడు. ఒక్కరోజు కూడా మానుకోడు. ఆవిధంగా గొప్పవాళ్ళు తమ సంకల్పబలంతో ఎదురుపడే అడ్డంకుల్ని దాటుకుని ముందుకే వెళ్తారు కానీ ఆగిపోరు."

"వోవ్! రోజూ చూసే సూర్యుడిలో ఇంత గొప్పదనముందా? ఇంకో సుభాషితం చెప్పండీ!"

"మానవులంతా కొబ్బరిచెట్టు నుంచి చాలా నేర్చుకోవాలట. తోటమాలి తనకు పోసిన గుక్కెడు నీళ్ళకు ప్రతిఫలంగా, తియటి నీళ్ళు నిండిన, బరువైన కాయలను తన తలపై మోస్తూ నిలబడుతుంది కొబ్బరిచెట్టు. అలాగే మంచివాళ్ళెప్పుడూ తమకు సహాయం చేసినవారిని మర్చిపోరు. అంతేకాదు, ఎదుటివాళ్లు చేసిన అల్పమైన సహాయాన్ని ఎల్లప్పుడూ తలుచుకుంటూ, వారికి గొప్ప సహాయాన్నే చేస్తారు."

"సూపర్బ్! సుభాషితాలే కాకుండా ఇంకేవైనా చెప్పారా?" – ఎంతో ఉత్సాహంతో తాను నిర్మించిన అలను తీరం మింగేసినా, పట్టుదలతో మరో అలను తయారుచేసుకునే సముద్రంలా ఉంది రంజని మనసు.

"ఊ...! ఇంకేమైనా అంటే......వైశాఖమాసమహాత్మ్యంలోని ఒక విశేషం చెప్పారు."

"కథలైతే వద్దు. మంచి వండర్ఫుల్ విషయమైతేనే చెప్పండి." గోముగా అడిగింది రంజని.

"ఇది కథ కాదు. ప్రకృతి పట్ల మానవులు ఎలా నడుచుకోవాలని చెప్పేది." అంది సుమతి నవ్వుతూ.

"ఓకే! ఎన్విరాన్మెంట్ అవేర్నెస్ అన్న మాట. ప్లీజ్ చెప్పండి."

"వైశాఖమాసం అంటే వేసవికాలంలో ఇంటి ముందుగానీ, వెనుకగానీ– ఎక్కడ ఖాళీ స్థలముంటే అక్కడ మట్టికుండ అడుగుభాగాన్ని భూమిలోకి పాతి అందులో నీళ్ళు పోసి, చుట్టూ గింజలు చల్లాలంట. దాహమేసిన పిట్టలు గింజలు తిని, నీళ్ళు తాగాలని ఋషులు ఈ ఏర్పాటును చేసారట. ఎండాకాలంలో దాహమేసిన వారందరికీ తాగడానికి నీళ్ళో, మజ్జిగో, పానకమో ఇస్తే అంత పుణ్యమంట." అని ఆగింది సుమతి.

“కుండముక్కలో నీళ్ళు పోసి, గింజలు చల్లి, పక్షుల్ని పిలిచి నీళ్ళివ్వడం. అయ్యో! సో క్యూట్. ఎంత మంచి ఐడియా. సిటీల్లో ఉండేవాళ్ళు ఎంత మిస్సౌతున్నారో కదా!” అంది రంజని.

ఇష్టపడి చేసుకున్న అలలన్నీ ఐపోతే, చిరాకు పడ్డ సముద్రం ముడుచుకుపోయినట్టు, హటాత్తుగా మౌనం వహించింది రంజని. నిజానికి సుమతి చెప్పిన ఆసక్తికరమైన విషయాల్ని మర్చిపోకూడదని మననం చేసుకుంటోంది రంజని.

అప్పుడు దూసుకొచ్చింది ఓ బాణం.

“మరి మీకూ...పిల్లలు...” నెమ్మదిగా అడిగింది సుమతి.

“ఇరవై రోజుల క్రితం నాకు అబార్షన్ అయింది. అదే నా ఫస్ట్ ప్రెగెన్సీ!” అని అంది రంజని.

ఈసారి నివ్వెరపోవడం సుమతి వంతయింది. “అయ్యొయ్యో! దయచేసి క్షమించండి.” సుమతి కళ్ళల్లో ఉన్నపళాన నీళ్లు కమ్మాయి.

“అరెరే! మీరెందుకు ఏడుస్తున్నారు? మీరడిగిన దానికి నేను అస్సలు బాధపడ్డం లేదు. ఇన్ఫాక్ట్ నేనే మీతో ఈ విషయం చెప్పాలనుకున్నాను.” సమాధానపరుస్తున్నట్టుగా అంది రంజని.

సుమతి తలను అడ్డంగా ఊపి – “లేదండీ! ఆ వెర్రి ప్రశ్నతో మీకెంత బాధ కలిగిందో నాకు తెలుసు! నన్ను క్షమించండి.” అంది, కన్నీళ్లని చెంగుతో ఒత్తుకుంటూ.

“నో నో నో! అలాంటిదేమీ లేదన్నాగా!” అంటూ సుమతి చేతుల్ని పట్టుకుంది రంజని. మెత్తని చేతులు వెచ్చగా ఉన్నాయి. రంజని చేతులు తాకినంతనే సుమతి రెండు చేతుల నిండా ఉన్న మట్టిగాజులు గలగలమన్నాయి. ఆ నీరవ వాతావరణంలో ఆ గాజుల చప్పుడు రంజని చెవులకు వింతగా సోకింది. ఆ చప్పుడులో ఏదో పురాతన రహస్యమొకటి తనతో మాట్లాడినట్టుగా అనిపించింది రంజనికి.

సుమతి చేతుల్ని గట్టిగా పట్టుకుని “మహాలక్ష్మిలా ఉన్నారు. మీరు నవ్వుతూ ఆశీర్వదిస్తే నాకు మంచి జరుగుతుంది! ప్లీజ్! ఏడవకండీ!” అంది రంజని. సుమతి దుఃఖాన్ని అదిమేందుకు ప్రయత్నించింది.

ఒకట్రెండు నిముషాల్లో సర్దుకుంది. అంతసేపూ సుమతి చేతుల్ని పట్టుకునేవుంది రంజని. సుమతి మామూలుగా కావడంతో ఆమె చేతుల్ని వదిలిపెట్టింది.

చేతుల్ని వెనక్కు తీసుకోగానే చలిగాలి తన వేళ్ళని కసిగా కొరికినట్లైంది రంజనికి. అమ్మవొడిలాంటి వెచ్చదనం ఈమె చేతుల్లోకి ఎలా వచ్చిందని చకితురాలయింది. ఆ చేతుల్ని పట్టుకున్నంతసేపూ తనలోకి ప్రవహించిందేమిటి? స్వచ్ఛతా! నిశ్చలత్వమా! విశ్వాసమా! పరిపూర్ణతా! — తెలీదు. కానీ ఒకానొక మార్పు మాత్రం రక్తనాళాల్లో కొత్తగా ప్రవహిస్తోందని అనిపించింది రంజనికి.

“హమ్మయ్య! ఇప్పుడు మీరు మళ్ళీ సుమతిగా మారిపోయారు. థాంక్ గాడ్!” నవ్వుతూ అంది రంజని.

సుమతి దించిన తల ఇంకా ఎత్తనే లేదు.

అంతలో ఆవైపుకే నడుచుకుని వస్తున్న ఓ సంప్రదాయస్తుడ్ని చూసి, సుమతి అనేకమార్లు తల్చుకున్న “మావారు” ఆయనే కావొచ్చునని ఊహించింది రంజని. “సుమతిగారు! అక్కడ వస్తున్నది...” అర్థవంతంగా ఆగిపోయింది.

తలెత్తి చూసిన సుమతి “మావారే!” అని చెప్పి గబగబా కళ్లను తుడుచుకుని నిలబడింది. రంజని కూడా లేచి నిలబడింది.

వాళ్లిద్దరి దగ్గరకూ వచ్చిన కేశవశర్మ మొదట రంజనికేసి చూసి ఆ వెంటనే సుమతి వైపు చూసాడు.

“ఏమండీ! ఈవిడ రంజని. ఇక్కడే, ఇప్పుడే పరిచయమయ్యారు. మీరు వచ్చేవరకూ నాకు తోడుగా ఉన్నారు.” అంది సుమతి.

“ఓ! అలానా! సంతోషం!” అన్నాడు శర్మ.

సుమతి అతని పక్కకు వెళ్లి నిలబడింది.

బాగా పైకి వచ్చిన సూర్యుని ఏటవాలు కిరణాలు ఆ దంపతుల మీద పడి మెరుస్తున్నాయి. అతను – మనిషికీ, పిట్టకూ, జంతువుకూ ఏకకాలంలో దాహం తీర్చే సరస్సులా ఉన్నాడు. ఆ సరస్సులోకి వొలికే వెన్నెల్లో, తడిసి విరిసిన ముగ్ధకలువలా ఆమె.

అతను – నిశ్చయ జ్ఞానానికి నిర్వచనంలా కనబడుతున్నాడు. ఆమె – అచంచలమైన అంకితభావానికి, మొక్కవోని నమ్మకానికి రూపుకట్టినట్లుంది.

ఎవరన్నారు? పెద్ద చదువులు, పెద్ద జీతాలు, పెద్ద పెద్ద మహాళ్ళలోనే సుఖముంటుందని?

రంజని వినయంగా వంగి అతని పాదాల్ని తాకింది. ఆ వెంటనే సుమతి కాళ్ళనూ తాకింది.

క్షణమాత్రంలో జరిగిన ఈ ఘటనకు దంపతులిద్దరూ ఆశ్చర్యపోయారు.

నమస్కారం చేసి, లేచిన రంజని పర్సులోనుంచి వెయ్యి రూపాల నోటు తీసి శర్మకు ఇస్తూ – "అమ్మకు చీర కొనిపెట్టండి!" అంది.

మొదటి ఆశ్చర్యం నుంచే తేరుకోని శర్మ "ఏమిటండీ?" అన్నాడు.

"దయచేసి నన్ను బహువచనంతో పిలవకండి. నేను....జస్ట్ ఆర్డినరీ వుమన్. మీరిద్దరూ ఇలా కలిసి నిలబడివుండడం చూస్తుంటే...అది ప్యూర్ డివినిటీ. స్వచ్ఛమైన దైవత్వం ముందు నిలబడినట్టుంది. నా కష్టమేమిటో అమ్మతో చెప్పుకున్నాను. నన్ను ఆశీర్వదించండి. అమ్మకు చీర కొనిపెట్టండి. ఇది దానం కాదు. అమ్మకు చిరుకానుక! దయచేసి కాదనకండి!" – నిర్మలమైన గొంతుతో, నిశ్చలాలైన కళ్లతో, అవ్యక్త భావాలతో, కంపితమైన దేహంతో, చేతులు రెండూ జోడించి చెప్పింది రంజని.

జోడించివున్న రంజని చేతుల్ని పట్టుకుంది సుమతి. అమ్మవొడి వెచ్చదనం మరోమారు పలకరించింది. శర్మ చెయ్యెత్తి ఆశీర్వదించాడు.

వెళుతున్న ఆ దంపతులను చూస్తూ నిల్చుంది రంజని. రాజగోపురం దాకా వెళ్ళి, వెనక్కు తిరిగి చేయిని ఊపింది సుమతి. ఎందుకో, ఆ క్షణంలో రంజనికి మరోమారు ఒళ్ళు జలదరించింది. జలదరింపుతో వణుకుతున్న చేతిని ఎత్తి వీడ్కోలుగా ఊపింది రంజని.

మరో పదినిముషాలు అక్కడే గడిపిన రంజని అప్పుడే ఎగరడం నేర్చుకున్న పక్షిపిల్లలాంటి సంతోషంతో, నిప్పుని సైతం నిర్భయంగా తాకగల పసిపాప నిర్హేతుక ఉత్సాహంతో, వెలుగుతూ ఇంటికేసి బయల్దేరింది.

★★★★★

"ఆశ్చర్యం! మహదాశ్చర్యం! మీ మొదటిపావూ, నా మొదటిపావూ స్వర్గలోకానికే చేరాయి!" అంది నిగమవందితుని పట్టపురాణి.

"నన గూడి నార తలకెక్కుట లేదా!" అన్నాడు ఆశ్చర్యచరితుడు.

"ఇది కాకతాళీయమా స్వామీ?"

"విధి" అన్నాడు చిత్రచరిత్రుడు.

"ఐతే అది బలీయమూ, ఉద్ధారహేతువూనూ!" అంది సముద్రతనయ.

"మన రెండవ ఆటకాయలు నిశ్చేష్టంగా ఉన్నాయి." అన్నాడు నారదవరదుడు.

"సర్వులకూ చేష్టాప్రదులు మీరే. మీ కాయనే మొదటగా నడపండి." అంది భీష్మకనందన.

"హన్నా! ఆటలో ఆధిపత్యం కూడదు. ఇప్పుడు నీదీ వంతు!" అన్నాడు నీరజనేత్రుడు.

అమ్మ చేతిలోకి ముద్దుపాపల్లా చేరిన పాచికలు, ఉయ్యాల నూపుతుంటే కిలకిల్లాడే బుజ్జాయిల్లా చప్పుడు చేసాయి.

★★★★★

అపార్ట్మెంట్ కాంప్లెక్స్ మైన్ గేట్ దాటి లోపలికి వచ్చిన రంజనికి వాచ్‌మాన్ భార్య ఎదురుపడింది. ఆమె చంకలో బొద్దైన, చింకికళ్ల పిల్లవాడు. వెంటనే బ్యాగులో ఉన్న ప్రసాదం తీసి "భగవాన్ కా ప్రసాద్. లేలో" అంది. టక్కుమని అబ్బాయిని ఎత్తుకొని వాడి బూరబుగ్గల్ని చిదిమి మళ్ళీ తల్లి చేతికిచ్చింది రంజని. ఎప్పుడో గానీ కనబడని, కనబడినా మాట్లాడని "208 మేమ్ సాబ్" విన్యాసాల్ని వింతగా చూసింది ఆ గూర్ఖా భార్య.

లిఫ్ట్ లోకి వచ్చిన రంజనికి జీన్స్, టీ షర్ట్ వేసుకొన్న ఓ టీనేజ్ అమ్మాయి కనబడింది. రెండో ఫ్లోర్ నెంబర్ నొక్కి ఆ అమ్మాయి కేసి చూసింది. చటక్కున ఆ అమ్మాయి చెవి దగ్గర నోరుపెట్టి "యూ లుక్ హారిబుల్ ఇన్ దిస్ డ్రెస్. కం టు మై హోమ్. ఐ వుడ్ గివ్ యూ లంగా, వోణీ. యూ వుడ్ లుక్ ఫ్యాబ్యులస్...యా...బిలీవ్ మీ!" అంది. ఘుమ్మని కొడుతున్న నేతి వాసన, అర్థంకాని రంజని మాటల్తో ఉక్కిరిబిక్కిరైన ఆ అమ్మాయి "ఆప్ క్యా బోలే సమఝ్ మే నహీ ఆయా ఆంటీ!" అంది. అంతలో రెండో అంతస్తు వచ్చేసింది.

లిఫ్ట్ తలుపులు మూసుకోబోతుంటే, రెండు చేతుల్తోనూ ఆపి – "మై ఫ్లాట్ నెంబర్ ఈజ్ 208. కమ్ ఎనీ టైమ్ అండ్ వియర్ లంగా, వోణీ. యూ విల్ ఫాల్ ఇన్ లవ్ విత్ యువర్ సెల్ఫ్...ఐ బెట్!" అని కుడి బొటనవేలిని పైకెత్తింది. మూసుకుపోతున్న లిఫ్ట్ తలుపుల వెనక నోరెళ్ళబెడుతున్న ఆ టీనేజ్ కుర్రదాన్ని చూసి పకపకా నవ్వింది రంజని.

ఫ్లాట్ తలవాకిలిని తోసింది. తెరుచుకోలేదు. క్రిందనున్న ఫుట్ మ్యాట్ ను చూసింది. WELCOME అక్షరాలు తల్లక్రిందులుగా ఉన్నాయి. "అంటే అనంత్ ఆల్రెడీ వెళ్ళిపోయాడన్న మాట!". చేతిగడియారం చూసుకుంది. ఎనిమిదిన్నర అవుతోంది. "అవును. ఇంటర్వ్యూ SEZ యూనిట్లో అని కదూ చెప్పాడు. పాతిక కిలోమీటర్లు వెళ్ళాలిగా. అందుకే పెందళాడే వెళ్ళిపోయాడు." అని అనుకుంటూ తన దగ్గరున్న తాళంతో వాకిలిని తెరిచింది.

తిన్నగా సోఫా దగ్గరకెళ్ళి, అందులోకి దబ్బున కూలబడింది. వెనక్కి జారిగిలబడి కళ్ళు మూసుకుంది.

గుడి. గోపుర కలశం. ధ్వజస్థంభం. పచ్చికబయలు. సుమతి. మాటలు. కన్నీళ్ళు. ఆ దంపతులు. ఆశీర్వాదం.

ఐనా సుమతిని "అమ్మ" అని ఎందుకంది? తన కంటే జస్ట్ ఏడేళ్ళేగా పెద్ద? వయసు వల్ల కాదు తను అలా పిలిచింది. ఆ వెచ్చని చేతులు. అమ్మఒడిలోని వెచ్చదనాన్ని, నిశ్చింతనూ పొదవుకున్న ఆ మెత్తని చేతులు వల్ల. అందుకూ తను అమ్మా అని పిలిచింది. అంతేనా? ఇదొక్కటే కాదు. తను ఆ చేతుల్ని పట్టుకున్నప్పుడు...ఆ గాజుల శబ్దం. ఆ గలగలలు తన చెవుల్లో పలికిందే శబ్దం? "అమ్మ" అనేగా! ఎస్! అవును. అందుకే తన నోట్లోనుంచి "అమ్మ" పదం అప్రయత్నంగా వెలువడింది.

ఆ పచ్చికబయల్లో తన కోసమే వచ్చింది ఆ ముత్తైదువ. ఆమెను చూస్తే మొదట బెజవాడ దుర్గమ్మ ఫోటోనే గుర్తుకొచ్చింది. అవునవును! ఇది కూడా సుమతి "అమ్మ"గా మారడానికి కారణమే! బహుశా, ఏ పూర్వజన్మలోనో వాళ్ళే తన అమ్మానాన్న అయివుంటారు. లేకపోతే కొద్ది నిముషాల పరిచయంతో ఇంత సన్నిహితత్వమా?

ఆమె వెళ్లిపోతూ, చేయి ఊపితే తన ఒళ్ళెందుకు జలదరించింది? వేదం విన్నప్పుడూ జలదరించింది! అది, ఇదీ ఒకటేనా? అమ్మకు, నాదానికి అంత అవినాభావ సంబంధమా? ఏమో! తనకు ఇలాంటి విషయాలేవీ అంత లోతుగా తెలీవు.

ఆ బ్రాహ్మణుడు చెయ్యెత్తి ఏమని ఆశీర్వదించాడో?మంచి భార్యవు కమ్మనా! తల్లివి కమ్మనా? రెండూ ఐవుంటాయి.

అక్కడితో రంజని ఆలోచనలు ఆగిపోయాయి.

"ఏయ్! రంజూ! నిన్నే!" అన్న మాటలతో మెలకువైంది రంజనికి.

ఎదురుగా తన ముఖంలో ముఖం పెట్టి చూస్తున్న అనంత్.

అంటే...ఆలోచిస్తూ ఆలోచిస్తూ తను నిద్రపోయిందా? టైమెంతైందో!

“బైట ఫుట్ మాట్ రివర్స్ లోనే ఉంటే నువ్వు బైటికెళ్లావేమో అనుకున్నా! లోనికొచ్చి చూస్తే గుర్రుపెట్టి నిద్రపోతున్నావ్. ఒంట్లో బాగోలేదా?” పక్కనే కూర్చుంటూ అడిగాడు అనంత్.

“నో...నో...ఐ యామ్ ఫైన్.” అని అనంత్ భుజానికి తల ఆనిస్తూ అంది.

“మళ్ళీ నిద్రపోతావా ఏంటి? ఆకలేస్తోంది.” అన్నాడు అనంత్.

“అరెరే! గుడి నుంచి వచ్చినదాన్ని అలాగే పడుకునేసానే. వండనేలేదు. ఇప్పుడు టైమెంతైంది?” సన్నగా ఆవులిస్తూ అడిగింది రంజని.

“రెండు కావస్తోంది. పద. హోటల్ కు వెళ్దాం. పిచ్చ ఆకలి.” అన్నాడు అనంత్ లేస్తూ.

అతని చేయి పట్టి లాగింది రంజని – “గివ్ మీ హాఫ్ నవర్. చకచకా వండేస్తాను.” అంది.

ఆమె నెత్తి మీద మొటిక్కాయ వేసాడు అనంత్. “నువ్వు వండే వార్చే సరికి నేను....తా!” అన్నాడు.

“ఛస్! తప్పు! ఫస్ట్ నీకు టూ మినిట్స్ నూడుల్స్ చేసిస్తా. ఆపై వంట చేసేస్తా. నువ్వూ హెల్ప్ చేస్తే ఇంకా తొందరగా ఐపోతుంది. కమాన్!” అంది రంజని.

“నూడుల్స్ తిని, నీకు హెల్ప్ చేసి, ఆపైన ఆ వంట తిని....గోవిందో....గోవిందా” అన్నాడు రెండు చేతుల్ని నెత్తిన పెట్టుకుని.

“ఆహా! ఎన్నాళ్లకు నీ నోటి నుంచి గోవింద నామస్మరణ వచ్చింది. అంటే ఈరోజు ది బెస్ట్ రోజన్నమాట. చలో...చలో” అని అనంత్ ను తోసుకుంటూ వంటింటికి దారి తీసింది రంజని.

ఏ కళనున్నాడో రంజని చెప్పిన ప్రతి పనినీ శ్రద్ధగా చేసాడు అనంత్. లేకపోతే ఒక పనికి వంద ప్రశ్నలేసి విసిగించేవాడు.

వంటంతా పూర్తైపోయింది.

పాత్రలనన్నింటినీ ఓసారి కలయజూసాడు అనంత్. "సంథింగ్ ఈజ్ మిస్సింగ్, బడ్డీ!" అన్నాడు కడుపుపై తాళమేసుకుంటూ.

"ఏంటది?" గడ్డం కింద చూపుడు వేలు పెట్టుకుని అడిగింది రంజని.

"ఎస్..ఖీర్...పాయసం...సంథింగ్ స్వీట్" అన్నాడు అనంత్.

"ఓ..యా..కానీ ఇప్పుడు అకేషనేమీ లేదుగా?" అంది రంజని.

అనంత్ ఆమె దగ్గరగా వచ్చి, మెడ చుట్టూ చేతులు వేసి "నాకు జాబొస్తే....అహా...వస్తే...అది అకేషన్ కాదేంటమ్మా!" అన్నాడు.

"కెవ్..కెవ్వ్..వ్వ్.." అని కావాలనే అరిచింది రంజని. "నిజంగా..కంగ్రాట్స్!" అంది గెంతుతూ.

"ఇప్పుడొస్తున్న జీతమే వస్తుంది. ఇట్స్ ఓకే! దూరమే ఒక ప్రాబ్లం." అన్నాడు.

"ఎంతో ఒకంత. నెలకు ఠంచనుగా జీతమొస్తే చాలు. ఇక డిస్టన్స్. లెటజ్ థింక్ అబౌట్ ఇట్ లేటర్. ప్రస్తుతానికి...తురుత్తురుత్తురూ....పాయసం చేసుకొందాం!" అంది రంజని.

ఆవేళ రంజని జీవితంలో నిజంగా ది బెస్ట్ డే.

★★★★★

"అమోఘం! నీ రెండో పావు గోలోకాన్ని చేరిందే!" అన్నాడు గోపాలబాలుడు.

"మీ కరుణాదృష్టి ఫలితమే స్వామీ! మీ రెండో పావు సంగతి?" అన్నది కమలాలయ.

"చూద్దాం!" అన్నాడు చూతశరునితాత.

గాజుపలకపై ముత్యాలు పడ్డట్టు చప్పుడు చేసాయి పాచికలు.

★★★★★

“సుమతీ! మొన్న గుడిలో మాట్లాడావే, ఆ అమ్మాయి ఎవరు?” పూజ మధ్యలో అడిగాడు కేశవశర్మ.

“ఏమో పూర్తి వివరాలు తెలీదండి. దర్శనం చేసుకుని, ప్రసాదం తీసుకుని మెట్లు దిగుతుంటే ఒక్కతే కూర్చుని కనబడింది. ఎందుకో చూడగానే మాట్లాడాలనిపించింది. వెళ్ళాను. పేరు రంజని అని చెప్పింది.” అంది సుమతి. పూజ మధ్యలో లౌకిక విషయాల్ని మాట్లాడని భర్త హటాత్తుగా అలా అడగడంతో కొద్దిగా ఆశ్చర్యపోయింది. ’ఎందుకలా అడిగారు?” అంది మళ్ళీ.

“ఆ అమ్మాయి నాకు నమస్కారం చేసాక నా సమస్యను అమ్మతో చెప్పుకున్నాను అందిగదా!” అన్నాడు శర్మ.

నిజానికి సుమతి ఆ విషయమే మర్చిపోయింది. “ఆ...అవును...” అంది గుర్తుచేసుకుంటూ.

“ఏమిటా సమస్య?” అన్నాడు శర్మ ఓ తులసీదళంను కుడిచెయ్యి చూపుడు–ఉంగరపు వేలి మధ్య పట్టుకుని.

“నెల క్రితం ఆ అమ్మాయికి గర్భస్రావమయిందంట! అదే తొలి గర్భం కూడా! పాపం!” అంది సుమతి.

శర్మ కళ్ళు మూసుకుని “శ్రీహరి!” అన్నాడు.

సుమతి నైవేద్యాల్ని వెండిపళ్లెంలో సర్దుకుని వచ్చి, శర్మ నీటితో చేసిన మండలంపై ఉంచి అక్కడే కూర్చుంది.

శర్మ ఒక్కో తులసీదళాన్నీ సాలగ్రామాల పై మంత్రోచ్చారణయుక్తంగా పెడుతున్నాడు.

భోజనమయ్యాక సుమతి శర్మ ఎదురుగా కూర్చుని “ఆ అమ్మాయి పేరు మీద దేవునికి తులసీ దళాన్ని సమర్పించారు కదూ!” అంది. అవునన్నట్టు చిన్నగా నవ్వాడు శర్మ.

“వాళ్ళెవరో మనకు పూర్తిగా తెలియదు కదా! అలాంటి వారి పేరు మీద కూడా భగవంతుణ్ణి వేడుకోవచ్చా?” అంది సుమతి.

"అవశ్యంగా ప్రార్థించవచ్చు. మా గురువుగారు పూజలో భాగంగా, సరిహద్దుల్లో తమ ప్రాణాలను పణంగా పెట్టి నిల్చున్న అపరిచిత సైనికులందరి తరఫునా ఓ తులసీదళాన్ని సమర్పించేవారు. మొదట్లో నాకు చాలా విచిత్రమనిపించేది. ఒకరోజు ఇప్పుడు నీవు అడిగినట్లే, ఇంకా ఘాటుగా అడిగాను..."

"ఏమని?" ఉత్సాహంగా అడిగింది సుమతి.

"గురువుగారూ! సైనికులందరూ తాగుబోతులు, అనాచారపరులు కదా! వారి కోసం మీరు తులసీ సమర్పణ చేయడమేంటని." – సుమతిలో ఉత్సుకత రేపే నిమిత్తం నాటకీయమైన మౌనం వహించాడు శర్మ.

"ఊ....తర్వాత?" అంది సుమతి.

"ఆయన నవ్వి 'ఒరే! పిచ్చోడా! ఆ సైనికులే లేకపోతే నువ్వూ, నేనూ ఇలా హాయిగా పూజలు చేసుకుంటూ, పురాణాలు చెప్పుకుంటూ బ్రతకగలిగేవాళ్ళమా? దేవుడు నిర్దయుడై, యుద్ధమే జరిగితే, వాళ్ళు కాక ఎవర్రా ప్రాణాల్ని బలి ఇచ్చేది? దేవుడి పేరు చెప్పి ఇప్పటికిప్పుడు నిన్ను నుయ్యిలోకి దూకమంటే దూకగలవా? అంత నమ్మకం, ధైర్యముందా? అదే వాళ్ళు – యుద్ధానికి వెళితే ప్రాణాలు నిలుస్తాయో, లేవో తెలియదు. ఐనా దేశం కోసం ఆ ప్రాణాల్ని పణంగా పెడతారు. అంతేకాదు, యుద్ధంలో వాళ్లు చనిపోతే నేరుగా స్వర్గానికి పోతారు. "వీరస్వర్గం" అన్నది వారి కోసం సృష్టించబడింది. నువ్వు, నేను ఛస్తే మొదట వెళ్ళేది నరకానికే. అక్కడ పాప, పుణ్య విచారణ జరిగాకే స్వర్గానికి వెళ్ళేది. కాబట్టి, దేశ పౌరులుగా మనం వారి క్షేమాన్ని కాంక్షించాలి. పురోహితులుగా వారి హితాన్ని తప్పకుండా కోరాలి. దీన్నే చాణుక్యుడి మాటల్లో చెప్పాలంటే "జనపదార్థం గ్రామం త్యజేత్ – గ్రామార్థం కుటుంబస్తజ్యతే'. దేశం కోసం గ్రామాన్ని వదులుకో. గ్రామం కోసం కుటుంబాన్ని వదులుకో అన్నాడు చాణక్యుడు. అంత త్యాగం మనకు చేతకాదు. అందువల్ల ఉపకారాన్నైనా స్మరించుకోవాలిరా' అని అన్నా రాయన."

శర్మ చెప్పింది విని రెండు చేతుల్నీ జోడించింది సుమతి – "నిజంగా చాలా గొప్ప ఆలోచన." అంది.

“కనుక ఆ అమ్మాయి సమస్యను తీర్చమని దేవుణ్ణి కోరుకోవడంలో అర్థముందిగా?” అన్నాడు శర్మ.

“అయ్యో! ఖచ్చితంగా కోరుకోవచ్చు. మన సంప్రదాయంలో ఇంత లోతుందని నాకు తెలీదుకదండీ! అందుకే అలా అడిగాను.” అంది సుమతి.

“సంప్రదాయం మనలోని లోతుల్ని తెలుసుకోవడానికే ఉండేది. పైపై మెరుగులకు భ్రమ పడక మన మనస్సును సంపూర్ణంగా అదుపులో ఉంచుకుని మన దుఃఖాన్నే కాకుండా పరుల దుఃఖాన్ని కూడా అర్థం చేసుకోమని చెప్పేందుకే శాస్త్రం పుట్టింది. దీన్నే ’పరదుఃఖ దుఃఖిత్వం’ అని పిలుస్తారు పెద్దలు. అజ్ఞానంలో పడి కొట్టుమిట్టాడుతున్న రాక్షస బాలలకు ప్రహ్లాదుడు చేసిన హితోపదేశమే ఉదాహరణ. విదురుడు ధృతరాష్ట్రునికి హితబోధ చేస్తూ ’భార్యాభర్తల మధ్య అభిప్రాయ భేదాలు తలెత్తడం, అనవసరంగా వాదించుకోవడం, బంధువులను భేదభావంతో చూడడం మొదలైనవన్నీ దుష్టకార్యాలని చెప్పాడు.”

“ఓహో! పురాణాలంటే ఏవో కథలు, మహిమలూ ఉండేవే ననుకున్నాను కానీ భార్యాభర్తలు ఎలా ఉండాలి, పరాయవాళ్లకు ఎలా సహాయం చేయాలి అనే విషయాల్ని కూడా ఇంత వివరంగా చెబుతాయని నాకు తెలీదండీ!” అంది సుమతి ఆశ్చర్యంగా.

“పురాణాలు ఎప్పుడో జరిగిపోయిన ఘటనల్ని చెబుతున్నట్టుగానే అనిపిస్తాయి. కానీ అవి చెప్పిన విషయాలు నేటికీ నడుస్తూ ఉండడమే విశేషం. కాబట్టి ఎప్పుడో జరిగిన ఘటనలను ఇప్పటి సంఘటనలతో అనుసంధానం చేసేదాన్నే పురాణమంటారు. అందుకనే మన కష్టాలకు పరిష్కారాలను సూచించడంలో అవి ప్రధానపాత్ర పోషిస్తాయి. పురాణాలు చెప్పే వాటిల్ని సరిగ్గా అర్థం చేసుకోగల బుద్ధి, మనసు ఉంటే చాలు, మన కష్టాల నుంచి సులభంగా గట్టెక్కవచ్చు.” అన్నాడు శర్మ.

“నిజమే!” అంది సుమతి. “ఇంకో విచిత్రం చెప్పనా — మన పెళ్ళిరోజున నేను మిమ్మల్ని అడిగానే — దేవుడెందుకు మంచివాళ్ళను శిక్షిస్తాడని! రంజని కూడా అదే మాట అన్నది!” నవ్వుతూ చెప్పింది సుమతి.

“నువ్వేమన్నావ్?” నవ్వుతూ అడిగాడు శర్మ.

“మీ మాటలే చెప్పాను. ఆ అమ్మాయి తెగ మెచ్చుకుంది. ఇంకా చాలా విషయాలను చెప్పమని అడిగింది కూడా. మీరు చెప్పిన కొన్ని సుభాషితాలు వగైరా చెప్పాను. మిమ్మల్ని గ్రేట్ పర్సన్ అని పొగిడింది.” అంది సుమతి.

“ఎవరు గ్రేట్! ఆ విషయాలను వ్రాసినవాళ్ళా? కాపీ కొట్టిన నాలాంటి వాళ్ళా?” అన్నాడు శర్మ.

“అబ్బా! ఒక్క పొగడ్తను కూడా ఒప్పుకోరు కదా మీరు.” అంది సుమతి కావాలని మూతిని వంకర్లు తిప్పి.

కొద్దిసేపు మౌనం తర్వాత “ఏమండీ! ఓ ప్రశ్న అడగనా?” అంది.

“ప్రశ్నానురూపమ్ ప్రతివచనమ్ – ప్రశ్నను అడిగే విధానంపై సమాధానం వస్తుంది. అడుగు!” అన్నాడు శర్మ.

“దేవుణ్ణి నమ్మిన మనకు ఒక్క నలుసు కూడా కలగలేదు. దేవుణ్ణి నమ్మిన రంజనికి కడుపు పండి నిలవలేదు. దేవుణ్ణి నమ్మని ఎందరికో పిల్లలు ఉన్నారు. ఈ విచిత్రమంతా ఎందుకు?” అంది సుమతి. ఆమెలో అంతర్లీనంగా జరుగుతున్న సంఘర్షణ ఒక్కొక్క అక్షరంలోనూ ప్రతిధ్వనించింది.

దీర్ఘంగా నిట్టూర్చాడు శర్మ. భార్య కళ్ళల్లోకి చూస్తూ అన్నాడు –

“సుమతీ! నీ ప్రశ్నలో కొద్దిగా లోపముంది. భగవంతుణ్ణి నమ్మిన వారికి కూడా పిల్లలున్నారు. నీకూ ఈ విషయం తెలుసు. ఐనా ఈ ప్రశ్నను తయారుచేసుకోవడంలో నీ మనసు ఎంత కష్టపడిందో నాకు అర్థమౌతోంది. ఈ ప్రశ్నకు సమాధానం చెప్పడానికి నీకంటే రెండింతల కష్టాన్ని పడాలి నేను.” అని ఆగాడు శర్మ.

సుమతి తన రెండు చేతుల్ని ఒకదానిలో ఒకటి వేసి, ధ్యానముద్రలా చేసి ఒడిలో పెట్టుకుని నిటారుగా కూర్చుంది. ’గురువు ఉపదేశించేప్పుడు అతని ముఖాన్ని నేరుగా చూస్తూ, సరైన ఆసనంలో

కూర్చోవా'లన్న మనుస్మృతి నియమం తన భార్యకు తెలియకపోయినా, తెలుసుకోవాలన్న ఆసక్తి మనకు తెలియకుండానే కొన్ని ధర్మాలను చేయిస్తుందనడానికి ఆమే ఓ ఉదాహరణ అని అనుకున్నాడు శర్మ.

గొంతు సవరించుకుని – "విను! ఒక మామిడి చెట్టు ఈరోజు ఫలించిందంటే అది ఆ ఒక్కరోజులో జరిగిన ఇంద్రజాలం కాదు. తోటమాలి విత్తనాన్ని తెచ్చి, నాటి, ఎరువులు వేసి, చీడపీడలు తగులకుండా రక్షణ చేస్తాడు. ఆ ప్రయత్నమంతా ఒక్కరోజు మొక్కుబడి కాదు. ఆ చెట్టు ఫలించడానికి ఎంతకాలం పడుతుందో అంతకాలం చేయాలి. అలా చేయగా, ఒక్క చెట్టు ఫలించడానికి తయారౌతుంది. చెట్టుకు పూలు పూయడం మొదలవ్వగానే మళ్ళీ ఎన్నెన్నో చీడపురుగులు, వ్యాధులు దాడిచేస్తాయి. తోటమాలి కష్టపడుతూ వాటన్నిటి నుంచీ చెట్టును రక్షించాలి. అప్పుడు, కాలానికి తగ్గట్టు మామిడి కాయలు కాచి, మగ్గి, తియ్యదనాన్ని నింపుకుని దిగుబడికి వస్తాయి. పైన చెప్పుకున్న ప్రయత్నాల్లో ఏ ఒక్కటీ లోపించినా చెట్టు ఫలించదు. కనుక ఆ చెట్లను పెంచి పోషించే తోటమాలి ప్రతి రోజూ కృషి చేయాలి. కృషితో నాస్తి దుర్భిక్షం అంటే ఇదే. రుచికరమైన మామిడిపండు తోటమాలి కష్టానికి ఫలమైతే, ఆ పండు రావడానికి పడ్డ కష్టాన్ని సుకృతం అని చెప్పాలి. సుకృతమంటే చక్కగా చేయబడిన పని అని అర్థం. వాటిల్నే మంచి పనులని కూడా అంటారు.

ఆవిధంగా పిల్లలు పుట్టడమన్నది కూడా ఒక సుకృతం. పునర్జన్మల్ని నమ్మే మన మతం ప్రకారం ఈ సుకృతం ఒక్క జన్మలో సిద్ధించేది కాదు. ఎలాగైతే తోటమాలి ఎన్నెన్ని రోజులు శ్రమపడతాడో, అలానే జీవులు ఎన్నో జన్మలను ఎత్తి ఎన్నో కర్మలు చేస్తారు. ప్రతి జన్మలో చేసిన పుణ్యపాపాలను బట్టి వచ్చే జన్మలో సుఖదుఃఖాలు కలుగుతాయి. 'పూర్వజన్మ సుకృతం' అనే పదం ఈ విషయాన్నే చెబుతోంది. పుట్టే ప్రతిబిడ్డ వెనుకా ఆయా తల్లిదండ్రుల పూర్వ సుకృతాలు ఉంటాయి. మామిడిపండు ఫలించడానికి తోటమాలి ఎన్నెన్ని చర్యలు తీసుకోవాలో, అలానే తల్లిదండ్రులిద్దరూ వారివారి సుకృతాలనే విత్తనాలుగా నాటాలి. అవి దైవసంకల్పంతో పెరిగి పెద్దవై ఫలిస్తాయి. ఈ ప్రయత్నాల్లో ఎవరైనా లోపం చేస్తే ఫలసాయం దక్కదు..." ఆగాడు శర్మ.

సుమతి శ్రద్ధగా వింటోంది.

మళ్ళీ కొనసాగించాడు శర్మ – "దేవుణ్ణి నమ్మని వాళ్ళకు పిల్లలు కలిగారు కదా? అని అడిగావు. ఒక్క విషయం గుర్తుంచుకో. మంచి పనులు చేయడానికి, దేవుణ్ణి నమ్మడానికి పెద్ద సంబంధం లేదు. దేవుడి పేరు చెప్పి చెడ్డ పనులు చేసే వారి కన్నా దేవుణ్ణి నమ్మకపోయినా నలుగురికి ఉపకారం చేసేవారే ఉత్తములు. కర్మలనేవి బస్సు లాంటివి! నడిపే వాడిని బట్టి అవి మంచి రోడ్డుపైనా నడుస్తాయి, ముళ్ళదారుల్లోనూ నడుస్తాయి. మెత్తని రోడ్డు పై వెళ్ళినా, ముళ్ళపై నడిచినా బస్సుకు బాధ కలుగదు. కానీ బస్సు వెళ్ళే దారిని బట్టి మన ప్రయాణం సుఖంగా సాగుతుంది లేదా కుంటుపడుతుంది. అలాగే చేసే కర్మల్లో మంచి పనులు అందరికీ మంచిని చేస్తాయి. చెడ్డపనులనేవి చేసివాళ్ళతో బాటు మిగతావారిని కూడా నాశనం చేస్తాయి. కాబట్టి దేవుణ్ణి నమ్మకపోయినా, అందరికీ మంచి చేసేవాళ్ళు సుకృతాల్ని చేసినవాళ్ళై మంచి ఫలితాలను పొందుతారు. నాస్తికులకి మంచి పిల్లలు పుట్టడమంటే ఇదే. అలానే దేవుణ్ణి నమ్ముతున్నామని చెబుతూనే చెడ్డ పనులు చేసేవారు తామే నష్టపోతారు. అర్థమైందా?"

సుమతి మెల్లగా తల ఊపింది.

శర్మ మళ్ళీ కొనసాగించాడు – "మనం దేవుణ్ణి నమ్మాం కానీ పిల్లల్లేరు. రంజనికి కడుపు పండి కూడా నిలువలేదు. వీటికి మనమే బాధ్యులం. అద్దం ముందు నిలబడిన వ్యక్తి చర్యల్నే అద్దంలోని ప్రతిబింబం చూపుతుంది. అలాగే ఈరోజు మనం అనుభవిస్తున్న సుఖదుఃఖాలన్నీ క్రితం జన్మలలో మనం చేసినవాటికి ప్రతిబింబాలే!"

"అంటే...మనకు పిల్లలు లేకపోవడానికి కారణం క్రితం జన్మల్లో పిల్లలుగలవాళ్ళని మనం హింసించడం కారణమైవుండొచ్చు. అలాగే రంజనికి గర్భస్రావం కావడానికీ పూర్వజన్మల్లో ఆ దంపతులిద్దరో లేక ఒక్కరో చేసిన చెడ్డపనే కారణమైవుంటుంది. నేను అర్థం చేసుకున్నది సరిగా ఉందా?" అంది సుమతి.

ఔనన్నట్టుగా తల నూపాడు శర్మ.

సుమతి కళ్ళు మూసుకుని గోడకు ఆనుకుంది. "క్రితంలో చేసుకున్న పాపాలను పోగొట్టుకోవడమెలా?" తనలో తాను మాట్లాడుకుంటున్నట్టు పైకి అన్నది.

“పశ్చాత్తపంతో…ఆ తప్పులు మళ్ళీ చేయను అన్న ప్రాయశ్చిత్త సంకల్పంతో…” అన్నాడు శర్మ.

“నేను చేసిన తప్పులకు ప్రాయశ్చిత్తం ఏమిటి?”

“చుట్టుపక్కలున్న ఐదేళ్ళ లోపు పిల్లలను పిలిచి, వాళ్ళు సంతోషపడేలా ఏదైనా తీపి, కారం పదార్థాలను పంచు.”

ఆ భార్యాభర్తల సంభాషణ, ధ్యానంలో ఉన్న ఇద్దరు మునులు మనస్సులతో మాట్లాడుకుంటున్నట్టుగా ఉంది.

★★★★★

“మీ రెండో ఆటకాయ అప్రతిహతంగా సాగిపోతోంది. డెబ్బైమూడు గదుల్ని అవలీలగా దాటి, డెబ్బైనాల్గో గడి ఐన ’గురుబోధ’ను చేరింది!” అంది వేదవ్యాస పదార్పిత హృదయ.

“అవును. ఈ కాయకు అంతఃశుద్ధి బాగున్నట్టుంది!” అన్నాడు సత్యవతీ సుతుడు.

“యోగంతో మనస్సును నిగ్రహించి జ్ఞానానందమనే స్వర్గాన్ని అధిరోహించి, భక్తిలో చిత్తశుద్ధిని మేళవించిన జీవికి స్వరూపోద్ధారకుడైన గురువు యొక్క బోధ అవశ్యం లభిస్తుందని తెలియజెప్పిన మీ రెండవ ఆటకాయ నిజంగా పుణ్యతమమైనదే. కానీ ముందు గడిలో కర్కోటకుడున్నాడు. వాడిని దాటే ధీశక్తి ఈ కాయకున్నదా స్వామీ?” ఆతృతగా అడిగింది అవనిజ.

“తప్పొప్పుల ఎరుక ఉన్నవాని మనసును కర్కోటకుడు ఆవహించలేడు. అంతేకాదు ఈ కాయ నిచ్చెన నెక్కి తొంభైనాలుగో గడికి చేరబోతోంది. కాబట్టి కర్కోటకుడి పొడైనా తగలదు. ఐనా పావుల నడక పాచికల అధీనం దేవీ! నీ మొదటి కాయను నడుపు. చూద్దాం” అన్నాడు ఖగరాజ గమనుడు.

“చిత్తం” అంది దుర్గ.

దైత్యసంహారక్రీడోద్యుక్త దుర్గా హస్తాలంకృత శూల త్రిదలన ఖేలనలా శబ్దం చేసాయి పాచికలు.

★★★★★

మీటింగ్ ముగియడంతో అందరూ లేచి వెళ్తున్నారు. రంజని కూడా లేచింది.

“రంజనీ! కూర్చో. నీతో పర్సనల్గా మాట్లాడాలి.” అన్నాడు అరవింద్. అతను రంజని పనిచేస్తున్న టీమ్ కు ప్రాజెక్ట్ మేనేజర్.

కూర్చుంది రంజని. “ఏం చెప్పబోతాడో?” అని ఆలోచించసాగింది. ఇప్పటిదాకా తన మాడ్యూల్లో ఎలాంటి లోపాలూ లేకుండా చాలా జాగ్రత్తగా చేసుకువస్తోంది. తనతో బాటు ఉన్న మరో ఇద్దరు జూనియర్స్ కూడా చక్కగా పనిచేస్తున్నారు. అరవింద్ తనతో ఇంత ప్రైవేటుగా మాట్లాడవలసి వచ్చిన విషయమేంటి?

ల్యాప్ టాప్ ను, తనముందున్న కొన్ని పేపర్లను మార్చి మార్చి చూసుకుని, వాటన్నింటిని మూసేసి రంజని వైపు చూసి నవ్వాడు అరవింద్. రంజని కూడా చిన్నగా నవ్వింది.

“రంజని! రెండు నెల్ల క్రితం నువ్వెలా ఉన్నావో చూసాను. ఏదో దిగులు, భయం. నీ మొహంలో సంథింగ్ వెరీ గ్రేవ్ కనబడేది. ఆ తర్వాత నీకు కలిగిన లాస్ గురించి విని ఎంతో బాధపడ్డాను. అక్చువలీ, ఐ వాజ్ అఫ్రైడ్ ఆఫ్ యూ. ఏం చేసుకుంటావో అని భయం వేసింది. అలా ఉండింది నీ బిహేవియర్. బట్, సిక్ లీవునుంచి వచ్చిన నిన్ను చూసి, ఐ వాస్ రియల్లీ సర్ప్రైజ్డ్. నీ మొహంలో ఏదో సంతోషం. అసలేమీ జరగనట్టుగా ఉన్న నిన్ను చూస్తే, అన్ బిలీవబుల్. అంతేకాదు, నీ టీమ్ మెంబర్స్ కూడా నీ క్వాలిటీస్ ను చాలా పొగిడేస్తున్నారు. నీ మంచితనం, నీ నెమ్మది, వాళ్ళు తప్పులు చేసినా కోప్పడకపోవడం. చిన్న చిన్న మీటింగులు పెట్టి, బోర్డుపై సొల్యూషన్స్ రాసి చూపించి….యూ ఆర్ సాల్వింగ్ దెయిర్ ప్రాబ్లమ్స్ విత్ లాటాఫ్ ఈజ్. ఇంత ఎందుకు
చెబుతున్నానంటే….పావని…జూనియర్ మోస్ట్ మెంబర్ ఆఫ్ యువర్ టీమ్…నువ్వు సిక్ లీవులో ఉన్నప్పుడు నా దగ్గరకొచ్చి వేరే టీమ్ లోకి ట్రాన్స్ఫర్ చెయ్యమని అడిగింది. ఎందుకని అడిగాను. షీ వాజ్ ఫైండింగ్ సమ్ ఫాల్ట్స్ విత్ యూ. నువ్వు సరిగ్గా గైడ్ చెయ్యడం లేదని చెప్పింది. డౌట్స్ ను సరిగ్గా క్లారిఫై చెయ్యడం లేదనీ అంది. అసలు నువ్వు చాలా మూడీగా ఉంటున్నట్టు చెప్పింది. దానికి నేను నువ్వొచ్చాక చూద్దామని చెప్పాను. ఇప్పుడేమో తనే వచ్చి ఐ వాంటు కంటిన్యూ ఇన్ రంజనీస్ టీమ్ అని

చెప్పింది. కారణం అడిగా. అప్పుడు పావని చెప్పిన మాటల్నే ఇంతకుముందు నేను చెప్పింది.” — ఊపిరి తీసుకోవడం కోసం ఆగాడు అరవింద్.

ఆశ్చర్యంగా చూసింది రంజని. “డిడ్ ఐ ఛేంజ్ సో మచ్! పక్కవాళ్ళు ఇంత ఫీలయ్యేలా మారిపోయానా?” — తనను తానే ప్రశ్నించుకుంది.

“యూ నో రంజనీ! పావని నీ గురించి చెబుతూ ’షీ ట్రీట్స్ అజ్ లైక్ హర్ ఛిల్డ్రన్. అచ్చు అమ్మలా చూసుకుంటుంది.’ అంది. నాకు భలే నవ్వు వచ్చింది.” అన్నాడు అరవింద్. అలా నవ్వుతుంటే భూతద్దల్లాంటి కళ్ళద్దాల వెనుక అతని కళ్ళు మెరుస్తూవున్నాయి. అలాంటి మెరుపు అరవింద్ లో కనబడ్డం అరుదు.

“నేను…అమ్మనా!” అంది రంజని.

“ఏం కోపమొచ్చిందా?” అన్నాడు అరవింద్.

“కోపమా! ఆంటీ కంటే అమ్మనే బెస్ట్!” అంది రంజని గట్టిగా నవ్వుతూ.

పళ్ళన్నీ కనబడేలా నవ్వుతూ “దట్సాల్! ఇది చెబుదామనే ఆపాను. రంజనీ! కీపప్ దిస్ లవ్లీ, స్మైలింగ్ ఫేస్ ఆల్ ద టైమ్. జరిగిన నష్టాన్ని మర్చిపో. దేర్ ఆర్ గుడ్ టైమ్స్ అహెడ్. టు కోట్ మై ఫేవరేట్ లైన్స్ – మైల్స్ టు గో బిఫోర్ ఐ స్లీప్! మైల్స్ టు గో బిఫోర్ ఐ స్లీప్!” అని లేచాడు అరవింద్.

రంజని కూడా లేచింది.

“వచ్చే నెల మనకు డెడ్ లైన్. యూ నో ఇట్. చక్కటి ప్రాజెక్ట్ డెలివరీ చేద్దాం. ఆల్ ద బెస్ట్ ఫర్ అజ్!” అంటూ చేయి చాచాడు. రంజనీ షేక్ హ్యాండ్ చేసింది.

“ఇంత ఏసీలోనూ నీ చెయ్యి ఇంత వార్మ్ గా ఉందే! ఆర్ యూ ఫైన్?” అన్నాడు అరవింద్.

“ఓహ్! ఈజిట్! ఐ యామ్ క్వైట్ హెల్దీ సర్!” అంది రంజని.

ల్యాప్ టాప్ ను ఎత్తుకుని నడిచాడు అరవింద్.

రంజని అతని వెనకే నడిచింది.

తన వర్క్ స్టేషన్ కొచ్చి కూర్చున్న రంజనికి అంతా మాయలా అనిపిస్తోంది. పావని తనను అమ్మతో పోల్చడమేంటి? కొన్ని నిముషాల క్రితం అరవింద్ తన చేతులు వెచ్చగా ఉన్నాయని చెప్పడమేంటి? ఏమిటిదంతా?

సుమతిని కలిసివచ్చాక మరో పన్నెండు రోజులు తను లీవులో ఉండింది. అఫ్ కోర్స్! లాస్ ఆఫ్ పే లోనే లీవిచ్చారు. అరవింద్ గట్టిగా రెకమెండ్ చేయడంతో పదిహైదురోజుల జీతాన్ని సాంక్షన్ చేసారు. ఆ విషయంలోనే కాక అనేక విషయాల్లో అరవింద్ చాలా సపోర్ట్ చేసాడు. అంతేకాదు, అతను ఒక పక్కా జంటిల్మన్. తన టీమ్ లో ఉన్న అమ్మాయిల్ని, అబ్బాయిల్ని చాలా అభిమానంతో చూసుకుంటాడు. చక్కగా పనిచేసినవాళ్ళకు గుర్తింపునివ్వడంలోనూ ఎప్పుడూ ముందుంటాడు. తప్పులు చేస్తున్నవాళ్ళని దిద్దడం కోసం కష్టపడతాడు. హద్దుదాటి మాట్లాడడు, ప్రవర్తించడు. తమకు తాముగా చెప్పుకుంటే తప్ప ఎవరినీ వాళ్ల పర్సనల్ విషయాలపై గుచ్చిగుచ్చి అడగడు. ఎవరినీ అనవసరంగా తిట్టడు, పొగడడు కూడా. అలాంటిది ఈరోజు పావని మాటల్ని తనతో ప్రైవేటుగా చెప్పాడంటే, ఆ అమ్మాయి మాటలు అతనికి అంత నచ్చివుండాలి. ఇదంతా ఒక ఎత్తు. కానీ “అమ్మ, వెచ్చదనం” ఒక ఎత్తు.

సుమతి చేతుల్ని పట్టుకున్నప్పుడు కలిగిన అనుభూతి గుర్తుకువచ్చింది. ఎందుకో సుమతి రూపాన్ని గుర్తుచేసుకోగానే రంజని ఒళ్ళు చిన్నగా జలదరించింది. తన చేతుల్ని చూసుకుంటూ ఆ రెండింటిని చెంపలకు ఆన్చుకుంది. చల్లగా తగిలాయి. “ఇదేమిటి? తన చేతులు వెచ్చగా ఉన్నాయని ఐదు నిముషాల క్రితమేగా అరవింద్ అంది. ఇంతలో ఇంత చల్లబడ్డాయా?”

ఏదో పేపర్ను చదువుకుంటూ రంజని దగ్గరకు వచ్చిన పావని చెంపలకు చేతుల్ని ఆనించి కూర్చున్న రంజనిని చూసి – “సారీ! తర్వాత రానా?” అంది. “అబ్బే! చలిగా అనిపిస్తే అలా ఉంచుకున్నాను. అంతే. రా కూర్చో!” అంది రంజని.

కుర్చీని లాక్కుని కూర్చుంది పావని.

ఆ అమ్మాయి నుదుటిపై కదులుతున్న ముంగురుల్ని చూస్తున్న రంజనిలో ఏదో సంతోషం కలిగింది.

యమునా నదీ తరంగాలను తాకి పరవశిస్తున్న గడ్డిపోచలు, అనుకోకుండా తమను సోకిన చిన్ని కృష్ణుని పాదాల స్పర్శకు ఉన్మత్తాలై అటూ ఇటూ ఊగినట్టు...ఆ ముంగురులు.

"మైగాడ్! ఇలా అనుకొంటున్నది తనేనా?" — ఆశ్చర్యపోయింది రంజని.

గుడిలో సుమతి మాట్లాడుతూ "కృష్ణుడు యశోద వద్దకు తనంత తానుగా వచ్చాడు. తన బాలలీలలన్నీ చూపాడు" అన్న మాటలు రంజని మనసులోకి బాగా నాటుకున్నాయి. ఇంటికి వచ్చాక ఇంటర్నెట్లో కృష్ణలీలలన్నింటినీ వెదికి తనకు వచ్చిన అన్ని భాషల్లో వ్రాసిన కథల్ని, వ్యాసాల్నీ, నాటకాల్నీ చదివింది. సెలవురోజుల్లోనే కృష్ణశతకంలో తనకు నచ్చిన పద్యాలను బట్టీ పట్టేసి, రోజులో ఒక్కసారన్నా గుర్తుచేసుకునేది. అప్పటినుంచీ చిన్నికృష్ణుడంటే అదోరకమైన అబ్సెషన్. గూగుల్లో సెర్చ్ చేసి ముద్దుముద్దుగుండే చిన్నికృష్ణుని చిత్రాలను ఎన్నింటినో డౌన్లోడ్ చేసుకుంది.

ఇప్పుడు పావని ముంగురుల్ని చూసి అలా అనిపించిందంటే.....ఎందుకలా?

రంజని తన మాటల్ని వినడంలేదని గ్రహించి "మేడమ్!" అంటూ 'నేను ఇక్కడే ఉన్నాను సుమా" అని హెచ్చరిస్తున్నట్టు పిలిచింది పావని.

"సారీ పావని! ఎందుకో కాన్సంట్రేట్ చెయ్యలేకపోతున్నా. ఓ టెన్ మినిట్స్ పార్క్ లో కూర్చొని వద్దామా?" అంది రంజని.

"ఓ ష్యూర్!" అని హుషారుగా లేచింది పావని.

ఇద్దరూ ఆఫీస్ ఎదురుగా ఉండే తోటలోకి వచ్చారు. సాయంత్రం నాలుగున్నర అవుతుండడంతో, స్కూల్ నుండి ఇంటికెళ్తూ కొద్దిమంది పిల్లలు ఆ పార్క్ లో ఆడుకుంటున్నారు. వారికి దగ్గరగా, ఓ బెంచ్ మీద కూర్చున్నారు రంజని, పావని.

“సో! పావని! ఈ ప్రాజెక్ట్ వర్క్ ఎలా వుంది? ఆర్యూ ఎంజాయింగ్ దిస్?” చాలా హుందాగా, అధికారికంగా అడిగింది రంజని.

“మేడమ్! నౌ ఐయామ్ ఎంజాయింగ్. టు బీ ఫ్రాంక్ ప్రాజెక్ట్ మొదలైనప్పుడు మీరు బాగానే ఉండేవారు. తర్వాత చాలా మూడీగా ఉండేవారు. ఆ తర్వాత మీకు అబార్షన్ అయ్యిందని తెలిసి నేను, రీటా చాలా బాధపడ్డాం. సిక్ లీవ్ నుంచి వచ్చాక మీ బిహేవియర్ ఎలావుంటుందోనని భయపడ్డాం కూడా!”.

“ఓహ్! ఇప్పుడు రీటా ఏమనుకొంటోంది?” అంది రంజని.

“షీ ఈజ్ ఆల్సో హ్యాపీ. అసలు మీరు ఎంతో మూడీగా ఉంటారనుకొన్నాం. బట్ మీరు చాలా డిఫరెంట్ గా ఉంటున్నారు. అంటే మీ లాస్ ను మేము ఎంజాయ్ చేస్తున్నామని కాదు మేడమ్. అంత పెద్ద లాస్ ను ఎలా తట్టుకున్నారు!” అంది పావని.

రంజని నవ్వి, ఆడుకొంటున్న పిల్లలవైపు చూపించింది.

“ఆ పిల్లల్ని చూడు! జారుడుబండపై నుంచి పడ్తారు. కాలో చెయ్యో దోక్కుపోతుంది. కానీ ఆడుకోవడం మానరు. అదే ఇంట్లో ఉన్నప్పుడు చిన్నచీమ కుడితే చాలు అరిచి అల్లరి చేస్తారు. అమ్మానాన్నకు వణుకు తెప్పిస్తారు. 2012 మూవీలోని సౌండ్ ఎఫెక్ట్స్ అన్నీ వాళ్ళ ఏడుపులో ఉంటాయి.”

పావని గలగలా నవ్వింది.

“నొప్పి ఒక్కటే ఐనా ఆ పిల్లలు ఎందుకలా డిఫరెంట్గా బిహేవ్ చేస్తారు?” అని పావని వైపు చూసింది రంజని.

“మే బీ…ఇక్కడైతే ఫ్రెండ్స్ ఉంటారు కాబట్టి. ఆటలో ఓడిపోతామేమోనన్న భయం ఉంటుంది కాబట్టి….” అని అనుమానంగా అంది పావని.

“ఎగ్జాట్లీ! అంతేకాదు, ఆ క్షణంలో వాళ్ళ మనసు ఆడుకోవడంలో దొరికే ఆనందంతో నిండిపోయివుంటుంది. ఆక్షణంలో దెబ్బలు, రక్తం అనేవి చాలా చిన్న విషయాలు. ఫర్ దెమ్, ఆల్

అదర్ థింగ్స్ ఆర్ టోటలీ మీనింగ్ లెస్ థింగ్స్ వెన్ దే ఆర్ విత్ ద ఫ్రెండ్స్. ఫ్రెండ్స్ సర్కిల్లో ఉన్నప్పుడు మనకుండే ధైర్యం ఒంటరిగా ఉన్నప్పుడు ఉండదు. లీవ్ తర్వాత ఆఫీసుకు వచ్చాక ఆ పిల్లల మెంటల్ స్ట్రెంగ్త్ ను ఇమిటేట్ చేస్తున్నాను. దట్సాల్ పావని. ఐ లైక్ యూ బోత్ అండ్ అరవింద్. ఇంత మంచి ఫ్రెండ్స్ నా చుట్టూ ఉన్నప్పుడు నేనెందుకు ఏడ్వాలి? నాకు వచ్చిన కష్టం నావరకూ పెద్దదే, భయంకరమైనదే. దాని కోసమని నా కొలీగ్స్ ను ఇబ్బంది పెట్టడం సరికాదు కదా?" అంది రంజని.

"వెల్ సెడ్ మేడమ్." అంది పావని మెచ్చుకోలుగా. "లీవులో ఉన్నప్పుడు మీరేదైనా పర్సనాలిటీ డెవెలప్మెంట్ బుక్స్ చదివారా?" అని నెమ్మదిగా అడిగింది.

రంజని పెద్దగా నవ్వి – "అన్నీ బుక్సులో దొరుకుతాయా?" అంది.

లేదన్నట్టుగా తలను అడ్డంగా వూపింది పావని.

"నీకు కృష్ణశతకం తెలుసా?" అడిగింది రంజని.

"కృష్ణ శతకం....నో మేడమ్!"

"బలమెవ్వడు కరి బ్రోవను – బలమెవ్వడు పాండుసుతుల భార్యను గావన్ – బలమెవ్వడు రవిసుతునకు – బలమెవ్వడు నాకు నీవె బలమౌ గృష్ణా! – అర్థమైందా?" అంది రంజని.

రంజని అంత పొడుగు పద్యాన్ని చెప్పడం విని నివ్వెరపోయిన పావని "కొంచెం కొంచెం అర్థమయింది మేడమ్!" అంది.

"కొంచెమే అర్థమైతే ఎట్లా? మన భాష మనకు పూర్తిగా అర్థం కావాలిగా. కృష్ణశతకాన్ని ఇప్పుడే నీకు ఫార్వర్డ్ చేస్తాను. నెక్స్ట్ మండే కనీసం పది పద్యాలైనా చూడకుండా చెప్పాలి. దిసీజ్ ఆల్సో వన్ అస్సైన్మెంట్ ఫర్ యూ! ఓకే!" అంది రంజని బెంచ్ పైనుంచి లేస్తూ.

"ఐ విల్ ట్రై మేడమ్. కానీ పది పద్యాలంటే కష్టమేనేమో?" అంది పావని.

"నథింగ్ డూయింగ్. పదంటే పదే!" అంది రంజని, పావని భుజంపై చెయ్యి వేసి.

“ఒకే!” అని నసిగినట్టుగా అంది పావని.

అంతలో వాళ్ళ వెనుక పిల్లల గోల ఎక్కువైంది. ఇద్దరూ వెనక్కు తిరిగారు.

నాలుగు కుక్కపిల్లలు ఒకదానిపై ఒకటి పడి కొరుక్కుంటూ దొర్లుతుంటే, పిల్లలు గట్టిగా చప్పట్లు కొడుతూ కేకలేస్తున్నారు.

“వాళ్లకు ప్రతి ఒక్కటీ ఎంటర్టైన్మెంటే కదూ!” అంది రంజని.

“ఎస్” అంది పావని.

“సో! నీ ప్రోగ్రాంలోని బగ్ ను సాల్వ్ చేసి నేను నిన్ను ఎంటర్టైన్ చేస్తా. నువ్వు పది పద్యాల్ని అప్పజెప్పి నన్ను ఎంటర్టైన్ చెయ్!” అంది రంజని.

“వోవ్! దిస్ ఈజ్ రియల్లీ ఎంటర్టైనింగ్” అంది పావని.

★★★★★

“నీ మొదటి కాయ సూర్యుణ్ణి చేరింది. దీని అర్థమేమిటి ప్రియా?” అన్నాడు యోగిహృత్కమలవాసుడు.

“సర్వప్రేరకా! సూర్యుడున్న ఈ డెబ్బైఎనిమిదవ గడికి ముందు చిరుత, తర్వాత జ్ఞానము అనే గడులున్నాయి. క్రూరమైన ఆలోచనలతో సతమతమయ్యే మనసును నియంత్రిస్తే, ఆత్మ సూర్యునిలా మెరవడం మొదలుపెడుతుందని ఆ గడులు చెబుతున్నాయి. ఎలాగైతే మానవులకు సూర్యుని వెలుగువల్లనే వస్తువుల పరిచయం కలుగుతుందో ఆవిధంగానే ఆత్మ యొక్క వెలుగులో తప్పొప్పులు తెలిసివస్తాయి. తప్పుల్ని తెలుసుకోవడం, ఒప్పుల్ని ఆచరించడమే కదా జ్ఞానమంటే! ఇప్పుడు నా మొదటికాయలో జ్ఞానసూర్యుడు ఉదయించాడు స్వామీ!” అంది వికసితశతదళసమానానన.

“బాగు బాగు! ఐనా, చిరుతపులి పోలికలోని స్వారస్యమేమిటో కాస్త వివరించు!” అన్నాడు భానుకోటితేజుడు.

“మీరిలా అడుగుతున్నారంటే రహస్యమైన పరమోద్దేశ్యమేదో ఉన్నది. తప్పక వివరిస్తాను శ్రీమాన్! చిరుతలోగానీ, పెద్దపులి, సింహం వంటి జంతువుల్లోగానీ క్రౌర్యమే ప్రధానగుణం. కానీ అప్పుడే పుట్టిన వాటి కూనల్లో అంతటి క్రౌర్యం కనబడదు. పైగా అవి చాలా పిరికిగా, ఆశ్రయం కోసం, ఆహారం కోసం అలమటిస్తూ ఉంటాయి. పెరిగి పెద్దవై, అవయవాలు, ఇంద్రియాలూ బలం పుంజుకోగానే వాటిల్లో క్రౌర్యం అమాంతంగా పెరుగుతుంది. చిన్నప్పటి మార్దవం మాయమౌతుంది. కానీ ఈ క్రూరజంతువుల్లో ఒక్క సింహం మాత్రమే అనవసరమైన హింసను చెయ్యదు. ఆకలైనప్పుడు మాత్రమే అది వేటాడుతుంది. చిరుత, పెద్దపులి అలా కాదు. ఆకలితోనే కాదు, వినోదం కోసం కూడా అవి వేటాడుతాయి. కాబట్టి ఈ రెండూ చాలా క్రూరమైనవి. అలానే మనుష్యులు చిన్నతనంలో అమాయకత్వంతో, స్వచ్ఛతతో ఉంటారు. పెద్దవారౌతూ ఒక్కో దుర్గుణాన్నీ అలవాటు చేసుకుంటారు. లోకకంటకులై ప్రవర్తిస్తారు.” అంది కమలగంధి.

“అందుకే కాబోలు వైకుంఠపాళిలో సింహం పద్ధెనిమిదో గడిలో ఉంది. చిరుత డెబ్బైఏడో గడిలో ఉంటే పెద్దపులి ఎనభైతొమ్మిదో గడిలో ఉంది. సంఖ్య పెరిగే కొద్దీ క్రౌర్యం కూడా పెరుగుతుందన్నమాట! అద్భుతం!” అన్నాడు అచింత్యాద్భుతమహిమోపేతుడు.

“నన్ను పరీక్షించి, ఉద్ధరించడానికే గానీ ఈ ప్రమేయాలు మీకు తెలియనివా మహానుభావా!” అని చేతులు జోడించింది ఆ లలితచారుశీల.

చిరుమందహాసం చేసాడు మహావిష్ణువు.

“మీ మొదటికాయ స్వర్గలోకంలో ఉంది. దాని తదుపరి ప్రస్థానం ఎక్కడికో?” అంది హాటకగర్భజనని.

“పాచికలే చెబుతాయి!” అంటూ వాటిల్ని విసిరాడు నరహరి.

కృష్ణుని చేతనున్న లేతపచ్చికను తినడానికై ముందుకు కదిలిన కోడెదూడ మెడలోని చిరుగంటల్లా ధ్వనించాయి పాచికలు.

★★★★★

పిల్లలతో కోలాహలంగా ఉంది శర్మ ఇల్లు.

వాళ్లను పిల్చుకువచ్చిన తల్లుల మాటల్తో మారుమ్రోగుతున్నాయి పరిసరాలు.

ఐదేళ్ళ లోపు పిల్లల్ని పిలిచి, చిరుతిళ్ళను ఇమ్మని శర్మ చెప్పి ఒక వారం కూడా కాలేదు. వెంటనే రంగంలోకి దిగింది సుమతి.

తీపి, కారం తినుబండారులున్న పొట్లాలను ఒక్కో బిడ్డ చేతికీ ఇస్తోంది సుమతి. ఆవిడ హడావుడిని నవ్వుతూ చూస్తున్నాడు శర్మ.

ఆ తినుబండారలన్నింటినీ సుమతినే స్వయంగా చేసింది. శర్మ సహాయం చేస్తానన్నా కూడా వద్దంది. రెండు రోజుల పాటు ఏకధాటిగా, అసిధారావ్రతంలా చేస్తూనే ఉండిపోయింది. శర్మ మొండికేయడంతో వాటిల్ని ప్లాస్టిక్ సంచుల్లోకి వేయడంలో అతని సహాయం తీసుకుంది.

చెప్పిన మాటల్లోని అర్థాన్ని సరిగ్గా గ్రహించడమే కాకుండా వెనువెంటనే ఆచరణలోకి తేవడంలో గల సుమతి చిత్తశుద్ధి శర్మను చాలా ఆశ్చర్యానికి గురిచేసింది.

సాయంత్రం ఆరు నుంచి రాత్రి తొమ్మిది దాకా చిరుతిళ్ల పంపిణీ జరిగింది. అంతసేపూ గుక్కెడు నీళ్ళైనా తాగకుండా బొంగరంలా గిర్రుమని తిరుగుతూనే ఉండిపోయింది సుమతి.

శబ్దం మౌనం వహించిన ఆ రాత్రిసమయంలో, అలసిపోయిన సుమతి భర్త పక్కగా కూర్చుంది. సుమతి ముఖంలోని అలసటలో కూడా చిందులేస్తున్న ఆత్మతృప్తిని స్పష్టంగా చూసాడు శర్మ. “ఏదైతేనేం! చెయ్యాలనుకున్నది సాధించావ్!” అన్నాడు మెచ్చుకోలుగా. చిరునవ్వే సమాధానంగా చూసింది సుమతి.

“పద! భోజనం చేద్దాం!” అన్నాడు శర్మ.

“ఓ పదినిముషాలు ఆగి చేద్దామా?” ప్రాధేయపడ్తున్న స్వరంతో అడిగింది సుమతి.

శర్మకు ఆమెలో అమితంగా నచ్చే ఒకానొక గుణం ఈ స్వరం.

తనను ఏ సహాయమడిగినా ఆజ్ఞాపించినట్టుగా ఉండక "దాన్ని ఇలా అందిస్తారా?" "ఒకసారి దీన్ని చూస్తారా?" అనే అడుగుతుంది. పెళ్ళైన మొదట్లో ఈవిషయమై తను మెచ్చుకుంటే సుమతి అంది "ఈ మాటతీరు మీనుంచే నేర్చుకున్నానండీ. 'ఒసేవ్ అదిలా తే', 'దీన్నక్కడ పెట్టూ' అనే మాటల్ని మీరు ఒక్కరోజు కూడా నాతో మాట్లాడలేదు. అది నాకు చాలా బాగా నచ్చింది. మీ తీరునే నేనూ అనుసరిస్తున్నా". ఆ మాటలతో తనకే పెద్ద ఆశ్చర్యం – "నేను అలా అడుగుతానా?" అని.

"ఏమండీ! ఓ పదినిముషాలాగి చేద్దామా?" మళ్ళీ అడిగింది సుమతి.

"అలాగలాగే. అలసిపోయావుగా!" అన్నాడు శర్మ. ఔనన్నట్టు తలూపింది సుమతి.

"చూసావా! పిల్లలుంటే ఎంత పనో...ఎంత అలసటో!" అన్నాడు శర్మ. ఆ మాటల్లోని హాస్యాన్ని హాయిగా ఆస్వాదించింది సుమతి.

శర్మ భుజానికి ఆనుకుని "ఓ చక్కటి బుజ్జికృష్ణుడి కథ చెప్పరూ!" అంది.

"అలాగే! పెద్దకథకంటే గోపమ్మలు యశోదకు చేసే పితూరీల రూపంలో కృష్ణబాలలీలల్ని చెబుతాను." అన్నాడు శర్మ.

"భలే భలే! చెప్పండి" అంది సుమతి.

"గోపికలు యశోద దగ్గరికొచ్చి కృష్ణుని పై పితూరీలు చెప్పడం మొదలుపెట్టారు –

'చూడమ్మా! యశోదా! నీ కొడుకు మహాఅల్లరివాడమ్మా! నా బిడ్డ నిద్రపోతుంటే వాడి పిలకకూ, దూడ తోకకూ ముడిపెట్టేసాడు. ఆపై దూడను బెదిరించాడు. అది చెంగున ఎగిరింది. దాంతోబాటే నా కొడుకు కూడా అంతెత్తు ఎగిరి పడ్డాడు. నాబిడ్డ చచ్చిపోతే దానికెవరమ్మా బాధ్యులు?'

"అమ్మా యశోదా! నీ కొడుకు సామాన్యుడు కాడమ్మా! నిన్న సాయంత్రం మా పశువుల కొట్టానికి వచ్చేసి, పాలు తాగే దూడను దూరంగా తరిమేసి, ఆవు పొదుగుకు నోరేసి మొత్తం పాలూ తాగేసాడు. ఆ దూడ అరచి మొత్తుకొంటోంది. మీవాడేమో చుక్క మిగల్చకుండా తాగేసాడు. చిత్రం చెప్పొద్దూ!

మీవాడు పొదుగుపై నోరుపెట్టగానే ఆ నంగనాచి ఆవు కూడా ఎన్ని పాలనిచ్చిందనుకున్నావ్! నేను పితికితే అందులో సగం కూడా రాదే!'

'యశోదా! నే చెప్పేది విను. మొన్నొకరోజు నీ కొడుకు పిల్లిలా మా ఇంట్లో దూరాడు. దూరి ఉట్టిలోనున్న ముంతలకేసి చూసాడు. అంతే ఆ ముంతల్లోని వెన్నంతా మాయం. నేను లోనికి పరుగెట్టుకొచ్చి కృష్ణుణ్ణి పట్టుకుని ఇక్కడేం చేస్తున్నావ్? ఉట్టిలోని వెన్నేమైంది? అని అడిగాను. అడిగితే వాడన్నాడు పిల్లి వచ్చి తాగేస్తుంటే దాన్ని తరిమేందుకు వచ్చానే అన్నాడు. వాడలా అంటున్నాడే లేడో, మా పిల్లలు గట్టిగా అరుస్తూ లోనికొచ్చారు. వచ్చినవాళ్ళని ఏమైందని అడిగాను. వాళ్ళేమన్నారో తెలుసా? "అమ్మోయ్! వీధిలో మన పిల్లి పిట్టలా ఎగురుతోందే" అని. వెంటనే వీధిలోకి వెళ్లాను. నిజమేస్మీ! మా పిల్లిముండ రెక్కల్లేని పిట్టలా గాల్లో గిరికీలు కొడ్తోంది. అప్పుడు మూర్చపోయిందాన్ని, ఇదిగో ఇప్పుడు లేచాను. ఏం మాయగాణ్ణి కన్నావమ్మా!'

'నువ్వు చెప్పింది నయంగా ఉంది. నా ఇంట్లో జరిగింది తల్చుకుంటే నాకిప్పటికీ మతిపోతుంది. నా కడగొట్టు పిల్లని ఉయ్యాల్లో వేసి ఊపుతుంటే, మీవాడొచ్చాడమ్మా! ఉయ్యాలని ఊపనా అన్నాడు. ఏదో పిల్లవాడు ముచ్చట పడ్తున్నాడు గదాని ఉయ్యాల తాడు చేతికిచ్చి, పనిచేసుకొందామని లోనికెళ్ళాను. అలా వెళ్లానో లేదో ఢాణ్...ఢాణ్..డఢాణ్ మని ఒక్కటే చప్పుడు. ఉయ్యాలున్న గదిలోకి వచ్చి చూద్దును గదా...నీ కృష్ణుడు పెద్ద కంచుపాత్ర తీసుకొని వాయిస్తున్నాడు. నిద్రనుంచి ఉలిక్కిపడి లేచిన నా చిన్నది ఒక్కటే ఏడ్పు. ఏరా ఎందుకిలా చేసావంటే, పాప నిద్రపోవాలని సంగీతం వాయిస్తున్నా అన్నాడు. కొట్టబోతే మాయమైపోయాడు. నువ్వు చెప్పు యశోదమ్మా! వీడు అమాయకుడా! ఔనని నువ్వన్నా నేను ఛస్తే నమ్మను తల్లీ'"

"హోహోహో" – జోరుగా నవ్వసాగింది సుమతి. "గోపెమ్మల్ని ఇంత హింసపెట్టాడా కృష్ణుడు!" అని ఆగి ఆగి అడిగింది.

నవ్వుతూనే కొనసాగించాడు శర్మ –

“ఇవన్నీ పెద్ద విషయాలే కావు. అమ్మా యశోదా! నాకు జరిగింది చెప్పుకోవాలంటేనే సిగ్గేస్తోంది. ఐనా చెప్పకపోతే నీవాడి అసలు రంగు నీకు తెలిసిరాదు. విను. నాలుగురోజుల క్రితం అర్ధరాత్రి అటు తిరిగి పడుకున్న నాపై మావారు చెయ్యివేసారు. నాకూ ప్రేమ పుట్టింది. ఇటు తిరిగి చూస్తే 'ఏమే భామా! ఆరోగ్యంగా ఉన్నావా?' అంటూ నీ కొడుకు పళ్ళికిలించాడు. చూద్దును గదా! మా ఆయన ఓమూలలో గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు. వీడు నాపక్కన దూరాడు. ఛీఛీ! అది గుర్తుకొచ్చినప్పుడల్లా సిగ్గుతో చచ్చిపోతున్నాను. పగలేమైనా గొడవ చెయ్యనీ కనీసం అర్ధరాత్రైనా నీ కొడుకును ఇంట్లో కట్టేసుకోవమ్మా! ఈ విపరీత చోద్యాల్ని మేం భరించలేం తల్లీ”

“ఆగండాగండి….ఏమిటీ! గోపమ్మ పక్కన చేరిందే కాక ఆరోగ్యంగా ఉన్నావా అని అడిగాడా…బాబోయ్! ఇదేం తమాషానండీ!” కళ్ళల్లో నీళ్ళు తిరుగుతుండగా అంది సుమతి. “ఇవన్నీ ఎక్కడివండీ? భాగవతంలో ఉన్నాయా?” — తన్నుకొస్తున్న నవ్వును ఆపుకుంటూ అడిగింది సుమతి.

“కొన్ని భాగవతంలో ఉన్నాయి. కొన్నింటిని మహాభక్తులు కొందరు కావ్యాల రూపంలో వ్రాసారు. విచిత్రమైన ఈ లీలల వెనుక అద్భుతమైన ఆధ్యాత్మిక విశేషాలున్నాయి!” అన్నాడు శర్మ.

“అవునా! ఐతే ఇవన్నీ నవ్వుకోడానికి రాసినవి కావా?” అంది సుమతి.

“సుమతీ! భగవంతుడు అన్ని రకాల ప్రజల్నీ ఉద్ధరించడానికి తన లీలల్ని ప్రదర్శిస్తాడు. కృష్ణలీలలూ అంతే. మానవుల్లోని పండితులకూ, పామరులకే కాక దేవతలకు కూడా జ్ఞానబోధను చేసే లీలలవి. మనసు పెట్టి అర్థం చేసుకోవాలంతే!” అన్నాడు శర్మ.

“ఓహో! ఐతే ఆ విశేషాలేవో చెప్పరూ!” అంది సుమతి.

“నేటికి ఇవి చాలు. భోజనానికి లే!” అన్నాడు శర్మ.

“నిజంగా యశోద ఎంత సుకృతం చేసుకుందో కదండీ!” అంది సుమతి లేస్తూ.

“అవును! గంగాజనకునికి చెంబుడు నీళ్ళతో స్నానం చేయించింది. సర్వాంగసుందరునికి అలంకారం చేసి మురిసింది. యోగులకు సైతం చిక్కని వాడిని తన ఒడిలో పడుకోబెట్టుకుంది. మృత్యువుకే మృత్యువైన మహావిష్ణువుకు బూచోడొస్తున్నాడని భయపెట్టింది...” అన్నాడు శర్మ.

“అబ్బా! ఎంత అదృష్టం! మన పిల్లల అల్లరికి మనమెంత మురిసిపోతామో! అలాంటిది సాక్షాత్తూ నారాయణుడే యశోదను మురిపించాడంటే ఆమె మురిపం ఎంత గొప్పదో?” అంది సుమతి.

“ఆ బాలకృష్ణుణ్ణి వదలకుండా అలా తలుస్తూనే ఉండు!” అన్నాడు శర్మ.

ఆ మాటల్లోని భావమేంటో అర్థమైన సుమతి నవ్వుతూ తలదించింది.

★★★★★

“అహో! మీ మొదటి ఆటకాయ ’చిత్తశుద్ధ’మనే గడినుంచి ఎకాఎకిన ’మహాలోక’మనే నూటాఐదవ గడిని చేరింది స్వామీ!” అంది తాపసారాధికపాదకమలయైన కమలజ. “అమితమైన ఆధ్యాత్మిక సంపదను కలిగివున్న మీ రెండో కాయను అధిగమించి ఒక వరుస పైకి ఎగబ్రాకింది ఈ కాయ!” అంది నిత్యకళ్యాణి.

“ఆశ్చర్యమెందుకు దేవీ! భక్తికి, చిత్తశుద్ధికి లింగభేదం లేదుగా!” అన్నాడు నిత్యముక్తుడు.

“ముక్తిలో కూడా లేదుగా ప్రభూ!” అంది మూలప్రకృతీస్వరూపిణి.

“అదే సిద్ధాంతం కూడా! మరి ఆశ్చర్యమెందుకు?” అన్నాడు శ్రీకరుడు.

“ఆశ్చర్యవత్పశ్యతికశ్చిదేయమ్...” అంది శ్రీదేవి నవ్వుతూ.

“ఐతే నీ రెండోపావు కలిగించే ఆశ్చర్యమేమిటో చూపించు!” అన్నాడు భూధరుడు.

భూజాత పాచికలను విసిరితే కొత్తనీరు నిండిన సెలయేటిలోని గలగలల్లా అవి కిలకిలమన్నాయి.

★★★★★

కొత్త కంపెనీలో అనుకోకుండా కొత్త సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాడు అనంత్.

విపరీతమైన వర్క్ లోడ్ తో బాటు ఎక్కువ బాధ్యతల్ని కూడా తీసుకోమని మేనేజ్మెంట్ ఒత్తిడి చేస్తోంది. అతనికి అనుభవంలేని మార్కెటింగ్ విభాగాన్ని కూడా చూసుకోవాలని సీ.ఈ.వో జారీ చేసిన ఈమైల్ హుకుంను చూసి కోపంతో ఊగిపోయాడు అనంత్.

విసురుగా సీ.ఈ.వో కేబిన్లోకి దూసుకొచ్చి – "ముకుల్! ఏమిటిదంతా! నాకు డెవలప్మెంట్ తో బాటు పోయిన నెలలో గ్లోబల్ ప్రోడక్ట్ డెలివరీని కూడా తగిలించావు. ఇప్పుడు మార్కెటింగ్ టీమ్ తో బాటు పనిచేయాలంటున్నావు. డైరెక్ట్ గా ఈమైల్ పంపించేకంటే ముందు నాతో డిస్కస్ చేసివుండాల్సింది. ఐ డోంట్ లైక్ దీస్ యూనీలేటరల్ డెసిషన్స్. సారీ! ఐమామ్ నాట్ ఆక్సెప్టింగ్ దిస్!" అని గట్టిగా అరిచాడు.

ముకుల్ అని పిలవబడే ఆ సీ.ఈ.వో, అనంత్ కంటే వయసులో చిన్నవాడు. అతని తండ్రి పెట్టుబడిదారుడు కావడంతో కంపెనీకి అధిపతి ఐపోయాడు. అతను కూడా ఇంజనీరే అయినా అత్తెసరి మార్కులతో పాసై చదువు"కొన్న"వాడే గానీ అనంత్ లా తెలివితేటల్తో పైకి వచ్చినవాడు కాదు. ఐతేనేం, జిత్తులమారితనంతో బండి నడిపిస్తాడు. ఉద్యోగంలో చేరిన నెలలోనే కుర్ర సీ.ఈ.వో అర్హతల్ని, పోకడల్ని కనిపెట్టేసాడు అనంత్. ఇలాంటి "అండర్ క్వాలిఫైడ్ కిడ్" క్రింద పనిచేయాల్సి వచ్చినందుకు విపరీతంగా బాధపడేవాడు. కానీ కుటుంబ, ఆర్థిక పరిస్థితులు అతన్ని అణిగివుండేట్టు చేస్తున్నాయి.

అందుకని తన ఈగోను బుజ్జగించుకోవడానికిగానూ సీ.ఈ.వోను పేరుతో పిలవడం మొదలెట్టాడు. ఈమైల్స్ రాసేటప్పుడు కూడా "సర్" అనో "డియర్ ముకుల్" అనో సంబోధించకుండా నేరుగా విషయాన్ని ప్రస్తావించేవాడు. మీటింగులకి కావాలనే ఐదు నిముషాలు ఆలస్యంగా వచ్చేవాడు. ముకుల్ నిశ్చయించే టార్గెట్ డేట్లను, ప్రొసీజర్లను, పాలసీలను కావాలనే మార్చేసేవాడు. తనుకు నచ్చిన విధంగా ప్రాజెక్ట్ ను నడిపేవాడు. ముకుల్ నుండి ఎలాంటి ఎదురుదాడీ ఎదురుకాకపోవడంతో తన క్వాలిఫికేషన్స్, ఎఫిషియన్సీలని చూసి ఆ కుర్రవాడు డంగైపోయుంటాడని అనుకొన్నాడు. అంతేకాదు, తను డెలివరీ చేసిన ఏ ప్రాజెక్టూ ఇప్పటిదాకా రిజెక్ట్ కాలేదు. క్లైంట్స్ ఫీడ్ బ్యాక్ కూడా బావుంది.

ఇలాంటి ట్రాక్ రికార్డ్ కూడా ముకుల్ నోరును మూయించివుంటుందని భావించాడు అనంత్. ఆ మైమరపులో ముకుల్ జిత్తులమారితనం గురించి ఆలోచించలేదు. ముకుల్ మాత్రం అనంత్ ను అవమానించే సందర్భం కోసం వేచి చూస్తున్నాడు.

"సో!" అన్నాడు ముకుల్. అతని గొంతులో ఎలాంటి ఉద్వేగంగానీ, ఆవేశం గానీ లేదు.

"సో మీన్స్ వాట్?" తిరుగువేటు వేస్తున్నట్టు అడిగాడు అనంత్.

"నేనిచ్చిన ఇంస్ట్రక్షన్ను నువ్వు ఫాలో కావా?" అన్నాడు ముకుల్, హైబ్యాక్ చేర్లో జారిగిల పడుతూ.

"కమాన్ ముకుల్! థింక్ రేషనలీ. నేనొక్కణ్ణి ఎన్ని పనులని చెయ్యను? అందులోనూ మార్కెటింగ్ లో నాకు ఎక్స్పీరియన్స్ లేదు. యూ నో ఇట్." అనంత్ లో ఆవేశం బుస్సుమని లేస్తోంది.

"నీ టాలెంట్ ను చూసే అడిషనల్ రెస్పాంన్సిబిలిటీని ఇస్తున్నాను అనంత్! యూ ఆర్ కేపబుల్ ఆఫ్ డూయింగ్ ఎనీ థింగ్." అన్నాడు ముకుల్. అది తనను కవ్వించడానికి చేసిన పొగడ్తేనని తెలుస్తూనేవుంది అనంత్ కు.

ముకుల్ మళ్ళీ కొనసాగించాడు– "నన్ను చూడు! నేనూ నీలాగే ఇంజనీర్ని. అకౌంటెంటునో, లాయర్నో కాను. బట్ ఒక సీయీవోగా కంపెనీకి సంబంధించిన అన్ని పన్లూ చూసుకోవాలి. బీ ఇట్ డెవలప్మెంట్, ప్రోడక్ట్ డెలివరీ, మార్కెటింగ్, అకౌంట్స్, హెచ్.ఆర్, లీగల్ కంప్లయన్స్....యూ నేమ్ ఎనీ థింగ్...ఐ మస్ట్ లుక్ ఇంటూ ఎవ్రీ డామ్ థింగ్!" – చైయిర్ లో అటుయిటూ విలాసంగా ఊగుతూ చెప్పాడు ముకుల్.

దాంతో అనంత్ కు చిర్రెత్తుకొచ్చింది – "లుక్ ముకుల్! ఇది నీ స్వంత బిజినెస్. అందుకు నువ్వు ఈ పనులేంటి, ఇంకేవైనా చెయ్యాల్సి వచ్చినా...యూ హావ్ టు డూ ఎనీ థింగ్ అండ్ ఎవ్రి థింగ్. కానీ నేను ఓ ప్రొఫెషనల్ ఎంప్లాయీని. కొన్ని సర్వీసుల్ని ఇవ్వడానికి మాత్రమే నేను జీతం తీసుకొంటున్నాను. అంతేగానీ, కంపెనీ ఇచ్చిన ప్రతి పనినీ చెయ్యడానికి కాదు. ఈరోజు మార్కెటింగ్ అంటున్నావు, రేప్పొద్దున్న ఆఫీసు ఊడ్చమంటావ్. యూ ఆర్ కేపబుల్ ఆఫ్ డూయింగ్ దిస్ అని

పొగుడుతావ్. కానీ ఒక హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ను కసువూడ్చమని ఏ సీయీవో ఐనా చెబుతాడా? అంతా నీ ఇష్టమేనా? నాటోన్లీ దిస్...ఆ మైల్ పంపేముందు నాతో ఒక్కసారన్నా మాట్లాడాలి కదా! ఈజ్ దట్ నాట్ ఏ ప్రొఫెషనల్ ఎథిక్?" నిలపకుండా మాట్లాడాడు అనంత్.

అనంత్ ఎంత అరచినా ముకుల్ ముఖంలో ఎలాంటి కోపఛాయలూ లేవు.

"లాస్ట్ థర్స్ డే నువ్వు సడెన్గా లీవ్ వేసావు. ఆరోజు అమెరికన్ క్లయింట్ తో కాన్ కాల్ ఉందని తెలిసీ ఆ పని చేసావ్. లీవ్ తీసుకొంటున్నానని ఇంటి నుండి ఒక ఈమైల్ పంపి ఆఫీసుకు డుమ్మా కొట్టావ్. నేను నాలుగుసార్లు ఫోన్ చేసినా తియ్యలేదు. లీవ్ అనేది కంపెనీ ఇచ్చే ప్రివిలెజ్. ఇట్స్ నాట్ యువర్ బర్త్ రైట్. కంపెనీలో ఎవరు లీవ్ తీసుకొన్నా వాళ్ల లైన్ మేనేజర్ అప్రూవల్ ఉండితీరాలని కదా రూల్. నీకు నేను లైన్ మేనేజర్ని. బట్ వాట్ హావ్ యూ డన్! నా అప్రూవల్ తీసుకొలేదు. అంతేకాదు కనీసం ఇంటినుండైనా ఒక పదినిముషాలు కాన్ కాల్ తీసుకోకుండా ఆ ఫారిన్ క్లయింట్ ముందు నా ఇజ్జత్ పోగొట్టావ్. ఇదేనా నీ ప్రొఫెనలిజం?" – నెమ్మదిగా అడిగాడు ముకుల్.

ఈ ఎదురుదాడిని ముందుగానే ఊహించాడు అనంత్. కాబట్టి పెద్దగా ఆశ్చర్యపోలేదు. అందువల్ల గట్టిగా నవ్వాడు.

"ఈ టాపిక్ నువ్వు తీసుకొస్తావని నాకు తెలుసు ముకుల్! లాస్ట్ వీక్ లో నేను తీసుకున్న లీవ్ ఈ కంపెనీ చేరిన తర్వాత తీసుకున్న నా వెరీ ఫస్ట్ లీవ్. అది కూడా నా కజిన్ చనిపోతే తీసుకున్నాను. ఆ విషయాన్నే నీకు మైల్లో రాసాను. ఆ మైల్ చివర్లో కైండ్లీ అప్రూవ్ అని కూడా అడిగాను. అసలు మైల్ చెయ్యడానికి ముందు నీకు ఫోన్ చేసాను. అది ఎంగేజ్ వస్తుండింది. వెంటనే ఎస్.ఎం.ఎస్ చేసాను. పదినిముషాలైనా నీ నుండి రిప్లై రాలేదు. అటువైపు నా కజిన్ వైఫ్, పిల్లలు నా హెల్ప్ కోసం మాటిమాటికీ ఫోన్లు చేస్తున్నారు. అప్పుడు....అప్పుడు నీకు మైల్ పంపాను. నువ్వు కాన్ కాల్లో నన్ను కనెక్ట్ చెయ్యడానికి ట్రై చేస్తున్నప్పుడు నేను స్మశానంలో ఉన్నాను. ఆర్ యూ ఎక్స్ పెక్టింగ్ మీ టు హావే కాన్ కాల్ ఇన్ఫ్రంట్ ఆఫ్ ది డెడ్ బాడీ ఆఫ్ మై కజిన్? ముకుల్! దిస్ ఈజ్ ఇల్లాజికల్ అండ్ బార్బేరియస్ బిహేవియర్." అనంత్ చేతులు, కాళ్ళు వణకడం మొదలుపెట్టాయి. ఊపిరి

తీసుకోవడానికి ఇబ్బంది అవుతున్నట్టు అనిపించడంతో ముకుల్ ఎదురుగావున్న కుర్చీలోకి కూలబడ్డాడు.

అనంత్ ఇబ్బందిని చూసి కూడా ముకుల్ తగ్గలేదు "ఒకే అనంత్! నువ్వు ఈ ఉద్యోగంలో కంటిన్యూ కావాలంటే నేను చెప్పింది చెయ్యాలి. లేదంటే....వెల్...యూ కెన్ లుక్ ఫర్ అదర్ ఆపర్చునిటీస్!" అంటూ కుండబద్దలు కొట్టాడు.

ఒళ్ళు సహకరించకపోయినా అక్కడి నుండి లేచి తన కేబిన్లోకి వచ్చాడు అనంత్. గొంతును చుట్టుకునివున్న టై తీసి టేబుల్ మీదికి విసిరికొట్టాడు. షర్ట్ గుండీలు రెండింటిని విప్పేసి, కళ్ళు మూసుకొని సీట్లోకి జారిగిలపడ్డాడు.

ఆఫీస్ బాయ్ గోవిందయ్య నెమ్మదిగా కేబిన్ తలుపు తోసుకుని లోనికొచ్చాడు. ట్రేలో వేడి కాఫీ. "సార్ కాఫీ!" అంటూ టేబుల్ పై పెట్టాడు. అనంత్ కు ఉన్నపళాన కాఫీ తాగాలనిపించింది. కప్పును చేతిలోకి తీసుకున్నాడు. "యూ ఆర్ డ్రింకింగ్ మై మనీ!" అని ముకుల్ అంటున్నట్టు అనిపించింది. "ఛీ!" అని కప్పును కిందపెట్టి "గోవింద్! హోటల్నుండి కాఫీ తీసుకురా. ఇది బాగా లేదు." అని హుంకరించాడు. షర్ట్ జేబులోనుంచి పదిరూపాయల నోట్ తీసి టేబుల్ పై విసిరేసాడు. గోవింద్ ఆ నోటును పట్టుకుని కంగారుగా బైటకు పరిగెత్తాడు.

గోవిందయ్య తెచ్చిన కాఫీని ఒక్క గుక్కలో తాగేసి, లాప్ టాప్ తెరిచాడు అనంత్. వణుకుతున్న వేళ్ళతో రాజీనామా మైల్ ను టైప్ చేసాడు. 'Send' బటన్ నొక్కేముందు ఒక్క క్షణం ఆగి, ఆపై కళ్ళు మూసుకుని నొక్కాడు.

మైల్ వెళ్ళిన రెండు నిముషాల్లో ఇంటర్ కామ్ లో ముకుల్ గొంతు. "గుడ్ డెసిషన్ అనంత్! అకౌంట్స్ వాళ్లకి నీ డ్యూస్ లన్నింటినీ సెటిల్ చెయ్యమని చెప్పాను. ఇంకో గంటలో చెక్ నీ చేతిలో ఉంటుంది. ఈరోజు సాయంత్రం నుండీ నువ్వు ఫ్రీబర్డ్ వి. ఆల్ ద బెస్ట్." అన్నాడు ముకుల్.

“హౌ కెన్ యూ రిలీవ్ మీ టుడే ఇట్సెల్ఫ్! నా అపాయంట్మెంట్ లెటర్లో వన్ మంత్ నోటీస్ పీరియడ్ క్లాజ్ ఉంది.” అన్నాడు అనంత్.

“ఆ క్లాజ్ తో బాటే సమ్మరీ డిస్మిసల్ అన్న మరో క్లాజ్ కూడా ఉంది. చూసుకోలేదా? “గ్రాస్ ఇన్ సబార్డినేషన్” కింద నీ సర్వీసుని టెర్మినేట్ చేస్తున్నాను. దిస్ టెర్మినేషన్ కమ్స్ అండర్ సమ్మరీ డిస్మిసల్ క్లాజ్. అన్నట్టు! నీకు నెలరోజుల జీతాన్ని సెటిల్ చేస్తున్నాను. సో డోంట్ వర్రీ అబౌట్ మనీ. నోటీస్ పీరియడ్ కోసమని నువ్వు నెలరోజులు ఆఫీసు రానక్కర్లేదు. దట్సాల్! మై పూర్ ఐఐటీ ప్రొడిగీ, దిస్ ఈజ్ మై ప్రొఫెషనలిజమ్!” అని పెట్టేసాడు ముకుల్.

అనంత్ లో అన్ని స్పందనలూ మాయమైపోయాయి...ఒక్క హృదయస్పందన తప్ప.

ఎలా చెక్కు తీసుకున్నాడో, ఎలా కంపెనీ అస్సెట్స్ అప్పగించాడో, ఎలా ఆఫీసు నుండి బైటపడి ఇల్లు చేరుకున్నాడో అతనికి తెలీదు. ఎలాగోలా ఇంటికొచ్చాడు అనంత్.

“*కృష్ణా నీ బేగానే బారో*” అనే పాట రంజని ల్యాప్ టాప్ నుండి వస్తోంది.

★★★★★

నలభైఏడో గదిలో నోరు తెరుచుకునివున్న బకాసురుడు మింగడంతో లక్ష్మీదేవి ఆడుతున్న రెండో ఆటకాయ ఒక వరుస క్రిందకు జారింది. అక్కడున్న కోడి మీద కూర్చుంది.

“ఈ కుక్కుట విన్యాస మర్మమేంటి దేవీ?” అన్నాడు సామగానప్రియుడు.

“జీవితమంతా తినడానికే వెచ్చించేవారు, పరులకు ఆహారమౌతారని భావం ప్రభూ!” అంది మంగళదుర్గ.

“అంటే?” అన్నాడు అశ్వగ్రీవుడు.

“మళ్ళీ పరీక్షిస్తున్నట్టున్నారు!” అంది గోపాలకరసరోజాలంకృత వేణుగానస్వరూపిణి.

“పరీక్షకు అర్థం చక్కగా ప్రేరేపించేదనేగా!” అన్నాడు నిగమదీక్షాదక్షతత్పరుడు.

“సత్యమైన మాట! యథామతిగా వివరిస్తాను ప్రభూ! మాటిమాటికీ ’ఛస్తాను ఛస్తాను’ అని బెదిరించేవారు, మీ నామస్మరణ క్షణకాలమైనా చెయ్యక ఎల్లకాలమూ తమ కడుపును మాత్రమే నింపుకునేందుకు శ్రమించేవాళ్ళు కుక్కుట జన్మనెత్తుతారు. గ్రుడ్డును చీల్చుకుని బైటకి వచ్చిన క్షణం నుంచీ ఆ కోడి ఆహారాన్వేషణలోనే కాలం గడిపేస్తుంది. అది మేసి బలంగా తయారయ్యేలోగా మరొకరికి ఆహారంగా మారిపోతుంది. మళ్ళీ మరో గ్రుడ్డులోకి ప్రవేశిస్తుంది. పుడుతుంది. మేస్తుంది. మళ్ళీ ఆహారంగా మారిపోతుంది. పరమ ఘోరమైన పాపకర్మలను చేసినవారు గ్రుడ్డుగా ఉండగానే ఆహారమైపోతారు. మళ్ళీ ఇంకో గ్రుడ్డులోకి ప్రవేశిస్తారు. ఇదొక విషవలయం. ఈ వలయాన్ని భేదించాలంటే మీ దయ తప్ప మరో మార్గం లేదు స్వామీ!” అంది హస్తివరదరాణి.

“బాగా చెప్పావు దేవీ! మరి, నా రెండో కాయను కదపనా?” అన్నాడు కపిలనామక భగవానుడు.

“మీ చిత్తమే సత్యమైనది. నడిపించండి ప్రభూ!” అంది

దుష్టక్షత్రియమర్దనాసమర్థ ఖండపరశుధారి పాచికల్ని నడిపిస్తే అవి తుంబురుహస్తాలంకృత మాలతీనిక్వాణాల్లా ధ్వనించాయి.

★★★★★

పదిహేదు, పదహారేళ్ళ అబ్బాయిని వెంటబెట్టుకు వస్తున్న భర్తను చూసి, వరండాలోకి వచ్చింది సుమతి.

“సుమతీ! ఈ అబ్బాయి తాతగారి దగ్గర మా నాన్నగారు వేదాధ్యయనం చేసారు.” లోనికి వస్తూనే సూటిగా విషయంలోకి వచ్చాడు శర్మ.

“ఓ! అవునా! ఏం పేరు బాబూ?” అని అడిగింది సుమతి, శర్మ చేతిలోని సంచీని తీసుకుంటూ.

“సుబ్రహ్మణ్యం” అన్నాడా అబ్బాయి.

“లోపలికి రా!” అంది సుమతి, గుమ్మం దగ్గరే నిలబడిపోయిన సుబ్రహ్మణ్యాన్ని చూసి.

“ఏరా అబ్బాయ్! ఆచార్య పదాన్ని వదిలేసావెందుకు?” అన్నాడు శర్మ, మందలిస్తున్నట్టుగా.

“ఓహో! సుబ్రహ్మణ్య ఆచార్యనా!” అంది సుమతి నవ్వుతూ.

అవునన్నట్టు తలూపాడా అబ్బాయి.

సుబ్రహ్మణ్యాన్ని చూస్తూ “పెరట్లో కెళ్ళు. స్నానాలగది అక్కడే ఉంది. కాళ్ళుచేతులు కడుక్కుని వంటింట్లోకి వెళ్ళు.” అన్నాడు శర్మ.

అలాగేనన్నట్టు తలూపాడు సుబ్రహ్మణ్యం.

“సుమతీ! వీడికి సంధ్యావందనం పాత్రలివ్వు. సాయంసంధ్య నేర్పించాలి.” అన్నాడు శర్మ.

------

రాత్రి భోజనాలయ్యాక, సుబ్రహ్మణ్యం మేడ మీద పడుకోవడానికి వెళ్ళాడు.

పడకగదిలోకి వచ్చిన సుమతిని చూసి “వాడు కొద్ది నెలలు మనతోనే ఉంటాడు సుమతీ!” అన్నాడు శర్మ.

“అలాగేనండీ!” అంది సుమతి. ఆమె ఇంకేమైనా అడుగుతుందేమోనని ఎదురుచూసాడు శర్మ. సుమతి నుండి ఎలాంటి ప్రశ్నా రాకపోవడంతో తనే మాట్లాడం మొదలుపెట్టాడు.

“సుబ్రహ్మణ్యం తాతగారు రాజగోపాలాచార్యులని గొప్ప ఋగ్వేద పండితులు. ఆయన దగ్గరే మా నాన్నగారు అధ్యయనం చేసారు. వీడి నాన్నగారైన పార్థసారథిగారు వైదికవృత్తిలో ఆసక్తి లేకపోవడంతో ఇంగ్లీషు చదువు చదువుకున్నారు. బి.ఏ. చేసి గవర్నమెంట్ ఉద్యోగంలో చేరారు. యూనియన్ లీడర్ గా పనిచేసారు కూడా. కొన్నేండ్ల క్రితం హైదరాబాద్ లో జరిగిన ధర్నాలో పాల్గోడానికి ఆయన వెళ్ళారు. ఆ ధర్నా ఉన్నట్టుండి హింసగా మారడంతో పోలీస్ ఫైరింగ్ జరిగింది. అందులో పార్థసారథిగారూ చనిపోయారు.”

“అయ్యొయ్యో!” అంది సుమతి, రెండు చెవుల్నీ మూసుకుంటూ.

“సుబ్రహ్మణ్యం తల్లిగారు హైస్కూల్ చదువు కూడా పూర్తిచేయలేదు. అందుకని ఆవిడకు స్వీపర్ ఉద్యోగమే ఇస్తామంది గవర్నమెంటు. ఆ పని చెయ్యలేక ఆవిడ తన అన్న ఇంటికి చేరింది. అతను ఈ ఊర్లోనే ఉంటాడు. మనవాళ్ళ కార్యక్రమాలకి వంటలూ అవీ చేస్తుంటాడు. ఈరోజు నేను వెళ్ళిన పెళ్ళిలో సుబ్రహ్మణ్యంగారి తల్లిగారిని చూసాను. ఆవిడ అన్నతో బాటూ వంటలు చెయ్యడానికి వచ్చింది. నాన్నగారితో బాటూ నేనూ రాజగోపాలాచార్యుల వారి ఇంటికి వెళ్ళేవాణ్ణి కాబట్టి ఈవిడ నాకు బాగా గుర్తు. అందువల్ల నేనే గుర్తుపట్టి మాట్లాడించాను. ఇన్ని విషయాలు తెలిసాయి. వీణ్ణి చూపించి చదువు మాన్పించేసి వంటల్లోకి దించినట్టు చెప్పింది. అంత గొప్ప ఘనాపాఠీ మనవడు ఇలా బ్రతకడం నాకు బాధ కలిగించింది. నాన్నగారి గురువుగారికి నావంతు శుశ్రూషగా వీణ్ణి వేదపారాయణంలో కాకపోయినా కనీసం పౌరోహిత్యంలోనైనా తర్ఫీదునిద్దామని తీసుకొచ్చాను. వీడికి సంధ్యావందనం కూడా సరిగ్గ రాదు. అందువల్ల కనీస ధర్మాలు పట్టుబడేదాకా మన ఇంట్లోనే పెట్టుకుందామని తీసుకొచ్చాను...” అని ఆగాడు శర్మ. “నీకూ ఇష్టమేనా” అన్నది ఆ ఆగడంలోని ధ్వనితార్థం.

భర్త భావాన్ని ఇట్టే అర్థం చేసుకున్న సుమతి – “తప్పకుండా పెట్టుకుందామండీ!” అంది సుమతి.

ఎంతో నిశ్చింతగా అనిపించింది శర్మకు.

-----

ఒక నెలరోజులుగా సుబ్రహ్మణ్యానికి కనీస విధివిధానాలను చెప్పించడంతో బాటు అనేక వైదిక కార్యక్రమాలకు కూడా తీసుకెళ్తున్నాడు శర్మ. ప్రతి మంత్రం, తంత్రం వెనుకవున్న ఆధ్యాత్మిక విశేషాల్ని, విజ్ఞానశాస్త్ర విషయాల్నీ వివరిస్తున్నాడు. ఎన్నిసార్లు ఆవృత్తి చేయించినా ఏ విషయమూ సుబ్రహ్మణ్యం బుర్రలోకి పూర్తిగా ఎక్కడంలేదని గ్రహించాడు శర్మ. అదే విషయాన్ని సుమతితో ప్రస్తావించాడు.

“మీరు ఒకేసారి ఎక్కువ విషయాల్ని చెప్పడం లేదు కదా?” అంది సుమతి.

“లేదు సుమతి! మామూలుగా సంధ్యావందనం ఎనిమిదేండ్ల పిల్లలకు కూడా నెలరోజుల్లో పూర్తిగా కంఠతా వచ్చేస్తుంది. వీడికి ఉపనయనం జరిగే ఏడేళ్ళు కావొస్తోంది. నెల క్రితం ఏ తప్పులు చెప్పేవాడో

ఇప్పుడూ అవే తప్పులు చేస్తున్నాడు. ఊర్ధ్వాయ దిశే అనడానికి బదులు ఉరుద్దై దిసే అంటున్నాడు. వల్లె వేయిస్తే సరిగ్గా చెబుతాడు కానీ మరుసటి రోజు మళ్ళీ మొదటికొస్తున్నాడు." – శర్మ గొంతులో నిరాశ, నిస్సహాయత కలగలిసి పోతున్నాయి.

"పోనీ ఈ పని చేస్తేనో?" అంది సుమతి ఉత్సాహం నిండిన గొంతుతో.

"ఏమిటది?"

"బహుశా సుబ్రహ్మణ్యానికి ఉచ్చారణలో సమస్య ఉన్నట్టుంది. అందుకని కొన్ని సులభ పదాలు, కొన్ని కష్టమైన పదాలున్న తెలుగు పద్యాలు వల్లె వేయించండి. ఆ పదాలకు నోరు తిరగడం మొదలైతే సంస్కృత పదాలు తొందరగా వంటబడతాయి. ఏమంటారు?" అంది సుమతి.

సుమతి మాటలతో శర్మ మనసులో కూడా రవ్వంత ఆశ చిగురించింది.

"ఆ ప్రయత్నమేదో నువ్వు చెయ్యరాదూ? వాడికి నేనంటే భయమెక్కువ. నీతోనే కాస్త చనువుగా ఉంటాడు." అన్నాడు శర్మ.

"నేనా! సరే. ప్రయత్నిస్తాను." అంది సుమతి.

"ఓ వారం రోజులు వాడిని ఎక్కడికీ తీసుకెళ్ళను. నువ్వు చెప్పిన ప్రయత్నాన్నీ చేసి చూద్దాం." అన్నాడు శర్మ.

అప్పటికే ఏ పద్యాలు చెప్పాలా అన్న ఆలోచనలో పడిపోయింది సుమతి.

-----

వంట చేస్తూ సుమతి చెప్పిన కొన్ని ప్రాసవాక్యాలను కొద్ది దూరంలో కూర్చున్న సుబ్రహ్మణ్యం అప్పచెప్పుతున్నాడు.

*"దేవదేవ రమ్ము – కావుమయ్య మమ్ము*
*రూక లేనివాడు – పోక చేయలేడు*

*అలుక పూన రాదు – అతివ గొట్ట రాదు*

*ఊర గలిసి మనుము – ఊని పనుల గనుము*

*ఏక మగుట యొప్పు – ఏడ్చు టెపుడు ముప్పు"*

చెబుతున్నాడే గానీ సుబ్రహ్మణ్యం మనసులో ఏకాగ్రత లేదు.

"ఐక్య మిచ్చు వద్దు – ఐనదెల్ల దిద్దు"

సుమతి తిరిగి చూసింది.

ఎక్కడో చూస్తూ చెప్పుకుపోతున్నాడు సుబ్రహ్మణ్యం.

"ఓటు మాట విడువు – ఓర్పు...ఓర్పు...ఓ..." ఆగిపోయి తల తిప్పి చూసాడు. సుమతి తనవైపే చూస్తుండటంతో తప్పు చేసినవాడిలా తలదించుకున్నాడు.

"ఐక్య మిచ్చు బలము అని చెప్పాలి. కానీ నువ్వు ఐక్య మిచ్చు వద్దు అన్నావు. ఆ వాక్యాని కేమైనా అర్థముందా?" అని అడిగింది సుమతి. ఆమె గొంతులోని మార్దవాన్ని సుబ్రహ్మణ్యం తట్టుకోలేకపోయాడు.

"తప్పైపోయిందమ్మా!" అన్నాడు.

"నీకే తప్పు తెలిసిపోయిందిగా! మళ్ళీ మొదట్నుంచి చెప్పు. ఈసారి చక్కగా చెప్పగలవ్." అంది సుమతి చిరునవ్వుతో.

సుబ్రహ్మణ్యం మళ్ళీ మొదలుపెట్టాడు

"దేవ దేవ రమ్ము ...

సఖుల కీడు బాపు – సాటి వాని మేపు

హాని పనికి దడువు – హాస్య మెపుడు విడువు"

"సెబ్బాష్! చూసావా! మనసు పెట్టి చెబితే ఏదైనా చక్కగా వచ్చేస్తుంది!" అంది సుమతి చప్పట్లు కొడుతూ.

గట్టిగా ఊపిరి పీల్చుకున్నాడు సుబ్రహ్మణ్యం.

ఆ రాత్రి భర్తతో మాట్లాడుతూ "ఏమండీ! సుబ్రహ్మణ్యానిది ఉచ్చారణ సమస్య కాదు. మనసుకు సంబంధించిన సమస్య. బహుశా ఇవన్నీ నేర్చుకోవడం వాడి కిష్టం లేదేమో!" అంది సుమతి.

ఆశ్చర్యపోయాడు శర్మ. "వాడికి ఆసక్తి లేదని ఎలా తెలుసుకున్నావ్?" అన్నాడు.

"ఈరోజు కొన్ని ప్రాసవాక్యాలు చెప్పమన్నాను. ఐక్య మిచ్చు బలము అనడానికి బదులు ఐక్య మిచ్చు వద్దు అన్నాడు. ఇలాంటి చిన్న చిన్న తప్పుల్ని చాలా చేస్తాడు. దీని వల్ల ఆ అబ్బాయి తనేం చెబుతున్నాడో, ఆ చెప్పేదానిలో అర్థముందా లేదా అని ఆలోచించడం లేదని తెలుస్తోంది. నేర్చుకుంటున్నవాటి పట్ల ఆసక్తి లేకపోవడమే ఈ తప్పులకు కారణమని నా ఊహ." అంది సుమతి.

"ఒకట్రెండు తప్పులతో అలా నిర్ణయానికి రావచ్చా?" అన్నాడు శర్మ. సుమతి చెబుతున్నదాన్ని నమ్మడానికి అతని మనసు ఒప్పడం లేదు.

"ఆనందతీర్థులు యమకాలంకారంలో వ్రాసిన సుభద్రా పరిణయ ఘట్టాన్ని వర్ణించే శ్లోకాన్ని ఒకసారి చెబుతారా?" అంది సుమతి.

ఆవిడెందుకు అడిగిందో అర్థమైంది శర్మకు. ఐనా తెలియనట్టు మొదలుపెట్టాడు.

*"పురమభియారిదరీ దత్త్వా భద్రాం పృథాసుతాయారిదరీ/*
*శక్రపురీమభియాతః ప్రాదాద్వహ్నేర్వనం సతామభియాతః//"*

"ఇందులో అరిదరి కి అర్థం చెబుతారా?" అంది సుమతి.

"ఆ పదానికి ఒకటి కాదు రెండర్థాలున్నాయి." అన్నాడు శర్మ.

"అవునవును. రెండర్థాలున్నాయి. అవేంటో చెప్పరూ!" అంది.

“అరి అంటే చక్రం. దరి అంటే శంఖం. అరిదరి అంటే చక్ర–శంఖాలను ధరించినవాడనేది ఒక అర్థం. అరి అంటే శత్రువులు. దరీ నంటే నాశనం చేసేవాడు. కాబట్టి అరిదరి అంటే శత్రుసంహారకుడని రెండో అర్థం. ఇప్పుడిదంతా ఎందుకు?” అన్నాడు శర్మ.

“నేనడిగిన వెంటనే ఒక్క అక్షరం పొల్లుపోకుండా శ్లోకాన్ని చెప్పారు. ఒక పదానికి వుండే నానార్థాలనీ చెప్పారు. మీలో శ్రద్ధ లేకపోతే ఈ జ్ఞాపకశక్తి ఉండేదా? సుబ్రహ్మణ్యంలో ఇలాంటి శ్రద్ధలేదన్నది అతను చేస్తున్న చిన్నా చితకా తప్పుల్లో తెలుస్తోంది. ఇది నా ఊహ మాత్రమే. మీరూ ఇంకోసారి పరీక్షించి చూడండి!” అంది సుమతి.

శర్మ మౌనం వహించాడు. సుమతి చెప్పినదానిలో ఒక్క అక్షరం కూడా తీసివేయడానికి లేదని అనిపించింది.

“ఓ పని చెయ్. రేపు ఏ పాఠాలూ వద్దు. వాణ్ణి కబుర్లలో పెట్టు. అలా కదిలిస్తే తన మనసులోని మాటను బైటపెడతాడేమో చూద్దాం. మనసును నిలుపందే సాధన సిద్ధించదు.” అన్నాడు శర్మ. అతని గొంతులో గూడు కట్టుకున్న నిర్వేదానికి సుమతి మనసు విచలితమైంది.

-----

మరుసటి రోజు వంట చేస్తున్నంత సేపూ సుబ్రహ్మణ్యంతో పోచికోలు కబుర్లాడుతూనే ఉండింది సుమతి. తన స్కూల్లో జరిగిన తమాషా ఘటనలు, టీచర్లు – స్టూడెంట్ల దాగుడుమూతలు, పక్కింటివాళ్ళతో వచ్చిపడిన పేచీలు, పెళ్ళిళ్ళు మొదలైన సందర్భాల్లో ఎదురైన వింత అనుభవాలూ మొదలైనవి ఎన్నో చెప్పింది సుమతి. వాటన్నింటినీ నవ్వుతూ విన్నాడు సుబ్రహ్మణ్యం. ఇలాంటివేవైనా చెప్పమని అతన్ని అడిగినపుడు నోరు మెదపలేదు ఆ అబ్బాయి.

తన చిన్ననాటి విషయాలను ఎక్కువగా చెప్పడానికి సుబ్రహ్మణ్యం ఇష్టపడడం లేదని గ్రహించింది సుమతి. అంటే, ఆ అబ్బాయి బాల్యం కష్టాల మధ్య గడిచివుండాలి. అలా కాకపోతే, చిన్ననాటి విషయాల్ని చెప్పడానికి ఎవరు ఉత్సాహపడరు?

మాట మార్చి – "నీ కిష్టమైన సినిమా ఏది?" అని అడిగింది.

"ప్చ్!" అని ఏదీ లేదన్నట్టు అడ్డంగా తలూపాడు సుబ్రహ్మణ్యం.

ఆ తర్వాత ఏం మాట్లాడాలో తోచలేదు సుమతికి.

వాళ్ళిద్దరూ పెరట్లో కూర్చునువున్నారు. ఆ చిన్న స్థలాన్ని తోటలా మార్చుకున్నారా దంపతులు. అక్కడ కూర్చొని మాట్లాడుకోవడం వారికి చాలా ఇష్టమైన వ్యాపకాల్లో ఒకటి.

సుబ్రహ్మణ్యం ఏమీ మాట్లాడకపోవడంతో సుమతి కూడా మౌనంగా ఉండిపోయింది.

నిమ్మచెట్టు మీద ఒంటరి పిచ్చుక కొమ్మ నుండి కొమ్మకు ఎగురుతూ కిచకిచమని అరుస్తోంది. బీరపాదులో నల్ల చీమలు దండు కట్టి వస్తూ, పోతు ఉన్నాయి. మధ్యాహ్నపు ఎండ ఆకులపై పడి మెరుస్తూవుంది. మనుష్యులు మాటలే మర్చిపోయారేమో అన్నంత నిశ్శబ్దంగా ఉంది వీధి.

తన కంటే ఒక మెట్టు దిగువన, ఎడం చెయ్యిని గడ్డం క్రింద పెట్టుకుని పాదుల వైపు చూస్తున్న సుమతిని కన్నార్పకుండా చూస్తున్నాడు సుబ్రహ్మణ్యం.

"అమ్మ కంటే చాలా చిన్నది. కానీ అమ్మలో లేని మనసూ, ఓర్పు ఈమెలో ఉన్నాయి. అమ్మ ఈమెలా ఉండుంటే నాన్నగారలా ఇంటికి రాకుండా ఎప్పుడూ బైటే ఉండేవారా? నాన్న ఇంట్లో ఉన్నప్పుడు ఎంత హాయిగా ఉండేది! చక్కగా నాతో ఆడుకొనేవారు. ఎప్పుడూ ఎవరిపైనా విసుక్కునేవారే కాదు. అమ్మ చీటీలు, వడ్డీ వ్యాపారమంటూ ఎవరెవర్నో ఇంట్లోకి రానిస్తున్నా ఊరుకున్నారు. ఇంట్లో జరిగిన ఏ గొడవా నాన్నతో మొదలు కాలేదు. అని నేను చెబితే ఈమె నమ్ముతుందా? నాన్న దక్కకపోవడానికి అమ్మే కారణమని చెబితే నన్ను పిచ్చివాడిలా చూడదూ? నాన్నను అమ్మ ఎలా హింసించేదో చెప్పాలంటే మాటలు సరిపోతాయా? నేను స్కూలుకు వెళ్లలేదని చెబితే ఈమె ఏమనుకొంటుంది? పక్కింట్లో ఉండే కరీమ్ మాష్టారు దయ తలచి తన దగ్గరకు ట్యూషన్ కు వచ్చే వాళ్ళతో చేర్చి నాకూ నేర్పిస్తేనే ఈమాత్రం చదువు వచ్చిందని ఎలా చెప్పేది? ఈ విషయాలన్నీ ఈమెతో చెబితే ఏమనుకొంటుంది? అమ్మకు కష్టపడడం ఇష్టంలేకనే కదా మామయ్యతో పాటూ వంటలు చెయ్యడానికని ఆ పెళ్ళికి నన్ను

తీసుకొచ్చింది! నాన్న చచ్చిపోవడం తప్పించి పంతులుగారితో అమ్మ చెప్పినవన్నీ కట్టు కథలని తెలిస్తే నన్ను ఈ క్షణం బైటకి తోసెయ్యరూ! ఇలాంటి లేకి కుటుంబాలు కూడా ఉంటాయా అని వీళ్ళిద్దరూ అనుకోరూ! వీళ్ళిలా అనుకుంటే అమ్మ కంటే నాన్నకే ఎక్కువ అవమానం జరుగుతుంది.

నాన్నా...నాన్నా..నాన్నా..."

"సుబ్రహ్మణ్యం! భోజనం చేద్దామా?" అని అడిగింది సుమతి. సరేనన్నట్టు తలూపాడు.

మొదట సుబ్రహ్మణ్యానికి వడ్డించి తను భోజనానికి కూర్చుంది సుమతి. రాత్రి భోజనానికి అన్ని పదార్థాలను విడిగా తీసిపెట్టి తనకు ఎంత కావాలో అంతే తెచ్చి ముందుపెట్టుకుంది సుమతి.

సుబ్రహ్మణ్యం ఈ పద్ధతికి ఆశ్చర్యపోయాడు. మామూలుగైతే శర్మ ఉండడం వల్ల వాళ్ళిద్దరికీ వడ్డించి కూర్చునేదని అనుకున్నాడు. ఈరోజు మధ్యాహ్నం భోజనానికి రానని చెప్పాడు శర్మ. అందువల్ల ఇద్దరూ ఒకేసారి కూర్చోవచ్చుననుకున్నాడు.

సుమతి భోజనం చేస్తుంటే ఆమెకు దగ్గరగా, గోడకు చేరగిలబడి కూర్చున్నాడు సుబ్రహ్మణ్యం.

"మిమ్మల్ని ఓ విషయం అడగనా?" అన్నాడు.

చాలాసేపైన తర్వాత నోరు విప్పిన సుబ్రహ్మణ్యం వైపు నవ్వుతూ చూసింది సుమతి. "ఒక్కటేనా అడిగేది?" అంది.

"ఆహా...రెండు మూడు విషయాలున్నాయి." అన్నాడు సుబ్రహ్మణ్యం.

"మొదటిదేమిటి?" అంది సుమతి.

"మీరు, పంతులుగారు నన్ను పూర్తి పేరుతో పిలుస్తారెందుకు? అందరూ పిల్చినట్టు సుబ్బా అనో, మణీ అనో పిలవరెందుకు?" అన్నాడు.

“సుబ్రహ్మణ్యం ఒక దేవత పేరు కదా! దేవతల పేర్లను తలిస్తే పుణ్యమొస్తుంది! పూర్తిగా పిలవకుండా ముక్కలు ముక్కలు చేస్తే పుణ్యం రాదుగా! అందుకని...” అంది సుమతి. “ఐనా పూర్తి పేరుతో నిన్ను ఎవ్వరూ పిలవలేదా?”

“మా తాతయ్య ఒక్కరే అలా పిల్చేవారు.” అన్నాడు సుబ్రహ్మణ్యం.

“రెండో విషయమేమిటి?”

“పంతులుగారంటే పెద్దవారు. మీరు వారికి వడ్డించి కూర్చోడం బాగుంది. కానీ ఈరోజు నాకు వడ్డించి కూర్చున్నారే? నేను చాలా చిన్నవాణ్ణి కదా!”

“నీకు వామనుడి కథ తెలుసా?” అంది సుమతి.

“తెలుసు. బలిచక్రవర్తిని మూడు అడుగుల స్థలాన్ని అడిగి అతన్నే పాతాళానికి తొక్కేస్తాడు.” అన్నాడు సుబ్రహ్మణ్యం.

“మరి ఆ బలి చక్రవర్తి ఎంతో పెద్ద రాజు కదా! ఐనా కూడా చిన్ని వామనుడి కాళ్ళు కడిగాడు. అవునా?” అంది సుమతి.

విషయం అర్థమైనట్టుగా “అంటే నేను వామనుడిలాంటి వాణ్ణని మీరు నాకు వడ్డిస్తారా!” అన్నాడు సుబ్రహ్మణ్యం.

సుమతి నవ్వింది.

“ఇంత మంచితనం అవసరమా?” అన్నాడు సుబ్రహ్మణ్యం.

సుమతి ముఖంలో నవ్వు మాయమయింది. “ఎందుకలా అన్నావ్?” అంది.

“ఏమో! అలా అనిపించింది!” అన్నాడు సుబ్రహ్మణ్యం.

మిగతా భోజనాన్ని మౌనంగా ముగించింది సుమతి. సుబ్రహ్మణ్యం గోడకలా ఆనుకునే కూర్చున్నాడు.

శుద్ధిపెట్టడాన్ని ముగించి హాల్లోకి వచ్చింది సుమతి. సుబ్రహ్మణ్యం లోపల గదిలోనే ఉండిపోయాడు.

ఓ పుస్తకాన్ని తీసుకుని హాల్లో ఉన్న కుర్చీలో కూర్చుంది సుమతి. కొద్దిసేపటి తర్వాత సుబ్రహ్మణ్యం హాల్లోకి వచ్చాడు.

సుమతికి ఎదురుగా కూర్చుని "ఏం చదువుతున్నారండీ?" అన్నాడు.

"మీ పంతులుగారు నా కోసమని రామాయణంలోని సుందరకాండకు తెలుగులో అర్థం వ్రాసిచ్చారు. దాన్ని చదువుకుంటున్నా!" అంది సుమతి.

"ఇప్పుడేం చదువుతున్నారు?" అన్నాడు.

"ఇప్పుడే మొదలుపెట్టాను. హనుమంతుడు సముద్రాన్ని లంఘించాడు. గట్టిగా చదువుతాను, నువ్వూ వింటావా?"

"ఊ..."

"హనుమంతుడు ఎగరగానే అతని వేగానికి లాగబడినట్టుగా సముద్రం ఉప్పొంగింది. అందులో ఉన్న జలచరాలన్నీ కూడా పైకి ఎగిరి అతని వెనకనే అనుసరించాయి. హనుమ బలానికి ఆ జలచరాలే కాక సముద్రంలో మునిగివున్న మైనాక పర్వతం కూడా పైకి వచ్చింది."

గట్టిగా నవ్వాడు సుబ్రహ్మణ్యం. చదవడం ఆపి అతని వైపు చూసింది సుమతి.

"ఒక కోతి గాల్లోకి ఎగిరితే సముద్రంలోని చేపలు, కొండలూ లాగబడతాయా?" అన్నాడు సుబ్రహ్మణ్యం.

సుమతికి ఏం చెప్పాలో తోచలేదు. ఆమె కెప్పుడూ ఇలాంటి సందేహం రాలేదు. ఏదో ఒకటి చెప్పాలని – "ఆయన వాయుదేవుడి కొడుకుగా! గాలి గట్టిగా వీస్తే ఏదైనా కొట్టుకొనిపోవాల్సిందే కదా? తుఫానుగాలి వస్తే ఇళ్ళు, చెట్లూ, అన్నీ ఎగిరిపోవడాన్ని మనం చూస్తున్నాంగా? " అంది సుమతి.

ఈసారి మౌనం వహించడం సుబ్రహ్మణ్యం వంతైంది.

సుమతి చదవడం కొనసాగించింది – "పైకి వచ్చిన మైనాకుడు హనుమంతుడికి నమస్కరించి తనపై కూర్చుని విశ్రాంతి తీసుకోమని ప్రార్థించాడు. అందుకు హనుమంతుడు చిరునవ్వు నవ్వి, మైనాకుణ్ణి తన చేత్తో స్పృశించి వెంటనే బయల్దేరాడు..."

"హనుమంతుడు ఎందుకు ఆగలేదు?" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"రాముడి పనిని నెరవేర్చేవరకు ఆగకూడదని!" అంది సుమతి.

"అంటే?" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"అంటే, పెద్దవారు చెప్పిన పనిని వెంటనే చేసెయ్యాలి. ఆలస్యం చెయ్యకూడదని అర్థం." అంది సుమతి.

సుబ్రహ్మణ్యం మాట్లాడలేదు. సుమతి మళ్ళీ చదవడం మొదలుపెట్టింది.

ఆ అబ్బాయి మనసు "పెద్దవారు చెప్పిన పనిని వెంటనే చేసెయ్యాలి." అన్న సుమతి మాటల చుట్టూ తిరుగుతోంది.

వాడికి నాన్న చెప్పింది గుర్తుకొస్తోంది – "సుబ్బా! మగాడికి చదువు ముఖ్యం. ఉద్యోగం ముఖ్యం. చదువు పూర్తయ్యాక ఏదో ఒక ఉద్యోగం చూసుకోవాలి. జీతమెంతని ఆలోచించకూడదు. వెయ్యిరూపాల జీతమొచ్చినా చేరిపోవాలి. పెద్ద జీతమిచ్చే పెద్ద ఉద్యోగమే చేస్తానని ఇంట్లో కూర్చొంటే అవమానం. మీ అమ్మ చీటీలు, వడ్డీవ్యాపారంలాంటి కొన్ని చెడ్డ పనులు చేస్తోంది. అవి తెచ్చే డబ్బు మనకు అరగదు. కష్టపడి సంపాదించేదే మనది. ఒకర్ని మోసం చేసి సంపాదించిన డబ్బు ఏదో ఒకనాడు మనల్నే ముంచేస్తుంది. మనకు చేతనైనంతలో మంచితనంతో బ్రతకాలి. మనశ్శాంతితో బ్రతకాలి. దీన్ని డబ్బుతో కొనలేం. నీ మనసులో శాంతి ఉన్నప్పుడు గౌరవం అదే వస్తుంది. నేను నా జీవితంలో నేర్చుకున్నదిదే. నువ్వు కూడా ఓ డిగ్రీ ముగించి ఉద్యోగం చెయ్యాలి."

సుబ్రహ్మణ్యంకు నాన్న మాటల్లో ఎంతో నిజమున్నట్టు అనిపించింది. ఆయన మాటల్ని పాటించడంలో ఇప్పటికే చాలా ఆలస్యం చేసినట్టుగా అనిపించింది. నాన్న మాటల్ని జవదాటి తను ఘోరమైన తప్పు చేస్తున్నాడు. ఈ పౌరోహిత్యాలు, వంటలూ చేసుకోవడం కంటే డిగ్రీ పూర్తిచేసి, ఏదైనా ఆఫీసులో

గౌరవమైన ఉద్యోగం చెయ్యాలన్న కోరిక బలంగా కలిగింది. అమ్మకు, మేనమామకు తనను చదివించే ఉద్దేశాలు లేవని తేలిపోయింది. ఇంటి నుంచి పారిపోవాలని ఎప్పుడో అనుకొన్నాడు కానీ ఎందుకో ధైర్యం చెయ్యలేకపోయాడు. పారిపోతే, చదువుకు ఇబ్బంది ఎదురవుతుందని భయపడ్డాడు. ఇప్పుడు ఈ దంపతుల్ని చూసాక, వాళ్ళ మంచితనాన్ని చూసాక తన ఇష్టాయిష్టాలని చెప్పడం మంచిదన్న నిర్ణయానికి వచ్చాడు.

"అమ్మా!" అన్నాడు.

చదవడాన్ని ఆపింది సుమతి.

"నేను మీతో కొన్ని విషయాలు చెప్పాలనుకొంటున్నాను. మీరేమీ అనుకోనంటే చెబుతాను." అన్నాడు సుబ్రహ్మణ్యం.

సుమతి ఈ క్షణం కోసమే ఎదురుచూస్తోంది. "అయ్యో! ఏమీ అనుకోను. తప్పకుండా చెప్పు!" అంది.

"అమ్మా! నాకు ఈ పౌరోహిత్యం పై ఇంట్రస్ట్ లేదు. డిగ్రీ చదివి, మంచి ఉద్యోగం చెయ్యాలని ఉంది." అన్నాడు. ఇంతకాలం తన గుండెలోనే తారట్లాడుతూ, కంగారు పెడుతున్న విషయాన్ని రెండు ముక్కల్లో చెప్పేసాక, సుబ్రహ్మణ్యంకు నెమ్మదిగా అనిపించింది.

సుమతి వెంటనే ఏమీ మాట్లాడలేదు.

సుబ్రహ్మణ్యం ఆమె మౌనాన్ని మరో రకంగా అర్థం చేసుకుని – "అమ్మా! 'పెద్దవాళ్ళు చెప్పినదాన్ని వెంటనే చేసెయ్యాలని' ఇంతకుముందే మీరన్నారు. మా నాన్న నాకు చెప్పిందాన్నే చేద్దామనుకుంటున్నాను." అన్నాడు. అతని గొంతులోని వేడుకోలు లాంటి బాధను పసిగట్టింది సుమతి.

"అయ్యో! దానికేం భాగ్యం సుబ్రహ్మణ్యం. ఆయన వచ్చాక నేనే ఈ విషయం చెబుతాను. ఆయన తప్పకుండా ఒప్పుకుంటారు. నిన్నేమీ అనర్లే!" అంది సుమతి, ధైర్యం చెబుతున్నట్టు.

సుబ్రహ్మణ్యం రెండు చేతులూ జోడించాడు.

-----

శర్మ క్రితం రాత్రి చాలా ఆలస్యంగా రావడంతో సుబ్రహ్మణ్యం విషయాన్ని తీసుకురాలేదు సుమతి.

మరుసటిరోజు ఆ అబ్బాయి బైటకెళ్ళినపుడు సుబ్రహ్మణ్యం తనతో చెప్పినదాన్ని శర్మకు వివరించింది సుమతి. శర్మ చాలా ఆశ్చర్యపోయాడు. ఆపై బాధపడ్డాడు.

"ఓ ఘనాపాఠీ మనవడికి శాస్త్రం, సాంప్రదాయం పట్ల అభిరుచి కలిగిద్దామంటే ఆ అవకాశం లేకుండా పోతోంది. నేను దీన్ని ఒప్పుకోలేకపోతున్నాను. వాడొచ్చాక మాట్లాడ్తాను. ఎలాగైనా వాణ్ణి ఒప్పిస్తాను." అన్నాడు శర్మ.

"అబ్బాయికి ఇష్టంలేనిదాన్ని బలవంతంగా రుద్దడ మెందుకండీ?" అంది సుమతి.

"ఇది రుద్దడమెలా అవుతుంది?మన సంప్రదాయాన్ని మనమే కదా నిలబెట్టాలి? వీడి తాతగారు, ముత్తాత గారు ఎంతటి పండితులో నీకు తెలీదు. వీడి ముత్తాతగారు కాశీలోని వ్యాకరణ పండితులతో వాదించి బంగారు గండపెండారాన్ని సాధించారు తెలుసా! సుమతీ, ఏ విషయం మీదా అందరికీ ఉన్నట్టుండి ఆసక్తి పుట్టదు. అర్థమయ్యేట్టు వివరిస్తే, అందులోవున్న గొప్పదనం అర్థమౌతుంది. అప్పుడు అనుమానాలన్నీ పోయి ఆసక్తి అదే వస్తుంది. అందుకనే వాడితో నేనూ మాట్లాడ్తాను. ఆ తర్వాత కూడా వాడి అభిప్రాయం మారకపోతే_ _ _.." కొనసాగించడం ఇష్టం లేదన్నట్టుగా ఆగిపోయాడు శర్మ.

తీవ్రంగా కుదిపే భావోద్వేగాలకు మనసులో ఎన్నడూ స్థానమివ్వని భర్త, ఈ ఒక్క విషయంలో ఇలా ప్రవర్తించడం సుమతికి చాలా ఆశ్చర్యాన్ని కలిగించింది. వాళ్ళ నాన్నగారు పోయాక అన్నలు ఆస్తి కోసం కొట్లాడుకుంటుంటే, అమ్మతో బాటూ వాళ్ళ నాన్నగారి దేవతార్చన పెట్టెను మాత్రమే చేతిలో పట్టుకుని ఈ ఊరు వచ్చేసారు. అప్పటికి ఆయన వయసు సరిగ్గా సుబ్రహ్మణ్యంలానే పదహారేళ్ళు. ఆ వయసులోనే అంత సహనం, సమ్యమనం చూపించిన వ్యక్తి ఈ కుర్రవాడి విషయంలో అనవసరంగా బాధపడడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఆ ఆశ్చర్యంతో బాటే కొద్దిగా భయం కూడా కలిగింది. దేనిపట్లా హద్దుమీరి అభిమానం చూపని వ్యక్తి, సుబ్రహ్మణ్యానికి ఆసక్తి లేదని తెలిసీ ఏదో నేర్పాలన్న తపన

పడుతున్నారు. అలా పుట్టక పుట్టక పుట్టిన తపన తీరకపోతే ఏమౌతుంది? కోపం, చిరాకు, విరక్తి లాంటి వాటిల్ని ఆయన చూపిస్తే తను తట్టుకోగలదా? ఒకరికి మంచి చేయబోతే మనకు చెడు ఎదురౌతుందా? ముందేం జరగబోతోంది?

★★★★★

"షడ్గుణైశ్వర్యసంపన్నా! ఇదేమి చిత్రం? అంతఃశుద్ధితో అలరారే మీ రెండో ఆటకాయ మాత్సర్యమనే పాము నోట చిక్కి, గుంటనక్క పాలైందా?" –జగత్తునే సంభ్రమాశ్చర్యాలకు గురిచేసే జగన్మాయ విచారంగా అడిగింది.

"ఏం దేవీ? ఎందుకా విచారం?" అన్నాడు భూతభవ్యభవత్ప్రభువు.

"విచక్షణ కలిగిన వారే విచలితులైతే మిగిలేది విచారమేగా ప్రభూ!" అంది బహుసుందరీగణాతీత సుందరి.

"పరుల ఇష్టాయిష్టాలతో పనిలేకుండా తనకు నచ్చినిదాన్నే వారి చేతా చేయించాలని పట్టుబట్టడం మాత్సర్యమేగా! మాత్సర్యం ఉన్నచోట మూర్ఖత్వం పుట్టుకొస్తుంది! ఒక్కోసారి ఆ మూర్ఖత్వం వంచనకు దారితీస్తుంది." అన్నాడు పూతాత్ముడు.

"ఒకరిని మంచిపని చేయడానికి పురిగొల్పడం మాత్సర్య మెలా అవుతుంది భగవాన్?" అంది వటపత్రశాయి శయ్యారూపిణి.

"అంబుజసదనా! ఇనుములో ఆకర్షింపబడే గుణముంది. అయస్కాంతంలో ఆకర్షించే గుణముంది. ఆ రెండు ఒకదాని గుణాన్ని మరొకటి గ్రహించడం ద్వార పరస్పరం దగ్గరవుతాయి. చెక్కలో అలా ఆకర్షింపబడే గుణం లేదు. కనుక దానిపై ఎంత పెద్ద అయస్కాంతాన్ని ఉపయోగించినా అది ఆకర్షింపబడదు. ఈవిధంగానే మంచి చెయ్యాలన్నా, మంచిని స్వీకరించాలన్నా రెండు ప్రక్కలా గుణగ్రాహిత్వం ఉండాలి. చెక్కకు గొడ్డలి దెబ్బ మాత్రమే అర్థమౌతుంది. లేదూ ఉలి స్పర్శకు స్పందిస్తుంది. కట్టెలు కొట్టేవాడికి దొరికిన చెక్క, పొయ్యిలో మండి బూడిదౌతుంది. శిల్పి చేతిలో పడ్డ

చెక్క అందమైన బొమ్మౌతుంది. అలాగే బుద్ధి కర్మకు వశమై నడుస్తుంది. ఆ కర్మపై విధి పెత్తనం చలాయిస్తుంది. ఆ విధి భగవంతుని అధీనం. ఈ ఆటలో పాచికలు ప్రవృత్తి అంటే క్రియకు నిదర్శనం. వాటిపైనున్న సంఖ్యలు కర్మలను అంటే క్రియాఫలితాలను సూచిస్తాయి. క్రియలకు వాటి ఫలాలకూ మధ్య జరిగే జగన్నాటకమే విధిబద్ధమైన మానవజీవనం." అన్నాడు ఇనకులతిలకుడు.

"ఆ పాచికలు మీ సుతిమెత్తని చేతులలో, మీ సత్యసంకల్పానికి ఆదరవులై వెలుగుతున్నాయి. వెలుగు-చీకటి, సుఖం-దుఃఖం, లాభం-నష్టం, పెరుగుట-తరుగుట అన్నీ మీ సంకల్పానుసారమే జరుగుతున్నాయి. ఈ ద్వంద్వభావాలలో మునిగిన సమస్త జీవులకూ, అనంత జగాలకూ మీరే దిక్కు. మీకు దాసోహం అన్న రోజున భయకారకాలైన ద్వంద్వాలు పోయి ఈశ-దాస మనోభావం ధృఢమై, జీవులూ-జగాలూ అన్నీ ముక్తిని పొందుతాయి." అంటూ చంద్రవంశప్రదీపకుణ్ణి చూసి చేతులు జోడించింది చంద్రానన.

"నీ మొదటి కాయ కూడా అంతరంగ శుద్ధిని చూపిస్తోందిగా...అదేం చెయ్యబోతోందో?" అన్నాడు ధృవవరదుడు.

"మీ కృపారసప్లావిత దృష్టిని ఆకర్షించిన ఆ కాయ గతి తప్పుందా స్వామీ! నడిపిస్తాను. అనుగ్రహించండి!" అని పాచికలను విసిరింది భీష్మక నందన.

కుచేలుని ఇంటిలో నర్తించిన ధనలక్ష్మీ పదాశ్రిత నూపురాల నినాదాల్లా శబ్దించాయి పాచికలు.

★★★★★

తన వొళ్ళో తలపెట్టి పడుకున్న అనంత్ ను జోకొడుతోంది రంజని.

"నాలుగు నెలల క్రితం ఇలాంటి దృశ్యమే ఉండింది. అనంత్ పనిచేస్తున్న కంపెనీ మూతపడి పోయిందని తెలిసినప్పుడు జరిగిన రభస గుర్తుకొస్తోంది. అప్పట్లో ఉన్న అలజడి ఇప్పుడు తనలో లేదు. ఈ ఓర్పు ఎక్కడినుంచి వచ్చింది? నాలుగు నెలల్లో ఇంతలా మారడం ఓ మనిషికి సాధ్యమా? ఇప్పుడు

అనంత్ ను చూస్తుంటే కోపం రావడం లేదు. ఓ నాన్న తన కష్టార్జితంతో కొనిచ్చిన ఖరీదైన కలాన్ని ఎక్కడో పారేసుకొచ్చిన కుర్రవాణ్ణి లాలించి, ధైర్యం చెప్పే తల్లిలా ఉంది తన మనసు."

మళ్ళీ తల్లి పోలిక రావడంతో లోలోపలే ఉలిక్కిపడింది రంజని – "పావని తనను అమ్మతో పోల్చింది. ఇప్పుడు తన మనసు తనే తల్లితో పోల్చుకొంటోంది. ఏమిటీ తల్లిదనం? నాలుగు నెల్ల క్రితం పోగొట్టుకున్నానని బాధపడింది దీని కోసమేగా!" – రంజని మనసులో ఆలోచనల పరంపర సాగిపోతూనే ఉంది.

"నువ్వలా సైలెంటుగా ఉంటే నీకు కోపమొచ్చిందేమోనని నాకు భయం." అన్నాడు అనంత్. తనని తాను ఇంకా ముణగదీసుకుని పడుకున్నాడు.

"నాకెలాంటి కోపం లేదుగా! నువ్వు పడుకొన్నావేమోనని ఊరకేవున్నా!" అంది రంజని.

"లేదు. నాకు నిద్ర రావడం లేదు. ఏదైనా మాట్లాడు. ప్లీజ్!" అన్నాడు అనంత్.

కంపెనీ నుండి బైటపడి ఇంటికి వచ్చినరోజు నుండీ రంజనితో మాట్లాడే ప్రతి వాక్యం చివరా "ప్లీజ్" చేర్చడం అలవాటైపోయింది అనంత్ కు. ఆ రెండక్షరాల్లో అతని మనసు, దేహంలో పేరుకుపోయిన నిస్సహాయత ప్రతిధ్వనిస్తోంది.

"కాలేజ్ లో నాకు సుత్తి రంజని అనే టైటిలుండేది. అదిప్పుడు పనికొస్తోంది." అంది రంజని.

"ఊ..." అన్నాడు అనంత్.

గొంతు సవరించుకుని "ఆన్ ద పాపులర్ డిమాండ్ ఆఫ్ అవర్ లిజనర్స్...వుయ్ ఆర్ బ్రింగింగ్ టు యూ సమ్ బోన్ టికిలింగ్ జోక్స్...ఎంజాయ్ గైస్.." అని గట్టిగా అరిచింది రంజని. అనంత్ కూడా నవ్వాడు. "ఇంకా జోకే చెప్పలేదు అప్పుడే నవ్వితే ఎట్లా లిజనర్...సేవ్ యువర్ లాఫ్....హియర్ వుయ్ గో..." అని మళ్ళీ అరిచింది రంజని.

“ముగ్గురు ఫ్రెండ్స్ ఎడారిలో చిక్కుకుపోయారు. వాళ్ళకి ఓ మ్యాజిక్ లాంప్ దొరికింది. దాంట్లో నుండి ఓ భూతం బైటకొచ్చి ఆ ముగ్గుర్నీ ఒక్కో కోరిక కోరుకోమంది. మొదటివాడు ఇంటికెళ్ళిపోవాలన్నాడు. వూ..ఫ్...వెళ్ళిపోయాడు. రెండో వాడూ అదే కోరుకొన్నాడు. వాడూ వెళ్లిపోయాడు. అప్పుడు మూడో వాడూ 'భూతం! భూతం! ఒక్కణ్ణైపోయి బోర్ కొడ్తోంది. నా ఫ్రెండ్స్ ను ఇక్కడకు పిలిపించు' అన్నాడు.”

“ఓల్డ్ జోక్!” అన్నాడు అనంత్.

“ఓ..రియల్లీ! ఓకే...హియర్ వుయ్ గో ఫర్ ద సెకండ్ జోక్...బిల్ గేట్స్ చచ్చి పైకిపోయాడు. అక్కడన్న దేవత ఒక పెద్ద స్క్రీన్ పై రెండు లోకాల్ని చూపించి నీకేది కావాలో కోరుకో అంది. గేట్స్ బాగా చూసాడు. రెండో లోకం బ్యూటిఫుల్గా కనబడింది. 'ఇదేం లోకం?' అన్నాడు. 'నరకం' అంది దేవత. 'రియల్లీ! నరకమంటే భయంకరంగా వుంటుందనుకొన్నానే ఇట్స్ లుకింగ్ ఫెంటాస్టిక్. నేనక్కడికే వెళ్తా' అన్నాడు. బిల్ వెళ్ళి నరకంలో పడ్డాడు. అది నిజంగానే భయంకరంగా ఉంది. అక్కడున్న ఓ యమకింకరుణ్ణి పట్టుకొని 'బాస్! ఇటీజ్ రియల్లీ హారిబుల్ ఓవర్ హియర్. ఆ దేవత చూపించిన స్క్రీన్లో నరకం బ్యూటిఫుల్గా కనబడిందే!' అన్నాడు. దానికి ఆ కింకరుడు నవ్వి 'బాస్! నువ్వు చూసింది మా స్క్రీన్ సేవర్ని' అని కెవ్వుమని కేకలేస్తున్న గేట్స్ ను తోసుకొంటూ పోయాడు.”

“హాహాహా...బాగుంది. వన్ మోర్!” అన్నాడు అనంత్.

“కొన్ని రోజులు నరకంలో ఉన్న గేట్స్ స్వర్గాని కెళ్ళాడు. అక్కడున్న దేవదూత గేట్స్ ను పెద్ద తోటలోకి తీసుకెళ్ళింది. అక్కడంతా పాలరాతి జారుడుబండలు ఉన్నాయి. బిల్ గేట్స్ కి జారుడుబండలంటే చాలా ఇష్టం. వెంటనే ఒక పేద్ద జారుడుబండ ఎక్కి జర్రున జారాడు. ఆ బండ చివరికి వస్తుండగా గేట్స్ పిర్రకు ఒక చిన్న రాతి ముక్క గీసుకుపోయింది. చాలా బాధతో గట్టిగా అరిచి 'వాట్ ఈజీదిస్ ఏంజెల్ గారూ?” అన్నాడు. 'ఓహ్! సారీ సర్! ఐ థింక్ ఇట్స్ ఏ స్మాల్ బగ్ ఆన్ ఎ బిగ్ ఫాల్. ఐ విల్ డీబగ్ అండ్ ఫిక్సిట్ మిస్టర్ గేట్స్' అందా ఏంజెల్.”

అనంత్ గట్టిగా నవ్వాడు.

“నీకు అటల్ బిహారీ వాజపేయీ, జనరల్ ముషరాఫ్ జోక్ తెలుసా?” అంది.

“నో” అన్నాడు అనంత్.

“ఇట్స్ ప్రెట్టీ ఓల్డ్. ఐనా చెప్పనా?” అంది రంజని.

“ఓల్డ్ ఈజ్ గోల్డ్. చెప్పు. ప్లీజ్” అన్నాడు అనంత్.

“వాజపేయీ, ముషరాఫ్, మాధురీ దీక్షిత్, మార్గరేట్ థాచర్ — ఈ నలుగురూ ఒక ట్రైన్లో స్విట్జర్లాండ్ లోని ఆల్ప్స్ మౌంటెన్లో ఉన్న టన్నెల్లో వెళ్తుంటారు. ఒక టన్నెల్ నుండి ఇంకో టన్నెల్లోకి వెళ్ళినపుడు బోగీ మొత్తం చీకటిగా ఐపోయేది. అలా ఒకసారి చీకటిగా ఐనప్పుడు గట్టిగా ముద్దు పెట్టుకొన్న చప్పుడూ, దాని వెనకే ఛళ్ళు, ఛళ్ళుమని చెంపల్ని వాయించి కొట్టిన సౌండూ వచ్చాయి. టన్నెల్ బైటకి రాగానే వెలుగొచ్చింది. ముషరాఫ్ తన రెండు చెంపల్నీ రెండు చేతుల్తో మూసుకొని కూర్చున్నాడు.”

“హోహోహో...” అన్నాడు అనంత్.

“హుష్...జోకింకా పూర్తి కాలేదు. అప్పుడే నవ్వొద్దు.” అంది రంజని.

“ఓకే...ఓకే” అన్నాడు అనంత్.

“అలా కూర్చొన్న ముషరాఫ్ ను చూసి ఒక్కొక్కరూ ఒక్కోరకంగా అనుకోవడం మొదలుపెట్టారు.

*మార్గరేట్ థాచర్*: “పాకిస్తానీలకి మాధురీ అంటే వల్లమాలిన పిచ్చి. బోగీలో చీకటి పడగానే ఆ ముష్ గాడు ఈ అమ్మాయికి ముద్దు పెట్టబోయుంటాడు. మాధురీ వీడి రెండు చెంపల్నీ వాయగొట్టి మంచిపని చేసింది.”

*మాధురి*: “ముషరాఫ్ నన్ను ముద్దుపెట్టుకోబోయి పాపం పెద్దామె థాచర్ను ముద్దు పెట్టుంటాడు. దాంతో ఆమె రెండు వాయించివుంటుంది. గుడ్ జాబ్ మేడమ్.’

*ముషరాఫ్*: “నా పక్కన కూర్చొన్న ఈ పెళ్ళికాని పెద్దమనిషి ఎదురుగా కూర్చొన్న లేడీస్లో ఎవర్నో ముద్దు పెట్టబోయుంటాడు. వాళ్ళేమో నేనే ఆ పని చేసుంటానని నన్ను వాయగొట్టారు.’

*వాజపేయీ*: “ఈ బోగీ మళ్ళీ ఎప్పుడు టన్నెల్లోకి పోతుంది? ఎప్పుడు చీకటి కమ్ముకొంటుంది? ఎప్పుడు నేను ముద్దు పెట్టిన సౌండ్ చేసి, ముషర్రాఫ్ చెంపలు వాయిస్తానో?”

దట్సాల్ ఫర్ ద డే గైస్!” అని అరిచింది రంజని.

“హాహాహా...హోహోహో...” అని గట్టిగా నవ్వసాగాడు అనంత్. “వాజ్పేయే ముద్దు సౌండ్ చేసి ముషర్రాఫ్ చెంపల్ని వాయగొట్టడం...హాహాహాహా... ఐ జస్ట్ కాంట్ బేర్ దిస్”.

నవ్వీ నవ్వీ ఇద్దరి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. అలా కొన్ని నిముషాల పాటు నవ్వుతూ ఉండిపోయారు.

“రంజూ! నా పైన నీకు కోపం లేదా?” ఉన్నట్టుండి అడిగాడు అనంత్.

“ఎందుకలా మళ్ళీ మళ్ళీ డౌట్ పడ్తావ్? ఐ డోంట్ హావ్ ఎనీథింగ్ అగేన్స్ట్ యూ! ఇంకెప్పుడూ ఇలా అడక్కు!” అంది రంజని.

సరేనన్నట్టు తలూపాడు అనంత్.

“సాటర్ డే ఐపోవచ్చింది. రేపు ఏం చేద్దాం?” అంది రంజని.

“నీ ఇష్టం. యూ డిసైడ్.” అన్నాడు అనంత్. ఆమెను శాసించే అధికారం తనకిప్పుడు లేదని అతని మనసు చెబుతోంది.

“ఊ...గుడి కెళ్దామా?”

మాట్లాడలేదు అనంత్.

“ఏమ్మా! వొద్దా? ఇష్టం లేదా?” – అనంత్ గడ్డం పట్టుకుని అడిగింది రంజని. “పోనీ పార్కుకెళ్దామా?” అంది.

“నీ ఇష్టం రంజూ!” అన్నాడు అనంత్.

"హ్మ్..! ఇలా చేద్దాం. పొద్దున్నే స్నానం చేసేసి గుడికెళ్దాం. నో కాఫీ, టీ! ఉపవాసంగా వెళ్దాం ఓకే? అలా వెళ్తే మంచి జరుగుతుందంట. ఓయ్! ఇప్పుడే ఏడుపు మొహం పెట్టకు. డోంట్ వర్రీ, గుడి కెళ్లడానికి ముందే టిఫన్ రెడీ చేసి, ఫ్లాస్క్ లో కాఫీ వేసిపెడ్తాలే!" నవ్వుతూ అంది రంజని.

"ఓకే"

"గుడి నుంచి ఇంటికొచ్చాక టిఫన్ చేసేసి నువ్వు రెస్ట్ తీసుకో. నేను చకాచక్ వంట చేసేస్తా. మధ్యాన్నం భోంచేసి మ్యాట్నీ షో కెళ్దాం. అట్నుంచి పార్కుకెళ్దాం. వస్తూ వస్తూ నీకిష్టమైన కదంబమ్ హోటల్లో డిన్నర్ చేసేసి వద్దాం. ఏం! ప్రోగ్రాం బావుందా?" అంది రంజని.

"వండర్ఫుల్. అలా చేద్దాం!" అన్నాడు అనంత్.

-----

అనంత్ కు ఆ వాతావరణం కొత్తగా అనిపించింది. గుడిలోకి వచ్చేముందు తలెత్తి రాజగోపురాన్ని చూసాడు.

ఆకాశంతో కబుర్లాడుతున్న ఇత్తడి కళశాన్ని ఏ మేఘం నవ్వించిందో గానీ, తెల్లవారి నీరెండలో ఫళ్ మని మెరిసింది.

ఆ మెరవడాన్ని చూసి "ఓహ్!" అని అసంకల్పితంగా అనుకొన్నాడు అనంత్.

తలెత్తి నిలబడిపోయిన భర్తను చూసి – "వాట్ సర్! ఇదేమీ ఐఫిల్ టవర్ కాదు ఇలా దంగైపోవడానికి. ఏదో మాలాంటి పిచ్చోళ్ళు నమ్మే దేవుడి గోపురం. దట్సాల్!" అంది రంజని.

ఆమెతో బాటూ నవ్వుతూ లోనికి వెళ్లాడు అనంత్.

గర్భగుడి దగ్గర వాళ్ళిద్దరూ దండం పెడుతుంటే ఓవారగా స్థంభానికి ఆనుకొని కూర్చున్న ముసలాయన భక్తి కీర్తన నొకటి పాడుతున్నాడు.

*'దాహామణగిన వెనుక తత్వా మెరిగెదనన్న – దాహమే లణగు, తా తత్వమే మెరుగు?*

*దేహంబు గల అన్ని దినములకును – పదార్థ మోహమే లణగు తా ముదమేల గలుగు?'*

అనంత్ కు పాత జ్ఞాపకమేదో చటక్కున గుర్తుకొచ్చింది. ఎవరి కీర్తనో గుర్తుకు రావడం లేదు గానీ అమ్మ దీన్ని చీటికీ మాటికీ పాడేది. నాన్నగారేమో "ఒసేవ్! నువ్వస్తమానం ఆ పాట పాడుతూ వుండు నీ కొడుకు సన్యాసుల్లో కల్సిపోతాడంతే!" అనడం కూడా గుర్తు.

"కడలుడిపి నీరాడగా తలచు వారలకు – కడలేని మనసుకు – కడమా ఎక్కడిదీ" అని తనూ అందుకుంది రంజని.

"నీకీ పాట వచ్చా?" ఆశ్చర్యంగా అడిగాడు అనంత్.

వస్తున్న పాటలో తన శ్రుతిని కలుపుతూనే "వచ్చు"నన్నట్టుగా తలూపింది రంజని.

"ఎప్పుడూ పాడలేదే?" అన్నాడు అనంత్.

పాడ్డం ఆపేసి – "ఇది నీకూ తెలుసా?" అంది.

"ఈ పాట తెలుసు. అంటే లిరిక్ మొత్తం తెలీదనుకో. అమ్మ పాడేది." అన్నాడు అనంత్.

రంజని "దీన్ని పాట అనరు. కీర్తన అంటారు." అని పైకి అని "అత్తయ్యకి కూడా ఈ కీర్తనంటే ఇష్టమా? నా ఎదుట ఆమె ఈ కీర్తన గురించి మాటవరసకైనా ఎప్పుడూ అనలేదే!" – మనసులోనే అనుకుంది రంజని.

"వాటే ట్రాజెడీ! ఈ పాట నీకు వచ్చని నాకు తెలీదు. అమ్మకీ తెలీదు. తెలిసివుంటే ఇద్దరం కూర్చొని వినేవాళ్ళం." అన్నాడు అనంత్. "ఈ పాట...అదే...అమ్మ పాడే ఈ కీర్తన నాకో సెంటిమెంట్."

"అత్తయ్యకు ఈ పాటంటే ఇష్టమని నాకూ తెలీదు. నువ్వూ ఎప్పుడూ చెప్పలేదు. ఎస్! ఇది ఒక రియల్ ట్రాజెడీ!" అంది రంజని. అనంత్ తల్లి పోయి సంవత్సరం కావొస్తోంది.

తోడు దొంగ దగ్గరే దొంగిలించి దొరికిపోయిన దొంగ పరిస్థితిలా ఉంది ఆ ఇద్దరిదీ.

– – – – –

అనుకున్న ప్రోగ్రాం ప్రకారం సినిమా, హోటెల్లో డిన్నర్ ముగించుకుని ఇల్లు చేరుకున్నారు రంజనీ, అనంత్ లు.

రంజని డ్రస్ మార్చుకుని వచ్చేసరికి, హాల్లో సోఫాలో కూర్చునివున్నాడు అనంత్.

రిమోట్ తో టీవీని ఆన్ చేసి, అతని ప్రక్కనే కూర్చుంది రంజని.

ఐటమ్ సాంగ్ ఏదో వస్తోంది. వెలిగి వెలిగి ఆరుతున్న దీపాలు, పొట్టి పొట్టి డ్రస్సుల్లో పూనకం పట్టినట్టు ఎగురుతున్న అమ్మాయిలు, వాళ్ల దేహాల్లోని వంపుల్ని చూపడమే తన ధర్మమన్నట్టు అటు ఇటూ తిరుగుతున్న కెమరా. వీటన్నింటినీ మించి చెవులను హోరెత్తెస్తున్న మ్యూజిక్.

"నీళ్లు కావాలి! తీసుకొస్తావా? ప్లీజ్" అన్నాడు అనంత్. లేచి వెళ్లింది రంజని.

రంజని నీళ్లు తెచ్చేలోగా టీవీని ఆఫ్ చేసాడు అనంత్.

"ఏం? టీవీ చూడవా?" అంది రంజని.

"ఆ పాట పాడవూ!" అన్నాడు అనంత్.

"కీ..ర్త..న" అని నొక్కి పలికింది రంజని.

"స్..సారీ...కీర్తన పాడవూ!"

అనంత్ చేతికి నీళ్ళ గ్లాస్ ఇచ్చి, క్రింద కూర్చుని అతని తొడపై చేతుల్ని వేసి, ఆ చేతులపై తన తలను పెట్టుకుని...

*"కడలుడిపి నీరాడగ తలచు వారలకు – కడలేని మనసుకు కడమ యెక్కడిది"*

పాడమన్నది ఎవరొ తెలియది–పాడుచున్నది ఏమో తెలియదు–రాగతాళపు రీతి తెలియదు–ఐననూ నే పాడుచుంటి అన్నట్టుగా పాడుతోంది రంజని.

*దాహమణగిన వెనుక తత్వా మెరిగెదనన్న – దాహమే లణగు, తా తత్వమే మెరుగు?*

*దేహంబు గల అన్ని దినములకును – పదార్థ మోహమే లణగు తా ముదమేల గలుగు?*

*ముందరెరిగిన వెనుక మొదలు మరచెదన్న – ముందరేమెరుగు తా మొదలేల మరచు*

*అందముగ తిరువేంకటాద్రీశు మన్ననల – కందు వెరిగిన మేలు కలనైన లేదు"*

నాలుగు గోడల నడుమ ఆమె పాడుతున్నది మిశ్రమోహన రాగమో కాదో తెలీదు! ఆకలేసినవాడికి అన్నం రుచి పట్టదు...గుండె లయ తప్పినవానికి ఏ రాగజ్ఞానమూ వద్దు...సమస్యల ఎడారిలో దిక్కుతెలియనివాడికి ఊరట నివ్వగల గొంతు పలికే అపశ్రుతి కూడా దేవగాంధారమే!

అక్కడున్న నాలుగు గోడలూ, దేవుడి గదిలోని రెండు దీపాలు, నలిగిన మనసొకటి ఆమె పాటలో సేద తీరాయి.

ఆ రేయి అతను, ఆమెలో "శయనేషు మాత"ను చూసాడు.

★ ★ ★ ★ ★

"నీ రెండో ఆటకాయ 'నిష్ఠ'తో కూడి 'తపోలోకా'న్ని చేరింది దేవీ. దీని అర్థమేమిటి?" అడిగాడు కంసచాణురాది దైత్యసంహరణాదక్షుడు.

"నిశ్చలమైన ఏకాగ్రతే నిష్ఠ. దీర్ఘమూ, నిరంతరమూ అయిన ఆలోచనకే 'తపం' అని పేరు. సంసార దుఃఖాల వల్ల కలిగే 'సంతాపం' భగవంతుని ధ్యానాన్ని కలిగిస్తుంది. అదే తపస్సు. ఈ తపస్సు వల్ల తమస్సు తొలగిపోతుంది కదా రఘువంశమౌళీ!" అంది రమాదేవి.

"చాలా బాగా చెప్పావు కమలముఖీ!" అన్నాడు కమలాసనవంద్యుడు.

"మీ రెండో కాయ మాత్సర్యగ్రస్తమైంది. మొదటికాయ తన చిత్తశుద్ధివల్ల మహాలోకాన్ని చేరింది. ఒక్కగడి ప్రక్కనే 'నరకాసురుడు' అడ్డుగా నిలుచున్నాడు. మీ మొదటికాయ తదుపరి నడక ఎలావుండబోతుందన్నది కుతూహలకరమైన ఘటనగా మారింది." అంది శార్ఙ్గపాణిహృదయరాణి.

“చూద్దాం!” అన్నాడు నిర్దోషగుణసాగరుడు.

నారాయణుడు పాచికలు వేస్తే, అవి ఫెళ్ళుమన్న శివుని విల్లుకు కట్టబడ్డ గంటల్లా ఘల్లుమన్నాయి.

★★★★★

“కిమ్ కుర్వన్ ఆసీః (ఏం చేస్తున్నావు)? భవాన్ భీరుః కిమ్? (నీవు భయపడుతున్నావా)” సంస్కృతంలో అడిగాడు శర్మ, సుబ్రహ్మణ్యాన్ని చూస్తూ.

వైదిక విధులతో బాటూ వాడికి సంస్కృతాన్ని కూడా నేర్పుతున్నాడు శర్మ. వాళ్లిద్దరు రోజూ సంస్కృతంలోనే మాట్లాడుకుంటారు. శర్మ నేర్పించినవాటిల్లో సుబ్రహ్మణ్యానికి త్వరగా వంటబట్టింది సంస్కృత సంభాషణమే!

సుబ్రహ్మణ్యం జవాబునివ్వలేదు. ఆ మౌనానికి చిరాకు పడుతూ “ఏతత్ న సాధుః (ఇది బావోలేదు)” అన్నాడు శర్మ.

అక్కడే నిలబడివున్న సుమతి లోనికి వెళ్లబోయింది. “నువ్విక్కడే ఉండు సుమతీ! వెళ్ళకు.” అన్నాడు శర్మ. ఆమె ఆగిపోయింది.

సుబ్రహ్మణ్యం సుమతి వైపు చూసి తలదించుకున్నాడు.

“ఏమండి! తెలుగులో అడగండి....అంటే...నాకు అర్థం కావాలని!” అని నెమ్మదిగా అంది సుమతి.

అలాగేనన్నట్టు తలనూపుతూ “ఏం అబ్బాయ్! ఎందుకలా మాట్లడకుండా ఉన్నావ్? నేనడిగిన దాని గురించి మాట్లాడు.” అన్నాడు. శర్మ.

సుబ్రహ్మణ్యం మౌనంగానే ఉండిపోయాడు. శర్మ ఓపిగ్గా నాలుగైదుసార్లు అడిగిందే అడిగాడు. కానీ సుబ్రహ్మణ్యంలో ఎలాంటి స్పందనా రాలేదు.

’ఛళ్’మని పేలింది సుబ్రహ్మణ్యం దవడ. మరో రెండుసార్లు చెంపలు వాయించాడు శర్మ.

సుమతి నిశ్చేష్టురాలైపోయింది. “అనుకున్నంతా జరిగింది! ఆయన సహనం పోగొట్టుకున్నారు. పుణ్యానికి పోతే పాపమెదురైనట్టుగా అయ్యింది. ఎందుకిలా గుడ్డి మోహాన్ని అంటువేసుకున్నారీయన?” అని పరిపరివిధాలా ఆలోచించసాగింది సుమతి.

నొప్పిని పంటిబిగువులో నొక్కిపెట్టి, సుమతి వైపు చూసాడు సుబ్రహ్మణ్యం. ఆమె ’మాట్లాడ’మన్నట్టు సైగ చేసింది. అంతేకాదు తన రెండు చేతుల్నీ జోడించింది.

సుమతి ముఖంలోని బేలతనం సుబ్రహ్మణ్యంలోని కాష్టమౌనాన్ని దహించింది.

“ఆచార్యా!...” అంటూ ఆగిపోయాడు సుబ్రహ్మణ్యం.

నోరువిప్పి, ఆగిపోయిన సుబ్రహ్మణ్యాన్ని చూస్తూ – “సంకోచః మాస్తు! ఆవశ్యకం చేత్ పృచ్ఛతు!” అని ఆగి, “సంకోచ పడకు, చెప్పదల్చుకున్నదేదో చెప్పు” అన్నాడు శర్మ. మాటలు కరుకుగా లేకపోయినా అతని గొంతులో మెత్తదనం లేదన్నది తెలుస్తోంది.

“ఆచార్యా! అహమ్..దశవారమ్ పఠితవాన్..తథాపి_ _ _నస్మరతి.”

“తెలుగులో చెప్పు.” అన్నాడు శర్మ.

“మీరు చెప్పినదాన్ని ఒకటికి పదిమార్లు చదువుతున్నాను. కానీ గుర్తుండటం లేదు. ఎందుకలా గుర్తుండటం లేదని నాలో నేనే చాలాసార్లు అనుకున్నాను. బహుశా ఈ శాస్త్రం, సాంప్రదాయ పద్ధతుల్లో నాకు ఆసక్తి లేకపోవడం వల్లనేమో అని అనిపించింది.”

అప్పుడు, సుమతి వైపు చూసాడు శర్మ. ఆమె కూడా అతని వైపు చూసింది.

“నువ్వు ఊహించింది నిజమే సుమా!” అన్నట్టుంది శర్మ చూపు.

“దయచేసి, పసివాడిని అర్థం చేసుకోండి!” అని అంటున్నాయి ఆమె కన్నులు.

సుబ్రహ్మణ్యం చెప్పుకు పోతున్నాడు “మా తాతగారు గొప్ప వేదపండితులు. మా నాన్నగారు పెద్ద యూనియన్ లీడర్. వర్కర్స్ కోసం ఎంతో పోరాడారు. పోలీస్ ఫైరింగ్ లో చచ్చిపోయారు. ఆయన

చనిపోవడంతో గవర్నమెంటు కూడా దిగిరావాల్సివచ్చింది. ఇప్పుడు ఆయన ఫోటో కొన్ని వందల వర్కర్స్ ఇళ్ళలో ఉంది. వాళ్ళల్లో ఎంతమంది తమ తల్లిదండ్రుల ఫోటోలను పెట్టుకున్నారో తెలీదు. కానీ మా నాన్నగారి ఫోటోని పెట్టుకొన్నారు. అంతేకాదు, రోజూ దండం పెడతారు. ఈరోజు వాళ్ళ ఉద్యోగాలు నిలబడి, ఇంత అన్నం తింటున్నారంటే మా నాన్నగారు, ఆయనతో పాటూ ఫైరింగ్ లో చనిపోయిన ఇంకొంతమంది లీడర్సే కారణం. మా తాతగారు చనిపోతే బంధువులు తప్పించి ఇంకెవ్వళ్ళూ రాలేదు. అదే నాన్నగారు పోయిన రోజున బైట వూళ్ళ నుండి కూడా జనాలు వచ్చారు. కంటి నిండా నీళ్ళు పెట్టుకొన్నారు. శవాన్ని మోయడానికి పోటీలు పడ్డారు. ఇప్పటికీ యూనియన్ వాళ్ళు నాన్న వర్ధంతి రోజున బీదలకు అన్నదానం చేస్తారు." – తను చెప్పుకుంటూ పోతున్నది ఎదుటివాళ్ళు వింటున్నారో లేదోనన్న అనుమానం వచ్చి ఆగాడు.

ఎదురుగా, ఆ దంపతులిద్దరూ సుబ్రహ్మణ్యం వైపు తదేకంగా చూస్తున్నారు. ఎవరి ముఖంలో ఏ భావం మెదుల్తుందో కనుక్కోలేకపోయాడు సుబ్రహ్మణ్యం. మళ్ళీ కొనసాగించాడు.

"నాకు నాన్నలా బ్రతకాలనివుంది. వీలైనన్ని మంచిపనులు చేసి మంచివాడినని అనిపించుకుని చచ్చిపోవాలని ఉంది. ఈ విషయాలు అమ్మకీ, మామకీ అర్థం కాదు. కాలేదు కూడా. వాళ్ళ తీరే వేరు. ఇలాంటి మంచి ఆలోచనలు కలలో కూడా రానివ్వరు వాళ్ళు." – తను ఇప్పుడన్న మాటలు చాలా ముఖ్యమైనవని, అవి వింటున్నవాళ్ళ మనసుల్లోకి ఇంకాలన్నట్టుగా మళ్ళీ ఆగాడు సుబ్రహ్మణ్యం. వాళ్ళేదైనా చెబుతారేమోనని మౌనం వహించాడు.

ఆ దంపతులనుండి ఎలాంటి ప్రతిస్పందనా రాలేదు.

సుబ్రహ్మణ్యం మళ్ళీ మాట్లాడుతూ "ఆచార్యా! నేను వైదిక విద్యను తప్పుపట్టడం లేదు. పనికిరానిదని అనుకోవడం లేదు. నాకు ఆసక్తి లేదని మాత్రమే చెబుతున్నాను. కనుక నన్ను తప్పుగా అర్థం చేసుకోకండి. నిజానికి మీకు నేనేమీ కాను. ఐనా మీరు నాపై చాలా అభిమానాన్ని పెంచుకొన్నారు. ముఖ్యంగా...' అంటూ సుమతి వైపు చూపిస్తూ "ఆ అమ్మ! మా అమ్మ నన్ను కూలివాడిని చేసింది. ఏరోజుకారోజు నా అన్నాన్ని నన్నే వెదుక్కోమంది. కానీ ఈ అమ్మ నాలాంటి పనికిమాలినవాడిలో

వామనమూర్తిని చూసి, కడుపు నిండా అన్నం పెట్టింది." ఈ మాటల దగ్గర సుబ్రహ్మణ్యం గొంతు వణికింది. నాలుక తడబడింది.

"ఆచార్యా! మీలాంటి మంచివాళ్ళని మోసం చెయ్యడం మహాపాపం. నా మనసులోని మాటల్ని మీకు చెప్పి, మీ ఆశీర్వాదాన్ని పొందితేనే నాకు శుభం జరుగుతుంది. నాకు నచ్చినదాన్ని సాధించే అర్హత కలగాలని మనస్ఫూర్తిగా ఆశీర్వదించండి." అని నేల మీద సాష్టాంగపడి శర్మ కాళ్ళను పట్టుకుని "తత్రహమ్ కిమపి న వదామి (ఇక నేనేమీ మాట్లాడను)" అన్నాడు సుబ్రహ్మణ్యం.

శర్మ ఉన్నచోటు నుండి కదల్లేదు. కళ్ళు గట్టిగా మూసుకుని నిలబడిపోయాడు.

సుమతికి ఆందోళనగా ఉంది. శర్మ భుజాల్ని పట్టుకుని కుదిపింది.

"ఏమండీ! అబ్బాయి చెప్పింది విన్నారుగా. దయచేసి వాణ్ణి కోప్పడకండీ!" అని వణుకుతున్న స్వరంతో మాట్లాడింది సుమతి.

కళ్ళు తెరచిన శర్మ "సుమతీ! వీడే నా కొడుకు అనుకుని తీసుకొచ్చాను. అది వీడు గ్రహించినట్టు లేదు. నా మనసును తెలుసుకునివుంటే 'నేను మీకేమీ కాకపోయినా అభిమానం చూపించా'రని చెప్పేవాడు కాదు. నిజమే! నా పిచ్చి వ్యామోహంలో పడిపోయి వీడిపై అనవసరంగా కోప్పడి కొట్టాను." అంటూ సుబ్రహ్మణ్యంను లేవనెత్తాడు శర్మ.

"చూడు సుబ్రహ్మణ్యం! మీ తాతగారి నిష్క్రమణానికీ, మీ నాన్నగారి దుర్మరణానికీ ఏవో పోలికలు పెట్టి చెప్పావు. అది సరికాదురా! బంగారాన్నీ, వెండినీ విడివిడిగానే చూడాలి గానీ ఒకదానితో ఒకటి పోల్చకూడదు. ఐనా ఇది నీ తప్పు కాదు. నీకింకా అంత ఎదుగుదల రాలేదు. నిన్ను ఇబ్బంది పెట్టను. నీకిష్టమైనదాన్నే చెయ్యి. నీకంతా మంచే జరగాలని కోరుకుంటాను." అన్నాడు శర్మ.

సుబ్రహ్మణ్యం సుమతి కాళ్ళను తాకి నమస్కరించాడు. ఆమె వాడి రెండు భుజాలనూ పట్టుకుని "వెళ్ళిపోతావా?" అని అడిగింది.

శర్మ కొట్టినప్పుడు రాని కన్నీళ్ళు అప్పుడు వచ్చాయి.

మళ్ళీ అడిగింది సుమతి "వెళ్ళిపోతావా?".

సుబ్రహ్మణ్యం ఏదో చెప్పబోతుండగా శర్మ అడ్డుపడి "వాడు చెయ్యాలనుకొన్న పనులేమిటో? ఎలాంటివో? మనలాంటి ఛాదస్తులకు అవి నచ్చుతాయో లేదో! వాడిక్కడే ఉంటూ ఇబ్బంది పడేదాని కంటే నచ్చిన చోటుకెళ్ళి నచ్చినపని చేసుకోనీ సుమతీ!" అన్నాడు.

ఔనన్నట్టు తలవూపాడు సుబ్రహ్మణ్యం.

"అంతేనా సుబ్రహ్మణ్యం?" అంది సుమతి. తలవంచాడా అబ్బాయి.

అతని భుజాల్ని వదిలేసింది సుమతి.

మళ్ళీ రెండు చేతుల్నీ జోడించి ఆ ఇద్దరికీ దండం పెట్టాడు సుబ్రహ్మణ్యం.

"నీ సామాన్లు సర్దుకో. మీ మామ ఇంటి దాకా నేనూ వస్తాను." అన్నాడు శర్మ.

★ ★ ★ ★ ★

సుబ్రహ్మణ్యాన్ని అతని మేనమామ ఇంటి వద్ద విడిచి వెనక్కు వచ్చిన శర్మలో ఉక్రోషం తగ్గలేదని గ్రహించింది సుమతి.

ఆ సాయంత్రం సంధ్యవార్చిన తర్వాత మామూలుగా చేసుకునే పారాయణాన్ని చెయ్యకుండా లేచివెళ్ళిపోయిన భర్తను చూసి కంగారు పడింది సుమతి. రాత్రి భోజనాలయ్యాక అతన్ని కదిపింది.

"వాడిపై మీకింకా కోపం తగ్గలేదా?"

"కోపమా? ఆ ఇంటి దగ్గర దింపేసి వెనక్కి తిరగ్గానే వాణ్ణి మర్చిపోయాను!" అన్నాడు శర్మ.

"సాయంత్రం పారాయణం చెయ్యలేదెందుకు?"

"అంటే? ఏమిటి నీ ఉద్దేశ్యం? ఎవడో పనికిమాలిన వెధవ కోసం ఇలా చేస్తున్నాననా?" కరుకుగా అన్నాడు శర్మ.

“మీ మనసు ఎంత బాధపడివుంటే పారాయణం చెయ్యకుండా ఉండగలరు చెప్పండి?” అంది సుమతి.

ఏదో అనబోయి తమాయించుకున్నాడు శర్మ.

ఏవైనా ఆధ్యాత్మిక విషయాలను అడిగితే భర్త ధ్యాస మరలవచ్చునన్న నమ్మకంతో “సుబ్రహ్మణ్యం తాతగారు నిష్క్రమించారని అన్నారు. అంటే అది మామూలు మరణం కాదా?” అని అడిగింది సుమతి.

“అవును. వాడి మట్టిబుర్రకు అవేం తెలుస్తాయి?” అన్నాడు శర్మ.

“వాడి సంగతి వదిలేయండి. నా ప్రశ్నకు సమాధానం చెప్పండి.”

“సుమతీ! సుబ్రహ్మణ్యం తాతగారు గొప్ప పండితులే కాదు గొప్ప యోగి కూడా. ఆయన బ్రహ్మరంధ్రాన్ని ఛేదించి పోయారు. అంతేగానీ సామాన్యుల్లాగా నవరంధ్రాలనుండి ప్రాణం పొగొట్టుకొని చనిపోలేదు.”

“అంటే చావన్నది అందిరికీ ఒకేరకంగా రాదా?”

“పిచ్చిదానా! పంచ భేదయుతం ప్రపంచం. ప్రపంచం అన్న పదానికి ఐదు భేదాలతో కూడిందని అర్థం. ప్రపంచంలోనివన్నీ వైవిధ్యమయాలే. ప్రతి ఒక్కటీ తనకు తానుగా ప్రత్యేకమైనదే. చూడ్డానికి ఒకే విధంగా కనబడే వస్తువుల్లో కూడా తేడాలుంటాయి. ఒక వ్యక్తి చేతిలోని వేళ్ళే ఒకదానికొకటి పోలిక లేకుండా ఉన్నప్పుడు, ఒక మనిషికీ మరో మనిషికీ తేడా ఉండదా? ఆ వేలి ముద్రల్లో అంతటి ప్రత్యేకత లేకపోతే ఈనాటి పోలీసులు నేరస్తుల్ని సులువుగా పట్టుకునేవారా?” అన్నాడు శర్మ.

భర్త నెమ్మదిగా తన సహజధోరణిలోకి వస్తుండడం చూసిన సుమతి చర్చను కొనసాగించాలని అనుకుని “మీరు చెప్పింది అర్థమైంది. కానీ సులభమైన ఉదాహారణ ఇస్తే ఇంకా బాగా అర్థమౌతుందండి!” అని అంది.

“ఇంకా సులభమైన ఉదాహరణంటే.....ఆ(...నువ్వు తిరగమాత వేసేప్పుడు వేడినూనెలో ఆవాలు వేస్తే ఏమౌతుంది?”

“అవి చిటపటమంటాయి!”

“ఆవాలు చూసేందుకు ఒకేలా ఉన్నా, నూనెలో వేసిన తర్వాత ఒకేసారి ’చిట్’ మని వేగవు. ఎందుకు?”

“అమ్మయోయ్! తాళింపు వెయ్యడమేగానీ తత్వం వెలికితీయడం తెలీదు నాకు!” అంది సుమతి, కళ్ళను పెద్దవిగా చేసి.

ఫక్కున నవ్వాడు శర్మ. “చేసే ప్రతి పనిలోనూ భగవంతుని సృష్టి విచిత్రాలను చూడాలి. అప్పుడే తత్వం తెలిసివస్తుంది.”

“ఇక నుండి అలానే ప్రయత్నిస్తాను. కానీ ఈ ఆవాల చిక్కుప్రశ్నకు జవాబు త్వరగా చెప్పేయండీ. చూసేందుకు ఒక్కలానే ఉన్న ఆవాలు ఒక్కొక్కటి ఒక్కోసారి చిటపటమని వేగుతాయెందుకు?” అంది సుమతి.

“మరేం లేదు. సైన్స్ ప్రకారమైతే ఆవాల్లోని ఒక్కో కణం యొక్క సాంద్రత అంటే డెన్సిటీ ఒక్కోరకంగా ఉండడం వల్ల అవి వేరువేరు సమయాల్లో వేగుతాయి. అంటే కంటికి ఒకేరకంగా కనబడుతున్న పదార్థాల్లో, కంటికి కనబడని సూక్ష్మమైన తేడాలుంటాయన్న మాట. ఆ తేడాల వల్ల ఒకే పదార్థంలోని వివిధ కణాలు లేక భాగాలు ఒక్కోరకంగా ప్రవర్తిస్తాయి. ఇదే వైవిధ్యమంటే. ఈవిధంగానే ప్రతి మనిషిలోనూ అవయవాలు ఒకేరకంగా ఉంటాయి. కానీ ఈ అవయవాల్ని నడిపే ’బుద్ధి’ ఒకేరకంగా ఉండదు. అందువల్ల ఆయా వ్యక్తులు చేసే చర్యలు వేరు వేరుగా ఉంటాయి. ఆ చర్యల వల్ల కలిగే ఫలాలు కూడా వేరుగా ఉంటాయి.” అన్నాడు శర్మ.

“ఆవాల్లో ఇంత ఆంతర్యముందన్న మాట. చాలా బావుంది. ’బుద్ధి’లో తేడాలుంటాయన్నారు. అది ఎందుకు? ఆ తేడాలు ఎలా వస్తాయి?” అంది సుమతి.

“నీకు నిద్ర రావడం లేదా?” అన్నాడు శర్మ. లేదన్నట్టు తల తిప్పింది సుమతి.

“సరే! విను! ’లోకే యథాన్నం భుంజతే తథా బుద్ధి ప్రజాయతే’. లోకంలో ఎలాంటి పదార్థాల్ని తింటారో అలాంటి బుద్ధి పుడుతుందని శాస్త్రవచనం. మనం తినే పదార్థాలు కడుపులోకి వెళ్ళాక

నాలుగు రకాలుగా జీర్ణం కాబడతాయి. అందులో ఒకభాగం మాంసవృద్ధికి, ఒకభాగం రక్తవృద్ధికి, ఒకభాగం ఎముకలు బలపడ్డానికీ వాడబడతాయి. నాలుగోభాగం మనసుగా మారుతుంది. మనసులోని ఏ భాగంలో 'నిర్ణయ శక్తి' అంటే డెసిషన్ మేకింగ్ కెపాసిటీ ఉంటుందో దాన్ని బుద్ధి అంటారు. అందుకనే మనమేదైనా వెర్రి పనులు చేస్తే 'బుద్ధి లేదా' అని పెద్దలు తిడతారు. 'మనసు లేదా' అని తిట్టరు!"

"ఓహో...బుద్ధిలేదా అని అనడంలోని అసలు సంగతి ఇదా?" అంది సుమతి.

"ఈ బుద్ధిశక్తి వల్లనే మానవుడు ఇతర జంతువుల కంటే ఉన్నత స్థానంలో ఉన్నాడు. ఈ శక్తి తినే ఆహారం వల్ల వస్తోంది. అందుకనే శుద్ధమైన ఆహారాన్ని తినమని పెద్దలు చెబుతారు. రుచిని కలిగిన పదార్థాలన్నీ మన బుద్ధికి మేలు చేసేవిగా ఉండవు. అందుకనే హితంగానూ, మితంగానూ తినమని పెద్దలు చెప్పారు. ఎప్పుడైతే బుద్ధికి ఉపయోగపడే ఆహారాన్ని తీసుకోక, కేవలం నాలుకను తృప్తి పరిచే ఆహారాన్ని తీసుకుంటారో అప్పుడు ఆ వ్యక్తుల్లోని బుద్ధిశక్తి మందగిస్తుంది. అది అర్థంలేని పనులను చేయడానికి కారణమౌతుంది. దాని వల్ల వ్యక్తి నష్టపోవడమే కాకుండా సమాజం కూడా దెబ్బతింటుంది." అన్నాడు శర్మ.

"తెలుసుకుంటే ఎన్ని సూక్ష్మ విషయాలున్నాయో!" అంది సుమతి.

"అవును. ఓ యాభై ఏళ్ల క్రితం కూడా వడ్లు మొదలైనవి దంచేప్పుడు సువ్వి పాటలో, ఆహూఊహూ పదాలో పాడుకుంటూ పని చేసేవారు. ఆ పాటల్లో భగవంతుని లీలల్ని పొందుపరిచి పాడుకునేవారు."

"ఎందుకు?" అంది సుమతి.

"ఎందుకంటే ఆ ఆహారాన్ని తినడంలోనే కాదు వండడంలో కూడా బుద్ధి యొక్క ప్రభావముంటుంది. చెడ్డ ఆలోచనలను చేస్తూ వండితే, ఆ ఆహారం కూడా దోషమయంగా ఉంటుంది." అన్నాడు శర్మ.

"ఐతే నాలోనే ఏదో దోషం జరిగింది." అంది సుమతి.

అర్థంకానట్టు ఆగాడు శర్మ. "ఏమన్నావ్?"

“నా లోనే ఏదో పెద్ద తప్పు జరిగివుండాలి! నా బుద్ధిలో ఏదో చెడు ఆలోచన జరిగివుంటుంది! లేకపోతే ఎప్పుడూ శాంతంగా ఉండే మీరు సుబ్రహ్మణ్యాన్ని కొడతారా? ఈరోజు పారాయణం కూడా చెయ్యకుండా ఉంటారా?” – తనలో తాను మాట్లాడుకుంటున్నట్టుగా అంది సుమతి.

సుమతి చెప్పినదాన్ని పూర్తిగా అర్థం చేసుకోగానే తొట్రుబాటుకు లోనయ్యాడు శర్మ.

తను చేసిన అవివేకపు పనికి ఆమె జవాబ్దారీ వహిస్తున్నట్టుగా మాట్లాడ్డం చూసిన శర్మకు తాను చాలా అల్పుడైపోయినట్టుగా అనిపించింది. అలా అనిపించడంలో అతనికి అవమానమనిపించలేదు.

సుమతి చేతుల్ని తన చేతుల్లోకి తీసుకున్నాడు శర్మ.

“అంతేకదండీ! లేకపోతే మీరు అకారణంగా అలా కోప్పడేవారా? సుబ్రహ్మణ్యాన్ని కొట్టేవారా?” అంది.

ఆమె గొంతులోని సహజమైన ఆర్ద్రతకు, సౌశీల్యానికి విచలతిమైపోయింది శర్మ మనసు.

“ఎప్పుడూ పక్కవారిలో తప్పుల్నే వెదికే ఈలోకంలో ఇలా లేని తప్పుల్ని తమ మీద వేసుకునే సచ్ఛీలురుంటారన్న నమ్మకం...ఇదిగో...ఈక్షణంలో పుట్టింది. ఈ పాఠం నేర్పడానికేనా భగవంతుడు నాకా వెర్రి ఆవేశాన్ని ఇచ్చింది? నన్ను దిద్దడానికేనా ఆ అమాయకుణ్ణి కొట్టించింది? భగవాన్! ఈ పాఠం చాలయ్యా! మరో వేయి జన్మలకైన మర్చిపోలేని విధంగా చెప్పించావు.” –అహం బుద్ధిలో లయమై, ఆ బుద్ధి చిత్తంతో చేరితే, శర్మ మనసు నిర్మలమై, నిరహంకారభూషితమైంది.

జ్ఞానోపార్జన కేవలం కర్మల వల్లనే లభించదు. స్థిరమైన మనసు ఉన్ననాడు ఎలాంటి అధ్యయనం లేకుండగానే ఆత్మతత్వం బోధపడుతుంది. ఇప్పుడు తన ఎదురుగా కూర్చున్నది కేవలం ఒక భార్య కాదు. అన్ని రంగుల్నీ తనలో ఐక్యం చేసుకున్నా తన స్వచ్ఛతను కోల్పోని తెలుపు రంగులా వెలుగుతున్న ఒకానొక ఆత్మసౌందర్యం. ఈమె అధ్యయనం చెయ్యలేదు! యాగయజ్ఞాలూ చెయ్యలేదు! జటాధ్యాయి కాదు! ఘనాపాఠీ కాదు! పురాణాలను ఔపోసన పట్టలేదు! ఉపనిషత్తులెన్నున్నాయో తెలీదు! కానీ త్రిమూర్తుల్ని పసిపాపలను చేసిన అనసూయలా అహమ్, విద్యామదం, కేవల కర్మనిష్ఠత్వమనే మూడు

అవగుణాలతో బాధపడుతున్న తనను పసిపాపను చేసి అసూయారహితమైన మనసును సాధించిన ఒక యోగి!

"ఏమండీ! అంతే కదూ! చెప్పండి?" అన్న సుమతి మాటలతో ఈలోకానికి వచ్చాడు శర్మ.

"కాదు సుమతీ! తప్పు నీది కాదు. విద్యాగార్ధభః అన్నట్టు అన్నీ తెలుసునన్న అహంకారంతో అవివేకంగా మాట్లాడిన నాదీ తప్పు. నీలో స్వచ్ఛత లేకపోతే నేను ఏమైపోయేవాణ్ణో? నాలోని అవివేకానికి నేనే కారణం. ఇక ఈ విషయమై ఏమీ మాట్లాడకు." అన్నాడు శర్మ.

"నా తప్పేమీ..." ఇంకా ఏదో అనబోతున్న సుమతి నోటిని తన చేత్తో మూసాడు శర్మ.

★ ★ ★ ★ ★

"అద్భుతం మహాభాగా! మీ మొదటికాయ నరకాసురుడిని దాటి మయూరమైంది." అంది మహిషాసురమర్దిని.

నవ్వాడు నారాయణుడు.

"మీ మొదటి కాయ చేరిన నూటఎనిమిదవ గడిలో నెమలి ఉంది. దాని తాత్పర్యమేమిటి స్వామీ?" అని అడిగింది సౌశీల్యగుణమణి.

"నీ మనసులోని మాటను చెప్పు దేవీ. ఆపై నేను చెబుతాను." అన్నాడు అవ్యయుడు.

"చిత్తం స్వామీ! నా బుద్ధికి గోచరమైనంత వరకూ వివరిస్తాను. కార్తికేయుని వాహనం నెమలి. కార్తికేయుడు మన్మథుని మరో అవతారం. మన్మథుని వాహనం చిలుక. అంటే మానవుల మనస్సులలో కామాన్ని ప్రేరేపించి, మనస్సును మథించే మన్మథుడు తన రెండు రూపాలలోనూ వర్ణప్రధానమైన జంతువుల్ని వాహనాలుగా చేసుకున్నాడు. దీన్నిబట్టి అర్థమయ్యేదేమిటంటే, మానవుల మనస్సు రంగుల యొక్క హంగులకు త్వరగా బానిసైపోతుంది. ఏ వస్తువైనా కంటికింపైన వర్ణాల్లో వెలుగుతుంటే చాలు, మానవులు ఇట్టే ఆకర్షింపబడతారు. ఎలాగైతే దీపపు వెలుగుకు ఆకర్షితమైన శలభం ఆ రంగుకు

భ్రమపడి, వెళ్ళి కాలిపోతుందో అదే విధంగానే మానవులు కూడా రంగుల ఆకర్షణలకు లోబడి తమ జీవితాలను వ్యర్థం చేసుకుంటారు. జీవితమనే నాణ్యానికి ఇది ఒక వైపు.

మరోవైపు చూస్తే, కార్తికేయుడు దేవతలకు సైన్యాధిపతి. తారకాసురుడు వంటి బలిష్టుడైన రాక్షసుణ్ణి చంపినవాడు. తారకం అన్న పదానికి అర్థం దాటించేది అని. కొన్ని కొన్ని విషయాలు మనల్ని తీరాన్ని దాటించేవిగా కనబడుతుంటాయి కానీ వాటిల్లో అంతర్లీనంగా చెడ్డతనం దాగివుంటుంది. అలాంటి అసురభావంతో కూడిన విషయాలను చంపేవాడు సుబ్రహ్మణ్యుడు. అలాంటి కార్తికేయుడు, ఆకర్షణకు నిదర్శనమైన నెమలిని తన వాహనంగా చేసుకున్నాడు. ఆవిధంగా మానవులు కూడా ఆకర్షణలను త్రొక్కివేసి, ఆధ్యాత్మికానందానికి అడ్డుతగిలే తారకాసురుల్ని వధించి, భూలోకంలో భగవంతుని సైన్యాధిపత్యాన్ని వహించాలి." అంది జ్ఞానసుగంధ సుందరి.

"బాగు బాగు!" అన్నాడు భాగవతజనప్రియుడు.

"మీ తత్త్వ విమర్శన కోసం ఎదురుచూస్తున్నాను ఆర్యా!" అంది జనకప్రియనందన.

"దేవీ! విను! నెమలిలోని ప్రధాన ఆకర్షణ దాని నృత్యం. ఆ నృత్యానికి వన్నె తెచ్చేది దాని పింఛం. ఎక్కడో అడవిలో వాన కురవబోతున్న సమయంలోనో లేక ఆడ నెమలిని ఆకర్షించే నిమిత్తంగానో మగ నెమలి తన పింఛాన్ని విరబూయిస్తుంది.  ఆడ నెమలితో జరగబోయే సంయోగాన్ని తలచుకుని తలచుకుని నర్తిస్తుంది. ఈ నాట్యం మగ నెమలి ఇష్టానుసారమే జరుగుతుంది గానీ మానవులు కోరినప్పుడు జరుగదు. అలానే ఒకానొక 'కామా'నికి లోబడిన మానవుని మనసు ఆ కామఫలాన్ని తలచుకుని తలచుకుని అందులోనే తల్లీనతని పొందుతుంది. మరులుగొన్న మనసులో విపరీతమైన ఆశలు పురులు విప్పుతాయి. ఆ సంరంభంలో మానవుని మనసు చాలాసార్లు విచక్షణను కోల్పోతుంది." అన్నాడు నారాయణుడు.

"అందమైన నెమలిపింఛం వెనుక ఇంత నిర్వేదమున్నదా స్వామీ?" అంది శతపత్రజాత.

“నీ మాటలను వింటుంటే ఆ పక్షిపై నీకు అమితమైన ప్రేమ ఏర్పడినట్టుంది!” అన్నాడు మురళీగానలోలుడు.

“మీకు మాత్రం ప్రేమ లేదంటారా శిఖిపింఛమౌళీ?” అంది రుక్మిణి.

హాయిగా నవ్వాడు హయముఖుడు.

“నిజమే దేవీ! నెమలిపింఛంలో మరో వింత దాగుంది. నెమలి తన పురిని ముడుచుకున్నప్పుడు అందులోని అందం ఎవరికీ తెలిసిరాదు. వర్షాకాలంలోనో, ఆడ నెమలి సాంగత్య సంభ్రమతోనో లేక తనకు తాను రక్షణను కల్పించుకోవడానికో నెమలి పురిని విప్పినపుడు ఆ అందం అందరికీ అవగతమౌతుంది. అలానే, మానవులు మంచివారిని రోజూ చూస్తూనేవుంటారు. కానీ మంచితనాన్ని వెంటనే తెలుసుకోలేకపోతారు. తాము కష్టాల్లో ఉన్నప్పుడు, ఐనవారందరూ ఒంటరిగా వదిలి వెళ్ళినపుడు, ఆ మంచివారి దయాగుణాన్ని చవిచూస్తారు. అప్పటిదాకా చాలా సాధారణంగా కనబడిన ఆ వ్యక్తుల్లోని ఉన్నతమైన వ్యక్తిత్వాన్ని తెలుసుకుంటారు. పురివిప్పిన నెమలి, పొరలు తొలగిన మనసు ఒకేవిధంగా ఆకర్షిస్తాయి. ఆహ్లాదాన్ని కలిగిస్తాయి.”

“ఆహా! చక్కటి ఉపదేశం స్వామీ.”

“మరి నీ మొదటి ఆటకాయను నడుపు!” అన్నాడు భక్తవశ్యుడు.

“ఆజ్ఞ” అంది ఆశ్రితజనపావని.

అమ్మ పాచికల్ని వేస్తే చిన్నికృష్ణుని సిరిమువ్వల్లా ఘల్లుమన్నాయి.

★ ★ ★ ★ ★

ప్రాజెక్ట్ సక్సెస్ మీట్ జోరుగా సాగుతోంది.

అరవింద్, రంజని తమ టీమ్ సభ్యులతో హడావుడిగా తిరుగుతూ, మాట్లాడుతున్నారు.

పెద్ద హోటల్లోని ఆ బాంక్వెట్ హాల్లో పదిహైదుమంది దాకా యువతీయువకులు తమ పిచ్చాపాటితో హోరెత్తిస్తున్నారు. సన్నగా వినబడుతున్న పాశ్చాత్య సంగీతం ఆ మాటల జోరుకు దరువు వేస్తోంది.

"గైస్ అండ్ గాళ్స్! లిజన్ టు మీ ప్లీజ్..." మైక్ లో గట్టిగా అరిచాడు అరవింద్.

మాటలు సద్దుమణిగి గుసగుసలుగా మారాయి.

అంతా నిశ్శబ్దంగా ఉందనుకున్న తర్వాత మళ్ళీ మైక్ చేతిలోకి తీసుకున్నాడు అరవింద్ "డియర్ కొలీగ్స్! ఈరోజు మనమెంతో హ్యాపీగా సెలబ్రేట్ చేసుకొంటున్న ఈ అకేషన్ మన బిజినెస్ డెవలప్మెంట్ టీమ్ చెప్పిందాని ప్రకారం మనకు వచ్చేది కాదు. బట్, మన బి.డి. టీమ్ ఎఫర్ట్స్ వల్ల అది మనకు వచ్చింది. వుయ్ ఆర్ ఎక్స్పెక్టెడ్ టు డు దిస్ అట్ ఏ వెరీ లో కాస్ట్. మీకందరికీ తెలుసు టైమ్ ఈజ్ మనీ! సో, ప్రాజెక్ట్ డెలివరి తక్కువ టైమ్ లో చెయ్యగలిగితేనే మన బి.డి టీమ్ కోట్ చేసిన కాస్ట్ తో మ్యాచ్ అవుతుంది. దట్స్ హౌ అవర్ రేస్ అగేన్స్ట్ టైమ్ హాజ్ స్టార్టెడ్. ఇది చెయ్యగలమా లేదా అన్న నా డౌట్స్ ను క్లీన్ బౌల్డ్ చేస్తూ మీరంతా పని చేసారు. ఐ యామ్ థాంక్ఫుల్ టు యూ ఆల్! ఇక్కడ మనం కొంతమంది టీమ్ మెంబర్స్ ని స్పెషల్గా అప్రీషియేట్ చెయ్యాలి. ఎందుకంటే వాళ్ళు హ్యాండిల్ చేసిన మాడ్యుల్స్ అంత క్రిటికల్ కాబట్టి. ఐ ఫస్ట్ ఇన్వైట్ రంజని టు షేర్ హర్ ఫీలింగ్స్ అండ్ ఎక్స్పీరియెన్సెస్. రంజనీ...ప్లీజ్..." అంటూ మైక్ ను ముందుకు చాచాడు అరవింద్.

రంజని లేచి మైక్ ను అందుకుంది. అక్కడ కూర్చున్నవాళ్ళందరినీ ఒకసారి కలయజూసి మాట్లాడ్డం మొదలుపెట్టింది.

"ఫ్రెండ్స్! ఈ అప్రీషియేషన్ ఎట్సెట్రా ఆర్ ద కైండ్ జస్చర్స్ ఆఫ్ ది మేనేజ్మెంట్. ఆక్చువలీ, నేను నా డ్యూటీని చేసాను. కాబట్టి నాకిచ్చిన మాడ్యూల్లో నేనేదో మిరాకల్స్ చేసానని చెప్పను. బట్, ఐ మస్ట్ షేర్ అ రేర్ ఎక్స్పీరియన్స్, ఎ డివైన్ ఎక్స్పోజర్. ఈ ప్రాజెక్ట్ లో నేనేమైనా మంచిపని చెయ్యగలిగానంటే, అది నావల్ల జరిగింది కాదు. దేర్ ఈజ్ ఏ హిడెన్ మోటివేషన్! ఇట్ ఈజ్ యాన్ అన్ డిసైఫరబుల్ డివైన్ స్క్రిప్ట్ విచ్ మేడ్ మీ టు డు మై డ్యూటీ." అని ఆగింది రంజని.

ఆమె మాట్లాడ్డానికి లేచినిలబడినప్పుడు ఉన్న చిన్నాచితకా శబ్దాలు కూడా తమ అస్తిత్వాన్ని మర్చిపోయాయేమో! అందరిలోనూ ఏదో తెలియని ఉత్సుకత చెలరేగిందేమో! ఓ గురుకులంలో ఓ గొప్ప గురువుగారు ఇవ్వబోతున్న మహత్తర ఉపదేశాన్ని వినడానికి కూర్చున్న శిష్యుల్లా అక్కడున్న వాళ్ళందరూ...

"నా జీవితంలో ఇప్పటిదాకా నాలుగైదు ట్రాజెడీలు జరిగాయి. ఆరు నెలల వెనక జరిగిన అబార్షన్ వాటిలో అన్నిటికంటే గొప్ప విషాదం. అబార్షన్ ఐన రోజు నేనున్న పరిస్థితిని, ఇప్పుడున్న పరిస్థితిని తల్చుకొంటే నిజంగా ఆశ్చర్యమేస్తుంది. ఆరోజు నాలో చచ్చిపోవాలన్న కోరిక ఉక్కిరిబిక్కిరి చేసింది. కానీ ఈరోజు ఏదో సాధించాలని, దానికోసం బ్రతికి తీరాలనే కోరిక బలంగా ఉంది. నాలోని ఈ గొప్ప మార్పుకు కారణం మీరెవరైనా ఊహించగలరా?" అని అందరినీ అడిగింది రంజని.

మధ్యవరుసలోని ఓ అబ్బాయి చెయ్యి పైకెత్తాడు.

"ఎస్ ప్లీజ్" అని అంది రంజని.

"శివ్ ఖేరా ఆర్ యండమూరి రాసిన పర్సనాలిటీ డెవెలప్మెంట్ బుక్స్ చదివుంటారు." అన్నాడు.

"నో!" నవ్వుతూ అంది రంజని.

మరో అమ్మాయి లేచి "మేడమ్! మే బీ యూ వుడ్ హావ్ గాన్ ఫర్ సమ్ కైండాఫ్ కౌన్సిలింగ్?" అంది.

కాదన్నట్టు అడ్డంగా తలనూపింది రంజని.

ఇంకో అమ్మాయి లేచి "ఐ థింక్ యూ వుడ్ హావ్ జాన్డ్ సుదర్శన్ క్రియా కోర్స్ ఆర్ రాజయోగ కోర్స్!" అంది.

"నో" అంది రంజని.

"ఐ గెస్ ...నీ భర్త, తల్లిదండ్రులు, ఫ్రెండ్స్ వగైరా వగైరాలు ఎంతో సపోర్ట్ చేసుంటారు?" అన్నాడు అరవింద్.

నోటికి చెయ్యి అడ్డుపెట్టుకుని నవ్వుతూ కాదన్నట్టు తలూపింది రంజని.

దాంతో అరవింద్ చేతుల్ని పైకెత్తి "వుయ్ హావ్ లాస్ట్..." అన్నాడు. మిగిలినవారందరూ "యా..." అని కోరస్ గా అరిచారు.

"ఓకే! ఓకే! నా మార్పుకు అసలు కారణం ఓ అపరిచిత వ్యక్తి. వన్ కంప్లీట్ స్ట్రేంజర్! అండ్ దట్ టూ ఏ థర్టీ టూ యియర్స్ ఓల్డ్ లేడీ. " అని ఆగింది రంజని.

"ఓ"..."ఓహ్"..."ఊప్స్"..."ఓ గాడ్" అనే రకరకాల ఆశ్చర్యార్థక పదాలు ఒక్కసారిగా గొల్లుమన్నాయి ఆ గదిలో.

అరవింద్ లేచి "ష్...ష్...సైలెన్స్ ప్లీజ్" అని రంజని వైపుకు తిరిగి "ఇది చాలా ఇంట్రెస్టింగ్గా వుంది. కంటిన్యూ ప్లీజ్" అని చెప్పి కూర్చున్నాడు.

"హాస్పిటల్ నుంచి ఇంటికి వచ్చేసాక దాదాపు ఇరవైరోజులు ఇంట్లోనే ఉండిపోయాను. నా భర్త నాతోనే ఉన్నా కూడా ఇద్దరి మధ్యా ఏదో గ్యాప్. ఏదో ఒంటరితనం. సో, ఆ ఫీలింగ్ ను పోగొట్టుకోవాలని నేను గుడికెళ్ళాను. అదీ తెల్లవారుజామునే వెళ్ళాను. దర్శనం చేసుకొనివచ్చి అక్కడున్న లాన్ లో కూర్చున్నప్పుడు....ఐ మెట్ దట్ లేడి. ఆమెను ఒక్క వర్డ్ లో వర్ణించాలంటే...ఇన్నోసెన్స్ పెర్సానిఫైడ్. అలాంటి అందమైన అమాయకత్వాన్ని మనం చాలా అరుదుగా చూడగలం. ఆమెతో నేను దాదాపు గంటకు పైగానే స్పెండ్ చేసాను. నా లైఫ్ లో మొట్టమొదటిసారిగా ఒక వ్యక్తికి పూర్తిగా సరెండరైపోయి, నోరు మూసుకొన్నది ఆ టైమ్ లోనే. ఆమె సింప్లిసిటీలో అంత పవర్ ఉంది. ఆమె ఎన్నో కొత్త విషయాల్ని చెప్పింది...."

"వోవ్! వాటార్ దోస్ న్యూ థింగ్స్?" అంటూ అడ్డు తగిలాడు అరవింద్.

"ఆమె కొన్ని పురాణ కథల్ని, సంస్కృత సుభాషితాల్ని, ఇంకెన్నో మంచి మంచి మాటల్నీ చెప్పింది." అంది రంజని.

గొల్లుమని నవ్వాడు అరవింద్. అంతటితో ఆగక గట్టిగా చప్పట్లు కూడా కొట్టసాగాడు. చాలామంది అతనితో శ్రుతి కలిపారు. రంజని వాళ్ళ నవ్వులు సాగినంతసేపూ మౌనంగా ఉండిపోయింది. ఆమె పెదవులపై కూడా చిన్ని నవ్వు మెరుస్తూ ఉండింది.

"పు....పురాణ కథలా? ఆ పాత చింతకాయపచ్చడిని కొత్త విషయాలంటావా?" ఆయాస పడ్తూ అడిగాడు అరవింద్.

"వెల్....నీకు పెళ్ళై ఎన్నేళ్లైంది అరవింద్?" అని అడిగి, వెంటనే "ఫర్గివ్ మీ ఫర్ ఆస్కింగ్ ఎబౌట్ పర్సనల్ మ్యాటర్" అని సన్నాయి నొక్కులా చెప్పింది రంజని.

"వెల్....ఫోర్టీన్ యియర్స్." అన్నాడు అరవింద్, రంజనిని అనుకరిస్తూ.

"ఐతే నీ భార్యకు నువ్విప్పుడు పాత చింతకాయపచ్చడే ఐవుండాలి!" అంది రంజని. అలా అంటూ అంటూనే కన్ను కూడా గీటింది.

కుర్చీలో సర్దుకుని కూర్చున్నాడు అరవింద్. "ఐ గెస్ నాట్" అన్నాడు గట్టిగా.

విశాలంగా నవ్వింది రంజని. "గెస్సింగ్ ఎందుకు అరవింద్. సే కాన్ఫిడెంట్లీ!" అంది రంజని.

కొద్దిగా ఇబ్బందిపడినట్టు మొహం పెట్టి "ఇంతకీ నువ్వు అనదల్చుకున్నదేమిటి రంజని?" అన్నాడు అరవింద్.

"భర్తకు భార్య, భార్యకు భర్త పాత చింతకాయపచ్చడైపోయామో లేదోనన్న విషయాన్నే కనిపెట్టలేనప్పుడు, మనకు అర్థం కానివాటిల్ని, మనకు పూర్తిగా తెలియని వాటిల్ని పాత చింతకాయపచ్చడి కింద కొట్టిపారేయడం సరైన పనా? అరవింద్, ఐ వెరీ సారీ ఫర్ వాటెవర్ ఐ హావ్ ఆస్క్డ్ యూ. ఈ పాయింట్ ను ప్రూవ్ చెయ్యడానికే అలా అడిగాను. నో అదర్ మాలిషియస్ ఇంటెన్షన్ ఇన్ ఆస్కింగ్ సో." అంది రంజని.

"పాయింట్ వెల్ టేకెన్." అని కుడి బొటనవేలిని పైకెత్తి చూపాడు అరవింద్.

“ఫ్రెండ్స్! నేను నా మదర్ హుడ్ ను పోగొట్టుకున్న రోజుల్లో దాన్ని తిరిగి పొందుతానో లేదోనన్న టెన్షన్ తో పిచ్చిపట్టేది. బట్ థాంక్స్ టు పావని అండ్ స్టెల్లా. వాళ్ళు నాలో ఓ అమ్మని చూసారట. మొన్నో రోజున నా హబ్బీ చాలా విచారంగా ఉంటే ఓ అన్నమాచార్య కీర్తన పాడాను. దాంతో ఆయన కూడా నాలో వాళ్ళ అమ్మని చూసారట! ఇవన్నీ నా వరకూ వండర్ఫుల్ ఎక్స్పీరియన్సెస్. పోగొట్టుకొన్నదాన్ని, వితౌట్ ఎనీ ఎఫర్ట్, పొందడం ఎవరికైనా వండర్ఫుల్లేననుకొంటాను. ఇలాంటి వండర్ ను నాకు మొదటిసారిగా చెప్పిన వ్యక్తి ఆ అన్నోన్ ఇన్నొసెంట్ లేడీ. షీ ఈజ్ మై రోల్ మోడెల్. ఈరోజు నేనేమైనా సాధించివుంటే ఆ క్రెడిట్టంతా ఆమెకే చెందుతుంది. ఐ డోంట్ వాంటు బోర్ యూ విత్ మై స్టోరీస్. బట్...ఒక్క విషయం. మీరందరూ జీవితంలో ప్రోగ్రెస్ కావాలంటే యూ మస్ట్ స్టడీ అవర్ ఏన్షియంట్ లిటరేచర్. మన శతకాలు, వేమన పద్యాలు, కీర్తనలు అండ్ జానపద గీతాలు...అదే ఫోక్ సాంగ్స్. వీటిల్లోని ఒక్కో అక్షరంలో మీ తలరాతను మార్చగలిగే పవర్ఫుల్ ఆల్గోరిథమ్స్ దాగున్నాయి. సో, ప్లీజ్ రీడ్ దెమ్ అండ్ డిజైన్ యువర్ లైఫ్. థాంక్స్!” అంటూ మైక్ ను టేబుల్ పైపెట్టి తన కుర్చీ వైపుకు వెళ్లబోయింది రంజని.

“ఎక్స్ క్యూజ్ మీ మేమ్! ఇంతకీ ఆ లేడీ ఎవరో, ఎక్కడుంటారో చెప్పండి.” అంటూ అడిగాడో కుర్రవాడు.

“ఆమె ఎవరో, ఎక్కడుంటారో, ఏం చదివారో నాకు తెలీదు.” అంది రంజని.

“ఓహ్...దెన్...మిమ్మల్ని అంతగా ఇన్స్పైర్ చేసిన ఆమె గురించి యూ డోంట్ నో ఎనీ థింగ్?” అన్నాడా కుర్రవాడు.

“వెల్...ఆమె పర్సనల్ డీటైల్స్ ఏవీ తెలియకపోవడం నాకు బాధ కలిగించే విషయమే. కనీసం ఫోన్ నెంబరైనా తీసుకోవల్సింది. బట్, ఆ టైమ్ లో నాకు ఇవేవీ తట్టలేదు. ఇప్పుడు నువ్వు వేసిన ప్రశ్ననే ఓరోజు నాకు నేనే వేసుకొన్నా. నాకు దొరికిన్ ఆన్సర్ ఏమిటంటే,  జనరల్గా పేషంట్లు తమకు రోగం ఎక్కువైనప్పుడు అది తగ్గేందుకు అవసరమైన  మెడిసిన్స్ వాడ్తారు. అంతేగానీ, ఆ మెడిసెన్లో ఉండే

కెమికల్ కాంబినేషన్ను చదువుతూ కూర్చోరు. అలానే, నేను కూడా నా జీవితాన్ని చక్కబెట్టుకోవడానికి అవసరమైన ఇన్స్పిరేషన్ను ఆమె నుండి తీసుకొన్నాను. దట్సాల్!" అంది రంజని.

నెమ్మదిగా మొదలైన చప్పట్లు ఒక్క అరనిముషంలో జోరందుకున్నాయి.

రంజని కుర్చీలో కూర్చోగానే స్టెల్లా, పావనిలు ఆమెకు షేక్ హ్యాండ్ ఇచ్చారు.

ఆ ఇద్దరి మధ్యా....రంజని...అమ్మదనపు మాధుర్యాన్ని ఆస్వాదిస్తూ...

★ ★ ★ ★ ★

"అమోఘం! నీ మొదటి కాయ భక్తితో కూడి బ్రహ్మలోకాన్ని చేరింది దేవీ!" అన్నాడు చేతనాచేతనవిలక్షణుడు.

"అవును స్వామీ! భ అంటే ప్రకాశం. వెలుగు ఉన్న చోట వస్తువులన్నీ చక్కగా పరిచయమౌతాయి. భజ అంటే పంచుకోవడం, పూజించడం, చేరడం అన్న అర్థాలున్నాయి. వెలుగులోకి వెళ్ళిన మానవులు తమకు ఉపయోగకరమైన వస్తువుల్ని ఎన్నుకుని సుఖపడతారు. ఈ వివరణ అటు లౌకిక సుఖానికి, ఇటు ఆధ్యాత్మిక సుఖానికీ కూడా అన్వయమౌతుంది. అంతేనా మౌనిహృదయావాసా?" అని అంది సకలలోకశరణ్యురాలైన అంబ.

"చక్కగా చెప్పావు దేవీ! తొమ్మిది ద్వారాలతో కూడిన దేహమనే పట్టణంలో తొమ్మిది విధాలైన భక్తిని ఐశ్వర్యరూపేణా నింపుకున్న జీవులలో జ్ఞానమనే వెలుగు ఎప్పుడూ అస్తమించదు. భక్తి లేని నాడు ఆ పట్టణం చీకటిలో మునిగిపోతుంది. లౌకిక సుఖాలకు ఆశ పడకుండా ఉండడమే నిజమైన భక్తుల లక్షణం. ఎక్కడ నిజమైన భక్తి ఉంటుందో అక్కడ జ్ఞానజ్యోతి వెలుగుతూవుంటుంది. ఆ జ్యోతిని ధరించిన భక్తులు చేరేది బ్రహ్మలోకాన్నే! భక్తి, జ్ఞానం, అనుష్ఠానం మరియు వినయం – ఇవే జీవికి ఉండాల్సిన నాలుగు ముఖాలు. ఎవరిలోనైతే ఈ నాలుగూ స్థిరంగా నిలబడివుంటాయో వారి హృదయమే బ్రహ్మలోకమౌతుంది. ఎలాగైతే బ్రహ్మదేవుడి సభయైన సత్యలోకంలో భగవంతుని

గుణగానం నిరంతరాయంగా సాగుతుంటుందో, నిజభక్తుల హృదయాల్లో నా స్మరణ పై నాలుగు మార్గాలలో జరుగుతూనేవుంటుంది. అదే మోక్షహేతువు." అన్నాడు సత్యపరాయణుడు.

"దివ్యోపదేశాన్ని చేసారు స్వామీ! మాత్సర్యగ్రస్తమైన మీ రెండో ఆటకాయ డెబ్బైమూడో గది నుండి ముందుకు సాగి ఎనభై ఐదో గడిలో చేరింది. దీని తదుపరి నడక ఎలా ఉంటుందోనన్న ఉత్కంఠత కలుగుతోంది. మరి…." అని నర్మగర్భంగా ఆగింది సానందసాంద్రగుణమయియైన లక్ష్మి.

చిరునవ్వు నవ్వుతూ నారాయణుడు పాచికలను కదిపితే అవి కూర్మరూపధారి వీపుపైని మందరపర్వతం 'గర్ గర్' మని కదులుతున్న సవ్వడిని నినదించాయి.

★ ★ ★ ★ ★

"సుమతీ!" అని గట్టిగా పిలుస్తూ లోనికొచ్చాడు శర్మ.

భర్త గొంతులోని ఆందోళనని గ్రహించిన సుమతి పరుగుపెడ్తున్నట్టు మధ్యగదిలోకి వచ్చింది.

అక్కడేవున్న కుర్చీలోకి కూలబడ్డాడు శర్మ. అతని ముఖంపై చెమట ధారగా కారుతోంది. కంట్లో నీళ్ళు కనబడీ కనబడక కదులుతున్నాయి.

ఈ దృశ్యాన్ని చూసి హతాశురాలైపోయింది సుమతి. "ఏమైందండీ?" అంది ఆదుర్దాగా.

"వాడు…వాడు…" అని చెప్పడానికి రొప్పుతున్నాడు శర్మ.

"ఎవరు? సుబ్రహ్మణ్యమేనా? వాడేనా?" అని అడిగింది సుమతి.

ఔనన్నట్టుగా తలూపాడు శర్మ.

"వాడికేమైందండీ?" అంటూ శర్మ చేతుల్ని గట్టిగా పట్టుకుని అడిగింది సుమతి.

"వాడు ఆత్మహత్య చేసుకున్నాడు." అన్నాడు శర్మ.

అతని చేతుల్ని వదిలిపెట్టేసింది సుమతి. "నిజంగా? చెప్పండీ? ఇది నిజమా!" అని అడిగింది.

మాటల్లో చెప్పలేనట్టు, 'ఔను' అన్నట్టుగా తలూపాడు శర్మ.

సుమతి రెండు చేతుల్తో ముఖాన్ని కప్పుకుని నేలమీద కూలబడింది.

"నిన్న రాత్రి జరిగిందీ ఘోరం. ఈ ఉత్తరాన్ని మనకు వ్రాసిపెట్టాడని పోలీసు ఇన్స్ పెక్టర్ ఇచ్చారు." అంటూ ఓ కాగితాన్ని ఆమె ముందుకు చాచాడు.

"నేను చదవను. నాకేమీ వద్దు!" అంది సుమతి, తన ముఖాన్ని చేతుల్లో దాచిపెట్టుకుంటూనే.

"ఇది నీకే వ్రాసాడు సుమతీ! నువ్వు తప్పక చదవాలని కూడా వ్రాసాడు."

"వాడు చెయ్యకూడని పని చేసేసాక ఇది చదివీ ఏం లాభం చెప్పండి. నేను చదవలేను. ఈ కాగితాన్ని పొయ్యిలో పడేయండీ!" అంది సుమతి. ఆమెలోని దుఃఖం వికృతమైన రోదనగా మారబోతోంది.

శర్మ కుర్చీ నుండి లేచి పక్కనే కూర్చుని ముఖాన్ని కప్పిన ఆమె చేతుల్ని తీసాడు.

"నిజమే! వాడు చెయ్యకూడని పనే చేసాడు. దానికి కారణం — నీ భర్త. ఈ ఉత్తరాన్ని నువ్వు చదివితేనే నాకు ప్రాయశ్చిత్తం జరిగేది. నీ భర్త పాపభారంతో జీవితాంతం ఉండిపోవల్సిందేనా?" అన్నాడు శర్మ.

చప్పున అతని ముఖంలోకి చూసింది సుమతి. "వాడి చావుకు మీరు కారణమా? నేను నమ్మలేను!" అంది.

"ఈ ఉత్తరాన్ని చదువు." అన్నాడు శర్మ ముక్తసరిగా. అందుకుంది సుమతి.

ఆమె కళ్ళు ఆ అక్షరాల వెంట పరుగెట్టాయి.

"సుమతి అమ్మకు...

నాకు ఆట్టే సమయం లేదు. మీ అందరికీ నేను చేస్తున్నది తప్పుడు పనిలా అనిపించవచ్చు. కానీ నావాళ్ళు నన్ను హింసిస్తున్నదానికంటే నేను చేస్తున్నది నీచమైనది కాదని నా నమ్మకం. ఆ ఏడ్పుగొట్టు వివరాలన్నీ ఇప్పుడు రాయలేను.

ఈ ఉత్తరంలో నేను మీతో చెప్పదల్చుకొన్నది నా సంతోషం గురించి. అందువల్ల ఈ ఉత్తరాన్ని మీరు తప్పక చదవాలి.

పంతులుగారు నన్ను మీ ఇంటికి తీసుకొచ్చిన రోజున నాలో ఉన్న భయం అంతాయింతా కాదు. ఆ భయం పంతులు గారి గురించి కాదు, మీ గురించి. ఆయనేమో మంచితనంతో తీసుకువచ్చారు కానీ మీలో అంత మంచితనం ఉంటుందా అని నా అనుమానం. మిమ్మల్ని చూసినప్పుడు కూడా ఆ అనుమానం తీరలేదు. కానీ ఒక్కోరోజు గడుస్తున్న కొద్దీ నా అనుమానం తీరిపోయింది. పంతులుగారు నన్ను కొట్టి తిడుతుంటే మీరు నా తరఫున నిలబడి మాట్లాడినప్పుడు నాలో కలిగిన సంతోషం ఎంతో చెప్పలేను. అమ్మ అంటే మీరేనని అనుకొన్నానని మాత్రం చెప్పగలను. నిజానికి నాకు మీ ఇంట్లో ఉండి చదువుకోవాలని అనిపించింది. ఆ విషయాన్ని చెప్పబోతుండగా పంతులుగారు అడ్డుపడి మా మేనమామ ఇంట్లో దించుతాను పదమన్నారు. ఆయన చెప్పిన ఏ పనినీ సరిగ్గా చెయ్యని నేను కనీసం ఇదైన చేద్దామని ఇక్కడికి వచ్చేసాను. అప్పుడే నాకు తెలిసిపోయింది – నేను ఇలా వెళ్ళడం తప్పించి ఇంకో మార్గం లేదని.”

తలెత్తి శర్మ ముఖంలోకి చూసింది సుమతి. ఆమె ఎందుకు చూస్తోందో అర్థమైనట్టుగా తల పంకించాడు శర్మ.

ఆమె మళ్ళీ చదవసాగింది.

“మీ దగ్గరకొచ్చి ధైర్యాన్ని పొందాలని చాలాసార్లు అనిపించింది. కానీ పంతులుగారికి కోపమొస్తుందేమోనని, నా వల్ల మీ ఇద్దరి మధ్యా గొడవలొస్తాయేమోనని భయపడి ఆగిపోయాను. ఈ నాలుగు నెలల్లో మిమ్మల్ని రోజూ తల్చుకునేవాణ్ణి. కానీ ఇలా బతకడం నా చేత కావడంలేదు. నన్ను కన్న రాక్షసి, దాని అన్నా నన్ను నాన్న దగ్గరకు వెళ్ళేట్టుగా చేసేసారు. నేనెలాగూ చచ్చిపోతాను కాబట్టి మీ బిడ్డగా పుట్టించమని చెరువుకట్ట మీదున్న విశ్వనాథునికి ముడుపు కట్టి వచ్చాను. ఆ భక్తవశంకరుడు నా కోర్కె తప్పక తీరుస్తాడు. ఎందుకంటే మీరనుకొనేట్టుగా నేను ఆత్మహత్య చేసుకోవడంలేదు. ఆ రాక్షసి ఇచ్చిన దేహాన్ని వదిలేసుకొని, మీరు ఇవ్వబోయే కొత్త రూపం కోసం

ముస్తాబవుతున్నాను. నాలాంటి వాడు కొడుకుగా పుట్టడం పంతులు గారికి ఇష్టం లేకపోవచ్చు. కానీ మీలాంటి తల్లి తోడుంటే నాలాంటి వెధవ కూడా విద్వాంసుడవగలడు. మతిత్వాత్ మాత అని పంతులుగారే వోసారి చెప్పారు. పరాయివాడైన సుబ్రహ్మణాన్ని మనసారా ఆదరించిన మీరు, ఈ మందమతి సౌమతిగా పుట్టినప్పుడు కనికరించకపోతారా! తప్పక కనికరిస్తారని నా నమ్మకం చెబుతోంది. విశ్వనాథుడి పాదాల దగ్గర పెట్టిన ముడుపు కూడా అదే నమ్మకాన్ని పుట్టిస్తోంది. కాబట్టి అయ్యగారు వరమివ్వకపోయినా అమ్మగారు అస్తు అంటారని భావిస్తూ ముగిస్తున్నాను.

ఇట్లు

మీ

దేవదేవ రమ్ము – కావుమయ్య మమ్ము"

ఒక్కసారిగా శర్మ మీదకు వాలిపోయింది సుమతి. శర్మకు ఏం చెప్పాలో తోచని పరిస్థితి ఏర్పడింది.

మనసు వికలమైన చోట మాటలు పనిచెయ్యవు. మాటలు పూరించలేని అగాధాన్ని మౌనం దాటిస్తుంది.

కొద్దిసేపు గడిచాక "సుమతీ!" అని పిలిచాడు శర్మ.

ఆమె నుండి సమాధానం లేదు. ఐనా మాట్లాడసాగాడు శర్మ. "నాపైన నీకు గౌరవం పోయింది కదూ?" అన్నాడు.

లేదన్నట్టు ఆమె తలూపింది.

"లేదా? నిజంగా?" అన్నాడు శర్మ. "ఎందుకు? వాడి చావుకు నేనే కారణం కదా! నేను చేసింది తప్పు కాదా?"

సుమతి అతని బాహువుల్లో ఒదిగిపోతూ అంది – "మీరు వాడికి ఉత్తమ జన్మ మీద ఆశను కల్పించారనే అనుకుంటున్నాను."

“ఆత్మహత్య చేసుకోవడం పాపమైతే, దానికి ప్రోత్సాహమివ్వడం కూడా పాపమే. నా వల్లనే వాడు ఆత్మహత్య చేసుకున్నాడు.” అన్నాడు శర్మ. అతను పలికిన ప్రతి అక్షరంలోనూ గాయపడిన అతని మనసు నిండివుంది.

“నిజమైన వైరాగ్యం కలిగినవాళ్ళు, జీవించాల్సిన విధంగా జీవించలేకపోతే శరీరత్యాగం చేయవచ్చని, అది ఆత్మహత్య కాదని మీరే చెప్పారుగా?” అంది సుమతి.

ఆ మాటలకు ఆశ్చర్యపోయాడు శర్మ. “అది యోగుల విషయంలో మాత్రమే చెల్లుతుంది.” అన్నాడు.

“నా వరకూ సుబ్రహ్మణ్యం ఒక యోగినే” అంది సుమతి.

మాటల్ని కొనసాగించలేనట్టుగా ఆగిపోయాడు శర్మ.

వాళ్ళిద్దరి మధ్యా మౌనం ఇంకొద్దిసేపు తచ్చాడింది.

“ఏమండీ! త్వరలోనే మనకు బిడ్డ పుడతాడు.” అంది సుమతి.

“అవును!” అన్నాడు శర్మ.

నిర్వికల్పసమాధి అంటే ఏమిటో కొద్ది కొద్దిగా అనుభవంలోకి వస్తోంది శర్మకు. సుమతి నుండి అతను అమితమైన దుఃఖాన్నీ, నిష్ఠూరమైన మాటల్ని ఊహించాడు. కానీ ఆమె ఇలా సాత్వికమైన మౌనాన్ని ఆశ్రయిస్తుందని ఉహించలేకపోయాడు.

“చక్కగా వండిన అన్నాన్ని, యవ్వనవతియైన భార్యని, విజేత ఐన శూరుణ్ణి, సంసార సాగరాన్ని దాటిన తపస్వినీ ధీరులు గ్రహిస్తారని” విదుర నీతి చెబుతోంది. తన భార్య పూర్ణయవ్వనంతో ఉండి కూడా ఆ యవ్వనానికి, దాని హంగులకీ బానిస కాకుండా నిశ్చలంగా ఉండగలుగుతోంది. దానికి కారణం, ఆమెలోని ధీశక్తి. మంచి విచక్షణతో కూడిన బుద్ధి చక్కటి పనులను చెయ్యడానికే ప్రేరేపిస్తుంది. ఈమె అనవసరంగా దుఃఖపడదు. ఇంకొకర్ని హింసించదు. కానీ ఇతరులలోని దుఃఖాలను చక్కగా అర్థం చేసుకుంటుంది. ఆ దుఃఖాన్ని నివారించేందుకు పూనుకుంటుంది. ఇదేకదా నిర్వికల్పమంటే!

శర్మకు దత్తాత్రేయ–సాత్య దేవతల సంవాదం గుర్తుకువచ్చింది.

“మనోనిగ్రహం, సత్యపరాయణత్వం, ధర్మనిరతి జీవితానికి అవశ్యమైనవి. హృదయాన్ని తెరచి ప్రియ–అప్రియాల్ని సమదృష్టితో చూడగలగాలి. ఇతరులు నిందించినా తిరిగి నిందించకూడదు. పరులను అవమానించరాదు. మనల్ని ఎవరైనా అకారణంగా దూషిస్తుంటే, వారు మన పుణ్యాన్ని వృద్ధి చేస్తున్నారని తలచాలి. ఏ రంగులో అద్దితే ఆ రంగును పొందే వస్త్రంలా మంచివాణ్ణి సేవించే చెడ్డవాడు కూడా క్రమేణా మంచివాడుగా మారుతాడు. మౌనం మాటలకంటే ఉత్తమమైనది. కానీ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం మౌనం కంటే గొప్పది.”

పైవాటిల్ని తను ఎన్నోసార్లు ప్రవచనాల్లో చెప్పాడు కానీ తన భార్య ఆచరించి చూపింది.

ఇంతటి పరిపక్వమైన మనసు గలిగిన భార్యను తనే ఎన్నుకున్నాడా? లేక అనుకోకుండా పొందాడా? లేక ఆ భగవంతుడే దయ తలచి ఇచ్చాడా?

మనసులోనే మ్రొక్కాడు శర్మ – “భగవాన్! పుస్తక జ్ఞానమే గానీ నేను ఆచరణశీలుణ్ణి కాను. కానీ నా భార్య నిగర్వియైన నిర్మల చిత్తురాలు. ఆ నిష్కల్మషమైన మనసు కోరుతున్న ఆ ఒక్కె కోర్కెను తీర్చు!”

మండపంలో దేవునికి అలంకరించిన పువ్వుల్లో ఒకటి క్రింద పడింది.

★ ★ ★ ★ ★

“ప్రభూ! మీ రెండో కాయ వైరాగ్యమూర్తియై ’వైకుంఠా’న్ని చేరింది. వైరాగ్యానికీ – వైకుంఠానికీ గల సంబంధమేమిటో వివరించండి!” అంది అంత్రభణీదేవి.

“దేవీ! ప్రాపంచిక భోగరాహిత్యమే వైరాగ్యం. అంటే మనసును కవ్వించే వస్తువులు ఎదురుగా ఉన్నా కూడా చలించకపోవడాన్నే ప్రాపంచిక భోగరాహిత్యమంటారు. కామ, క్రోధాలనే రాగాలను చక్కగా విడిచిపెట్టడమే వైరాగ్యం. అదే నిజమైన సన్యాసమంటే. కావిరంగు గుడ్డల్ని ధరించినంత మాత్రాన ఈ వైరాగ్యం పుట్టదు. తన భార్యను తప్ప ఇతర స్త్రీలను కాముక దృష్టితో చూడని సంసారి కూడా సన్యాసిలా ధృడమైన బ్రహ్మచర్యం కలిగినవాడే. ఒకరి సొత్తు నాది కాదనడం, దానమిచ్చిన వస్తువును తనదిగా

చెప్పుకోకపోవడం, కర్కశ స్వభావం లేకపోవడం మొదలైనవన్నీ వైరాగ్యంలోని ఉపలక్షణాలు. వీటికి వ్యతిరేకమైన అవిజ్ఞ లక్షణాలను "కుంఠ" అని పిలుస్తారు. వైకుంఠమంటే ఈ కుంఠితాలన్నీ వికటమై పోవడమే. దోషముక్తులైన మానవులు పొందగోరేది ఈ లోకాన్నే. ఇక్కడికి వచ్చిన వారికి పునరావృత్తి లేదు." అన్నాడు వైకుంఠజుడు.

"స్వామీ! ఇక్కడికి వచ్చే దాకా మానవులకు దోషరాహిత్యం తో కూడిన సుఖం లభించదా?" అని అడిగింది సుమనసపూజిత.

"ప్రియా! నాహమ్ వసామి వైకుంఠే – నేను ఒక్క వైకుంఠంలోనే లేను. భూలోకంలో నేను వెలసిన ఒక పర్వతం కూడా భూవైకుంఠమని పిలువబడుతోంది. పర్వతాన్ని అచలం అంటారు. అలా ఎవరైతే తమ మనసును అచలం చేస్తారో అక్కడా నేనే ఉంటాను. నేనున్న చోటు వైకుంఠమౌతుంది. అందువల్ల కాలమృత్యువు సంభవించే వరకూ చంచలమైన మనస్సును అదుపులో పెట్టిన ధృడమతికి ఇహలోక వైకుంఠం సులభసాధ్యం!" అన్నాడు ధృవవరదుడు.

"ప్రభూ! కాల మృత్యువు సంభవించేదాకా అన్నారు. అంటే అకాల మృత్యువనేది ఉందా?" అని సంశయాన్ని వ్యక్తం చేసింది కరవీరపురవాసిని.

"సజ్జనుల సౌకర్యార్థమే అడుగుతున్నావు గానీ, ప్రకృతి నియామకురాలవు నీకు తెలియని మృత్యువా దేవీ! పూర్వ జన్మల పాప ఫలితంగా యమధర్మరాజు విధించే అకాల మృత్యువును జ్యోతిష్యశాస్త్రం ద్వారా తెలుసుకుని పరిహరించుకోవచ్చు. కానీ కాలంచే విధింపబడే నా సంహార రూపమైన మహామృత్యువును ఎవ్వరూ జయించలేరు."

"మరి ఆత్మహత్య ఏవిధమైన మరణం స్వామీ?" అని పునః ప్రశ్నించింది జగన్మాయ.

"మానవుల శరీరం సాధనకై ఇవ్వబడింది. ఒక స్థాయి సాధన పూర్తి కాగానే ఉత్తమ గతుల్ని ఇచ్చే నిమిత్తం ఆ శరీరాన్ని మహామృత్యువు కబళిస్తుంది. ఇది సృష్టిబద్ధమైనది. అలాంటి సాధనా శరీరాన్ని మహామృత్యువుతో గాక స్వయంఇచ్ఛతో ముగింపచూడడం సృష్టినియమానికి వ్యతిరేకమైనది. అందుకే

ఆత్మహత్య మహాపాపమని విజ్ఞులు బోధించారు. ఆత్మహత్య చేసుకోబోయే వారి దేహం నుండి వారు చావడానికి మొదలే మానవ మనస్సులను నియంత్రించే లయకారకుడైన శివుడు జీవాత్మను దేహం నుండి వేరుచేస్తాడు. ఆవిధంగా వారికి కాలీనమైన మృత్యువు సంభవిస్తుంది. తెలిసి తెలిసీ సాధనా శరీరాన్ని క్షణిక కోపానికి బలిచేసిన వారికి ప్రేతదేహం నుండి విముక్తి లేదు. కానీ నా అనుగ్రహబల సంపన్నులైన వారి వల్ల కొన్ని సందర్భాల్లో అది తొలగుతుంది." అన్నాడు నరకాంతకుడు.

"మీ కారుణ్యానికి ఎల్లలు లేవు." అని మ్రొక్కింది వేదవేదాంతాభిమానిని.

"మరి నీ రెండో కాయ ఏమౌతుందో చూద్దాం!" అన్నాడు ముచికుంద వరదుడు.

జగదంబ పాచికలను విసిరింది. అవి ఋత్వికుల మంత్రోచ్చారణల్లా శబ్దించాయి.

★ ★ ★ ★ ★

ఉద్యోగం పోయి ఐదు నెలలు కావస్తున్నా అనంత్ కు ఎక్కడా కొత్త కొలువు దొరకడంలేదు. అతనికి ఓపిక నశించిపోతోంది. అర్థం చేసుకునే భార్య ఉండడం వల్ల ఆమె సాహచర్యంలో ఉన్నంతసేపూ ఆ నిస్సహాయతను మర్చిపోగలుగుతున్నాడు. ఆమె ఆఫీసుకు వెళ్ళినప్పటి నుండీ తిరిగి వచ్చే వరకూ భరించలేని ఒంటరితనంతో కృంగిపోతున్నాడు. ఏం చేయ్యాలన్నది తోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడతను.

"పోనీ, ఈ పని చేస్తే?" అంది రంజని సాలోచనగా.

"ఏమిటి?" అన్నట్టు కనుబొమలు ఎగరేసాడు అనంత్.

"నువ్వు ఓ బ్లాగ్ మొదలుపెట్టు. అందులో నీ డొమైన్ కు సంబంధించి ఆర్టికల్స్ పబ్లిష్ చెయ్."

"నాకేంటి బెనిఫిట్?" అన్నాడు అనంత్.

"ఫేమ్!" అంది రంజని.

"అది సరే! ఇదీ" అన్నాడు 'డబ్బులు' అన్నట్టు చేత్తో సైగ చేస్తూ.

“ప్రస్తుతానికి దాని గురించి ఆలోచించేదివద్దు. జస్ట్ మేక్ ఏ నేమ్ ఫర్ యువర్ సెల్ఫ్.” అంది రంజని.

“ఓకే! నా ఆర్టికల్స్ నచ్చిన వాళ్ళల్లో ఎవరో ఒకరు హెల్ప్ కోసం నన్ను కాంటాక్ట్ చెయ్యొచ్చు. దాన్ని కన్సల్టెన్సీగా మార్చుకొనేందుకు ట్రై చెయ్యొచ్చు.” అన్నాడు అనంత్.

“దట్స్ నైస్” అంది రంజని.

మరునిముషంలో ఇద్దరూ అనంత్ ల్యాప్ టాప్ ముందున్నారు. బ్లాగ్ పేరు గురించి ఓ పదిహేను నిముషాలు చర్చించుకుని ఓ పేరును ఖరారు చేసారు. బ్లాగ్ తయారు చేసిన మరో గంటలో మొదటి వ్యాసాన్ని వ్రాసాడు అనంత్. ఆ బ్లాగ్ ను రెండు మూడు అగ్రిగేటర్లలో కూడా చేర్చాడు.

మరుసటి రోజు బ్లాగ్ తెరవగానే నాలుగు కామెంట్లు ఉండడంతో అనంత్ లో ఉత్సాహం వెల్లివిరిసింది. వెంటనే రంజనికి ఫోన్ చేసాడు. అనంత్ చూడకముందే రంజని ఆ నాలుగు కామెంట్లనీ చదివేసింది. కానీ ఏమీ తెలియనిదానిలా ’కంగ్రాట్స్’ చెప్పింది. వెంటనే జవాబులు రాయమని కూడా సలహా ఇచ్చింది.

రాత్రికి రంజని ఇల్లు చేరేవేళకు అనంత్ తన ల్యాప్ టాప్ ముందే కూర్చుని వున్నాడు. “రంజనీ! యూ నో...పొద్దున్నుంచి పన్నెండు కామెంట్లొచ్చాయి. అందులో ఆరు కామెంట్లు ప్యూర్ టెక్నికల్ డౌట్స్. అన్నిటికీ ఆన్సర్ ఇచ్చేసా.” అన్నాడు అనంత్. భార్య అలసిపోయివచ్చిందన్న ఆలోచనే తట్టలేదతనికి. రంజని నవ్వుతూ “వోవ్! ఫస్ట్ డే ఫస్ట్ షో గ్రాండ్ సక్సెస్. కంగ్రాట్స్!” అంది షేక్ హ్యాండిస్తూ.

బ్లాగులో ఏదో వ్రాస్తూనే ఉండిపోయాడు అనంత్. మధ్యరాత్రి నిద్ర లేచిన రంజని గడియారం కేసి చూసింది. దాదాపు తెల్లవారుజామున ఒకటిన్నర కావొస్తోంది.

“కొత్త బిచ్చగాడు పొద్దెరుగడంట!” అంది రంజని. నిద్రతో మత్తు నింపుకున్న ఆమె గొంతు మాటల్ని ముద్దముద్దగా పలికించింది.

టక్కుమని ల్యాప్ టాప్ ను మూసేసి, ఆమెను తన మీదకు లాక్కున్నాడు అనంత్.

- - - - -

మూడు నెలల్లో అనంత్ బ్లాగును చదివే వారు కొన్ని వందల మంది తయారయ్యారు. ఆ చదువర్లల్లో సాఫ్ట్ వేర్ కంపెనీల్లో పెద్ద హోదాల్లో ఉన్నవారు కూడా ఉన్నారు. వారు అనంత్ వ్రాసే టెక్నికల్ రైట్–అప్స్ ను చూసి, తమ ప్రాడక్ట్ లిటరేచర్ ను అతనితో వ్రాయించుకున్నారు. మరికొద్దిమంది తమ ప్రాజెక్ట్స్ కు అతన్ని కన్సల్టంట్ గా తీసుకుని రీటైనర్ ఫీజులు చెల్లించడం మొదలుపెట్టారు. ఇవన్నీ చాలదన్నట్టుగా కొన్ని ప్రసిద్ధి చెందిన టెక్నికల్ వెబ్ సైట్లు అనంత్ ను కాలమిస్ట్ గా తీసుకుని, అతను వ్రాసే ప్రతి రచనకు పారితోషికాన్ని ముట్టచెప్పడం మొదలెట్టాయి. ఓ స్నేహితుడు ఇచ్చిన సలహా మేరకు తన బ్లాగులో ఆన్ లైన్ యాడ్స్ పెట్టాడు అనంత్. ఆవిధంగా తన సంపాదనను ఇంకొద్దిగా పెంచుకున్నాడు. దేశదేశాల్లో అతనికి మిత్రులు, అభిమానులు, శిష్యులు ఏర్పడ్డారు. వీటన్నిటితో అనంత్ కు ఇంకో ఉద్యోగం వెదుక్కునే అవసరం లేకుండా పోయింది. ఎన్ని పనులున్నా వారాంతాల్ని రంజనితో గడపేందుకే కేటాయించాడు.

ఆ ఆదివారం సాయంత్రం, పార్క్ లోని మ్యూజికల్ ఫౌంటెన్ చేస్తున్న విన్యాసాల్ని చూస్తూ కూర్చున్నారు రంజని–అనంత్ లు.

క్షణక్షణం ఎగసిపడే ఆశల్లా ఆ నీటిధారలు అందని ఆకాశం వైపు ఎగురుతున్నాయి. అనుక్షణం రంగులు మార్చే భావాల్లా వెలిగి ఆరుతున్నాయి లైట్లు. అచ్చు జీవితంలానే ఉందా ఫౌంటెన్.

రంజని–అనంత్ లు కూర్చున్న బెంచ్ కు కొద్దిగా ముందు, ఫౌంటెన్ కు దగ్గరగా పచ్చిక మీద కూర్చున్న ఓ జంట ఆ ఫౌంటెన్ను చూడ్డంలో లీనమైవున్నారు. అప్పుడే దోగాడ్డం నేర్చుకున్న వారి బిడ్డ, తన కొత్తవిద్యను మరోసారి ప్రదర్శించే నిమిత్తం వడివడిగా దోగాడుతూ వచ్చి రంజని చీరకుచ్చిళ్ళను పట్టుకుని నిలబడబోయింది.

హటాత్తుగా తన చీరను ఎవరో లాగినట్టవడంతో ఉలిక్కిపడింది రంజని. క్రింద చూసేసరికి నిలబడినా బ్యాలెన్స్ దొరక్క అటుయిటు ఊగుతూ, బోసినవ్వులు రువ్వుతున్న ఆ పసిపాపను చూడగానే ఆమె మనసు పొంగిపోయింది. “అర్రెర్రెర్రే” అంటూ బిడ్డను ఎత్తుకుని తన ఒడిలో కూర్చోబెట్టుకుంది.

నిత్యచైతన్యానికి చిరునామాలా ఉన్న ఆ పాప, రంజనికి మరింత ఉత్సాహం నింపేలా చిత్రమైన శబ్దాల్ని చేస్తోంది. ఆ బిడ్డడి చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుని తన ఒడిలోనే నిలబెట్టింది రంజని. దాంతో ఆ పసిపాప ఆమె ఒడిలోనే గెంతసాగింది. ఆ పాప గెంతులకి తగ్గట్టుగా అనంత్ చప్పట్లు కొడుతూ ఓ పాటను అందుకున్నాడు.

ఫౌంటెన్ షో ఐపోవడంతో ఇహలోకంలోకి వచ్చిన పాప తల్లిదండ్రులు, బిడ్డ కనబడక కంగారుగా లేచి చుట్టూ చూడసాగారు, రంజని ఒడిలో ఆడుకుంటున్న బిడ్డను చూసిన ఆ తల్లి పరుగుపరుగున వచ్చింది. పరుగెట్టివస్తున్న అమ్మను చూసిన పాప మరింత జోరుగా కేకలేస్తూ గెంతసాగింది.

రొప్పుతూ తన ముందు నిలబడింది బిడ్డ తల్లేనని పోలికల్ని బట్టి గ్రహించిన రంజని టక్కున లేచి ఆ పాపను ఆమె చేతుల్లోకి చేర్చింది. ఆ తల్లి బిడ్డను గుండెలకు హత్తుకుని "థాంక్స్!" అంది. ఆ కృతజ్ఞతలెందుకో అర్థం కాని రంజని జోరుగా తలను ఊపింది. ఇంతలో బిడ్డ తండ్రి కూడా అక్కడకు వచ్చాడు. అనంత్ వైపుకు చెయ్యి చాచి "మా పాప చాలా యాక్టివ్. క్షణం ఒకచోట ఉండదు. మీరున్నారు కాబట్టి ఈ దొంగని పట్టుకొని మాకు అప్పగించారు. థాంక్స్!" అన్నాడు.

"ఓహ్! అవును. షీ ఈజ్ వెరీ వెరీ యాక్టివ్ అండ్ బ్యూటిఫుల్ టూ." అన్నాడు అనంత్ ఆ అపరిచితుడి చేతిని జోరుగా ఊపేస్తూ.

వెళ్ళొస్తామంటూ ఆ దంపతులు చెప్పి బయల్దేరారు. అమ్మ భుజం మీద నుంచి తనకేసి చూస్తూ కేరింతలు వేస్తున్న ఆ బిడ్డను చూస్తూ ఉండిపోయింది రంజని.

ఆమె భుజం మీద చేయివేసి "వెళ్దామా?" అన్నాడు అనంత్.

ముందుకు కదిలింది రంజని.

ఆరాత్రి రంజని మౌనానికి పర్యాయపదంగా మారింది.

"నువ్విలా మౌనంగా తపస్సు చేస్తే పిల్లలు పుట్టినట్టే..." అన్నాడు అనంత్, మౌనాన్ని చెదరగొట్టే నిమిత్తం.

“మన పాప పోయి అప్పుడే ఒకటిన్నర సంవత్సరం కావస్తోంది. ఉండివుంటేనో...” అంది రంజని.

ఆమె మోకాళ్ళ మీద తన గడ్డాన్ని ఆన్చుకుని మంచం మీద కూర్చునుంది.

పడుకునివున్న అనంత్ లేచి కూర్చున్నాడు.

“ఆ విషయం గురించి నిన్ను మర్చిపొమ్మని చెప్పలేను. కానీ, దాన్ని మర్చిపోతేనే మంచిది.” అన్నాడు అనంత్.

“అలా మరవడం మగవాళ్ళకి సాధ్యమేమో!” అంది రంజని.

“ట్రై అండ్ ట్రై అన్నాడు కాళిదాసు. ప్రయత్నః ప్రయత్నః అన్నాడు షేక్ స్పియర్.” అన్నాడు అనంత్.

“అన్నీ రివర్సులే!” అంది రంజని చిన్నగా నవ్వుతూ.

“అదేదో సినిమాలో ఎస్వీ రంగారావు అన్నట్టు ఈ ఒక్క దేవుణ్ణి ఇంకోసారి నమ్ముకోరాదూ!” అన్నాడు అనంత్.

“మొగుడుగారూ! ఆ సినిమా అదేదో సినిమా కాదు స్వర్ణకమలం. ఆ డైలాగు సాక్షిరంగారావుది” అంది రంజని, ఇంకాస్త పెద్దగా నవ్వుతూ.

“మొగుడుగారా? వాడెవడు? ఎక్కడున్నాడు? ఖమాన్. చూపించు.” అని రంజనినీ ఊపెయ్యసాగాడు అనంత్.

“మొగుడుగారంటే మీరేనండీ అనంత్ గారూ.” అంది రంజని అనంత్ చేతుల్నించి తప్పించుకుంటూ.

“వాట్...కెన్...వాట్! నన్ను గారండీ అని పిలిచావా? బాబోయ్....సూర్యుడు పశ్చిమే్మ వరువాన్...” అన్నాడు అనంత్.

“అంటే...సూర్యుడు వచ్చేదాకా..ఇలానే కోతిగెంతుల్తో గడిపేస్తారా ఓ నా దేవుడుగారూ?” అంది రంజని.

“అబ్బే! ఈ ప్రార్థన సరిపోదు.” అన్నాడు అనంత్ బెట్టుగా.

“ప్లీజ్ దేవుడూ!” అంది రంజని అతని చుబుకాన్ని పట్టుకొని.

“దేవుడితో ఇంత ఫ్రెండ్ షిప్పా! ఇదేనా భక్తులు ప్రార్థించే తీరు?” అన్నాడు అనంత్ మంచం మీదే లేచి నిలబడి.

“పోనీ ఇలా ప్రార్థించితేనో….” అని వంగి అతని కాళ్ళను పట్టుకుంది రంజని.

“వహ్వా…ఇదేదో భేషుగ్గా….” అని అతను వాక్యం పూర్తి చేసేలోపే అతని కాళ్ళని లాగింది రంజని.

వెల్లకిలా పడ్డ అనంత్, అదే ఊపులో రంజనిని తన మీదకు లాక్కున్నాడు.

“నేనేమో నా దేవుణ్ణి ప్రసన్నం చేసుకున్నాను.” అంది రంజని.

“భేష్! ఆ దేవుణ్ణి నేను ప్రసన్నం చేసుకుంటానులే! గోవిందా! గోవిందా!!” అన్నాడు అనంత్, ఆమెను చుట్టేస్తూ.

“నువ్వూ – దేవుడ్ని ప్ర…సన్నం…అన్ బిలీవబుల్.” అంది రంజని అతనిలోకి కరిగిపోతూ.

“ఈ క్షణం మాత్రం బిలీవబుల్.” అన్నాడు అనంత్ కౌగిలిని మరింత బిగిస్తూ.

★ ★ ★ ★ ★

“అనూహ్యం స్వామీ! మీ గురించి ఆలోచించని నా రెండో ఆటకాయ మిమ్మల్ని ప్రార్థిస్తోంది. యాభైరెండవ గడిలోని యోగపు మెట్లెక్కి డెబ్భైరెండవ గడిని చేరింది.” అంది సులక్షణాదేవి.

“ఆ కిరాత హూణాదపి ఏ పాపి జీవాః తరంతి మమ మాయయా” అన్నాడు భగవద్గీతబోధకుడు.

“పాపులూ, మ్లేంఛులూ కూడా మీ నామస్మరణతో సంసారసాగరాన్ని దాటడం ఆశ్చర్యం!” అంది తమోహారిణి.

“దేవీ! జీవులలో నిత్యం వెలిగేది జ్ఞానజ్యోతియే. అదే స్వరూపం. జ్ఞానం వల్లనే సుఖం లభించేది. కావున జీవులు తమతమ స్వరూపాల్లో సుఖాత్ములే. కానీ బలిష్టమైన నీ ప్రకృతికి లోబడి, మాయావశులై, జడపదార్థాలలోనే సుఖముందన్న అపోహతో చావుపుట్టుకల చక్రంలో చిక్కుకుంటారు. ఎవరైతే స్వంత ఇచ్ఛతో, జడపదార్థాల పై మోహాన్ని దాటడానికి ప్రయత్నిస్తారో వారికి స్వరూపతత్త్వం తెలిసివస్తుంది. నిత్యసుఖకారకమైన స్వస్వరూప పరిచయంతో ప్రాకృతిక పదార్థాల మోహం పోతుంది. ఆ స్వరూపజ్ఞానసిద్ధికి నా అనుగ్రహమే కారణమౌతుంది. నాస్తికులు సైతం ’నారాయణా’ అని పలికినా వారికి నామోచ్చారణ పుణ్యాన్ని అనుగ్రహిస్తాను. నన్ను నమ్మకపోయినా ఇతరుల దుఃఖాలను నివృత్తి చేసేందుకు ప్రయత్నిస్తే దానికీ పుణ్యానిస్తాను.” అన్నాడు చరాచరనియామకుడు.

“భక్తితోగానీ, నిర్లక్ష్యంతోగానీ, ద్వేషంతోగానీ, మరేవిధమైన భావనతో గానీ మీ పేరును పిలిస్తే, తత్క్షణంలో పుణ్యాన్ని ప్రసాదిస్తారు. సృష్టిలోని జీవులు, జడపదార్థాలూ మీ ప్రేరణతోనే తమతమ ధర్మాల్ని నిర్వర్తిస్తున్నాయి. ఒక నాస్తికుడు మిమ్మల్ని నమ్మకపోయినా వాని చేత లోకోపకారకమైన పని చేయించే ప్రేరణ మీదేగా! ఇందుకేగా మిమ్మల్ని కరుణాసముద్రుడని పిలిచేది!” అని చేతులు జోడించింది కమలాలయ.

“మరి నా పావుల్ని నడపనా?” అన్నాడు నందనందనుడు.

“తప్పకుండా” అంది త్రిలోకపూజిత.

నారాయణుడు పాచికల్ని విసిరితే పిల్లనగ్రోవి కణుపుల్లో గాలి చేస్తున్న కేరింతల్లా ధ్వనించాయి.

★ ★ ★ ★ ★

“ఏమండీ! ఈ చీకటికి అర్థమేమిటి?” – కొవ్వొత్తిని వెలిగిస్తూ అడిగింది సుమతి.

“ఏ చీకటి? కరెంటు పోయినప్పటిదా!” అని నవ్వుతూ అడిగాడు కేశవశర్మ.

“అనాది చీకటి.” అంది సుమతి.

శర్మకు ఆ పదబంధం బాగా నచ్చింది. “అనాది చీకటి! దుస్సమాసమైనా నాకెందుకో బాగా నచ్చింది.” అన్నాడు.

“ఐతే చెప్పండి....ఈ చీకటి ఎందుకు?” అంది సుమతి,

“గుండెల్ని పిండేసిన దుఃఖం ఆగిపోయాక ఎంతో సుఖంగా ఉంటుంది. తెలుసా!” అన్నాడు శర్మ. “అలాంటి సుఖమే ఈ అనాది తమస్సు!”

అతని గొంతులోని గాంభీర్యానికి తత్తరపడిన కొవ్వొత్తి రెప్పపాటు ఊగిసలాడి మళ్ళీ నిశ్చలమైంది.

సుమతి మౌనంగా ఉండిపోయింది.

“అలా ఎందుకడిగావ్?” – చప్పున అడిగాడు శర్మ.

"చాలారోజుల క్రితం, సుబ్రహ్మణ్యం మనింట్లో ఉంటున్నప్పుడు...దీపాలు పెట్టేవేళకి కరెంటు పోయింది. కొవ్వొత్తి వెలిగించి వరండాలో కూర్చునివున్నాం. అప్పుడు వాడు అడిగిన ప్రశ్న ఇది.” అంది సుమతి.

“నువ్వేం చెప్పావ్?”

“మీ అంత బాగా చెప్పేదాన్నా?” అంది సుమతి.

“నువ్వేం చెప్పావ్?” మళ్ళీ అడిగాడు శర్మ.

“సూర్యుడు పోయి నక్షత్రాలు వచ్చే వేళ అని అన్నాను.”

“అంటే...” సాలోచనగా ఆగాడు శర్మ.

“తల ఎత్తి చూడలేని ఆకాశాన్ని హాయిగా చూడగలిగే వేళ.”

“ఓహ్!” అన్నాడు శర్మ. “వాడేమన్నాడు?”

“చప్పట్లు కొట్టాడు.” అంది సుమతి నవ్వుతూ.

అరవిచ్చుకున్న ఆమె పెదాల మీది తడిలో తన ప్రతిబింబాన్ని చూసుకుని కొవ్వొత్తి మురిసింది కాబోలు, ఓ మెరుపు ఆ పెదాల పై విరిసింది.

శర్మ ముందుకు వంగి ఆ వెలుగును చుంబించాడు.

మాధ్వీకచషకంలో చిక్కిన మధ్వకంలా ఆమె.

రివ్వుమంటూ ఎగిరే గువ్వల జంట వర్షంలో తడిచి రెమ్మల మధ్యలో ముడుచుకుపోయినట్టుగా చిక్కుబడ్డ పెదాలు.

వామదేవుని వామభాగంలో ఉమాభామ సమాగమించి, సంగమించి, సగం కరిగి, సగం మిగిలి....

★ ★ ★ ★ ★

“ఇదేమిటి స్వామీ? వైకుంఠంవాసియైన మీ మొదటి ఆటకాయలో ఆ భోగలాలసత్వం? తృటిలో శతకంఠ రావణుని నోట బడడాన్ని తప్పించుకుంది కూడా!” అంది వైభోగలక్ష్మి, నూటపందొమ్మిదవ గడిలో నోరు తెరుచుకు నిలబడివున్న 'శతకంఠ రావణు”డనబడే పామును తప్పించుకుని నూట ఇరవయ్యో గడిని చేరిన నారాయణుని మొదటి ఆటకాయను చూస్తూ.

“వేదపీఠవు, నీకు తెలియని సుఖభోగసూక్ష్మాలా?” అన్నాడు వేదవేద్యుడు.

“ఈ చిత్రమేమిటో, ఈ లాలసత్వంలోని ధర్మమర్మమేమిటో మీరే వివరించాలి! అంతేకాక శతకంఠ రావణుని గురించి కూడా విశదీకరించండి!” అంది కూర్మరూపిమనోహారిణి.

“దేవీ! రావణుడు ఆర్భాటపరత్వానికి ప్రతినిధి. భయంకరమైన చప్పుళ్ళు చేయడం వల్లే కదా ఆ అసురుణ్ణి 'రావణా' అని పిలిచింది! అంతేగాక, పది తలలున్నా కూడా నిక్కమైన ఆలోచన ఒక్కటైనా చెయ్యలేని వాడు రావణుడు. అలా స్వచ్ఛమైన ఆలోచనలు చేయలేనినాడు మిగిలేది ఆర్భాటం మాత్రమే. అంతఃసౌందర్యం లేని వారిని లోకం నిర్లక్ష్యం చేస్తుంది. ఆర్భాటపరులు చివరకు గుడ్లగూబలా చీకటి జీవితాన్ని గడపాల్సి వస్తుంది.” అన్నాడు రావణవైరి.

“ఓహో! అందుకేనా ఈ ఆటలో శతకంత రావణుని నోట పడిన పావులు గుడ్లగూబ గడికి జారుకునేది?” అంది మందస్మితమదనారవింద ఇందరాదేవి.

ఔనన్నట్టుగా చిరునవ్వు నవ్వాడు సర్వంతర్యామి.

“మరి, ఆ భోగలాలసత్వం గురించి హితబోధ చేయండి స్వామిన్!” అంది కమలలోచని.

“దేవీ! యం అంటే జ్ఞానం అని కదూ వ్యుత్పత్తి?” అన్నాడు సర్వలోక ఉత్పత్తి హేతువైన నారాయణుడు.

“అవును స్వామీ!” అంది సర్వలోకశరణ్య.

“సద్గుణభరితమైన సత్కర్మాచరణం కూడా ఓ యజ్ఞమే. అమలినమై, ఉత్తమసంతానధారణ కారణమైన ఈ భోగం వామయజ్ఞమని పిలువబడుతుంది. ఇది చెప్పు, డెబ్బైఐదవ గడిలోని కర్కోటకుడు మింగితే చేరేది ఎక్కడికి?”

“పదవగడిలోని పందిని.”

“మురికికూపాన్నే అమోఘసుఖంగా ఆస్వాదించడమే పందిలోని గుణం. వ్యర్థ పదార్థాల్ని మేస్తూ అది చేసే శబ్దంలో హేయమైన దాని మలిన సుఖం వ్యక్తమౌతుంది. ఆవిధంగా అసభ్యమైన, అతి జుగుప్సాకరమైన భావాలతో చేసే శృంగారమే విషయలాలసత్వమని అనిపించుకుంటుంది. దీనికి వ్యతిరేకంగా మంచి బిడ్డల్ని కని, భక్తి–వినయం–సత్పాత్రతతో నిండిన సంఘాన్ని నిర్మించాలన్న సంకల్పంతో జరిపే శృంగారం మైథునీభావసృష్టిగా పిలువబడుతుంది. నా నాభికమలం నుండి సృష్టికర్తయైన బ్రహ్మ పుట్టినట్టుగా, తల్లి గర్భంలో పేగుబంధంతో మానవులు పుడతారు. సాధనా శరీరప్రాప్తికి కారణమయ్యే ఈ రతికార్యం మంగళారతిలానే పవిత్రమైంది దేవీ!” అన్నాడు పరమపురుషుడు.

“ధన్యోస్మి స్వామీ, ధన్యోస్మి! నాభి నుండి పుత్రుణ్ణి, పాదం నుండి పుత్రికను ప్రభవింపజేసిన స్వరమణులు మీరు. పురుషునిలోనూ, స్త్రీలోనూ నిలచి వారివారికే ప్రత్యేకమైన ఇంద్రియసుఖాన్ని ఇచ్చి, ఆపై సంతానభాగ్యాన్ని ప్రసాదించేది మీరే. పిమ్మట వారి వార్థక్యంలో యోగ్యులైన పుత్రులలో నిలచి

కాపాడే శిష్టేష్టపరాయణులూ మీరే. మీ లీలలను నేనెన్న తరమా?" అని చేతులు జోడించింది పద్మలోచని.

"మాటలేనా! ఆట లేదా?" నర్మగర్భంగా అన్నాడు పద్మగర్భుడు.

"శ్రీవారి ప్రీతికై...ఇదిగో..." అంటూ పాచికల్ని వేసింది సదమలయోగివృందవందిత చరిత.

మరో మధురపుష్పాన్ని వెదుకుతూ సాగుతున్న మదపు తుమ్మెద రెక్కల ఝుంకారాన్ని ధ్వనిస్తూ పడ్డాయి పాచికలు.

★ ★ ★ ★ ★

ముంబైలోని ఓ ప్రముఖ ఐదు నక్షత్రాల హోటెల్ గదిలో హడావిడి పడిపోతున్నాడు అనంత్. ఆ హడావిడిని కళ్ళప్పగించి చూస్తోంది రంజని.

ప్రతి సంవత్సరం ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ఎంపిక చేసి, బహుమతులిచ్చే సంస్థ ఒకటి "ఇంటర్నెట్ బేస్ట్ బిజినెస్ వెంచ్యూర్స్"లో భాగంగా అనంత్ ను ఎంపిక చేసింది. రానుపోను ఖర్చులు, బస, అన్నీ ఆ సంస్థే చూసుకోవడంతో రంజని సహా వచ్చాడు అనంత్.

ఆనాటి సభలో ఐదు నిముషాల పాటు మాట్లాడే అవకాశం దక్కింది అనంతుకు. దాంతో ఒకదాని తర్వాత ఒకటిగా డ్రస్సుల్ని మార్చి చూసుకుంటున్నాడు. చివరగా టై కట్టడంతో అద్దంలోని ప్రతిబింబం తన కోర్కెకు తగ్గట్టుగా కనబడ్డంతో వెనక్కు తిరిగాడు.

కళ్ళప్పగించి చూస్తున్న రంజని చూసి ఈల వేస్తూ "ఎలా ఉన్నాను?" అన్నట్టు కనుబొమలెగరేసాడు.

బొటనవేలిని చూపుడువేలితో కలిపి 'సూపర్' అన్నట్టుగా సైగ చేసింది రంజని.

అప్పుడు ఆమెను పరీక్షగా చూసాడు అనంత్.

గులాబీరంగు చీరకట్టుతో బాటు కొప్పు వేసుకుని దానికి నిండుగా మల్లెపూలు చుట్టుకుని తయారైన రంజనిని చూసి చిన్నగా కేకపెట్టాడు. "ఏయ్! అమ్మమ్మా! ఏమిటీ వేషం?" అన్నాడు.

“అమ్మమ్మనో, బామ్మనో...ఈరోజుకు నా డ్రెస్ ఇదే. పద లేటైపోయింది.” అంటూ లేచింది రంజని.

“నథింగ్ డూయింగ్...నువ్విలా రావడానికి వీల్లేదు.” అన్నాడు పక్కనేవున్న చైర్లో కూలబడుతూ.

రంజని ముందుకువచ్చి అనంత్ చెయ్యిని పట్టుకుని “ప్లీజ్...నాకు ఈ డ్రెస్సే కంఫర్టబుల్గా ఉంది. ఫోర్స్ చెయ్యొద్దు.” అంది.

ఓసారి రంజని ముఖంలోకి చూసి చేసేదేమిలేనట్టుగా లేచాడు అనంత్.

-----

బాంక్వెట్ హాల్ రకరకాల పెర్ఫ్యూమ్ వాసనలతో ఘుమాయిస్తోంది.

ఎర్రటి లిప్ స్టిక్ ను పులిమేసిన పెదవుల్తో అదే పనిగా నవ్వుతున్న ఓ మణిపురీ అమ్మాయికి తన చేతిలోని ఇన్విటేషన్ కార్డ్ ను చూపాడు అనంత్. అంతేకాక, 'అవార్డీ' అని వ్రాసున్న గుర్తింపు కార్డ్ ను తన కోటులో నుండి బైటకు వేళ్ళాడదీసుకున్నాడు. ఆ అమ్మాయి మరింత నవ్వుతూ, తల కొద్దిగా వంచి “దిస్ సైడ్ ప్లీజ్...” అని అవార్డు గ్రహీతలకు అని వ్రాసున్న డోర్ వైపుకు చెయ్యి చూపింది. హుందాగా లోనికి నడిచాడు అనంత్.

రంజని-అనంత్ తమకు కేటాయించిన టేబుల్ దగ్గర కూర్చున్నారు. ఓ వెయిట్రస్ వచ్చి వాళ్ళకేం కావాలో వ్రాసుకుని వెళ్ళింది. కొన్ని నిముషాలు గడవగానే, ఫుల్ సూట్ వేసుకున్న ఓ బట్టతల పెద్దాయన, స్కర్ట్ లో ఫుల్ షర్ట్ ను టక్ చేసుకున్న ఓ యువతి అక్కడకు వచ్చారు.

“హల్లో అనంత్! ఐ యామ్ వినోద్ దూబే...” అని అనంత్ చేతిని బలంగా లాక్కున్నాడు.

“హల్లో సర్...” అంటూ చైర్లో నుంచి లేచాడు అనంత్. రంజనిని కూడా లేవమన్నట్టు కంటితో సైగ చేసాడు.

“మీట్ షైనా విలియమ్స్...విపి, కార్పొరేట్ కమ్యూనికేషన్స్.” అంటూ ఆ స్కర్ట్ అమ్మాయిని పరిచయం చేసాడు దూబే.

“నైస్ మీటింగ్ యూ షైనా...బై ద వే షీ ఈజ్ మై వైఫ్ రంజని.” అని ఆమె వైపు చేయి చూపించాడు అనంత్. రంజని వైపుకు తిరిగి “ఐ టోల్డ్ యూ నా...మిస్టర్ దూబే...నాకు మొదటి కన్సల్టెంట్ ఆఫర్ ఇచ్చిన వ్యక్తి!” అన్నాడు.

దూబే అనంత్ చెయ్యిని వదిలి రంజని వైపుకు చాచాడు. మళ్ళీ అనంత్ సైగ చెయ్యడంతో తన చేయిని ముందుకు చాచించి రంజని. ఆమె భయపడినట్టుగా కాక ఆమె చేతిని మెల్లగా తన కుడిచెయ్యిలోకి పైన తన ఎడమ చెయ్యివేసి మృదువుగా పట్టుకుని “నైస్ టు మీట్ యూ...మై చైల్డ్!” అన్నాడు దూబే. ఊహించని ఆ సంబోధనకు ఆశ్చర్యపోయింది రంజని.

“యూ నో అనంత్...షీ జస్ట్ లుక్స్ లైక్ మై డాటర్!” అన్నాడు దూబే.

“ఓహ్...ఈజిట్...దట్స్ అ రేర్ కోయిన్సిడెన్స్!” అన్నాడు అనంత్, అవసరానికి మించి ఆశ్చర్యాన్ని నటిస్తూ.

“షైనా! యూ మస్ట్ ట్రై సారీస్....” అన్నాడు దూబే, షైనా వైపుకు చూసి కన్ను కొడుతూ.

ఆ అమ్మాయి ఇబ్బందిగా నవ్వింది.

నలుగురూ మళ్ళీ ఆ రౌండ్ టేబుల్ చుట్టూవున్న నాలుగు కుర్చీల్లోనూ కూర్చున్నారు.

కార్యక్రమం మొదలైంది.

తనకు ఆసక్తి కలిగించే విషయాలేవీ లేకపోవడంతో విసుగొచ్చిన రంజని మాటిమాటికీ అటుయిటూ తల తిప్పుతూ చుట్టూ చూస్తోంది. మళ్ళీ తన వైపే చూస్తూ దొరికిపోయాడా వ్యక్తి. ఇప్పటికి ఓ ఐదార్లు సార్లు జరిగింది. కోపాన్ని ప్రకటిస్తున్నట్టుగా కనుబొమల్ని ముడివేసి, కళ్ళు పెద్దవి చేసింది రంజని. ఆ పాతికేళ్ళ కుర్రవాడు టక్కున తలదించుకున్నాడు.

అదే సమయంలో రంజని వైపుకు చూసిన అనంత్ రంజని చేస్తున్న ముఖ విన్యాసాల్ని చూసి తన మోచేత్తో ఆమెను పొడిచాడు. ఉలిక్కిపడిన రంజని అనంత్ వైపుకు చూసింది. అనంత్ వంగి "ఏమిటా పిచ్చి చేష్టలు?" అన్నాడు చిరాగ్గా.

"వాడెవడో అదే పనిగా నా వైపు చూస్తున్నాడు!" అంది రంజని.

"ఎవరు?"

"అదో...మనకు ఎదురుగా ఉన్న టేబుల్ దగ్గర కూర్చున్న బ్లాక్ కోట్ వాడు."

"అక్కడున్న అందరూ ఆల్మోస్ట్ బ్లాక్ కోట్సే వేసుకున్నారు!" అన్నాడు అనంత్.

"ఎనీ ప్రాబ్లం?" అంటూ వంగాడు దూబే.

"నో...నో...నథింగ్!" అని సర్దుకుని కూర్చున్నాడు అనంత్. "నీ వెర్రివేషాలు స్టాప్ చెయ్!" అని రంజనికి హుకుమ్ జారీచేసాడు.

"హు.." అని తల తిప్పుకుంది రంజని.

\- - - - - -

భోజనాల సమయంలో అటూయిటూ చూస్తూనే వుంది రంజని.

ఆ నల్లకోటు కుర్రవాడు కనబడలేదు.

కాన్ఫరెన్స్ హాల్లోకి వచ్చాక ఆ టేబుల్ వైపుకు చూసింది. ఆ ఒక్క కుర్చీ తప్ప మిగిలిన మూడూ నిండిపోయివున్నాయి.

"ఏమయ్యాడబ్బా?" అని అనుకుంది రంజని.

ఇంతలో అనంత్ మాట్లాడాల్సిన సమయం వచ్చింది.

హుందాగా లేచి, చకచకా వేదిక మెట్లెక్కి, మొహం పై నవ్వు వెలిగిపోతుండగా మైక్ ముందు నిలబడ్డాడు అనంత్. ఫ్లడ్ లైట్స్ వెలుగులో అతను రంజనికి కొత్తగా కనబడసాగాడు.

“లేడీస్ అండ్ జంటిల్మెన్‌...” అంటూ మొదలెట్టిన అనంత్ ఐదు నిముషాల పాటు అనర్గళంగా మాట్లాడాడు. కొన్ని ఉన్నవి, మరికొన్ని లేనివి, కొన్ని దాచిపెడుతూ కొనసాగింది అతని ఉపన్యాసం. ఏదియేమైనా, అనంత్ వాడిన ఇంగ్లీష్, నగిషీ చెక్కినట్లున్న అతని హావభావాలు, ఖంగుమనే అతని గొంతు శ్రోతల్ని ఇట్టే ఆకట్టుకున్నాయి. వీటికి తోడు టెక్నికల్ అంశాలపై అతనికున్న పట్టు కూడా తోడై, ప్రసంగం ముగియగానే జోరుగా చప్పట్లు వినబడ్డాయి.

కావాలనే వేగంగా నడుస్తూ వచ్చి తన కుర్చీలో కూర్చున్నాడు అనంత్.

దూబే, షైనా ఇద్దరూ అతన్ని అమితంగా పొగిడారు. చుట్టుప్రక్కల కూర్చున్నవాళ్ళల్లో కొద్దిమంది లేచివచ్చి అతన్ని అభినందించారు.

ఇంతమంది మధ్యలో రంజని మర్చిపోబడినట్టుగా కూర్చునుంది.

------

హోటల్ గదిలో సామాన్లు సర్దుకుంటున్నారు రంజని, అనంత్.

కాన్ఫరెన్స్ నుంచి వచ్చిన తర్వాత కూడా అనంత్ అక్కడే ఉన్నట్టు మాట్లాడుతున్నాడు. తన ప్రసంగం ముగియగానే వేదికపైనున్న గొప్పవాళ్ళు ఎలా పొగిడిందీ, అక్కడ్నుంచి టేబుల్ దాకా వస్తున్నప్పుడు ఆ మధ్యలో కూర్చున్నవాళ్ళు తనతో చేతులు కలపడానికి ఎలా పోటీపడింది, వినోద్ దూబే ఎంతగా మెచ్చుకున్నదీ, మరీ ముఖ్యంగా ఆ షైనా విలియమ్స్ తన కమ్యూనికేషన్స్ స్కిల్స్ చూసి ఎలా డంగైపోయిందీ.....సాగిపోతూనే ఉన్నాడు అనంత్.

అప్పుడప్పుడూ ఊ కొడుతూ, ఒక్కోసారి 'ఆహా', 'ఓహో' అనడం తప్ప రంజనిలో ఇంకేరకమైన ప్రతిస్పందనా లేదు. అనంత్ అవేవీ పట్టించుకునే స్థితిలో లేదు.

ఎయిర్ పోర్టుకు వచ్చి, విమాన మెక్కాక కానీ అనంత్ నోరు మూతపడలేదు. విమానం గాల్లోకెగరగానే అతను నిద్రలోకి జారుకున్నాడు. రెండు గంటల ప్రయాణంలో రంజని మరోమారు ఒంటరిదైంది.

– – – – – –

ముంబై కాన్ఫరెన్స్ కు బయల్దేరే ముందు కంటే అక్కడి నుంచి వచ్చాక అనంత్ లో మరుగునపడిపోయిన పాత అహంకారం మళ్ళీ తలెత్తినట్టుగా అనిపించసాగింది రంజనికి.

అనంత్ తన ప్రసంగంలో మాటవరసకైనా తన పేరును ప్రస్తావించకపోవడం రంజనికి బాధగా అనిపించసాగింది.

"నిజానికి భర్త తన భార్యను పొగిడి తీరాలా? – అవసరం లేదు! – మరైతే ఎందుకలా డీలా పడిపోతున్నాను? – ఇది డీలా కాదు డైలెమా! – డైలెమానా? – అవును. ఉద్యోగం పోయాక ఏం చెయ్యాలో ఏమీ తోచని అనంత్ కు ఈ బ్లాగ్ ఐడియా ఇచ్చింది తనే. అందువల్ల తన భార్యపైన ఏ మాత్రం ప్రేమవున్నా తన పేరును చెప్పేవాడు, లేదూ ఇద్దరూ కలిసే ఈ ఐడియాను కనిపెట్టామని చెప్పేవాడు. కానీ అనంత్ ఐడియా అంతా తనదిగా చెప్పుకున్నాడు. అంటే తన భార్య మీద ప్రేమ లేనట్టేగా! అంతేకాదు కొన్ని అబద్ధాలు కూడా చెప్పాడు. ఇది చాలదూ అనంత్ మహాస్వార్థపరుడని చెప్పడానికి!"

తను చేస్తున్న ఆలోచన సరైనదో కాదో అర్థం కాని రంజని విసురుగా తల విదిలించింది. కానీ ఆలోచనలు వేటాడ్డం మానలేదు.

"కాసేపు బైటి తోటలో కూర్చునివస్తే బెటర్!" అనుకుంటూ సీట్లో నుంచి లేచి బైటకొచ్చింది రంజని.

ఆఫీస్ కు ఎదురుగావున్న మున్సిపల్ పార్క్ కు వెళ్ళాలంటే రోడ్డు దాటాలి. వాహనాల ప్రవాహం ఆగకుండా రెండువైపులా సాగుతూనే ఉంది.

వాహనాల రద్దీ కొద్దిగా తగ్గగానే రోడ్ దాటేందుకు గబాగబా అడుగులు వేయసాగింది రంజని. అంతలో వెనుక సడెన్ బ్రేక్ వేసిన చప్పుడు, టైర్లు నేలను రాచుకుంటూ ఆగిన చప్పుడు వినబడింది. వెనక్కు తిరిగింది రంజని.

నల్ల కళ్ళద్దాలు పెట్టుకుని, చేతిలో ఎరుపు, తెలుపు చారలున్న కర్రతో ఓ మధ్యవయస్కుడు నిలబడివున్నాడు. అతనికి అర ఇంచు దూరంలో కారు ఆగివుంది. ఆ మధ్యవయస్కుడు కర్రను అటూయిటూ ఊపుతున్నాడు. రంజని గబగబా వెనక్కువచ్చి అతని చెయ్యి పట్టుకుని "నాతో రండి!" అని రెండడుగులు ముందుకు నడిపించి, ఆగి, వెనక్కు తిరిగి ఆ కార్ నడుపుతున్న వ్యక్తికి బొటనవేలెత్తి 'థమ్స్ అప్' అన్నట్టుగా చూపింది. దూకుడుగా వచ్చిన రంజని తనపై అరచి గోలచేస్తుందేమోనని భయపడ్డ ఆ డ్రైవర్ నమస్కారం చేస్తున్నట్టు రెండు చేతులూ జోడించి కారును ముందుకు నడిపాడు. ఆ వెనకాలే అదేపనిగా హారన్లు కొడుతున్న వాళ్ళు వీళ్ళిద్దరినీ తిట్టుకుంటూ ముందుకు ఉరికారు.

"ఒక్క సెకండులో ఎస్కేపయ్యారు!" అంది రంజని ఆ అంధుణ్ణి నడిపిస్తూ.

అతను ఏమీ మాట్లాడక నవ్వాడు.

రోడ్డు పూర్తిగా దాటాక "మీరెక్కడికెళ్ళాలి?" అంది రంజని.

చొక్కా జేబులో తడిమి తడిమి ఓ కాగితపు ముక్కను తీసాడతను.

రంజని ఆ ముక్కను తీసుకుని చూసింది.

"ఫ్లాట్ నెం. 1016, నెం. 73, డైమండ్ స్క్వేర్ అపార్ట్మెంట్స్, వివేకానంద నగర్" అని వ్రాసుంది.

"ఓహ్! ఈ అడ్రెసున్న ఏరియా ఇక్కడికి చాలా దూరమండీ!" అంది రంజని ఆ కాగితం ముక్కని అతని చేతిలో పెడుతూ.

"దూరమైనా తప్పక వెళ్ళాలండీ. దగ్గర్లో సిటీ బస్టాప్ ఉందా?" అన్నాడు ఆ ముక్కని జాగ్రత్తగా జేబులో పెట్టుకుంటూ.

“బస్టాప్ ఉంది. కానీ కనీసం రెండు మూడు బస్సులైనా మారాలి.” అంది రంజని.

“తప్పక వెళ్ళాలి.” అన్నాడతను.

అతని కర్రను పైకెత్తి నేరుగా పెట్టి “ఇక్కడ్నుంచి నేరుగా ఓ హండ్రెడ్ ఫీట్ వెళ్తే బస్టాప్ వస్తుంది. నెంబర్ 276E బస్సు ఎక్కాలి.” అంది రంజని.

“థాంక్సండి. ఫర్ హెల్పింగ్ మీ టు క్రాస్ ది రోడ్ అండ్ ఫర్ గైడింగ్ టూవర్డ్స్ బస్టాప్.” అని రెండు చేతుల్నీ కలిపి నమస్కారం చేసి నెమ్మదిగా ముందుకు నడిచాడా వ్యక్తి.

అతను ఓ నాలుగడుగులు నడిచే దాకా అక్కడే నిలబడి చూస్తున్న రంజనికి అతను వెళ్ళాల్సిన దూరాన్ని తల్చుకోగానే బాధేసింది. చూస్తుంటే ఊరికి కొత్తవాడిలా ఉన్నాడు, ఆపై కంటిచూపు లేదు. ఎందుకో రంజనిలో అమితమైన జాలి పుట్టుకొచ్చింది. పరుగులాంటి నడకతో అతని దగ్గరకెళ్ళింది.

“ఏమండీ! నేనే!” అంది అతని చెయ్యి పట్టుకుని.

“ఓహ్! మీరా! చెప్పండి. వేరే నెంబర్ బస్సు ఎక్కాలా?” అని అడిగాడు.

“కాదు..కాదు. మీరిక్కడే ఉండండి. నా కార్ తీసుకొస్తాను. మిమ్మల్ని డ్రాప్ చేసివస్తాను.” అంది.

“అయ్యొయ్యో! నా కోసం అంత దూరం వస్తారా? వద్దండీ. కళ్ళు కనబడని వాడికి చీకటి భయం లేదులేండి.” అని నవ్వాడు.

“పర్లేదు. మీరిక్కడే ఉండండి. కదలకండి. బస్సెక్కకండి.” అని చెప్పి అతను వద్దంటున్నా మళ్ళీ రోడ్డు దాటే ప్రయత్నంలో పడింది రంజని.

– – – – – –

విశ్వేశ్వర్ అన్న పేరుగల ఆ నడివయసు అంధుణ్ణి ఆ అడ్రెస్ వద్ద రంజని దింపేసరికి ఆరుగంటలైంది. అతను అనేకమార్లు రంజనికి కృతజ్ఞతలు చెప్పి కాంప్లెక్స్ మైన్ గేట్ దాటి లోనికెళ్ళాడు.

ఓ పెద్ద నిట్టూర్పు విడిచి కార్ ను స్టార్ట్ చేసింది రంజని.

– – – – – –

రంజని ఫ్లాట్ కు వచ్చేసరికి WELCOME డోర్ మాట్ రివర్స్ లోనే ఉంది. "అంటే, అనంత్ ఇంట్లో లేదు. ఎక్కడికెళ్ళాడు? ఫోన్ చెయ్యలేదు కనీసం మెసేజ్ కూడా పంపలేదు!" అనుకుంటూ డోర్ తెరిచింది.

ఆరాత్రి దాదాపు పన్నెండున్నరకు ఇంటికొచ్చాడు అనంత్.

బాగా నిద్రలోనున్న రంజని నిద్రమత్తులో జోగుతూ వాకిలి తెరిచింది.

ఏమీ మాట్లాడకుండా లోనికొచ్చిన అనంత్ చకచకా బట్టలు మార్చుకుని పడుకునేసాడు.

ఏదో కారణం చెబుతాడని అనుకున్న రంజని మారుమాట్లాడకుండా పడుకునిపోయిన అనంత్ ను ఆశ్చర్యంగా చూసింది.

"ఎక్కడికెళ్ళావ్?" అని అడిగింది రంజని.

"అదా...అదీ...ముంబై నుంచి షైనా వచ్చింది. ఓ మార్కెటింగ్ మీటింగ్ వుంటేను నన్నూ జాయినవమని సాయంత్రం ఫోన్ చేసింది. వెళ్ళాను. క్లైంట్స్ డిన్నర్ కు వెళ్దామనడంతో కాదనలేక వెళ్ళాను."

"అంతేగా! నాకు కనీసం మెసేజైనా ఇవ్వొచ్చుగా? పదకొండు దాకా చూసి అప్పుడు తిన్నాను." అంది రంజని అతని పక్కనే పడుకుంటూ.

అటువైపే తిరిగి పడుకునివున్న అనంత్ "సారీ!" అన్నాడు.

ఇంకేం మాట్లాడాలో తోచని రంజని అతని భుజం మీద చేయి వేయబోయి వెనక్కి తీసేసుకుని పడుకుంది.

కంటికి కనబడని గోడ ఒకటి తమ మధ్య మళ్ళీ మొలుస్తున్నట్టుగా కలవపడసాగింది రంజని.

ఆ రాత్రి కలలో___.మసక చీకటి నిండిన గదిలో ఓ నల్లటి ఆకారం ఒడిలో అనంత్ పడుకున్నట్టు, అతని చేతులు కాళ్ళని ఆ నల్లటి ఆకారం విరిచిపట్టుకున్నట్టు, ఆ గది బైట వెలుగులో తను "అనంత్..అనంత్" అని పిలుస్తున్నట్టు, ఆమె పిలుపు విని ఆ ఆకారం భయంకరంగా నవ్వింది. అనంత్ భయంతో కేకలు పెట్టసాగినట్టు కల గనింది రంజని.

_ _ _ _ _ _

"క్షణం క్రితమే కర్కోటకుడి గురించి మాట్లాడుకున్నాము. ఈలోపు నీ రెండో ఆటకాయ వాడి నోటిలో చిక్కి వరాహమైపోయిందేమి దేవీ?" అన్నాడు సురమునిహృదయ పాలకుడు.

"కామాతురాణాం న భయం న లజ్జ స్వామీ!" అంది హరిప్రియ. "క్రితంలో మీరు వివరించినట్టుగా తన భార్యను విడిచి వేరొకరి స్త్రీ పట్ల ఆసక్తి చూపేవాడికి, ఆ వరాహానికీ తేడా లేదు!" అంది నిరుతకన్య.

"మరి ఆ వరాహం వరహాల మూట అయ్యేదెలా?" అన్నాడు అగణితగుణగణమండితుడు.

"తన భార్య పట్ల మక్కువ చూపడంతోనే!"

"అది జరిగే పనేనా?"

"మీ అనుగ్రహం ఉంటేనే! మరి, సుఖభోగవిలాసంలో మునిగివున్న మీ రెండో పావు తదుపరి పయనం?" అంది శుభ్రశోభనగాత్రి.

"నీ ఉత్సుకతను ఆపడం భావ్యం కాదులే! ఏమౌతుందో నువ్వే చూడు." అంటూ పాచికల్ని వేసాడు సర్వోత్తముడు.

ఆయన కరకమలాల నుండి విడివడిన పాచికలు కృష్ణ గాఢాలింగనా వర్జితులైన గొల్లభామల నిట్టూర్పుల్లా శబ్దించాయి.

★ ★ ★ ★ ★

వచ్చిన ఆ ఐదుమందితో కేశవశర్మ మాట్లాడ్డం మొదలుపెట్టి దాదాపు గంట పైనే కావస్తోంది. లోనవున్న సుమతికి విషయమేంటో పూర్తిగా అర్థం కాలేదు గానీ ఆ వచ్చినవాళ్ళలో ఇద్దరు కుఱ్ఱ దంపతులనీ మిగిలిన ముగ్గురిలో ఇద్దరు అబ్బాయి తల్లిదండ్రులు, ఒకరు అమ్మాయి అన్న అని తెలిసింది. ఏదో వివాహ సమస్యల్లే ఉంది.

మరికొద్దిసేపటి తర్వాత ఆ యువ దంపతులు కేశవశర్మ కాళ్ళకు నమస్కరించారు. పెద్దవాళ్ళు కూడా ఆయనకు నమస్కారం చెప్పారు. ముత్తైదువులకు కుంకుమ ఇవ్వమని సుమతిని పిలిచాడు శర్మ.

వాళ్లందరూ అక్కడి నుంచి కదిలారు.

అందరి ముఖాలపైనా నవ్వులు.

“సుమతీ!” అని పిలిచాడు శర్మ.

హాల్లోకి వచ్చింది సుమతి.

“అంతా సక్రమంగా జరిగింది.” అన్నాడు శర్మ.

“వాళ్ళ ముఖాలపైని నవ్వే చెబుతోంది!” అంది సుమతి చిరునవ్వుతో.

“ఏం జరిగిందో తెలుసుకోవాలని లేదా?” అన్నాడు శర్మ.

“నాకు తెలియాల్సిన విషయాల్ని మీరు చెబుతారుగా!” అంది సుమతి.

తన పైన ఆమెకున్న నమ్మకాన్ని చూసి సంతోషించాడు శర్మ.

“ఈ సంబంధాన్ని కుదిర్చింది, పౌరోహిత్యం నిర్వహించిది నేనే. అందువల్ల వాళ్ళు యుద్ధానికి రాలేదనుకో! ఆ అమ్మాయి తల్లిదండ్రులకి మా నాన్నగారు బాగా తెలిసినవారు. అందుకనే ఇక్కడికొచ్చారు.” అన్నాడు శర్మ.

“ఓహో! ఇంతకీ సమస్య ఏమిటో?” అంది సుమతి.

“చర్విత చర్వణం. ఈకాలం కొత్త దంపతుల్లో చాలామందికి ఎదురయ్యే సమస్యే! తల్లా–పెళ్ళామా?” అన్నాడు శర్మ నవ్వుతూ.

“మీకు ఎదురుకాని ఈ సమస్యను ఎలా పరిష్కరించారో?” అని అర్థోక్తిలో ఆగింది సుమతి.

“సుమతీ! కొన్ని సమస్యల్ని ప్రత్యక్షంగా అనుభవించకపోయినా ఆ సమస్యల్ని దగ్గరి నుంచి చూడ్డం ద్వారా అవగాహన పెరుగుతుంది. ఎప్పుడో ఒకప్పుడు అది ఉపయోగపడుతుంది. ఇక్కడా అదే జరిగింది.” అన్నాడు శర్మ.

“మరి, చివరకు వాళ్ళ సమస్య పూర్తిగా తీరినట్టేనా?”

“*నా తప్త లోహో లోహేన సంధీయతే* – కాల్చకుండా ఒక లోహం మరో లోహంతో అతుక్కోదు. ఆవిధంగానే కష్టాలనే వేడి తగిలిన మనుష్యులు ఆ కష్ట నివృత్తి కోసం దగ్గరౌతారు. ఈ కొత్త దంపతుల విషయంలో కూడా అదే జరిగింది. దైవీకమైన దోషాలను శాంతికర్మలతోను, మానవ తప్పిదాలను నేర్పుతోనూ నివారించుకోవాలని చాణుక్యుడు చెబుతాడు. ఆవిధంగా వాళ్ళిద్దరి మధ్యా ఉన్న అనుమానమనే తప్పును శాస్త్ర విజ్ఞానమనే నేర్పుతో తొలగించడంతో ఈరోజు ఒక్కటైయ్యారు.”

“బాగుంది. వారికి చెప్పిన శాస్త్ర విషయాల్నీ నాకూ చెప్పండి.”

“సుమతీ! ఈ శాస్త్రవిజ్ఞానమన్నది ఏ ఒక్కరికో, నలుగురికో తెలిసినదని అనుకోరాదు. మనందరికీ తెలిసిన విషయాలే! కానీ ఆ విజ్ఞానాన్ని ఎక్కడ, ఎలా అన్వయించుకోవాలో తెలియనప్పుడే సమస్యలు బయల్దేరుతాయి. మనుష్యుల జీవితాలన్నీ ’అభిప్రాయా’ల వల్లనే నడుస్తాయి. చెడ్డవారిపై మంచి అభిప్రాయమున్నప్పుడు వాళ్ళెలాంటి తప్పులు చేసినా సర్దిపుచ్చేసుకుంటాం. దీనికి వ్యతిరేకంగా మంచివారి పట్ల చెడు అభిప్రాయాల్ని ఏర్పరచుకున్నప్పుడు వాళ్ళు మనకు మంచి చేయబోయినా తిరస్కరిస్తాం. కల్లు అమ్మినవాడు పాలు అమ్మబోతే ఆ పాలను కల్లుగానే భావిస్తుంది లోకం.”

“అవును! ఈ పోలిక చక్కగా ఉంది.” అంది సుమతి.

"తల్లిదండ్రుల్ని వదలి వచ్చాను గనుక నన్నే ప్రేమించాలన్నది ఆ అమ్మాయి అభిప్రాయం. నీతో బాటూ నావాళ్ళనూ ప్రేమించడం నా కర్తవ్యమన్నది అబ్బాయి అభిప్రాయం. రెండు పచ్చికుండలు ఢీకొంటే వాటికి రక్షణ ఉంటుందా?"

"లేదు. రెండూ పగిలిపోతాయి."

"వాళ్ళ జీవితాలూ అలానే అయ్యాయి. జీవితం యొక్క అర్థాన్నీ, లోతునీ తెలుసుకోని యువత పచ్చికుండల్లాంటివే. అలాంటివాళ్ళు అభిప్రాయభేదాలతో ఒకరినొకరు ఢీకొంటే మిగిలేదు పగిలిన జీవితాలే!"

"సులభమైన పోలికతో ఎంతో బరువైన సత్యాన్ని చెప్పారండీ!" అందు సుమతి మెచ్చుకోలుగా.

"పిచ్చిదానా! ఇందులో నా స్వంతమైన మాట ఒక్కటీ లేదు. అంతా మన పూర్వీకులు చేసిన ఉపదేశాల్లోనివే!" అన్నాడు శర్మ.

ఒప్పుకుంటున్నట్టుగా తలాడించిన సుమతి "ప్రియమైనవాళ్ళు స్వార్థపరులు కాకూడదని మీరే ఒకసారి చెప్పారు. అలా చూసినపుడు తన భర్తను ఆ అమ్మాయి అలా అడగడంలో తప్పులేదుగా?" అంది.

తన నుండి మరిన్ని విషయాలను రాబట్టడానికే ఈ ప్రశ్న వచ్చిందని అర్థం చేసుకున్న శర్మ కొనసాగించాడు.

"నిజమే! కానీ తనవాళ్ళనుకున్న వారి విషయంలో కూడా మర్యాదలను అతిక్రమించరాదని పెద్దలు చెప్పారు. భర్త తనను ప్రేమించాలన్న అమ్మాయి అభిప్రాయం తప్పుకాదు. కానీ తనొక్కర్తినే ప్రేమించాలన్న షరత్తు మంచిది కాదు. ఎందుకంటే పరాయివాళ్ళందరూ శత్రువులు కారు. మన మంచిని కోరని బంధువుల కంటే మన ఉన్నతిని కోరే పరాయివాళ్ళే హితులు. కాబట్టి తన భర్త తల్లిదండ్రులు హితులా, అహితులా అన్నది తేల్చుకోకుండానే తొందరపడడం ఆ అమ్మాయి తప్పు." అన్నాడు శర్మ.

"అవును. ఆ తొందరపాటు తప్పే!" అంది సుమతి అంగీకరిస్తున్నట్టుగా.

“సుమతీ! అందరూ సుఖాన్నే కోరుకుంటారు. ఆ సుఖం మరో వ్యక్తి ద్వారానో, వస్తువు ద్వారానో, యంత్రాల ద్వారానో దొరుకుతుందని భ్రమపడుతుంటారు.”

“అంటే..!! సుఖం వీటన్నింటివల్లా దొరకదా?” అడిగింది సుమతి.

“ఊహూ!” అన్నాడు శర్మ తలను అడ్డంగా ఆడిస్తూ.

“ఆశ్చర్యం! అదెలా సాధ్యం? మీనుండి నాకు సుఖం లభిస్తోంది. స్వంత ఇల్లు ఉండడం వల్ల కూడా సుఖం కలుగుతోంది.” అని ఆగింది సుమతి.

విశాలంగా నవ్వాడు శర్మ.

“పిచ్చిదానా! నువ్వన్నదంతా సరిగ్గానే ఉంది. కానీ కేవలం నావల్లనో, ఈ నాలుగ్గోడల వల్లనో నీకు సుఖం దొరకడం లేదు.” అన్నాడు శర్మ.

“నాకు అర్థం కావడంలేదు!” అని బిక్కమొహం వేసిన భార్యను చూసి కదిలిపోయాడు శర్మ.

ఆమె భుజం పట్టుకుని “సుమతి! నావల్ల నీకు కలుగుతున్న సుఖం ఒక వ్యక్తిగా నేనిస్తున్నది కాదు. నా పట్ల నీలో ఉన్న’భర్త’ అన్న అనుసంధానం వల్ల. అలాగే ఈ ఇంటి వల్ల కలుగుతున్న సుఖం కూడా ’ఇది దేవుని నివాసం’ అన్న భావన వల్ల. ఇలా ఇలా అనుకోవాలని, అనుసంధానించుకోవాలని మనకు చెప్పి సరిదిద్దేదే శాస్త్రం. అర్థమైందా?” అన్నాడు శర్మ.

“అంటే సుఖమన్నది శాస్త్రం వల్లనే దొరుకుతుంది___” అని అంది సుమతి.

“అవును! మానవుల శరీరాలకు నిజమైన సుఖాన్నిచ్చేది శాస్త్ర విహితమైన ఆచరణ మాత్రమే!” అన్నాడు శర్మ.

“ఇదేనా మీరు వాళ్లకి చెప్పింది?” అంది సుమతి అతని భుజంపై తలను ఆనిస్తూ.

“ఇదే చెప్పాను___.వాళ్ళకర్థమయ్యే విధంగా!”

“అర్థం చేసుకుంటే వాళ్ళంత అదృష్టవంతులు ఉండరు.”

“వాళ్ళు అదృష్టవంతులవ్వాలని ఆశీర్వదించు!” అన్నాడు శర్మ నవ్వుతూ.

“ఏ జన్మలో ఎవరు ఆశీర్వదించారో, ఈ జన్మలో నేను చాలా అదృష్టవంతురాల్నే.” అందు సుమతి.

“నిజంగా?” అని ప్రశ్నిస్తున్నట్టు అన్నాడు శర్మ.

“అవును. అనుమానమెందుకు? నన్నొక విలాసవస్తువుగా చూడని భర్త దొరికారు. నిజమైన సుఖమంటే ఏమిటో తెలిసిన భర్తతో జీవితం గడపడం అదృష్టం కాదా?” అంది సుమతి.

“న స్త్రీ సమం రత్నమ్” అని మనసులో అనుకుంటూ సుమతిని పసిపాపను పొదవిపట్టుకున్నట్టు తన చేతుల మధ్య తీసుకున్నాడు శర్మ.

★ ★ ★ ★ ★

“అద్భుతం మహాభాగా! మీ రెండో ఆటకాయ చివరి రెండు పాముల్ని దాటుకుని జన్మరాహిత్యమనే నూటాఇరవైమూడో గడిని చేరింది. ఈ ఆటకాయ నడకలో గ్రహించాల్సిన నడవడికను వివరించి, ఉద్ధరించండి!” అని ప్రార్థించింది విద్యాశీలయైన సులక్షణాదేవి.

“అవశ్యం దేవీ! ’నిష్కృష్టరూపేణ ప్రాపంచిక సుఖభోగరాహిత్యం వైరాగ్యం’ అని శాస్త్రకారులు చెబుతున్నారు. అంటే దుఃఖాలకే దారితీసే భౌతిక సుఖాల్ని వదిలిపెట్టి, ధర్మదేవత రూపంలో నేను ఉపదేశించిన ఉత్తమ కర్మలని ఆచరించడాన్నే వైరాగ్యమంటారు. అలాంటి వైరాగ్యధారులే ఈ వైకుంఠంలోకి ప్రవేశించడానికి అర్హులు. వైకుంఠమంటే పుణ్యజనసేవితపురం అని మరో అర్థం. ఆవిధంగా నా రెండో ఆటకాయ పుణ్యజనుల్లో ఒకటి. అది కామంలో కూడా ఆధ్యాత్మిక భావాన్ని చూడగలుగుతోంది. నా మొదటి ఆటకాయ కూడా అదే భావనతో నిండివుంది. వారి మధ్య జరిగిన, జరుగుతున్న కామకలాపం కలికాలంలో సాగే వికృతకామం వంటిది కాదు. ఇది శాస్త్ర సమ్మతమైన దాంపత్యసుఖభోగం. చర్మదేహాల రాపిడిని సుఖమని భ్రమపడకుండా, ఉత్తమమైన సంతానాన్ని ఫలంగా ఆశిస్తూ యజ్ఞానుసంధానంతో దాంపత్యజీవితాన్ని సాగించే వైరాగ్యశీలులకు జన్మరాహిత్యమే

తదుపరి ప్రస్థానం. చూడు దేవీ! జన్మరాహిత్యమనే నూటాఇరవైమూడవ గదిలో 'ఠ' అన్న అక్షరం ఉంది!" అన్నాడు జన్మాదృష్టకర్తృత్వధారి.

"అవును స్వామీ! జన్మరాహిత్యానికీ ఠకారానికీ గల సంబంధం?" అని అడిగింది మారజనని.

"ఠ అంటే శూన్యమని అర్థం దేవి. చావు–పుట్టుకలనే చక్రం శూన్యమవడం అంటే ఆగిపోవడమే జన్మరాహిత్యం!" అన్నాడు సర్వజీవజన్మవిచ్ఛేదకారకుడు.

"ధన్యోస్మి దేవా! ధన్యోస్మి!" అని నమస్కరించింది మూలప్రకృతీస్వరూపిణి.

"నీ మొదటి ఆటకాయ బ్రహ్మలోకంలోనే ఉండిపోయింది. ఆటకాయలు నడకను మర్చిపోరాదు సుమా!" అన్నాడు

"చక్కగా గుర్తుచేసారు స్వామీ! అమోఘశీలురైన మీ ఆటకాయల ముందు నా కాయలు వెలవెలబోతూ కుంటినడకలు నడుస్తున్నాయి." అంది చంద్రసమానానన.

"అలా అనకు దేవీ! వైకుంఠపాళిలోని నిచ్చెనలు విహితకర్మలకు నిదర్శనం. పాములు నిషేధ కర్మలను సూచిస్తాయి. ధర్మాధర్మాల ఎగుడు దిగుడు నడకే ఈ ఆట. పాచికలు క్రియల్ని సూచిస్తాయి. పాచికలపైని సంఖ్యలు కర్మల్ని సూచిస్తాయి. క్రియలంటే ప్రవృత్తి అని అర్థం. కర్మ అంటే క్రియాఫలమని అర్థం. జీవులు ఆటకాయలు. ధర్మపరులైన జీవులు మంచి కర్మలను చేసి, మంచి ఫలాన్ని పొంది, నిచ్చెనలను ఎక్కుతారు. అధర్మవర్తనులైన వారు చెడు కర్మలను చేసి, దుఃఖానికి లోనై, పాముల నోట పడతారు. ఆట పూర్తికావడమంటే మోక్షం లభించడమే. కానీ ఆట ముగిసేలోగా ధర్మపరులు అధార్మికులుగానూ, అధార్మికులు ధర్మపరులుగానూ మారుతుంటారు. కాబట్టి తాత్కాలిక స్థాయీ భేదాలకు అట్టే మనసు విరుచుకోకూడదు ప్రియా!" అన్నాడు సత్యధర్మపరాయణుడు.

"చిత్తం స్వామీ! సర్వులకూ మీరే ప్రేరకులు. మిమ్మల్ని స్మరిస్తూ నడిపిస్తే నా ఆటకాయలు కూడా ధర్మమార్గ సంచారులు కాగలరు." అని భక్తితో మ్రొక్కి పాచికల్ని వేసింది జగదంబ.

పారిజాత హరణోద్యోగ ఉద్యుక్త కృష్ణసత్యాభామల్ని ఎదుర్కొన్న ఇంద్రుని ఐరావతానికి అలంకరించిన బంగారు గంటల్లా ధ్వనించాయి పాచికలు.

★ ★ ★ ★ ★

"రంజనీ! మీ కోసం ఓ విజిటర్ వచ్చారు...విశ్వేశ్వర్ ఈజ్ ద నేమ్!" అన్న రిసెప్షనిస్ట్ మాటలు విన్న రంజని ఆ వచ్చింది ఎవరాని ఆశ్చర్యపోతూ "ఎవరు? ఎక్కడ్నుంచి వచ్చారు?" అంది.

"విశ్వేశ్వర్" అని గట్టిగా అన్న రిసెప్షనిస్ట్ "బ్లైండ్ పర్సన్!" అని మెల్లిగా అంది.

చివరి మాటతో రంజనికి వచ్చిందెవరో అర్థమైంది.

"ఓహ్! ఆయనా! ఎనీ మీటింగ్ రూమ్ వేకెంట్?" అని అడిగింది. "యా! మౌంట్ ఎవరెస్ట్!" అంది ఆ రిసెప్షనిస్ట్. "ఓకే! అతణ్ణి అక్కడ కూర్చోబెట్టు. ఐదు నిముషాల్లో వస్తాను." అంది రంజని.

ఎప్పుడో రెండు నెలల క్రితం అనుకోకుండా కలిసిన విశ్వేశ్వర్ ఈరోజు తనని వెదుక్కుంటూ వచ్చిందెందుకో అని ఆలోచిస్తూ విజిటర్స్ లౌంజ్ లోకి వచ్చింది రంజని.

"హీ ఈజ్ దేర్! ఇన్ సైడ్!" అని మీటింగ్ రూమ్ కేసి చేయి చూపించింది రిసెప్షనిస్ట్.

తలుపు తీసిన చప్పుడు విన్న విశ్వేశ్వర్ ఛైర్ లో నుంచి లేచి నిలబడ్డాడు.

"అరెరే! ఎందుకు నిలబడ్డారు? కూర్చోండి...ప్లీజ్!" అని అంది రంజని.

"థాంక్స్ మేడమ్! నేను గుర్తున్నాను కదూ!" అన్నాడు అతను.

"ఎస్..ఎస్..గుర్తున్నారు! బట్ రిసెప్షనిస్ట్ మీ పేరు చెప్పినప్పుడు ఇమ్మీడియట్గా గుర్తుతెచ్చుకోలేకపోయాను!" అంది.

"బ్లైండ్ పర్సన్ అనగానే గుర్తుకొచ్చేసాను!" అన్నాడు అతను నవ్వుతూ.

"నో..నో...అలా కాదు!" అన్న రంజని కంగారుగా "సారీ!" అని అంది.

“నా గుడ్డితనం వల్లనే మీరు నన్ను గుర్తుపెట్టుకున్నారు. ఆరోజు అంత గొప్ప సహాయం చేసారు. దేవుడు చేసే ప్రతిదానికీ ఒక అర్ధముంటుంది. ఇందుకు మీరు సారీ చెప్పాల్సిన పనిలేదు.”

రంజని ఇబ్బందిగా ఫీలైంది. “మీరు ఏం తీసుకుంటారు? కాఫీ, టీ!”

“కాఫీ” అన్నాడు విశ్వేశ్వర్.

ప్యాంట్రీకి డయల్ చేసి “టూ కాఫీ...మౌంట్ ఎవరెస్ట్ కు” అంది రంజని.

“ఏమిటీ? మనం మీ ఆఫీసులో లేమా?” అన్నాడు విశ్వేశ్వర్ చిరునవ్వుతో.

“గుడ్ జోక్! మా కంట్రీ హెడ్ చాలా క్రియేటివ్ థింకర్. మనం ఇప్పుడు టాప్ ఫ్లోర్...అంటే ఫోర్త్ ఫ్లోర్ లో ఉన్నాం. ఇక్కడున్న మీటింగ్ రూములన్నింటికీ వరల్డ్ ఫేమస్ మౌంటెన్స్ పేర్లు పెట్టాడాయన.” అంది రంజని.

“ఓహో! ఐతే గ్రౌండ్ ఫ్లోర్లో ఉన్న రూములకి నదుల పేర్లు పెట్టారా?” అన్నాడు విశ్వేశ్వర్.

“ఎగ్జాట్లీ! ఎలా గెస్ చేసారు?” అంది రంజని.

చిరునవ్వే సమాధానంగా ఇచ్చాడు విశ్వేశ్వర్.

“మరి ఫస్ట్, సెకండ్, థర్డ్ ఫ్లోర్స్ లో ఏం పేర్లు పెట్టుంటారో చెప్పండి?” అంది రంజని, క్విజ్ మాస్టర్లా.

“మీరు నన్నేదో గొప్ప మేధావిననుకున్నట్టున్నారు!”

“ఇప్పటికిప్పుడైతే అలా అనుకోవడం లేదు. నా ప్రశ్నకి సరిగ్గా ఆన్సర్ చేస్తే తప్పకుండా అలానే అనుకుంటాను.” అంది రంజని.

“కాఫీ వచ్చేదాకా టైమ్ పాస్ అంటారు. సరే..లెట్ మీ థింక్...మ్ మ్ మ్...ఫస్ట్ ఫ్లోర్లోనివి అడవుల పేర్లతో ఉండొచ్చు. సెకండ్ ఫ్లోర్ లోనివి హిస్టారికల్ మాన్యుమెంట్స్ పేర్లతో ఉండొచ్చు. థర్డ్ ఫ్లోర్ లోనివి జలపాతాల పేర్లతో ఉండొచ్చు.” అన్నాడు విశ్వేశ్వర్.

మెల్లిగా చప్పట్లు కొట్టింది రంజని "బుల్స్ ఐ...ఎక్సెప్ట్ సెకండ్ ఫ్లోర్" అంది రంజని.

"చూసారా! నేను మేధావిని కాను." అన్నాడు విశ్వేశ్వర్.

"ఎందుక్కాదూ! మీకు నూటికి తొంభై మార్కులు వచ్చాయి. కాబట్టి మీరు జీనియస్సే!" అంది రంజని.

ఆఫీస్ బాయ్ కాఫీలతో రావడంతో వాళ్ళ మాటలు ఆగాయి.

ఒక సిప్ తర్వాత విశ్వేశ్వర్ అన్నాడు – "రంజని గారు! నేను మీకు థాంక్స్ చెప్పుకుందామని మిమ్మల్ని డిస్టర్బ్ చేసాను."

"థాంక్సా? ఎందుకండీ?" అంది రంజని.

"ఆరోజు మీరు నన్ను కారులో తీసుకెళ్ళకపోయుంటే నా చెల్లెలు జైల్లోకెళ్ళేది!" అన్నాడు అతను.

తుళ్ళిపడిన రంజని "వాట్?" అని గట్టిగా అడిగింది.

"అవును మేడమ్! నా చెల్లెలు ఆ కాంప్లెక్స్ లో బిల్డింగ్ మెంటెనెన్స్ టీమ్ లో పనిచేసేది. ఓ ఫ్లాట్ ఓనర్ గారి డైమెండ్ జ్యువెలరీ సెట్ పోగొట్టుకుపోవడంతో, ఆమె ఇంట్లో పనిచేసేవాళ్ళందరి మీదనే కాక ఆ బిల్డింగ్ మెంటెనెన్స్ స్టాఫ్ పైన కూడా కేసు పెట్టింది. ఆ సెట్ పోగొట్టుకుపోయేందుకు కొన్ని గంటల ముందు నా చెల్లెలు ఆ ఫ్లాట్ కు వెళ్ళింది."

"ఎందుకు?" అని అడ్డుపడి అడిగింది రంజని.

"నా చెల్లెలు హెల్ప్ డెస్క్ లో పనిచేస్తుంది. ఆ ఫ్లాట్ ఓనర్ ఇచ్చిన ఓ కంప్లెంట్ ను ఎలెక్ట్రీషియన్ పూర్తి చేసాడా లేదా అని చెక్ చెయ్యడానికి వెళ్ళింది. ఆమె, ఆ ఎలెక్ట్రీషియన్నూ వెనక్కు వచ్చేసిన చాలాసేపటికి ఆ ఓనర్ తన డైమెండ్ సెట్ పోయినట్టుగా తెల్సుకుని నేరుగా పోలీసులకి ఫోన్ చేసింది. వాళ్ళు రాబోయే కొద్ది నిముషాల ముందు బిల్డింగ్ మేనేజర్ కు ఫోన్ చేసి విషయాన్ని చెప్పింది. ఆపై ఓనర్స్ అసోషియన్ వాళ్ళకీ ఫోన్లు చేసింది. ఓ పదిహేను నిముషాల్లో పోలీసులూ, అసోసియేషన్ వాళ్ళూ నా చెల్లిని, ఆ ఎలెక్ట్రీషియన్నూ ఓ గదిలో కూర్చోబెట్టి నానా ప్రశ్నలూ వేసారు."

“ఓహ్!” అంది రంజని, చైర్లోనుండి ముందుకు వంగుతూ.

“బిల్డింగ్ మేనేజర్ నాకు ఫోన్ చేయడంతో నేను మా ఊరి నుంచి బయల్దేరాను. ఇక్కడికి ఫార్టీ కిలోమీటర్స్ దూరంలో ఉండే సవారిపురం మాది. ఈ ఇన్సిడెంట్ పొద్దున పదకొండుకు జరిగింది. నాకు ఒంటిగంటకి మెసేజ్ వచ్చింది. అప్పుడు బయల్దేరి వచ్చాను. ఆ తర్వాత మీరు కనబడ్డారు. సమయానికి ఆ ఫ్లాట్ దగ్గరకు చేర్చారు. బై గాడ్స్ గ్రేస్...నా చెల్లెల్ని అక్కడినుంచి పోలీస్ స్టేషన్ కు వెళ్ళనీకుండా నేరుగా ఇంటికి తీసుకొచ్చేసాను. ఓ అరగంట ఆలస్యమైవుంటే ఆ అమ్మాయి స్టేషన్ లాకప్పులో ఉండేది. మీ టైమ్లీ హెల్ప్, హ్యూమానిటేరియనిజమ్ మమ్మల్ని కాపాడాయి.” అంటూ వివరించాడు విశ్వేశ్వర్.

“విశ్వేశ్వర్ గారు! మీరన్నారే – గాడ్స్ గ్రేస్ – అదీ మిమ్మల్ని కాపాడింది. నేను కాదు.” అంది రంజని.

“నిజమే మేడమ్! ది ఫిజికల్ ఫామ్ ఆఫ్ దట్ గాడ్స్ గ్రేస్ ఈజ్ యూ! అందుకనే మీకు థాంక్స్ చెప్పాలని వచ్చాను.” అంటూ చేతులు జోడించాడు విశ్వేశ్వర్.

అతిగా పొగడకుండా, విపరీతంగా కన్నీళ్ళూ, విశేషణాలూ లేకుండా ఉన్న విశ్వేశ్వర్ మాటల్ని విన్న రంజనికి ఎందుకో తెలీకుండానే కంట్లో నీళ్ళొచ్చాయి.

“మీరలా అనుకోవడం మీ మంచితనానికి ఋజువు. డివైన్ డిజైన్ లో నేనొక లింక్ మాత్రమే! మీకంతా మంచి జరిగినందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. సో, ఇప్పుడు మీ చెల్లెలు ఇంట్లోనే ఉంటోందా? ఏం చదువుకొంది?” అని అడిగింది రంజని.

“చెల్లెలి పేరు విశ్వజ్ఞ. బిఎస్సీ కంప్యూటర్ సైన్స్ చేసింది.” అన్నాడు విశ్వేశ్వర్.

“వోవ్! వెరైటీ నేమ్! ఐటీ కంపెనీలో ఎక్కడా ట్రై చెయ్యలేదా?”

“చేసింది. కానీ ఎక్స్పీరియెన్స్ లేదని ఉద్యోగం దొరకలేదు. అందుకని ఆ మెంటేనెన్స్ జాబ్ లో చేరింది.” అన్నాడు విశ్వేశ్వర్.

“రేపే రెజ్యూమే తీసుకురమ్మని చెప్పండి. ఐ విల్ డెఫినెట్లీ హెల్ప్ హర్ హియర్.” అంది రంజని.

మళ్ళీ చేతులు జోడించిన విశ్వేశ్వర్ “థాంక్స్ మేడమ్” అంటూ లేచాడు.

రంజని అతని చెయ్యి పట్టుకుని బైటకు తీసుకువచ్చింది. “ఎలా వెళ్తారు? బస్సా ఆటోనా?” అని అడిగింది.

“బస్” అన్నాడు విశ్వేశ్వర్.

అక్కడున్న హౌస్ కీపింగ్ బాయ్ ను పిల్చి “సార్ ను బస్టాప్ లో బస్సెకించి రా” అని చెప్పి పంపించింది.

– – – – – –

విశ్వజ్ఞకు తన టీమ్ లోనే ఉద్యోగం వచ్చేట్టు చేసింది రంజని.

రంజని పట్ల అరవింద్ కు ఉన్న గౌరవమే అనుభవంలేని విశ్వజ్ఞ కు ఉద్యోగం దొరికేట్టు చేసింది. తన చెల్లి జాయినింగ్ రోజున వచ్చిన విశ్వేశ్వర్, రంజని కాళ్ళకు దాదాపు దండం పెట్టేసాడు. ఊహించని ఈ అనుభవాలకు ఉక్కిరిబిక్కిరైంది రంజని.

తనకు, అనంత్ కు మధ్య పెరిగి పెద్దదౌతున్న అడ్డుగోడల్ని తల్చుకున్నప్పుడు కలిగే దుఃఖం విశ్వేశ్వర్ లాంటి పరాయివాళ్ళకు చేసిన సహాయం లాంటి వాటితో కొద్దిగా తీరినట్టు అనిపించసాగింది రంజనికి.

విశ్వజ్ఞ చురుకైన అమ్మాయని కొద్దిరోజుల్లోనే గ్రహించింది రంజని. చురుకుదనంతో బాటు కావల్సినంత లౌక్యం కూడా ఉందని మరికొద్దిరోజుల్లో తెలిసివచ్చింది.

పావని, స్టెల్లాలిచ్చిన సమాచారం ప్రకారం విశ్వజ్ఞ రంజనితో తనకున్న కొద్దిపాటి పరిచయాన్ని పెద్దది చేసి చెప్పుకుంటోంది. కొన్ని కొన్నిసార్లు రంజనికి చెప్పకుండా అరవింద్ తో నేరుగా కలవడానికి ప్రయత్నాలు చేసింది. టీమ్ లీడర్ ను దాటవేస్తున్నావెందుకని పావని అడిగితే నిర్లక్ష్యంగా జవాబిచ్చింది.

ఐతే ఆ అమ్మాయి తనతో ఎప్పుడూ అలా ప్రవర్తించలేదు. చాలా ఒద్దికగా, వినయంగా ఉంటుంది. అలాగని పావనికి గానీ స్టెల్లాకి గానీ అబద్ధాలు చెప్పాల్సిన అవసరం లేనేలేదు. ఇదే విషయం పావనితో అన్నప్పుడు "డబల్ ఎడ్జ్ స్వోర్డ్" అని కామెంట్ చేసింది పావని. అరవింద్ ను అడిగి చూడాలని అనుకున్నా కూడా అడగకుండా ఆగింది రంజని. ఎప్పుడోకప్పుడు విశ్వజ్ఞ ఇలాంటి తలబిరుసు పనులు చేస్తుండగా తను నేరుగా పట్టుకునే అవకాశం రాకపోదు. అప్పుడు ఏదో ఒకటి చేస్తే సరిపోతుందని భావించింది రంజని.

– – – – – –

బజారుకెళ్ళి ఇంట్లోకి వచ్చిన రంజని కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి.

హాల్లో అనంత్ తో కబుర్లు చెబుతున్న విశ్వజ్ఞను చూసి డంగైపోయింది.

రంజని వచ్చింది చూసి 'హాయ్' అన్నట్టు చేయూపి అనంత్ తో మాట్లాడుతూ ఉండిపోయింది విశ్వజ్ఞ.

రంజనికి చిర్రెత్తుకొచ్చింది. "ఎందుకొచ్చావ్...ఇక్కడికి?" అని కరుకుగా అడిగింది.

నవ్వడం ఆపి, సోఫాలో నుంచి లేచిన విశ్వజ్ఞ – "అదీ...మేడమ్! నెక్స్ట్ అపార్ట్మెంట్లోనే నా క్లాస్ మేట్ ఉంటోంది. దాన్ని చూసేందుకొచ్చాను. అట్లాగే మిమ్మల్ని చూసెళ్దామని...." అని ఆగిపోయింది.

"ఓకే!" అంది రంజని, ఇంకేం మాట్లాడాలో తోచకుండా.

"షీ ఈజ్ వెరీ టాకిటివ్. నీకు ఆఫీసులో మంచి కాలక్షేపమే!" అన్నాడు అనంత్.

అతని వైపు కొరకొరమంటూ చూసింది రంజని. ఆ చూపులోని తీవ్రతను గమనించిన అనంత్ మరింకేమీ మాట్లాడకుండా ఊరకేవుండిపోయాడు.

మరో పదినిముషాల్లో వెళ్ళిపోయింది విశ్వజ్ఞ.

"ఎంతసేపైంది అదొచ్చి?" విసురుగా అడిగింది రంజని.

“నీవొచ్చేదానికి ఓ పదినిముషాలముందనుకుంటా! ఐనా ఎందుకంత రాష్ గా అదీ ఇదీ అని అంటున్నావ్?” అన్నాడు అనంత్.

“పదినిముషాల్లోనే యికయికలు పకపకల దాకా పెరిగిపోయిందా?”

“వాట్?”

“అదే! మీ ఇద్దరి ఫ్రెండ్ షిప్! జోకులేసుకొని విరగబడి నవ్వేంతదాకా పెరిగిపోయిందా….ఇన్ జస్ట్ టెన్ మినిట్స్!” అంది రంజని.

“డోంట్ టాక్ నాన్సెన్స్!” అన్నాడు అనంత్ కోపంగా.

“అవున్లే! నేను చెప్పేదాంట్లో నీకెప్పుడు సెన్స్ కనబడింది?” అంటూ పక్కనే ఉన్న న్యూస్ పేపర్ను విసిరేసింది రంజని.

“ఏయ్! ఏమైంది నీకు?ఆ…పిచ్చేమన్నా పట్టిందా?” అన్నాడు అనంత్.

“నువ్వు చేస్తున్న పన్లకి అదొక్కటి పట్టడమే తక్కువ!” గట్టిగా అరిచింది రంజని.

“వో వో వో! కామ్ డౌన్! అలా గట్టిగా అరవొద్దు!” అన్నాడు అనంత్.

అక్కడి నుంచి లేచి మరో గదిలోకి వెళ్ళింది రంజని. అనంత్ కూడా ఆమె వెంటే వెళ్ళాడు.

“లీవ్ మీ అలోన్!” మళ్ళీ గట్టిగా అరిచింది రంజని.

“ష్…ష్…ఏమిటా అరుపులు? ఇప్పుడేమైందని?” అన్నాడు అనంత్ రంజని దగ్గరగా వస్తూ.

“స్టాప్ దేర్! దగ్గరకు రావొద్దు. నీకు నాపై ఇంట్రెస్ట్ పోయిందని నాకు తెలుసు. డోంట్ ట్రై టు యాక్ట్!” అంది రంజని.

అడుగు ముందుకు వేసిన అనంత్ అక్కడే ఆగిపోయాడు.

“ఏం మాట్లాడావో తెలుసా?” అన్నాడు. అతని మొహంలో కరుకుదనం పేరుకోసాగింది.

"ట్రూత్! నిజం మాట్లాడాను. ఓవైపు షైనా...మరోవైపు ఇప్పుడొచ్చింది. చూస్తూనే వున్నాను!" – రంజని గొంతులోను, మనసులోను, మాటలోను పట్టుదల గట్టిపడ్తోంది.

"నీ బొంద ట్రూత్! నాన్సెస్!" అని నిర్లక్ష్యంగా అన్నాడు అనంత్.

అంతే....

ఒక్క ఉదుటున ముందుకొచ్చిన రంజని అనంత్ ను ఉన్నపళాన గట్టిగా ఒక్క తోపు తోసింది.

అనుకోని ఆ తాకిడికి వెల్లకిలా నేల మీద పడ్డాడు అనంత్. వెంటనే లేచి నిలబడి రంజని చెంపను ఛళ్ళుమనిపించాడు.

ఒకసారి కాదు...రెండుసార్లు కాదు....

ఎరుపెక్కిన చెంపల్తో నిశ్చేష్టంగా నిలబడిపోయిన రంజనిని ఆ గదిలో వదిలేసి బైటకు వెళ్ళిపోయాడు అనంత్.

వెళ్తూ వెళ్తూ "నౌ ఐ హావ్ లాస్ట్ ఇంట్రెస్ట్...ఇన్ యూ..." అని వేలు చూపెట్టి మరీ వెళ్ళాడు.

ఆవేశంతో వణుకుతున్న శరీరం. ఆందోళనతో చంచలాలైన కళ్ళు. క్షణకాలపు ఉద్రేకంతో బద్దలైన మనసు...ఇవే రంజనికి తోడుగా నిలబడ్డాయి.

నెమ్మదిగా నేల మీద కూలబడింది రంజని. మోకాళ్ళ మధ్య తలపెట్టుకుని మౌనంగా ఉండిపోయింది.

ఉప్పటి చెమటలో, ఉప్పటి కన్నీళ్ళు సంగమిస్తున్నాయి.

"బ్రతుకెంత దుర్భరం! విధికెంత నిర్దయ!"

– – – – – –

సాయంత్రం గొడవతో బైటికెళ్ళిన అనంత్ ఇంకా తిరిగిరాలేదు.

పొద్దున ఆలస్యంగా లేచిన రంజని అతని గురించి వాకబు చేసే ప్రయత్నమేమీ చెయ్యలేదు. అరవింద్ కు ఫోన్ చేసి సెలవు కావాలని అడిగింది. అతను సరేననడం జరిగిపోయింది.

స్నానం చేసి వచ్చి బెజవాడ కనకదుర్గ పటం ముందు నిలబడింది రంజని. రోజూ చూస్తున్న ఆ చిత్రం ఈరోజు విచిత్రంగా కనబడ్తున్నట్టుగా అనిపించింది.

గర్జిస్తున్న సింహవాహనంపై వీరాసనంలో కూర్చున్న అమ్మ చేతుల నిండా ఆయుధాలే! కానీ ముఖంలో దయ, పెదవులపైని చిరునవ్వులో కరుణ. అభయహస్తంలో స్రవిస్తున్న ప్రేమ.

చేతుల్లో ఆ ఆయుధాలెందుకు? ముఖంలో ఆ ప్రశాంతత ఎక్కడిది? ఆయుధాలున్న చోట ప్రశాంతత ఉండడం సాధ్యమా? – అని ప్రశ్నించుకుంది రంజని మనసు.

నేల పై కూర్చుని ఆ పటాన్నే చూడసాగింది రంజని. క్షణం క్రితం పుట్టుకొచ్చిన ప్రశ్నల్నే మళ్ళీ మళ్ళీ తల్చుకోసాగింది.

"అవును! చల్లనితల్లి చేతిలో భయం పుట్టించే ఆయుధాలెందుకు?". రంజనికి హటాత్తుగా సుమతి గుర్తుకువచ్చింది.

"సుమతి ఉండుంటే ఈ చిక్కుప్రశ్నకు సరైన సమాధానం ఇచ్చివుండేది. ఈమధ్య సుమతిని గుర్తుచేసుకోవడమే లేదు. ఆమెను కలిసివచ్చిన తొలిరోజుల్లో ప్రతిరోజూ ఏదో ఒక కారణానికి గుర్తుకువచ్చేది. ఇప్పుడు దాదాపు మర్చిపోయింది. ఆరోజు ఆమె ఆ గుడిలో కలవకపోయివుంటే నా పరిస్థితి ఎలావుండేది? ఇలా ఇంతదూరం సులభంగా రాగలిగేదాన్నా? ఆమె చెప్పిన మాటలు మంత్రాలుగా మారకపోయివుంటే నాలో ఇంత మనోధైర్యం నిండేదా? నో! అబార్షన్ అయ్యిందన్న బాధలోనే కుళ్ళిపోయివుండేదాన్ని. ఆ బాధకు జతగా అనంత్ వింత చేష్టలు ఖచ్చితంగా పిచ్చెక్కించేవి! మంచి వ్యక్తుల్ని, మంచి విషయాల్ని తొందరగా మర్చిపోయేట్టు ఎందుకు చేస్తాడా దేవుడు? అమ్మా! ఇంకోసారి సుమతి తో కలిసే పరిస్థితి వచ్చింది. ఆమె కలుస్తుందా? నువ్వు కలవనిస్తావా? నాకు శాంతిని కలిగిస్తావా? అమ్మా...అమ్మా...అమ్మా" – ఘోషిస్తోంది రంజని అంతరంగం.

పటంలోని కనకదుర్గ పెదాలపైని చిరునవ్వు చెదరడంలేదు. చెరోవైపు వెలిగించిన దీపాల శిఖలు నిశ్చలంగా వెలుగుతున్నాయి. అగరొత్తి ధూపం వింత రూపాల్ని చూపుతూ మాయమౌతోంది.

రంజని మౌనాన్ని, ధ్యానాన్నీ భంగపరుస్తూ మోగింది ఫోన్. ఆమె లేవలేదు. ఆగిపోయిన మొబైల్ మళ్ళీ మోగింది. తియ్యడానికి మనసు రాలేదు రంజనికి.

మూడోసారి కూడా మోగడంతో నిరాసక్తంగా లేచి ఫోన్ తీసుకుని “హలో” అంది. ఆమె గొంతు ఆమెకే వినబడ్డం లేదు.

“నమస్తే మేడమ్! నేను...విశ్వేశ్వర్ని!” అంది అవతలి గొంతు.

నిద్రించిన నాగుపాము లేచినట్టుగా కోపం కట్టలు తెంచుకుంది రంజనిలో. చెవి దగ్గరినుంచి ఫోన్ తీసేసి డిస్ కనెక్ట్ చెయ్యబోయింది.

“ఇంపార్టెంట్ మ్యాటర్ మేడమ్. అందుకే మిమ్మల్ని డిస్టర్బ్ చేస్తున్నాను!” అన్న విశ్వేశ్వర్ మాటలకు రంజనిని మళ్ళీ ఫోన్ ను చెవికి ఆనించింది.

“నిన్న నా చెల్లెలు మీ ఇంటికి మీతో చెప్పకుండా వచ్చిందంట కదా! ఐ యామ్ ఎక్స్ట్రీమ్లీ సారీ ఫర్ దట్ మేడమ్!”

“మీరెందుకు సారీ చెప్పడం? ఆల్సో...మీకెలా తెల్సింది?”

“ఆమె చెప్పడానికి భయపడ్తోంది మేడమ్. అందుకని నేనే చేసాను అండ్ షీ ఈజ్ మై సిస్టర్. నాతో అన్నీ చెబుతుంది...” ఆగిపోయాడు విశ్వేశ్వర్.

“ఓకే! ఇంకెప్పుడూ అలా చెయ్యొద్దని చెప్పండి.” అంది రంజని. ఆమె గొంతులో అధికారం ధ్వనించింది.

“ష్యూర్! థాంక్స్! ఉంటాను మేడమ్” అన్నాడు విశ్వేశ్వర్.

“అలాగే!” అన్న రంజని వెంటనే “వన్ మినిట్! మిమ్మల్ని ఒక ప్రశ్న అడగాలనివుంది.” అంది.

“ఓహ్!” అన్న విశ్వేశ్వర్ కొన్ని సెకన్ల తర్వాత “అడగండి! ప్లీజ్!” అన్నాడు.

“మన దేవుళ్ళ చేతుల్లో వెపన్స్‌...అదే...ఆయుధాలెందుకుంటాయ్?” అని అడిగింది రంజని.

విశ్వజ్ఞ పై ఆమె ఏ బ్రహ్మాస్త్రమో సంధించబోతోందని కంగారుపడ్డ విశ్వేశ్వర్, రంజని అడిగిన ప్రశ్నకు స్థిమితపడి – “అదా! అదీ! అంటే...” అన్నాడు.

సహనమన్నదే పోయిన రంజని మనసు అతని నాన్చుడు ధోరణికి చిర్రెత్తుకొచ్చింది. “మీకు తెలుసా లేదా?” అని కోపంగా అంది.

“సారీ! ఎస్! నాకు ఆన్సర్ తెలుసు మేడమ్!” – వడివడిగా అన్నాడు విశ్వేశ్వర్.

“మీరు జీనియస్ గా...వెంటనే చెప్పండి...ఎందుకా నసుగుడు?” అంది రంజని.

“ష్యూర్ మేడమ్! ఏదైనా దేవుడు లేదా దేవత చేతిలో ఆయుధం ఉంటే అది వీరత్వానికి గుర్తు. పువ్వు ఉంటే ప్రకృతికి నిదర్శనం. పుస్తకం ఉంటే అధ్యయనానికి గుర్తు. జపమాల ఉంటే ధ్యానానికి చిహ్నం. వీణ, పిల్లనగ్రోవి మొదలైన సంగీత వాయిద్యాలుంటే అవి మానవుల మనోభావాల్ని డిలైట్ అంటే రంజింపజేసే కళలను సూచిస్తాయి.” చకచకా చెప్పుకుపోయాడు విశ్వేశ్వర్.

అవతలి వైపునుండి ఎలాంటి స్పందనా లేకపోవడంతో అనుమానమొచ్చిన అతను “హల్లో మేడమ్! వింటున్నారా?” అన్నాడు.

“ఎస్..ఎస్..బట్, కనకదుర్గమ్మ మనకు అమ్మ కదా! ఆమె చేతిలో అన్ని వెపన్స్ ఎందుకు? ఓ అమ్మకు అన్ని హారిబుల్ వెపన్స్ కావాలా?” అంది రంజని.

“ఓహో! అదా మీ అనుమానం. దుర్గమ్మ చేతిలో ఉండే గద ఆయుధమే ఐనా అదొక సింబల్. గమ్యాన్ని చేర్చేదాన్ని గద అంటారు. అలాగే ధనస్సు–శరం కూడా సింబల్సే! ముక్తిని కోరుకునే వాళ్ళకి వాళ్ళ శరీరమే ధనస్సు, సాధనయే శరం. ప్రతి బాణానికీ ఒక లక్ష్యమున్నట్లే ముక్తి అనే లక్ష్యాన్ని ఛేదించాలి

అనేదే అందులోని అర్థం. వేదనాదానికి సింబల్ శంఖం. ఇలా ఒక్కో ఆయుధానికీ స్పిరిచువల్ మీనింగ్స్ వున్నాయి. ఆల్ దోజ్ వెపన్స్ ఆర్ ఫిల్డ్ విత్ మెటాఫోరికల్ సింబాలిజమ్!" – ఆగాడు విశ్వేశ్వర్.

"ఎక్సలెంట్! ఇప్పుడు నా ప్రశ్నకు సమాధానం దొరికింది. బై ద వే, హౌ డూ యూ నో ఆల్ దీజ్ థింగ్స్?" అని అడిగింది రంజని.

నవ్వాడు విశ్వేశ్వర్. "నాకో గురువుగారున్నారు లేండి. ఆయన చెప్పారు!" అన్నాడు.

"ఓహో! ఎవరాయన?" అంది రంజని.

"శర్మగారని!" అన్నాడు విశ్వేశ్వర్.

"వెరీగుడ్! కన్వే మై నమస్కారమ్స్ టు హిమ్!" అంది రంజని.

"తప్పకుండా మేడమ్! సారీ టు బాదర్ యూ!" అన్నాడు విశ్వేశ్వర్.

"నో నో! ఇట్స్ మై ప్లెజర్ టు టాక్ టు యూ అండ్ గెట్ ఆన్సర్స్!" అంది రంజని.

మరోమారు నమస్కారం చెప్పి ఫోన్ పెట్టాడు విశ్వేశ్వర్.

మొబైల్ ను చేత్తో పట్టుకుని మళ్ళీ కనకదుర్గ  పటం దగ్గరకు వచ్చింది రంజని.

దుర్గమ్మ నవ్వులో ప్రేమ హెచ్చినట్టుగా అనిపించింది ఆమెకు. విశ్వేశ్వర్ ఇచ్చిన వివరణను గుర్తుకుతెచ్చుకుని దుర్గ చేతిలోని ఆయుధాల్ని చూసింది. ఇప్పుడవి భయపెట్టేట్టుగా లేవు.

"గమ్యాన్ని చేర్చేదే కదా గద? ఇప్పుడు నా జీవితాన్ని ఓ గమ్యానికి చేర్చాలంటే నాకు నేనే గదలా మారాలి! అంటే పైకి చూసేందుకు బలంగా, భయపెట్టేటట్టుగా! కానీ లోపల మెటాఫోరికల్ సింబాలిజంలా దుర్గమ్మ పెదవుల మీది చిరునవ్వులా! ఐనా ఎంత ఆశ్చర్యం! సుమతి గురించి అనుకోగానే నా ప్రశ్నకు జవాబు దొరికింది. ఇది మిరాకల్ అనుకోవాలా లేక కోయిన్సిడెన్సా? వాటెవర్. ఐ గాట్ వాట్ ఐ వాంటెడ్. థాంక్స్ అమ్మా" అని అనుకుంటూ మొబైల్ పక్కనపెట్టి కనకదుర్గ పటాన్ని చేతిలో తీసుకుని గుండెలకు హత్తుకుంది రంజని.

★ ★ ★ ★ ★

“నీ మొదటి పావుకు భక్తి ఎక్కువైనట్టుంది సుమా!” అన్నాడు సుమనసపూజ్యుడు.

చేతులు జోడించింది సుమశరుని జనని.

“జోడించిన నీ కరపద్మాలు భక్తులకు వరప్రదాలు!” అన్నాడు ముకుందుడు.

“అది మీ అనుగ్రహమేగా స్వామీ!” అంది మంగళదుర్గ.

“ఇంతకూ ఎనిభైఎనిమిదవ గడికి చేరిన నీ మొదటి ఆటకాయ ఏం సూచిస్తోంది దేవీ?” అన్నాడు అహిగిరివాసుడు.

“స్వామిన్! యథామతిగా వివరిస్తాను. అదే వరుసలో డెబ్బైఎనిమిదవ గడిలో ఉన్నవాడు గ్రస్త సూర్యుడు” అంది సూర్యకోటిసమప్రభ.

“అంటే...” సాలోచనగా ఆగాడు ఆర్తత్రాణపరాయణుడు.

“అంటే గ్రహణకాలం నాటి వెలుగు కోల్పోయిన సూర్యుడు ప్రభూ! కర్మసాక్షిగా ప్రతిరోజూ పూజలందుకునే సూర్యుడు, గ్రహణకాలంలో ఆ పూజార్హతను కోల్పోతాడు. పైగా గ్రస్తసూర్యుని దర్శనం అనేక పాపాలకు, రోగాలకూ దారితీస్తుందని ధర్మశాస్త్రం చెబుతోంది. ఆవిధంగా లోకంలో, అనుకోకుండా వ్యసనాలకు బానిసలైపోయే ఉత్తములు కూడా పూజార్హతను కోల్పోతారు.”

“మరి అలాంటి వారికి త్రోవ యేది సాక్షిభూతా?” అన్నాడు విశ్వచక్షువు.

“మీ నామస్మరణ త్రోవయే త్రోవ స్వామి. జ్ఞానము, బ్రహ్మలోకము, వైరాగ్యమనే మూడు గడులను దాటిన వారు ఎనభైయెనిమిదవ గడిలోకి చేరి గ్రహణముక్త సూర్యునిలా సంపూర్ణజ్ఞానంతో వెలుగుతారు. ఎవ్వరూ వేలెత్తి చూపలేని సౌశీల్యంతో అలరారుతారు.” అంది దైత్యసంతాపకారిణి.

“ఈ సమన్వయం చాలా బావుంది.” అని త్రివిక్రముడంటే – “మీ మొదటి ఆటకాయ ఏం చెప్పబోతోందో!” అని ఉత్సుకతను ప్రదర్శించింది త్రైలోక్యకుటుంబిని.

“చూద్దాం!” అన్నాడు పారాయణపరాయణుడౌ నారాయణుడు.

ఆయన పాచికలు వేస్తే అవి నటరాజ జటాజూట బద్ధ వియద్గంగా భంగ తరంగాల్లా గలగలమన్నాయి.

★ ★ ★ ★ ★

గుడి గంట మ్రోగగానే, చెదిరిపోయిన పాపాల్లాగా గాల్లోకి ఎగిరాయి పావురాళ్ళు.

వరదనీరు తీరం దాటి దూసుకువచ్చినట్టుగా ఘంటానాదపు ప్రకంపనలు సన్నగా వినబడ్తున్నాయి.

పగలు–రాత్రి అనే రెండు కుంచెల్తో ఆయుష్షు అనే రాశిని ఇవతలి నుంచి అవతలికి కొలిచి వేస్తున్న కాలదేవత యొక్క కరకంకణాల చప్పుడు ఆ దేవాలయప్రాంగణంలో వినిపించదేమోనన్నట్టుగా నిశ్శబ్దం ఆవరించుకుని ఉంది.

సుమతి, శర్మ ఓ మారుమూల గ్రామంలోని ఆ గుడికి వచ్చారు.

శర్మ హటాత్తుగా ఈ ప్రయాణాన్ని ఏర్పాటు చేసినా “ఎందుకు?” అని ప్రశ్నించకుండా బయల్దేరింది సుమతి. ఎన్నడూ వినని ఈ గుడికి రావడంలో తన భర్త ఉద్దేశ్యమేమిటన్నది తెలియకపోయినా సరైన సమయం వచ్చినప్పుడు ఆయనే చెబుతారన్న నమ్మకం ఉంది సుమతికి.

గోధూళి వేళకు ఆ చిన్ని పల్లెలో దిగగానే సుమతికి ఏదో చిరపరితమైన భావన ఒకటి గాలిలో తేలివచ్చి పలకరించినట్టైంది. ఇరుకు వీధుల్లోని ప్రతి మలుపు ఎప్పుడో తిరిగినట్టుగా అనిపించింది. గుడికి వెళ్ళే దారిలో ఎదురుపడ్డ పెద్ద దిగుడు బావి వద్దకు రాగానే ఒళ్ళు ఝల్లుమంది. భయంతో కాదు, అది చెప్పదల్చుకున్న రహస్యపు లోతు చూసి.

వింతైన భావాలతో గుడి ప్రాంగణంలోకి ప్రవేశించిన సుమతికి మరో ఆశ్చర్యం ఎదురైంది.

గర్భగుడికి చేరేందుకు ఉన్న మెట్లకు రెండు వైపులా తంబూరలు మీటుతున్న రెండు పురుష విగ్రహాలున్నాయి.

“ఏమండీ! ఈ గుడిని ఇంతకు మునుపెప్పుడో చూసానండీ!” అంది సుమతి.

“ఇదేగా మొదటిసారి...మనం ఇక్కడకు రావడం!” అన్నాడు శర్మ, మెట్లపై నిలబడి.

“కావొచ్చు...కానీ నాకెందుకో అలా అనిపిస్తోంది. ఈ గుడి...ముఖ్యంగా ఈ రెండు విగ్రహాలు...”అంటూ వాటి కేసి చూపించింది.

శర్మ ఆ రెండు విగ్రహాలను పరీక్షగా చూసాడు. ఎక్కిన రెండు మెట్లు దిగి సుమతి దగ్గరకు వచ్చి “ఏదో కలలో చూసుంటావు!” అన్నాడు.

“కలా? అలా అనిపించడం లేదండీ!” అంది సుమతి.

“ఖచ్చితంగా కలలోనే చూసుంటావు. పద” అంటూ ఆమె చేయి పట్టుకుని ముందుకు నడిచాడు.

వాళ్ళు రంగమండపంలోకి వచ్చి నిలబడగానే, గర్భగుడిలో ఉన్న అర్చకుడు బైటకు వచ్చి శర్మకు నమస్కరించాడు.

శర్మ ఆయనకు ప్రతినమస్కారం చేస్తే, సుమతి వంగి కాళ్ళకు దండం పెట్టింది.

“సుపుత్రప్రాప్తిరస్తు” అన్నాడా అర్చకుడు.

శర్మ వైపుకు చూస్తూ “మా ఇంట్లోనే బస ఏర్పాటు చేసాను. కార్యక్రమం రేపటి నుండి మొదలుపెడదాం!” అన్నాడాయన.

“అలాగే!” అన్నాడు శర్మ.

మరో అరగంట గడిచాక గుడి వాకిలి వేసి, టార్చ్ లైట్ తీసుకుని ఆ అర్చకుడు ముందు నడుస్తుంటే శర్మ దంపతులు అనుసరించారు.

ఇల్లు చేరాక సాయం సంధ్య ముగించి, భోజనానికి కూర్చున్నప్పుడు మరుసటిరోజు జరుగబోయే కార్యక్రమం గురించి వివరాలు తెలిసాయి సుమతికి. అనేక జన్మల్లో కూడబెట్టబడిన పాపాల నివృత్తికి కోసం హోమం చేయాలని తన భర్త అనుకున్నట్టు, ఆ హోమాన్ని ఒక ఏకాంత పవిత్ర ప్రదేశంలో

నిష్ఠాగరిష్ఠుడైన ఋత్వికుని చేత చేయించాలని సంకల్పించి ఇక్కడకు వచ్చినట్టు అర్థమైంది సుమతికి. ఆమె మనస్సు భర్త మనసులో మెదలుతున్న సద్భావంతో మమేకమైపోయింది.

ఆరుబైట కురుస్తున్న వెన్నల, సుమతి హృదయంలో భర్త పట్ల గల ఆరాధనా భావంలా ప్రకాశించసాగింది.

– – – – – –

మరుసటిరోజు ప్రొద్దున హోమానికై వస్తూ మెట్లెక్కుతున్న సుమతికి తంబూరల్ని మీటుతూ నిలబడివున్న ఆ పురుష విగ్రహాల్ని చూడగానే ఒళ్ళు గగుర్పొడిచింది. ఎక్కడో చూసినట్టు బలంగా అనిపిస్తున్నా గుర్తురావడం లేదు.

కేశవశర్మ, ఆ గుడి పూజారి హోమగుండం ముందు కూర్చుని కార్యక్రమాన్ని మొదలుపెట్టారు.

నెయ్యి పడగానే ఎగసిన జ్వాలలు క్షణానికో రూపాన్ని దాలుస్తున్నాయి. ఒకసారి కాళిక నాలుకలా, మరోసారి త్రినేత్రుని త్రిదలనంలా, ఆ వెనువెంటనే పరశురాముని ఖండపరశులా, రామబాణంలా, ఐరావతపు దంతాల్లా, మందారపువ్వులా....

ఆ అగ్నిశిఖల్నే చూస్తూ కూర్చున్న సుమతికి ఎక్కడికో, సుదూర తీరాల్లోకి జారిపోతున్నట్టుగా అనిపించసాగింది. సమిధల్ని వేస్తున్నప్పుడల్లా కమ్ముకుంటున్న ధూమంలో ఆమెకు దారి తెలిసీ తెలియనట్టుగా అగుపించసాగింది.

"ఏమౌతోంది? ఎందుకిలా అనిపిస్తోంది?"

మరునిముషంలో సుమతికి దివ్యదేహధారులైన ఇద్దరు వ్యక్తులు అమోఘమైన సంగీతాన్ని పాడుతూ కనిపించారు. మైమరపించే గమకాలతో, రాగతాళాలతో వడివడిగా అడుగులు వేస్తూ వస్తున్నారు. దగ్గరదగ్గరగా వచ్చేస్తున్నారు. ఇప్పుడు సుమతికి వారు స్పష్టంగా కనబడుతున్నారు. ఒకరు మానవ శిరస్సుతో ఉంటే మరొకరు గుర్రపు తలతో ఉన్నారు. వారు ఇంకా దగ్గరగా వచ్చారు. ఘుమ్మని సువాసన వెదజల్లుతున్న పూలమాలలు వాళ్ళ కంఠసీమలో వేళ్ళాడుతున్నాయి. భుజాల నుండి నడుం

వరకూ వెళ్ళాడుతున్న ఉత్తరీయాల అంచులు బంగారుతో కూడినవేమో తళతళమని మెరుస్తున్నాయి. రత్నపుటుంగరాలు పొదిగిన వాళ్ళ వేళ్ళు చకచకా కదులుతూ మీటుతున్నాయి...ఆ తంబూరల్ని.

తంబూరలు....తంబూరలు....

దివ్యపురుషులు వాయిస్తున్న గంభీరనాద ఘోషధారలు ఆ తంబూరలు. అలౌకిక సంగీత ఝురుల్ని కురిపిస్తున్న తంబూరలు. సర్వేశ్వరారాధనాభరితులైన గానగంధర్వుల చేతుల్లో అనన్యసామాన్య రాగాలాపనలు చేస్తున్న తంబూరలు. నాదోపాసనామార్గానురక్త, ముక్తాసక్త, అమలిన భక్తిసిక్త మానసులైన అమరగాయకుల అక్షరోచ్చారణా బద్ధ సిద్ధ సాధనా సంగీత తప్త తంబూరలు – దగ్గర దగ్గరగా వచ్చేస్తూ....విచ్చేస్తూ...తనలోకి ప్రవేశిస్తూ....

"సుమతీ!" అని బిగ్గరగా వినబడ్డ శర్మ అరుపుకు చటక్కున మేలుకుంది సుమతి.

"నిద్రపోతున్నావా?" — అనుమానంగా అడిగాడు శర్మ. అతని గొంతులో ఆశ్చర్యం వ్యక్తమౌతోంది.

"లేదండీ!" అంది సుమతి తడబాటుగా.

"ఐతే ఆ పరధ్యానమెందుకు? సమిధలు ఇంకొన్ని కావాలి. అర్చకుల వారింటికెళ్ళి తీసుకురావాలి..." అన్నాడు శర్మ.

"వెంటనే తీసుకొస్తాను." అని చెప్పి కంగారుగా అక్కడి నుంచి పరుగులాంటి నడకతో అర్చకుల ఇంటికి బయల్దేరింది సుమతి.

ఆమె వెళ్ళాక "మీ ఆవిడది ఏమరుపాటు! నిద్రకాదు!" అన్నాడు గుడి అర్చకుడైన త్ర్యయంబక ఉపాధ్యాయ.

'అవునా!' అన్నట్టు నొసలు ముడివేసి చూసాడు శర్మ.

శర్మ చేసిన ఆ భావ వ్యక్తీకరణకు జవాబుగా నవ్వుతూ 'కొనసాగించ'మన్నట్టుగా సైగ చేసాడు ఉపాధ్యాయ.

– – – – – –

మొదటిరోజు కార్యక్రమం సక్రమంగా సాగడంతో కేశవశర్మ చాలా సంతోషంగా, సంతృప్తితో నిండిపోయాడు.

రాత్రి భోజనాలయ్యాక ఉపాధ్యాయ ఇంటి ముందున్న ఆరుబయల్లో కూర్చునివున్నారు సుమతి, శర్మలు.

పాలు నిండిన పాత్రలా ఆకాశం వుంటే, ఆ పాలపై తేలుతున్న బుడగల్లా నక్షత్రాలు వెలుగుతూ ఆరుతున్నాయి. ఆ బుడగల్ని ఊదుతున్న బుడుతడిలా నిండుజాబిల్లి చలాకీగా నవ్వుతున్నాడు.

నిశ్శబ్దానికి నిర్వచనంలా ఉంది ఆ వాతావరణం. మనసు పెట్టి వింటే వెన్నెల కురుస్తున్న చప్పుడు వినవచ్చునేమో!

“పొద్దున, హోమం దగ్గర ఏమిటా నిద్ర?” అన్నాడు శర్మ.

“అది నిద్ర కాదండి!”

“మరి?”

“ఓరకమైన మైమరుపు...ఏమరుపాటులాంటిది!” సంజాయిషీగా చెప్పింది సుమతి.

అర్థం కానట్టుగా ముఖం పెట్టి నవ్వాడు శర్మ.

సుమతికి కూడా ఆ అలౌకికానుభవాన్ని మామూలు మాటల్లో ఎలా చెప్పాలో తోచక నవ్వింది.

కాసేపు ఆగి – “ఏమండి! తంబూర అంటే ఏమిటి?” అని అడిగింది.

“ఏం! నా బుర్రను రామకీర్తన పాడించాలనుకున్నావా?” అన్నాడు శర్మ.

“అయ్యో! కాదండి. అక్కడ...గుడి మెట్ల దగ్గర తంబూరల్ని పట్టుకున్న రెండు విగ్రహాలున్నాయి కదా! వాటిల్ని చూసినప్పటి నుంచీ ఆలోచిస్తున్నాను...తంబూర అంటే ఏమిటీ అని!” అంది సుమతి.

“ఓహ్! అదా నీ మైమరుపుకు కారణం?” – ముందుకు వంగి ఆసక్తిగా అడిగాడు శర్మ.

అవునన్నట్టుగా తలూపింది సుమతి.

సుమతి కళ్ళలోకి చూసాడు శర్మ. అన్నేళ్ళుగా తనకు తెలియని మెరుపేదో ఆమె కళ్ళల్లో మెరుస్తున్నట్టు అనిపించింది అతనికి. ఆ మెరుపులో ఓ ఆకర్షణ....భౌతికమైనది కాదు...వెన్నెల్లా....ముత్యంలా...తామరాకుపైని నీటి బొట్టు చందంలా...అనిర్వచనీయమైనది.

ఆ ఆకర్షణ నుంచి తప్పించుకోవాలన్నట్టుగా వెనక్కు వాలాడు శర్మ. రెండు కళ్ళూ మూసుకుని "తం బ్రూహి" అన్నాడు.

"ఏమన్నారు?" అంది సుమతి అర్థం కాక.

మూసుకున్న కళ్ళను తెరవకుండా "తంబూర అంటే తం బ్రూహి అన్న రెండు సంస్కృత పదాల కలయిక. తెలుగులో చెప్పుకుంటే 'నీ గురించి పలికేది' అని.." అని ఆగాడు శర్మ.

"ఓహో!" అంది సుమతి, అర్థం కాని చిక్కు లెక్క కొద్దిగా అర్థం కాగానే ఊరడిల్లే విద్యార్థిలా.

"ఈ 'నీ' – నేను, నీవు కాదు. వాడు..." అంటూ కుడి చేతిని ఆకాశానికేసి చూపాడు శర్మ.

"ఆఁ....దేవుడి గురించి పలికేది తంబూరనా! అందుకేనా సంప్రదాయ సంగీతానికి అదే మూలాధారం?" అంది సుమతి.

అవునన్నట్టుగా తల పంకించాడు శర్మ. అతనింకా కళ్ళు మూసుకునేవున్నాడు.

"ఇది చాలా కొత్త విషయం. ఎప్పుడూ వినలేదు. కొద్దిగా వివరిస్తారా?" అని వినయంగా అంది సుమతి.

ఆమె అడగడమే తడవు అన్నట్టుగా కొనసాగించాడు శర్మ – "శరీర వీణ విద్య అన్నది గంధర్వులు చేసే సాధన. దేవలోక గాయకులైన ఆ దేవగంధర్వులు తమ శరీరాన్నే వీణగా భావించి, నాదోపాసనతో ముక్తి మార్గాన ప్రయాణిస్తారు. ఈ విద్యను ఉపాసించేవారు తమ శరీరాన్ని దండిగాను, నర–నాడుల్ని తంత్రులుగానూ భావించి, ప్రతి నరతంత్రినీ భగవంతుని నామోచ్చారణతో మీటి, వేదనాదాలతో శృతి చేసి, అతని లీలావిలాసాల్ని పలికిస్తారు. అదే తం బ్రూహి...అదే తంబూర!"

ఆ నీరంధ్ర నిశ్శబ్దంలో, ఆర్ద్రపూరితమైన శర్మ కంఠం నుండి వెలువడుతున్న ఒక్కో పదం మందరమై, షడ్జమమై, పంచకమై మోగుతున్నాయి. కపట మెరుగని ఓ స్త్రీ మనసు అనునాదమై, అనువాకమై, ఆ శీతల వాతావరణంలో నిరావరణమై భాసిస్తోంది.

దీర్ఘసమాధిలో ఉన్నట్టు మాట్లాడుతున్న శర్మ ముందుకు సాగాడు – "తంబూర పైభాగంలో తంత్రుల్ని బిగించేందుకు వుండే కీలులాంటిదే మన మేధస్సు. అనవసరపు ఆలోచనల్తో అది వదులైతే, సాధన శృతి తప్పుతుంది. అలాగని ఎక్కువగా బిగిస్తే, తెగిన తంత్రిలా విపరీత జ్ఞానంతో దారి తప్పుతుంది సాధన. మనిషికి అన్నింటిలోనూ, అన్ని సమయాల్లోనూ సమతూకం అవసరం. సుస్వరాల ఆలాపనకు తోడునిచ్చే తంబూరలాంటిదే భగవంతుని నామస్మరణ. అందుకనే మీటాలి...ఈ దేహాన్ని, మనస్సునీ, ఆలోచనల్నీ, అన్నింటినీ సమతూకంలో పెట్టి, స్మరణోపాసన అనే సుస్వరంతో శృతి చేసి మీటాలి. పలికించే వేళ్ళు ఆగేదాకా మీటుతూనే ఉండాలి. ఇదే తంబూర లోని సందేశం. ఇందుకే ప్రతి వాగ్గేయకారుడూ *'వేకువ జామున వెలయుచు తంబుర – చేకొని గుణముల చెలువొంద పాడుచు – శ్రీకరునికాశ్రిత చింతామణిని'* కంటూ తంబూర చేపట్టి మీటింది. తం బ్రూహి అని ఎలుగెత్తి చాటింది. ఎండిన కట్టెతో చేయబడిన తంబూరను జీవం నిండిన చెయ్యి పలికిస్తే మధురంగా పలుకుతుంది. జడమైన ఈ దేహంలో దేవదేవుని నామస్మరణ జీవాన్ని నిలుపుతుంది, నింపుతుంది, కడ దాకా సరైన దారిలో నడిపిస్తుంది. తం బ్రూహి...స్వామిన్...త్వమేవ పాహి!" అన్నాడు శర్మ.

మూసేవున్న అతని కళ్ళ నుండి కన్నీటి ధారలు సాగాయి.

అప్పటిదాకా మబ్బు చాటుకెళ్ళిన చంద్రుడు అప్పుడే తొంగి చూసాడు.

భూలోకంలోని ఓ భాగంలో, పర్ణశాలవంటి ఆ పల్లెటూరి ఇంటి ముందు ఉన్మత్త లౌకిక ప్రపంచానికి పట్టని విషయంలో తల్లీనత చెందిన ఆ దంపతుల్ని చూసి పులకించాడేమో వెన్నెల పోటెత్తింది. ఆ భక్తుడి కంటినీటి వెచ్చదనాన్ని చవిచూడడానికి తన వెలుగుల హస్తాన్ని చాచాడేమో, శర్మ కన్నీటిలోకి తెల్లటి వెన్నెల ప్రతిఫలించింది. అతని మౌనంలో దేవగంధర్వ గానం ప్రతిధ్వనించింది.

సుమతి చెయ్యి చాచి శర్మ చేయిని అందుకుని కళ్లకు అద్దుకుంది. లోకసీమాతివర్తనుడైవున్న తన భర్త చెయ్యి వణుకుతోంది.

భక్తిధునిలో అవ్యక్త భావనలతో ప్రకంపిస్తున్న ఆ చేయిలో శరీర వీణ విద్యానాదాన్ని లీలగా వింటున్నది సుమతి.

"తం బ్రూహి....స్వామిన్....త్వమేవ పాహి!" అని ఆమె కూడా మెల్లగా పలికింది.

– – – – – –

"మీ దయవుంటే సాధన అన్నది ఇంత సులభమా స్వామీ?" అని ప్రశ్నించింది సింధుకన్య.

"నీ దయకూడా నిక్కంగా అవసరమే కదా దేవీ!" అన్నాడు సింధుకన్యాపతి.

"ఎలా స్వామీ?"

"ప్రకృతికి నీవే నియామకురాలవు. నీవు దయతలచి తొలగిస్తేగా మాయాశక్తి నిరసించేది! సాధకులకు త్రోవ కనిపించేది!" అన్నాడు చిద్విలాసుడు చిరునవ్వుతో.

"మీరంటున్న నా శక్తికి బలం మీరే! ఇందుకేనా స్వామీ మీ మొదటి ఆటకాయ ఈశ్వరత్వపు గడిని అవలీలగా చేరింది!" అంది పృధ్వీతనయ.

"సందేహమెందుకు?" అన్నాడు భక్తమందారుడు.

"మీ సన్నిధిలో సందేహం లేదు స్వామీ, సమ్మోదం తప్ప! ఈ ఈశ్వరత్వము గడి గురించి ఉపదేశించండి!" అంది త్రిగుణమానిని.

"అనన్యమైన భక్తురాలివి, నీవు చెబితే వినాలనివుంది కమలజ!" అన్నాడు శ్రీహరి.

"అలాగే స్వామీ! ఈ అంటే లక్ష్మీదేవి. శం అంటే సుఖం. రం అంటే రమణత్వం. ఎవరైతే లక్ష్మీదేవికి తన రమణత్వం ద్వారా సుఖాన్ని కలిగిస్తున్నారో వారే ఈశ్వర శబ్దవాచ్యులు. జన్మరాహిత్యాన్ని

సాధించిన వారికి మాత్రమే గోచరమయ్యేదే ఈ ఈశ్వరతత్వం. అటువంటు లక్ష్మీపతి తత్వాన్ని తెలియడమే సాధన. తెలిసిన తరువాత చేరేదే పరమపదం.” అని నమస్కరించింది పద్మదళనేత్రి.

“ఈశ్వరత్వం సిద్ధించే నూటాఇరవైయారవ గడిలో ఉన్న అక్షరం ’పా’. గీర్వాణభాషలో పాతీతి పా అని చెబుతారు. పాతి అంటే పతి అని, యజమాని అని అర్థం. పాతు అనే ధాతువు ప్రకారం రక్షకుడు అనే అర్థం వస్తుంది.” అన్నాడు ఏకోనారాయణుడు.

“సర్వ ప్రాణులకూ యజమాని, రక్షకులు ఐన ఈశ్వరులు మీరే! మీ తత్వచింతనలో మునిగి మీ మొదటి ఆటకాయ ధన్యమైంది!” అంది శ్రీరమణి.

“మరి నీ రెండో ఆటకాయను నడుపు. చూడాలని వుంది.” అన్నాడు శ్రీకరుడు.

“చిత్తం!” అంటూ అంబ పాచికల్ని వేస్తే అవి అమృతాన్ని పంచడానికి కదలిన మోహినీ కటిసీమలోని మణిమేఖలపు చిరుగజ్జెల్లా ఘల్లుమన్నాయి.

★ ★ ★ ★ ★

ఇప్పటికి వారం రోజుల పై మాటే అయింది అనంత్ ఇంటికెళ్ళి.

అమెరికాలో ఉద్యోగం చేస్తున్న స్నేహితుడికి చెందిన ఖాళీ అపార్ట్మెంట్ లో ఉంటూ అతని కంప్యూటర్ ద్వారా తన పనులు కొనసాగించుకోసాగాడు. రంజనిని అలా వదిలివచ్చేసినందుకు అతనిలో కించిత్తూ బాధ లేదు. పైగా తను లేకుండా ఒంటరిగా ఆమె ఉండడానికి పడే కష్టాల్ని ఊహించుకుని తృప్తి పడసాగాడు. ఆ తృప్తే అతన్ని రంజని పై సహానుభూతితో ఆలోచించే గుణాన్ని చంపేసింది.

మోగుతున్న మొబైల్ను తీసాడు అనంత్. గుర్తు తెలియని నెంబర్ కనిపిస్తోంది. “కొత్త నెంబరుతో రంజనీ ట్రై చేస్తోందా?” అన్న అనుమానం రావడంతో తీయబోయి ఆగాడు. చివరి క్షణంలో మనసు మార్చుకుని తీసుకున్నాడు.

ఆశ్చర్యం!

అవతల ఉన్నది విశ్వజ్ఞ.

"నా నెంబర్ ఎలా తెలిసింది నీకు?" అన్నాడు అనంత్, ఆ హటాత్పరిణామానికి తికమకపడుతూ.

"లాస్ట్ టైమ్ మీ ఇంటికొచ్చినపుడు మీ బిజినెస్ కార్డ్ మీరే ఇచ్చారు. గుర్తులేదా?" అంది విశ్వజ్ఞ.

అప్పుడు గుర్తుకొచ్చింది అనంత్ కు. "ఓ! యా! గుర్తుకొచ్చింది." అన్నాడు, ఆశ్చర్యం తొలగిపోయిన గొంతుతో.

"మీరు, మేడమ్ కలిసివుండడం లేదనుకుంటా?" అంది విశ్వజ్ఞ.

అసలు విషయాన్ని ఆమె నుండి దాచిపెట్టాలన్న ఆలోచనరాని అనంత్ ఉన్న విషయాలకు మరికొన్ని చేర్చి చెప్పాడు. ముఖ్యంగా ఈ గొడవ విశ్వజ్ఞ తమ ఇంటికి రావడం వల్లే జరిగిందన్నదాన్నే పెద్దది చేసి చెప్పాడు.

అనంత్ చెప్పిందంతా విన్న తర్వాత "ఇప్పుడు మీరెక్కడుంటున్నారు?" అంది విశ్వజ్ఞ.

ఆ ప్రశ్నతో అతనిలో ఒకానొక విశృంఖలభావం తలెత్తింది. సంకోచించకుండా చిరునామా, రావల్సిన దారి మొదలైన వివరాలన్నీ చెప్పేసాడు.

"రేపు సాయంత్రం ఆరుగంటలకు మనం అక్కడే కలుద్దాం!" అంది విశ్వజ్ఞ.

థ్రిల్ ఫీలయ్యాడు అనంత్. "ష్యూర్!" అని పైకి అని లోలోపల "వోవ్!" అని అనుకున్నాడు.

మరుసటి సాయంత్రం ఆరుగంటలకై ఆ క్షణం నుండే గడియారం వైపు చూసుకొసాగాడు.

\- - - - - -

కాలింగ్ బెల్ మోగడంతో హుషారుగా వాకిలి తీసాడు అనంత్.

ఎదురుగా కనబడ్డ వ్యక్తిని చూసి అవాక్కయ్యాడు. ఆ వెనకనే నిలబడివున్న మరో వ్యక్తిని చూసి కనుబొమలు ముడేసాడు.

“అన్నయ్యా! అనంత్ గారు…” అంది విశ్వజ్ఞ.

“నమస్కారమండి. నా పేరు విశ్వేశ్వర్. విశ్వజ్ఞ అన్నను.” అని ఎదురుగా వున్న వ్యక్తి అనడంతో తేరుకున్న అనంత్ “ప్లీజ్ కమ్…లోపలికి రండి!” అని వాకిలిని పూర్తిగా తీసాడు.

లోనికొచ్చి సోఫాలో వాళ్ళు కూర్చున్న తర్వాత ఏం మాట్లాడాలో తోచని అనంత్ యథాలాపంగా “కాఫీ తీసుకుంటారా?” అని అడిగాడు. వద్దన్నాడు విశ్వేశ్వర్. వెంటనే “మీరు తాగాలేమో! కిచెన్ ఎక్కడుందో చెల్లికి చెప్పండి. తను చేసిస్తుంది.” అన్నాడు.

అనంత్ వంటగదిని చూపించగానే అటుకేసి వెళ్ళింది విశ్వజ్ఞ.

అనంత్ కు అంతా తికమకగానూ, గందరగోళంగానూ ఉంది. ఇక్కడకొచ్చి కలుస్తానని చెప్పిన విశ్వజ్ఞ ఇలా అన్నను పిలుచుకు రావడంలోని ఉద్దేశ్యమేమిటి? నిన్న మాట్లాడిన మాటల్లో తను తప్పుగా ఏం మాట్లాడలేదే! హద్దులు దాటలేదే! ఐనా ఇతణ్ణి పిల్చుకురావడమెందుకు? ఒకవేళ రంజని ఈ విశ్వేశ్వర్ కు ఏమన్నా కథలు చెప్పి రెచ్చగొట్టి పంపిందా?

ముందేం జరగబోతోందన్న దాని పట్ల లోలోపలే జంకుగా ఉంది అనంత్ కు.

“డాటాబేస్ ఆర్కిటెక్చర్లో మీరు చాలా ఎక్స్పర్ట్ అని విన్నాను.” అని అన్నాడు విశ్వేశ్వర్ ఉపోద్ఘాతంగా.

పిరికిగా నవ్వాడు అనంత్.

ఆలోపు కాఫీలు పట్టుకొచ్చింది విశ్వజ్ఞ.

తాగినంతసేపూ మౌనంగా ఉన్నారందరూ.

కప్పులు తీసుకుని విశ్వజ్ఞ లోనికెళ్ళగానే మొదలెట్టాడు విశ్వేశ్వర్ – “సర్! మీరు, మేడమ్ మళ్ళీ కలవాలి. ప్లీజ్!” అన్నాడు.

“రాయబారానికి ఆమే పంపిందా లేక పెద్దరికం మీదేసుకుని మీరే వచ్చారా?” అన్నాడు అనంత్.

“మేడమ్ పంపలేదు. మీకు బుద్ధి చెప్పేంత పెద్దరికం నాకు లేదు సర్. కానీ నా చెల్లెలి జీవితానికి ఒక దారి చూపిన మేడమ్ గారి జీవితం ఇలా కాకూడదన్న బాధతో మిమ్మల్ని వేడుకోవడానికి వచ్చాను.” అంటూ చేతులు జోడించాడు విశ్వేశ్వర్.

అతని వినయాన్ని, మెత్తని పలుకుల్ని చూస్తున్న అనంత్ కు కోపం రమ్మన్నా రావడంలేదు.

“చూడండి.....” పేరు గుర్తురాక ఆగాడు అనంత్.

“విశ్వేశ్వర్...” అన్నాడు విశ్వేశ్వర్.

“యా...విశ్వేశ్వర్...మీ చెల్లెలు నిన్న నాకు ఫోన్ చెయ్యడం. ఈరోజు మీరిలా నాకు లెక్చరివ్వడానికి రావడం, ఐ జస్ట్ కాంట్ మేక్ హెడ్ అండ్ టైల్ ఆఫ్ దిస్ రకుస్!” అన్నాడు అనంత్ కోపాన్ని బలవంతంగా తెచ్చిపెట్టుకుంటూ.

“సారీ సర్! మీకు ఇబ్బంది కలిగించడం నా ఉద్దేశ్యం కాదు. నా చెల్లెలి వల్ల మీరిద్దరూ దూరం దూరంగా ఉండడం చూడలేక ఇలా వచ్చాను. నా చెల్లలికి ఫ్రీగా మాట్లాడే స్వభావం ఉంది. అలా మాట్లాడ్డంలో ఎలాంటి చెడు ఉద్దేశ్యముండదు. కొద్దిమందికి ఇది నచ్చినా చాలామంది అపార్థం చేసుకుంటారు. మేడమ్ గారు కూడా అపార్థం చేసుకున్నారు.” అన్నాడు విశ్వేశ్వర్.

“ఐతే ఆమె దగ్గరికి పోకుండా నాకెందుకు సుత్తి కొట్టడం? నేను మీ చెల్లెల్ని గానీ, ఆమెనుగానీ అపార్థాలు చేసుకోలేదే!” అన్నాడు అనంత్.

“నిజమే సర్! మొదటగా మేడమ్ గారితోనే మాట్లాడాలి. నేను ఆల్రెడీ ఫోన్లో మాట్లాడాను. సారీ చెప్పాను. మేడమ్ గారు క్షమించారు. నా చెల్లెలు ఇంకోసారి ఇలాంటి తప్పు చెయ్యకూడదని వార్నింగిచ్చారు. ఇప్పుడు మిమ్మల్ని రిక్వెస్ట్ చేసుకొందామని వచ్చాను. ప్లీజ్ సర్! మీరు ఇంటికి వెళ్ళండి!” అన్నాడు విశ్వేశ్వర్, చేతులు జోడిస్తూ.

అతనికి ఏం జవాబివ్వాలో తోచలేదు అనంత్ కు.

“సర్లేండి. ఆలోచించుకోవడానికి నాకు టైమ్ కావాలి.” అన్నాడు పొడిగా.

“థాంక్స్ సర్. ప్లీజ్ కన్సిడర్ మై సిన్సియర్ రిక్వెస్ట్ టు జాయిన్ విత్ మేడమ్!” అన్నాడు విశ్వేశ్వర్, కుర్చీలో నుండి లేస్తూ.

“ఒక్క నిముషం కూర్చోండి!” అన్నాడు అనంత్.

కూర్చున్నాడు విశ్వేశ్వర్.

“మీకు, రంజనికి ఎలా పరిచయమైంది?” అన్నాడు అనంత్.

విశ్వేశ్వర్ అన్ని ఘటనల్నీ చెప్పాడు. ఆరోజు కారులో రంజనిని తనని తీసుకెళ్ళకుంటే విశ్వజ్ఞ జీవితం ఎలా అభాసు పాలయ్యేదో వివరించి వివరించి చెప్పాడు. అలానే తన చెల్లికి ఉద్యోగాన్ని ఇప్పించి రంజని తమ ఇంటిని ఎలా నిలిపిందన్న విషయాన్ని మరీమరీ నొక్కి చెప్పాడు.

అనంత్ కు ఆశ్చర్యమేసింది. “ఒక్కరోజు కూడా నాతో ఈ విషయాలేవీ చెప్పలేదే!” అన్నాడు.

“మేడమ్ గారికి గొప్పలు చెప్పుకోవడం ఇష్టం లేదనుకుంటాను సర్.” అన్నాడు విశ్వేశ్వర్.

“ఉన్న విషయాల్ని మొగుడితో చెప్పుకోవడం గొప్పలు చెప్పుకోవడమా? భలే చెప్తున్నారే మీరు?” అని ఎకెసెక్కంగా అన్నాడు అనంత్.

“మీరన్నది నిజం. భార్యకు భర్తే ఆప్తుడు. కానీ ఒక్కోసారి వాస్తవాలను ఆప్తులతో చెప్పుకున్నా కూడా అవి గొప్పలుగా భావించే అవకాశం ఉంది. అందుకని ఆవిడ మీతో చెప్పివుండరు.” అన్నాడు విశ్వేశ్వర్.

“దిసీజ్ అబ్సర్డ్ బట్ ఇంటరెస్టింగ్...భార్యకు భర్త ఆప్తుడు. కానీ అలాంటి వాడితో కూడా ఆమె చెప్పుకోలేని విషయాలుంటాయా?” అన్నాడు అనంత్.

“ఉంటాయి సర్. అవి ఆ భార్యాభర్తల సంబంధాన్ని బట్టి ఉంటాయి. ఎండిపోయిన చెరువును కూడా చెరువనే పిలుస్తారు. కానీ అది దప్పికను తీర్చదు కదా? అలాగే, వివాహబంధాన్ని పూర్తిగా గౌరవించలేని భర్త, భార్య సామర్థ్యాన్ని గుర్తించలేని భర్త, తన గురించే ఎక్కువగా చెప్పుకొనే భర్త –

ఇలాంటివాళ్ళ దగ్గర భార్యలు తమ గురించి ఏం చెప్పుకున్నా అపార్థాలకు దారి తీస్తుంది." అన్నాడు విశ్వేశ్వర్.

ఆ మాటలకు ఉలిక్కిపడ్డాడు అనంత్. ప్రతి మాటా తన గురించే అన్నట్టుగా అనిపించింది అతనికి.

"జీవితం కుండలాంటిది. కుండకు ఏవైపు రంధ్రం పడినా నీరు కారిపోతుంది. అలాగే భార్యాభర్తల మధ్య ఎవరి వైపునుండైనా దూరం పెరిగితే ఇద్దరి మధ్యా నమ్మకం జారిపోతుంది. నమ్మకం లేనప్పుడు వాస్తవాలు కూడా అబద్ధాల్లా అనిపిస్తాయి. మనకు ఇష్టమైన వాటి గురించి మాట్లాడేవాళ్ళు చాలామంది దొరకుతారు. కానీ మనకు మంచిని చేసేవాళ్ళు అరుదుగా ఉంటారు. భార్యాభర్తలు ఒకరికొకరు మంచిని కోరాలి. మంచినే చెయ్యాలి. అందుకే మన సంప్రదాయంలో ఈ బంధానికి అంతులేని ప్రాముఖ్యతనిచ్చారు. తనను, తన తల్లిదండ్రుల్ని అవమానిస్తూ తప్పు చేస్తున్న భార్యకు త్వరలోనే తప్పును దిద్దుకునే అవకాశం ఉందని తెలుసుకున్న భర్త ఆమెను మంచిదారిలో పెట్టడానికి గానూ తన తల్లిదండ్రులను కొద్దికాలం దూరంగా ఉంచవచ్చని, అది తప్పు కాదని పెద్దలు ఎప్పుడో చెప్పేసారు." అన్నాడు విశ్వేశ్వర్.

"ఓహ్!" అని ఆశ్చర్యం మాత్రం ప్రకటించగలిగాడు అనంత్.

"సర్! ఇప్పటికే అతిగా మాట్లాడినట్లున్నాను. చివరగా ఒక్క మాట. ఉద్వేగంతో కూడిన జీవితం అంటే టెన్షన్ ఫిల్డ్ లైఫ్ లో మంచితనం తన చోటును కోల్పోతుంది. అన్ని సుఖాల్నీ ఒకేసారి సంపాదించలన్న అత్యాశ, నన్ను మించినవాళ్ళు లేరనే అహంకారం, పొరుగింటి పుల్లకూర రుచి అనే స్వభావం ఉద్వేగానికి కారణాలౌతాయి. వీటిల్ని కంట్రోల్లో పెట్టుకోగలిగితేనే శాంతి దొరికేది. ప్రాణాలు పోయేటప్పుడు లేని ఔషధాలు ఆ తర్వాత సంచి నిండుగా ఉన్నా ఏం ఉపయోగం? అట్లానే అనవసరమైన పంతాలతో వయస్సుని వృధా చేసుకోకూడదు. ప్లీజ్ సర్! మేడమ్ గారితో మళ్ళీ చేరే విషయంలో తొందరగా ఓ డెసిషన్ తీసుకోండి." అన్నాడు విశ్వేశ్వర్.

సరేనన్నట్టు తలూపాడు అనంత్.

“సార్ ఓకే అంటున్నారు!” అని అన్న చెవిలో చెప్పింది విశ్వజ్ఞ.

“చాలా సంతోషం సర్. ఉంటాము.” అని లేచి ముందుకు కదిలాడు విశ్వేశ్వర్.

వాళ్ళు వెళ్ళిపోయాక మొదటిసారిగా జీవితం గురించి తీవ్రంగా ఆలోచించడం మొదలెట్టాడు అనంత్.

టక్కున లాప్ టాప్ తెరిచి, Pictures ఫోల్డర్లోని ఫోటోలను చూడసాగాడు. చూసినదాన్నే మళ్ళీ చూసుకున్నాడు. రంజని ముఖంలోని నవ్వులో ఉన్న హాయి, ఆమె కళ్ళలో ఉన్న నిజాయితీ తనలో లేనట్టుగా అనిపించింది.

మొబైల్ తీసుకుని డయల్ చేసాడు.

రంజని ఫోన్ మోగుతోంది.

మోగి, మోగి, మోగి...ఆగిపోయింది.

సోఫాలో కూలబడ్డాడు అనంత్.

మామూలుగా ఐతే మొబైల్ తియ్యనందుకు రంజనిపై విరుచుకుపడేవాడే. కానీ ఈరోజు అతను మామూలు అనంత్ కాడు.

★ ★ ★ ★ ★

’సుగుణము’ అన్న పదహారవ గడిలోని నిచ్చెనను ఎక్కి ’సాలోక్యము’ అన్న ఇరవై ఎనిమిదవ గడిని చేరిన లక్ష్మీదేవి రెండవ ఆటకాయను చూసిన నారాయణుడు నవ్వాడు. అందుకు ప్రతిగా తనూ నవ్వింది త్రైలోక్యజనని.

“ఆట మొదటలో మీ రెండో ఆటకాయ కూడా ఇదే నిచ్చెనెక్కి మునుముందుకు దూసుకుపోయింది స్వామీ!” అంది విదేహరాజపుత్రి.

“అవునవును. నేను సృష్టి కథల్ని మళ్ళీ మళ్ళీ వ్రాసినట్టే, ఈ ఆటలోని పావులు అవే గడుల్ని మళ్ళీ మళ్ళీ ఎక్కి, దిగుతుంటాయి. అప్పుడేమో నా పావుల నడక గురించి చెబుతూ భార్యాభర్తలు ఒకే ఆలోచనాతరంగాలపై విహరించడాన్ని సాలోక్యమని వివరించావు. మరి ఇప్పుడు నీ ఆటకాయ నడక గురించి వివరించు ప్రియా!” అన్నాడు సత్యవ్రతోద్ధారకుడు.

చేతులు జోడించిన సత్యప్రియభామిని అంది – “ప్రభూ! జ్ఞానహీనులు దూషణలు చేస్తే, ఆ దూషణల్ని భూషణాలుగా గ్రహిస్తారు జ్ఞానులు. ఒకరిని అనవసరంగా దూషించడమనే దుర్గుణం పోయినప్పుడు మాత్రమే ఎదుటివారిలోని సుగుణాలు అర్థమవుతాయి. ఆ దుర్గణాలు పోవాలంటే సజ్జనుల స్నేహం కావాలి. చల్లటి, చక్కటి మాటలు పలికే స్నేహితుల వల్ల జ్ఞానహీనుల్లో జ్ఞానోదయం కలుగుతుంది. కర్కోటకుడి నోట నుండి జారి పందిగా మారిన నాటి నుండీ విశ్వేశ్వరులైన, విశ్వసౌఖ్యకాంక్షులైన, విశ్వజ్ఞులైన మీ హితోక్తుల్ని వింటున్న నా రెండో ఆటకాయ, నేడు సుగుణాన్ని సంపాదించి సాలోక్యాన్ని చేరింది. ఇక్కడ సాలోక్యమంటే ఎదుటివారిలోని మంచితనాన్ని తనలోకి ఆహ్వానించడమనే అర్థం. బ్రహ్మలోకం నుండి కదలి ముక్తసూర్యుణ్ణి చేరిన తన జోడీని చూసి, కొత్త నీతి పాఠాల్ని నేర్చుకున్నట్టుంది ఈ రెండో ఆటకాయ. అందుకనే సుగుణం ద్వారా సాలోక్యాన్ని అందుకుంది. ఇదంతా మీ కృపవల్లనే సాధ్యమైంది!”

అంగీకరిస్తున్నట్టుగా తలూపాడు లక్ష్మణాగ్రజుడు.

“మరి ’జన్మరాహిత్య’ సీమల్లో తచ్చాడుతున్న మీ రెండో ఆటకాయ చెప్పబోయే అతీత, అనాగతమైన తత్త్వోపదేశాన్ని మీ నోట వినడానికి నా మనసు ఉత్సుకమౌతోంది. అనుగ్రహించండి!” అంది సుగ్రీవసఖుని ప్రియసఖి.

అప్రమేయుడు పాచికలు వేస్తే కలినిగ్రహనార్థమై కల్కి అధిరోహించిన తురంగ ఖరపుట ఘట్టన స్ఫుట చటచట శబ్దాల్లా ఘోషించాయి.

★ ★ ★ ★ ★

పురాకృత కర్మల వల్ల పోగుపడి, పిల్లలు కలగడానికి అడ్డుపడే పాపాల్ని తొలగించుకునే నిమిత్తం ఆ మారుమూల పల్లెలో హోమకార్యక్రమాన్ని ముగించుకుని వచ్చారు సుమతి–శర్మ దంపతులు. '*మోసం ద్వేషం లేని సీమ*'లాంటి ఆ పల్లెటూరి నుండి పట్నానికి రాగానే ఉక్కిరిబిక్కిరైంది సుమతి. పక్కనే ఉన్న శర్మలోని నిష్కాపట్యం మాత్రమే ఆమెకు ఇక్కడ లభించగలిగే ఊరట.

అక్కడినుండి వచ్చిన ఓ వారం రోజుల తర్వాత సుమతికి వరుసగా వింతైన కలలు వచ్చాయి. వాటిల్ని భర్తతో చెప్పుకోవాలో వద్దోనన్న గందరగోళానికి గురై అల్లల్లాడుతోంది ఆమె.

ఒకనాడు...

మరుసటిరోజు పూజలో కూర్చునివున్న శర్మను వెనుకనుండి చూసింది సుమతి.

ఆశ్చర్యపు అల ఒకటి ఆమెను ముంచెత్తింది.

పద్మాసనంలో కూర్చుని, వెన్నెముకను నిటారుగా పెట్టి, రెండు చేతుల్ని ధ్యానముద్రలో ఉంచి కూర్చున్న శర్మ శరీరభంగిమ, శృతి చేసి పట్టుకున్న తంబూరలా అనిపించింది ఆమెకు.

అప్పటిదాకా అప్రమత్తమైవున్న అలౌకిక భావన ఒకటి ప్రమత్తమై, ప్రఫుల్లమై, ఫుల్లఫేనయుత సముద్ర తరంగమై ఆమె మనోసీమల్ని ముంచెత్తసాగింది.

ఎలాగైనా సరే, భర్త తో తన కలల గురించి మాట్లాడి తీరాలని ఆ క్షణంలో నిశ్చయించుకుంది సుమతి.

– – – – – –

హాల్లో గోడకు మేకు కొట్టే పనిలో ఉన్నాడు శర్మ.

“ఏ పటం పెట్టబోతున్నారు?” అని అడిగింది సుమతి, శర్మ ఎక్కిన కుర్చీని పట్టుకుని.

“చూస్తావుగా!” అన్నాడు శర్మ.

మేకు భద్రంగా ఉందని రూఢి చేసుకుని – “ఆ సంచీలో పటం ఉంది. ఇలాగివ్వవా?” అన్నాడు శర్మ.

కాగితం చుట్టిన ఓ పటాన్ని జాగ్రత్తగా పట్టుకొచ్చింది సుమతి.

శర్మ ఆ కాగితాన్ని తీసేసి పటాన్ని మేకుకు వేళ్ళాదీసాడు. ఓసారి తృప్తిగా దాన్ని చూసి, క్రిందకు దిగాడు.

అప్పటిదాకా అడ్డువున్న భర్త దిగగానే పటం వైపుకు తేరపారి చూసింది సుమతి.

ఒక్కసారిగా ఆమె ఒళ్ళు ఝల్లుమంది.

నారాయణుడి ఒడిలో లక్ష్మీదేవి ఓ బంగారు గిన్నెను అతని నోటికి దగ్గరగా ఉంచి కూర్చునివుంది. కుడివైపు హనుమంతుడు, ఎడమవైపు గరుత్మంతుడు చేతులు జోడించి, తలలు వంచి నిలబడివున్నారు. బ్రహ్మ-సరస్వతులు, శివపార్వతులు మొదలైన దేవానుదేవతలందరూ చుట్టూ నిలబడివున్నారు. హనుమంతుడికి వెనకగా నారద-తుంబురులు వీణల్ని పట్టుకుని నిలబడివున్నారు. ఆశ్చర్యంగా, వాళ్ళు వీణల్ని తంబూరల్లా భుజాన మోస్తూ నిలబడివున్నారు.

సుమతికి పల్లెటూరి ఆలయంలో, హోమ సమయంలో జరిగిన అనుభవం గుర్తుకువచ్చింది.

"ఆ ఇద్దరు పురుషులు. ఆ తంబూరలు. అంటే? అక్కడ కనబడినవారు నారద, తుంబురులా? ఊరికి వచ్చేసాక వరుసగా వచ్చిన కలల్లో కనిపించిన పురుషుల జంట వీళ్ళేనా?" — సుమతిలో ఆలోచన, ఆశ్చర్యం కలగలసిపోయి ఉద్వేగాన్ని రేకెత్తిస్తున్నాయి.

సుమతి మౌనాన్ని 'నిశ్చేష్ట'గా అర్థం చేసుకున్న శర్మ "ఇది మా పరగణా మహారాజా గారి దివాణంలో ఉన్నదానికి నకలు. మా ముత్తత గారు ఆ రాజుగారి ఆస్థాన పురోహితులట. ఇదో అపూర్వమైన చిత్రమని ఇందులో చాలా ఆధ్యాత్మిక రహస్యాలున్నాయని మా తాతగారు నాన్నగారికి చెబుతుంటే విన్నాను. ఆ రహస్యాలేవో నాకు తెలీవు. నాన్నగారు ఎప్పుడూ చెప్పే ప్రయత్నం చెయ్యలేదు. ఆయనంటే నాకు చాలా భయం. పైగా అప్పటికి నేను చాలా చిన్నవాణ్ణి కూడానూ..." చెప్పుకుపోతున్నాడు శర్మ. ఆ కళాఖండం అతనిలో చిన్ననాటి జ్ఞాపకాల్ని తట్టి లేపినట్టుంది.

“శేషయ్యగారు ఈ చిత్రం నకలు గురించి చెప్పారు. ఆయన ముత్తాత గారే ఈ చిత్రాన్ని ఆరోజుల్లో వ్రాసి రాజుగారికిచ్చారు. గవర్నమెంటు మ్యూజియంలో ఉన్నదాన్ని శేషయ్యగారు అతికష్టం మీద ఇంటికి తీసుకొచ్చి ఓ వారంరోజుల్లో నకలు తయారుచేసుకుని ఇచ్చేసారట. పోయిన నెలలో ఇక్కడకు వచ్చినపుడు వివరాలు చెప్పారు. వెంటనే నాకూ ఒక కాపీ ఇవ్వండని అడిగాను. ఈరోజు పొద్దున కట్టు వేసి మరీ తెచ్చిచ్చారు.”

సుమతికి శర్మ చెబుతున్న మాటలు వినబడుతున్నాయి గానీ ఆమె మనస్సంతా నారద–తుంబురల మీదే లగ్నమైవుంది.

“సుమతీ! భోజనం వద్దా?” అన్న శర్మ మాటలకు ఈలోకంలో వచ్చింది ఆమె.

చకచకా వడ్డన ఏర్పాట్లు చేసింది.

శర్మ భోంచేస్తుండగా నెమ్మదిగా మాటలు కలిపింది.

“ఏమండీ! హోమం ముగించుకుని వచ్చిన రోజు నుండీ మీతో ఓ విషయం చెప్పాలనుకున్నాను...”

“అలాగా! ఏమిటది?”

“నవ్వకూడదు!”

“భరించలేనంతగా వస్తే తప్ప నవ్వను. చెప్పుమరి?” అన్నాడు శర్మ.

“ఆరోజు, హోమం దగ్గర నేను నిద్రపోయానని మీరనుకున్నారు. కానీ అది నిద్ర కాదు. ఏదో తెలియని ఏమరుపాటు. మైమరపు!”

“ఈ మాట ఆరోజే చెప్పావు...” అంటూనే ఆగిపోయాడు శర్మ. అతనికి అప్పుడు తట్టింది...సుమతిని తను విసుక్కున్నప్పుడు త్ర్యంబక ఉపాధ్యాయ కూడా సరిగ్గా ఇవే మాటల్ని అన్నారు – “మీ ఆవిడది ఏమరుపాటు! నిద్రకాదు!”

తన మొహంలోకే గుచ్చి చూస్తున్న శర్మ చూపులకు సిగ్గుపడింది సుమతి. "ఏమండి! వింటున్నారా?" అని అడిగింది.

"చాలా శ్రద్ధగా..." అన్నాడు శర్మ.

"గుడి మెట్లకి అవతల ఇవతల తంబూరల్ని పట్టుకొన్న ఇద్దరు భక్తుల విగ్రహాల్ని చూసారు కదా! మీరు హోమం చేస్తున్నప్పుడు ఆ ఇద్దరు వ్యక్తులు ఆ హోమగుండంలోంచి పైకి వచ్చినట్టు అనిపించింది. ఇద్దరూ తంబూరల్ని మీటుతూ వచ్చారు. ఆ విగ్రహాలు మనుష్యుల లానే ఉన్నా నాకు కనబడిన వారిలో ఒకరిది మనిషి తల. మరొకరిది గుర్రం తల. చాలా చిత్రంగా ఉన్నారు. కానీ వాళ్ళ సంగీతంలో ఎంత ఆకర్షణ ఉందనుకున్నారు?" అన్న సుమతి మాటలకు దిగ్భ్రాంతి చెందాడు శర్మ. "మనిషి తల, గుర్రపు తలా?" అన్నాడు.

అవునన్నట్టుగా తలూపింది సుమతి – "అంతేకాదండీ! ఓ వారం రోజులుగా విచిత్రమైన కలలు వస్తున్నాయి. ప్రతి కలలోనూ ఆ ఇద్దరే కనబడుతున్నారు. అలా కనబడిన ప్రతిసారీ వాళ్ళు వేగంగా నా ఒంట్లోకి దూసుకెళ్తున్నట్టుగా అనిపిస్తుంది. నాకు చాలా భయం వేస్తుంది. వాళ్ళలా నాలోకి దూసుకెళ్ళే క్షణంలో మీరు నన్ను గట్టిగా పట్టుకుంటారు. మీ చేతుల్లో ఉన్న నాకు భయం పోయి ఏదో శక్తి వచ్చినట్టౌతుంది. వాళ్ళు మాయమైపోయాక చూస్తే నా కొంగులో రెండు మామిడి పళ్ళుంటాయి. మీరు నవ్వుతుంటారు. ప్రతి కలా దాదాపు ఇలానే ఉంటుంది. ఏవో కొన్ని కొన్ని మార్పులు తప్ప! ఈరోజు మీరు తీసుకొచ్చిన పటంలో చూడండి...నారద–తుంబురులు వీణల్ని తమ భుజాల మీద తంబూరల్లా మోస్తున్నారు కదా! నా కలలో కనబడే వ్యక్తులు కూడా అచ్చు అలానే మోస్తుంటారు..."

స్తబ్దుగా కూర్చుండిపోయిన శర్మ "విచిత్రం..." అని మాత్రం అనగలిగాడు.

"అయ్యో రామా! మాటల్లో పడి నేను వడ్డించలేదు...మీరు తినడం లేదు. మొదట భోజనం కానివ్వండి!" అని అంది సుమతి.

ఆపై భోజనాన్ని మౌనంగా ముగించాడు శర్మ. అతని భోజనమయ్యాక తనూ హడావిడిగా ముగించింది సుమతి.

రాత్రి వరకూ వాళ్ళిద్దరూ తమతమ పనుల్లో మునిగిపోయారు.

పరుపు మీద కూర్చున్న శర్మ, సుమతి రాగానే ఎదురుగా కూర్చోమన్నాడు.

శర్మ సుమతి ముఖంలోకి చూసాడు. ఆ కళ్ళలో కొత్త వెలుగు...చాలా స్పష్టంగా కనబడుతోంది. అది ఏమాత్రం భ్రమ కాదు...భ్రాంతి అసలే కాదు. ఆమె కన్నుల్లోనిది సిసలైన అలౌకిక తేజస్సు. మెరుస్తూ...మనస్సును లాగేస్తూ. ఉపాధ్యాయ ఇంట్లో ఆ వెన్నెల రాత్రి తంబూర గురించి ప్రశ్నిస్తున్నప్పుడు ఆమె కన్నుల్లో తాను చూసిన వెలుగే ఇది. కానీ ఆరోజు కంటే ఇప్పుడు ఆ వెలుగు మరింత తేజోవంతంగా కనబడుతోంది.

"ఆనాడే తంబూర నన్ను గురించి అడిగింది కదూ! ఆమె ఎందుకంత ప్రత్యేకంగా తంబూర గురించే అడిగిందో అప్పుడు తెలుసుకునే ప్రయత్నం చెయ్యలేదు. కానీ ఈరోజు అర్థమైంది. ఏమిటిదంతా? భగవంతుడు తనకు ఏదైనా చెప్పదల్చుకున్నాడా? సుమతి కలలు అతని సంకేతభాషకు నిదర్శనాలా?" — పరిపరివిధాలా పోతోంది శర్మ మనసు.

"ఏమండీ! ముందు కూర్చోబెట్టుకుని ఏమీ మాట్లాడ్డం లేదు? నేనా రోజు నిద్రపోయాననే అనుకుంటున్నారా?" అని నవ్వుతూ అడిగింది సుమతి.

లేదన్నట్టుగా తలూపాడు శర్మ.

"మరి! కల అంటే ఏమిటండి?" అంది సుమతి.

ఆమె నుండి ఆ ప్రశ్నను మధ్యాహ్నం నుండీ ఎదురుచూస్తున్నాడు శర్మ.

"కష్టమైన ప్రశ్న. జవాబునివ్వడం అంత సులభం కాదు!" అన్నాడు, ఉపోద్ఘాతంగా.

"అవునా? ఐనా మీరు చెప్పండి..నాకెంత అర్థమైతే అంతే చాలు." అంది సుమతి.

సరేనన్నట్టు తలూపి కొనసాగించాడు శర్మ — "మానవ జీవితం భూత, వర్తమాన, భవిష్యత్తులనే కాల విభాగాలకు లోబడి నడుస్తుంది. ఈ మూడూ వేటికవి విడిగా ఉంటాయి. ఒకటి ముగిసిన తర్వాతే మరొకటి ప్రవేశిస్తుంది. కానీ ఆ మూడూ ఒకచోట కలవగలిగే స్థితినే 'స్వప్న'మని పిలిచారు."

"ఓహో! మూడూ ఒకటిగా కలవడమా?అదెలా సాధ్యం?" అంది సుమతి.

"త్రివేణీ సంగమంలా! ఇంకా సులభంగా చెప్పాలంటే నువ్వు వేసుకునే జడను తీసుకో. అందులో మూడు పాయలూ వేటికవి విడిగా ఉన్నా, కలిపి వేసేసరికి 'జడ' అన్న ఒక్క పేరుతోనే పిలవబడతాయి." అన్నాడు శర్మ.

"ఓహ్! అర్థమైంది. ఇంతకు ముందు తాళింపులో తత్త్వాన్ని విడమర్చారు. ఈరోజు జడలో వున్న తత్త్వాన్ని చెప్పారు." అంది సుమతి మెచ్చుకోలుగా.

"ఎలాగైతే జడలో రెండు పాయలు కనబడుతూ మూడోది రహస్యంగా దాగివుంటుందో, అదే విధంగా స్వప్నం కూడా ఏ రెండు కాలాలనో ప్రముఖంగా చూపిస్తుంది. గతం-వర్తమానం లేక వర్తమానం-భవిష్యత్తు లేక గతం-భవిష్యత్తు...ఇలా రెండు విభాగాల్ని స్పష్టంగా చెబుతూ, మూడోదాన్ని వాటిల్లోనే అంతర్హితం చేస్తుంది. అందువల్లనే కలలు రహస్య సంకేతాల్లా అనిపిస్తాయి. ఓ పట్టాన అర్థం కావు." అన్నాడు శర్మ.

సుమతిలో ఆసక్తి పెరిగింది. — "కలలు మన జీవితం గురించి చెబుతాయా? మనకు రాబోయే సమస్యల్ని ముందే చెబుతాయా? అలాగే దొరకబోయే సుఖాల గురించి కూడా చెబుతాయా? కలలు నిజమౌతాయని అంటారు. అది నిజమేనా? ఇప్పుడు నాకొచ్చిన కలకు అర్థమేంటి? అది మంచిదేనా?" అన్న ప్రశ్నలు ఒకదాని వెంట ఒకటి పరుగులు పెట్టాయి.

ఆమెలోని ఆతృతను చూసి నవ్వాడు శర్మ. సుమతి చెంపలను మెత్తగా తాకి — "ఈమధ్య కలల గురించి బాగా ఆలోచిస్తున్నట్టున్నావే!" అన్నాడు. ఔనన్నట్టుగా తలాడించింది సుమతి.

“మనకు పడే అన్ని కలలూ నిజాల్ని చెప్పేవి కావు. ఒక్కోసారి అనారోగ్యం వల్ల అరకొర నిద్రలో కలల్లాంటి దృశ్యాలు వస్తాయి…” అని ఓమారు ఆగి “పైత్యం ఎక్కువైనా పిచ్చి కలలు వస్తాయి…” అన్నాడు శర్మ.

ఫక్కున నవ్వింది సుమతి.

నవ్వుతూ కొనసాగించాడు శర్మ – “నిజానికి కలల్ని అర్థం చేసుకోవడం చాలా కష్టం. అందులో కనబడేవన్నీ సంకేతాలు మాత్రమే. అంటే కోడ్స్ అన్న మాట. ఉదాహరణకు నీ కలలో మామిడి పండు కనబడింది. కానీ ఆ పండు ఒకానొక సంకేతం మాత్రమే. ఇంగ్లీషులో సింబల్ అంటారు చూడు అలాంటిదన్న మాట.”

“ఓహో! మరి కలల భాషలో మామిడిపండుకు అర్థమేంటి?” అంది సుమతి.

“ముందు కల గురించి సరిగ్గా తెల్సుకో. ఆ తర్వాత మామిడి పండు గురుంచి చెప్పుకుందాం.” అన్నాడు శర్మ.

“చెప్పండి…చాలా ఆసక్తిగా ఉంది.” అంది సుమతి.

ఓసారి గట్టిగా ఊపిరి పీల్చుకుని మళ్ళీ మాట్లాడసాగాడు శర్మ – “బ్రతికినన్నాళ్ళూ ప్రతివారూ ప్రతిరోజూ మూడు అవస్థలకు లోనౌతారు. అవి – జాగృత, స్వప్న, సుషుప్తి అనేవి. జాగృత అంటే మేలుకునివుండడం. ఈ జాగృతస్థితిలో మనిషి శరీరం మొత్తం మేలుకుని పనిచేస్తూవుంటుంది. స్వప్న అంటే నిద్రపోయినప్పుడు కలిగే స్థితి. ఇందులో శరీరం లోని భాగాలు పనిచెయ్యవు. ఒక్క మనసు మాత్రమే పనిచేస్తూవుంటుంది.”

“శరీరం పని చెయ్యకపోతే, ఊపిరి ఎలా ఆడుతుంది?” అని అడ్డు తగిలింది సుమతి.

“మంచి ప్రశ్న…చాలా మంచి ప్రశ్న..” అన్నాడు శర్మ. – “మనిషి శరీరంలోని అవయవాలు దాదాపుగా అతని నియంత్రణలో ఉంటాయి ఒక్క ఊపిరిని పీల్చడం తప్ప. ఉదాహరణగా చెప్పుకోవాలంటే ఒకరికి చెయ్యి నొప్పి పుడుతోందంటే ఆ చెయ్యితో ఎక్కువ బరువు ఎత్తడమో

చేసివుండాలి. అప్పుడు ఆ చెయ్యికి విశ్రాంతినివ్వడం ద్వారా ఆ నొప్పిని తగ్గించుకోవచ్చు. ఈ చర్య మొత్తం మనిషి అధీనం. కానీ ఊపిరి తీసుకోవడానికి కష్టమౌతోందంటే ఊపిరి తీసుకోవడం మానెయ్ అని ఎవరూ అనరు. అవునా?"

"ముమ్మాటికీ నిజం. ఊపిరి తీసుకోవడం కష్టమౌతోందని ఎవరైనా అంటే వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్ళి ఆక్సిజన్ ఇచ్చేస్తారు!" అంది సుమతి.

"అవును! కాబట్టి, ఊపిరి తీసుకోవడమన్నది సాధారణ శారీరిక చర్యలా కనబడినా అది మనిషి నియంత్రణలో లేని స్వతంత్ర్య వ్యవస్థ. అర్థమైందా?" అన్నాడు శర్మ. అయిందన్నట్టు తలూపింది సుమతి. శర్మ కొనసాగించాడు.

"నిద్రాస్థితిలో మనిషి దేహంలోని అవయవాలన్నీ విశ్రాంతి తీసుకుంటాయి. ఒక్క మనసు తప్ప. మన మత సిద్ధాంతం ప్రకారం ఆత్మలోని భాగమైన ఈ మనసు అనాది నిత్యమైంది. అంటే ఎవ్వరూ తెలుసుకోలేని కాలం నుండీ ఈ సృష్టిలో ఉన్న వస్తువు. ఆత్మ ఒక దేహం నుండి మరో దేహానికి వెళ్తున్నప్పుడల్లా ఈ మనసు కూడా ఆయా దేహాల యొక్క సంస్కారాల్ని తనలో ఇముడ్చుకుంటూ వస్తుంది. ఈ ఇముడ్చుకోవడాన్నే 'వాసన' అంటారు. ఉదాహరణకు మొన్నొకసారి మనం రాజశేఖరం పెళ్ళికెళ్ళినప్పుడు ఒకాయన నా దగ్గరికొచ్చి నన్ను గుర్తుపట్టారా అని మాటి మాటికీ అడిగాడు. గుర్తుందా?"

"గుర్తుంది. ఆయన ఎంత అడిగినా మీకప్పుడు గుర్తురాలేదు. కానీ మెట్లు దిగుతూ నేను జారిపడబోతుంటే మీరు నన్ను పట్టుకున్నారు. అప్పుడు మీకు గుర్తుకొచ్చింది. చాలా ఏండ్ల క్రితం ఆయన్ను మీరు ఇలానే రోడ్డు పక్కనే ఉన్న గోతిలో పడబోతుంటే పట్టుకుని కాపాడారని. ఆపై అతను మీకు దూరపు బంధువని తెలిసింది.' అంది సుమతి.

"అవును. ఆయన అడిగినప్పుడు ఆ సంఘటన గుర్తురాలేదు. దాంతో ఆయనా గుర్తురాలేదు. కానీ అదేరకమైన సంఘటన వల్ల మళ్లీ గుర్తుకొచ్చింది. ఇది 'వాసనాశక్తి' మేల్కోవడం వల్ల జరిగింది. ఇంకా సులభంగా చెప్పుకోవాలంటే పాత జ్ఞాపకాల నుండి పొందే జ్ఞానాన్ని 'వాసన' అంటారు.  ఈ

'వాసనాశక్తి' వల్లనే మనకు అప్పటిదాకా తెలియని వ్యక్తులు కలల్లో కనబడుతుంటారు. ఒక్క మనుష్యులే కాదు ఏవేవో వస్తువులు, ప్రాంతాలు, లోకాలు, భాషలు పరిచయమౌతుంటాయి. అప్పటిదాకా మనకు తెలియనివి కనబడ్డాయి కనుక, ఆ కనబడ్డవి వెంటనే ఎదురుపడవు గనుక చాలామంది కలల్ని నమ్మరు. వాటిల్ని మిథ్యగా కొట్టిపారేస్తారు." అన్నాడు శర్మ.

"అంటే 'వాసనాశక్తి' పెరిగినప్పుడు వచ్చే కలల్లో కనబడేవేవీ అబద్ధాలు కావన్న మాట!" అని సాలోచనగా అంది సుమతి.

"అవును. ఎక్కడో ఉత్తరభారతదేశంలో పుట్టిన చిన్నపిల్లవాడు దక్షిణ భారతదేశంలో ఫలానా ఊర్లో ఫలానా ఇంట్లో పుట్టి పెరిగి చచ్చిపోయానని చెప్పినట్టు, అక్కడికెళ్ళి చూస్తే ఆ వూళ్ళో ఆ ఇల్లు ఉన్నట్టూ వగైరావగైరాలు ఇప్పటికీ వార్తాపత్రికల్లో మనం చదువుతుంటాం. ఇలాంటి కథల్లో దాదాపుగా అన్నీ వాస్తవాలే. ఆ కథలు నిజం కావడం వెనుక ఈ వాసనా శక్తి ఉంటుంది. వాసనాశక్తికి మరో నిర్వచనం – గడిచిపోయిన అనుభవాలను వర్తమాన కాలంలో తెలుకోవడం అని. చూసావా! మన శాస్త్రంలో ఎంత సైన్స్ వుందో?" అన్నాడు శర్మ.

"ఐతే ఆ పల్లెటూరు, ఆ కోవెల, మెట్ల పక్కనున్న ఆ ఇద్దరు భక్తులు, వాళ్ల తంబూరలు, నా కలలో కనబడే ఆ ఇద్దరు...ఇవన్నీ..." అని ఆగిపోయింది సుమతి.

గట్టిగా నిట్టూర్చాడు శర్మ. "నీ కలలో కనబడుతున్నవారు సామాన్యులు కారు. అలౌకిక లోకాల్లో ఉండేవారు. వారికీ, మనలాంటి అల్పులకూ సంబంధం ఉండదు. అలా ఉంటుందని అనుకోవడం భ్రమ. కాబట్టి, చాలా లోతుగా ఆలోచించాలి సుమతీ!" అన్నాడు శర్మ.

సుమతి మౌనంగా పడుకుంది.

ఎప్పుడూ వెల్లకిలా పడుకోని శర్మ అసంకల్పితంగా అలా పడుకున్నాడు. రెండు చేతుల్నీ తల క్రింద చేర్చి దీర్ఘమైన ఆలోచనల్లోకి జారుకున్నాడు.

అతని మేధస్సులో అమృతమథనంలాంటిది జరుగుతోంది.

"నా పక్కన ఇలా అమాయకంగా పడుకున్న ఈమె ఎవరు? పెళ్ళై పన్నెండు సంవత్సారాల్లో ఏనాడూ ఎదురుకాని సంఘటనలు ఈ కొన్ని నెలల్లో ఎందుకు ఎదురౌతున్నాయి? ప్రతి సందర్భంలోనూ శాస్త్రవిజ్ఞానాన్ని లోతుగా అధ్యయనం చేసిన నాకంటే సుమతి ఒక అడుగు ముందే ఉంటోంది. కారణమేమిటి? ఉన్నతమైన వ్యక్తిత్వాన్ని కలిగివున్నా కించిత్తూ అహంకారం లేని ఈమె నిజంగా మామూలు మనిషేనా? ఆమె కలల్లో వస్తున్న ఆ ఇద్దరూ దేనికి ప్రతీకలు? వాళ్ళు చెప్పదల్చుకున్న రహస్యమేమిటి? – హే భగవాన్! దుస్వప్ననాశకుడివి నీవు. అలానే సుస్వప్నదాతవూ నీవే! ఈ ప్రహేళికను నువ్వే పరిష్కరించాలి. నన్నే సర్వస్వమని నమ్మి, చాలా తెలివిగలవాడినని గౌరవించే ఈ శుద్ధ  సాత్విక జీవికి ఆ కలల గురించి వివరించే సామర్థ్యాన్ని నువ్వే ఇవ్వాలి. *యది త్వం సుప్రసన్నోసి సర్వార్థాని సంప్రదాస్యసి* – నువ్వు ప్రసన్నుడవైతేనే మా బోటివాళ్ళకు సర్వార్థాలు సిద్ధించేది. కాబట్టి ఈ విషయంలో నాపై ప్రసన్నతను చూపించు స్వామీ!" అని మనసులోనే చేతులు జోడించాడు శర్మ.

– – – – – –

"*యది త్వం సుప్రసన్నోసి సర్వార్థాని సంప్రదాస్యసి* – ఎంత చక్కటి భావం! నిజమైన భక్తికి ఇంతకంటే మంచి నిర్వచనం దొరకదు!" అంది హరిపాదసేవోద్యమి.

"అవునా! దేవీ!" అన్నాడు నిర్ఝరగణసేవ్యుడు.

"నిశ్చయంగా ప్రభూ! అంతటి భక్తి ఉంది కాబట్టే మీ రెండో పావు 'మాయాశక్తి' గడిని దాటగలిగింది. ఇలా దాటడం సులభం కాదు. అశక్యమైన ఈ శక్తిని దాటిన మీ ఆటకాయ నడకలోని గూఢార్థాన్ని తెలియజేయండి." అంది నిరుపమ.

"అలాగే దేవీ! నా తొమ్మిది శక్తుల్లో ఒకటైనది ఈ విష్ణుమాయ. జీవుల సాధనను పరీక్షించే వ్యాజం ఈ మాయ. ఉన్నది లేనట్టుగా, లేనిది ఉన్నట్టుగా కనబడ్డాన్ని భ్రమ అంటారు. దాని వ్యతిరేకంగా ఉన్నది ఉన్నట్టుగా తెలుసుకోవడాన్ని ప్రమ అంటారు. జీవులు భ్రమ నుంచి ప్రమకు చేరుకునేటప్పుడు వారి ధీశక్తిని పరీక్షించేదే నా మాయాశక్తి. 'మాయామాత్రమిదం సర్వం' అని వేదం చెబుతోంది. 'సర్వం విష్ణుమయం జగత్' అని అదే వేదం చెబుతోంది. నిత్యచైతన్యయుక్తమైన ఈ చరాచర ప్రపంచం

నిండుగా నేను, నా మాయా వ్యాపించువున్నాం. ఆ మాయాశక్తిని పొందిన నీ ప్రకృతి బలిష్టమై, సాధకుల చిత్తశుద్ధిని ఎప్పటికప్పుడు పరీక్షిస్తూ, సమీక్షిస్తూ, సరిచేస్తూ సాగుతూవుంటుంది. అశాశ్వతాలైన ప్రపంచ సుఖాలను వదిలిన వారికి ప్రకృతిలోని మాయాబంధనం తొలగిపోతుంది. కానీ దానికంటే బలిష్టమైన నా బంధకశక్తి వారి జ్ఞానస్థిరత్వాన్ని పరీక్షిస్తూనేవుంటుంది. స్థిరబుద్ధితో, స్థిరాసనంలో కూర్చుని, చిరంతన చింతనలో మునిగిన వారికి మాత్రమే విష్ణుమాయను దాటడం సులభమౌతుంది. 'భవ మమ శరణం' అన్న సాధకులు నా మాయాశక్తిని దాటి ముందుకు సాగుతారు. ఇక వారిని బంధించగల శక్తి ఏదీ లేదు." అన్నాడు ముక్తానాం పరమాగతి కారకుడైన సర్వేశ్వరేశ్వరుడు.

"దివ్యోపదేశం స్వామీ!" అంది ఘృతపూర్ణాన్నదాయిని.

"మరి నీ మొదటి ఆటకాయను నడుపు. భక్తిసుధను ఇప్పుడిప్పుడే చవిచూస్తున్న బిడ్డల్ని అలా ఆకలికి వదిలెయ్యరాదు!" అన్నాడు నర్మగర్భంగా కమలగర్భుడు.

"చిత్తం స్వామీ!" అంటూ అంబుజసదన పాచికల్ని వేస్తే అవి లవకుశుల తంబూర శృతుల్ని పలుకుతూ పడ్డాయి.

★ ★ ★ ★ ★

రెండో అంతస్తులో ఉన్న తమ అపార్ట్మెంట్ బాల్కనీలో నిలబడి జడ వేసుకుంటోంది రంజని.

అనంత్ లేనితనాన్ని విషాదంగా భావించడం మానేసి కొన్ని వారాలైపోతోంది. కొన్ని రోజుల క్రితం అనంత్ ఫోన్ చేసినా ఆమె తియ్యలేదు. అనంత్ మళ్ళీ ప్రయత్నం చేయకపోవడంతో అతనిలో మార్పు రాలేదని, రాబోదని నిశ్చయించేసింది రంజని.

ఆమెకు నిర్వేదంలోని గొప్పతనమేంటో ఈ కొద్దికాలంలోనే తెలిసింది. అనంత్ ఇల్లు వదిలి వెళ్ళిపోయాడన్న విషయం తెలుసుకున్న అరవింద్ చాలా బాధపడ్డాడు. రంజనిని ఓదార్చబోయాడు. అప్పుడామె అంది "అరవింద్! అనంత్ నాతో లేడన్న ఫీలింగ్ నాలో విషాదాన్ని నింపలేదు. ఐ థింక్ దేర్

ఈజ్ ఏ బ్లిస్ బీయింగ్ ఇన్ మెలాంకలీ! జీవితంలో అప్పుడప్పుడూ ఈ మెలాంకలీ లేకపోతే కంప్లీట్ నెస్ లేదనిపిస్తుంది. ఈ మాటల్ని డిప్రెషన్ తో చెప్పడం లేదు. జీవితం–నిర్వేదం ఈ రెండూ పిల్లనగ్రోవి, దానికుండే రంధ్రాల్లాంటివని అనిపిస్తోంది. ఒక్కో అనుభవం జీవితంలో గాలిలా వీస్తే, అవి నిర్వేదంగా మారితే, మనసులో కొత్త రాగాలు వినిపిస్తాయి. అప్పటిదాకా మనకే తెలియని కొత్త కోణాలు మనలో కనిపిస్తాయి."

ఆమె మాటల్ని విన్న అరవింద్ డంగైపోయాడు. "ఓహ్! వాటీజ్ దిస్? ఫిలాసఫీ?" అని మాత్రం అనగలిగాడు.

అరవింద్ భూతద్దాల్లోంచి పెద్దగా కనబడుతున్న అతని కళ్ళని చూసి నవ్వుతూ "ఆర్టాఫ్ థింకింగ్" అంది రంజని.

ఆఫీసులో విశ్వజ్ఞతో మామూలుగా ఉంటోంది రంజని. పనికి సంబంధించినంత వరకే మాట్లాడుతోంది ఆ అమ్మాయి.

అన్నతో కలిసి అనంత్ ను కలిసిన విషయాన్ని రంజనికి చెప్పలేదు విశ్వజ్ఞ. చెబితే అపార్థం చేసుకుంటుందేమోనన్న సందేహం ఆ అమ్మాయిలో నాటుకుపోయింది. ఫోన్ చేసినా రంజని తీయలేదని అనంత్ చెప్పిన మాటలు విశ్వజ్ఞను కలవరపాటుకు గురిచేసాయి. ఐనా రంజనితో మాట్లాడకుండా మౌనం వహించింది.

స్వాతంత్ర్యదినోత్సవం కలుపుకుని వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో దగ్గర్లోనే ఉన్న ఓ పర్యాటక స్థలానికి వెళ్ళి ఓ రెండు రోజులుండాలని ప్రణాళిక వేసింది రంజని. పావని, స్టెల్లాలు సరేననేసారు. విశ్వజ్ఞ మాత్రం రాలేనని చెప్పింది. రంజని అంతగా పట్టించుకోలేదు. పావని, స్టెల్లాలు మాత్రం మరోసారి అడిగి చూడమని మరీ మరీ చెప్పడంతో ఆ అమ్మాయిని ముక్తసరిగా అడిగింది.

"ఎందుకు రావడం లేదు?" అంది రంజని.

“అదీ...మేడమ్...ఇంట్లో మా అన్నయ్య మూడు రోజులు ఒక్కడే ఉండాలంటే కష్టం.” అంది విశ్వజ్ఞ, వంచిన తల ఎత్తకుండా.

“దెన్....కాల్ హిమ్ టూ....” అంది అధికార స్వరంతో రంజని.

చప్పున తలెత్తి చూసింది విశ్వజ్ఞ. ఆమెను చూస్తూ కనుబొమలెగరేసి “ఈజ్ దట్ ద ఓన్లీ ప్రాబ్లమ్? దెన్ విశ్వేశ్వర్ కెన్ జాయిన్ అజ్.” అనేసి కుర్చీలో నుంచి లేచి వెళ్ళిపోయింది రంజని.

అక్కడే ఆలోచనల్తో కూర్చుండిపోయింది విశ్వజ్ఞ.

– – – – – – –

పర్యాటక స్థలమంటే ప్రపంచ ప్రసిద్ధి చెందినదేమీ కాదు. ఎడారిలాంటి ఆ పట్టణానికి అతి దగ్గరలో ప్రకృతి కట్టుకున్న ఓయాసిస్సు లాంటిది ఆ ప్రాంతం.

ఓ చిన్న చెరువు. పక్కనే ఓ చిట్టి కొండ. కొండ మీద దేవుడు లేని గుడి. కొండ, చెరువుల్ని చుట్టుముట్టిన పొలాలు. ఆ పొలాలకు దిష్టి తీస్తూ ఎండిన చెట్ల పెద్ద మైదానం. వాటన్నింటినీ కలుపుతూ, చీలుస్తూ, హద్దులు ఏర్పరుస్తూ సాగిపోయే కాలిబాటలు. రైతులు, కూలీలు, కాపర్లు ఆ ప్రదేశానికి పాలితులు, పాలకులు!

ప్రశాంతంగా చూస్తే చిన్నిపాప గీసిన తడియారని తైలవర్ణ చిత్రానికీ, ఆ ప్రదేశానికీ పెద్ద తేడా కనబడదు. అందుకే పసిపాప వేసిన చిత్రమంత ముగ్ధంగా ఉంటుంది. రంజని ఆ ప్రాంతాన్ని అంత ఇష్టపడడానికి ఇదే కారణం. పైగా అదే ఊళ్ళో రంజని కంపెనీలో పనిచేసే అడ్మిన్ మేనేజర్ కు ఓ చిన్న ఫార్మ్ హౌస్ ఉంది కూడా.

రంజని వాళ్ళు ఆమె కారులో సాయంత్రానికి అక్కడికి చేరుకునే సరికి ఆ ఫార్మ్ హౌస్ బాగోగులు చూసుకునే కుటుంబం మొత్తం ఎదురొచ్చి అతిథుల్ని, వారి సామానుల్నీ ఫార్మ్ హౌస్ లోకి చేర్చారు. ఆఫీస్ ముగించుకుని నేరుగా ఇక్కడికే వచ్చేసారు వాళ్ళు.

పొందికైన ఇల్లది. అతిథులొస్తున్నారని కాబోలు చక్కజేసి పెట్టారు. రెడ్ ఆక్సైడ్ వేసిన పాతకాలపు ఫ్లోరింగ్ చక్కగా నీళ్ళేసి రుద్దడంతో చమక్కుమని మెరుస్తోంది. ఆ ఎర్రటి నేల మీద తెల్లటి ముగ్గు తన అంచుల్ని, వంపుల్ని మరీ మరీ చూసుకుంటోంది. కొత్తగా అలంకరించుకున్న సున్నపు పూతల్ని అదేపనిగా ప్రదర్శిస్తున్నాయి గోడలు. కిటికీలకు కట్టిన పరదాలు అటు బైట గాలితోనూ, ఇటు లోన పంకా తోనూ కబుర్లు చెబుతూ హడావిడి పడిపోతున్నాయి. పరదాలతో కబుర్ల జోరెక్కువై పడిపోతుందేమోనని ఆ పంకాని గట్టిగా కౌగిలించుకుందొక పైకప్పు దూలం.

“వోవ్!” అన్నారు పావని, స్టెల్లాలు ఒకేసారి.

పొదరిల్లులాంటి ఆ ఇల్లూ, పెరటిలోని బావి, పెద్ద కూరగాయ తోట వాళ్ళని అరిపించేలా చేసేసాయి.

విజయగర్వంగా నవ్వింది రంజని.

అవేవీ చూడలేని విశ్వేశ్వర్ అలానే నిలబడివుంటే, చూస్తూ కూడా ముభావంగా ఉండిపోయింది విశ్వజ్ఞ.

కనుబొమలు చిట్లించి తనకు కేటాయించిన గదిలోకి నడిచింది రంజని. పావని, స్టెల్లాలు ఒక గదిలోకి వెళితే, విశ్వేశ్వర్ తన చెల్లితో బాటు మొదటి అంతస్తులో నున్న ఓ చిన్న గదిలోకి వచ్చాడు.

“వీళ్ళతో మనం రాకూడదయింది అన్నయ్యా! నువ్వెందుకు ఒప్పుకున్నావ్?” అని చిరాకుగా అంది విశ్వజ్ఞ.

నవ్వే సమాధానంగా ఇచ్చాడు విశ్వేశ్వర్. నుదురు కొట్టుకుని ఊరకే ఉండిపోయింది విశ్వజ్ఞ.

పావని పైకొచ్చి “భోజనం” అన్నట్టు సైగ చేసి పిల్చేదాకా అన్నా–చెల్లి మౌనంగా ఉండిపోయారు.

మళ్ళీ పైకొచ్చాక – “చూసావా! వాళ్ళలో వాళ్ళే మాట్లాడుకున్నారు గానీ మనిద్దర్నీ కనీసం ఒక్క మాటైనా పలకరించలేదు. రంజని కావాలని నిన్ను నన్నూ పిల్చింది. నాపై గొంతు దాకా కోపముంది.” అంది విశ్వజ్ఞ.

“అలాగేం లేదులేమ్మా! రేపటికి అంతా మామూలుగా ఉంటుందిలే. వెర్రిగా ఆలోచించక పడుకో!” అన్నాడు విశ్వేశ్వర్ గట్టిగా ఆవలిస్తూ.

– – – – – – –

మరుసటి రోజు ప్రొద్దున ఉపాహారం ముగించి, ఫార్మ్ హౌస్ నుండి చెరువు వరకూ నడవడం మొదలెట్టారు అందరూ.

రంజని, పావని, స్టెల్లాలు జట్టుగా ముందువెళ్తుంటే, విశ్వేశ్వర్ చేయి పట్టుకుని వెనకగా నడుస్తోంది విశ్వజ్ఞ.

“మనం వెనక వస్తున్నామా లేదా? నువ్వు వాళ్లంత ఫాస్ట్ గా నడవగలవా లేదా? అలా ముందు ముందుగా వాళ్ళెళ్ళిపోతే మనకు దారి తెలుస్తుందా లేదా? – ఇవేమీ పట్టనట్టుగా చూడు ఎట్లా వెళ్ళిపోతున్నారో!” అంది విశ్వజ్ఞ చాలా ఉక్రోషంగా.

ఆమె చెయ్యిని తట్టి – “ఇదిగో! మళ్ళీ వెర్రిగా ఆలోచిస్తున్నావు. కొంచెంసేపు మనసుని ప్రశాంతంగా ఉంచుకో!” అన్నాడు విశ్వేశ్వర్.

“అలా బుద్ధభగవానుడిలా శాంతం శాంతం అని చెప్పడానికి నీకు బోర్ కొట్టదా?”

“ఊహూ! మంచి విషయాన్ని పదేపదే చెప్పడంలో బోర్ ఉండదు. నువ్వూ ఒకసారి ప్రాక్టీస్ చేసి చూడు.” అన్నాడు విశ్వేశ్వర్.

“హుష్షో! ఎప్పుడూ నన్నే ఏడ్పిస్తావు!” అంది విశ్వజ్ఞ బేలగా.

“లేదమ్మడూ! కొంచెం ఓపిక పట్టు!”

“ఆ...నేను ఓపిక పడితే నువ్వు మిరాకిల్స్ చేస్తావా...” అంది విశ్వజ్ఞ.

“మనం అనుకోనిది అనుకోని సమయంలో జరగడమే మిరాకిల్. ఏమో....ఇప్పుడే అది జరగొచ్చునేమో!” అన్నాడు నవ్వుతూ.

“సరే! చూద్దాం! ఏమీ జరగలేదనుకో......” అంటూ విశ్వజ్ఞ తన అన్న నెత్తి మీద చిన్నగా మొట్టికాయ వేసింది.

ఓ మలుపు తిరగ్గానే స్వచ్ఛమైన నీటితో ఆహ్వానించింది ఆ చెరువు.

దాన్ని చూడగానే చప్పట్లు కొడుతూ పరుగెట్టారు పావని, స్టెల్లా. “స్లో....స్లో...” అని అరుస్తూ వాళ్ళ వెంటే పరుగెట్టింది రంజని.

ఒకే ఒక్క క్షణంలో పసిపిల్లలైపోయారు ఆ ముగ్గురు.

“వాళ్ళు నీళ్ళల్లోకి దిగారు.” అంది విశ్వజ్ఞ, గట్టుపైన కూర్చుని.

“వాళ్ళు గానీ, చెరువు గానీ నిన్ను దిగొద్దనలేదే!” అన్నాడు విశ్వేశ్వర్.

“హుష్షో...” అంది విశ్వజ్ఞ.

“కాసేపు నువ్వూ వాళ్ళతో పాటు చేరు. ఈ నీరసం, ఆ హుష్షోలూ తగ్గిపోతాయి.” అన్నాడు విశ్వేశ్వర్.

“ఊహూ! నేనిక్కడే కూర్చుంటా!” అంది విశ్వజ్ఞ మొండిగా.

మరో ఐదు నిముషాలు గడిచాయి.

ఎక్కడినుంచి వచ్చిందో ఓ చిన్న కుక్కపిల్ల. గునగునా వచ్చి విశ్వజ్ఞ పక్కనే ఆగింది.

“ఐయ్...పప్పీ!” అంటూ దాన్ని పట్టుకోబోయింది విశ్వజ్ఞ.

బెదిరిపోయిన ఆ కుక్కపిల్ల ముందుకు ఉరికింది. అంతే...గట్టు అంచునుండి పల్లం లోకి జారి, అక్కడి నుండి సరాసరి చెరువులోకి పడిపోయింది. విశ్వజ్ఞ గొల్లుమని అరిచింది. కంగారుగా లేచాడు విశ్వేశ్వర్. “ఏమైందమ్మా?” అని గట్టిగా అరిచాడు.

“పప్పీ...పప్పీ...చెరువులో పడిపోయింది అన్నయ్యా!” అని ఏడుపు గొంతుతో అంది విశ్వజ్ఞ.

“పప్పీనా?” అన్నాడు విశ్వేశ్వర్, పడిపోయింది ఎవరని అర్థం కాక.

“పప్పీ అన్నయ్యా! చిన్న కుక్కపిల్ల.” అంది విశ్వజ్ఞ.

వాళ్ళిద్దరి కేకల్ని విని తమ కేరింతల్ని ఆపేసారు రంజని, పావని, స్టెల్లాలు.

“ఏమైంది విశ్వేశ్వర్?” అని గట్టిగా అరిచింది రంజని.

“కుక్కపిల్ల చెరువులో పడిపోయిందని విశ్వజ్ఞ చెబుతోంది. త్వరగా చూడండి. పాపం చచ్చిపోతుందేమో!” అని గట్టిగా అరిచాడు విశ్వేశ్వర్.

“అయ్యోయ్యో! ఏయ్! విశ్వజ్ఞ, ఎక్కడ పడిందే. తొందరగా చెప్పు!” అని అరిచింది పావని.

“అక్కడ...అక్కడ...” అని గట్టు పై నుండే చూపించింది విశ్వజ్ఞ.

“ఏడ్చావ్. అక్కడి నుంచి చూపిస్తే ఎలా తెలుస్తుంది. కిందకు రా!” అని హుకుమ్ జారీ చేసింది స్టెల్లా.

గబగబా కిందకు దిగి వచ్చి, కుక్కపిల్ల దొర్లిన స్థలాన్ని చూపించింది.

రంజని త్వరత్వరగా అటుకేసి నడిచింది. మరో రెండడుగులు ముందుకేసిందో లేదో బుడుంగ్ మని నీళ్ళలోకి జారిపోయింది. ఆమె పూర్తిగా మునిగిపోవడాన్ని చూసి కెవ్వుమని ఒకరి తర్వాత ఒకరు అరిచారు పావని, స్టెల్లాలు.

“మేడమ్ నీళ్ళలోకి జారిపోయారు. అక్కడ లోతు ఎక్కువేమో! పాడు చెరువు. విశ్వేశ్వర్ గారూ! చుట్టుపక్కల ఎవరైనా ఉన్నారేమో చూడండి. మేడమ్ నీళ్ళలోకి మునిగిపోయారు.” అని గెంతులేస్తూ అరవసాగింది పావని.

దభీమని నీళ్ళలోకి దూకింది విశ్వజ్ఞ.

ఈసారి కెవ్వుమని జంటగా కేకలు పెట్టారు పావని, స్టెల్లాలు.

“ఏమైందమ్మా?” అని కంగారుగా అరిచాడు విశ్వేశ్వర్.

“విశ్వజ్ఞ కూడా నీళ్ళలో పడిపోయిందండీ!” ఏడుస్తూ అంది పావని.

“పడిపోయిందా? తనే దూకిందా!” అన్నాడు విశ్వేశ్వర్.

“తనే దూకేసింది!” అంది పావని.

“ఐతే ఫర్వాలేదు. గాభరా పడకండి!” అని కూర్చున్నాడు విశ్వేశ్వర్.

అతని వైపుకు వెర్రిగా చూసారు ఆ ఇద్దరమ్మాయిలు. “చెల్లెలు నీట్లో పడిందిగా...ఈ గుడ్డాయనకి బుర్ర చెడిపోయినట్టుగా ఉందే. నువ్విక్కడే ఉండు. నేనే పైకెళ్ళి ఎవరైనా ఉన్నారేమో చూసొస్తా.” అంటూ గట్టుపైకి పరుగెట్టింది స్టెల్లా.

మరో నిముషంలో నీళ్ళపైకి తేలింది విశ్వజ్ఞ. ఆమెతో బాటే పైకి తేలింది రంజని. ఆమెను పావని వైపుకు నెట్టి “తొందరగా లాక్కో!” అంది విశ్వజ్ఞ. రంజని భుజాన్ని పట్టుకుని తన వైపుకు లాక్కొంది పావని. వెంటనే బుడుంగ్ మని మళ్ళీ నీళ్ళలోకి మునిగింది విశ్వజ్ఞ.

రంజనిని బలంగా పట్టుకుని గట్టు అంచుకు లాక్కొచ్చింది పావని. మళ్ళీ నీళ్ళ శబ్దం కావడంతో తలెత్తి చూసింది. విశ్వజ్ఞ ఎడం చేతిలో చిన్ని కుక్కపిల్ల. గిలగిలా తన్నుకుంటోంది. వేగంగా గట్టుపైని కెక్కి “ఇదో కుక్కపిల్ల! నీళ్ళు కక్కించు!” అని అక్కడే నిలబడి దిక్కులు చూస్తున్న స్టెల్లా చేతిలో పెట్టి, అంతే వేగంగా వెనక్కు తిరిగి, గట్టు దిగి రంజని వైపుకు వచ్చింది.

రంజనిని వెల్లకిలా పడుకోబెట్టి, కడుపు పైన వొత్తి మింగిన నీళ్ళను కక్కించింది విశ్వజ్ఞ.

రంజని కొద్దిగా కళ్ళు తెరవడం చూసి ఏడ్చేసింది పావని. “మేడమ్! మేడమ్!!” అని రంజని బుగ్గల్ని తడుతూ అడిగింది విశ్వజ్ఞ. పూర్తిగా కళ్ళు తెరచి చూసింది రంజని. ఆమెను నెమ్మదిగా లేపింది విశ్వజ్ఞ.

“కాసేపిలా ఆనుకుని కూర్చోండి. యూ విల్ బీ ఫైన్!” అంటూ అక్కడున్న ఓ పెద్ద రాయికి ఆన్చి రంజనిని కూర్చోబెట్టింది విశ్వజ్ఞ. “వెళ్ళి కొద్దిగా కాఫీ తీసురా!” అని పావనికి చెప్పింది. క్రమశిక్షణ గల సైనికుడిలా పరుగెట్టింది పావని.

పావనితో బాటే కుక్కపిల్లని పొదవి పట్టుకుని వచ్చింది స్టెల్లా. పావని ఇచ్చిన కాఫీని కొద్దికొద్దిగా తాగింది రంజని. షాక్ నుంచి ఆమె ఇంకా తేరుకోలేదని ఆమె కళ్ళు చెబుతున్నాయి.

లేచి నిలబడిన విశ్వజ్ఞ ఒక్కసారి గట్టిగా గాలి పీల్చి, వేగంగా గట్టు కిందకు పరుగెట్టి దభీమని చెరువులోకి దూకింది. ఆ ముగ్గురూ మళ్ళీ ఉలిక్కిపడ్డారు.

నీళ్ళలోకి దూకిన రెండు నిముషాల తర్వాత పైకి తేలింది విశ్వజ్ఞ. వెంటనే వెల్లకిలా పడుకుని ఈత కొడుతూ చెరువునంతా చుట్టేసి వచ్చింది. తడిచిపోయిన పంజాబీ డ్రెస్సును పిండుకుంటూ పైకి వస్తున్న విశ్వజ్ఞను నోరెళ్ళబెట్టి చూడసాగారు పావని, స్టెల్లా.

"ఎంతెంతో చదివినారు, అంతంతే చదవేసినారు...ఇంత చదువు చదివి మీరు నేర్వలేద ఈతశాస్త్రమూ?" అంటూ గట్టిగా నవ్వసాగింది విశ్వజ్ఞ.

రంజని కూడా ఆ నవ్వుకు శ్రుతి కలిపింది. ఎందుకు నవ్వాలో అర్థంకాని పావని, స్టెల్లాలు క్రమశిక్షణ తప్పని సేవకుల్లా నవ్వసాగారు. గట్టుపైని విశ్వేశ్వర్ నవ్వాడు. కొండ మీది దేవుడులేని గుడి శిఖరం నవ్వింది. అలల రెప్పల్ని ఆర్చి ఆర్చి మరీ నవ్వింది చెరువు.

క్షణం క్రితం దాకా కేకలతో హోరెత్తిన ఆ ప్రాంతం నవ్వుల్తో మారుమోగింది.

– – – – – – –

"చెప్పండి విశ్వేశ్వర్! ఆరోజు అనుకోకుండా నేను మిమ్మల్ని అపార్ట్మెంట్ దగ్గర దింపాను. మీ చెల్లి లైఫ్ సేవ్ అయింది. ఈరోజు మీ చెల్లెలి వల్ల నా లైఫ్ సేవ్ అయింది. వాటీజ్ ద మీనింగ్ ఆఫ్ ఆల్ దీస్?" కురుల్ని తడారబెట్టుకుంటూ అడిగింది రంజని.

వాళ్లిద్దరూ ఫార్మ్ హౌస్ వెనక భాగంలో ఉండే నూతి దగ్గర కూర్చునివున్నారు. ఇంటి లోపల మిగతా ముగ్గురమ్మాయిలూ వంటవార్పులో మునిగిపోయారు.

"ఐ డోంట్ నో వాట్టు సే!" అని భుజాలు కుదిపాడు విశ్వేశ్వర్.

“మీరు చెప్పగలరు. ప్లీజ్…” అంది రంజని.

“ఒక వ్యక్తి మరో వ్యక్తితో మాట్లాడాలన్నా పరిచయం కలిగించుకోవాలన్నా వాళ్ళిద్దరి మధ్య ఋణానుబంధం ఉండాలంటారు పెద్దలు.” ఉపోద్ఘాతంగా అన్నాడు విశ్వేశ్వర్.

“అర్థం కాలేదు!” అంది రంజని.

“అందుకే అన్నాను ఐ డోంట్ నో వాట్టు సే అని!” అని నవ్వాడు విశ్వేశ్వర్.

“ప్చ్! నా ఇగ్నోరెన్స్ వల్ల ఎన్ని మంచి విషయాల్ని తెలుసుకోవడాన్ని మిస్సైపోతున్నానో! సింపుల్గా చెప్పలేరా?” అంది రంజని బాధగా.

దీర్ఘంగా ఊపిరి తీసుకున్నాడి విశ్వేశ్వర్. “ప్రతి పరిచయం వెనుక ఎవ్వరికీ తెలియని ఒక ఇన్విజిబుల్ లింక్ ఉంటుంది. ఆ లింక్ ఎంత స్ట్రాంగ్ గా ఉంటే ఆ రిలేషన్ అంత త్వరగా డెవెలప్ అవుతుంది.”

“వాటీజ్ దట్ ఇన్విజిబుల్ లింక్?” అంది రంజని.

“మీకు ఎలా సమాధానం చెప్పాలి? ఫిలసాఫికల్ ఆర్ సైంటిఫిక్?” అన్నాడు విశ్వేశ్వర్.

“ఆ రెండూ వేరు వేరా?” అంది రంజని.

“Knowing the truth about a phenomenon is the scope of science. Knowing the truth in its eternity is the scope of philosophy. ప్రతి ఘటనలోని సత్యత్వాన్ని తెలుసుకోవడం సైన్స్ అని, సత్యత్వంలోని అనంతత్వాన్ని తెలుసుకోవడం ఫిలాసఫీ అని ఒకచోట చదివాను. ఈ డెఫినిషన్ ప్రకారం చూస్తే ఒక ఖచ్చితమైన ఉద్దేశ్యంతో కూడుకున్న ఫిలాసఫీని సైన్స్ అని, అందరికీ అన్వయించగలిగే సామాన్య ఉద్దేశ్యంతో కూడుకున్న సైన్స్ ను ఫిలాసఫీ అని అర్థం చేసుకోవచ్చు.” అన్నాడు విశ్వేశ్వర్.

“హుమ్….ఇది కూడా కష్టంగా ఉంది. పూర్తిగా అర్థం కాలేదు.” అంది రంజని.

ఇక చేసేదేమీ లేదన్నట్టుగా నవ్వాడు విశ్వేశ్వర్.

“మీరి కంటిన్యూ చెయ్యండి. మిమ్మల్ని ఫాలో అవడానికి ట్రై చేస్తాను.” అంది రంజని.

“మీరు మా చెల్లెల్ని కాపాడ్డం, ఆమె మిమ్మల్ని కాపాడ్డం అన్నది ఒకే కాయిన్ కు ఉన్న రెండు పార్శ్వాల్లాంటివి. మీరు ఆమెకు చేసిన క్రెడిట్, ఆమె మీకు చేసిన ఉపకారంతో బాలెన్స్ అయింది. ఈ బాలెన్స్ అయ్యేదాకా మీకు ఆమె ఋణపడివుండింది. అకౌంటెంట్స్ వ్రాసే డే బుక్ లాంటిది మనిషి జీవితం. అక్కడ డెబిట్, క్రెడిట్లు ఉన్నట్టే మనిషి జీవితంలో సుఖాలు, దుఃఖాలు ఉంటాయి. క్రెడిట్ గానీ, డెబిట్ గానీ ఓ పర్టిక్యులర్ వ్యక్తికిగానీ లేక గ్రూపాఫ్ పర్సన్స్ అంటే ఓ కంపెనీకి గానీ చేస్తారు. అలానే సుఖదుఃఖాలు కూడా ఒక్కో వ్యక్తి వల్ల లేక వ్యక్తుల గుంపుల వల్లా కలుగుతాయి. ఎన్ని క్రెడిట్, డెబిట్లు ఉన్నా చివరకు బాలెన్స్ ట్యాలీ కావాలి. ఎన్ని సుఖాలు, దుఃఖాలు కలిగినా మనిషి జీవితం చివరకు ఏదో ఒకచోట బాలెన్స్ కావాలి. డే బుక్ క్లోజింగన్నా, మనిషి చచ్చాడన్నా ఒకటే అర్థం. పుణ్యలాభంతో చచ్చాడా, పాపనష్టంతో చచ్చాడా అన్నదే ముఖ్యమైంది.”

“వావ్...” అంది రంజని.

“మీది లవ్ మ్యారేజా?” అన్నాడు విశ్వేశ్వర్.

“నో...అరేంజ్డ్! వై?” అని అంది రంజని.

“మీవారిని చేసుకునే ముందు పెళ్ళి చూపులు జరిగాయా?”

“ఆ....ముగ్గురు వచ్చి చూసుకెళ్ళారు! ఇదంతా ఎందుకు?”

“నాలుగోవారైన అనంత్ గారు మిమ్మల్నీ, మీరు వారినీ ఒప్పుకున్నారు. అనంత్ గారి ఊరేది?” అన్నాడు విశ్వేశ్వర్.

ఈ వివరాలన్నీ అడుగుతున్నదెందుకు అన్న తన ప్రశ్నను పట్టించుకోకుండా ప్రశ్న పైన ప్రశ్న వేసుకెళ్తున్న విశ్వేశ్వర్ ను వింతగా చూస్తూ – “హీ ఈజ్ ఫ్రం వైజాగ్ అండ్ ఐ యామ్ ఫ్రం ఢిల్లీ. మా నాన్నగారు చాలా సంవత్సరాలు అక్కడే రాష్ట్రపతి భవన్లో పనిచేసారు. ఢిల్లీ నుంచి మేమే వైజాగ్ కు వచ్చి పెళ్ళి చూపులకి అనంత్ ఇంటికెళ్ళా. బట్! ఇవన్నీ ఎందుకు?”

"ఎక్కడి వైజాగ్ అనంత్? ఎక్కడి ఢిల్లీ రంజని? కానీ వాళ్ళిద్దరిప్పుడు ఈ ఊళ్ళో ఉంటున్నారు? వేరీజ్ దిస్ ప్లేస్ అండ్ వేర్ వర్ యువర్ ప్లేసెస్? మీకు ఆశ్చర్యంగా అనిపించడంలేదా!!" అన్నాడు విశ్వేశ్వర్.

ఇప్పుడు అర్థమైంది రంజనికి. మనుష్యుల మధ్య సంబంధాలు ఎలా ఏర్పడతాయో చెబుతున్నాడతను. "నిజమే కదా! ఎక్కడ తను? ఎక్కడి అనంత్? ఎక్కడివాళ్ళీ విశ్వేశ్వర్, విశ్వజ్ఞ? పావని, స్టెల్లా, అరవింద్ – ఎక్కడివాళ్ళు వీళ్ళందరూ? నావాళ్ళని ఇప్పుడనుకుంటున్నవాళ్ళెవ్వరూ పుట్టుకతోనే తెలిసినవాళ్ళు కారు!"

రంజనికి ఏవో తెరలు తొలగిపోతున్నట్టుగా అనిపిస్తోంది.

"ఎక్కడి మావి చిగురు! ఎక్కడి కోకిల! ఎక్కడిదా సంబంధం? అని ఓ కవి ప్రశ్నించినట్టు మీకు, మాకు మధ్యవున్న ఈ రిలేషన్ విచిత్రంగా లేదూ? ఇది జస్ట్ హాయ్–బై రిలేషన్ మాత్రమే కాదు. మీరు విశ్వజ్ఞ మర్యాదను కాపాడారు. ఆమె మీ ప్రాణాల్ని కాపాడింది. మానం–ప్రాణం, ఈ రెండూ మనిషికి ఎంతో ముఖ్యం. డబ్బుకన్నా, కీర్తికన్నా, ఆస్తులకన్నా ముఖ్యమైనవీ రెండు. అలాంటివాటిల్ని మీరిద్దరూ పరస్పరం పంచుకున్నారు. గౌరవంగా బ్రతకడానికి కావల్సిన వీటిల్ని మీరిద్దరు, ఒకరికొకరు కాపాడుకోవడంలో అర్థం కాని రహస్యమొకటి ఉన్నట్టు మీకు అనిపించడం లేదూ?" అని ఆగాడు విశ్వేశ్వర్.

ఔనన్నట్టుగా తలూపింది రంజని.

ఆమె ప్రతిస్పందనని తెలుసుకోలేని విశ్వేశ్వర్ మళ్ళీ కొనసాగించాడు.

"అనుకోకుండా పరిచయమైన విశ్వజ్ఞ మీ భార్యాభర్తలు విడిపోవడానికి కారణమైంది."

"ఛా...ఛా...నో..." అని అడ్డుపడింది రంజని.

విననట్టుగా సాగిపోయాడు విశ్వేశ్వర్ – "మిమ్మల్ని విడగొట్టానన్న బాధతో కుమిలిపోతోంది నా చెల్లెలు. మానాన్ని కాపాడిన వ్యక్తికి తన అజ్ఞానంతో నా చెల్లెలు అన్యాయం చేసిందిగదా అని నేనూ బాధపడుతున్నాను. ఇక్కడికి వచ్చినప్పటి నుండి మీరు ఆ ఇద్దరమ్మాయిల్తోనే కలివిడిగా ఉంటుండం

చూసి విశ్వజ్ఞకు కోపమొచ్చింది. మీకు, విశ్వజ్ఞకు రిలేషన్ ఏర్పడడానికి నేను కారణం. నేను మీకు పరిచయమవడం ఓ యాక్సిడెంట్ అండ్ దటాల్సో త్రూ యాన్ యాక్సిడెంట్. ఇన్ని ప్రమాదాల్ని ఒక్క క్షణంలో తుడిచివేసింది ఎవరో చెప్పండి?"

"దేవుడు."

"కాదు....కుక్కపిల్ల! హాహాహా...." అంటూ విరగబడి నవ్వాడు విశ్వేశ్వర్.

నవ్వింది రంజని. చాలారోజుల తర్వాత అంత విశాలంగా నవ్విందేమో ముఖంలోని కండరాలు సాగి, హాయిగా అనిపించింది ఆమెకు.

"రంజనిగారు! మనం నమ్మినవాళ్ళనూ, మనల్ని నమ్ముకున్నవాళ్ళనూ ఎక్కువగా పరీక్షించ కూడదు. వుయ్ షుడ్ నాట్ పుట్ దెమ్ అండర్ సివియర్ టెస్ట్స్. తప్పుగా అనుకోకపోతే నాదో రిక్వెస్ట్. ప్లీజ్ కాల్ అనంత్ గారు. హీ కాల్డ్ యూ. బట్, మీరు ఆ కాల్ తీసుకోలేదు. ఐ నో ఇట్. మెలాంకలీలో సుఖముందని మీరు అనుకోవచ్చు. కానీ అది స్లో పాయిజన్ లాంటిది. సంతాపమన్నది బలాన్నీ, రూపాన్నీ, జ్ఞానాన్నీ నాశనం చేస్తుందంటారు. సో, ప్లీజ్ డోంట్ వేస్ట్ ఎనీ మోర్ టైమ్! ఇది నా హంబుల్ రిక్వెస్ట్!" అని ముగించాడు విశ్వేశ్వర్.

కుర్చీలో వెనక్కు వాలి ఆలోచనల్లో మునిగింది రంజని.

స్టీల్ ప్లేట్ ను గరిటెతో మోగిస్తూ పావని రావడంతో రంజని ఆలోచనలు అర్థాంతరంగా ఆగిపోయాయి. ఆమెలో ఆలోచనలు ఆగినా అంతరంగం అలజడి చేస్తూనే ఉంది.

\- - - - - - -

ఆదివారం మధ్యాహ్నానికి ట్రిప్ నుండి వెనక్కు వచ్చేసారు రంజనీ ప్రభృతులు.

అపార్ట్మెంట్ చేరిన రంజనిని పేరుకుపోయిన ఏకాంతం పలుకరించింది.

కాళ్ళు, చేతులు కడుక్కుని, బట్టలు మార్చుకుని బెజవాడ దుర్గమ్మ ఫోటో ముందు దీపాలు వెలిగించింది రంజని. దండం పెట్టుకుంది.

హాల్లోకి వచ్చి, సోఫాలో కూర్చుని మొబైల్ చేతిలోకి తీసుకుని విశ్వేశ్వర్ కు డయల్ చేసింది. అవతల వైపు అతను తీసి “నమస్తే మేడమ్! మేము కూడా ఇంటికొచ్చేసాం!” అన్నాడు.

“గుడ్! ఐ జస్ట్ వాంట్ టు నో....మీకు ఇన్ని మంచి విషయాలు నేర్పించిందెవరు?” అంది రంజని. క్రిందటి రోజు సాయంత్రం ఫార్మ్ హౌస్ నూతి దగ్గర విశ్వేశ్వర్ చెప్పిన మాటలు ఆమె మనసులో గింగిర్లు కొడుతున్నాయి.

“ఇంతకు ముందు కూడా చెప్పాననుకుంటాను! శర్మగారని ఓ మంచి పండితుడున్నారు. ఆయనే నాకు గురువు. అప్పుడప్పుడూ ఆయన్ను కదిలిస్తుంటాను. ఇలాంటి విషయాల్ని రాబట్టుకుంటాను. మీలాంటి వాళ్ళ దగ్గర మొత్తం క్రెడిట్ కొట్టేస్తుంటాను. హాహాహా” అని గట్టిగా నవ్వాడు విశ్వేశ్వర్.

“కెన్ ఐ మీట్ హిమ్?” అంది రంజని.

“ఓహ్! వై నాట్! తప్పకుండా కలవొచ్చు. వారితో మాట్లాడి ఎప్పుడు కలిసేది చెబుతాను.” అన్నాడు విశ్వేశ్వర్.

“అయ్యో! మీకెందుకు శ్రమ? ఆయన ఫోన్ నెంబర్ ఇవ్వండి. మీ రెఫరెన్స్ చెప్పి నేనే అపాయంట్మెంట్ తీసుకుంటాను.” అంది రంజని.

“మీరనుకున్నట్టు హై ఫండా పండితుడు కాడాయన. మహాఛాందసులు! ఆయన దగ్గర మొబైల్ కాదు కదా లాండ్ లైన్ కూడా లేదు. నేనే వాళ్ళింటికెళ్ళాలి. ఆ శ్రమ మీకెందుకు? ఐ విల్ ఆర్గనైజ్ ఫర్ యూ మేడమ్.” అన్నాడు విశ్వేశ్వర్.

సరేనని ఫోన్ కట్ చేసింది రంజని. మొబైల్ ను టీపాయ్ మీద పెట్టి, టీవీ ఆన్ చేసి కళ్ళు మూసుకుంది.

*“నేడు శ్రీమతికి మాతోనే వివాదం*

*తగువే భలే వినోదం ఎందుకో తగువే భలే వినోదం"*

ఘంటసాల గాత్రం గారాలు పోతూ సాగుతోంది.

గట్టిగా నవ్వింది రంజని. "ఆహా! ఈ ఛానల్ వాడి టైమింగ్ బావుంది." అని మనుసులో అనుకుంది. "ఈ పాటను అనంత్ పాడితే!!!" అని అనుకున్నదే తడవు, టక్కున కళ్ళు తెరచి మొబైల్ చేతిలోకి తీసుకుని ఓ సంఖ్యను డయల్ చేసింది.

ఒక్క రింగ్ లోనే అవతలి గొంతు పలికింది – "రంజూ!"

ఇటు గంగ పొంగితే అటు గౌతమి ఉబికింది కాబోలు, రెండు తీరాల మధ్య ఉద్వేగపు మౌననది మహోద్రేకంగా ప్రవహించడం మొదలుపెట్టింది.

★ ★ ★ ★ ★

"ఇదేమిటి స్వామీ! నా మొదటి ఆటకాయ తొంభైఐదవ గడిలోని 'గుడ్లగూబ'ను చేరింది? ఇది అపశకునం కాదా?" అని ప్రశ్నించింది రత్నాకర కుమారి.

"భయపడకు దేవీ! ఇక్కడికి చేరడం నీ పావు చేసుకున్న పాపం కాదు. మన ఆటలో భాగంగా ఆ గడిని చేరిన నీ పావు మహత్తరమైన సందేశాన్నిస్తోంది." అన్నాడు ప్రధానపురుషేశ్వరుడు.

"ఆ ధర్మ మర్మాన్ని బోధించి ఉద్ధరించండి స్వామీ!" అని చేతులు జోడించి ఆనందాబ్జసదన.

"చూడు దేవీ! గుడ్లగూబ గడిలోకి దిగుతున్న పాము తల ఎక్కడుంది?"

"నూటాపందొమ్మిదవ గడిలో!"

"ఆ పాము పేరేమి?"

"శతకంఠ రావణుడు!"

"దశకంఠ రావణుడి గురించి విన్నావు గదా దేవీ?"

“మీరు రామావతారానికి పూనుకోవడం వాని సంహారార్థమే గదా స్వామీ!”

“లోకంలో ప్రసిద్ధుడైన రావణుడికి పది తలలు మాత్రమే ఉంది. మరి ఈ శతకంఠ రావణుడెవరు?”

“సమస్త అక్షరాలకు, సమస్త శబ్దాలకూ మూలం మీరే! పరమార్థమూ మీరే! విశదీకరించండి స్వామిన్!”

“సంస్కృతంలో దశ, శత అనే పదాలు కేవలం సంఖ్యల్ని మాత్రమే సూచించవు. అలౌకికార్థంలో “పూర్ణత్వం” అని వాటికి అర్థం”

“అవశ్యం! మీ పద్మగర్భసంజాతుడైన బ్రహ్మ, పూర్ణమైన ఆనందం కలిగినవాడవడం వల్లనే కదా మీరు అతణ్ణి శతానందా అని సంభోదించేది!”

“సరిగ్గా గ్రహించావు దేవీ! ఆవిధంగానే ఎవడి గుణం పరిపూర్ణమైన ఆర్భాటంతో నిండివుంటుందో వాడే శతకంఠ రావణుడు. చూపాల్సిన సామర్థ్యాన్ని చేతల్లో కాకుండా కేవలం మాటల్లో మాత్రమే చూపించే ఆర్భాటపరుల్ని లోకం నిర్లక్ష్యం చేస్తుంది. ఎందుకంటే, ఈ ఆర్భాటపరుల మనసుల్లో అజ్ఞానం, అపరిపక్వతలు నిండివుంటాయి. ఎదుటివారి శక్తియుక్తుల్ని అర్థం చేసుకోలేని వారి అసామర్థ్యమే అజ్ఞానం. అలానే తమలోని లోపాల్ని గుర్తించి సరిచేసుకోకలేకపోవడమే వారి అపరిపక్వత. అందుకనే వారు ఎక్కువగా అరుస్తూ తమ లోపాల్ని కప్పిపుచ్చుకోవాలని చూస్తారు. ఇలాంటి వారిని సమస్త లోకం ఉపేక్షించడంతో, వారు జీవితాంతం గుడ్లగూబలా నిర్లక్ష్యపు చీకట్లో మగ్గిపోవాల్సిందే. ఇదీ నా ఆటకాయ చెబుతున్న ముఖ్య విషయం!” అన్నాడు చతుర్భుజుడు.

“ధన్యోస్మి దేవా! అమోఘమైన ఉపదేశాన్ని ఇచ్చారు. ఈశ్వరత్వపు గడిలో మీ తత్త్వచింతనలో మునిగివున్న మీ మొదటి ఆటకాయ తదుపరి ప్రస్థానమేమిటో?” అని సాలోచనగా అడిగింది లోలలోచన.

“పావుల నడకలు పాచికల అధీనాలు. వాటిల్నే అడుగుదాం!” అంటూ వేసాడు.

సర్వసాక్షిపాచికల్ని వేస్తే అవి వామనమూర్తి కొనగోరు తాకిన బ్రహ్మాండ కటాహం నెర్రలు విచ్చినప్పటి శబ్దాల్ని ధ్వనించాయి.

★ ★ ★ ★ ★

"నువ్వు చెబుతోంది నిజమేనా?" సుమతి చుబుకాన్ని ఎత్తిపట్టి అడిగాడు కేశవ శర్మ.

తల దించుకుని ఔనన్నట్టు తలనూపింది సుమతి.

"మరి వెంకాయమ్మ పిన్నిగారికి చెప్పావా లేదా?"

లేదన్నట్టుగా తలూపింది సుమతి.

"మొదటగా నాకే చెబుతున్నావా?"

మళ్ళీ ఔనన్నట్టుగా తలాడించింది సుమతి.

ఆమెను తన బాహువుల్లోకి తీసుకున్నాడు శర్మ – "ఇప్పుడు సంతోషమేనా?"

"జీవితం ధన్యం!"

"ధన్య అంటే కృతార్థత అనే అర్థముంది. కృతార్థత అంటే పరమసుఖమనే మరో అర్థముంది." అన్నాడు శర్మ.

"అన్ని అర్థాలూ ఇప్పుడు అనుభవంలోకి వస్తున్నాయి!" అంది సుమతి.

ఒక నిముషం మౌనం తర్వాత – "నాదో చిన్న సందేహం!" అంది.

"అడుగు"

"అప్పుడే పుట్టిన పాపాయికి ఏ భాషా రాదు. కానీ తన బిడ్డకు ఏం కావాలో కన్నతల్లికి చక్కగా తెలిసిపోతుంది. ఇదెలా సాధ్యం?"

“అబ్బో! చాలా చాలా ఆలోచిస్తున్నావే?” అన్నాడు నవ్వుతూ శర్మ.

“చెప్పరూ!” అంది సుమతి గోముగా.

“నువ్వడిగే ప్రతి ప్రశ్నా నన్ను కవ్వించి, సమాధానాల్ని రప్పించేవే. తప్పకుండా చెబుతాను. తల్లికి– అప్పుడే పుట్టిన బిడ్డకు మధ్య సమాచారాన్ని చేరవేసేది ఎవరో తెలుసా?”

తెలీదన్నట్టు తలను అడ్డంగా ఊపింది సుమతి.

శర్మ నవ్వుతూ – “దేవుడు!” అన్నాడు.

“అన్నింటినీ నడిపేది ఆ దేవుడేనని తెలిసిందే!” అంది సుమతి, తను ఎదురుచూస్తున్న సమాధానం ఇది కాదన్నట్టు.

“పిచ్చిదానా! అన్నిటికీ దేవుడే ఉండేది. కానీ ఎక్కడ, ఎలా ఉంటాడని తెలుసుకోవడం చాలా ముఖ్యం. ఇప్పుడు మనం మాట్లాడుకుంటున్న విషయంలో అమ్మ–బిడ్డ అనే ఇద్దరున్నారు. అమ్మలోనూ భగవంతుడు ఉన్నాడు. అదేవిధంగా బిడ్డలోనూ ఉంటున్నాడు. భగవంతుని రూపాలు ఒకదానికొకటి అపరిచితాలు కావుగా! కాబట్టి బిడ్డ యొక్క కోరికను వెల్లడి చేసే భగవంతుని రూపం నుండి సమాచారాన్ని స్వీకరించిన అమ్మలోని రూపం బిడ్డ కోర్కెకు తగ్గట్టుగా ప్రతిస్పందిస్తుంది. ఆవిధంగా లోకంలో మొదటిసారిగా అమ్మ ఐన స్త్రీకి తన బిడ్డ అపరిచితమైనదైనా, ఈ భగవంతుని రూపాల వల్ల ఎన్నో రోజుల పరిచయమున్నట్లు ప్రవర్తిస్తుంది. అర్థమయిందా?” అన్నాడు శర్మ.

కళ్ళను పెద్దవిగా చేసి – “అద్భుతం!” అంది సుమతి.

“అమ్మను సంస్కృతంలో అంబ అంటారు. అంభ్యతే శాబ్దతే ఇతి అంబా అని వ్యుత్పత్తి. అంటే, తన బిడ్డకు భయాన్ని పోగొట్టి సుఖాన్ని కలిగించే శబ్దాలు చేసే వ్యక్తిని ’అంబ’ అని పిలుస్తారు. నువ్వు చూసేవుంటావు, పిల్లలు ఏడుస్తుంటే తల్లులు ’జుజ్జుజ్జూ’ అనో, ’ఊళోళాయీ’ అనో కొన్ని విచిత్రమైన శబ్దాలు చేస్తారు. కాసేపయ్యాక ఏడుస్తున్న పిల్లలు చక్కగా నిద్రపోతారు...అవునా!”

“అవునండీ! ఆ మాటలకు ఏమైనా కొత్త అర్థాలున్నాయా?”

“ఊహూ! ఈ జుజ్జుజ్జూలకు ఎలాంటి అర్థాలూ లేవు. పసిపాప యొక్క ఆనుభవిక ప్రపంచం ఎంత చిన్నదో, ఈ మాటలు కూడా అంతే అర్థరహితాలు.” అని ఆగాడు శర్మ.

“మీరు పెద్ద పెద్ద పదాలు వాడేస్తున్నారు. నాకేమీ అర్థం కావడం లేదు!” అంది సుమతి.

“సరే! మామూలు భాషలో చెప్పడానికి ప్రయత్నిస్తాను. అప్పుడే పుట్టిన పాపకు మనలా జ్ఞానం ఉండదు. అవునా!”

“అవును.”

“మన జ్ఞానం, మనకు ఎదురయ్యే అనుభవాల వల్ల పెరుగుతుంది. అవునా!”

“అవును”

“అంటే మనకు చూసుకుంటే పసిపాపలకు ప్రపంచ జ్ఞానం చాలా తక్కువగా....నిజానికి దాదాపు శూన్యంగా ఉంటుంది. అలాంటి లోకజ్ఞానం లేని పిల్లలను పెద్ద పెద్ద సంస్కృత పదాల్లో పలుకరిస్తే అర్థం కాదు. పసిబిడ్డల జ్ఞానమెంత అల్పమో, వాళ్ళతో మాట్లాడేందుకు వాడే భాష కూడా అంతే సరళం. అలా సరళంగా పుట్టిన మాటలే ఈ జుజ్జుజ్జూలు, ఊళ్ళుళ్ళూలూనూ...” అన్న శర్మ మాటలకు గట్టిగా నవ్వింది సుమతి.

“అంటే ఆ పసిపాపలు అర్థంలేని మాటలకే తృప్తి పడ్తాయి పాపం!” అంది.

“అవును. అలా భాషే రాని పసిపాపల్ని సైతం మాట్లాడించగలిగే సామర్థ్యమున్న వ్యక్తి ఒక్క తల్లి మాత్రమే. అందుకే శాస్త్రం వారిని ’అంబ’ అన్న పేరుతో పిలిచింది. ఆవు కూడా ’అంబా’ అని అరుస్తుంది. ఇక్కడ ’అంబా’ అనే శబ్దానికి ’హితాహిత వేదనం’ అని వ్యాఖ్యానించారు శాస్త్రకారులు. దూడ తన పొదుగును కుడిచినా లేక తప్పిపోయినా ఆవు ’అంబా’ అనే రంకె వేస్తుంది. అంటే అటు సంతోషానికీ, ఇటు దుఃఖానికీ ఒకే భాషను కలిగిన జంతువు ఆవు. అదేవిధంగా ఒకట్రెండు పదాలతోనే

తన బిడ్డ యొక్క భయాన్ని పోగొట్టి, సంతోషాన్ని కలిగించే వ్యక్తిని 'అంబ' అని పిలిచారు పెద్దలు" అన్నాడు శర్మ.

"అబ్బా! ఈ మాటల్లో నిజంగా ఎంత సైన్స్ ఉందండీ!" అంది సుమతి, కళ్ళను పెద్దవి చేసి.

"అవును! అలానే అమ్మను 'మాతా' అన్న పేరుతో కూడా పిలుస్తారు. మాతా అంటే పూజనీయమైన వ్యక్తి అని అర్థం. అంతేకాదు 'మతిత్వాత్ మాతా' అన్నది మరో అర్థం. అంటే, తన బిడ్డకు ఎప్పుడు, ఏం కావాలో ముందుగానే తెలుసుకొగల మతివున్న వ్యక్తి అని అర్థం. 'అంబ, 'మాత' – ఈ రెండూ ప్రతి స్త్రీలోనూ ఉండాల్సిన రెండు గొప్ప గుణాలు. అవి లేని వారు అమ్మ కాలేరు." అన్నాడు శర్మ.

"అద్భుతం! ఏమిటో అనుకొన్నాను. సంస్కృతంలోని ఒక్కో పదం వెనుకా చాలా లోతుంది!" అంది సుమతి.

"అవును. పనికిరానిదని, అర్థంకానిదని కొట్టిపారవేయబడుతున్న ఈ భాషలో ఒక్కో పదం వెనుక అమోఘమైన సైన్స్ ఉంది. సైకాలజీ ఉంది. మనసును కదిలించే అర్థాలున్నాయి. ఈ భాష మానవులచేత తయారు కాలేదు. అందుకనే ఆ లోతు, ఆ గాంభీర్యం!" అన్నాడు శర్మ.

"ప్రతి అక్షరం భగవంతుని రూపమని మీరు చెప్పారు. అలాంటప్పుడు భాష కూడా అతని రూపమే కదా! భగవంతుణ్ణి, ఆయన రూపాల్నీ ఈ మానవులు సృష్టించలేరు. కనుక మానవుల కంటే భాష గొప్పది. భాష కంటే భగవంతుడు గొప్పవాడు. మాట్లాడే ప్రతి అక్షరం ఎంత స్పష్టంగా ఉంటే, మాట్లాడే ప్రతి మాటా ఎంత స్వచ్ఛంగా ఉంటే ఆ భగవంతుడికి మనం అంత దగ్గరౌతాం. ఔనుకదండీ!" అంది సుమతి.

ఆ మాటలకు ఆశ్చర్యపోయాడు శర్మ.

"చిన్న చిన్న మాటల్లో నువ్వు చెప్పిన విషయం చాలా ముఖ్యమైంది సుమా!" అన్నాడు.

"మీరు చెప్పినదాన్నే నా మాటల్లో చెప్పాను గానీ ఇది నా స్వంతమా? ఐనా మీ నుండి ఇన్ని కొత్త విషయాల్ని రాబట్టాడూ అంటే, ఆ రాబోయేవాడు మిమ్మల్ని మించి పోతాడేమో!" అని ఛలోక్తిగా అంది సుమతి.

"జనులా పుత్రుని కనుగొని పొగడగ — పుత్రోత్సాహమ్ము నాడు పొందెదను......సుమతీ!" అన్నాడు శర్మ.

ఇద్దరి నవ్వులతో ఆ సాయంసంధ్య వింత రంగులతో మెరిసింది.

– – – – – – –

"ఈశ్వరత్వమనే గడి నుండి కదలి మాయాశక్తి అనే నూటాయిరవై తొమ్మిదో గడిని చేరింది మీ మొదటి పావు. దీని అర్థమేమిటి స్వామీ?" అని చేతులు జోడించి అర్థించింది సకలాభీష్టప్రదాయిని.

"మాయ అన్నది నా బంధకశక్తి. గ్రహాల్ని గతులు తప్పకుండా నిలుపుతున్నది ఆ శక్తే. చంద్రుణ్ణి శుక్లపక్షంలో వృద్ధి చేసి, కృష్ణపక్షంలో కృంగదీసేదీ ఈ శక్తే. సముద్రంలో అలలు తీరాన్ని దాటకుండా చూసేదీ ఈ మాయే. అంతేకాదు, కష్ట కార్పణ్యాలకు ఆలవాలమైన భూలోకంలో పుట్టిన ప్రతి ప్రాణీ తాను సుఖంగా ఉంటానని భ్రమించడం కూడా నా మాయశక్తి యొక్క పరాకాష్టతే! ఆయుష్షు మిగిలివున్న రోగి, ఔషధాల్ని తీసుకుంటే, దాన్ని ఫలింపజేస్తాను. కానీ మరణం ఆసన్నమైనవాడు ఎన్ని ఔషధుల్ని తీసుకున్నా వాటిల్ని నిర్వీర్యం చేస్తాను. ఇదీ నా మాయే. ఒక చిన్న విత్తనాన్ని వందలు, వేల పళ్ళనిచ్చే మహావృక్షంగా మార్చేదీ నా మాయే!" అన్నాడు నిత్యసత్యసంకల్పుడైన శ్రీహరి.

"మీ మాయాశక్తి అనంతమైనది. అప్రతిహతమైనది. అగాధమైనది! దీనిని దాటడం అంత సులభం కాదు కదా స్వామీ!" అంది త్రిజగన్మాత.

"దాటడం సులభమే దేవీ! ఎవరు నా నుండి ఎంత దూరం ఉంటారో, వారి నుండి నేనూ అంతే దూరంలో ఉంటాను. నేను ఎంత దగ్గరౌతానో, నా మాయ అంత దూరమౌతుంది."

"ఆహా! ఎంత సులభోపాయం! ఈ సూక్ష్మాన్ని గ్రహించలేని జీవులు మీ నుండి దూరంగా పరుగెడుతూ మీ మాయాశక్తి అనే మరీచికల్ని తలచి తలచి అందుకోవడానికి తపిస్తుంటారు. అందక అలమటిస్తుంటారు. ప్రతి అక్షరంలోనూ మిమ్మల్ని ప్రత్యక్షీకరించుకోవాలని తపిస్తున్న మీ మొదటి ఆటకాయ ఈ మాయాశక్తిని తప్పక దాటుతుంది. ఆ విశ్వాసం నాకు కలుగుతోంది." అంది విరించి సన్నుత.

"నీ రెండో పావు సాలోక్య సంచారం చేస్తోంది. అక్కడి నుండి ముందుకు నడుపు!" శ్రీరమణి కరకమల పూజితుడు.

"చిత్తం!" అని పాచికల్ని వేసింది చిత్తజ జనని.

ఆమె పాచికల్ని వేస్తే, అవి కుశ లవుల కాళ్లకు సీతమ్మ కట్టిన గజ్జెల్లా ధ్వనించాయి.

★ ★ ★ ★ ★

రంజని ఎదుట తలవంచుకుని కూర్చున్నాడు అనంత్.

అతను అలా కూర్చోబట్టి పదిహేను నిముషాల పైమాటే అయింది. రంజని నుండి ఫోన్ రాగానే రివ్వున వచ్చి వాలిపోయాడే గానీ వచ్చినప్పటి నుండీ ఆమెతో ఒక్క అక్షరం కూడా మాట్లాడలేకపోయాడు. రంజని కూడా మౌనం వహించి ఉండిపోవడంతో లోలోపలే ఇబ్బంది పడిపోసాగాడు అనంత్.

అంతలో రంజని మొబైల్ మోగింది.

"హలో! ఆ....విశ్వేశ్వర్! చెప్పండి!"

"గుడీవినింగ్ మేడమ్! మా గురువుగారిని కలవాలన్నారు కదా! ఇప్పుడే బయల్దేరి రాగలరా?"

"ఆఁ....ఇప్పుడా?"

"అవును మేడమ్! ఇంకో గంట గంటన్నరలో ఆయన వేరే ఊరికి వెళ్తున్నారు. నేను వాళ్ళింటి నుండే మాట్లాడుతున్నాను. మీ ఇంటి నుండి ఇక్కడికి రావడానికి ఓ అరగంట పడుతుంది. కాబట్టి

ఇమ్మీడియట్గా వస్తే కొద్దిసేపైనా మాట్లాడ్డానికి అవకాశం ఉంటుంది. రాగలరా?" గుక్క తిప్పుకోకుండా చెప్పేసాడు విశ్వేశ్వర్.

వెంటనే ఏం చెప్పాలో తోచలేదు రంజనికి. "విశ్వేశ్వర్! యాక్చువలీ.....అనంత్ ఈజ్ హియర్!" అంది.

"ఓహ్! వోవ్! వెరీ నైస్....." అంటూ ఆగిపోయాడు విశ్వేశ్వర్. "సో....!" అని మళ్ళీ అన్నాడు.

అనంత్ ఏదో మాట్లాడబోవడం చూసిన రంజని "ఇంకోసారి చూద్దాం!" అంది.

"ఇంకోసారా!......సరే.....చూద్దాం మేడమ్!" అని అన్న విశ్వేశ్వర్ గొంతులోని నిరాశని గమనించలేకపోయింది రంజని. ఫోన్ కట్ చేసింది.

"ఎవరి గురించి....ఈ ఫోన్?" అన్నాడు అనంత్.

"నీ బుద్ధి పోనిచ్చుకున్నావు కాదు! క్వశ్చన్స్ తోనే పెళ్ళి చూపులు మొదలుపెట్టావు. ఇప్పుడూ ఆ వెధవ క్వశ్చనింగే!" అంది రంజని చిరుకోపం నటిస్తూ.

"సారీ!" అన్నాడు అనంత్, నాలుక కరచుకుని.

"ఇట్స్ ఓకే! రోజంతా ఇలా శివుడి ముందు బసవడిలా కూర్చునేవుంటావా?" అంది రంజని.

వెంటనే తను కూర్చున్న కుర్చీలోనుంచి రంజని కూర్చున్న సోఫాలోకి మారాడు అనంత్. అతని భుజంపై తల పెట్టి ఆనుకుంది రంజని. అతను ఆమె ముంగురుల్ని సవరించసాగాడు. కళ్ళు మూసుకుంది రంజని.

క్షణం క్షణం ఆలోచనల్తో ఉప్పొంగే మనస్సులను సేద తీర్చే అమ్మ – మౌనం.

అనవరతం పరుగులెట్టే అంతరంగాలను ఆపి, దప్పిక తీర్చే చన్నీటి చలమ – మౌనం.

అరుపులతో ప్రపంచాన్ని జయింపజూసే అహంకారాన్ని శాంత పరచే హితబోధ – మౌనం.

వాదాలతో విరిగి, చెదరి, విడిపోయిన మనుష్యులు అనురాగాల్ని అందిపుచ్చుకునే స్వర్గం – మౌనం.

ఎంతసేపు అలా మౌనంగా గడిచిందో అంతసేపూ అనంత్–రంజనీల తనువులు, మనసులు దగ్గరగా వచ్చాయి. ఆమెను దగ్గరగా తీసుకుని గట్టిగా ముద్దుపెట్టాడు అనంత్. ఆరు నెలల సూర్యవిరహంతో గడ్డ కట్టిన అంటార్కిటికా మంచు ముక్కలా కరిగింది రంజని.

వారి ఏకాంత సాన్నిహిత్య తపస్సును భంగం చేస్తూ గట్టిగా మోగింది అనంత్ మొబైల్. జేబులోంచి తీసి, పేరు చూసాడు. "నో టైమ్ ఫర్ హిమ్!" అంటూ మొబైల్ ను టీపాయ్ మీదకు విసిరేసాడు.

"ఎవరు?" అంది రంజని, అనంత్ నుండి కొద్దిగా పక్కకు జరిగి.

"నీ సవతి కాదులే!" అని అంటూనే "వినోద్ దూబే" అన్నాడు అనంత్. వెంటనే "మరి, ఇంతకు ముందు నీకొచ్చిన ఫోన్?" అన్నాడు.

"హోరి అనుమానపు మొగుడుగారూ!" అంది రంజని చేతుల్ని నెత్తి మీద పెట్టుకుని "ఫోన్ చేసింది విశ్వేశ్వర్. అతనికో స్పిరిచువల్ గురూ ఉన్నాడు. అతన్ని కలవాలని నేను చెప్పినందుకు ఫోన్ చేసాడు. ఎనీ డౌట్స్?" అంది.

"నో డౌట్స్! బట్ వన్ డౌట్!!" అన్నాడు అనంత్, తనూ చేతుల్ని నెత్తి మీద పెట్టుకుంటూ.

"ఏమిటీ?" అన్నట్టు కనుబొమల్ని ఎగరేసింది రంజని.

"అంతగా కలవాలనుకొన్న వ్యక్తిని కలవకుండా ఎందుకుంటున్నావ్? – నేనొచ్చాననా?"

"అఫ్ కోర్స్!"

"వై కాంట్ వుయ్ మీట్ హిమ్? టుగెదర్!" అన్నాడు అనంత్.

అతని మాట పూర్తి కావస్తుండగానే సోఫాలో నుండి చెంగుమని లేచి నిలబడింది రంజని. "ఈ మాట ముందే అనాల్సింది. ఇంకో గంటలో ఆయన ఊరెళ్తున్నారని విశ్వేశ్వర్ అప్పుడనంగా చెప్పాడు...." అని తన మొబైల్ తీసి విశ్వేశ్వర్ ఫోన్ వచ్చిన సమయాన్ని చూసింది. "హెల్!" అని గట్టిగా అంది.

"ఏమైంది?" అన్నాడు అనంత్.

"జస్ట్ పది నిముషాలుంది. వాళ్ళింటికెళ్ళడానికి మన ఇంటి నుండి అరగంట పడుతుందని చెప్పాడు విశ్వేశ్వర్. వుయ్ కాంట్ మేకిట్!" అని నిస్తేజంగా సోఫాలోకి కూలబడింది రంజని.

"అయ్యో!" అంటూ తనూ కూలబడ్డాడు అనంత్.

వెంటనే, "ఇంకోసారి విశ్వేశ్వర్ కు ఫోన్ చేసి చూడు. అతను అక్కడేవుంటే కనీసం ఫోన్లోనైనా మాట్లాడొచ్చుగా!" అన్నాడు.

"బ్రిలియంట్!" అంటూ అనంత్ బుగ్గపై గట్టిగా ముద్దు పెట్టి చకచకా నంబర్ డయల్ చేసింది రంజని.

రెండు రింగుల్లోనే విశ్వేశ్వర్ ఫోన్ తీసుకోవడంతో ఉత్సాహం రెట్టించింది రంజనిలో – "హల్లో విశ్వేశ్వర్ గారూ! మీరెక్కడున్నారు? గురువుగారున్నారా? వెళ్ళిపోయారా?" అని గట్టిగా అరిచింది.

"నేను బస్టాండులో ఉన్నాను మేడమ్. ఆయన ఇప్పుడే అలా వెళ్ళారు!".

"అయ్యో! అనంత్ రావడం వల్ల ఈరోజు కుదర్లేదు. ఆయన ఊరెళ్ళి మళ్ళీ ఎప్పుడొస్తారు?"

కొన్ని సెకన్ల మౌనం తర్వాత – "ఆయన పర్మనెంటుగా వెళ్ళిపోతున్నారు మేడమ్. మళ్ళీ ఈ సిటీకి రారు!" అని నెమ్మదిగా పలికాడు విశ్వేశ్వర్.

"వాట్! వై...వై?" అని ఉద్వేగంగా అడిగింది రంజని.

"రీజన్స్ నాకూ పూర్తిగా తెలీదు మేడమ్! ఈరోజు పొద్దునే నాతో అన్నారు, ఇక్కడి నుండి ఓ చిన్న పల్లెటూరికి షిఫ్ట్ అవుతున్నట్టుగా. నేనూ షాకయ్యాను. సాయంత్రమే వాళ్ళింటికి వచ్చాను. మీ గురించి చెప్పి ఒక్కసారైనా కలవాలని అడిగాను. సరేనన్నారు. అందుకే మిమ్మల్ని అంత అర్జెంటుగా రమ్మని ఫోన్ చేసాను. బట్......"

"ఓహ్! హెల్!.....పోనీ కనీసం ఫోన్లోనైనా మాట్లాడొచ్చా?" ఉద్వేగం కాస్తా ఉద్విగ్నంగా మారిపోయి రంజనిని కుదిపేస్తోంది.

“గురువుగారు రాగానే నేను ఫోన్ చేస్తాను.....” అని విశ్వేశ్వర్ అంటుండగా వెనక ఎవరో “సుమతీ! సుమతీ!” అని గట్టిగా పిలవడం వినబడింది రంజనికి.

ఆ పేరు చెవిన పడగానే ఒళ్ళు ఝల్లుమంది ఆమెకు.

“విశ్వేశ్వర్! సుమతి.....ఆ సుమతి ఎవరు?” అని నెమ్మదిగా అడిగింది.

“గురువుగారి భార్య మేడమ్! చాలా మంచి మనిషి. సాక్షాత్తు లక్ష్మీదేవే అనుకోండి!” అన్నాడు విశ్వేశ్వర్.

రంజని కళ్ళ ముందు ఓ మెరుపు మెరిసినట్టైంది. ఆమె మస్తిష్కంలో ఆ పురాతన దేవాలయం, మార్గశీర్షపు నునువెచ్చని ఉషఃకాలం, తన ఒంటరితనం, ఆ నిండుముత్తైదువ, ఆమె నిష్కల్మష హృదయం, పారిపోయిన తన దుఃఖం – అన్నీ కాశీపటంలా కళ్ళ ముందు గిర్రున తిరిగాయి.

“సుమతి....సుమతి....విశ్వేశ్వర్ గారు! అర్జెంటుగా ఆమెకివ్వండి. ఐ హేవ్ టు టాక్ టు హర్! ఐ హేవ్ టు టాక్ టు హర్!”.

రంజని మాటల్లోనూ, గొంతులోనూ స్పష్టమౌతున్న ఆదుర్దాను గ్రహించిన విశ్వేశ్వర్ ఆశ్చర్యపోయాడు. “డూ యూ నో హర్! మేడమ్?” అన్నాడు.

“ప్లీజ్ విశ్వేశ్వర్! ఐ కెనాట్ లూజ్ దిస్ ఆపర్చ్యునిటీ. ప్లీజ్ గివ్ ఫోన్ టు హర్....” ఆవేశపడిపోసాగింది రంజని.

ఒక్క క్షణం తర్వాత అవతలి నుంచి ఓ మెత్తని స్వరం “హలో” అంది.

వాయుతరంగాలపై తేలివచ్చిన శబ్దతరంగాలు అంతరంగ తంత్రుల్ని మీటినట్టవడంతో రంజనికి మాటలు కరువయ్యాయి.

ఆ మెత్తని స్వరం “హలో” అని మరోమారు పలికింది.

గొంతు పెగుల్చుకుంటూ “హలో! అమ్మా! నేను....నేను....” అంది రంజని.

“ఎవరు? గొంతు గుర్తుపట్టలేకపోతున్నాను. దయచేసి పేరు చెబుతారా?”

“అమ్మా! నేను.....వెంకటేశ్వరస్వామి గుడిలో....పొంగల్ ప్రసాదం! గుర్తున్నానా?” ఆనందంతో రంజని పొడిపొడి మాటల్ని మాట్లాడసాగింది.

ఒక్క క్షణం మౌనం తర్వాత “రంజని!” అంది సుమతి.

“అవును! రంజనిని! గుర్తున్నానా?” నవ్వు, ఏడ్పు కలిసిపోయిన స్వరంతో అడిగింది రంజని.

“ఎలా మర్చిపోగలను! మీరు నాకెప్పుడూ గుర్తుంటారు! ఎలా ఉన్నారు?” అని అడిగింది సుమతి.

“కనీసం ఇప్పుడైనా నన్ను ఏకవచనంతో పలకరించండి...మీరలా పలకరిస్తే వినాలనివుంది....ప్లీజ్!” అంది రంజని.

పూరేకులు కదిలినంత మెత్తగా ఓ నవ్వు వినబడింది – “అలాగే! ఎలా ఉన్నావు రంజని!”.

“నేను బ్రహ్మాండంగా ఉన్నానమ్మా! మీరెలా ఉన్నారు? శర్మగారంటే మీవారా? ఎన్ని నెలల నుండీ విశ్వేశ్వర్ మీవారి గురించి చెబుతున్నాడో! కానీ ఒక్కరోజు కూడా కలవాలని నా మట్టిబుర్రకు తోచలేదు. ఈరోజు కలవాలనుకుంటే నేను రాలేకపోయాను. మీరేమో ఊరే వదిలి వెళ్లిపోతున్నారంట! ఐ మిస్డ్ ఎ లైఫ్ టైమ్ ఆపర్చ్యునిటీ!” గద్గదికమైన గొంతుతో వణుకుతూ పలికింది రంజని.

తన భార్యలో చకచకా రంగులు మారుస్తున్న ఉద్వేగపరంపరల్ని, వాటి మార్పులనీ చూస్తూ ఆశ్చర్యపోసాగాడు అనంత్.

“అయ్యో! అలా అనుకోకు రంజనీ! మేమేమీ మహాత్ములం కాముగా? నువ్వింత బాధపడ్డానికి!” అంది సుమతి.

“అమ్మా! ఏ ఊరెళ్తున్నారు?” అంది రంజని.

అవతలి వైపునుండి జవాబు లేదు. మళ్ళీ అడిగింది. జవాబు లేదు. రంజని మళ్లీ మళ్ళీ అడుగుతూనే వుంది. అనంత్ ఆమె చేతిలో నుంచి మొబైల్ తీసుకుని “లైన్ కట్టైంది.” అని చూపించాడు.

“హెల్! హెల్!” అంటూ విశ్వేశ్వర్ సెల్ కు డయల్ చేసింది. లైన్ పోతూనే ఉంది కానీ రింగ్ కావడం లేదు. “కమాన్! కమాన్!” అంటూ మళ్ళీ డయల్ చేసింది.

లైన్ వెళ్తున్న చప్పుడే గానీ కనెక్ట్ కావడం లేదు. చటక్కున ముందుకు వంగి టీపాయ్ మీదున్న అనంత్ మొబైల్ తీసుకుని గబగబా విశ్వేశ్వర్ నెంబర్ను డయల్ చేసింది. “ది వొడాఫోన్ నెంబర్ డయల్డ్ బై యూ ఈజ్ ఔటాఫ్ కవరేజ్ నౌ. ట్రై ఆఫ్టర్ సమ్ టైమ్”.

కళ్ళలో నీళ్ళు కమ్ముకుంటుంటే రెండు మొబైళ్ళనీ టీపాయ్ మీదకు జారవిడిచి, అనంత్ మీదకు వాలిపోయింది రంజని. తన భార్యలో చెలరేగుతున్న భావనాత్మక ప్రళయాల్ని చూస్తూ, అవి పూర్ణంగా అర్థంకాక, కానీ ఎప్పుడూ స్థిమితంగా ఉండే రంజనిని కూడా అల్లకల్లోలం చేయగలిగిన ఆ ’సుమతి’ ఎలాంటి వ్యక్తి అని ఆలోచిస్తూ, రంజనని జోకొట్టసాగాడు అనంత్.

– – – – – – –

“అరవింద్ వచ్చాడు!” అని రంజని చెవిలో గుసగుసగా అంది పావని.

టేబుల్ సొరుగులోంచి ఓ కాగితం తీసుకుని అరవింద్ కేబిన్లోకి నడిచింది రంజని.

“హా...రంజని...కమ్ కమ్” అని సాదరంగా ఆహ్వానించాడు అరవింద్.

రంజని కుర్చీలో కూర్చుని, ఒక్క నిముషం ఆగి, చేతిలో ఉన్న కాగితాన్ని అరవింద్ ముందుకు తోసింది.

ఆశ్చర్యంగా చూస్తూ కాగితాన్ని చదువుతున్న అరవింద్ ముఖంలో కవళికలు వెంటవెంటనే మారిపోయాయి. ముడిపడిన కనుబొమ్మలతో, భూతద్దాల్లాంటి కళ్ళద్దాల్లోంచి చూస్తూ – “వాటీజ్ దిస్ రంజని? ఎందుకిలా చేస్తున్నావ్? ఎనీ థింగ్ రాంగ్ హాపెండ్? ఆర్ ఈజ్ దిస్ మై ఫైల్యూర్?” అని గబగబా అడిగాడు.

రంజని చిన్నగా నవ్వింది.

"నువ్వంటున్నవి ఏవీ కావు అరవింద్! నువ్వో బెస్ట్ లీడర్. కాబట్టి నీకెప్పుడూ ఫైల్యూర్స్ రావు. నథింగ్ రాంగ్ హాపెండ్ ఇన్ దిస్ కంపెనీ సో ఫార్. కానీ నేనీ డెసిషన్ తీసుకోవడానికి మీరెవ్వరూ కారణం కాదు!"

"దెన్? హూ ఈజ్ దట్ పర్సన్! నిన్నీ పని చెయ్యడానికి ఎంకరేజ్ చేసిందెవరు? ఐ హోప్ ఇటీజ్ నాట్ అనంత్!!"

కాదన్నట్టు తలూపింది రంజని – "అనంత్ ను అనుమానిస్తున్నావా? పాపం! ఇప్పుడెంత మారిపోయాడో తెలుసా? అతనిప్పుడో జెమ్ ఆఫ్ పర్సనాలిటీ!" అని నవ్వింది రంజని.

అరవింద్ కూడా బలహీనంగా నవ్వుతూ "ఐతే ఈ రెజిగ్నేషన్ ఎందుకిస్తావ్? ఎవరి కోసం?" అని అడిగాడు.

"నా కోసం!" ముక్తసరిగా చెప్పింది రంజని.

"ప్లీజ్ రీకన్సిడర్!" అన్నాడు అరవింద్ అంతే ముక్తసరిగా.

"సారీ!" అంది రంజని మరింత క్లుప్తంగా.

"హుష్..." అంటూ ఆకాశంలోకి చూడసాగాడు అరవింద్.

"స్టెల్లాను ప్రమోట్ చేయ్. షీ విల్ గివ్ యూ ద రైట్ సపోర్ట్!" అంది రంజని.

"అప్పుడే అన్నీ డెసిషన్స్ తీసేసుకున్నావా? వెల్...యాజ్ యూ లైక్....కానీ నేను మాత్రం హ్యాపీగా లేను." అన్నాడు అరవింద్ తలను అడ్డంగా ఊపుతూ.

"ప్లీజ్ అరవింద్! అలా అనకు! ఐ యామ్ ట్రైయింగ్ టు సేవ్ మై సోల్!" – నెమ్మదిగా అంది రంజని.

కుర్చీలోనుంచి లేచాడు అరవింద్. రంజనీ కూడా లేచింది. తన చెయ్యి ముందుకు చాచాడు అరవింద్. రంజని తన చేతిని చాచింది. గట్టిగా షేక్ హ్యాండిస్తూ – "మై బెస్ట్ విషేష్ ఆర్ దేర్ విత్ యూ ఇన్ ఆల్ యువర్ బెస్ట్ ఎండీవర్స్!" అని నవ్వుతూ అన్నాడు అరవింద్.

“థాంక్స్!” అని చెప్పి కేబిన్ బైటకు నడిచేముందు “ముందు వారానికి రిలీవ్ చెయ్యగలవా?” అంది రంజని.

సరేనన్నట్టు తలూపాడు అరవింద్.

రంజని ముందుకు నడిచింది.

– – – – – – –

ఆ రాత్రి. . . .

“నిన్న, ఎవరామె?....హా. . . .సుమతి. . . .ఆమెతో మాట్లాడేప్పుడు నువ్వెంత క్రేజీగా బిహేవ్ చేసావో తెలుసా?” అన్నాడు అనంత్.

“క్రేజానా! నా ఫీలింగ్స్ నీకు అర్థం కావులే! అందుకే అలా అంటావు!”

“అలాగైతే, అర్థమయ్యేట్టుగానే చెప్పు. . . .వింటాను!” అన్నాడు అనంత్ చేతులు కట్టుకుని.

కుర్చీలో వెనక్కు వాలింది రంజని – “ఎలా చెప్పేది?” అంటూ.

“అదేమరి! నీకే సరిగ్గా తెలీదు కానీ నన్ను దెప్పి పొడుస్తావ్!” అంటూ రంజనిని ఎద్దేవా చేసాడు.

“ఆహా! నాకు తెలీక కాదు. . . .ఆ ఫీలింగ్స్ మామూలు మాటల్లో చెప్పడానికి చేతకాక!” అంది రంజని. “శీతకాలంలో గడ్డ కట్టిన నీరు కరిగి ప్రవహించడానికి ఎంతో ఆత్రపడుతుంది కానీ ప్రవహించలేదు. సుమతి విషయంలో నా మాటలూ అంతే!".

“వోవ్! వాటే పొయెట్రీ!!” అంటూ చిన్నగా చప్పట్లు కొట్టాడు అనంత్.

“ఇట్స్ నాట్ జస్ట్ పొయెట్రీ అనంత్! ద పవర్ ఆఫ్ ట్రూ అడ్మిరేషన్! సుమతిలోని ఆ పవర్ ఆమె సింప్లిసిటీలో ఉంది. ఆమెకు ఎన్నో తెలుసు బట్ అణకువతో ఆ గొప్పదనాన్ని దాచిపెడుతుంది. కానీ

కదిలిస్తే చాలు గంగాప్రవాహంలా దప్పిక తీరుస్తుంది. ఆమె పవర్ ఆమె డెడికేషన్లో ఉంది. నీకు తెలుసా! భర్తపై ఆమెకెంత నమ్మకమో తెలుసా? తన గురుత్వాకర్షణ శక్తిపై భూమికున్నంత నమ్మకం!"

"ఓహ్!" అన్న అనంత్ – "చాలా పొగుడ్తున్నావే? ఎందుకో- - -." అంటూ ఆగాడు.

"అనంత్! ఇక్కడో మాట చెప్పాలి. అయస్కాంతం అట్రాక్ట్ చేస్తుంది. ఆ అట్రాక్టింగ్ పవర్ అన్నది అయస్కాంతానికున్న న్యాచురల్ క్వాలిటీ. వుయ్ కెనాట్ క్వశ్చన్ ఎనీ వన్ ఆన్ దిస్! నో వన్ కెన్ ఛేంజ్ ఆల్సో! అలాగే మనిషిలో ప్రాక్టికాలిటీ ఉన్నప్పుడు, అది అయస్కాంతంలా అట్రాక్ట్ చేస్తుంది. సుమతి అయస్కాంతంలాంటిది. ఆమెలో ఉన్న ప్రాక్టికాలిటీ ఆమెకున్న పవర్. ఇ యామ్ కంప్లీట్లీ అట్రాక్టెడ్ బై ఇట్ అండ్ అనేబుల్ టు కమౌట్!" అంది రంజని.

మౌనం వహించాడు అనంత్. అతనికి తన భార్య ప్రవర్తన విచిత్రంగా అనిపిస్తోంది. అంతేకాదు ఆ సుమతి పట్ల రంజనికి ఉన్న అభిమానాన్ని చూసి ఈర్ష్య పడసాగాడు. "ఆమె పై నీకున్న అభిమానంలో పావువంతు కూడా నా మీద లేదనుకుంటా?"

"అలా ఎందుకనుకుంటావ్?"

"ఎందుకనుకొకూడదు!"

"అనుకోకూడదు. ఎందుకంటే నువ్వు నా హజ్బెండ్. ఆమె ఓ ఫ్రెండ్. ఇద్దరికీ చాలా తేడా ఉంది." అంది రంజని.

"ఆహా! అంటే మొగుణ్ణి తిట్టడం, ఫ్రెండును పొగడ్డం పతివ్రత లక్షణమా?" అని గేలిగా అన్నాడు అనంత్.

ఎందుకో మామూలుగా వచ్చే కోపం ఆ సమయంలో రంజనిని పూనలేదు. బదులుగా అపారమైన శాంతత ఆమెను ఆవరించింది.

“భర్త అనేవాడు లైఫ్ లాంగ్ నడవాల్సినవాడు. కాబట్టి అతని తప్పొప్పుల్ని భార్య విమర్శించడంలో తప్పులేదు. ఫ్రెండ్స్ అలా కాదు. వస్తూ పోతూ ఉంటారు. నిజానికి నా హైస్కూల్ ఫ్రెండ్స్ ఒక్కరు కూడా టచ్ లో లేరు....ఈవెన్ ఇన్ దిస్ ఇంటర్నెట్ ఏజ్! కానీ నేను, నువ్వు అలా వస్తూ, పోతూ ఉండలేం కదా! అఫ్టాల్ మనిద్దరం భార్యాభర్తలం కదా!” అంది రంజని.

“బహుత్ ఖూబ్! నువ్వు చెప్పింది చాలా బావుంది! కానీ నా క్వశ్చన్ కు ఆన్సర్ దొరకలేదు. ఐ రిపీట్....ఫ్రెండ్ పొగుడ్తూ, భర్తను తిట్టాలా?”

“అరే! దిస్ ఈజ్ ఫన్నీ! నేను చెప్పినదాంట్లో నీ ప్రశ్నకు సమాధానముంది. నువ్వు అర్థం చేసుకోవడంలేదు. ఐ టూ రిపీట్....వచ్చీ పోయే ఫ్రెండ్స్ దగ్గర నుండి మనం మంచి విషయాల్ని కలెక్ట్ చేసుకొని, నేర్చుకోవచ్చు. అందుకు వాళ్ళకి థాంక్స్ చెప్పాలి. కానీ భార్యాభర్తలు అలా కాదు. లైఫ్ లాంగ్ కలిసివుండాల్సిన వాళ్ళు. లైఫ్ లాంగ్ తప్పొప్పుల్ని తెలుసుకుంటూ, మిస్టేక్స్ ను సరిచేసుకొంటూ పోవాలి. కాబట్టి ఉత్తినే పొగుడుకుంటూనో, తిట్టుకుంటూనో కూర్చునే రిలేషన్ కాదది! అండర్స్టాండ్?” అని ఆగింది రంజని.

తర్వాత ఏం మాట్లాడాలో తోచని అనంత్ అర్థమైంది అన్నట్టుగా తలూపాడు.

కొద్దిసేపు ఇద్దరూ మౌనంగా ఉండిపోయారు.

“అనంత్! ఐ వాంట్ టు బీ ఏ హౌస్ వైఫ్!” అని హటాత్తుగా అంది రంజని.

“వాట్?.......వై?” అన్నాడు అనంత్ అర్థం కానట్టు.

“ఈ ఉద్యోగం, ఈ ఉరుకులు పరుగులు, సంపాదన కోసం తాపత్రయాలు.....ఇవేవీ నాకొద్దు! నేను హాయిగా ఇంట్లో ఉంటాను.”

“ఆ....ఉండి...ఏం చేస్తావ్?”

“నిన్ను చూసుకుంటాను. ఇంటిని కనిపెట్టుకుని ఉంటా! భక్తి ఎక్కువైనప్పుడు పూజలు, ఇంకా ఎక్కువైనప్పుడు భజనలు చేసుకొంటా...” విశాలంగా నవ్వుతూ అంది రంజని.

అనంత్ వెంటనే జవాబునివ్వలేదు. రంజని కూడా బలవంతం చెయ్యలేదు.

మళ్ళీ మౌనం ఇద్దరి మధ్యా తచ్చాడింది.

“సో! యూ వాంట్ టు బీ వన్ మోర్ సుమతి?” అని నెమ్మదిగా పలికాడు అనంత్.

నిశ్శబ్దంగా నవ్వింది రంజని.

“నాకేమో ఫిక్సెడ్ ఇన్కం లేదు. రిమెంబర్ దట్!” అన్నాడు అనంత్ హెచ్చరిస్తున్నట్టుగా.

“లీస్ట్ బాదర్డ్ అబౌట్ మనీ! ఐ వాంటి పీస్...ఇన్నర్ పీస్!” అంది రంజని.

“అలాగే!” అన్నాడు అనంత్.

అతని చేతిని తన చేతుల్లోకి తీసుకుని “థాంక్యూ!” అని ముద్దు పెట్టింది రంజని.

చాలాసేపు అతని చేతిని అలానే పట్టుకుని కూర్చుంది ఆమె.

★ ★ ★ ★ ★

“పంద్యాల పైన పంద్యం పడిన నీ రెండో ఆటకాయ అరవైనాల్గవ గడిలోని స్త్రీమూర్తిని చేరింది. ఈ నడకలోని తాత్పర్యమేమిటో?” అన్నాడు తత్పురుషవరేణ్యుడు.

“మీ దయాలబ్ధప్రాప్తమైన జ్ఞానశక్తితో వివరించడానికి ప్రయత్నిస్తాను ప్రభూ! అరవైరెండవ గడిలో రాజు ఉన్నాడు. అరవైమూడవ గడిలో ’భక్తి’ నిలచివుంది. ఆపై అరవైనాల్గవ గదిలో మీరు ఉటంకించిన స్త్రీమూర్తి ఉంది. ఈ మూడు గదుల్నీ అవలోకనం చేసినప్పుడు – అరవైరెండవ గదిలోని రాజు ’ఐశ్వర్యసంపద’లకు సూచన. అరవైనాల్గవ గదిలోని స్త్రీమూర్తి ’సుఖభోగా’లకు గుర్తు. ఈ రెండింటి మధ్య ’భక్తి’ చిక్కుకునివుంది. సాధారణంగా జీవులు ధనాసక్తులౌతారు లేదూ కాంతాదాసులౌతారు.

తద్వారా భక్తికి దూరమై, మీ అనుగ్రహాన్ని కోల్పోతుంటారు. ఎవరైతే కాంతా–కాంచనాల ఆకర్షణను భక్తితో జయిస్తారో వారిలో చిత్తశుద్ధి మసకబారని దీపంలా వెలుగుతుంది."

"బాగు బాగు! చూశావా...అరవైనాల్గవ గదిలోని స్త్రీమూర్తికి ప్రక్కనే నువ్వు పేర్కొన్న 'చిత్తశుద్ధి' అనే గడి ఉంది. అక్కడి నిచ్చెనను ఎక్కిన జీవులు నేరుగా మహర్లోకాన్ని చేరుతారు."

"ఆ మహర్లోకం యొక్క అంతరార్థాన్ని బోధించండి స్వామిన్."

"అవశ్యం దేవీ! మహస్ అంటే పూజనీయమైనదని అర్థం. ఈ పూజనీయ స్థానాన్ని చేరుకోవడానికి కావల్సింది 'చిత్తశుద్ధి'. చిత్ సంజ్ఞానే అని ధాతువు. సంజ్ఞానమంటే అటినిటు కదలని, చెదరని మనోస్థితి. అంటే ఏకచిత్తత. ఈ ఏకచిత్తత సాధ్యమయ్యేది ఏకవాక్యత వల్లనే."

"అజ్ఞులకూ అవగతమయ్యేలా వివరించండి ప్రభూ!" అని వేడుకుంది వేదవతి.

"దేవీ! జీవులు నిశ్చలమైన మనసును సాధించాలంటే మొదట తమ కార్యాలలో నిశ్చలత్వాన్ని సాధించాలి. చేసే పనులు శాస్త్రవిహితమై, ఫలాఫలాల పట్ల చెదరనితనంతో కూడినప్పుడు చెదరని మనసు సిద్ధిస్తుంది. అలాంటి ఏకచిత్తమే జీవుల ప్రథమలక్ష్యం. 'ఏకమ్ సత్' అని కదా శాస్త్రవచనం! అలాంటి ఏకేశ్వరుణ్ణి ఏకచిత్తంతో ఏకాగ్రభావంతో భజించినపుడు లభించేదే పూజార్హమైన మహర్లోకం. ఈలోకం జీవులు నివసించే భూమి నుండి దూరంగా ఉన్నది. కానీ నా దయవల్ల భక్తుల అంతరంగాల్లో కూడా ఈ లోకానుభవం సాధ్యపడుతుంది. ఆస్తులు, అంతస్తులు, లౌకికవస్తుభోగాలను ఆశించని సాధకులెందరో భూలోకంలో పూజనీయులయ్యారు. అందుకు కారణం, వారి మనోలోకాల్లో ఈ మహర్లోక సాక్షాత్కారం వల్లనే దేవీ!"

"అమోఘమైన ఉపదేశం స్వామి! మాయాశక్తిని, పరాశక్తిని దాటిన మీ మొదటి ఆటకాయ ఈ పరమపద సోపాన పటపు చిట్టచివరి వరుసలోకి చేరింది. ఇక్కడి నుండి ఆట తీరు మారిపోతుందని విన్నాను. కేవలం 'ఒకటి' సంఖ్య పడితేనే పావులు ముందుకు కదలాలని నియమాన్ని విధించారు మీరు. ఎందుకు స్వామీ?"

“కొన్ని నియమాలు రహస్యమయాలు దేవీ!”

“అనంతాలైన మీ రహస్యావతార ఉపాసనా పరాయణురాల్ని, నాకూ తెలియని రహస్యాలున్నాయన్న మాట! కాలమూర్తులైన మీరు దయ తలచిన కాలానికి ఈ రహస్యం బోధపడుతుంది. అప్పటిదాకా వేచి చూడ్డం కూడా సాధననే. మీ అనుగ్రహప్రాప్తికై ఎదురుచూస్తుంటాను ప్రభూ!”

“ఆ లోపు నా మొదటి పావును నడపనా?”

“అత్యవసరంగా నడపండి. మీ పావులు పవిత్రభావనాప్రపూరకాలు, దివ్యానుభూతితో అలరారే సాధకులు. వాటి ప్రతి నడకలోనూ మీకు దగ్గరయ్యే సూక్ష్మ మార్గాలు ఆవిష్కృతమౌతున్నాయి.” అంది అపరాజిత.

నవ్వుతూ పాచికల్ను కదిపాడు నారాయణుడు.

మహాక్రతు చేతి నుండి జారిన పాచికలు దశరథ చక్రవర్తి కృత పుత్రకామేష్టియాగారంభ సమయంలో ఋత్వికవరుడైన ఋష్యశృంగుని ముఖోద్భూత వేదమంత్రాల్లా ధ్వనించాయి.

★ ★ ★ ★ ★ ★ ★

మళ్ళీ ఆ పల్లెటూరులో...

సుమతి హాయిగా గాలి పీల్చింది.

ఆ తెల్లవారుజామునే అక్కడికి వచ్చారు శర్మ దంపతులు.

గర్భవతియైన భార్య కోరిన కోర్కెను తీర్చడానికి గాను పట్నం నుంచి పల్లెటూరుకు మకాం మార్చాడు శర్మ.

*“మాతృజం హ్యస్య హృదయం మాతృశ్చ హృదయేన తత్*

*సంబద్ధం తేన గర్భిణ్యాః నేష్టం శ్రద్ధావిమాననమ్”*

“గర్భంలో పెరిగే బిడ్డ యొక్క మనసు తల్లి వల్లనే తీర్చిదిద్దబడుతుంది. ఆవిధంగా బిడ్డ మనసుకు, తల్లి మనసుకు అవినాభావ సంబంధముంది. కాబట్టి గర్భిణికి ఏ విషయం పట్ల అనురక్తి కలుగుతుందో దాన్ని ఉపేక్ష చేయకుండా పూర్తి చేయా”లన్న శాస్త్రవాక్కులో శర్మకున్న అచంచల విశ్వాసం అతన్ని మళ్ళీ ఈ పల్లెటూరుకు మళ్ళించింది.

ఆ మారుమూల పల్లెలో, జనసంచారం లేని ఆ గుడికి దగ్గరగా, తంబూరల్ని మీటుతూ నిలబడివున్న భక్తుల విగ్రహాల సాన్నిధ్యంలో ఉండాలన్నది సుమతి కోరిక.

ఆమెకు వచ్చిన కలలకు, తన భావి జీవితానికీ మధ్య ఉన్న రహస్య సంబంధమేదో పూర్తిగా వ్యక్తమౌతుందన్న మరో నమ్మకం కూడా శర్మను అక్కడకు వెళ్ళేట్టు చేసింది.

హోమాన్ని చేసిన కొద్దికాలంలోనే సుమతి కడుపు పండడాన్ని తెలుసుకున్న త్ర్యంబక ఉపాధ్యాయ, అతని భార్య అపర్ణాదేవి చాలా సంతోషించి, అత్యంత ఆదరంతో ఆ దంపతుల్ని ఆహ్వానించారు. వారింటికి వెనక భాగంలో ఉన్న ఓ చిన్న ఇల్లును శుభ్రం చేయించి, అందులో శర్మ–సుమతుల విడిదికి ఏర్పాట్లు చేసారు.

భర్త పూజా ఏర్పాట్లకు ఎంత శ్రమ వహించాలో అంతేవరకే సుమతిని పరిమితం చేస్తోంది అపర్ణ. “అబ్బే! రోజువారి పనులన్నీ నేను చేసుకోగల”నని చెప్పినా వినకుండా వారించింది అపర్ణ. పెద్ద పట్నంలో భర్త నుండి తప్ప మరొకరి అనురాగం చవిచూడని సుమతికి అపర్ణ చూపిస్తున్న ఆదరువుకు కళ్ళు చెమర్చాయి. అదే మాట శర్మతో కూడా అంది. అందుకు శర్మ “బాంధవానాం విష్ణుభక్తాశ్చ!” అని మాత్రం చెప్పి మౌనం వహించాడు.

– – – – – – –

గుడిలో పారాయణం చేసుకువస్తానని చెప్పి వెళ్ళిపోయాడు శర్మ.

అసురసంధ్య వేళలో గర్భవతి బైట తిరగడం కూడదని అపర్ణ నొక్కి చెప్పడంతో వెళ్ళకుండా ఆగిపోయింది సుమతి.

కీర్తననేదో చిన్నగా కూనిరాగంలా పాడుతూ దేవుడి దగ్గర దీపం వెలిగించి, ముందు గదిలోకి వచ్చి అక్కడున్న చిన్ని గూట్లోని వినాయకుడి విగ్రహం ముందు మరో దీపాన్ని వెలిగించి, దండం పెట్టి వెనక్కు తిరిగిన సుమతి ఉలిక్కిపడింది.

తలవాకిలి గడపకు అవతల ఓ పది–పన్నెండేళ్ళ అమ్మాయి నిలబడివుంది.

"ఎవరు కావాలి?" అని అడిగింది సుమతి.

ఆ అమ్మాయి జవాబునివ్వలేదు సరికదా సుమతి వైపు రెప్పార్పకుండా చూడసాగింది.

"నిన్నే అమ్మాయ్! ఎవరు కావాలి?" అని మళ్ళీ అడిగింది సుమతి.

"కొత్తగా వచ్చారా?" – పొడిపొడిగా అడిగింది ఆ అమ్మాయి.

"అవును."

"ఎప్పుడెళ్ళిపోతారు?"

ఆ ప్రశ్నకు నివ్వెరపోయింది సుమతి. ఏం చెప్పాలో తోచక మౌనంగా ఉండిపోయింది. అమ్మాయి రెప్పార్పకుండా చూస్తూనేవుంది. ఆ చూపులకు తెగ ఇబ్బందిపడిపోసాగింది సుమతి.

అంతలో అటుకేసి వచ్చిన అపర్ణ వడివడిగా వచ్చి – "ఏయ్! సోమి! ఇక్కడేం చేస్తున్నావే? పో పో!" అని గద్దించినట్టుగా అరిచింది.

మారుమాట్లాడకుండా వెనక్కు తిరిగి వెళ్ళిపోతూ, ఒక్కసారి వెనక్కు తిరిగి సుమతి వైపు గుచ్చి చూసింది సోమి అని పిలువబడిన ఆ అమ్మాయి. ఆ చూపుకు గతుక్కుమంది సుమతి మనసు.

"ఎవరక్కా ఆ అమ్మాయి?" – ప్రహరీగోడకున్న వాకిలిని దాటుకువెళ్తున్న సోమి వైపే చూస్తూ అడిగింది సుమతి.

“రెండు వీధులవతల ఉండే మోహన్రావు గారి మొదటి భార్య కూతురు. దాని పూర్తి పేరు సోమక్క. మోహన్రావు గారి అమ్మపేరునే దీనికి పెట్టారు. ఇది పుట్టిన ఆరునెల్లకే మీనాక్షిఅంటే మోహన్రావు గారి మొదటి భార్య, హటాత్తుగా పోయింది. పెద్దలు బలవంతం చేయడంతో ఇంకో పెళ్ళి చేసుకున్నారాయన. సవతి తల్లి మంచిదే! కానీ ఆమె వచ్చే సమయానికి దీనికి పిచ్చి పట్టుకుంది...”

“అయ్యో! పిచ్చా? చూసేందుకు లక్షణంగా ఉంది.” అంటూ అపర్ణ మాటలకు అడ్డు తగిలింది సుమతి.

“పిచ్చంటే మరీ అంతకాదులే సుమతి! ఐనా మన ధ్యాస తక్కువ. పొద్దుకు సరిగ్గ తినదు. ఎవరితోనూ సరిగా మాట్లాడదు. ఉన్నట్టుండి అరుపులు కేకల్తో గొడవ పెడ్తుంది. రామలక్ష్మి, అదే దీని సవతి తల్లి, మొదట్లో బాగా చూసుకునేది. కానీ ఇప్పుడు ఆమెకే ముగ్గురు పిల్లలు. ఇహ ఈ సగం పిచ్చిదాన్ని చూసుకునే ఓపిక తగ్గిపోయింది. భోజనానికి, తిండికి ఇది ఇంట్లో లేకపోతే తన పిల్లల్లో ఎవర్నో ఒకర్ని వెదకడానికని పంపుతుంది. పాపం!” అని ఆగింది అపర్ణ.

“అయ్యో!” అంది సుమతి బాధగా.

“అదేం పైత్యమోగానీ ఊళ్ళోకి కొత్తవాళ్ళెవరైనా వస్తే, మీరెప్పుడేళ్ళిపోతారు అని అడుగుతుందీ పిచ్చిది. దాంతో అవతలివారికీ పిచ్చెక్కడం, దీన్ని తరిమేయడం జరుగుతుంది. ఐనా అదొస్తే నువ్వేం భయపడకు. కొద్దిగా జోరు చేసి మాట్లాడు. వెళ్ళిపోతుంది. సరే! కాస్త పనుంది వెళ్ళొస్తాను.” అని సుమతి జవాబుకు ఎదురుచూడకుండా వెళ్ళిపోయింది అపర్ణ.

భర్త రాగానే సోమి విషయం చెప్పాలకున్న సుమతి మర్చిపోయింది.

\- - - - - - -

సోమి వచ్చి వెళ్ళిన రెండు రోజులకు కేశవశర్మ, ఉపాధ్యాయ అక్కడికి ఐదు కిలోమీటర్ల దూరంలోనున్న మరో పల్లెటూరిలో ఎవరో వేదపండితుడిని కలవడానికని వెళ్ళారు. ఎంత రాత్రైనా తాము వెనక్కు వచ్చేస్తామని చెప్పి వెళ్ళాడు శర్మ.

మధ్యాహ్నం భోజనమైన తర్వాత ముందు గదిలో పుస్తకం చదువుతూ కూర్చుంది సుమతి.

గడప దగ్గర నీడ పడ్డంతో చప్పున తలెత్తి చూసింది. ఎదురుగా సోమక్క. రేగిన జుట్టుతో, ఎర్రబడ్డ కళ్ళతో సుమతిని గుచ్చి గుచ్చి చూస్తూ నిలబడివుంది. సోమి అవతారాన్ని చూసిన సుమతి ఒక్క క్షణం ఉలిక్కిపడింది. వెంటనే సర్దుకుని, అపర్ణ చెప్పినట్టు వెళ్ళిపొమ్మని గద్దించింది. రెండు మూడుసార్లు సుమతి అరవడంతో వెళ్ళిపోవడానికి వెనక్కు తిరిగింది సోమి. అప్పుడు చూసింది సుమతి.

ఆ అమ్మాయి మెడ నుండి కింది దాకా ఎర్రటి చార!

“సోమక్కా! ఇలారా!” అని సౌమ్యంగా పిలిచింది సుమతి.

గడప దాకా వచ్చి ఆగింది సోమి.

“లోపలికి రా!”

రానన్నట్టు అడ్డంగా తలూపింది సోమి.

దాంతో తనే లేచి గుమ్మం దాకా వచ్చింది సుమతి. “ఏదీ! వెనక్కు తిరుగు!” అంది.

సోమి వెనక్కు తిరిగింది. సందేహం లేదు. ఏదో పదునైన వస్తువు తగిలి కోసుకుపోయింది. జాకెట్టుకు అంటుకున్న రక్తపు చారలు. సుమతి హతాశురాలైంది.

సోమి రెండు భుజాల్ని సుతిమెత్తగా పట్టుకుని తన వైపుకు తిప్పుకుని – “ఏమైంది సోమక్కా! ఇంత దెబ్బ ఎలా తగిలింది?” అని అడిగింది.

“చంద్రశేఖరు కొట్టాడు.…ఇంత పెద్ద కర్రతో” అని రెండు చేతుల్ని బారచాపుతూ చెప్పింది. అంతలో దెబ్బ తగిలిన చోట కలుక్కుమనడంతో “స్..స్…అబ్బా…నొప్పి” అని కళ్లు మూసుకుంది. కొన్ని కన్నీటి చుక్కలు ఆ లేత బుగ్గల్ని తాకుతూ దూకాయి. ఆ అమ్మాయి స్థితిని చూసి విచలితురాలైపోయింది సుమతి.

“లోపలికి రా! మందు రాస్తాను.” అంది.

రానన్నట్టు తల అడ్డంగా ఊపి అక్కడే కూర్చుండిపోయింది సోమి.

చేసేదిలేక సుమతి లోనికెళ్లి తడిగుడ్డ, ఆయింట్మెంటుతో వెనక్కు వచ్చి ఆ గాయాన్ని మెల్లగా తుడిచి, మందు పూసింది.

సుమతి సపర్యలు చేస్తున్నంతసేపూ చెట్ల వైపు చూస్తూ కూర్చుంది సోమి. జాకెట్ హుక్కుల్ని పెట్టి "కొద్దిసేపట్లో నొప్పి తగ్గిపోతుందిలే!" ఊరటగా అంది సుమతి.

"ఊ(....." – ముక్తసరిగా అనింది సోమి తలను బరబరమని గోక్కుంటూ.

"జుట్టంతా ఎలా చిక్కుపడిందో చూడు!" ఏదో ఒకటి పలకరించాలన్నట్టు అడిగింది సుమతి.

సోమి నుండి మౌనమే సమాధానంగా వచ్చింది.

నెమ్మదిగా లేచి, లోని కెళ్ళి ఆయింట్మెంటును పెట్టేసి అద్దం, దువ్వెనా తీసుకువచ్చి సోమి తల దువ్వడం మొదలెట్టింది సుమతి. దాని చిక్కు తీసి జడవేసేందుకు పదిహేను నిముషాలపైనే పట్టింది సుమతికి. అంతసేపూ ఉలుకుపలుకు లేకుండా కూర్చునే ఉంది సోమి. సుమతి కూడా ఏమీ మాట్లాడలేదు. జడ వేయడం పూర్తయ్యాక సోమి చేతికి అద్దం ఇచ్చి "ఎలా ఉన్నావో చూసుకో!" అంది సుమతి.

అద్దాన్ని మొహం దగ్గరగా పెట్టుకుంది సోమి. "ఆహా! అంత దగ్గరగా పెట్టుకుంటే ఎలా......ఇలా.....ఇప్పుడు చూసుకో!" అంది సుమతి.

చూసుకుంది సోమి.

అమ్మాయి మొహంలో ఆశ్చర్యాన్ని, సంతోషాన్ని ఊహించింది సుమతి. కానీ అవేవీ కనబడని మొహంతో అద్దాన్ని వెనక్కు ఇచ్చేసి, చటక్కున లేచి పరుగెడ్తున్నట్టుగా వెళ్ళిపోయింది సోమి. తనలో తానే నవ్వుకుంది సుమతి.

సోమి వెళ్లిపోయిన పది నిముషాల్లో వచ్చాడు శర్మ.

అతని చేతిలోని సంచిని తీసుకుంటూ "శాస్త్రులుగారు కలిసారా?" అని అడిగింది సుమతి.

“అసలు ఆయన్ను వదిలి రావాలంటే మనసు రాలేదనుకో! మహావిద్యావంతులు. గొప్ప వాక్చాతుర్యం. ఇంకా గొప్ప సమన్వయ శక్తి. . . ఆహా! ఈ కాలంలో అలాంటి వ్యక్తిని కలుస్తానని అనుకోనేలేదు సుమా! ఉపాధ్యాయ పుణ్యమాని, నీ పుణ్యామాని కలవగలిగాను. ఈ జన్మ ధన్యం!” – పొగడ్తలతో తేలిపోసాగాడు శర్మ.

“అబ్బో! చాలా కొత్త విషయాల్నే తెలుసుకొచ్చినట్టున్నారు. ఈమధ్యకాలంలో ఇంత అత్యుత్సాహంగా మీరెప్పుడూ కనబడలేదు సుమండీ!” అంది సుమతి.

విశాలంగా నవ్వాడు శర్మ.

“అయినా మన పుణ్యం తప్పించి నా పుణ్యమన్నది విడిగా ఎక్కడుంది?” అంది సుమతి చటక్కున.

ఆ మాటకు ఆశ్చర్యపడినట్టు చూసాడు శర్మ – “దేని గురించి చెబుతున్నావ్?”

“మీరింతకు మునుపే అన్నారుగా! ఉపాధ్యాయగారి పుణ్యమాని, నా పుణ్యమాని శాస్త్రిగారిని కలిసారని!”

సుమతి వైపు సంతృప్తిగా చూస్తూ – “బిందువు బిందువు కూడితే సింధువు. అంటే ఒక్కో చుక్క నీరు చేరితేనే సముద్రమయ్యేది. అలానే నీ పుణ్యం, నా పుణ్యం, మన పూర్వీకుల పుణ్యం – ఇలా అన్నీ చేరితేనే మంచి పనులు జరిగేవి!” అన్నాడు శర్మ.

“మరి రాబోయే వాడి పుణ్యమో? అది లెక్కలోకి రాదా?” అందు సుమతి చిన్నగా నవ్వుతూ.

సుమతి దగ్గరకు వచ్చాడు శర్మ – “ఇప్పుడు నువ్వు దౌహృదినీ” అన్నాడు.

“అంటే?” కన్నులు పెద్దవి చేసి అడిగింది సుమతి.

“ఇలా కూర్చో!” అంటూ మెత్తటి దుప్పటి పరిచివున్న కుర్చీ మీద ఆమెను కూర్చోబెట్టి ఎదురుగావున్న మరో కుర్చీలో తనూ కూర్చున్నాడు శర్మ.

“దౌహృదినీ అంటే రెండు మనసులున్న స్త్రీ. ఈ పదం గర్భవతులకు మాత్రమే వాడబడుతుంది. ఎందుకంటే వారిలో వాళ్ళ మనసుతో బాటు పుట్టబోయే బిడ్డ మనసు కూడా పనిజేస్తుంటుంది!” అన్నాడు శర్మ.

“ఓహో!” అంది సుమతి.

“*హృదయం చేతనస్థానం* అని శాస్త్రం చెబుతోంది. ఈ శరీరంలో అత్యంత చైతన్యవంతమైన భాగం మనసు. ఆ మనసులోనే కోర్కెలు పుడతాయి. ఆ కోర్కెలను తీర్చుకోవడానికి మిగతా శరీర భాగాల్ని ఉపయోగిస్తారు జీవులు. కాబట్టి జీవులు చేసే సమస్త చేష్టలకూ మూలం హృదయం. గర్భంలో ఉండే బిడ్డకు స్వతంత్ర్యంగా వ్యవహరించే శరీరం పూర్తిగా ఏర్పడివుండదు. కానీ మనసు పూర్ణశక్తితో పనిచేస్తూవుంటుంది. అందువల్ల తల్లి ద్వారా తన కోర్కెల్ని వెల్లడి చేస్తుంది. ఈ కారణంగానే గర్భవతులు అప్పటి వరకూ వ్యక్తం చెయ్యని కోర్కెల్ని కోరుతుంటారు. అప్పటి వరకూ తినని పదార్థాల్ని తింటుంటారు. శాంతంగా ఉన్నవాళ్ళు అకారణంగా కోపగిస్తుంటారు. నిర్లక్ష్యంగా తిరిగే స్త్రీలు ఒద్దికగా ఉంటుంటారు. ఇలా తన వారి ఎరుకలో లేని ఎన్నెన్నో కోర్కెల్ని, పనుల్ని వ్యక్తం చేస్తారు గర్భవతులు.” అన్నాడు శర్మ.

“ఓహో!” అని మళ్ళీ అంది సుమతి – “అలాగైతే నాలో అలాంటి వింత కోర్కెలేవైనా మీరు గమనించారా?”

“హోహోహో…” కాస్త గట్టిగానే నవ్వాడు శర్మ. అతనలా గట్టిగా నవ్వడం చాలా అరుదు. “ఎన్నెన్నో వింత చేష్టలున్నాయ్!” అన్నాడు కాస్త చిలిపిగా.

సుమతి మొహంలో దిగులు కారుమబ్బులా కమ్మింది – “అవునా! అన్నేసి వెర్రిమొర్రి కోర్కెల్ని కోరానా?” అంది.

ఆమెను కొద్దిగా ఆటపట్టించాలని – “కోరావు సుమా! ఎన్నో సౌకర్యాలున్న పట్నాన్ని వదిలేసి ఈ పల్లెలోకి నన్ను తరుముకొచ్చావుగా? పైగా అక్కడ గిట్టుబాటైనట్టు ఇక్కడ కాదు కూడానూ! మనకే

చాలకపోతే, పిల్లలకేమిస్తాం? హుమ్...ఏం చేద్దాం....విన్నపాలు వినవలె వింత వింతలు!" అన్నాడు శర్మ.

సుమతి ముఖంలో అసందిగ్ధత కొట్టొచ్చినట్టు కనబడసాగింది. భర్త ఉపదేశాల్ని వినేటప్పుడు నిర్మలంగా ఉండే ఆ కన్నులు చంచలాలై, నిశ్చలత్వవంచితాలై, దుఃఖభారాకుంచితాలై రెపరెపమన్నాయి. "పెద్ద తప్పే చేసేసాను!" అని ఆమె అన్నది.

ఆమె భావాలు, వాటి తీవ్రత అతని మనసును తాకాయి.

ఐనా మరికాస్త చొరవ చేసి – "ఉత్తి తప్పు కాదేమో! తప్పున్నరేమో?" అన్నాడు.

ఆ మాటలతో సుమతి కళ్ళలో గూడుకట్టున్న దైన్యం రెక్కలు చాచుకుని రివ్వున లేచింది. కన్నీరు గలగలా పారింది.

కంగారు పడ్డాడు శర్మ. "ఏయ్! తమాషాకంటే ఇలా ఏడ్చేస్తావా?" అన్నాడు.

"హృదయం చేతనస్థానమ్.....తమాషానే అనుకోండి. కానీ ఈ భావాలు మీ మనసులో లేకపోతే తమాషాకైనా అంటారా? మీ ఇష్టానికి తెలుసుకోకుండా నా వింత కోర్కెల్ని రుద్దడం తప్పే.....కదూ!" అంది సుమతి. దుఃఖం ఆమె మాటల్ని సంపూర్తిగా ముంచెత్తలేదు. తాను మరో తమాషా మాట అంటే అంత పనీ జరుగుతుందని అనిపించిందికి శర్మకు. అంతేకాదు, మనసు గురించి తాను చెప్పినది ఆమె మనసులో ఎంత త్వరగా, ఎంత లోతుగా నాటుకొన్నదో గ్రహించాడు.

వెంటనే పరిస్థితిని, ఆమె మనఃస్థితిని సరిదిద్దడానికి పూనుకున్నాడు శర్మ.

"అరే పిచ్చిదానా! అన్ని చేష్టలకూ మూలం మనసే. ఇప్పుడు నేనన్న మాటలూ మనసులోనివే. కానీ దొర్లే ప్రతి మాట వెనుకా ఓ లక్ష్యముంటుంది. ఒక భావముంటుంది. నేనన్న మాటల్లోని భావం నిన్ను ఆటపట్టించడం మాత్రమే. ఆ మాటల్లోని లక్ష్యం నవ్వించడం మాత్రమే. కానీ, నాకు హాస్యం చేతకాదు. అందుకే ఇలా రసాభాస అయింది." అన్నాడు.

“అంతేగా? నేను మిమ్మల్ని ఉద్దేశపూర్వకంగా ఇబ్బంది పెట్టానని మీరు అనుకోవడం లేదు కదా?” అంది సుమతి.

“*పొంకపు శేషాదులు తుంబురు నారదాదులు – పంకజభవాదులు నీ పాదాల చేరి – అంకెలనున్నారు లేచి అలమేలుమంగను – వేంకటేశుడా రెప్పలు విచ్చి చూచి లేవయ్యా – విన్నపాలు వినవలె వింత వింతలు.* తంబూరలు మీటుతున్న ఆ భక్తుల కోసం నువ్విక్కడికి రావాలనుకున్నావు. బ్రహ్మాదులు కలలో సైతం కలవరించే ఆ వేంకటేశుడు నా జీవితాన్ని ఎలా చూడబోతున్నాడోనన్న ఆత్రుతతో నేను వచ్చాను. ఇద్దరమూ వింత కోర్కెలతో సతమతమౌతున్నవాళ్ళమే.” నెమ్మదిగా, విస్పష్టంగా పలికాడు శర్మ.

“*ఎక్కడి సురపుర మెక్కడి వైభవ – మెక్కడి విన్నియునేమిటికి – యిక్కడనే పరహితమును పుణ్యము – గక్కున జేయగ గలదిహ పరము...*” – శర్మ చెప్పిన అన్నమయ్య కీర్తనకు మరో కీర్తనలోని మాటల్ని చేర్చింది సుమతి.

“ఆ నిజసురపురమెక్కడుందో గానీ ఈ పల్లెటూరే మనకు సురపురం.” అన్నాడు శర్మ.

★ ★ ★ ★ ★

“పడడం కష్టమనుకున్న ఒంటి కన్ను పడి మీ మొదటి ఆటకాయ ముందుకు నడిచేసింది.” అని మెచ్చుకోలుగా అంది శ్రీలక్ష్మి.

నవ్వాడు నవావరణ ధారకుడు.

“ప్రభూ! పరమపద సోపానపటంలోని ఈ చిట్టచివరి వరుసలో ఒకటి సంఖ్య పడితేనే పావును నడపాలన్న నియమమెందుకో? ఆ నియమంలోని మర్మమేమిటో బోధించండి.” అని చేతులు జోడించింది ఆనందాబ్జసదన.

“సోమసమాననా! ఏకమ్ అంటే ఒక్కటి అనే అర్థమే కాదు అద్వితీయమనే మరో అర్థం కూడా ఉంది. అద్వితీయమైనదెప్పుడూ సత్యమైనదే. కాబట్టి ఏక శబ్దానికి సత్యమని కూడా అర్థం. సత్యమైనదానికి

అగ్రస్థానం అవశ్యం లభిస్తుంది. కాబట్టి ఏకమంటే అగ్రగణ్యమైనది అర్థం. అగ్రస్థానాన్ని సంపాదించడం ఉత్తమత్వానికి నిదర్శనం. ఆవిధంగా ఏకమ్ అంటే ఉత్తమమైనదని అర్థం. ఇన్ని విశేషణాల్ని ఒకే జన్మలో పొందగలగడమే జీవుల లక్ష్యమైవుండాలి. ఆవిధంగా సాధన చేయాలంటే '*మనస్యేకం – వచస్యేకం – కర్మణ్యేక*'మై నడవాలి. అంటే ఆలోచించే మనసు, ఆలోచన్ని వ్యక్తి చేసే మాటలు, ఆ మాటల్ని నిజం చేసే ఆచరణ – ఈ మూడూ ఒకేవిధంగా ఉండాలి. అలాంటి వారిని 'మహాత్ము'లని పేర్కొంటోంది శాస్త్రం. ఇలాంటి వారికి 'ఏకమ్ సత్' అనే వేదవిజ్ఞానం సహకరిస్తుంది. వెన్నంటి నడిపిస్తుంది. మహాత్ములు వేసే ఒక్క అడుగు కోటి కోటి తీర్థయాత్రల పుణ్యానికి సమానం. వారి ఒక్క అడుగు భూప్రదక్షిణకు సమానం. వారి అడుగులకు పురోగమించడమే గానీ తిరోగమనం తెలియదు. ఈ స్థితి గురించి మానవులకు తెలియజేయడానికనే ఈ ఆటలో, చివరి వరుసలోకి చేరిన పావుల్ని ఒకటి పడితేనే నడిపించాలన్న నియమాన్ని పెట్టారు విజ్ఞులు." అన్నాడు ముఖజవరదుడైన హయముఖుడు.

వినమ్రభక్తిశీలయైన సౌభాగ్యదేవి అమందానందకందళితహృదయారవిందయై నమస్కరించింది.

"నీ మొదటి ఆటకాయ కూడా ఏకచిత్తతను సాధించేందుకు ఆయత్తమౌతోంది. ఆలస్యం అమృతం విషం దేవీ!" అన్నాడు అనిమిత్త సుజనోద్ధారకుడు.

"మీ ఆశీర్వాదబలంతో అసాధ్యాలు కూడా సుసాధ్యాలు స్వామీ. ఇదిగో మీ ప్రీతికై నడిపిస్తున్నాను." అంటూ పాచికల్ని వేసింది వరమహాలక్ష్మి.

అంబ పాచికల్ని వేస్తే అవి వనవాస కాలంలో సీతమ్మ స్వరాన్ని అనుకరించబోయిన మత్తకోయిలల గళాల్లా ధ్వనించాయి.

★ ★ ★ ★ ★

అరవింద్ కోరడంతో మరో వారం రోజులు అదనంగా పనిచేసిన రంజని, తన బాధ్యతలన్నింటినీ స్టెల్లాకు అప్పజెప్పింది.

ఆమె వెళ్ళిపోతున్నప్పుడు పావని, స్టెల్లా, విశ్వజ్ఞలు కన్నీరు పెట్టుకున్నారు.

ఎన్నడూ చలించని అరవింద్ కూడా కళ్ళను తుడుచుకుంటూ బలవంతపు నవ్వొకటి నవ్వి రంజనికి షేక్ హ్యాండిచ్చాడు.

ఇతర మిత్రులు, అధికారుల వీడ్కోలు తీసుకుని ఆఫీసు నుండి బైటపడింది రంజని.

కారు దగ్గరకెళ్ళి డోర్ లాక్ తీస్తుండగా "మేడమ్!" అన్న పావని గొంతు వినబడి వెనక్కు తిరిగింది.

"ఏం పావని?" అని చిరునవ్వుతో అడిగింది రంజని.

"అది...అంటే...నేను....మీరన్నట్టు కృష్ణ శతకం నేర్చుకోలేకపోయాను! ఐ యామ్ సారీ!" అని బిక్కమొహం వేసుకుని చెప్పింది పావని.

పకపకమని నవ్వింది రంజని – "థాంక్ గాడ్! ఆ శతకం ఒకటుందని, దాన్ని నువ్వు నేర్చుకోలేదని గుర్తుపెట్టుకున్నావ్. ప్రస్తుతానికి అది చాలు. బట్ లెర్న్ ఇట్. ఇట్ విల్ హెల్ప్ యూ ఎ లాట్!" అని ఆ అమ్మాయి భుజం తట్టింది రంజని.

డోర్ తీయబోతున్న రంజనిని మళ్ళీ పిలిచింది పావని.

"మేడమ్! కొన్ని పద్యాలు నేర్చుకొన్నాను!" అంది.

"అరే! ఆ విషయం చెప్పకుండా అసలు రాదంటావేంటి. ఏం పద్యాలు వచ్చో చెప్పు!" అంది రంజని.

"ఊహూ....ఇక్కడ చెప్పను....అక్కడే...ఆ పార్కులో చెబుతా!" అని గోముగా అంది పావని.

"ఆహా! సెట్టింగు కూడా ఫిటింగ్ చేసేసుకుని డ్రామాలాడుతున్నావా! హాహాహా....బాగుంది. పద పద." అంటూ కార్లో కూర్చుంది రంజని. పక్క సీట్లో పావని కూర్చుంది.

– – – – – – –

రంజని, పావనిలు పార్కుకు వచ్చేసరికి విశ్వజ్ఞ, స్టెల్లాలు అక్కడికి వచ్చేసారు.

*"దిక్కెవ్వరు ప్రహ్లాదుకు*

*దిక్కెవ్వరు పాండుసుతుల దీనుల కెపుడున్*

*దిక్కెవ్వరయ్యహల్యకు*

*దిక్కెవ్వరు నీవే నాకు దిక్కువు కృష్ణా!"*

బృందగానంలా పద్యాన్ని చదివారు ఆ ముగ్గురమ్మాయిలు.

సంతోషం పట్టలేకపోయిన రంజని ఆ ముగ్గుర్ని ఒకేసారి కావలించుకుంది.

వాళ్ళలా ఉండడాన్ని చూస్తున్న పిల్లలు కొందరు చప్పట్లు కొట్టారు. వారి అల్లరికి మూసిన కళ్ళను తెరిచింది రంజని.

ఆమెను బెంచ్ మీద కూర్చోమని చెప్పి పక్కనేవున్న చెట్టు చాటుకెళ్ళి ఓ పెద్ద ఫోటోను పట్టుకొచ్చారు పావని, విశ్వజ్ఞ.

"వావ్!" అని గట్టిగా అంది రంజని.

పాడి ఆవు పొదుగు నుండి పాలు తాగుతున్న కృష్ణుడు అదే పాలను తాగడానికి వస్తున్న ఓ లేగదూడను దూరంగా తోస్తున్నాడు. పాలిస్తున్న గోమాత కృష్ణుని వీపును ప్రేమతో నాకుతోంది. ఇదీ ఆ బొమ్మ.

"ఫెంటాస్టిక్ ఇమాజినేషన్! సో క్యూట్! ఎక్కడ దొరికిందిది?" అని అడిగింది రంజని.

"ఓహ్! ఎన్నెన్ని షాపులు తిరిగామో. ఫైనల్గా రోడ్డు సైడు షాపులో దొరికింది. చాలా పాతదే ఐనా కొనేసి, ఫ్రేమ్ వేయించామ్. బావుందా మేడమ్!" అంది స్టెల్లా.

"ఎక్సలెంట్! ఎంత హ్యాపీగా ఉందో చెప్పలేను. దిసీజ్ ది బెస్ట్ గిఫ్ట్ దట్ ఐ హావ్ గాట్!" అని చెప్పింది రంజని.

మరోసారి అందరి దగ్గరా సెలవు తీసుకుని కారెక్కింది రంజని.

– – – – – – –

ఇంటికి రాగానే అపార్ట్మెంట్ కార్పెంటర్ ను పిలిపించి కొలీగ్స్ ఇచ్చిన కృష్ణుని ఫోటోని టీవీ వెనుకవున్న గోడకు బిగించింది రంజని. అంతేకాదు ఎలెక్ట్రీషియన్ను పరుగెట్టించి రెండు స్పాట్ లైట్స్ తెప్పించి అలంకరించింది. వాటితో బాటే మంచి గంధపు చెక్కతో చేసిన దండను వేసింది. ఓసారి ఆ లైట్స్ వేసి గంధపు దండతో నిండుగా వెలుగుతున్న ఆ ఫోటో కేసి తృప్తిగా చూసింది.

“చాలా బాగుండాది మేడమ్! ఇట్లాంటి ఫోటో యాడా చూడ్లా!” అని అన్నాడు కార్పెంటర్.

గర్వంగా నవ్వింది రంజని. “అవును! ఇది చాలా రేర్ ఫోటో. అదృష్టం కొద్దీ నాకు దొరికింది.” అని అంటూ పర్స్ లోంచి వంద రూపాయలు తీసి ఇవ్వబోయింది.

“అయ్యెయ్యో! నూర్రూపాయలా? ఒక్క మేకు కొట్టినాను. చానా చిన్న పని. దేవుడి పనికి డబ్బులొద్దు మేడమ్! ఇట్లాంటి ఫోటోని ఎక్కడా చూడ్లా! మీ పున్నెమాని ఈయాల చూసినా. గొప్ప పున్నెమొచ్చిండాది నాకు. అది చాలమ్మగారు!” ఫోటోకు దండం పెడుతూ అన్నాడు కార్పెంటర్.

“నీకు పిల్లలున్నారా?”

“ఆ...ఉండారు మేడమ్. పెద్దది తొమ్మిదో తర్గతి. చిన్నోడు ఐదు.” అన్నాడు సంతోషంగా.

పర్సులోంచి ఇంకో వంద తీసింది రంజని.

“నాకు పిల్లల్లేరు. ఇదో చేరో వంద....నీ పిల్లలకి. వద్దనకు!” అని ఆ కార్పెంటర్ చెయ్యి లాక్కుని అందులోకి నోట్లను కుక్కింది రంజని.

పెద్దింటి అమ్మగారు తన చెయ్యి లాక్కుని డబ్బులిచ్చినందుకు మెలికలు తిరిగిపోయాడా వ్యక్తి.

“కన్నయ్య ఈ ఇంట్లోకి వచ్చినాడు. మీకు పిల్లలు తప్పక ఔతారు అమ్మగారు.” అని నిండు మనసుతో అన్నాడా నిరుపేద.

నవ్వింది రంజని.

ఆమెకు దండం పెట్టి, మరోమారు కృష్ణుని పటానికి దండం పెట్టి వెళ్ళాడు కార్పెంటర్.

సోఫాలో కూర్చుని ఆ ఫోటో వంకనే చూస్తూ కూర్చుండిపోయింది రంజని.

"*కన్నయ్య ఈ ఇంట్లోకి వచ్చినాడు. మీకు పిల్లలు తప్పక ఔతారు అమ్మగారు.*" — ఆ కార్పెంటర్ మాటలు ఆమె మనసులో ప్రతిధ్వనించాయి.

కృష్ణుడి వంక చూస్తూ — "ఏరా కన్నయ్యా! పిల్లల్ని ఇస్తావురా?" అని గట్టిగా అడిగింది

పటానికి అలంకరించిన గంధపు దండ కుడిభాగం వదులయిందేమో టక్కుమని జారింది.

అది శుభ శకునమో, అపశకునమో అర్థం కాలేదు రంజనికి. నిలువని మనసుతో వెంటనే విశ్వేశ్వర్ కు ఫోన్ చేసింది.

ఫోన్ తీసుకున్న విశ్వేశ్వర్ రంజని అనుమానాన్ని తీర్చాడు.

"చాలా శుభ శకునం మేడమ్! కృష్ణుడు మీకు వరమిచ్చాడు. ఇక నిశ్చింతగా ఉండండి. మరో పది నెలల్లో మీ ఇంట్లో కన్నయ్య దోగాడుతాడు."

రంజని ఆనందానికి పగ్గాల్లేకుండా పోయాయి. విశ్వేశ్వర్ కు అనేకమార్లు 'థాంక్స్' చెప్పి ఫోన్ పెట్టేసింది.

వెంటనే అనంత్ కు ఫోన్ చేసింది. ఎక్కడున్నాడో ఏమో ఫోన్ తీయలేదతను. మరోసారి చేసింది. తీయలేదు అనంత్.

విసుక్కోకుండా లేచి రాత్రికి వంట చేయడానికి సిద్ధమైంది రంజని.

– – – – – – –

"*తల్లి యశోదా తనయుడు నేనిక తలుపులు తియ్యవే భామా*

భామా తల వాకిలి తియ్యవే కొమ్మా

వాకిలి తీయమని వార్తలు తెలిపేవు
వచ్చిన మగవాడెవ్వరో సామి వచ్చిన మగవాడెవ్వరో

నా ముద్దుగుమ్మరో నిను పెండ్లాడిన
రామ కృష్ణులమే భామా రామ కృష్ణులమే భామా

రామ కృష్ణాదులకు రాతిరి వేళలో
వచ్చిన పని ఏమయ్యా రా కారణమేమయ్య

పచ్చని దవనము పరిమల గందము
నీ కంటా నేను తెస్తి భామా నేను నిను చూడాలని వస్తి కొమ్మా

పచ్చని దవనము పరిమల గందము నా కంట తెచ్చితే
నను చూడ వచ్చితే భామలకీపోవయ్య నువు భామలకీపోవయ్య

గండ బేరుండల మృగముల జంపితి
గాసి జెందితి భామా నేను గాసి చెందితిని కొమ్మా

గాసి తీర్చుటకు చెంచిత వున్నది
గరుడాద్రికి పోవయ్య నీవు శేషాద్రికి పోవయ్యా

*దానితో ఎక్కడ దారి తెలియదు*

*దారి చూపవే భామా నీవు దారి చూపవే కొమ్మా*

*రుక్మిణి యింటికి అటు ప్రక్కనున్నాది*

*దారి చూపితి పోవయ్యా నీవు దాపు చేరు కోవయ్యా"*

వంట చేస్తూ ఎప్పుడో బట్టీ పట్టిన కృష్ణ–సత్యభామల వాదులాటను వర్ణించే జానపద గేయాన్ని తనకొచ్చిన రాగాల్లో పాడుకుంటోంది రంజని.

మొబైల్ మోగడంతో కూనిరాగాన్ని ఆపి చూసింది. చేస్తున్నది అనంత్. గంట క్రితం తాను ఫోన్ చేసినట్టుగా అప్పుడు గుర్తొచ్చింది రంజని.

"హలో!"

"సారీ! ఇంపార్టెంట్ మీటింగులో ఉన్నాను. అందుకే తీసుకోలేదు." ఉపోద్ఘాతంగా అన్నాడు అనంత్.

"ఇట్స్ ఓకే డియర్! ఎప్పుడొస్తావ్!" అంది రంజని.

"ఏమో తెలీదు. బహుశా ఇంకో ఫైవ్ సిక్స్......" ఆగాడు అనంత్.

"వాట్! ఇంకో ఫైవ్ సిక్స్ అవర్సా?" అంది రంజని.

"నో.....నానో సెంకడ్స్ పట్టొచ్చు!" అన్నాడు అనంత్.

అర్థం కాలేదు రంజనికి – "ఏం మాట్లాడుతున్నావ్?"

"బూ....." అని వెనకాల గట్టిగా వినబడ్డంతో అదిరి పడింది రంజని.

"యూ...." అంటూ వెనక నిలబడివున్న అనంత్ మీదకు పోయింది రంజని. ఆమెను గట్టిగా వొడిసి పట్టుకున్నాడు అనంత్.

"ఛీ! దొంగలా ఇంట్లో దూరడానికి సిగ్గులేదా?" అంది రంజని.

“సిగ్గా! అంటే ఏంటబ్బా?” అన్నాడు అనంత్, కౌగిలి పట్టును బిగిస్తూ.

“నీకు లేనిది!” అంది రంజని అతని భుజాన్ని గిల్లుతూ.

“నాకు లేనిది, నీకు పోనిదీ సిగ్గన్న మాట. ఐతే మనకి ఫ్రెండ్షిప్ కుదర్దంటే కుదర్దుగా?”

“బేషరమ్! కుదుర్తుంది. అద్సరే నువ్వు లోపలికెప్పుడొచ్చావ్?” అంది రంజని అతని కౌగిలి నుంచి తప్పించుకుంటూ.

“నువ్వదేదో వాకిలి తియ్యీ అంటూ పాట పాడుతున్నావే...అప్పుడొచ్చాను.” అన్నాడు అనంత్.

“ఓహ్!” అంది రంజని.

“ఫోక్ సాంగా?”

“అలా పాడు భాషలో అడిగేకంటే జానపద గేయమా అని అడక్కూడదూ? ఎస్...చాలా తమాషా పాట. మళ్ళీ పాడనా” అంది రంజని.

“ఆకలి ముందు అన్నీ బలాదూర్లా ఉన్నాయ్. ముందు ఫుడ్డు. తర్వాతే ఫోక్ సాంగ్....సారీ....నీ జానపద గీతం!” అన్నాడు అనంత్

“అంతా రెడీగా ఉంది. తమరు దయచేయడమే ఆలస్యం.” అంది రంజని.

విజిల్ వేసుకుంటూ వెళ్ళాడు అనంత్.

– – – – – – –

అనంత్ కంటే త్వరగా భోజనం చేసిన రంజని, హాల్లోకి వచ్చి లైట్లు తీసేసి, కృష్ణుని ఫోటోకున్న స్పాట్ లైట్స్ మాత్రం ఉంచింది. తన ల్యాప్ టాప్ తెరిచి ఓ పాటను ప్లే చేయడానికి సిద్ధంగా ఉంచుకుంది.

చేతులు తుడుచుకుంటూ అనంత్ హాల్లోకి రావడం చూసి, టక్కున పాటను ప్లే చేసి, వేగంగా వెళ్ళి సోఫాలో కూర్చుంది రంజని.

*"పాట పాడుమా కృష్ణా – పలుకు తేనెలొలుకునటుల*
*మాటలాడుమా ముకుందా – మనసు తీరగా...ఆ...ఆ...ఆ"*

చీకటి – వెలుగు ఆ గదిలో ఆటలాడుకొంటుండగా సున్నితంగా మొదలైన ఆ గాత్రానికి, ఆ రాగానికి, సోఫాలో వయ్యారంగా కూర్చుని నవ్వుతున్న రంజనిని దంగైన అనంత్ "ఓహోయ్!" అన్నాడు.

*"శ్రుతిలయాదులన్నీ జేర్చి యతులు నిన్ను మదిని దలచే*
*సదమలహృదయా నిను సన్నుతించు వరనామము"*

అనంత్ పక్కన కూర్చోగానే అతని భుజం మీద తలను వాల్చింది రంజని. "ష్...మాట్లాడకు! కళ్ళు తెరిచి, నేరుగా చూస్తూ పాట విను!" అని గుసగుసగా అంది.

ఆమె చెప్పినట్టే నేరుగా చూసాడు. ఎదురుగా కొత్త ఫోటో.

అందులో ఆవు పొదుగు నుండి పాలను తాగుతున్న బుజ్జి కృష్ణుడు. అతని చేతిలో చిక్కిన లేగదూడ. "ఫెంటాస్టిక్!" అన్నాడు అనంత్. "ష్..." అంది రంజని. మారుమాటాడక మౌనం వహించాడు అనంత్.

*"సామవేదసారము సంగీతము సాహిత్యమెగా*
*దానికంత మధుగానము పాట కూర్చి పాడుమా"*

సాలూరి రాజేశ్వరరావు గాత్రం హొయలు పోతూ పలుకుతోంది.

"నాకు కృష్ణుడు కావాలి!" అంటూ అనంత్ ను తన మీదకు లాక్కుంది రంజని.

మాటలు అవసరంలేని స్థితి ఒకటి ఆ గదిని, దంపతుల్ని ఆవరించుకుంది.

★ ★ ★ ★ ★

“గుడ్లగూబను వదిలి మొసలిని చేరిందే!” అన్నాడు రవిశతతేజుడు, లక్ష్మీదేవి కదిపిన ఆమె మొదటి పావును చూస్తూ.

“అవును స్వామీ! ఈ కదలికలోని తత్త్వసారం మీరే బోధించాలి.”

“ఆహా_ _ _.నీవే చక్కగా సమన్వయం చేయగలవు. కొనసాగించు!” అన్నాడు పార్వతీశ వినుతుడు.

“యథామతి ప్రయత్నిస్తాను స్వామిన్! ఈ గడి ’గజేంద్రమోక్షా’న్ని, అందులోని తత్త్వసిద్ధాంతాన్ని తెలుపుతోంది. బుద్ధిహీనులై ఓ మహర్షిని ఆటపట్టించబోయిన హాహా, హూహూ గంధర్వులు శాపాల పాలై ఒకరు కరి గాను, మరొకరు మకరి గానూ జన్మించారు. ఒకనాటి మిత్రులు నేడు పరస్పర శత్రువులై పెనుగులాడుతున్నారు. ఎవ్వరూ తోడురాని నిస్సహాయ స్థితిలో ’కావవే వరదా! సంరక్షింపు భద్రాత్మకా!’ అని మొరబెట్టిందా ఏనుగు. అప్పుడు_ _ _.”

“నీకున్ జెప్పక బయల్దేరానని కించిత్ కినుకా!” అన్నాడు నగధరుడు.

మనోజ్ఞంగా నవ్వింది మంజులభాషిణి.

“ఎంత మాట! భక్తులపై మీకున్న అనురాగాన్ని అనుక్షణం ప్రత్యక్షంగా దర్శించే భాగ్యం నాది. ఇది అందరికీ లభించేనా?” అని చేతులు జోడించింది.

“కొనసాగించు_ _ _” అన్నాడు కువలయ మర్దనుడు.

“అప్పుడు_ _ _సిరికిన్జెప్పక మీరు కదిలారు. మకరిని చంపి కరిని రక్షించారు.”

“ఈ కథ అందరికీ తెలిసినదే. ఇందులో తత్త్వ రహస్యమేమున్నది ప్రియా?” అన్నాడు చతుర్యుగమూర్తి.

“దీనుల ఉద్ధారార్థమై అలా అడుగుతున్నారు గానీ మీకు తెలియని రహస్యమున్నదా? వివరిస్తాను. మిమ్మల్ని రప్పించింది ఏనుగు. కానీ మొదటగా శాపవిముక్తమైనది మొసలి. మీ దాసుల కంటే దాసానుదాసులని మీరు త్వరగా ఉద్ధరిస్తారు. అందులోనూ ఆ మొసలి మీ దాసుడైన ఏనుగు యొక్క పాదాల్ని పట్టుకుంది. అంటే శరణుజొచ్చిందనేగా? అందువల్ల మీ దాసుడి పాదదాసుడైన మొసలిని

మొదటగా అనుగ్రహించారు. ఆ తర్వాతే కరిని కాపాడారు. కనుక 'తద్దాస దాస దాస కిం న దదాసి పుంసః' అన్నట్టు తల్లిదండ్రుల్ని, పెద్దల్ని, పండితుల్ని, జ్ఞానుల్ని ఇతోధికంగా సేవించే వారే మీ సత్వరానుగ్రహానికి పాత్రులౌతారు. ఇదే గజేంద్ర మోక్షంలోని తత్త్వ రహస్యం!" అంది హేమాంబర కంఠీరవ మణిగణ ధారిణి యైన లక్ష్మి.

"అద్భుతం! నిగూఢ రహస్యాన్ని సులలితంగా వివరించావు దేవీ. వేదపీఠవైన నీ అనుగ్రహానికి గురైన వారికి ఈ తత్త్వద్యోతనం అత్యంత సులభం." అన్నాడు పురహరనుతుడు.

"ధన్యోస్మి! మరి మీ రెండో పావును నడపండి. అది తలుపబోయే ఉపదేశామృత్తాన్ని ఆస్వాదించాలని మనసు ఉవ్విళ్ళూరుతోంది." అంది తామరసాంబక.

"అలాగే!" అంటూ పాచికల్ని కదిపాడు దైత్యమత్తేభ దమనుడు.

ఆయన వేసిన పాచికలు కరి–మకరి పెనుగులాటలో పోటెత్తిన కోనేటి నీటి సవ్వడిలా హోరుమన్నాయి.

★ ★ ★ ★ ★

తెల్లవారుజామున ఐదు గంటలౌతోంది.

కేశవశర్మ ప్రాతఃకాలపు దైవపూజలో లీనమైవున్నాడు. సుమతి అతనికి దగ్గర్లో కూర్చొని ఏవో శ్లోకాలు చెప్పుకుంటోంది.

ఇంతలో బైట హటాత్తుగా గలభా చెలరేగింది.

సుమతి శర్మ వైపుకు చూసింది. అతను చలనం లేకుండా మంత్రాలు చెప్పుకుపోతున్నాడు. ఆమె కూడా తన ఏకాగ్రతను నిలుపుకునే ప్రయత్నం చేసింది.

కొద్దిక్షణాల్లో బైటి గొడవ మరింత అధికమైంది. ఈసారి సుమతికి అపర్ణ గొంతు గట్టిగా అరుస్తున్నట్టుగా వినబడింది.

అపర్ణ గొంతు వినబడ్డంతో మనసు నిలపలేకపోయింది సుమతి. నెమ్మదిగా లేచి ముందుగది తలవాకిలి దాకా వచ్చి చూసింది. గొంతులు తప్ప వ్యక్తులేవరూ కనబడలేదు. “బైటకెళ్ళడమా? ఇక్కడే ఆగడమా!” ఒక్క క్షణం ఆలోచనలో మునిగింది సుమతి. ఓసారి పూజాగది వైపుకు చూసింది.

ఉన్నట్టుండి ’దభీ’మని ఏదో పడ్డ చప్పుడైంది. ఆ వెంటనే అపర్ణ గట్టిగా అరవడం వినబడింది. ఆందోళన విపరీతంగా పెరగడంతో ఆగలేకపోయింది సుమతి. అపర్ణకేమైందోనన్న భయం ఆమెను బలంగా చుట్టుకుంది. జాగ్రత్తగా మెట్లు దిగి అపర్ణ ఇంటి వైపుకు అడుగులు వేయసాగింది. వేకువజాము మసక వెలుతురులో ఎగుడు దిగుడుగా ఉన్న ఆ నేలపై త్వరత్వరగా నడవడానికి భయపడుతూ అడుగులు వేస్తోంది సుమతి.

ఏదో పడినట్టు, ఆ వెంటనే వినబడ్డ అపర్ణ అరుపు తర్వాత మరే చప్పుడూ రాకపోవడంతో సుమతికి గాభరా పెరగసాగింది.

ఉపాధ్యాయ ఇంటి ముందున్న బయల్లోకి వచ్చిన సుమతి అక్కడి పరిస్థితిని చూసి “ఏమండీ!” అని గట్టిగా కేకవేసింది.

నేల మీద పడిపోయివున్న అపర్ణ తలపై బండరాయిని వేయబోతున్న ఆ ఆగంతకుడు సుమతి అరుపుకు వెనక్కు తిరిగాడు. వాడిని చూసి మరోసారి గట్టిగా కేకవేసింది సుమతి. ఈసారి ఆవిడ భర్తను పిలవలేదు – “భగవాన్!” అని అరిచింది.

అనుకోకుండా వచ్చిన సుమతిని చూసి పాలుపోని ఆగంతకుడు రాయిని పక్కన పడేసి పారిపోజూసాడు. కానీ మోకాళ్ళ మీద పడ్డ కఱ్ఱ దెబ్బకు నేల మీద బోర్లా పడ్డాడు. సుమతి విహ్వలంగా కళ్ళు చిట్లించి చూసింది.

చేతిలో కఱ్ఱ పట్టుకున్న ఆకారమొకటి సుమతికి ఎదురుగా వచ్చింది.

“ఎవరది? ఎవరది?” అని అరిచింది సుమతి. ఆ వెనువెంటనే “ఏమండీ!” అని మరోమారు కేకవేసింది.

కింద పడిన వ్యక్తి లేవబోయాడు. ఆ ఆకారం మరోమారు కర్రతో వాడి నెత్తిన ఒక దెబ్బ వేసింది. "అమ్మా!" అంటూ మళ్ళీ నేల మీద పడ్డాడు. ఆగకుండా వాడి వీపు మీద దెబ్బల వర్షాన్ని కురిపిస్తోంది ఆ ఆకారం. వాడి వీపు మీద కర్ర తాకిడికి పుట్టుకొస్తున్న చప్పుడుతో బాటూ "అమ్మా! అమ్మా! అమ్మా!" అంటున్న ఆగంతుడికి అరుపూ చేరి సుమతికి విపరీత భీతిని కలిగించాయి. నేల మీద నిశ్చలంగా పడివున్న అపర్ణను చూస్తుంటే సుమతిలో మరింత భయం చెలరేగింది.

విపరీతమైన ఒత్తిడికి గురైన ఆమెకు కళ్ళు తిరిగినట్టువుతోంది. దేహం అటునిటు తూలుతున్నట్టుగా అనిపించసాగింది. నేల మీదకి కూలబోతున్న సమయంలో కర్ర పట్టుకున్న ఆ అపరిచిత ఆకారంతో బాటూ మరో తెలిసిన మొహం చెరో వైపు పట్టుకోవడం చూసి– "సోమక్కా!" అని మాత్రం అనగలిగి కళ్ళు మూసింది సుమతి.

ఈలోపు చుట్టుపక్కలవాళ్ళు అక్కడికి పరుగెట్టుకొచ్చారు.

"సుమతీ!" అని పిలుస్తూ పరుగుపరుగున వచ్చాడు శర్మ.

– – – – – – –

సుమతి కళ్ళు తెరచి చూసింది.

పక్కనే శర్మ ఉన్నాడు. సోమక్క కూడా నిలబడుంది. ఆ అమ్మాయి పక్కన మరో వ్యక్తి నిలబడివున్నాడు.

ఒకసారి వాళ్ళందరినీ కలయజూసిన సుమతి, శర్మ వైపు చూసి "అక్క ఎక్కడ? ఎలావుంది?" అని హీన స్వరంతో అడిగింది.

"ఏం కంగారుపడకు సుమతీ! ఆమె క్షేమంగా ఉంది. ఈయన మోహన్రావు గారు! ఈ అమ్మాయి...." శర్మ పూర్తి చేసేలోగా "సోమక్క!" అని అంది సుమతి.

"ఈ అమ్మాయి నీకు తెలుసా?" అన్నాడు శర్మ.

ఔనన్నట్టుగా తలూపింది సుమతి.

"మోహన్రావు గారే ఆ దొంగను పట్టుకుంది. వీరు సోమక్క తండ్రిగారు!" అన్నాడు శర్మ.

నమస్కారం చేసింది సుమతి. ఆయన వారిస్తున్నట్టుగా రెండూ చేతుల్నీ చూపుతూ "నువ్వు బాగా టెన్షన్ పడినట్టున్నావమ్మా! రెస్టు తీసుకో. నేను సాయంత్రం ఆఫీసునుంచి వచ్చాక ఇటొస్తాను." అని సుమతితో చెప్పి "శర్మగారూ! నేను ఆఫీసుకెళ్ళగానే డాక్టరుగారిని నా వెహికల్లో పంపిస్తాను...అమ్మాయిని చూడ్డానికి! అసలే ఒట్టి మనిషి కూడా కాదాయే! ఎలాంటి రిస్కూ తీసుకోకూడదు!" అని అన్నాడు మోహన్రావు.

కుర్చీలో నుండి లేచిన శర్మ రెండు చేతులూ జోడించి "అలాగేనండీ! సరైన సమయానికి వచ్చి వీళ్ళిద్దరినీ కాపాడారు. అందుకు ఎంత కృతజ్ఞత చెప్పినా సరిపోదు." అన్నాడు,

"అంతా దేవుడి దయ! మరి ఉంటాను. పదవే పిచ్చిదానా!" అంటూ సరదాగా విసుక్కొంటూ సోమక్క చేయి పట్టుకున్నాడు మోహన్రావు. సోమక్క అతని చేయి విడిపించుకుని "నేన్రాను పో" అని సుమతి పడుకున్న మంచంపైకి ఎక్కింది.

"ఇక్కడే ఉండనివ్వండి!" అని అభ్యర్థించింది సుమతి.

నవ్వుతూ సోమక్క తలను నిమిరి, శర్మకు మరోమారు జాగ్రత్తలు చెప్పి వెళ్ళిపోయాడు మోహన్రావు.

– – – – – – –

ఆరోజు వంటావార్పూ శర్మనే పూర్తి చేసాడు.

సుమతితో బాటు అపర్ణకు కూడా సపర్యలు చేసాడు. అతనికి సోమక్క సహాయపడింది.

ఒద్దికగా చెప్పిన పని చేసిన ఆ అమ్మాయిని కన్నతండ్రి కూడా పిచ్చిదానిగా జమకట్టి పిలుస్తున్నందుకు ఆశ్చర్యపడ్డాడు.

కార్యక్రమాలకని పొరుగూరు వెళ్ళిన ఉపాధ్యాయ సాయంత్రానికి ఇంటి కొచ్చి జరిగిన సంఘటన విని తల్లడిల్లిపోయాడు. ముందస్తుగానే శర్మ హెచ్చరించడంతో అపర్ణను గానీ, సుమతిని గానీ ఎక్కువ

వివరాల్ని అడగకుండా ఆగాడు. రాత్రికి రెండిళ్ళ మధ్యనున్న ఆరుబయల్లో శర్మతో మాట్లాడుతూ కూర్చున్నాడు ఉపాధ్యాయ.

"మీ ఇంటి బైటపెట్టిన ఇత్తడి గంగాళాన్ని ఎత్తుకుపోవాలని తెల్లవారుజామౌతున్నా తెగించి వచ్చాడా దొంగ. బహుశా మీరు ఇంట్లో లేరన్న సంగతి వాడికి తెలుసు కాబోలు. ప్రొద్దున్నే అపర్ణగారు తులసికోట ముందు ముగ్గెయ్యడానికి బైటికి రావడం, వాడూ అక్కడే ఉండడం అనుకోకుండా జరిగింది. నేను పూజలో ఉంటే, సుమతికి శబ్దాలు వినబడి ఇక్కడకొచ్చింది. అప్పుడా దొంగ అపర్ణ గారిని కిందకు తోసేసి తలపైన బండరాయితో కొట్టబోతున్నాడు....."

"శివ శివా!" అన్నాడు ఉపాధ్యాయ.

"అది చూసిన సుమతి గట్టిగా అరిచింది. అటుగా వెళ్తున్న మోహన్రావు గారు ఆడవాళ్ళ కేకలు విని చేతికందిన కర్రను పట్టుకుని ఆ దొంగను ధైర్యంగా ఎదుర్కొన్నారు. ఆయన రావడంతో ఎన్నో ప్రమాదాలు తప్పాయి." అన్నాడు శర్మ.

"నిజమే! కానీ మోహన్రావు ఇల్లు అవతలి వీధిలో ఉంది. అంత పొద్దున ఇక్కడికెందుకొచ్చాడో?" అన్నాడు ఉపాధ్యాయ.

"నిజానికి ఈరోజు పొద్దునదాకా ఆయనెవరో, ఇల్లక్కడో కూడా నాకు తెలీదు. ఆయన చెప్పిన దాని ప్రకారం వాళ్ళమ్మాయి సోమక్క తెల్లవారుజామునే లేచి పిచ్చి కేకలేస్తూ గొడవ గొడవ చేసిందట. రావుగారి భార్య కొట్టబోయేసరికి పరుగెట్టిందట. భార్య కేకలు విని నిద్రలేచిన రావుగారు అమ్మాయిని పట్టుకోవడానికి వీధిలోకి వచ్చారట. ఆ అమ్మాయి ఆగకుండా పరుగెట్టి సరిగ్గా మీ ఇంటి ముందు ఆగిందట. అమ్మాయిని పట్టుకుని ఆయన వెళ్ళబోతుండగా సుమతి అరుపులు విని లోనికొచ్చారు. అదీ సంగతి!" అన్నాడు శర్మ.

“ఆశ్చర్యం! బారెడు పొద్దెక్కే దాకా నిద్రలేవని ఆ పిచ్చిది పెందరాళే లేవడమేమిటి? మా ఇంటి దాకా పరుగెత్తి రావడమేమిటి? ఇన్నేళ్ళుగా లేని దొంగతనం ఈ ఇంట్లో జరగబోవడమేమిటి? భగవంతుని సంకల్పం కాకపోతే!” అని నిట్టూర్చాడు ఉపాధ్యాయ.

ఇక చెప్పడానికేమీలేనట్టుగా మౌనం వహించాడు శర్మ.

కాసేపటి తర్వాత వెళ్ళిపోయాడు ఉపాధ్యాయ.

– – – – – – –

లోనికొచ్చిన శర్మ నిద్రపోకుండా ఆలోచిస్తున్న సుమతిని చూసి, ఆమె వైపుకొచ్చాడు. మంచం చివరన కూర్చుని ఆమె చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుని నిమరసాగాడు.

కాసేపటి మౌనం తర్వాత – “ఏమండీ! సోమక్క లేకపోయుంటే నేను, అపర్ణాక్క చచ్చిపోయేవాళ్ళమే!” అంది.

అంగీకరిస్తున్నట్టుగా నిట్టూర్చాడు శర్మ.

“సోమక్కకి నిజంగా పిచ్చేనంటారా? పాపం, చూడ్డానికి లక్షణంగా ఉంటుంది. కానీ…” అని ఆగింది సుమతి.

“ఆ పిల్లకి ’సోమక్క’ అన్న చిత్రమైన పేరెందుకు పెట్టారో?” ఆశ్చర్యంగా అన్నాడు శర్మ.

“నాకూ విచిత్రంగా అనిపించింది. ఆ పేరు ఆ పిల్ల నానమ్మ పేరట!” అంది సుమతి.

“ఆహా…” అన్నాడు శర్మ.

“పాపం ఆ అమ్మాయిని చూస్తే నాకు చాలా బాధేస్తుంది. ఇప్పుడంటే చిన్నపిల్ల. పెరిగి పెద్దదైతే ఎంత కష్టం! ఇంతకీ అమ్మాయి అలా కావడానికి కారణమేమిటంటారు? ఇలాంటివారిని భగవంతుడు కాపాడడా?”

“అమ్మాయి అలా వెర్రిగా ప్రవర్తించడానికి వైద్యపరమైన కారణాలేవో ఉండుంటాయి. మంచి డాక్టర్ కు చూపిస్తే మేలేమో!”

“నేను శాస్త్రమేమి చెబుతోందో తెలుసుకోవాలనుకున్నాను.”

దీర్ఘంగా నిట్టూర్చాడు శర్మ. “తెలుసుకుని ఏం చేస్తావ్? ప్రారబ్ధ కర్మల్ని మనం మార్చలేం!”

“దేవుడు కరుణాసముద్రుడు కదా! మనం మరొకరికి మంచి జరగాలని కోరుకుంటూ ప్రార్థిస్తే ఆ కోరికను తీర్చడా? ఈరోజు సోమక్కే లేకపోతే నేనూ, అపర్ణక్కా చచ్చిపోయేవాళ్ళమేగా! ఆ అమ్మాయి చేత మనకు ఇంత మేలు చేయించిన భగవంతుడు మన వల్ల ఆమెకు మేలు చేయించడా? పరదుఃఖ దుఃఖిత్వం సజ్జనుల లక్షణమని మీరు ఎన్నోసార్లు చెప్పారు. సోమక్క పిచ్చిదే! ఈరోజు తను చేసిన సహాయాన్ని మనమెంత పొగిడినా కూడా అర్థం చేసుకోలేని పిచ్చిది. పొగడ్తలే అర్థంకాని ఆ పిచ్చిది మన దుఃఖాన్ని ఎలా అర్థం చేసుకుంది? మనల్ని ఎలా కాపాడింది? అలాంటి పిచ్చమ్మాయి మనల్ని కాపాడగాలేంది అన్నీ తెలిసుకున్నామన్న మనం ఏమీ చేయలేమా? శాస్త్రం ఇలాంటి వారి గురించి ఏమీ చెప్పదా? చెప్పండి!” – కొద్దిపాటి ఆవేశంతో గబగబా మాట్లాడింది సుమతి.

శర్మ నవ్వాడు.

ఆ నవ్వు ఎగతాళితో కూడింది కాదు. తాను బోధిస్తున్న విషయాల పట్ల తనకే ఎంత నమ్మకముందోనని పరీక్ష చేస్తున్న శిష్యుణ్ణి చూసి గురువు వాత్సల్యంతో నవ్వే నవ్వులాంటిదది.

సుమతి చేతుల్ని గట్టిగా పట్టుకుని “శాసనాత్ శంశనాత్ చైవ శాస్త్రం ఇత్యభిధీయతే! ఏదైతే కఠిన నియమాల్ని విధిస్తుందో కానీ సుఖాన్ని ఇస్తుందో దాన్నే శాస్త్రమని పిలిచారు పెద్దలు. తల్లిదండ్రులు తమ పిల్లల్ని సంతోష పెట్టడం వేరు. హితవు చెప్పడం వేరు. బిడ్డకు మిఠాయిని కొనివ్వడం సంతోషం పెట్టడం క్రిందకు వస్తుంది. ఆ మిఠాయిని మరోమారు తినడానికి బిడ్డ డబ్బులు దొంగిలిస్తే అప్పుడు శిక్షతో బాటూ చెప్పే మంచిమాటల్ని హితోపదేశం అంటారు. ఆ హితోపదేశాన్ని నమ్మి ఆచరించిన వాళ్ళు ఎన్నటికీ చెడరు. మన శాస్త్రం కూడా అంతే! అది మనల్ని సంతోషపెట్టదు. కానీ హితవు బోధిస్తుంది. ఆ

హితవుని వంటబట్టించుకున్నవారు ఎన్నటికీ దారి తప్పరు. మంచి పనులకి శాస్త్రం ఎప్పుడూ అండగా ఉంటుంది.” అన్నాడు శర్మ.

“ఐతే చెప్పండి! సోమక్క బాగుపడాలంటే ఏం చెయ్యాలి?” — శర్మ మాటల్తో నమ్మకం పెరిగిన సుమతి చప్పున అడిగింది.

“ఆ పేరు మోహన్రావుగారి తల్లిగారిది కదూ!”

“అవును!”

“అమ్మాయి పేరు మారిస్తే మేలేమో!”

“పేరు మార్చాలా? సోమక్క పిచ్చికి, పేరుకీ సంబంధముందా?” — ఆశ్చర్యంగా అడిగింది సుమతి.

“ఇతమిత్థంగా చెప్పలేను గానీ, పేరు మారిస్తే ఫలితముండొచ్చు!”

“కాస్త వివరంగా చెప్పరూ!”

“సుమతీ! మన తల కాకుండా మరో మూడు తలల వెనుకనున్న వాళ్ళ పేర్లని మన పిల్లలకు పెట్టకపోవడం మంచిదన్న ఓ నమ్మకం వాడుకలో ఉంది. ఉదాహరణకు, మోహన్రావు గారు తమ తల్లి ఆబ్దీకం చేస్తున్నప్పుడు తన కూతురి పేరునే వాడాల్సి వస్తుంది. ఇందులో మనకు అభ్యంతరాలేవీ లేకపోయినా శాస్త్రరీత్యా అంత మంచిది కాదని కొద్దిమంది విద్వాంసులు చెప్పగా విన్నాను. అందులో సత్యముందని నేనూ నమ్మేవాణ్ణి. ఈ అమ్మాయిని చూసాక నా నమ్మకం బలపడింది. కాబట్టి అమ్మాయి పేరును మార్చడం ఉత్తమం!” అన్నాడు శర్మ.

ఆలోచనలో పడిన సుమతి — “చరిత్రలో తాత పేరో, ముత్తాత పేరో పెట్టుకున్న రాజులు చాలామంది దొరుకుతారు కదండీ! వెయ్యి, రెండువేల ఏళ్ళ క్రితం సాంప్రదాయాలు ఇప్పటి కంటే బలంగా ఉండేవి కదా! అప్పుడెలా సాధ్యమైంది?” అంది,

మళ్లీ నవ్వాడు శర్మ – "చరిత్రను వదిలి పురాణాల్ని చూడు. ఇక్ష్వాకు వంశంలో పుట్టిన నూటా అరవై మంది రాజులకూ ప్రత్యేకమైన పేర్లే ఉన్నాయి. తాత ముత్తాతలపై అభిమానంతో దశరథుడు తన నలుగురి కొడుకుల్లో ఒక్కరికీ ఆ పేర్లు పెట్టలేదు. అన్ని అక్షరాలకూ అధిదేవత ఐన నారాయణుడు కూడా రఘువంశోత్తముడిగానే ప్రఖ్యాతి చెందాడు గానీ రఘు మహారాజు పేరును పెట్టుకోలేదు. అలాగే రాక్షస వంశాల్నీ తీసుకో! ప్రహ్లాదుడి కొడుకు, మహా విష్ణుద్వేషీ ఐన విరోచనుడు కూడా తన కొడుకుకు బలి అన్న పేరే పెట్టాడు గానీ తాతలూ, తనలాగే విష్ణుద్వేషులైన హిరణ్యాక్ష, హిరణ్యకశిపుల పేర్లు పెట్టలేదు. ఎందుకంటావ్?" అన్నాడు.

అంగీకరిస్తున్నట్టుగా తలనాడించింది సుమతి.

"ఇంత మంచి విషయాన్ని వాళ్ళకి చెప్పాలి. మోహన్రావు గారు భార్యతో పాటూ వస్తానని చెప్పారుగా! వాళ్ళు వచ్చినప్పుడు మీరు తప్పక చెప్పండి!" అంది సుమతి.

"చూద్దాం!" అన్నాడు శర్మ.

చెబుతానని శర్మ ఖచ్చితంగా అనకపోవడంతో తాము చెబితే మోహన్రావు వాళ్ళు నమ్ముతారో, నమ్మరోనన్న శంక రేకెత్తి మౌనం వహించింది సుమతి.

– – – – – – –

అ సాయంత్రం భార్య రామలక్ష్మితో సహా వచ్చాడు మోహన్రావు.

మొదట అపర్ణ, ఉపాధ్యాయల్ని పరామర్శించి అటుపై శర్మ ఇంటికి వచ్చారా దంపతులు.

సుమతిని చూడగానే సంతోషంతో ఉప్పొంగిపోయింది రామలక్ష్మి. లక్షణంగా, సాంప్రదాయంగా ఉండే యువతులు కరువైపోయిన ఈరోజుల్లో ఇలాంటి అమ్మాయి కనబడ్డం అదృష్టమని పొగిడింది. ఔనౌనని తనూ గొంతు కలిపాడు మోహన్రావు.

“మా అమ్మాయికి జడేసి పంపావ్ చూడూ! అప్పటి నుండీ నిన్ను చూడాలని అనుకుంటూనే ఉన్నానమ్మాయ్! ఇప్పుడు, ఇలా కుదిరింది. నువ్వు నాకంటే చిన్నదానివి, పైగా నా రెండో చెల్లలికంటే కూడా చిన్నదానివి, అందుకనే ఇంత చనువూ తీసేసుకొని ఏకవచనంలో పిలిచేస్తున్నా. ఏమనుకోకు. పైగా చిన్నవాళ్ళని పెద్దవాళ్ళు బహువచనంలో పిలిస్తే ఆయుక్షీణం కూడానూ! ఒక్కచోట కూడా కుదురుగా కూర్చోని ఈ పిచ్చిది నీ దగ్గర ఒద్దికగా ఉంటోదంటే విచిత్రమేనమ్మాయ్! నా చేత్తో ఒక్కపూట కూడా జడేయించుకోలేదీ వెర్రిఘటం. అట్లాంటిది నువ్వు రోజూ వేసి పంపిస్తున్నావాయే! జడ ఎవరేసారే అంటే పక్కవీధి అమ్మ వేసిందని చెబుతుంది. ఏ జన్మలోని ఋణానుబంధమో కాకపోతే ఈ పిచ్చిదేమిటీ, తనంత తానుగా నిన్ను అమ్మా అని పిలవడమేమిటీ!ఆ ఆ...” — అంటూ గలగలా మాట్లాడేస్తోంది రామలక్ష్మి.

ఆమె వాగ్ధాటికి మిగిలిన ముగ్గురూ మౌనప్రేక్షకులే అయ్యారు.

మధ్యమధ్యలో శర్మ వైపుకు చూస్తూ “వీలు చేసుకుని చెప్పేయండీ!” అన్నట్టు కనుసైగలు చేసింది సుమతి. “ఆగ”మన్నట్టుగా చూసాడు శర్మ.

“ఇక వస్తా”మంటూ రామలక్ష్మి లేవడంతో హతాశురాలైంది సుమతి. మధ్యలో ఎన్నో అవకాశాలు వచ్చినా శర్మ నోరు విప్పి చెప్పకపోవడంతో ఆమె దిగులు చెందింది.

మంచం మీది నుంచి లేచి గూట్లోని కుంకుమ భరిణె తీసుకుని రామలక్ష్మికి ఇస్తూ — “సోమక్క గురించి మావారేదో....” అని చెప్పబోతుండగా...

“అవునమ్మాయ్! మీ ఆయన మాకంతా చెప్పారు. మావారికి ఏదో జపం చెయ్యమని కూడా చెప్పారు. ఏమండోయ్! రేప్పొద్దున్నుండే మొదలెట్టాలి మీరు. మర్చిపోకండి! మీరు రోజూ చెప్పుకొనే సహస్రనామం పుస్తకంలోనే శర్మ రాసిన శ్లోకాన్నుంచాను. ఆ కాగితాన్ని పారేసుకోకండి. ముందువారంలో మా కులదైవం బెజవాడ కనకదుర్గమ్మ దగ్గరకెళ్ళి దీని పేరును మారుస్తాం. అయ్యో మతిమరుపు మండా! ఆ పేరేదో నువ్వు చెబితేనే బాగుంటుందని అనుకొనే నేనూ వచ్చా. అసలు సంగతే మర్చిపోయా. సమయానికి గుర్తు చేసావ్. మంచిపేరొకటి నువ్వే చెప్పమ్మాయ్! పెట్టేస్తాం! నువ్వు చక్కటి

కొడుకును కన్నాక నేనొచ్చి నామకరణం చేస్తా. చెల్లుకు చెల్లైపోతుంది. ఏమంటావ్?" అంటూ జోరుగా నవ్వేసింది రామలక్ష్మి.

ఆ జలపాతపు మాటలకు అవాక్కవడం సుమతి వంతైంది.

వాళ్ళు వెళ్ళిపోయాక శర్మ వైపుకు చూసింది సుమతి.

"మధ్యాహ్నం నువ్వు గుర్రుపెట్టి నిద్రపోతున్నప్పుడు వాళ్ళింటి కెళ్ళాను. అమ్మాయి జాతకం కూడా చూసాను." సంక్షిప్తంగా అన్నాడు శర్మ.

చటక్కున వంగి అతని కాళ్ళకు దండం పెట్టబోయింది సుమతి.

ఆమెను మధ్యలోనే ఆపి పైకి లేపాడు శర్మ.

*"ప్రేయసి ప్రేమలోన కనిపించెడి తీయని స్వర్గ మొక్కటే*

*ధ్యేయము కాదు, హీను లతిదీనులు మ్లానతనుల్ దరిద్ర నా*

*రాయణు లేడ్చుచుండిరి, తదశ్రువులన్ దుడువంగపొమ్ము నీ*

*ప్రేయసితోడ, నీ కట లభించును కోట్లకొలంది స్వర్గముల్!"*

★ ★ ★ ★ ★

"స్వామీ! మాయాశక్తి నుండి ముందుకు కదలి పరాశక్తి అనబడే నూటా ఇరవైమూడవ గడిని చేరింది మీ రెండో పావు. తదుపరి వివరణ మీ చిత్తం!" అంది చిత్తజ జనని ముకుళిత హస్తాలతో.

జగదంబ అయినా కూడా సడలని వినయాభరణ భూషితురాలైన లక్ష్మిని చూసి హసన్ముఖుడయ్యాడు అనేకగుణసన్మణి ఐన నారాయణుడు.

"దేవీ! ఈ పరాశక్తి మాయాశక్తి నుండి భిన్నమైనది. నా మాయ బంధకశక్తి ఐతే నా పరాశక్తి మోచక శక్తి. అంటే బంధాల నుండి విడిపించే అమోఘశక్తి."

“ప్రభూ! పరా అంటే అర్థమేమిటి?”

“సాధారణార్థంలో పరా నాశనం చేసేదని అర్థం. అశాశ్వత సుఖాలను కోరుకునే పాంచభౌతిక దేహాన్ని నాశనం చేయడమంటే మోక్షమనేగా అర్థం! “

“అవును స్వామీ!”

“పరా అనేది ఒకానొక నాదరూపమైన వర్ణం.”

“అంటే?”

“జీవులు తాము తెలుసుకున్న విషయాన్ని ఇతరులకు చెప్పే క్రమంలో మాట్లాడేందుకు ప్రయత్నిస్తారు. అలా శబ్దోచ్చారణ చేయడానికి చేతనులు (జీవులు) పూనుకున్నప్పుడు మొదటగా మనసు ప్రేరేపింపబడుతుంది. అలా ప్రేరేపితమైన మనసు నాభి (బొడ్డు) వద్ద ఉండే మూలాధారం లోని గాలిని కదిలిస్తుంది. అలా చలిస్తున్న గాలి అతి సూక్ష్మమైన నాదాన్ని ఉత్పత్తి చేస్తుంది. అత్యంత సూక్ష్మమైన ఈ నాదానికి ’పరా’ అని పేరు. ఈ నాదం హృదయం వరకూ చేరి ’వైఖరీ’ అన్న పేరుతో అర్థవంతమైన శబ్దంగా మారుతుంది.”

“నీ వైఖరి బాగోలేదని మానవులు పరస్పరం నిందించుకోవడం అర్థరహితమైన మాటలను పలకడం వల్లనేనా స్వామీ?”

’అవునం’టూ నిశ్శబ్దంగా నవ్వాడు నారాయణుడు.

“అమోఘమైన ఉపదేశం! ఈ ఉపదేశామృతానికి కారణమైన మీ రెండో ఆటకాయ ధన్య చరిత.” అంది రమణీమణి రుక్మిణి.

“నీ అమృత హస్తాలతో నడిపి నీ రెండో ఆటకాయను కూడా ధన్యతను పొందేట్టుగా చెయ్యి!” అన్నాడు తాపసజనప్రియుడు.

“నమోన్నమః” అంటూ పాచికల్ని వేసింది శ్రీపాదార్చకురాలు.

ఆమె నడిపిన పాచికలు హిరాణ్యాక్షుడి చెర వీడి, వరాహస్వామి భుజాన్ని చేరిన భూదేవి ఆనందభరిత నిట్టూర్పుల్లా ధ్వనించాయి.

★ ★ ★ ★ ★ ★

తన వ్యాపారాన్ని పెంచుకోవడం కోసం వినోద్ దూబే సహాయంతో ఇంటికి దగ్గరలోనే ఓ చిన్న ఆఫీస్ ను ఏర్పాటు చేసుకున్నాడు అనంత్. రోజువారీ పనుల్ని చేయడానికి ముగ్గురు ఉద్యోగుల్ని తీసుకుని, బిజినెస్ డెవెలప్మెంట్ ను అనంతే చూసుకోసాగాడు.

తన ఉద్యోగుల్ని అభిమానంగా చూసుకోవడంతో వాళ్ళు కూడా శక్తివంచన లేకుండా అతనికి సహాయం చేయసాగారు. నిజానికి ఇది రంజని ఇచ్చిన సలహా. సాంకేతిక నైపుణ్యం, చక్కటి మాటతీరుతో బాటు ఉద్యోగుల సంపూర్ణ సహకారం ఉండడంతో అనంత్ కంపెనీ పెద్ద పెద్ద అడుగుల్ని వేయసాగింది.

ఆరు నెలలు తిరిగేసరికి ముగ్గురు ఉద్యోగులు కాస్తా పదిహేనుమంది అయ్యారు. ఒక్క సర్వీస్ నుండి ఐదు విధాలైన సర్వీసుల్ని అందించే స్థాయికి చేరుకున్నాడు అనంత్. ఇప్పుడు అతని దృష్టి ముకుల్ కంపెనీ మీద ఉంది. ఒకప్పుడు తన నక్కజిత్తుల్తో అవమానం చేసి పంపిన ముకుల్ ను వ్యాపరపరంగా దెబ్బ కొట్టాలన్న తహతహ అనంత్ లో అంతులేకుండా పెరిగిపోతుంది. తన కంపెనీ దాటుతున్న ఒక్కో మైలురాయి అతనిలో పంతాన్ని పెంచుతోంది. ఓసారి యథాలాపంగా రంజనితో ఈ మాటనన్నప్పుడు “ఇలాంటి వెర్రిపనులేవీ చెయ్యకు. జస్ట్ నీ దారేదో నువ్వు చూసుకో!” అని అంది. మొదటికంటే ఇప్పుడు రంజని మాటలకు చాలా విలువనిస్తున్నా ఎందుకో అనంత్ కు ముకుల్ ను ఓ దెబ్బ కొట్టాలన్న పట్టుదల బలంగా ఉండిపోయింది.

నేరుగా దెబ్బకొట్టకుండా గెరిల్లా యుద్ధ పద్ధతిలో తన పథకాన్ని అమలుపెట్టాడు అనంత్. అందులో భాగంగా ముకుల్ కంపెనీలో పనిచేస్తున్న ప్రతిభావంతులైన ముగ్గురు మేనేజర్లని అక్కడినుండి రాజీనామా చేయించి, మరో కంపెనీలో మూడు-నాలుగు నెలలు పనిచేసేలా ఏర్పాటు చేసాడు. ఆ తర్వాత మంచి జీతంతో తన కంపెనీలోకి తీసుకున్నాడు అనంత్. ఈవిషయం ముకుల్ కు తెలిసినా

ఏమీ చేయలేని పరిస్థితి. ఆ ఉద్యోగులు నేరుగా అనంత్ కంపెనీలో చేరివుంటే ఎంతోకొంత న్యూసెన్స్ సృష్టించే అవకాశం ఉండేది. కానీ అలా జరగలేదు.

మేనేజర్లు వెళ్ళిపోవడంతో వారితో సన్నిహితంగా ఉండే మరికొద్ది కిందిస్థాయి ఉద్యోగులు కూడా బైటికెళ్ళేందుకు తమ ప్రయత్నాల్ని మొదలుపెట్టారు. వెళ్ళినవాళ్ళకి రీప్లేస్మెంట్లని, కొత్తగా వచ్చినవాళ్ళకి పూర్తిచేయాల్సిన ప్రాజెక్టల గురించి వివరించడం, వెళ్ళదల్చిన వాళ్లను బుజ్జగించే ప్రయత్నాల్లో మునిగిపోయిన ముకుల్, వ్యాపారంపై తక్కువ శ్రద్ధ చూపడంతో కొన్ని కొత్త అకౌంట్లని అనంత్ కంపెనీకి కోల్పోవలసి వచ్చింది.

ముకుల్ ను వదిలి తనతో చేరిన మేనేజర్ల దగ్గర ముకుల్ తనని ఎలా అవమానించిందీ తనదైన శైలిలో వర్ణించి వర్ణించి చెప్పాడు అనంత్. అతని హావభావాలకు, పొల్లుపోని మాటలకు లొంగిపోయిన ఆ మేనేజర్లు, ముకుల్ తో పనిజేస్తున్న తమవాళ్ళకు ఈ విషయాన్ని చేరవేసారు. ఆ చేరవేయడంలో తమ వంతు మసాలాను చేర్చి మరీ వేసారు. ఆవిధంగా మధ్యస్థాయి, క్రిందిస్థాయి ఉద్యోగుల్లో ముకుల్ ఓ పచ్చి అవకాశవాదిగాను, మానవ సంబంధాలను ఖాతరు చేయని కౄరుడన్న అభిప్రాయాన్ని బలంగా తయారుచేయగలిగాడు అనంత్.

ఓ పెద్ద బ్యాంక్ పిలిచిన టెండర్లలో మొదటిసారిగా ముకుల్ తో ముఖాముఖి నిలబడ్డాడు అనంత్. తక్కువ కోట్ చేసే అవకాశముండి కూడా ఎక్కువగానే కోట్ చేసాడు అనంత్. అంతేకాక తను ఎంత కోట్ చేయబోతున్నదీ ముకుల్ కు చూచాయగా తెలిసేటట్టు చేసాడు. ఆ వివరాలు తెలుసుకున్న ముకుల్ అంతకంటే అతి తక్కువ మొత్తంలో కోట్ చేసి ఆ కాంట్రాక్టును దక్కించుకున్నాడు. చాలా నెలల తర్వాత అనంత్ ను దెబ్బకొట్టగలిగానన్న సంతోషంతో ఉక్కిబిక్కిరయ్యాడు ముకుల్.

కావాలనే బ్యాంక్ టెండర్ను వదులుకున్న అనంత్ వేరే క్లయింట్లపై శ్రద్ధ పెట్టి చక్కటి ప్రాజెక్టులు డెలివరీ చేసాడు. పాత క్లైంట్ల మాట సహాయం ద్వారా కొత్త క్లయింట్లు వెల్లువెత్తడంతో పుట్టుకొచ్చిన ఉద్యోగాల్లోకి ముకుల్ కంపెనీ నుండి కొంతమందిని ఔట్ సోర్స్ విధానంలో తీసుకున్నాడు అనంత్.

మూడు నెలల్లోనే ముఖ్యమైన ఉద్యోగుల్ని తన వైపుకు లాక్కోవడం ద్వారా ముకుల్ కంపెనీలో అనిశ్చిత పరిస్థితిని సృష్టించడంలో కృతకృత్యుడయ్యాడు. దీనితో ముకుల్ మరింత దిగాలుపడ్డాడు. తీవ్రమైన నిబంధనలతో తక్కువ సమయంలోనే పూర్తిచేయాల్సిన బ్యాంక్ ప్రాజెక్ట్ పూర్తిగా వెనుకబడిపోయింది. ఆ గందరగోళంలోనే ముకుల్ ను మరో దెబ్బ కొట్టాడు అనంత్.

నిబంధనల్ని సడలించి మరికాస్త సమయం ఇవ్వాల్సిందిగా బ్యాంకువాళ్ళని కోరాడు ముకుల్. కానీ ముకుల్ బ్యాంకువాళ్ళని కలవడానికి ఒకరోజు ముందుగా ఆ అధికారులికి ఫైవ్ స్టార్ హోటల్లో విందునిప్పించి తనవైపుకు తిప్పుకున్నాడు అనంత్. అంతేగాక టెండర్ సమయంలో తన కోట్ వివరాల్ని ముకుల్ దొంగతనంగా రాబట్టినట్టుగా చెప్పాడు. నిజానికి ముకుల్ ఈ ప్రాజెక్టును తనను దెబ్బతీయడానికి మాత్రమే తీసుకున్నట్టుగా బల్లగుద్ది చెప్పాడు అనంత్. ముకుల్ తర్వాత బెస్ట్ కోటును ఇచ్చిన తనకు మూడునెలల సమయమిస్తే మొత్తం ప్రాజెక్టును డెలివరీ చేయగలనని నమ్మకంగా చెప్పాడు అనంత్.

ప్రాజెక్ట్ సరిగ్గా సాగడంలేదని అమెరికాలో ఉన్న హెడ్ క్వార్టర్స్ నుంచి తాఖీదులు అందుకున్న ఇండియా అధికారులు ముకుల్ అభ్యర్థనని తోసిపుచ్చి, సెకండ్ బెస్ట్ ఐన అనంత్ కు ప్రాజెక్టును బదిలీ చేయాల్సిందిగా తమ పై అధికారుల్ని కోరారు. కొద్దిపాటి తర్జనభర్జనల తర్వాత అనంత్ తో కాన్ కాల్ తీసుకున్న అమెరికా అధికారులు అనంత్ స్థైర్యానికి, ప్రొఫెషనలిజానికి ఆకర్షితులై కాంట్రాక్ట్ ను అతనికిచ్చేందుకు ఒప్పుకున్నారు.

బ్యాంకువాళ్ళు ముకుల్ కు చెల్లించాల్సిన మొత్తంలో నుంచి ఎక్కువశాతాన్ని అపరాధ రుసుం క్రింద ఉంచేసుకుని తక్కువ మొత్తాన్ని చెల్లించారు. ఇది అన్యాయమని వాదించబోయిన ముకుల్ నోటికి తను సరిగ్గా చూడకుండా సంతకం పెట్టిన అగ్రిమెంట్ అడ్డుపడింది. అనంత్ ను దెబ్బ తీయాలన్న తొందరలో టెండర్ డాక్యుమెంట్లను సరిగ్గా చదవకుండా సంతకాలు పెట్టేసిన ముకుల్, ఈ హటాత్పరిణామానికి మ్రాన్పడిపోయాడు.

చెప్పినవిధంగానే సరిగ్గా మూడునెలల్లో ప్రాజెక్టును పూర్తిచేసిన అనంత్ బ్యాంకువాళ్ళ నుండి ప్రశంసాపత్రాన్ని పొందడమే కాకుండా వాళ్ళ నోటి ద్వారా మార్కెట్లో ముకుల్ కంపెనీ మీద వ్యతిరేకత ఏర్పడేటట్టు చూసుకున్నాడు.

ఒకదానిపైన ఒకటిగా తగిలిన ఎదురు దెబ్బల వల్ల కళ్ళెదుటే మాయమైనపోయిన గౌరవాన్ని, పరపతిని, ఆదాయాన్ని చూసుకున్న ముకుల్ తన ఫార్మ్ హౌస్ లో పిస్టల్తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

అనుకోని ఈ ఘటనకు ఉలిక్కిపడ్డాడు అనంత్. తెలిసి చేసిన నేరభావం అతనిలో గూడుకట్టుకోసాగింది.

– – – – – – –

"ముకుల్ ఆత్మహత్య చేసుకున్నాడు!" నిలదీస్తున్నట్టుగా అడిగింది రంజని.

నోటి దగ్గర పెట్టుకున్న కాఫీ కప్పును క్రిందపెట్టి భావరహితంగా ఆమె వైపు చూసాడు అనంత్.

"నేనూహించగలను అనంత్! అతన్ని ఎవరు చంపారో!" అంది రంజని.

"వాద్దా యూ మీన్?" స్వరం పెంచి అడిగాడు అనంత్.

"యూ నో వాట్ ఐ మీన్! ఇంతగా డర్టీ గేమ్స్ ఆడాల్సిన అవసరమేముంది? అతని మానాన అతన్ని వదిలేసి ఉండొచ్చుగా?" నెమ్మదిగా అంది రంజని.

"చూడు రంజనీ! వాడి తప్పులకి ఇంకెవరో రెస్పాన్సిబిల్ అని చెప్పొద్దు. తెలియని విషయాల గురించి అతిగా మాట్లాడ్డం ఫూలిష్..." అన్నాడు అనంత్.

ఇంకేమీ మాట్లాడకుండా మౌనంగా ఉండిపోయింది రంజని.

– – – – – – –

ఊరి పొలిమేరలోవున్న ఎస్.ఈ.జడ్ లోని కొత్త క్లైంట్ తో వ్యాపార చర్చలు ముగించి తిరిగి వస్తున్న అనంత్ కాఫీ తాగడానికని రోడ్డు ప్రక్కనున్న చిన్న హోటల్ దగ్గర ఆగాడు.

కాఫీకై ఆర్డర్ ఇచ్చి యథాలాపంగా బైటకి చూసాడు. అక్కడ కనబడ్డ దృశ్యాన్ని అలానే చూస్తూ ఉండిపోయాడు.

ఆ హోటెల్ కు ఎదురుగా కడుతున్న బిల్డింగ్ దగ్గరున్న చెట్టుకు ఓ ఉయ్యాల కట్టివుంది. ఆ ఉయ్యాలను ఊపుతూ ఓ మధ్యవయస్కురాలైన స్త్రీ. నిద్రపట్టని బిడ్డ గట్టిగా ఏడుస్తోంది. ఏడ్పు ఆగకపోవడంతో ఉయ్యాలను నిలిపి, లోపల పడుకున్న బిడ్డను ఎత్తుకుంది ఆవిడ. తన ముందు పరిచిన పొత్తిళ్ళలో బిడ్డను అతి జాగ్రత్తగా పడుకోబెట్టి మాట్లాడించసాగింది.

ఆమెకు మోచేతుల క్రింది నుండి రెండు చేతులూ లేవు. ఆ మొండి చేతుల్తో బిడ్డను అతి సులువుగా ఎత్తుకోవడమే కాకుండా ఆ పాపాయి మొలకి కట్టిన గుడ్డను తన కాళ్ళతో చాలా చాకచక్యంగా తీసేసి మరో తుండుగుడ్డను నడుం కట్టింది. ఆపై ఒక పాదాన్ని బిడ్డకు ఆసరాగావుంచి మరో పాదంతో సున్నితంగా తడుతూ పాడుతోంది.

ఆ జరుగుతున్నదాన్ని అనంత్ అత్యంతాశ్చర్యంతో చూడసాగాడు. కొద్ది క్షణాలు ఆలస్యమైనా ఆమె మొండిచేతులతోను, కాళ్ళ తోనూ చేసిన అసాధారణమైన ఫీట్లని తన మొబైల్ కెమెరాలో చిత్రీకరించాడు అనంత్.

ఇంటికి వచ్చాక ఆ వీడియోను ఎడిట్ చేసి యూట్యూబ్ లో పెట్టాడు. ఓ గంట ఆగి చూడగా ఇరవై కామెంట్లు వచ్చాయి. అన్ని కామెంట్లని శ్రద్ధగా చదివాడు. పందొమ్మిది కామెంట్లు అనంత్ ను, ఆమెను పొగుడ్తూ వచ్చాయి. కానీ ఒక్క కామెంట్ మాత్రం అనంత్ ను కుదిపేసింది.

Mr. Anant, while I appreciate your effort to record and share with us a video about an exceptional woman who has emphatically exhibited what a dutiful mother can do. On the other hand, I wish to be candid with you on one aspect. Having blessed to witness such a spectacular moment, wherein, the true motherhood has been exhibited with all its glory, what do you want to do from here on? Do you want to be content with the number of hits that

your video can receive? Will you be keep checking the analytical insight of this video more often than not? Or do you ever wish to meet her again and understand the torment that she had undergone to overcome her deformity and master such a dexterity which, otherwise, a normal mother can ever imagine in her wildest dreams? I sincerely request you to meet that mother and say "Maa, tujhe salaam" on my behalf. Thanks.

ఆ కామెంట్ పోస్ట్ చేసింది ఎవరాని ప్రొఫైల్ ను చూసాడు. "An Orphan, deceived by mother!" అన్న పేరుతోవున్న ఆ ప్రొఫైల్లో ఇంకే వివరాలూ లేవు. సిటీ అన్నచోటున *మిషిగన్* అని మాత్రం వ్రాసుంది.

ఆ కామెంటును పదే పదే చదువుకున్నాడు అనంత్. చదివిన ప్రతిసారీ 'మా తుఝే సలామ్' అన్న చోట తన ఒళ్ళు సన్నగా జలదరించడాన్ని గమనించాడు.

రంజనిని పిలిచి ఆ వీడియోను, ఆ కామెంటును చూపించాడు.

"యూ మస్ట్ గో, అనంత్!" అని క్లుప్తంగా, బలంగా చెప్పింది రంజని.

"వుయ్ మస్ట్ గో!" అన్నాడు అనంత్, రంజని చేయిని గట్టిగా పట్టుకుని. హృద్యంగా నవ్వింది రంజని.

– – – – – – –

ఖరీదైన కారు నుండి దిగుతున్న ఆ ఇద్దరిని కౌతుకంతో చూస్తోందామె.

ఖరీదు తక్కువైన కాటన్ చీరలో వున్నా కూడా అందంగా కనబడుతున్న రంజనిని కళ్ళార్పకుండా చూస్తోంది ఆమె.

పక్కనే విలువైన దుస్తుల్లో విలాసంగా వస్తున్న అనంత్ ను ఆమె చూడనే లేదు.

వస్తూనే ఉయ్యాల కట్టిన చెట్టు క్రింద కూర్చునివున్న ఆమె రెండు భుజాల మీదా చేతులు వేసి "బావున్నావామ్మా!" అని పలకరించింది రంజని.

బాగున్నట్టుగా తలాడించి – "మీరు?" అంది ఆమె. తన భుజాల మీదున్న రంజని మెత్తటి, తెల్లటి చేతులు ఎక్కడ ఖరాబౌతాయోనన్న ఆలోచన ఆమె కళ్ళల్లో తారట్లాడుతోంది.

ఆ ఆలోచనని గ్రహించినట్టు – "ఇలా నేను చేతులు వేయడం నీకు నచ్చినట్టు లేదు?" అంది రంజని.

"ఆహా...అట్లేమీ కాదండి! నా బట్టలు మురిగ్గావుంటాయని..." నసిగింది ఆమె.

"ఈయన మావారు!" అంది అనంత్ వైపు చూపిస్తూ.

మొండి చేతుల్తోనే నమస్కారం చేసిందావిడ.

అప్రయత్నంగా ప్రతి నమస్కారం చేసాడు అనంత్.

"నిన్న నువ్వు బిడ్డను ఈ చేతుల్తో ఆడించడాన్ని..." అంటూ ఆవిడ కాళ్ళను చూపించింది రంజని. "...చూసిన ఈయన వీడియో తీసారు. అది చూడగానే నిన్ను చూడాలని, మాట్లాడించాలనీ వచ్చాను." అంది రంజని.

రంజని మాటలకు సమాధానం చెప్పని ఆమె కళ్ళలో విస్మయం మాట్లాడసాగింది.

"నీ పేరు?" అని అడిగింది రంజని.

"రత్నమ్మ." లోగొంతుకతో చెప్పింది.

"రత్నమ్మ! నీకు సరిగ్గా సరిపోయే పేరు." అని కొన్ని క్షణాలాగి "రత్నమ్మా! ఇది ఎలా జరిగింది?" అంటూ ఆమె మొండి చేతుల్ని తన చేతిలోకి తీసుకుంది రంజని.

పడవలాంటి కారులో వచ్చిన గొప్పింటి ఆడబిడ్డ తనలాంటి మసిబారిన మనిషిని అలా చనువుగా తాకడం రత్నమ్మకు ప్రపంచపు ఎనిమిదో వింతగా అనిపిస్తోంది.

రత్నమ్మ వెంటనే మాట్లాడకపోవడాన్ని మరోరకంగా అర్థం చేసుకుంది రంజని – "నీకు బాధ కలిగించేట్టైతే వద్దులే రత్నమ్మ!" అంది.

రత్నమ్మ మాట్లాడలేదు.

"నేను చెప్పనా అమ్మగారూ?" అన్న మగగొంతు వినబడ్డంతో అటుకేసి చూసింది రంజని. రత్నమ్మ, అనంత్ లు కూడా చూసారు.

ఎదురుగా నిలబడివున్న వ్యక్తిని చూసి – "మీరూ?" అంది రంజని.

"దీని పెనిమిటిని. వెంకటేసులు నా పేరు. తాపీమేస్త్రీని." క్లుప్తంగా, సూటిగా తన పరిచయం చేసుకున్నాడా వ్యక్తి.

"ఆహ్..." అంది రంజని. ఆమె అలా అనడాన్ని పచ్చజెండాగా భావించి జరిగిపోయిన కథను ఆగకుండా చెప్పుకుపోయాడు వెంకటేసులు.

ఓ పల్లెటూళ్ళో కడుతున్న బిల్డింగ్ లోని పన్నెండడుగుల ఎత్తున్న పచ్చిగోడ కూలిపోవడం, ఆ గోడ దగ్గరే పనిచేస్తున్న రత్నమ్మ తీవ్రంగా గాయపడడం, సరైన వైద్యం జరక్క చేతులకు గాంగ్రిన్ రావడం, ఆపై పెద్దాసుపత్రిలో రెండు చేతుల్నీ తీసేయడం గురించి వివరంగా చెప్పుకొచ్చాడు వెంకటేసులు. ఈ ఘటన జరిగినప్పుడు రత్నమ్మ రెండు నెలల గర్భవతని చెప్పాడు.

ఆపై పుట్టిన బిడ్డను చూసుకోవడానికి కొన్ని నెలల పాటు కూలీకి వెళ్ళకుండా తను ఆగిపోవాల్సిరావడం, దాంతో వచ్చిపడ్డ ఆర్థిక కష్టాల్ని చెప్పుకున్నాడు. తనను పనికి పంపి, ఆ మొండి చేతుల్తోనే ఇంటి పనుల్ని చేసుకోవడానికి, బిడ్డ లాలింపుని చూసుకోవడానికీ రత్నమ్మ పడ్డ అవస్థల్ని వివరించాడు. ఆపై స్వంత ప్రయత్నంతో కాళ్ళనే చేతులుగా చేసుకొన్న వైనాన్ని విశదీకరించాడు.

వెంకటేసులు చెబుతున్నంతసేపూ నిర్ఘాంతపోతూ విన్నారు రంజని, అనంత్ లు. మొగుడు అలా పొగుడుతున్నా రత్నమ్మ మొహంలో ఎలాంటి పొంగూ, అహమిక రవ్వంతైనా కనబడలేదు వాళ్ళకి.

"దీనికింత పట్టుదల రాకపోయింటే తినేందుకు రెండు మెతుకులు కూడా మాకు రాలేవా?" అన్నాడు వెంకటేసులు, నిండైన అభిమానంతో తన భార్యను పొదివిపట్టుకుని.

ఆ మాటల్ని విన్న రంజని కళ్ళు చెమరిస్తే, అనంత్ దీర్ఘమైన నిశ్వాసాన్ని వదిలాడు.

"వెంకటేసులు, నీకు బ్యాంకులో అకౌంట్ వుందా?" హటాత్తుగా అడిగింది రంజని.

"ఉందమ్మగారు! ఎందుకు?" అన్నాడు.

"నీ బ్యాంకు ఎక్కడుంది?" మళ్ళీ అడిగింది రంజని.

"ఈడే....కొంచెం ముందెళ్తె గ్రామీణ బ్యాంకొస్తుంది. అదే అమ్మగారు!" అన్నాడు వెంకటేసులు.

"మాతో వెంటనే రా వెంకటేసులు!" అని అతనితో అని, అనంత్ వైపుకు తిరిగి "ఐ వాంటు మేక్ ఏ ఎఫ్.డి ఫర్ ద కిడ్!" అని తన నిర్ణయాన్ని ప్రకటించింది రంజని.

"ష్యూర్!" అన్నాడు అనంత్, వెంకటేసులు కంటే రెండింతల ఆశ్చర్యంతో.

"డూ యూ హావ్ ఎనీ అబ్జెక్షన్?" – అడిగింది రంజని.

"ఐ యామ్ థ్రిల్డ్ అండ్ లవింగ్ టు డు!" అని 'థమ్సప్' చేసి చూపాడు అనంత్.

రంజని ముఖంలో సంతోషం సుడిగాలిలా వీచింది.

"రత్నమ్మా! వెంకటేసులు ఓ పదినిముషాలు మాతో వస్తే చాలు. ఒక్కతే ఉంటావుగా?" అని నవ్వుతూ అంది రంజని.

ఏం జరుగుతోందో, ఎందుకు జరుగుతోందో ఏమీ అర్థంకాని రత్నమ్మ "ఉంటా!" అని మాత్రం అనగలిగింది.

లోలోపలే తికమకపడుతున్న వెంకటేసుల్ని ముందు సీట్లో కూర్చోబెట్టుకుని వేగంగా కారును ముందుకు నడిపాడు అనంత్.

_ _ _ _ _ _ _

వెంకటేసులు పది నెలల కూతురి పేరున యాభైవేల రూపాయలతో ఎఫ్.డి. వేసాడు అనంత్. గార్డియన్గా వెంకటేసులు పేరును వ్రాయించింది రంజని. తాగుడుకు, జల్సాలకు, వృధా ఖర్చులకు ఈ డబ్బు వాడనని, అమ్మాయికి చక్కగా చదువు చెప్పించి ప్రయోజకురాల్ని చేసేందుకే వాడతానని వాళ్ళ కులదైవం మీద వెంకటేసులుతో ఒట్టేయించుకుంది రంజని. ఆ తర్వాతే ఎఫ్.డి. కాగితాల్ని అతని చేతిలో పెట్టాడు అనంత్.

బ్యాంక్ నుండి వెనక్కు వచ్చిన తర్వాత 'అమ్మగారు, అయ్యగారు' చేసిన దానం గురించి గొప్పగా వర్ణించాడు వెంకటేసులు.

నిర్మలమైన నవ్వుతో దండం పెట్టింది రత్నమ్మ.

ఆ చేతుల్ని పట్టుకుని "మా! తుఝే సలామ్!" అని మెల్లగా గొణిగింది రంజని.

ఆమె అన్న మాటలను విన్నా అర్థం తెలియని రత్నమ్మ ముగ్ధంగా నవ్వింది.

ఆ నవ్వు, అమలిన మాతృప్రేమకు చిరునామాగా తోచింది రంజనికి.

*ఏ ప్రేమ మహిమచే నీ ధారుణీచక్ర*

*మిరుసు లేకుండనే దిరుగుచుండు*

*ఏ ప్రేమ మహిమచే నెల్ల నక్షత్రాలు*

*నేల రాలక మింట నిలిచియుండు*

*ఏ ప్రేమ మహిమచే పృథివిపై బడకుండ*

*కడలిరాయుడు కాళ్ళు ముడుచుకొనును*

*ఏ ప్రేమ మహిమచే నీరేడు భువనాల*

*ఆ మహాప్రేమ – శాశ్వతమైన ప్రేమ –*

*అద్భుత మఖండ మవ్యక్తమైన ప్రేమ –*

*నిండియున్నది బ్రహ్మాండభాండమెల్ల*

*ప్రేయసీ! సృష్టి యంతయు ప్రేమమయము!!*

– – – – – – – –

రత్నమ్మ నుండి వెనక్కు వచ్చిన వెంటనే తన వీడియో పై కామెంట్ వ్రాసిన ఆ అజ్ఞాత వ్యక్తికి రిప్లై ఇచ్చాడు అనంత్.

Dear "Orphan" – I have met with Ratnamma, the wonder lady in my video and learnt as to how she toiled in learning the unique ways of cajoling her ten months old kid. All I can say is that – "I am humbled by her commitment.". I own a $0.5 million company and I am convinced now that my learning capabilities and commitment levels are no match to this wife of a construction worker. With all this, I must sincerely thank you for making me to understand the true meaning of life. Keep in touch. I remain – Ananth.

"నువ్వు చాలా మారిపోయావ్ అనంత్!" – టైప్ చేయడం ముగించిన అనంత్ ను వెనకనుండి కౌగిలించుకుంటూ అంది రంజని.

"ఇప్పటికీ మార్పు రాకపోతే నేను మనిషినేనా?" అన్నాడు అనంత్.

అతని గొంతులోని నిజాయితీకి, మాటల్లోని నైర్మల్యానికి చలించిపోయింది రంజని.

“గాడ్ బ్లెస్ యూ!” అంటూ అంతులేని తమితో అతని బుగ్గ మీద ముద్దుపెట్టింది.

“నౌ ఐ నో హూ ఈజ్ యువర్ గాడ్!” అన్నాడు అనంత్ నవ్వుతూ.

“నిజంగా?” అంది రంజని

“ఐ ఆల్సో నో వేరీజ్ హీ!” అన్నాడు అనంత్ ధృఢంగా.

“ఓహ్! ఎక్కడుంటాడు?” అంది రంజని కళ్ళని పెద్దవి చేసి చూస్తూ.

“ఇక్కడే....ఈ కళ్ళలో!” అన్నాడు అనంత్ ఆమె కళ్ళలోకి సూటిగా చూస్తూ.

మరింత గాఢంగా అల్లుకుపోయింది రంజని.

★ ★ ★ ★ ★

“డెబ్బైవ గదిలోని పువ్వును చేరింది నీ రెండో పావు!” సాలోచనగా అన్నాడు సారస్వతసారుడు.

“పువ్వు జ్ఞానానికి నిదర్శనం కదా ప్రభూ!” అంది కమలగంధి.

“అదెలా?” అన్నాడు నిగమాగమగోచరుడు చిరునవ్వును వెలయిస్తూ.

“పూష్ణాతి జ్ఞానం ఇతి పుష్పం – అని కదా ఆర్యోక్తి......” అని అర్ధోక్తిలో ఆగింది సర్వార్థప్రదాయిని.

“గొల్లలతో తిరిగినవాణ్ణి, ఇలా కఠినమైన వేదాంతం వంటబట్టేనా!” అన్నాడు యోగిహృద్ధ్యానగమ్యుడు.

“గోపాలురంటే వేదరక్షకులైన దేవతలే గానీ అన్యులు కారుగా ప్రభూ!” అంది సకలలోకసంధాయిని.

“అలాగా! ఐనా కూడా అర్థం కాలేదు. వివరించు ప్రియా!” అన్నాడు ప్రీతివర్ధనుడు.

“చిత్తం స్వామీ! పుష్య అంటే వికసించేది అని అర్థం. చెట్టు నుండి మొగ్గ రూపంలో పుట్టి, అటుపై రేకుల్ని విప్పుకుని, సుగంధాన్ని వెదజల్లుతూ నెమ్మదిగా వికసిస్తుంది పువ్వు. జ్ఞానం కూడా దేహమనే

చెట్టులో మొగ్గ తొడుగుతుంది. సజ్జనుల సాంగత్యమనే రసవర్ధకం దొరికినప్పుడు రేకుల్ని విప్పుకుని వికసిస్తుంది. సుజ్ఞానమెప్పుడూ సుగంధభరితమైనదే. ఆ జ్ఞానం, పొందినవారికే కాకుండా ఇతరులకు కూడా సుఖకారకమౌతుంది. అందుకనే అర్చనలో పుష్పసమర్పణ ఒక విడువలేని భాగం. అందువల్ల పుష్పం జ్ఞానానికి ప్రతీక. దీనికి సూచనగా మిమ్మల్ని తలచుకోని నా రెండో పావు ఇప్పుడిప్పుడే మీ స్మరణలో తరిస్తోంది. ఒక్కో రేకునే తెరచుకుంటూ వికసిస్తోంది. ఇది సృష్టిధర్మం. మానవుల తుది గమ్యం. అజ్ఞానాంధకార వినాశనం." అంది క్షీరసముద్రరాజ తనయ.

"అద్భుతం!" అన్నాడు నారాయణుడు.

"తమద్భుతం బాలక మంబుజేక్షణం...." అంటూ నమస్కరించింది పన్నగశాయిప్రియ. "మరి మీ మొదటి పావు సంగతేమిటో!"

"పరమపదసోపానంలోని చివరి మెట్టు మీద వున్న ఈ కాయకు మిగిలింది మోక్షం మాత్రమే!" అన్నాడు చతుర్విధపురుషార్థ ప్రదాత.

"అనుగ్రహించండి!" అంది సర్వానుగ్రహప్రదాయిని.

స్వామి పాచికల్ని నడిపితే అవి గోవర్ధనోద్ధారియైన శ్రీకృష్ణునిపై దేవతలు పుష్పవృష్టిని కురిపించినప్పుడు ఆ పుష్పధారలు చేసిన చప్పుళ్ళను ప్రతిధ్వనించాయి.

★ ★ ★ ★ ★

"ఇంకో కథ చెప్పు!" అంది సుశీలగా పేరు మారిన సోమక్క.

"ఇంకో కథా?" అంది సుమతి.

"ఔను! తమాషా కథ చెప్పు!" అధికారయుక్తంగా అడిగింది సుశీల.

"ఊ...ఊ...ఆ( ఈ కథ విను! ఓ పేదవాడికి గారెలు తినాలనిపించింది. పాపం, అక్కడా ఇక్కడా బిచ్చెమెత్తి కొద్దిగా మినుములు, నూనె మొదలైన కావలసిన సామాన్లని సంపాదించాడు. ఇంటికొచ్చి

భార్య చేతికిచ్చి 'చక్కటి గారెలు చెయ్యవే!' అన్నాడు. ఆవిడ గారెల్ని కాలుస్తూ కాలుస్తూనే ఒక్కొక్కటి లెక్కన అన్నీ తినేసింది. భర్త కోసమని ఒక్క గారెను మిగిల్చింది. అరిటాకులో ఆ గారెను పెట్టుకొచ్చి భర్త ముందు పెట్టింది. ముందున్న ఒకే ఒక్క గారెను చూసి ఆశ్చర్యపోయిన మొగుడు 'ఏమే! పాతికో ముప్పయ్యో ఐవుంటాయని అనుకొన్నాను. ఈ ఒక్కటేనా చేసింది?' అన్నాడు. భర్తకు అబద్ధం చెప్పలేని ఆ భార్య 'లేదండీ! మీరన్నట్టుగా పాతిక దాకా అయ్యాయి. ఇరవైనాలుగు నేనే తినేసాను!' అంది. విస్తుపోయిన ఆ పేదభర్త 'ఇరవైనాలుగు తిన్నావా? ఎలా తిన్నావే?' అంటుండంగా 'ఇదిగో, ఇలా!' అంటూ ఆ ఒక్క గారెనూ నోట్లో వేసేసుకుంది ఆ పేదోడి పెళ్ళాం."

"హాహాహా...హాహాహా...బాగుంది బాగుంది" అని చప్పట్లు కొడుతూ నవ్వింది సుశీల.

తానూ ఆ నవ్వుతో శ్రుతి కలిపింది సుమతి.

"ఇదెందుకిలావుంది?" అని టక్కున అడిగింది సుశీల, సుమతి గర్భం వైపు చూపిస్తూ.

ఆ ప్రశ్నకు గతుక్కుమంది సుమతి. ఒక నిముషం ఆలోచించి – "నీలాంటి పాప ఉంది!" అని అన్నది.

"అవునా? పాపాయి అక్కడికెలా వచ్చింది?" మళ్ళీ ప్రశ్నించింది సుశీల.

పునరాలోచనలో పడింది సుమతి. సుశీల వొలుచుకు తింటున్న వేరుశెనక్కాయల్ని చూడగానే మెరుపులా సమాధానం తట్టింది. చేతిలోకి ఓ వేరుశెనగను తీసుకుని, వొలిచి – "ఇందులోకి ఈ పప్పు ఎలా వచ్చిందో అలా అన్నమాట!" అని అంది.

ఏదో అర్థమైనట్టుగా "ఓహో!" అని తలను ఆడించింది సుశీల. "పాపాయిని అక్కడ ఎవరు పెట్టారు?" – తనలో తానే ఆలోచించుకున్నట్టుగా మెల్లిగా అంది సుశీల.

"ఈ వేరుశెనగలో పప్పును నువ్వు పెట్టావా?" అని అడిగింది సుశీల.

లేదన్నట్టు తలను అడ్డంగా ఊపింది సుశీల.

“మరి ఎవరు పెట్టారబ్బా?” అని సుశీలని అనుకరిస్తూ అడిగింది సుమతి. “ఏమో!” అన్నట్టుగా భుజాల్ని కుదిపిన సుశీల — “దేవుడా!” అని అంది.

“అరే! భలే చెప్పావే!” అని అంటూ సుశీల భుజం తట్టింది సుమతి.

“ఐనా! పాపాయిల్ని ఎలా తయారుచేస్తారు?” అని అడిగింది సుశీల.

“చిన్ని పాపాయిల్ని నువ్వు చూసావా?” — అడిగింది సుమతి.

“చూసా!”

“ఎవర్ని చూసావ్?”

“ఊ...అదే...మా చంద్రశేఖరం, లావణ్య...”

వాళ్ళిద్దరూ సుశీల పిన్ని రామలక్ష్మి బిడ్డలు.

“పాపాయిలు ఎలా పడుకుంటారు చెప్పు?” అంది సుమతి.

“ఇల్లా......” అంటూ వెనకనున్న ఓ పెట్టె మీద వెల్లకిలా పడుకుంది సుశీల.

“అలా పడుకోవడంతో బాటూ పిడికిళ్ళు బిగించి ఇలా తలపైకి పెట్టుకుంటారు కూడా! నువ్వు చూసావా?”

“ఆ....అవును....లావణ్య అట్లాగే పెట్టుకొనేది. ఎందుకలా పెట్టుకుంటారు?” కుతూహలంగా అడిగింది సుశీల.

“మనుషులు అనే బొమ్మల్ని బ్రహ్మదేవుడు మట్టితో తయారుచేస్తాడు. కొత్తగా పుట్టిన పాపాయిలు, పుట్టబోయే పాపల కోసం మట్టిని మోస్తారు. అందుకనే ఇలా చేతుల్ని నెత్తి మీద పెట్టుకొంటారు.” అంది సుమతి.

“ఆహా....” అని అంది సుశీల.

“ఒక్కోసారి పాపాయిలు సోమరిపోతులై మట్టిని మొయ్యకపోతే బ్రహ్మదేవుడు తిడతాడు. అందుకనే నిద్రలోనే ఉలిక్కిపడి ఏడుస్తారు పాపాయిలు...”

“ఆఆఅ...” అని దీర్ఘం తీసింది సుశీల.

“చక్కగా పనిచేస్తే ఇదిగో...ఇలా...భుజం తట్టి మెచ్చుకుంటాడు బ్రహ్మదేవుడు. అప్పుడు పాపాయిలు వాళ్ళల్లో వాళ్ళే నవ్వుకొంటారు.” అంది సుమతి నవ్వుతూ.

“ఆ..ఆ..ఆ....” అని మళ్ళీ దీర్ఘం తీసింది సుశీల.

కొద్దిసేపటి మౌనం తర్వాత ఒక్క ఉదుటున లేచి బైటకు పరుగెట్టిన సుశీలను చూసి అవాక్కైన సుమతి చివాలున లేచి “సుశీల! ఎక్కడికి? ఆగు!” అంటూ బైటకెళ్ళబోయింది. రెండడుగులు వేసేలోగా కడుపులో సన్నటి నొప్పి రేగడంతో “అమ్మా!” అని చిన్నగా కేకపెట్టి వాకిలిని ఆసరాగా పట్టుకుంది సుమతి. నొప్పి ఇంకా ఉద్ధృతం కావడంతో ఈసారి గట్టిగా అరిచింది సుమతి.

ముంగిటిలోకి గెంతులేస్తున్న లేగదూడను పట్టుకోవడానికి ప్రయత్నిస్తున్న సుశీల, వాకిట్లో వున్న సుమతిని తేరపారి చూసింది. ఆ వెంటనే బాణంలా వీధిలోకి దూసుకుపోయింది.

– – – – – – –

“ఏం దిగులు పడకండి శర్మగారు! మీ పట్నం డాక్టరులానే చక్కగా చూడగలడు మా అరుణాచలం. చూడ్డానికి కాంపౌండర్లా కనబడుతున్నా వీడూ ఎంబిబిఎస్ డాక్టరేనండోయ్! అనుమానాలేవీ పెట్టుకోకండి!” అని ధైర్యం చెబుతున్నాడు మోహన్రావ్.

“అవును శర్మా! మంచి మార్కులతో పాసై, పట్నంలో కాకుండా ఇక్కడ ఆసుపత్రి పెట్టుకున్నాడు. చాలా మంచి కుర్రవాడు. అంతే మంచి హస్తివాసి కూడానూ. ధైర్యంగా ఉండు!” అని మోహన్రావుకు వత్తాసు పలికాడు త్ర్యంబక ఉపాధ్యాయ.

“ఒక్క అరుణాచలమేనా? ఆ సంపూర్ణమ్మ కూడా ఎంత అనుభవం ఉన్నదంటారూ! ఇప్పటికి కనీసం వెయ్యి కాన్పులైనా చేసుంటుంది. ఒక్కటి కూడా పురిటిలో సంధి కొట్టింది లేదు! మంచి నేర్పున్న వ్యక్తి. కాబట్టి ధైర్యంగా ఉండొచ్చు!” అని అంది రామలక్ష్మి. ఆమె అన్న మాటలకు అంగీకారం తెలుపుతున్నట్టుగా తలను ఆడించింది అపర్ణ.

మాట్లాడుతున్న ప్రతి వ్యక్తి వంకా చూస్తూ చిరునవ్వులో తన ధైర్యాన్ని ప్రకటించాడు శర్మ. కానీ అతని చూపంతా రామలక్ష్మి వెనకనే దాక్కుని అప్పుడప్పుడూ శర్మ వైపుకు తొంగిచూస్తున్న సుశీల మీదనే ఉంది.

ఒక తోడు, ఒక రక్షణ, ఒక సహాయం కావల్సివచ్చిన ప్రతి సందర్భంలోనూ ఆ అమ్మాయి సుమతికి తోడుగా ఉండడాన్ని ఆలోచిస్తున్న కొద్దీ శర్మలో ఆశ్చర్యం అధికం కాసాగింది. ముఖ్యంగా తను ఊర్లో లేనప్పుడు, దొంగతో ప్రమాదం వచ్చిపడ్డప్పుడు, ఇప్పుడు — కొన్ని గంటల క్రితం సుమతికి నొప్పులు వచ్చినప్పుడూ సుశీల అక్కడేవుంది. ఊళ్ళో అందరి చేతా పిచ్చిదానిగా పిలవబడినా సుమతి దగ్గర మామూలుగా వ్యవరించే ఆ అమ్మాయి తీరును అర్థం చేసుకోవడానికి ఇప్పుడిప్పుడే ప్రయత్నించసాగాడు శర్మ.

తెలిసినవారెవరో కనబడ్డంతో వారితో మాట్లాడ్డానికని గది బైటకెళ్లాడు మోహన్రావు. రామలక్ష్మి, అపర్ణలు కొద్దిగా వారగా వెళ్ళి మాట్లాడుకోసాగారు. బల్ల మీద కూర్చున్న ఉపాధ్యాయ కళ్ళు మూసుకుని ఏవో శ్లోకాలు వల్లెవేసుకుంటున్నాడు. కొద్దిదూరంలో గోడకు ఆనుకుని దిక్కులు చూస్తున్న సుశీల దగ్గరకొచ్చాడు శర్మ. అతన్ని చూసిన ఆ అమ్మాయి దూరంగా వెళ్ళబోయింది. టక్కుమని అమ్మాయి చేతుల్ని పట్టుకుని — “సుశీలా! “సుమతికి నొప్పులొచ్చాయని నీకెలా తెలిసింది?” అని మార్దవంగా అన్నాడు అడిగాడు శర్మ.

అన్నిరోజులూ కేవలం చూడ్డమేతప్ప శర్మతో మాట్లాడని సుశీల ఏం పలకాలో తోచకుండా అతని వైపుకు గుడ్లప్పగించి చూస్తూ — “నొప్పులు.....నొప్పులంటే?” అని మెల్లగా అడిగింది.

“అదే! కడుపునొప్పి....సుమతి గట్టిగా అరిచింది కదా?” అన్నాడు శర్మ.

“లావణ్య పుట్టేటప్పుడు పిన్ని కూడా ఇలాగే వుండేది....ఓరోజు ఇలాగే అరిచింది! అందుకే పిన్నిని పిలుచుకొచ్చా!” అంది సుశీల.

ఆ మాటలకు అమ్మాయి బుగ్గల్ని పుణికాడు శర్మ.

“సుమతికి పాపాయిలు పుడ్తారని పిన్ని చెప్పింది.”

“పాపాయిలా? కాదు...కాదు...నీలాంటి పాపనో లేక బాబో పుడతారు!” అన్నాడు శర్మ.

“ఆహో....మీకు పాపాయిలొద్దా? ఒక్క పాపాయే కావాలా?” — ప్రశ్నించింది సుశీల. ఏం చెప్పాలో తోచని శర్మ ఓ నవ్వు నవ్వాడు.

“అయ్యో! ఆ పిచ్చిదాన్తో ఏం మాటలండీ శర్మగారూ?” అంటూ వడివడిగా వచ్చింది రామలక్ష్మి.

“ఆహో...సుశీలను పిచ్చిదని అనకండి. ఆ అమ్మాయిలో మనకు అర్థం కాని గొప్పదనముంది!” అన్నాడు శర్మ. అతని మాటల్లో ప్రతిధ్వనించిన గాంభీర్యాన్ని గ్రహించింది రామలక్ష్మి.

“అయ్యో! ఏదో దీన్నలా పిలిచి పిలిచీ అలవాటైపోయింది.” అని అంటూ “మీ పుణ్యమాని పేరు మార్చాక ఇప్పుడిప్పుడే మన లోకంలోకి వస్తోంది. తొందర్లోనే పూర్తిగా కుదురుకోవాలని ఆ దుర్గమ్మకు మొక్కుకొంటున్నాను. చూడండి! దీనికి పన్నెండు నిండబోతోంది. ఎదుగుతున్న బిడ్డ కదా! మునుపటిలానే ఉండివుంటే ఎన్ని కష్టాలు ఎదురుపడేవో? మా అక్క...అదేనండీ...మావారి మొదటి....అర్థమైంది కదా! అక్క చేసుకొన్న పూజలకి ఫలంగా మీరు ఈ ఊరొచ్చారు. లేకపోతే ఎక్కడో పట్నంలో ఉండేవాళ్ళు ఇలాంటి పల్లెటూరికొస్తారా? ఐనా అదేం చిత్రమో గానీండి మా పిచ్చిది...అదే సుశీల...మొదటిరోజు నుండీ సుమతితో భలే జోడీ కట్టేసింది. మొన్న కూడా అన్నాను...వీళ్ళిద్దరిదీ ఏదో జన్మల ఋణానుబంధం! ఔనంటారా?” ఆగకుండా మాట్లాడుతోంది రామలక్ష్మి.

అంతలో – "శర్మగారూ! ఒక్క నిముషం!" అంటూ ఆపరేషన్ గది నుండి బైటకి వచ్చిన డాక్టర్ అరుణాచలాన్ని చూసి నోరు కట్టేసుకుండి రామలక్ష్మి. శర్మ వడివడిగా అతని వైపుకు నడిచాడు. అతని భుజాన్ని పట్టుకుని పక్కకు తీసుకెళ్ళాడు అరుణాచలం.

"శర్మగారూ!" అంటూ అతని చేతుల్ని ఊపేయసాగాడు అరుణాచలం. "కవలలు! అమ్మాయి – అబ్బాయి." అన్నాడు.

సంతోషంతో బాటూ దిగ్భ్రమకు లోనైయ్యాడు శర్మ. "మీకు పాపాయిలొద్దా? ఒక్క పాపాయే కావాలా?" అంటూ పది నిముషాల క్రితం సుశీల అన్న మాటలు గుర్తుకొచ్చాయి. "ఏవరీ అమ్మాయి? సుమతికీ ఈ అమ్మాయికీ గల సంబంధమేమిటి? రామలక్ష్మి అన్నట్టు ఏ జన్మలోని ఎలాంటి ఋణమిది?" – ఆలోచనాపరంపరలతో సతమతమౌతూ మౌనం వహించిన శర్మను మరోలా అర్థం చేసుకున్న అరుణాచలం "మీరు వర్రీ కావల్సిన పనిలేదండీ! నార్మల్ డెలివరీ. నో ప్రాబ్లమ్స్!" అని భుజం తట్టాడు.

"అంతా భగవంతుని కృప!" అని మాత్రం అనగలిగాడు శర్మ.

సంపూర్ణమ్మ ద్వారా విషయం తెలుసుకున్న రామలక్ష్మి, అపర్ణ, ఉపాధ్యాయలు శర్మను చుట్టుముట్టారు. శర్మ వినయంగా వంగి ఉపాధ్యాయ దంపతులకు నమస్కారించాడు.

"తీరదేమో అని అనుకున్న కోర్కెను ద్విగుణీకృతం చేసాడు దేవుడు. మీ ఇద్దరి పుణ్యం ఎలాంటిదో చెప్పడానికి ఇంతకంటే మరో సందర్భం కావాలా శర్మా? పిల్లలిద్దరూ మీలాగే గుణసంపన్నులు కావాలని ప్రార్థిస్తాను." అన్నాడు ఉపాధ్యాయ.

మోహన్రావు దంపతులు శర్మకు శుభాకాంక్షలు చెప్పారు.

అరుణాచలం అనుమతించడంతో పురిటిగదిలోకి వచ్చిన శర్మను అలసిన కన్నులతో చూస్తూ నవ్వింది సుమతి. ఆమె పక్కనే పొత్తిళ్ళలో 'పాపాయిలు'.

అందరికంటే ముందుగా నడచి, రెండు చేతుల్నీ వెనక్కి కట్టుకుని, గంభీరంగా పిల్లల వైపు చూస్తూ – "బాగున్నారు. బాగా ఉంటారు." అని అంది సుశీల.

"బాల వాక్కు బ్రహ్మవాక్కంటారు. ఇంకేం! అమ్మాయి శుభం పలికింది శర్మా!" అన్నాడు ఉపాధ్యాయ.

"టూ బర్డ్స్ అట్ వన్ స్టోన్ అని ఇంగ్లీషువాడన్నట్టు ఆర్తికి అమ్మాయిని, కీర్తికి అబ్బాయిని ఒకే ఛాన్సులో పొందారు శర్మగారూ! మీ పరోపకారఫలమే ఇదంతానూ!" అని అన్నాడు మోహన్రావు.

"అనుమానమటండీ? పూజ కొద్దీ పురుషుడు పుణ్యం కొద్దీ బిడ్డలని వూరకేఅన్నారా?" అని దీర్ఘం తీసింది రామలక్ష్మి.

"ఔనౌను! ముమ్మాటికీ నిజం" అన్నాడు ఉపాధ్యాయ.

అపర్ణ సుమతి పక్కన చేరి, ఆమె చేతిని మృదువుగా నొక్కి – "ఇరవైనాలుగ్గంటల్లో నలభైఎనిమిది గంటల పనిబడింది నీకు! ఐనా భయమొద్దులే మేమున్నాంగా!" అని చిరునవ్వు నవ్వింది.

"హుష్! పాపాయిలు మట్టి మోస్తున్నారు. గొడవచెయ్యొద్దండి!" అని దండించింది సుశీల.

"పసిగుడ్డులు మట్టి మోయడమేమిటే మొద్దుబుర్రా?" అని సుశీల తల మీద మొట్టికాయవేసింది రామలక్ష్మి.

"నీకు తెలీదులే! లావణ్య మట్టిమోయడంతో సుమతికి పాపాయిలు పుట్టారు. ఇప్పుడు వీళ్ళు మట్టి మోస్తేనే ఇంకొకరికి పాపాయి పుట్టేది. ఔనా సుమతీ!" అని అంది సుశీల.

ఔనన్నట్టుగా తలాడించింది సుమతి.

ఏమీ అర్థం కాని రామలక్ష్మి – "ఏమిటో! కుదిరిందనుకున్న పిచ్చి ముదిరిందో ఏం పాడో? ఇలా మాట్లాడుతోందేమిటండీ?" అని మొగుణ్ణి మోచేత్తో పొడిచింది రామలక్ష్మి.

సుశీల చెప్పిన విషయం అర్థమైన వాళ్ళందరూ రామలక్ష్మిని చూస్తూ నవ్వసాగారు.

"ఇదేం చోద్యంరా బాబూ! అందరూ నన్ను పిచ్చిదాన్ని చేసేస్తున్నారు!" అంటూ నిట్టూర్చింది రామలక్ష్మి.
"ఇలారా పిన్నీ! పాపాయి-మట్టి గురించి చెప్తాను. ఇలా రా..." అంటూ ఆమె చేతిని పట్టుకుని లాగింది సుశీల.

“వెళ్ళవే! ఇన్నాళ్ళకి అది నీతో మాట్లాడబోతోంది.” అని ముందుకు తోసాడు మోహన్రావు. అందరి వైపూ వెర్రిగా చూస్తూ సుశీల వెంట గది బైటకెళ్ళింది రామలక్ష్మి. అందరూ మరోమారు గట్టిగా నవ్వారు.

ఆ నవ్వు నుంచి మొదటగా తేరుకున్న ఉపాధ్యాయ – “మనం వెళ్దాం పదండి.” అంటూ అపర్ణకు సైగ చేసాడు. మోహన్రావు కూడా వాళ్ళతో బాటే బైటకొచ్చేసాడు.

అందరూ వెళ్ళిపోయాక సుమతి పడుకున్న మంచం మీద కూర్చున్నాడు శర్మ.

“ఇకపై మీరిద్దరే కాదు సుమా! మేమూ ఉన్నా”మన్నట్టుగా కేర్ మన్నాయా కవలలు.

సుమతి కళ్ళల్లో నుండి వెడలిపోతూ పలకరించాయి ఆనందబాష్పాలు.

★ ★ ★ ★ ★

“మత్పుణ్యం త్వద్దయా బలాత్ – మీ దయా విశేషమే భక్తులకు పుణ్యరూపంలో దక్కేది. అందరికంటే మొదటగా పరమపదాన్ని చేరిన మీ మొదటి ఆటకాయ పుణ్యం అంతా ఇంతా కాదు!” అని మెచ్చుకుంది సర్వవర్ణాభిమానిని.

నవ్వాడు పార్థసఖుడు.

“స్వామీ! ఈ పరమపదం గురించి ఈ అల్పమతికి వివరించండి!” అని ప్రార్థించింది మారజనని.

“దేవీ! ఐదు శిరస్సులతో శోభిస్తున్న నాగేంద్రుని ఫణాల క్రింద యోగపట్టికాసనంలో నేను కూర్చునివున్నాను. నా చుట్టూ నువ్వు శ్రీ, భూ, దుర్గా రూపాలతో కొలుస్తున్నావు. ఇదీ పరమపదం యొక్క చిత్రీకరణ. పంచశీర్షాలతో ఉన్న ఫణీంద్రుడు పంచాగుల్నీ, పంచక్రతువుల్నీ తెలపడమే కాకుండా వాసుదేవ, ప్రద్యుమ్న, అనిరుద్ధ, సంకర్షణ, నారాయణ అనబడే నా పంచరూపాల్నీ సూచిస్తున్నాడు. ఆవగింజంత పరిమాణంలోవున్న పంచభేదాత్మకమైన ప్రపంచాన్ని తన పడగల మీద అవలీలగా మోసే ఫణీంద్రుడు అహంకారానికి గుర్తు. అహమ్ అన్నది జీవుల్లో ఉండే అతిసూక్ష్మమైన నా రూపమే. ఆ

రూపం పనిచేయబట్టే 'నేనున్నాను' అన్న ప్రజ్ఞ జీవుల్లో కలుగుతోంది. ఈ ప్రజ్ఞాశక్తి వల్లనే సాధనకు పూనుకుంటారు జీవులు. అలా సర్వప్రేరకుడినైన నేను *అహమ్ బ్రహ్మాస్మి!*" అన్నాడు విశ్వవ్యాపకుడు.

"ఏ ఒక్క జీవినీ విడిచిపెట్టక వారి హృదయాల్లో వెలసి అతిదగ్గరగా నివసిస్తూ 'అహమ్' నామంతో అలరారుతున్నారు. మీ పేరును తమ అస్తిత్వంగా చెప్పుకుంటూ విర్రవీగే జీవుల్ని సైతం ఉద్ధరించే మీరు నిజమైన కరుణాసముద్రులు." అని నమస్కరించింది దైత్యసంతాపకారిణి.

"అహమ్ వైశ్వానరో భూత్వా – హృద్దేశ అర్జున తిష్ఠతి – అహమాత్మా ఇలా ఎన్నో విధాలుగా నా 'అహర్నామక' రూపాన్ని వివరించాను. విస్తృతపరిచాను. మనుష్యాణామ్ సహస్రేషు అన్న చందాన తెలియవలసిన వారికి తెలిసివస్తుంది." అన్నాడు లోకబంధువైన లోకనాథుడు.

"త్వద్దయా బలాత్!" అని మ్రొక్కింది రూపవైలక్షణామణి.

"మరి నీ మొదటి పావు సంగతేమిటో తెలుపు దేవీ!" అని నారాయణుడంటే – "చిత్తం!" అంటూ అంబ పాచికల్ని వేసింది.

అవి నవజాతశిశువు హృద్ఘోషలా శబ్దించాయి.

★ ★ ★ ★ ★

"ఓన్లీ టూ పీపుల్ కేమ్, మేడమ్!" – దిగులుగా ముఖం పెట్టి రెండే పేర్లు వ్రాసివున్న కాగితాన్ని రంజని చేతికి అందిస్తూ చెప్పిందా అమ్మాయి. ఆ కాగితాన్ని అందుకుంటూ "దట్స్ ఓకే డియర్!" అంది రంజని పెదవులపై చిరునవ్వుని వెలిగిస్తూ.

"క్లబ్ హౌస్ కు వచ్చిన ప్రతివారికీ మీ ప్రోగ్రామ్ గురించి చెప్పాను మేడమ్! అందరూ చూస్తాం చూస్తాం అన్నారంతే. ఈ ఇద్దరమ్మాయిలు మాత్రం పేర్లు రాసిచ్చారు. ప్రాంప్ట్ గా వచ్చారు కూడా! మీరు ఇంకో ప్రోగ్రాం చెయ్యండి. ఈసారి ఇంకా ఎక్కువమంది వచ్చేలాగా ట్రై చేస్తా! " అని మళ్ళీ అందా అమ్మాయి.

“థాంక్స్ కల్పనా! ఐ లైక్డ్ యువర్ ఆప్టిమిజమ్!” అంటూ షేక్ హ్యాండ్ ఇచ్చింది రంజని.

“సార్ ను నేను పిల్చుకువస్తాను. మీరు పదండి మేడమ్!” అంటూ విశ్వేశ్వర్ చేయి పట్టుకుని నడిపించసాగింది కల్పన అనబడే క్లబ్ హౌస్ రిసెప్షనిస్ట్.

మూడువందల ఎనభై ఫ్లాట్లున్న తన అపార్ట్మెంట్ కాంప్లెక్స్ లో సనాతన సంస్కృతి, సాహిత్యాలపై యువతరానికి అవగాహన కల్పించే తరగతుల్ని నిర్వహించాలన్న సంకల్పంతో, An Introduction to Telugu folklore అన్న విషయంపై విశ్వేశ్వర్ సహాయంతో మొదటి తరగతిని ఏర్పాటు చేసింది. అనుకోకుండా వచ్చిన ఆలోచనని ఉన్నపళాన అమల్లోకి పెట్టింది రంజని. దానివల్ల ఆ కాంప్లెక్స్ లో ఉన్న అందరికీ తెలియజేసేందుకు సమయం తక్కువైంది. కల్పన పూనుకుని క్లబ్ హౌస్, జిమ్, పార్టీ హాల్ మొదలైన చోట్ల రంజని కార్యక్రమం గురించి వివరిస్తూ ప్రింటౌట్లని అతికించింది. రంజనికి వచ్చిన అపురూపమైన ఆలోచనకు, తన కష్టానికి ప్రతిఫలంగా చెప్పుకోదగ్గ సంఖ్యలో శ్రోతలు వస్తారని ఎంతో ఆశపడిన కల్పనకు కార్యక్రమం మొదలయ్యే సమయానికి ఇద్దరు టీనేజ్ అమ్మాయిలు మాత్రమే రావడంతో తీవ్ర నిరాశకు గురైంది. కానీ రంజని పెదవులపైని చిరునవ్వును చూసాకా ఏదో కొత్త ఆశ చిగురించినట్లైంది ఆ అమ్మాయికి.

క్లబ్ హౌస్ లోని ఆ మీటింగ్ హాల్లో ఓ యాభైమంది దాకా కూర్చునే ఏర్పాటువుంది. ప్రసంగీకులకు కేటాయించిన వేదిక వద్దకు వచ్చిన రంజని అంత పెద్ద గదిలో మధ్య వరుసలో కూర్చున్న ఓ ముద్దైన ముఖంతో ఉన్న బొద్దైన అమ్మాయిని, మరో రెండు వరుసల వెనుక కూర్చున్న మరో పొడవాటి అమ్మాయిని చూసి “హల్లో!” అని చేయి ఊపింది. “ప్లీజ్ కమ్ క్లోజర్!” అంటూ ముందువరుసలోని కుర్చీల వైపుకు చూపించింది. ఆలోపు కల్పన సహాయంతో అక్కడకు వచ్చాడు విశ్వేశ్వర్.

బుద్ధిగా వచ్చి ముందు వరుసలోకి వచ్చి కూర్చున్నారా అమ్మాయిలు. ఇద్దరికీ పదహారో, పద్ధెనిమిదో ఉంటుంది వయసు. తొలగిపోవడానికి ఒప్పుకోని పసితనం, తొందరపడుతూ వచ్చేస్తున్న యవ్వనాల విచిత్ర సమ్మేళనంతో వింత వెలుగుల్ని విరజిమ్ముతున్నాయా ముఖాలు. రంజనికి తన తొలి యవ్వనపు రోజుల ప్రతిఛాయలు పంచవర్ణాల్లో ప్రతిఫలించి, మనసులో ఇంద్రధనస్సును వికసింపజేసాయి.

అనుకోని పులకింత అపురూపానుభవాన్ని కూడిక వేస్తుంటే, మౌనంతో దాన్ని హెచ్చవేసే ప్రయత్నం చేస్తోంది రంజని.

తాను వచ్చి నిలబడినదానికి సూచనగా గొంతు సవరించుకున్నాడు విశ్వేశ్వర్. అందమైన కల నుండి ఉక్కపోతల వాస్తవంలోకి జారిపడినట్టుగా ఉలిక్కిపడింది రంజని. తనూ ఓమారు సర్దుకుని మాట్లాడ్డం మొదలుపెట్టింది. ముందుగా తమ తమ పరిచయం చేసుకోమని కోరింది.

ముద్దైన బొద్దమ్మాయి లేచి "మై నేమ్ ఈజ్ స్మితా కౌర్!" అని అంది, గాఢమైన పంజాబీ యాసను జోడించి.

పొడవైన పిల్ల నిలబడి – "మై నేమ్ ఈజ్......భ్రమరాంబ!" అంది "నేను తెలుగమ్మాయిని సుమా!" అన్న హెచ్చరిక చేస్తున్నట్టుగా.

"థాంక్స్!" అంటూ తన సంక్షిప్త పరిచయాన్ని చేసుకుని విశ్వేశ్వర్ ఇంగ్లీష్ లో గురించి వివరించింది. "ఆవిధంగా, ఓ అంధుడు ప్రాచీన జ్ఞానాన్ని, ముఖ్యంగా తెలుగు జానపద పాటల్లోని పురాణ కథల గురించి విశేషంగా తెలుసుకోవడం మనందరికీ ఓ విలువైన పాఠాన్ని నేర్పుతుంది. అవయవాలు ఎలావున్నాయన్నదాని కంటే ఉన్న అవయవాల్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలన్న తపనతో ఆయన అధ్యయనానికే ఎక్కువ సమయం వెచ్చించారు. ఈయన్ని కలుకున్న మొదట్లో ఇన్ని విషయాల్ని ఎలా తెలుసుకోగలిగారని నేనడిగిన పిచ్చి ప్రశ్నకు విశ్వేశ్వర్ ఇచ్చిన సమాధానాన్ని ఎప్పటికీ మర్చిపోలేను. ఆయనేమన్నారంటే, 'ప్రారబ్ధం వల్ల పుట్టగానే కళ్ళు పోయినా, చెవులు పనిచేస్తున్నాయి కదా! అందుకే చెవుల్నే కళ్ళుగా మార్చుకున్నాను.' ఈ సమాధానం విన్న తర్వాత నేను నేర్చుకోవల్సిన జీవిత పాఠాలు ఎన్నో ఉన్నట్టుగా తెలుసుకొన్నాను." అని చెప్పగానే ఆ ఇద్దరమ్మాయిలు చప్పట్లు కొట్టినప్పుడు దీర్ఘంగా శ్వాస తీసుకుంది రంజని. తను ఏం చెబుతోందో, అది ఆ పిల్లలకు ఆసక్తిగా ఉందో లేదోనని తికమకపడుతున్న ఆమెకు ఆ చప్పట్లు ముందుకెళ్ళేందుకు ధైర్యాన్ని, విశ్వాసాన్ని ఇచ్చాయి.

"ఆ తర్వాత ఎన్నోసార్లు ఈయన దగ్గర మంచి మంచి విషయాల్ని తెలుసుకున్నాను. ఇప్పుడు మీలాంటి కొత్తతరం వాళ్ళతో వాటిల్ని పంచుకుని ఆ విలువైన సంపద జారిపోకుండా కాపాడుకోవాలన్న

తాపత్రయంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటుచేసాను. ఎవ్వరూ రారేమోనన్న గట్టి నమ్మకంతో వచ్చిన నాకు మీరిద్దరు రావడంతో నిజంగానే భయమేసింది సుమా!" అని గంభీరంగా అంది రంజని. ఆ నాటకీయమైన గాంభీర్యానికి అమ్మాయిలిద్దరూ గట్టిగా నవ్వారు. రంజని నవ్వుతూ "ఇక విశ్వేశ్వర్ మాట్లాడుతారు..." అని అతని చేతిని పట్టుకుని ముందుకు నిలిపి, తను పక్కకు జరిగి కూర్చుంది.

మరోమారు గొంతు సవరించుకుని, అందరికీ నమస్కారం చేసి మాట్లాడబోయాడు విశ్వేశ్వర్. అంతలో వాకిలి వద్ద ఎవరో వచ్చిన అలికిడైంది. అందరూ అటుకేసి చూసారు. స్థూలకాయంతో ఉన్న మధ్యవయస్కురాలైన ఒకావిడ హడావిడిగా లోపలికి వచ్చింది. వచ్చీ రాగానే "అందరికీ నమస్కారం!" అని తెలుగులో పలకరించింది. ఆవిడను చూడగానే స్మితా కౌర్ లేచి నిలబడి "రంజని మేడమ్! షీ ఈజ్ మై మామ్. నేమ్ భానుమతి. షీ ఈజ్ తెలుగు!" అని పరిచయం చేసింది. ఆశ్చర్యాన్ని ప్రకటిస్తూ "వాటే సర్ప్రైజ్!" అంటూ భానుమతికి షేక్ హ్యాండిచ్చింది రంజని.

"నేను ఆర్మీ మెడికల్ కోర్ లో పనిచేస్తున్నప్పుడు స్మితా తండ్రిని...అదే...హర్మీందర్ని కలిసాను. ఇద్దరం ఇష్టపడడంతో బాటూ రెండు వైపులా పెద్దలు ఒప్పుకోవడంతో పెళ్ళి చేసుకొన్నాం. అఫ్ కోర్స్ నా చిన్నప్పుడే అమ్మానాన్నా పోయారు. పిన్ని దగ్గరే పెరిగాను. ఆవిడ నా ఇష్టానికి అడ్డుచెప్పలేదు. లాస్ట్ ఇయర్ మావారు ఆర్మీ నుండి రిటైరై ఇక్కడే ఓ ఫార్మా కంపెనీలో సెక్యూరిటీ హెడ్ గా జాయిన్ అయ్యారు. ఈ కాంప్లెక్స్ లోకి వచ్చి ఆరు నెలైంది. మీ ప్రోగ్రాం పోస్టర్ చూసి ఎంతఎంత థ్రిల్లైయానో. ఆక్చువలీ నేనే వద్దామనుకొన్నా కానీ ఇంపార్టెంట్ గెస్ట్స్ రావడంతో స్మితాని పంపాను" అనర్గళంగా చెప్పుకుపోయింది భానుమతి.

"చాలా సంతోషమండీ. మీరూ జాయినైతే బావుంటుంది!" అంది రంజని.

"సారీ! గెస్టులున్నారు కదా! నెక్స్ట్ టైమ్ తప్పకుండా వస్తాను. ఐ వాంట్ మై డాటర్ టు నో మోర్ అబౌట్ తెలుగు కల్చర్!" అని గట్టిగా అని, రంజని చెవిలో "స్మితాని చక్కటి తెలుగబ్బాయికి ఇచ్చి పెళ్ళి చెయ్యాలని నా కోరిక!" అని అంది భానుమతి. మెచ్చుకోలుగా నవ్వింది రంజని. "ఓహ్! మిమ్మల్ని

డిస్టర్బ్ చేసినట్టున్నాను సర్! ప్లీజ్ క్యారీ ఆన్!" అని హుందాగా చెప్పి చకచకా వెళ్ళిపోయింది భానుమతి.

సుడిగాలి వెళ్ళిపోయినట్టుగా భావించిన రంజని "ఉఫ్!" అని నిట్టూర్చి, "విశ్వేశ్వర్! మొదలెట్టండి. ప్లీజ్!" అని అంది. సరేనన్నట్టుగా తల పంకించిన విశ్వేశ్వర్ ఇంగ్లీష్ లో మొదలుపెట్టాడు.

“మైఖెల్ జాక్సన్, లేడీ గాగా, బ్రిట్నీ స్పియర్స్, చెట్నీ లవర్స్ లాంటి ఇంకా ఏవేవో నా నోరు పలకలేని పేర్లున్న వాళ్లని, ఆడవాళ్ళ సెంటు ఏది? మగవాళ్ళ ఫేస్ క్రీములెన్ని?ఎలాంటి చెప్పులు వేసుకోవాలో చెప్పేందుకే పుట్టిన ఛానల్స్ గురించిగానీ, నార్నియాకు సీక్వెల్ హెర్నియానా? అని అడిగే ఈకాలపు మేధావుల్నీ వదిలేసి ఈ గుడ్డివాడు చెప్పబోయే పిచ్చి పాటల్ని వినడానికి వచ్చిన మీ ఇద్దరికీ నా అభినందనలు.” అన్నాడు విశ్వేశ్వర్, ఉపోద్ఘాతంగా.

ఫక్కున నవ్వారు అందరూ.

“నదిలో నీరు ఏ ఒక్కరి కోసమో పారదు. కేవలం మనుషుల కొరకే పారదు. చిన్ని పిచ్చుక, చిట్టి ఉడుత, భయంకరమైన సింహం, భారీ ఏనుగుతో బాటు చుక్క నీరు కోసం మెడను వంచడానికి విచిత్రమైన ఫీట్లు చేసే జిరాఫీకి కూడా దప్పిక తీరుస్తుందా నది. మనమేమో తాగడానికే కాదు, దేహ వ్యర్థాల్ని శుద్ధి చేసుకోవడానికి కూడా అదే నది నీళ్లని వాడతాం. కానీ ఆ నది ఏ మాత్రం విసుక్కోక, అసహ్యించుకోక నింపాదిగా, నిబ్బరంగా పారుతుంది...మన మన అమ్మల్లా. ఆవిధంగా నదికి, అమ్మకు, మన ప్రాచీన సంస్కృతికి ఎన్నో పోలికలున్నాయి.”

చప్పట్లు కొట్టారు అమ్మాయిలు. వారితో బాటే తనూ కలిసింది రంజని.

“ఇప్పటిలాగా ఎలాంటి వ్యర్థ వ్యాపకాలు, నిరుపయోగమైన వ్యసనాలు లేని ప్రాచీనకాలంలోని జిజ్ఞాసువులు, విజ్ఞానులు, మేధావులు తీవ్రంగా ఆలోచించిన ఒకేఒక్క విషయం – ’జీవితం’. సీ.ఎఫ్.ఎల్. లైట్ల కృత్రిమ కాంతిలో కాకుండా వెన్నెల వెలుగులో జీవితాన్ని గడిపిన ఆ ప్రాచీనులు, సహజత్వానికి దగ్గరగా, దాదాపు లీనమై జీవించినవాళ్ళు. అందుకే వాళ్ళ మాటల్లోని లోతు చాలా

గంభీరమైనది. తమలో చెలరేగిన అనుమానాల్ని, భయాల్ని, బాధల్ని, సంతోషాన్ని, ఎలాంటి శషభిషలు లేకుండా చెప్పుకోగలిగిన స్వచ్ఛమైన మనసులున్న మనుష్యులు వాళ్ళు. అందుకనే వాళ్ళు వ్రాసిన ఆ తొలి అక్షరాల్ని 'మధురం మధురాక్షరం' అని ఈరోజుకూ మనం చెప్పుకుంటున్నాం. భారతీయులకు రామాయణ, భాగవత, భారతాలు మూడు కన్నుల్లాంటివి. మీ భాషలో చెప్పాలంటే త్రీ డైమెన్షల్ మూవీల్లాంటివి. ఆ మూడు కన్నులతో విశ్వంలోని అన్ని రహస్యాల్నీ సులభంగా గ్రహించగలిగారు వారు. ఆ రహస్యాలేమిటో మరోసారి తెలుసుకుందాం. జానపద సాహిత్యం సంస్కృతం తెలియనివాళ్ళు కనిపెట్టిన కెలైడోస్కోప్ లాంటిది. మీరిద్దరూ ఇంటర్మీడియేట్ రెండో సంవత్సరం చదువుతున్నారని విన్నాను. భవిష్యత్తులో పెళ్ళిళ్ళు చేసుకోబోయే మీకు సంబంధించిన అందమైన విషయాల గురించి క్లుప్తంగా మాట్లాడుకొందాం. బిడ్డను కనడం ప్రతి స్త్రీకీ  అపురూపమైన అనుభవం. కౌసల్య–రాముడు, అదితి–వామనుడు, దేవహూతి–కపిల భగవానుడు, ఇలా పుట్టుచావుల్లేని ఆ దేవుడు కూడా భూలోకానికి రావల్సి వచ్చినప్పుడు అమ్మ ద్వారానే వచ్చాడు. ఆ విషయాన్ని మరింత బలంగా చెప్పడానికి కాబోలు కృష్ణుడిగా పుట్టినప్పుడు దేవకి కడుపు నుండి ప్రభవించి యశోద దగ్గర అల్లరి చిల్లరిగా పెరిగాడు. ఇద్దరమ్మల ఆప్యాయతల్నీ, కోపాల్నీ, దుఃఖాల్నీ చవిచూసాడు. అదీ అమ్మదనంలో ఉన్న గొప్పదనం. తమకు పుట్టినవాడు సామాన్యుడు కాదని ఈ తల్లులకు తెలిసినా మామూలు పిల్లలకు మల్లేనే లాలపోసారు. జోలపాడారు. ఐతే, ఈరోజుల్లో దేవుడు పుట్టడం లేదు. కానీ ఆనాటి ఆ అమ్మదనపు గొప్పదనాన్ని పొందగలుగుతున్నారు ఈనాటి తెలుగు అమ్మలు. ఎలాగంటారా? ప్రస్తుతంలో అందరు తల్లులు కాకపోయిన కొద్దిమందైనా '*రామా లాలీ మేఘశ్యామా లాలీ*' అనో '*జో అచ్యుతానంద జోజో ముకుందా, లాలి పరమానంద రామ గోవిందా!*' అంటూ బిడ్డల్ని నిద్రపుచ్చుతున్నారు. ఆ పాటలో లీనమైపోయి, ఉయ్యాలలో ఉన్న తన బిడ్డ రాముడేనని, తాను కౌసల్యనేననీ అనుకొగలుగుతున్నారు. సంస్కృతంలో జుషీ అంటే సంతోషం అని అర్థం. బహుశా ఈ పదం నుండే జోష్ అన్న హిందీ లేక ఉర్దూ పదం పుట్టివుంటుందని నా ఊహ. ఆవిధంగా చూసినప్పుడు, జో అచ్యుతానంద అంటే 'ఓ బిడ్డా నువ్వు సుఖంగా నిద్రపో' అని ఆ తల్లి అంటున్నట్టుగా అర్థమౌతుంది. లాలి కూడా ఆనందాన్ని సూచించే పదం. సంస్కృతంలో 'లా' అంటే స్వీకరించడం, 'లీ'

అంటే కౌగిలించుకోవడం.  సుఖకరమైన, ఆనందకరమైన నిద్ర తన చిన్నిబిడ్డను స్వీకరించి, ఆలింగనం చేసుకోవాలన్న తల్లి తపనకు గుర్తులు ఈ చిన్ని పదాలు. చూశారా! చిన్నపిల్లలకు నిద్రే బలం అన్న సామాన్య విజ్ఞానం మన పూర్వీకులకు ఎంత బాగా తెలుసో! సరళమైన, లయ బద్ధమైన పదాలను పిల్లలు వెంటనే గ్రహిస్తారు. ఆ పదాలను శ్రావ్యంగా పాడితే మరింత బాగా గ్రహిస్తారు. అలా, చిన్నపిల్లల మనస్తత్వాన్ని పూర్తిగా అవపోసన పట్టిన మన పూర్వీకులు'జో జో' అంటూ 'లాలీ' అంటూ మన తల్లుల చేత పాడించారు." అని ఆగాడు విశ్వేశ్వర్.

నిర్ఘాంతపోయి వింటున్నారా యువతులు. రంజనికి సంపూర్ణంగా మతిపోయింది. ఈ విషయాల్నీ ఎన్నడూ విశ్వేశ్వర్ నుండి వినలేదు.

అతను చెబుతున్నది వింటుంటే వెంటనే ఓ ముద్దబంతిపువ్వులాంటి పసిపాపను ఒడిలో వేసుకుని లాలించాలన్న తపన రంజనిలో సుడిగాలిలా చెలరేగసాగింది.

"ఇప్పుడొక లాలిపాట చూద్దాం" అంటూ గొంతు సవరించుకుని సన్నటి స్వరంతో పాడసాగాడు విశ్వేశ్వర్.

*ఉయ్యాల జంపాలలూగరావమ్మ*
*వెలలేని బంగారుటూగుటుయ్యాల ||ఉ||*

*కమలమందున బుట్టి కమలాక్షుని చేపట్టి*
*కామూని కన్నట్టి కంజదళనేత్రి ||ఉ||*

*శుభశుక్రవారమున సుదతులు పూచ*
*నూరి జనము పొగడ సుందరముగాను*
*కోటి సూర్యుల కాంతి కొల్లగొట్టగను*
*కావేటి రంగనితో కలసినీవూగ ||ఉ||*

*శ్రీ విల్లి పుత్తూరిలో వెలసితివి తల్లీ*

*శ్రీరంగధాముని చేపట్టితివమ్మా*

*చేరి కూర్చుండేటి చక్రధరుని గూడి*

*చేతనులను రక్షించ చెలులందరు ఊచ ||ఉ||*

లక్ష్మీదేవి తామరపువ్వులో పుట్టింది. తామరపువ్వులాంటి కన్నులున్న నారాయణుణ్ణి పెళ్ళాడింది. పూలబాణాలను వదిలే మన్మథుణ్ణి కొడుకుగా కనింది. ఇంత సరళమైన మాటల్లో ఎంత లోతుందో చూద్దాం.

సనాతనధర్మంలోని అక్షరాలే కాదు దేవతల ఆకారాలు, ఆహార్యాలన్నీ కూడా గూఢార్థాలతో నిండివున్నవి. లక్ష్మీదేవికి పుట్టినిల్లైన తామరపువ్వు ప్రకృతికి నిదర్శనం. అంటే ఆవిడ మనం చూస్తున్నటువంటి భౌతిక ప్రపంచానికి అధినాయకురాలు. అలాంటి ఆమె, తామరపువ్వుల్లాంటి కనులున్న హరిని పెళ్ళి చేసుకుంది. అంటే, బురదలో పుట్టినా తనకు బురద అంటుకోకుండా నిలబడివుంటుంది తామర. అలాగే, ఈ ప్రకృతిలో ఉన్నట్టుగా కనబడుతున్నా, ప్రకృతికి అభిమాని ఐన లక్ష్మిని పెళ్ళి చేసుకున్నా ఆ శ్రీహరి ప్రకృతికి లోబడినవాడు కాదు. తామరపువ్వల్లే స్వచ్ఛమైనవాడు. నిర్దుష్టుడు. ఈ రమానారాయణుల సమాగమంలో కాముడు ప్రభవించాడు. కాముడు కోరికలకు చిహ్నం. ప్రకృతికి ప్రాపంచిక సుఖాలపై కోరికలు కలిగితే, అప్రాకృతానికి భగవంతునిపై కోరిక కలుగుతుంది. ఈ ఉయ్యాలలో ఊగుతున్న పసిబిడ్డకు మొదట అమ్మ అనుగ్రహానికి లోనై, ప్రకృతిని జయించి, ఆపై అయ్య అనుగ్రహానికి లోనయ్యే విధంగా కోర్కె పుట్టాలని భావిస్తూ తల్లి ఉయ్యాలనూపాలి." అని కొద్దిగా ఆగాడు విశ్వేశ్వర్. "మీరింకా చిన్నవాళ్ళు కాబట్టి ఇప్పుడు నేను చెప్పింది పూర్తిగా అర్థం కాలేదేమో!" అన్నాడు.

రంజని కల్పించుకుని – "ఆర్ యూ ఫైండింగ్ ఎనీ డిఫికల్టీ?" అని అడిగింది. లేదన్నట్టుగా తలలని ఊపారా అమ్మాయిలు. "ఆర్ యూ ష్యూర్ స్మితా?" అని ప్రశ్నించింది రంజని.

దానికి సమాధానంగా "మేడమ్! నేచర్ అండ్ గాడ్ పెళ్ళి చేసుకొన్నప్పుడు డిజైర్ పుట్టింది. బట్, ఆ డిజైర్ వరల్డీ డిజైర్ కాక ఫిలాఫికల్గా ఉండాలని నాకు అర్థమైంది. యామై కరెక్ట్, సర్?" అని అంది స్మిత.

"ఫెంటాస్టిక్! అబ్సొల్యూట్లీ కరెక్ట్!" అని ప్రశంసాపూర్వకంగా అన్నాడు విశ్వేశ్వర్.

ఆపై మిగిలిన పాటకు కూడా వివరణనిచ్చాక "ఈరోజుకు ఇంత చాలు. మీకు మరింత వినాలన్న ఆసక్తివుంటే వచ్చేవారం కలుద్దాం!" అంటూ చేతులు జోడించాడు విశ్వేశ్వర్.

గది బైటకి వచ్చాక విశ్వేశ్వర్ చేతిని గట్టిగా పట్టుకుని "మీకు తెలీదు నేనెంత సంతోషంగా ఉన్నానో!" అని అంది రంజని.

"నేను కూడా మేడమ్!" అన్నాడు విశ్వేశ్వర్.

"నెక్స్ట్ క్లాస్ సూపర్ హిట్టౌతుంది!" అని జత కలిసింది కల్పన.

విశ్వేశ్వర్ ను అతని ఇంటి వద్ద దిగబెట్టి బయల్దేరే ముందు "విశ్వేశ్వర్! మీరు లాలి పదాన్ని గురించి చెబుతున్నప్పుడు ఓ బుజ్జిపాపని ఎత్తుకొని ఆడించాలన్న తపన ఎంత కలిగిందో! డూ యూ థింక్ ఐ విల్ హేవ్ దట్ లక్.....అగైన్?" అని అడిగింది రంజని.

ఆమె గొంతులోని నైరాశ్యం విశ్వేశ్వర్ ను బలంగా తాకింది. "తప్పకుండా మేడమ్! ఎన్నో మంచిపనుల్ని చేసారు, చేస్తున్నారు. మీకు పిల్లలు కలగకపోవడమా? ఒక్కోసారి మనం కోరుకుంటున్నదాన్ని ఇవ్వకుండా దేవుడు దాటవేస్తున్నాడంటే వాడి మనసులో ఏదో గొప్ప ఆలోచనే ఉండివుంటుంది. ఒకటికి పదింతలుగా ఇవ్వబో తున్నప్పుడు, వాడిలానే పరీక్షిస్తాడని గురువుగారు చెప్పారు." అన్నాడు.

'అర్థమైం'దన్నట్టుగా తల పంకించి, దీర్ఘంగా నిట్టూర్చి కారును ముందుకు నడిపింది రంజని.

★ ★ ★ ★ ★

"మూడు శిఖరాలున్న నూటాపద్నాల్గవ గడిని చేరిన నీ మొదటి పావు చెప్పదల్చిన విశేషమేమి దేవీ?" అన్నాడు అశేషగుణసంపన్నుడు.

"ప్రభూ! దేవాలయానికి గర్భగుడి శిఖరం ఎంత ముఖ్యమో జీవుల సాధనలో కాయక, మానసిక, వాచిక తపస్సులు అంతే ముఖ్యం.  మానవులకు ఈ మూడూ ముఖ్యలక్షణాలు. ఎవరైతే మాటలోనూ, ఆలోచనలోనూ, చేతల్లోనూ ఒకేవిధంగా వ్యవహరించగలుగుతారో వారు శిఖరప్రాయులై అలరారుతారు." అంది మారజనని.

"అంటే నీ మొదటిపావు శిఖరసమానమైన వ్యక్తిత్వాన్ని సాధించిందన్న మాట!" అన్నాడు కంసధ్వంసి.

"మీరు చెప్పిన మాటలకు తిరుగులేదు కదా స్వామీ!" అంది కంజదళాయతాక్షి "మరి మీ రెండో ఆటకాయను నడిపి తత్త్వోపదేశం చేయండి".

"అవశ్యం!" అంటూ పాచికల్ని వేసాడు ముచుకుందవరదుడు. ఆ పాచికలు దశకంఠ నిర్మూలనోద్యుక్త శ్రీరామ ధనుష్టంకారం వలే ధ్వనించాయి.

★ ★ ★ ★ ★

"డుమువులు ప్రథమా విభక్తి, నిన్ నున్ లన్ కూర్చి గురించి ద్వితీయా విభక్తి...ఊ...ఊ..." అంటూ ఆగిపోయాడు చంద్రశేఖరం.

"ఏరా మోహన్రావుగారి అబ్బాయి? తృతీయావిభక్తిని మర్చిపోయావా?" అంటూ జారిన కళ్ళజోడు సందులో నుంచి చూస్తూ గద్దించాడు త్ర్యంబయ ఉపాధ్యాయ.

తీరికవేళల్లో పిల్లలకు తెలుగు వ్యాకరణం నేర్పించమని మోహన్రావు మరీమరీ కోరడంతో ఒప్పుకొన్నాడు ఉపాధ్యాయ. అక్కడే కూర్చునివున్న కేశవశర్మ "మర్చిపోయావా?" అన్నాడు.

"ఔనండీ!" అంటూ బిక్కమొహం వేసాడు చంద్రశేఖరం.

"అందుకనే మాటిమాటికీ తల్చుకోమని చెబుతుంటాను. నువ్వేమో పాడు సినిమా పాటల్ని పాడుతుంటావు!" అని సుతిమెత్తగా విసుక్కొన్నాడు ఉపాధ్యాయ.

శర్మ కల్పించుకుని "గుర్తుపెట్టుకోవడం చాలా సులభం. నీకు రామాయణ కథ తెలుసుకదా!" అన్నాడు.

"తెలుసు."

"బాగు బాగు. నేను ఒక్కో ప్రశ్న వేస్తాను. నువ్వు చెప్పే సమాధానాల్తో రామాయణ కథను క్లుప్తంగా చెప్పుకుందాం! సరేనా!"

అలాగేనన్నట్టు తలూపాడు చంద్రశేఖరం.

"రాముడి తండ్రి ఎవరు? రాముడెలా పుట్టాడు?"

"దశరథుడు రాముని తండ్రి. సంతానం గురించి పుత్రకామేష్టి చేస్తే రాముడు పుట్టాడు."

"చూశావా! మొదటి రెండు విభక్తులు నీకు తెలుసు. దశరథు'డు', రాము'డు' ప్రథమావిభక్తి. 'గురించి' అన్నది ద్వితీయావిభక్తి! అవునా?" అన్నాడు శర్మ.

చంద్రశేఖరం ముఖం వికసించింది. "నెక్స్ట్ ప్రశ్న అడగండి!" అన్నాడు ఉత్సాహంగా.

"రాముడిని విశ్వామిత్రుడితో వెళ్ళినప్పుడు వెంట ఎవరున్నారు? అతను మిథిలానగరానికి ఎందుకు వెళ్ళాడు?"

"విశ్వామిత్రుడు యాగరక్షణకు రాముణ్ణి తీసుకెళ్ళినప్పుడు అతనికి తోడుగా వెళ్ళిందెవరు? రాముడు మిథిలానగరానికి ఎందుకు వెళ్ళాడు?"

"విశ్వామిత్రునితో వెళ్ళిన రాముడికి లక్ష్మణుడు తోడుగా వెళ్ళాడు. సీతాస్వయంవరం కొరకు రాముడు మిథలకు వెళ్ళాడు."

"భలే! తోడన్, తోన్ తృతీయా విభక్తి. కొరకు లేక కొరకున్ అన్నది...."

"చతుర్థీ విభక్తి!" అని శర్మ వాక్యాన్ని పూర్తి చేసాడు చంద్రశేఖరం.

ఆపై మిగిలిన విభక్తుల్ని కూడా చకచకా చెప్పేసాడు చంద్రశేఖరం.

"భలే బాగా చెప్పావోయ్ శర్మా! స్కూల్ మేష్టారుగా నువ్వెళ్తే బడుద్ధాయిలందరూ బుద్ధిమంతులైపోతారనుకో!" అని మెచ్చుకున్నాడు ఉపాధ్యాయ. ఆ పొగడ్తని చిరునవ్వుతో స్వీకరించాడు శర్మ.

– – – – – – –

"చాలాసేపు అక్కడే ఉండిపోయారే!" అంది సుమతి, లోనికి వస్తున్న శర్మను చూసి.

"మోహన్రావు గారి అబ్బాయి చంద్రశేఖరానికి ఉపాధ్యాయగారు వ్యాకరణం చెబుతుంటే నేనూ వింటూ కూర్చున్నా!" అన్నాడు.

"సంధులా? సమాసాలా?" అందు సుమతి.

"విభక్తి." అన్నాడు శర్మ.

"ఆహా...." అని క్షణమాగి "విభక్తికి భక్తికి సంబంధమేదైనా ఉందా?" అని అడిగింది సుమతి. చప్పున తలెత్తి చూసాడు శర్మ. "వెఱి ప్రశ్న వేసానా?" అంది సుమతి.

"లేదు!" అన్నాడు శర్మ. సుమతి ప్రశ్నకు అతని మేధస్సులో మథనం మొదలైంది.

"హమ్మయ్య! తిక్క ప్రశ్న కాదు కాబట్టి మీరిప్పుడు సమాధానం చెబుతారు!" అంది మెల్లగా నవ్వుతూ.

కొద్దిక్షణాల మౌనం తర్వాత నోరు విప్పాడు శర్మ – "రెండు వేర్వేరు పదాల్ని కలిపేదాన్ని విభక్తి అంటారు. ఇది వ్యాకరణ నిర్వచనం. పరస్పర భిన్నాలైన భగవంతుణ్ణి–జీవిని కలిపేదాన్ని విభక్తి అంటారు. ఇది ఆధ్యాత్మిక నిర్వచనం." అన్నాడు.

"బావుంది. కానీ భక్తికి–విభక్తికి తేడా ఏమిటి?"

"విభక్తి అంటే విశేషమైన లేక విశేష్టమైన భక్తి. ప్రహ్లాదుడు, ధృవుడులాంటి వాళ్ళు ఎన్ని కష్టాలెదురైనా శ్రీహరి పట్ల చూపింది ఈ విభక్తినే!" అన్నాడు శర్మ.

"ఆహా..." అంది సుమతి.

"విభక్తి అంటే విరుద్ధ భక్తి అని కూడా అర్థముంది!" అని ఆగాడు శర్మ, సుమతిలో కౌతుకాన్ని రేపేందుకు.

శర్మ ఊహించినట్టుగానే కళ్ళను పెద్దవి చేసి "విరుద్ధమైన భక్తా? అది పాపం కదా!" అంది సుమతి.

నవ్వాడు శర్మ – "హిరణ్యాక్ష–హిరణ్యకశిపులు, రావణ–కుంభకర్ణులు, శిశుపాల–దంతవక్రులు చేసింది విరుద్ధమైన భక్తినే! ద్వేషంతో రగిలిపోతూ క్షణమైనా విడువకుండా హరినామ స్మరణ చేసిన విభక్తికి నిలువెత్తు నిదర్శనాలు వీళ్ళే!" అన్నాడు శర్మ.

సుమతి ముఖంలో ఆశ్చర్యం మరింత తొంగిచూసింది.

శర్మ చెప్పుకుపోసాగాడు – "కర్త, కర్మ, కరణ, సంప్రదాన, అపాదాన, సంబంధ, అధికరణ అన్నవి సంస్కృత వ్యాకరణంలోని ఏడు విభక్తులు. ప్రపంచంలోని సర్వధర్మాలూ ఒకదానికొకటి సమన్వయపూరకంగా నడవాలంటే పై ఏడూ ఎంతో అవసరపడతాయి. ప్రతి పనికీ ఒక కర్త ఉంటాడు. ఇది ప్రథమా విభక్తి. ఆ కర్త చేత చేయబడే పని కర్మ అవుతుంది. దీన్నే ద్వితీయవిభక్తి అంటారు. ఆ పనిని చేసేందుకు కొన్ని పనిముట్లు కావల్సివస్తాయి. అవే కరణాలు. ఇది తృతీయావిభక్తి. కర్త, కర్మ, కరణాలన్నీ ఒకానొక ప్రతిఫలం కోసమే పనిచేస్తాయి. దాన్నే చతుర్థీవిభక్తి ఐన సంప్రదాన అన్నారు. ప్రపంచంలోని ప్రతి చర్య వెనుకా ఒక మూలం ఉంటుంది. అంటే సోర్స్ అన్న మాట. అపాదానమంటే ఈ మూలమే. ఇది పంచమీవిభక్తి. అలాగే అన్ని చర్యలకూ ఒక మిగులు అంటే శేషముంటుంది. అదే సంబంధం. ఇది షష్ఠీవిభక్తి. ఈ కర్త, కర్మ, కరణ, సంప్రదాన మొదలైనవన్నీ ఒక కాలానికి అనుగుణంగా నడుస్తాయి. ఆ కాలమే వీటన్నిటినీ నిర్దేశిస్తుంటుంది. అదే సప్తమీ విభక్తిగా పిలువబడే అధికరణం. ప్రపంచావసరాలకు ఉపయోగపడే ఈ ఏడు విభక్తుల్ని అదే ప్రాపంచికమైన పనుల్లోనే

భగవంతుడితో అనుసంధానం చేసినప్పుడు సాధారణ భక్తి విశేష భక్తిగా మారుతుంది. ఇదే విభక్తి సారం."

"లౌకికమైన పనుల్ని దేవుడితో అనుసంధానం చేసేదెలాగా?"

"తీసి వేసే ప్రతి అడుతూ ఒక తీర్థయాత్రలా భావించడం, కనబడే ప్రతి జీవిలోనూ, వస్తువులోనూ భగవంతుడున్నాడని భావించడం ద్వారా. చక్కటి భోజనం చేయడం, మంచి దుస్తుల్ని వేసుకోవడం హరిపూజగా భావించడం, చెవిలో పడే నానా రకాల వార్తలు హరికథాశ్రవణమనుకోవడం, పొగడ్తలన్నీ హరినామావళి అని అనుకోవడం ద్వారా అన్ని లౌకిక చర్యలూ భగవంతుని సేవలుగా మార్చుకోవచ్చు!"

"ఎంత సున్నితమైన అనుసంధానం! అలాంటిదాన్ని వివరించిన చెప్పిన మీరు నిజంగా గొప్పవారు!" అంది సుమతి.

"పిచ్చిదానా! ఇందులో ఏ ఒక్క పదమూ నా స్వంతం కాదు. ఇంద్రియాలపై విజయం సాధించి, విఠలుని పాదదాసులైన మహామహులెందరో తమ మాటల్లో చెప్పింది, ఆచరించి చూపించినవాటిల్లో ఈ మూర్ఖుడు తెలుసుకోగలిగింది ఎంత? తెలుసుకోవలసింది ఇంకెంత?" అన్నాడు శర్మ.

"మాకూ విషయాలు అర్థమయ్యా"యన్నట్టుగా కిలకిలమన్నారు కవలలు. వారి చిట్టి చేతుల్ని సుమతి పట్టుకుంటే, ఆమె భుజాలు పట్టుకుని నవ్వాడు శర్మ.

★ ★ ★ ★ ★

"పరాశక్తి గడి నుండి కదలిన మీ రెండో పావు పరమపదంలోని హనుమంతుణ్ణి చేరింది!" అని అర్ధోక్తిలో ఆగింది అంబుజసదన.

"దేవీ! నవవ్యాకరణ విద్యానిపుణుడైన హనుమంతుడు మూర్తీభవద్విద్యాసంపన్నుడు. కించిత్తూ అపశబ్దాలు పలుకని సుశిక్షిత భాషావేత్త. దేహబలంతో బాటూ బుద్ధిబలం, జ్ఞానశక్తి నిండిన ఉత్తముడు. అన్నీవున్న ఆకు అణిగివున్నట్టే సకలవిద్యాపారంగతుడైనా వినయసంపన్నుడు. మానవుల్లో ఉండే మిడిసిపాటులేని సద్గుణశీలి." అన్నాడు లక్ష్మీలోలుడు.

"ఏమిటి స్వామీ! మీ ప్రియదాసుని ప్రశంసలలో మునిగితేలుతున్నారు!" అంది సత్యార్థసంధాయిని.

"గుర్తుందా దేవీ! రావణ సంహారానంతరం నిన్ను చూడాలని కపిసైన్యం ఉత్సుకత పడింది. ఎవరి కోసం తామంతా కలిసి భీకరయుద్ధం చేసారో ఆ వ్యక్తి ఎలా ఉంటుందోనన్న ఉబలాటానికి ప్రతి కపివీరుడూ లోనయ్యాడు. అగ్నిపునీతవైన నువ్వు నా వైపు నడిచివస్తున్నప్పుడు సుగ్రీవ, అంగద, నలనీలాది ఆజానుబాహువులు ముందువరుసలో నిలబడ్డారు. ఆకారంలోను, అధికారంలోనూ మరుగుజ్జులైన అనేక కపిజాతులు వెనకనే ఉండిపోయి నిన్ను చూడలేక నిరుత్సాహపడ్డాయి. వాటి మనోగతాన్ని, దైన్యాన్ని గ్రహించిన హనుమంతుడు ఆజానుబాహులైన కపివీరులకు ఒక్క కనుసైగ చేసాడు. ఏకాంతభక్తుడు, భటాగ్రేసరుడైన హనుమ భ్రూభంగానికి తలవొగ్గిన ఆజానుబాహువులైన కపులు తమ భుజస్కందాలపైకి మరుగుజ్జు కోతుల్ని ఎక్కించుకున్నారు. ఆవిధంగా బలజ్ఞానాలలో అల్పులైనా రామసేవాసక్తులైనవారికి హనుమ దయతో నీ దర్శనం లభించింది. నీ దర్శనమంటే వేదజ్ఞానప్రాప్తియనే అర్థం!" అన్నాడు హనుమహృత్కమలవాసి.

"ఆ ఘటనని మీ నోట వింటుంటే ఒళ్ళు పులకరించింది స్వామిన్!"

"పుత్రోత్సాహం ఒక్క తండ్రికి మాత్రమే పరిమితం కాదుగా!" అన్నాడు నారాయణుడు.

మనోహరంగా నవ్వింది హరిమనోహారిణి. "మీ రెండో పావు కూడా ముక్తికి చేరువయింది. మరి నా మొదటిపావు గతి ఏమిటో?"

"సుమతిని సాధించినవారికి మన్మనోరంజకమైన సద్గుణసాంగత్యం లభిస్తుంది. అదే మోక్షమార్గానికి మొదటి మెట్టు. నీ పావు దారితప్పడం లేదు. నడుపు!"

అమ్మ పాచికల్ని వేస్తే  రామముద్రికను చూసినప్పుడు సీతాసతి కంట వొలికిన ఆనందబాష్పాల పులకరింతల్ని ప్రతిధ్వనించాయి.

★ ★ ★ ★ ★

"ఫ్రెండ్స్! గుడీవినింగ్ టు యూ ఆల్!" అంటూ మొదలుపెట్టింది రంజని. అనంత్ తన కంపెనీ ఉద్యోగుల కోసం పర్సనాలిటీ డెవెలప్మెంట్, మోటివేషన్, ఇంటర్ పర్సనల్ రిలేషన్షిప్ మొదలైన వాటిపై శిక్షణనిప్పించడానికి రంజనిని. అపార్ట్మెంట్ కాంప్లెక్స్ లో రంజని నడిపిన తరగతుల్లో కొన్నింటికి హాజరైన అనంత్ కు విశ్వేశ్వర్ విశ్లేషణలు ఎంతగానో నచ్చాయి. అలానే రంజని యొక్క లోతైన పరిశీలనాశక్తికి ఆశ్చర్యపడ్డాడు. పని ఒత్తిడితో నలిగే తన ఉద్యోగులకు ప్రతి రెండో శుక్రవారం మధ్యాహ్నం ఓ గంట పాటు వీళ్ళిద్దరితో ఉపన్యాసాల్ని ఏర్పాటు చేసాడు.

"మనలో ప్రతి ఒక్కరి లక్ష్యం సంతోషంగా ఉండడం. అవునా?" – శ్రోతల్ని ప్రశ్నించింది రంజని.

"ఎస్" అని ఒక్కసారిగా బదులిచ్చారందరూ.

"ఏది సంతోషం అని అడిగితే ఫలానా అని ఎవ్వరూ చెప్పలేరు. ప్రతి మనిషికీ ఎన్నెన్నో సంతోషాలు కావల్సి వస్తుంటాయి. అవునా?"

"ఎస్"

"అంటే మనమందరం మనకు కావాలని అనిపించిన అన్ని సంతోషాల్నీ పొందలేం.కొన్నిసార్లు సంతోషాన్ని పొందేందుకు ప్రయత్నిస్తున్నప్పుడు కష్టాలు ఎదురౌతుంటాయి. దాంతో దుఃఖమే కలుగుతుంటుంది గానీ సుఖం ఏమాత్రం దొరకదు. ఎవరో కావాలని మనల్ని వెనక్కి లాగుతున్నట్టుగా అనిపిస్తుంది. ఎందుకిలా జరుగుతోందని అడిగితే ఒక్కొక్కరు ఒక్కోవిధంగా బదులిస్తారు. ఎదురుపడ్డ అనుభవాల్ని మనస్పూర్తిగా స్వీకరించిన కొద్దిమంది మాత్రమే ఈ మాయాజాలాన్ని అర్థం చేసుకోగలిగారు." అంటూ ఆగింది రంజని. కావాలనే వదిలిన ఆ విరామం వినేవాళ్ళలో కుతూహలాన్ని రేకెత్తించింది.

"మనలో చాలామందికి ఫిజికల్ ఆబ్జెక్ట్స్ మాత్రమే సుఖాన్ని సాధించేందుకు ఉపయోగపడేవిగా అనిపిస్తుంటాయి. దట్ మీన్స్ – కార్, బంగ్లో, ఫారిన్ ట్రవెల్, లావిష్ ఫుడ్ ఎట్సెట్రా ఎట్సెట్రా. బట్, అలాంటివాళ్ళందరూ మిస్సయ్యే ముఖ్యమైన పాయింట్ దటీజ్ 'సింప్లిసిటీ'. ఫర్ ఎంగ్జాంపుల్ – నదిలో నీళ్ళు మనం తయారుచేసుకొన్నది కాదు. కానీ దాన్ని ఓ ప్లాస్టిక్ బాటిల్లో నింపి, పైన ఒక బ్రాండ్ వేసి పదహైదురూపాయలకు అమ్ముకొంటాం. మొదటిది న్యాచురల్ సింప్లిసిటీ ఐతే రెండోది ఆర్టిఫిషియల్ మెటీరియల్ ఎగ్జూబరెన్స్. ఒకసారి మనముంటున్న ఈ పరిసరాల్ని గమనించి చూడండి. మన చుట్టూవున్న గాలి అందులోని ఆక్సిజన్ మన సృష్టి కాదు. కొండల్ని మనం నిలబెట్టలేదు. అడవుల్ని మనం నాటి పెంచలేదు.

కానీ వీటిల్ని నాశనం చేయడంలో ఎంతో ప్రోగ్రెస్ ను సాధించాం. ఇదంతా ఎందుకు జరుగుతోంది? బికాజ్, మనలో ఆత్మ ఉన్నట్టే, ప్రకృతిలో కూడా ఆత్మ ఉందని, అది మనలాగే సున్నితమైనదని మర్చిపోయాము. ఈ సృష్టిలోకి ఎలావచ్చామో తెలుసుకోకుండా, చుట్టూవున్న పరిసరాల్ని మన అదుపులోకి తెచ్చుకొని అన్నింటిపైనా పెత్తనం చలాయించాలన్న అత్యాశే మానవుల్ని ఇలా తయారుచేస్తోంది. ఎండ్లెస్ గ్రీడ్ ఈజ్ ఆల్వేస్ డేంజరస్. ఆన్ ద అదర్ హ్యాండ్, కంటెంట్మెంట్ బ్రింగ్స్ సింప్లిసిటీ ఇన్ యూ. ఈ సందర్భంలో ఒక చిన్న కథ చెప్పుకోవాలి. ఇద్దరు సన్యాసులు తీర్థయాత్రకని కాలినడకన బయల్దేరారు. ఓ మట్టిదారిలో పోతున్నప్పుడు పెద్ద వర్షం వచ్చి దారంతా బురదమయమైంది. ఖరీదైన పట్టుబట్టల్లోవున్న చక్కనైన ఒక అమ్మాయి ఆ బురదను దాటడానికి ఇబ్బందిపడుతోంది. ఆ అమ్మాయిని చూసిన సన్యాసి ఒకడు టక్కున తలతిప్పుకొంటే మరో సన్యాసి 'ఏమ్మా! దాటడానికి కష్టపడుతున్నావా?' అంటూ అవలీలగా అమ్మాయిని ఎత్తుకుని రోడ్డు అవతలి వైపు తీసుకెళ్ళి దింపాడు. ఆపై ఇద్దరు సన్యాసులూ నడుస్తూ నడుస్తూ రాత్రికి ఓ దేవాలయాన్ని చేరుకొన్నారు. విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో మొదటి సన్యాసి రెండోవాణ్ని అడిగాడు – 'స్వామీ! మనం సన్యాసులం. భవబంధాల నుండి మరీ ముఖ్యంగా అందమైన స్త్రీలనుండి దూరంగా ఉండాలి. కానీ మీరేమో యుక్తవయస్సులో వున్న ఆ అమ్మాయిని మాట్లాడించడమే కాక ఎత్తుకున్నారు కూడా!'. ఆ

మాటలకు ఆశ్చర్యపోతూ 'స్వామీ! నేను ఆ అమ్మాయిని అక్కడే మర్చిపోయాను. మీరు ఇప్పటికీ గుర్తుపెట్టుకున్నారా?' అని అన్నాడు రెండో సన్యాసి.".

అందరూ జోరుగా నవ్వారు.

"ఈ కథలో మనకు కావల్సిందేమిటంటే ఆకర్షణ కానీ అవసరం కానీ మనకు ఉపయోగపడే వరకూ ఉండవచ్చు. కానీ అవి మితిమీరితేనే అత్యాశ మొదలౌతుంది. ఆశ పెరిగే కొద్దీ కోరినదాన్ని దక్కించుకోవాలన్న తపన మొదలౌతుంది. ఆ తొందరపాటు అసహాయానికి దారి తీసి చివరకు మనచేత తప్పుడు పనుల్ని చేయిస్తుంది. కాబట్టి ఆ రెండో సన్యాసిలాగా అనవసర విషయాల్ని మర్చిపోయేలా మన మనసుల్ని కంట్రోల్ చెయ్యాలి." అని ముగించింది రంజని.

"ఈ కథలో మనకు కావల్సిందేమిటంటే ఆకర్షణ కానీ అవసరం కానీ మనకు ఉపయోగపడే వరకూ ఉండవచ్చు. కానీ అవి మితిమీరితేనే అత్యాశ మొదలౌతుంది. ఆశ పెరిగే కొద్దీ కోరినదాన్ని దక్కించుకోవాలన్న తపన మొదలౌతుంది. ఆ తొందరపాటు అసహాయానికి దారి తీసి చివరకు మనచేత తప్పుడు పనుల్ని చేయిస్తుంది. కాబట్టి ఆ రెండో సన్యాసిలాగా అనవసర విషయాల్ని మర్చిపోయేలా మన మనసుల్ని కంట్రోల్ చెయ్యాలి. కొందరు దొంగలు సులభంగా సంపాదించాలని చిన్నపిల్లలకు చాక్లెట్ల ఆశ చూపి నగల్ని దొంగిలించినట్టుగా మనం షార్ట్ టర్మ్ గెయిన్స్ కోసం కలవరిస్తూ లాంగ్ టర్మ్ గోల్స్‌ను మర్చిపోతాం." అంది రంజని.

“సో, వాటీజ్ ద పర్పస్ ఆఫ్ లైఫ్?” అని విసుగ్గా అడిగాడో కుర్రవాడు.

నవ్వింది రంజని. కుతూహలంగా చూసాడు అనంత్.

“రైటియస్ లివింగ్. నిజాయితీగా బ్రతకడం. డార్విన్ సిద్ధాంతం ఎవల్యూషన్ గురించి సరిగ్గా చెప్పిందో లేదో గానీ ఒక్క విషయాన్ని మాత్రం బాగా చెప్పింది. అదే స్ట్రగుల్ ఫర్ ఎగ్జిసిస్టెన్స్. బ్రతకడం కోసం పోరాటం! ఎప్పుడైతే పోరాటమే జీవితమైందో ఇక శాంతి ఎక్కడిది? కూడు కోసం, గుడ్డ కోసం, ఆస్తి, అంతస్తుల కోసం, పేరుప్రఖ్యాతుల కోసం పోరాటం చేస్తోంది మానవజాతి. పక్కవారి కంటే ఎక్కువగా ఉండాలన్న అత్యాశ ఈ పోరాటానికి ఆజ్యం పోస్తోంది. ఇండస్ట్రియలైజేషన్ వల్ల మోడ్రనిజం పెరిగింది. ఇది నిప్పుకు గాలి తోడైనట్టు తోడు కావడంతో మనుష్యుల మధ్య పోరాటం ఇంకా ఇంకా తీవ్రమైపోయింది. ఖరీదైన వస్తువుల్ని పుట్టించుకుని వాటిల్ని సంపాదించడమే ఏకైక లక్ష్యంగా, బ్రతకడానికి ఆ వస్తువులు తప్ప మరేమీ లేనట్టు, ప్రేమ–అభిమానం–స్నేహం మొదలైనవాటిల్ని కూడా బహుమతులతో, కానుకలతో, ఆడంబరాలతో కొల్చుకొంటూ బ్రతుకుతోంది మన జాతి. ఈ పోరాటంలో విచక్షణ లేదు. ఓపిక, సహనం లేదు. నెమ్మదిగా ఆలోచించే అవకాశం లేదు.” — రంజనిలో ఆవేశం వేగం పుంజుకోసాగింది.

“మీలో ఎవరికైనా గులాబ్ జామూన్ ఇష్టమైనా ఇరవైనాలుగ్గంటలూ, మూడువందల అరవైఐదు రోజులూ దాన్నే తినలేరు. ఏందుకు? తిన్నదే తింటుంటే కలిగేది సుఖం కాదు రోత. అలాగే సుఖం వెనుకనే దుఃఖం పుట్టే ఈ లౌకిక జీవితం ఎప్పుడోకప్పుడు రోత పుట్టిస్తుంది. కానీ మీ దగ్గర రెండు జామూన్లు ఉంటే, అందులో ఒకదాన్ని పక్కవారితో పంచుకుంటేనో! త్యాగం వల్ల సుఖం తగ్గదు సరికదా రెట్టింపౌతుంది. మనకున్న లైఫ్ స్పాన్‌లో మనకోసమే బ్రతక్కుండా మరొకరి కోసం బ్రతకడంలోనే మీనింగ్ఫుల్నెస్ ఉండేది.” అని ముగించింది రంజని.

ఆమె ఆవేశానికో లేక ఆమె మాటల్లోని గాఢతకో అక్కడున్నవారందరూ కొన్ని సెకన్ల పాటు మౌనం వహించారు. చివరి వరసలో ఎవరో ఒంటరిగా చప్పట్లు కొట్టారు. దానికి మరి కొన్ని చేతులు కలిసాయి. ఇంకొన్ని...ఇంకొన్ని...ఇంకొన్ని...కొద్దిక్షణాల్లో మొత్తం సభంతా చప్పట్లు కొట్టింది.

★ ★ ★ ★ ★

“మూడు శిఖరాల్ని దాటి, కైలాసాన్ని కూడా దాటి ’ప’ అక్షరమున్న నూటాఇరవైనాల్గవ గడికి చేరిన నీ మొదటి పావు చెప్పదల్చింది ఏమిటో?” అన్నాడు సాకారానందస్వరూపుడు.

“ప్రభూ! గీర్వాణ భాషలో ప – అంటే ధనాధిపతియైన కుబేరుడు. బహుశా తన జీవితంలో నిజమైన ధనమేదో తెలుసుకున్నందువల్ల నా మొదటి పావు కూడా కుబేరునితో సామ్యాన్ని పొందింది కాబోలు. నాకు తెలిసింది ఇంతే ఆపై మీరు దయజూపాలి!” అని చేతులు జోడించింది నిత్యకళ్యాణి.

“దేవీ! పాతీతి ప అని ధాతువు. పాతి అనగా రక్షణ అని అర్థం. మానవులకు నిజమైన రక్షణనిచ్చేది జ్ఞానం మాత్రమే. ఈ జన్మలో సంపాదించుకున్న ఆధ్యాత్మిక జ్ఞానం జన్మజన్మలకూ వెన్నంటి వస్తుంది. ’న హి జ్ఞానేన సదృశం’ అని వక్కాణించింది ఇందువల్లనే. జ్ఞానాన్ని మించిన మిత్రులు లేరు. జ్ఞానాన్ని మించిన సంపత్తు లేదు. జ్ఞానాన్ని మించిన సుఖం లేదు. జీవించడానికి అవసరమైనదేది, కానిదేదని తెలుసుకోవడమే జ్ఞానం. ప అంటే పవనే అంటే గాలి అని కూడా అర్థముంది. గాలిలోని ప్రాణవాయువు మాత్రమే జీవుల అస్తిత్వానికి ఆధారమైనట్టు లౌకికమైన చర్యల్లో పరోపకారం, పరదుఃఖదుఃఖిత్వం, ఉపకారస్మరణ మొదలైనవన్నీ కూడా భగవత్సంబంధమైనవిగా పరిగణింపబడతాయి. ఆ లక్షణాలను పుణికిపుచ్చుకున్న జీవులను నేను అనుగ్రహిస్తాను.” అన్నాడు శ్రీహరి.

“మీ అనుగ్రహమన్నా జ్ఞానప్రాప్తియన్నా ఒక్కటే స్వామీ!” అంది లక్ష్మి.

నవ్వాడు నారాయణుడు.

“మీ మొదటిపావుతో బాటూ రెండోపావుకూడా ముక్తికి చేరువైంది. మరో పందెం పడితే ఆ కాయ కూడా పరమపదాన్ని పొందుతుంది. ఆ కాయను ఎలా నడిపించబోతున్నారో చూడాలన్న కుతూహలం ఎక్కువౌతోంది!”

“చూద్దువులే ప్రియా!” అంటూ నారాయణుడు పాచికల్ని వేస్తే అవి మోహిని చేతిలోని కలశం నుండి జాల్వారిన అమృతపు గలగలల్ని ప్రతిధ్వనించాయి.

★ ★ ★ ★ ★

పల్లెటూరి గతులక దారిలో బస్సు నెమ్మదిగా పోతోంది. ఉపాధ్యాయ, మరో పురోహితుడు తో బాటూ కూర్చున్న కేశవ శర్మ వాళ్ళు ముగించుకు వస్తున్న కార్యక్రమం గురించి పిచ్చాపాటీగా మాట్లాడుకుంటున్నారు. కండక్టర్ బస్సునాపి ఎవర్నో ఎక్కించుకున్నాడు. ఆ వ్యక్తి లోనికి రాగానే సారాయి వాసన గుప్పుమని కొట్టింది. ఉపాధ్యాయ, మరో పురోహితుడూ కండువాల్తో ముక్కుల్ని మూసుకున్నారు. ఆ వ్యక్తి తూలుతూ వచ్చి వాళ్ళ పక్క సీట్లో కూలబడ్డాడు. ఇప్పుడు సారా వాసనతో బాటూ మురికి బట్టల నుండి వస్తున్న గబ్బు తోడయింది. ఆ కంపుకు బుర్ర తిరిగిపోయిన పురోహితుడు "ఏమండీ కండక్టర్ గారూ! ఇలాంటి వాళ్ళని ఎక్కించుకుంటారేమిటండీ?" అని అరిచాడు. దానికి సమాధానంగా ఆ కండక్టర్ "పంతులుగరూ! ఇది పబ్లిక్ ట్రాన్స్పోర్టు. టికెట్టు కొనేవాళ్ళెవరైనా బస్సు ఎక్కొచ్చు!" అని అన్నాడు. అబ్జెక్షన్ ఓవర్-రూల్డ్ ఐన న్యావాదిలా నోరు నొక్కేసుకున్నాడా పురోహితుడు.

సీటు చివరలో కూర్చునున్న శర్మ ఆ ప్రక్కనే కూలబడిన తాగుబోతును పరిశీలనగా చూసాడు. మాసి, మట్టిగొట్టుకుపోయున్న ప్యాంటు, షర్టు, బవిరిగడ్డం, తైలసంస్కారానికీ, క్షవరానికీ నోచుకోక ఉండలు గట్టి, గాలికి రేగుతున్న జుత్తు, భుజం నుండి వేళ్ళాడుతున్న జిప్పూడిపోయిన సంచీ. ఆ సంచీలో నుండి తొంగిచూస్తున్న కొన్ని గుడ్డలు. ఒక పిల్లనగ్రోవి. "అదొక్కటే అతకని వస్తువు!" అను అనుకున్నాడు శర్మ.

అరకొర మత్తులో కూరుకుపోయిన ఆ వ్యక్తి కళ్ళు తెరచి శర్మను చూసాడు. ఇద్దరూ పరస్పరం చూసుకుంటున్నారు. ఏమనిపించిందో గానీ ఆ తాగుబోతు శర్మను చూసి నవ్వాడు. వణుకుతున్న చేతుల్తో ఓ దండం కూడా పెట్టాడు. శర్మ భావరహితంగా చూస్తూనేవున్నాడు.

"ఛీ ఛీ ఛీ! కడుపులో నుండి వికారం తన్నుకొచ్చేస్తోంది. పాడువాసన, పాడు వాసన. ఇదిగో! నిన్నే! ఓయ్! ఆ వెనకాల సీట్లోకెళ్ళు." అని విసుక్కున్నాడు పురోహితుడు. "అబ్బా! సీతాపతీ! ఊరుకోవయ్యా! అసలే తాగుబోతు. నీ అరుపులకు తిక్క రేగిందంటే ఏడేడు తరాల్నీ తీసుకొచ్చి తిడతాడు. వాడి నోటిని తెరిపించడం కంటే మనం ముక్కు మోసుకోవడం ఉభయతాపి క్షేమం!" అన్నాడు ఉపాధ్యాయ.

"అలా అంటారేమిటండీ! ఇది పబ్లిక్ బస్సని కండక్టరు ఎక్కించుకొనె. బూతులు తిడతాడేమోనని నన్ను నోరుమూసుకోమని మీరు చెప్తున్నారాయే. ఇదెక్కడి అన్యాయమండీ! ఇంతకీ నేనేమన్నాననీ! వెనక సీట్లో కూర్చుంటే ఎవ్వరికీ ఇబ్బంది ఉండదని చెబుతున్నానంతేగా! దానికే వీడు బూతులు తిడతాడా? ఒకవేళ ఆ పనే గనక చేస్తే....ఏమండోయ్! ఇదే చెబుతున్నా, నాకూ నాటు భాషవచ్చు. ఆ అప్రాచ్యపు మాటల్ని నేను పలికానా వీడు చచ్చూరుకుంటాడు. ఛీ! ముదనష్టపు జనాలు, ముదనష్టపు జనాలు!" అని విసుక్కుంటూ కిటికీలో నుండి బైటకు ముఖం పెట్టి కూర్చున్నాడు సీతాపతి అనబడే ఆ పురోహితుడు.

సీతాపతి నసుగుడుకు మరో ఇద్దరు ప్రయాణీకులు కూడా గొంతు కలపడంతో కండక్టర్ లేచి వచ్చి ఆ తాగుబోతు జబ్బ పట్టుకుని "లే లే! ఆ వెనకాల కూర్చు!" అన్నాడు. ఆ తాగిబోతు లేవలేదు. మరోమారు చెప్పాడు కండక్టర్. అతను కదల్లేదు.  "ఏరా! కొవ్వెక్కిందా? చెప్పేది అర్థం కాదా!" అంటూ బూతులు లంకించుకున్నాడు కండక్టర్. ఐనా ఆ వ్యక్తిలో చలనం లేదు. మొండిగా సీటుకు అతుక్కుపోయి "పోరా...పోరా" అని ముద్దముద్దగా అన్నాడు. దాంతో వొళ్ళు మండిన కండక్టర్ విసురుగా చెంప మీద ఎడాపెడా కొట్టాడు. అలా కొట్టడాన్ని చూడలేకపోయిన శర్మ కండక్టర్ను ఆపాడు. "పోనివ్వండీ! కొట్టడమెందుకు? మేము సర్దుకుంటాం!" అన్నాడు. శర్మను చూడగానే చల్లబడ్డాడు కండక్టర్. "మీరు సర్దుకుంటానంటే నాకేం ఇబ్బందీ! ఆ పంతులుగారు గొడవెట్టారని గానీ...." అంటూ సీతాపతి కేసి చూసాడు. అప్పటిదాకా చోద్యం చూస్తున్నట్టు చూస్తున్న సీతాపతి చటుక్కున తలతిప్పుకున్నాడు. కండక్టర్ తన సీట్లోకెళ్ళిపోయాడు. శర్మకు మరోమారు దండం పెట్టాడు తాగుబోతు. అతను నవ్వుతున్నప్పుడు కనబడిందా రక్తం. "అయ్యో! మీ నొట్లో రక్తం!" అన్నాడు శర్మ క్రింది పలువరసకేసి చూపిస్తూ. ఏమీ పట్టనట్టుగా ఉండిపోయాడు ఆ తాగుబోతు. శర్మ మౌనం వహించాడు. కొన్ని నిముషాల తర్వాత సద్దుమణిగి, చాలామంది నిద్రలోకి జారుకున్నారు. సీతాపతి కిటికీకి తల ఆనించి జోరుగా నిద్రపోసాగాడు. తెల్లవారుజామున మూడింటికే లేచివుండడం వల్ల శర్మ కూడా కునుకులోకి జారుకున్నాడు.

ఓ చక్కటి, శ్రావ్యమైన రాగమొకటి శర్మ మాగన్నును కుదిపి లేపింది. చప్పున కళ్ళు తెరచి చూశాడు శర్మ. ఆ తాగుబోతు పిల్లనగ్రోవిని వాయిస్తున్నాడు. వెనువెంటనే ఆ పాటేదో గుర్తించాడు. "*క్షీరసాగర శయనా నను చింతల బెట్ట వలెనా?*" దేవగాంధారి రాగంలోని త్యాగరాజు కీర్తన. ఆశ్చర్యంతో శర్మ కనుబొమలు ముడిపడ్డాయి. అతని ఆశ్చర్యానికి కారణం తాగుబోతు మురళి వాయించడం కాదు.

నెమ్మనెమ్మదిగా హెచ్చుతున్న వేణువు నాదానికి బస్సులోని అందరి నిద్రా పారిపోయింది. కళ్ళు నులుముకొంటో, కళ్ళజోళ్ళని సరిచేసుకుంటో అందరూ ఆ నాదం వస్తున్న దిశకు తలలు నిక్కించి చూస్తున్నారు. సారాయి మత్తో లేక అంతర్యామి ప్రేరణో ఆ తాగుబోతు మురళీగానం సాగిపోతూనేవుంది.

కునికిపాట్లనుండి లేచిన సీతాపతి నోరువెళ్ళబెట్టి ఆ నాదాన్ని వినసాగాడు. తెలియకుండానే అతని చేతులు దరువులు వేయసాగాయి. ఉపాధ్యాయ కూడా ఆ తాగుబోతు వైపుకు చూస్తూ ఉండిపోయి సంగీతాన్ని ఆస్వాదించసాగాడు. శర్మకు ఇప్పుడెలాంటి ఆశ్చర్యమూ లేదు. అతని మనసు తాగుబోతు వేళ్ళ కదలికలపైన, బుద్ధి గమకాలపైన, చిత్తం కీర్తనలోని భావం మీద కేంద్రీకరింపబడ్డాయి. అలాంటి తాదాత్మ్యంలో తుచ్ఛమైన, క్షుల్లకమైన లౌకికాశ్చర్య విడంబనాలకు చోటేది?

పది పదిహేను నిముషాల లలిత లలిత స్వర కలిత నాదోపాసన చేసి చటక్కున మురళిని పెదవుల నుండి తీసేసి వెర్రిగా నవ్వాడా తాగుబోతు. నవ్వుతూనే ఎక్కిళ్ళతో సతమతమౌసాగాడు. ముందుసీట్ల ఉన్నవాళ్ళలో ఒకరు నీళ్ళ బాటిల్ ను అందించారు. రెండు గుక్కల నీళ్ళు తాగి – "అబ్బా!" అని అన్నాడా తాగుబోతు.

"ఆ‐‐‐.మీరు ఇక్కడే దిగాలి!" అన్నాడు కండక్టర్ తాగుబోతు వంక గౌరవంగా చూస్తూ. మురళీగానం సాగుతున్నంత సేపూ తన తోలుసంచీ మీద దరువులు వేస్తునేవున్న కండక్టర్, కచేరీ ముగిసిన తర్వాత తన ప్రక్కన కూర్చున్న ప్రయాణీకుడితో తను కూడా చిన్నప్పుడు సంగీతం నేర్చుకున్నట్టు, కొద్ది రోజులు వేణుగానాన్ని సాధన చేసినట్టూ చెప్పుకొచ్చాడు. అరగంట క్రితం బూతులు తిట్టిన వ్యక్తినే ఇప్పుడు 'మీరు' అంటూ గౌరవించసాగాడు.

తూలుతూనే లేచి, అప్పుడే నడకలు నేరుస్తున్న పసిపాపలా తడబడుతూ క్రిందకు దిగాడు. అతను పూర్తిగా క్రిందకు దిగబోయేలోగా బస్సును ముందుకు ఉరికించాడు డ్రైవర్. పట్టు జారి క్రింద పడిపోయాడా నిర్భాగ్యపు కళాకారుడు. బస్సులో ఉన్నవాళ్ళందరూ 'ఓ' అంటూ గట్టిగా అరిచారు.

అందరి కంటే ముందుగా శర్మ క్రిందకు దిగాడు. బలమైన దెబ్బ తగిలి రక్తం ఓడుతున్న అతని తలను తన ఒడిలోకి తీసుకున్నాడు. తెల్లటి అతని పంచె మీద ఎర్రగా అంటుకుంది రక్తం. తన కండువాను అతని తలకు చుట్టి "బస్సులోకి పట్టండి. ఆసుపత్రికెళ్దాం!" అన్నాడు. మరో నలుగురు చేరి అతన్ని ఎత్తుకుని బస్సులోకి ఎక్కారు. పోలీస్ కేసు అవుతుందేమోనన్న భయంతో డ్రైవర్ ఓ ప్రయాణీకుడు దారి చెబుతుంటే దగ్గరలోనే ఉన్న చిన్న ఊళ్ళోకి బస్సును మళ్ళించాడు.

ఆ ఊరికంతా కలిపి ఒకే ఒక ఆర్.ఎం.పి డాక్టర్ ఉన్నాడు. తన దగ్గరవున్న సరంజామాతో ప్రథమ చికిత్స చేసి పరిస్థితి చెడేలోపు ఏదైనా మంచి హాస్పిటల్‌కు తీసుకెళ్ళమని సలహా ఇచ్చాడు. ఆ వూరి నుండి ఇంకొద్ది దూరంలో కాస్త మంచి ఆసుపత్రి ఉన్నట్టుగా వివరాలు ఇచ్చాడు. డ్రైవర్, కండక్టర్, మరికొద్ది మంది ప్రయాణీకులు తలా కొంత డబ్బు వేసుకుని ఆ డాక్టర్‌కు ఇచ్చి మళ్ళీ బస్సును బయల్దేరదీసారు. సీట్లకు మధ్యన ఉండే జాగాలో తాగుబోతు కళాకారుడిని పడుకోబెట్టారు. అతనిలో జీవం అటు ఇటుగా కొట్టుకుంటోంది. శర్మ, ఉపాధ్యాయ అతనికి కాపలా కాస్తున్నారు.

డాక్టర్ చెప్పిన ఊరు చేరేసరికి సాయంత్రమైపోయింది. మొదట్లో మెడికో–లీగల్ కేసని మొరాయించిన ఆ ప్రైవేట్ హాస్పిటల్ వాళ్ళు సాంప్రదాయస్తులుగా కనబడుతున్న శర్మ, ఉపాధ్యాయల్ని చూసి ఏ కళనో ఒప్పుకున్నారు. చకచకా చికిత్స మొదలుపెట్టారు.

అంతా సద్దుమణగడం చూసిన డ్రైవర్, కండక్టర్, మిగతా ప్రయాణీకులు మెల్లగా అక్కడినుంచి జారుకున్నారు. వారితో బాటే సీతాపతి కూడా మొహం చాటేసి వెళ్ళిపోయాడు. ఆసుపత్రిలో డాక్టర్‌తోను, సిబ్బందితోనూ మాట్లాడుతూ ఉండిపోయిన శర్మ, ఉపాధ్యాయ మిగతావాళ్ళు వెళ్ళిపోయారన్న సంగతిని ఆలస్యంగా గమనించారు. ఉపాధ్యాయ బాధపడుతుంటే ఓదార్చాడు శర్మ.

వాళ్ళిద్దరినీ చూసిన ఆ హాస్పిటల్ యజమాని శర్మతో — “స్వామీ! నా పేరు హరనాథ్. ఈ హాస్పిటల్ నాదే. ఇబ్బంది అని అనుకోబోతే, మీరు మా ఇంటికి రండి. పైన ఓ గది విడిగా ఉంది. మీరిద్దరు ఈ రాత్రికి ఉండొచ్చు. ఇక్కడ మీరు ఉండీ చేసేదేమీ లేదు. మావాళ్ళు చూసుకుంటారు. రేపొద్దునకి బహుశా తెలివి రావొచ్చు.” అన్నాడు.

ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు శర్మ, ఉపాధ్యాయులు. ఆ ఇద్దరికీ ఇలాంటి అసందర్భంలో ఇరుక్కోవడం ఇదే ప్రథమం. ఇద్దరికీ మడి, మైలల ఆశంక బాధిస్తోంది. అంతేకాదు మరుసటి రోజు ఉదయం ఆహ్నికం గురించి బెంగ పట్టుకుంది. వాళ్ళ బాధను గ్రహించినట్టుగా — “ప్రొద్దున్నే మీరు అనంతకృష్ణశాస్త్రిగారి ఇంటికెళ్ళే ఏర్పాటు చేస్తాను. వారు మా వెనక వీధిలోనే ఉంటారు. శివాలయం అర్చకులు.” అన్నాడు హరనాథ్. సంక్షిప్తంగానూ, సారభూతంగానూ ఉన్న అతని మాటలు ఆ వైదీకుల మనసులను ఆకట్టుకున్నాయి.

“అతనికేం ప్రమాదం లేదుగా డాక్టర్?” అని అడిగాడు ఉపాధ్యాయ. ’ఏమీ లేద’న్నట్టుగా తల ఊపి “వెళ్దామా?” అన్నాడు హరనాథ్. అతన్ని అనుసరించారు శర్మ, ఉపాధ్యాయులు.

— — — — — — —

హరనాథ్ సమకూర్చిన పళ్ళు, పాలతో ఆ రాత్రి భోజనాన్ని ముగించారు శర్మ, ఉపాధ్యాయులు. విశాలమైన ఆ మేడ మీద గదిలో నేలపై నడుంవాల్చారిద్దరూ. కాసేపటి నిశ్శబ్దం తర్వాత — “శర్మా! ఆ తాగుబోతు మీద నీకు అవ్యాజమైన కారుణ్యం పుట్టుకొచ్చింది. ఎందుకంటావ్?” అని అడిగాడు.

“తాగుబోతైనా మన లాంటి మనిషేగా ఆచార్యా!” అన్నాడు శర్మ.

“మేమందరం అసహ్యంచుకుంటున్నా నువ్వు మాత్రం మొదటినుంచీ మామూలుగానే ఉన్నావ్. ఎందుచేత?”

“"ఏమో! తెలీదు. అతని సంచీలో ఉన్న పిల్లనగ్రోవిని చూసినప్పుడే ఓలాగా అనిపించింది!"”

“ఓహో.…దాన్ని నువ్వు ముందుగానే చూసావా? అతనో కళాకారుడైవుంటాడని అప్పుడే ఊహించేసావా?” కౌతుకంగా అన్నాడు ఉపాధ్యాయ.

“అవును!” — ముక్తసరిగా అన్నాడు శర్మ.

మరికొన్ని క్షణాలు మౌనం పిదప — “ఐనా, అబ్బాయ్! వాడో పచ్చి తాగుబోతు. జూదరో, వ్యభిచారో కూడా ఐవుంటాడు. అలాంటి వాడికి అంత గొప్ప సంగీతం ఎలా అబ్బిందంటావోయ్?” అన్నాడు ఉపాధ్యాయ, అదేదో ప్రపంచపు వింతైనట్టుగా, జరగకూడనిది జరిగిపోయినట్టుగా.

“కళ అనేది పూర్వజన్మ సుకృతం. వ్యసనమన్నది ప్రస్తుత జన్మలోని విపర్యాసం. రెండింటికీ ప్రత్యక్ష సంబంధం లేదు.” అన్నాడు శర్మ.

“అతనిలో నిన్ను ఆకట్టుకొన్నది అదేనా?” అన్నాడు ఉపాధ్యాయ,

“అదొక్కటే కాదు ఆచార్యా! అంతటి మత్తులో కూడా లయ తప్పని నాదాన్ని పలికించాడతను. అతని మెదడు సారాయితో మసిబారినా, లోపలనున్న అంతఃచేతనంలో ఏదో శుద్ధత్వం ఉంది. ఆ శుద్ధత్వమే అతని చేతి వేళ్ళని కదిలించింది. సుస్వరమైన నాదోత్పత్తిని సాధించింది. వేణువు కాక చేతికో కలాన్ని ఇచ్చి రెండు వాక్యాలు వ్రాయమంటే అతని వల్ల కాకపోయిండేది.” అన్నాడు శర్మ.

కేశవశర్మ మాటల్లోని ఆంతర్యం ఉపాధ్యాయను ఇట్టే ఆకర్షించింది. శుద్ధ శ్రోత్రియుడైన ఉపాధ్యాయకు మంత్రాల ఘనాపాఠీయం ఉంది గానీ శర్మకు ఉన్న విశ్లేషణా విచక్షణ తక్కువే. ఆ విషయం అతనికి అనేక సందర్భాల్లో అర్థమైంది. అందుకే వయసులో చిన్నవాడైనా శర్మ చెప్పే మాటల్ని శ్రద్ధగా వింటాడు.

“ఐతే శర్మా! ఇతనో శాపగ్రస్తుడైన గంధర్వుడంటావా?” అన్నాడు.

“గంధర్వుడా? అంతటి గొప్ప పోలికను సాధించే సాహసం చేయలేను. కానీ ఇతను కచ్చితంగా ఓ అపురూపమైన జీవి. వృథావ్యసనంలో చిక్కుకున్న శాపోపహతుడు. ఇంతకు ముందున్నట్టుగా కళ్ళు, కాళ్ళు స్వాధీనంలో ఉండని మత్తులో కూడా అద్భుతమైన లయజ్ఞానాన్ని చూపించడం అరుదైన

విషయమే!" అన్నాడు శర్మ. సంగీతంలో శర్మకు చక్కటి అవగాహన ఉందని తెల్సిన ఉపాధ్యాయ అతని నిర్ణయాన్ని శంకించేందుకు వెళ్ళలేదు.

మళ్ళీ శర్మే కొనసాగించాడు – "ఆచార్యా! మీకు తెలుసు! శబ్దం లేకుండా ఈ ప్రపంచం లేదు. లయబద్ధమైన శబ్దమే నాదం. ఈ ప్రపంచం మొత్తం నాదస్వరూపం. నాదం పరమాత్ముని మరో రూపం. '*న నాదేన వినా గీతం న నాదేన వినా స్వరః/ న నాదేన వినా రాగస్తస్మాన్నాదాత్మకం జగత్/*' అన్నాడు సంగీతదామోదర కర్త. అక్కడితో ఆగకుండా '*న నాదేన వినా జ్ఞానం న నాదేన వినా శివః/ నాదరూపం పరం జ్యోతిర్నాదరూపీ పరం హరిః*' అని నొక్కి చెప్పాడు." అని ఆగాడు.

"ఆహా! బావుంది. '*త్రైవర్గ ఫలదాః సర్వే దాన యజ్ఞ స్తవాదయః – ఏకమ్ సంగీత విజ్ఞానం చతుర్వర్గ ఫలప్రదం*' అని కూడా అన్నారు." అన్నాడు ఉపాధ్యాయ.

"అవును! '*శబ్దమూర్తి ధరస్యైతె విష్ణోరంశ మహాత్మనః*' అంటుంది విష్ణుపురాణం. నాదానికి అక్షరాలు ఆశ్రయాలు. ఆ అక్షరాలకు లిపి మరియు శబ్దం అనే రెండు ముఖాలున్నాయి. శబ్దాలు విష్ణువు యొక్క అంశలు. దీన్ని మరింత స్పష్టంగా చెబుతూ – '*నాహం వసామి వైకుంఠే యోగినో హృదయే న వై / మద్భక్తా యత్ర గీయంతి తత్ర తిష్టామి నారదా*' అని అన్నాడు శ్రీహరి. వైకుంఠంలోనో, యోగుల హృదయాల్లోనే కాక ఎవరైతే తన నామ కీర్తనను గానం చేస్తుంటారో వారిలో కూడా నేనుంటానని నారదుడికి ఉపదేశించాడు నారాయణుడు."

"బావుంది! ఇంతకీ తాళం అంటే ఏమిటి?" అడిగాడు ఉపాధ్యాయ.

"తల ప్రతిష్టాయాం అని ధాతువు. ఒక స్వరాన్ని ఎంతసేపు పాడాలని సూచించేది తాళం. దీన్ని చేతులతో దరువు వేయడం ద్వార తెలుసుకోవచ్చు. పార్వతీపతియైన మహారుద్రుడు చేసే నాట్యానికి 'తాండవ'మని పేరు. పార్వతీదేవి చేసే నాట్యానికి 'లాస్య'మని పేరు. ఆ రెండు పదాల మొదటి అక్షరాలైన తా, ల లను కూర్చితే పుట్టిందే 'తాళం'. '*నకారం ప్రాణ నామానాం దకార మనలం విదుః*' అని చెప్పినట్టుగా మన చెవుల్ని గట్టిగా మూసుకుంటే 'హూం' అన్న ధ్వని నిరాటంకంగా వినబడుతూనే ఉంటుంది. అదే ప్రాణవాయు సంచార శబ్దం. వైశ్వానరాగ్ని ప్రజ్వలన చ్ఛటచ్ఛటలు. వెరసి అదే

జీవనాదం. ఆ 'హూం'కార నాదం ఉన్నంతసేపూ మనలో శ్వాసోచ్ఛ్వాస ఒక 'తాళ'బద్ధమైన రీతిలో సాగుతుంది. అది నిలచినరోజు జీవనతాళం ఆగిపోతుంది. వైశ్వానరుడు, ప్రాణాగ్ని శాంతులైన రోజున మనలోని నటరాజు తన అర్ధాంగితో కూడి తొలగిపోతాడు.. సర్వచేష్టాప్రదమైన మనిషి మరుక్షణంలో శవమనిపించుకుంటాడు. మూగబోతాడు. నాదహీనుడౌతాడు." అన్నాడు శర్మ. అతని గాత్రం గద్గదికమౌతోంది.

ఉపాధ్యాయ కూడా మారుమాట్లాడలేకపోయాడు. శర్మలోని విశ్లేషణాశక్తి అతనిలోని విద్యాశక్తిని జయించింది. తాను పఠిస్తున్న ప్రతి అక్షరంలోని నాదాత్మకమైన పరమాత్ముని లీలను లీలామాత్రంగానైనా తెలుసుకోగలిన ఈ సుకృతానికి మూలం ఓ తాగుబోతన్న నిష్టుర సత్యం ఉపాధ్యాయను ఆసాంతం కుదిపివేసింది. ఇప్పుడు ఉపాధ్యాయకు ఆ తాగుబోతులో కూడా ఏదో సుందరత్వం కనబడసాగింది.

భగవంతుని సృష్టిలో ప్రయోజనంలేని వస్తువు గానీ, వ్యక్తి గానీ లేదన్న మరో ధర్మసూక్ష్మం అతనికి గోచరించింది. తన ప్రక్కనే పడుకునివున్న ఈ సాధారణ వ్యక్తిలో అసాధారణమైన సమన్వయశక్తి ఉందనీ, అది నీచ సన్నివేశాల్లో కూడా ఉత్తమమైన జ్ఞానాన్ని వెలికి తీయగలదని, అలా సర్వత్రా జ్ఞానాన్ని దర్శించగలగడమే జీవనసాఫల్యమని గ్రహించాడు ఉపాధ్యాయ.

'లబ్ డబ్' అని లయాత్మకంగా ధ్వనించే హృదయ స్పంద నం బాహ్యప్రపంచానికి వినిపించని నిశ్శబ్దనాదోపాసన. అదే నేడు ఉపాధ్యాయ మస్తిష్కంలో రేగుతున్న నాద-లయ-విలయ తాండవలాస్యం. అతనికి ఇంకేమీ మాట్లాడాలని అనిపించలేదు.

తాళబద్ధమైన నాదోపాసనకు వాగాడంబరంతో పనిలేదు.

\- - - - - - -

"స్వామీ! హనుమంతుని వద్ద ఉండిన మీ రెండో ఆటకాయ పరమపదాన్ని చేరేసింది."

"అవును దేవీ! పండితుడూ, సమదర్శి ఐన హనుమ అనుగ్రహంతో పరమపదం లభించడం అసాధ్యమేమీ కాదు! మాయ అనేది మత్తులాంటిది. ఆ మత్తుకు విరుగుడు సుజ్ఞానమే. అటువంటి నిజజ్ఞానానికి నిదర్శనం హనుమంతుడు. అంజనాసుతుని పాదసేవనంతో మాయ తొలగి, పరమపదం ప్రాప్తమౌతుంది"

"నా రూపమైన మాయ మత్తుమందులాంటిదా ప్రభూ?"

"దేవీ! అది కేవలం పోలిక మాత్రమే. వాస్తవ విషయం కాదు. మాయా, జయ, కృతి, శాంతి అన్నవి నీ నాల్గు రూపాలు. మాయా–వాసుదేవ, జయ–సంకర్షణ, కృతి–ప్రద్యుమ్న, శాంతి–అనిరుద్ధ అన్నవి మన మూల రూపాలు. మాయా–వాసుదేవులకు ప్రభవించిన వాడే బ్రహ్మ. ప్రపంచమంతా మాయామయమంటే లక్ష్మీమయమనే అర్థం. అప్రాకృతుడనైన నాకు, బ్రహ్మ సృజించిన ప్రాకృతబద్ధ జీవరాశులకు మధ్య తెరలా నీ 'మాయా' రూపం ఆవరించివుంటుంది. 'మాయ' అంటే భ్రమ కాదు. సత్యభూతమైన ఈ భౌతిక సృష్టికే 'మాయా' అన్న పేరు. ఈ భౌతికావరణాన్ని దాటి నా స్వరూపాన్ని ఎంతో కొంత తెలుసుకోవడమే ముక్తి. కానీ నీ 'మాయా' రూపాన్ని దాటడం అంత సులభం కాదు. ఎందుకంటే సర్వలక్షణసంపన్నురాలివైన నీ ఆకర్షణ అత్యంత బలమైనది. ప్రాకృతిక సుఖభోగాలనే మత్తును కలిగించేది. ఆ మత్తు వీడాలంటే భౌతికమైన దేహాన్ని దాటి, లోపలనున్న అంతఃచేతనాన్ని గుర్తించగలగాలి. అప్పుడే సునిశితమైన, ఆధ్యాత్మికజ్ఞానసత్త్వమైన మనోనేత్రం తెరచుకుని గీతలో చెప్పినట్టుగా  'శునిచైవ శ్వపాకేచ పండితాః సమదర్శినః' అన్న స్థితి అనుభవంలోకి వస్తుంది."

"అంటే మీ రెండో ఆటకాయ అలాంటి స్థితిని నేడు సాధించిందన్న మాట! దానిదెంతటి సౌభాగ్యం! సర్వజ్ఞానాధారులైన మీ చేతితో నడపబడింది కాబట్టే సమదర్శిత్వాన్ని సాధించి ముక్తిని పొందింది. మీ రెండు కాయలూ పరమపదాన్ని చేరేసాయి. అంటే మీరు గెల్చినట్టే...ఆట ముగిసినట్టే!"

"నా ప్రియసఖివి. మరో పందెం వేసి నీ కాయల్నీ గట్టెక్కించు"

"చిత్తం మీ ఆజ్ఞ నాకు శిరోధార్యం." అంటూ అంబ పాచికల్ని వేస్తే అవి నారదుని మహతీ తంత్రీనినాదాల్లా సుస్వరంగా ధ్వనించాయి.

★ ★ ★ ★ ★

షాపింగ్ చేయడానికి వస్తానని స్నేహితురాలు చెప్పడంతో పికప్ చేసుకోవడానికి ఆ సిటీ బస్టాప్ కు దగ్గరలో కారును ఆపి వేచిచూస్తోంది రంజని. కొత్తగా డెవలప్ అవుతున్న ప్రాంతం కావడంతో అక్కడక్కడా ఇళ్ళు, షాపులు వున్నాయి. ఐదుగంటలౌతున్న ఆ సాయంత్రంవేళ బస్టాప్ చుట్టుపక్కలన్నీ నిర్మానుష్యంగాను నిశ్శబ్దంగానూ ఉన్నాయి. స్టీరియోలో నుండి ఎమ్మెస్ కీర్తన ఒకటి మంద్రస్థాయిలో వస్తూంటే స్టీరింగ్ పై తాళం వేస్తూ ఆ కీర్తనను మెల్లగా పాడుతోంది రంజని.

అంతలో ఓ కుర్రజంట బస్టాప్ దగ్గరకొచ్చింది. పంజాబీ డ్రస్‌లో వున్న అమ్మాయి, జీన్స్ ప్యాంట్ టీషర్ట్ వేసుకున్న అబ్బాయితో అతి చనువుగా ఉంటూ గలగలా మాట్లాడుతోంది. కాసేపటికి అబ్బాయి ఆమె నడుం చుట్టూ చెయ్యి వేసాడు. తన నడుంచుట్టూ ఉన్న చెయ్యిపై తనూ చెయ్యిని వేసిందా అమ్మాయి. ఆ చొరవను అమ్మాయి ఆపుతుందేమోనని అనుకుంది రంజని. కానీ అలా జరగలేదు. మరికొద్ది క్షణాల్లో అమ్మాయి బుగ్గ మీద మెరుపువేగంతో ముద్దుపెట్టాడా అబ్బాయి. పకపకా నవ్వింది అమ్మాయి. ఆ పబ్లిక్ సరసాన్ని విస్మయంతో చూస్తూ తలను విదిల్చింది రంజని. మొబైల్ తీసి మిత్రురాలికి ఫోన్ చేసింది. ఇంకో పదినిముషాల్లో వస్తున్నట్టు చెప్పింది. ఆలస్యానికి కారణాలన్నీ ఏకరువుపెట్టి "సారీనే" అని ముగింపు పలికిందామె. "ప్చ్!" అంటూ నిట్టూర్చింది రంజని. వద్దు వద్దనుకుంటూనే మళ్ళీ ఆ కుర్రజంట వైపుకు చూసింది రంజని.

ఇప్పుడూ ఇద్దరూ దూరదూరంగా ఉన్నారు. అమ్మాయి ఏదో అడుగుతోంది. అబ్బాయి చేతుల్ని ఊపుతూ ఏదో చెబుతున్నాడు. మాట్లాడుతూ మాట్లాడుతూ బెంచ్ మీద నుంచి చివాలున లేచిందామ్మాయి. చెయ్యి పట్టుకుని లాగాడు అబ్బాయి. విదిల్చికొట్టిన అమ్మాయి కళ్ళు తుడుచుకుంటూ రోడ్డు మీదకు పరుగెట్టింది. నింపాదిగా లేచి నిలబడిన అబ్బాయి ఆగమని అరుస్తున్నాడే గానీ అడుగు ముందుకు వెయ్యలేదు. వినబడినా వినబడనట్టుగా విసురుగా ముందుకు కదిలిన అమ్మాయి, రంజని కారు వైపుకు వచ్చింది. అప్పుడు కనబడ్డాయా కన్నీళ్ళు! రంజని కార్ డోర్ ను తెరిచింది. తనను దాటుకుపోబోతున్న అమ్మాయి భుజాన్ని పట్టి ఆపింది.

"ఏమైంది?" – దర్పంగా అడిగింది రంజని. మౌనమే తప్ప సమాధానం రాలేదు. "నిన్నే! ఏమైంది?" రెట్టించి అడిగింది రంజని. ఏమీ లేదన్నట్టు తలనూపిందామ్మాయి.

"ఏం జరక్కపోతే ఈ ఏడ్పెందుకు? వాడెవడు?" అంది రంజని. ప్రతి పదంలోనూ అధికారం ధ్వనించేట్టుగా జాగ్రత్తపడింది.

"మీరెవరు?" అంది అమ్మాయి తికమకపడ్తూ.

"వాడెవడు? నీ సంగతేంటి?" ఆ అమ్మాయి భుజాన్ని బిగిసిపట్టుకుని అడిగింది.

అందం, ఆకర్షణతో బాటు హుందాగా కనబడుతున్న రంజనిని, ఆమె దిగిన ఖరీదైన కారును మార్చిమార్చి చూడసాగిందామ్మాయి. ఇప్పుడా కళ్ళలో నీళ్ళతో బాటు ఆశ్చర్యం కూడా చేరింది. ఎందుకో రంజనికి ఆ అమ్మాయి బేలతనం నచ్చింది.

"అతను....అతను....." తత్తరపడ్తూ నోరు విప్పిందా అమ్మాయి.

"బాయ్ ఫ్రెండ్! అంతేనా?" నిర్లక్ష్యంగాను, విసురుగానూ అంది రంజని.

కాదన్నట్టు తలనూపి "నా భర్త!" అందామ్మాయి.

"వోయ్! ఏంటి? తమాషానా?" కనుబొమల్ని ఎగరేస్తూ అడిగింది రంజని. ఈసారి ఆమెకు నిజంగానే కోపమొచ్చింది.

"నిజమండీ! ఆయన నా హజ్బెండే! లాస్ట్ మంత్ పెళ్ళైంది." బెరుకుగా అందా అమ్మాయి. ఆ అబ్బాయి వైపుకే చూస్తు. రంజని కూడా అతని వైపుకు చూసింది. గబగబా అటుకేసి వస్తున్నాడతను. ఈమారు అమ్మాయి కంఠం వైపు చూసింది రంజని. పసుపుతాడు కనబడుతోంది. అంటే అమ్మాయి నిజమే చెబుతోంది.

"అతను నీ మొగుడైతే ఆ ఏడుపెందుకు? ఇలా ఎందుకు పరుగెత్తుతున్నావ్?" విస్తుబోయినట్టుగా అడిగింది రంజని.

జవాబు చెప్పలేదా అమ్మాయి. ఈలోపు భర్తగా చెప్పబడుతున్న జీన్స్ ప్యాంట్ కుర్రవాడు అక్కడికొచ్చాడు.

"వాట్ మేడమ్?"

"ఈ అమ్మాయి ఎవరు?" నిజం రాబట్టాలన్న నిశ్చయంతో ఆ అమ్మాయిని అడిగిన ప్రశ్ననే అబ్బాయినీ అడిగింది రంజని.

"నా వైఫ్!" అన్నాడు. అతని గొంతులో చిరాకు స్పష్టంగా ప్రతిధ్వనిస్తోంది. దాన్ని పట్టించుకోనట్టుగా "ఐతే ఆమె ఎందుకలా ఏడుస్తోంది? ఈ ఈవ్ టీజింగ్ ఎందుకు? పబ్లిక్ ప్లేస్‌లోనే ఇలా ఏడిపిస్తున్నావంటే ఇంట్లో నాలుగ్గోడల మధ్య ఇంకెంత ఏడ్పిస్తున్నావో? అమ్మాయ్! నాతో రా! పక్క రోడ్డులోనే విమెన్స్ పోలీస్ స్టేషన్ ఉంది. అక్కడ కంప్లైంట్ రాసిద్దువుగానీ!" – ఆపకుండా మాట్లాడేస్తోంది రంజని.

ఈసారి విస్తుబోవడం ఆ ఇద్దరి వంతైంది. రంజని దిగిన ఖరీదైన కారు వాళ్ళిద్దరినీ ఎదురు తిరగనివ్వకుండా చేస్తోందేమో! పైగా ఆమె దర్పంతో కూడిన వ్యవహార శైలి కూడా వాళ్ళని మాటకు మాట బదులు చెప్పనివ్వకుండా ఆపుతోందేమో!

"నీ పేరేమిటమ్మాయ్?" కొన్ని క్షణాల నిశ్శబ్దం తర్వాత టక్కున అడిగింది రంజని. "నా పేరా?" నివ్వెరబోతూ అందామ్మాయి. "నీ పేరే! ఏం మర్చిపోయావా?" ఎకసెక్కంగా అడిగింది రంజని. ఓమారు భర్త వైపు చూసి "అనామిక!" అంది. ఆ సమాధానంతో చిర్రెత్తుకొచ్చింది రంజనికి – "తమాషా చేస్తున్నావా?" అని తీవ్రంగా అడిగింది. లేదన్నట్టు తలూపి "కావాలంటే మావార్ని అడగండి!" అంది ఆ అమ్మాయి. ఇప్పుడా అమ్మాయి గొంతులో మొదులున్న భయం లేదు. సరికదా కొద్దిగా నిర్లక్ష్యం ధ్వనిస్తున్నట్టు అనుమానించసాగింది రంజని.

"నిజంగా ఈమె పేరు అనామికనేనా?" – 'కాదు అన్నావంటే చంపేస్తా'నన్నంత కోపంతో ఆ అబ్బాయిని అడిగింది. "ఇట్స్ ట్రూ మేడమ్!" అని చిరునవ్వును జోడించి మరీ చెప్పాడు అబ్బాయి.

“ఐతే నీ పేరు అపరిచితుడా!” తను కూడా వ్యంగ్యంగా అడిగింది రంజని. “నో మేడమ్!” అని అన్నాడేగానీ తన పేరు చెప్పలేదా అబ్బాయి.

ఉన్నట్టుంది నిస్సత్తువ ఆవరించింది రంజనికి. తర్వాత ఏం మాట్లాడాలో తోచలేదు. వెంటనే మాటల్ని కూడదీసుకొని “ఇలా పబ్లిగ్గా భార్యభర్తలు పోట్లాడుకోవడం సభ్యత కాదు.” అంది. రంజని మాటల కోసమే ఎదురుచూస్తున్నట్టుగా అందుకొన్నాడా అబ్బాయి – “ఐతే ముక్కూ మొహం తెలియనివాళ్ళకి ఇలా హ్యామర్ వేయడం మ్యానర్సా మేడమ్?” అన్నాడు. మళ్ళీ అతని పెదవులపై అదే చిరునవ్వు. ఆ నవ్వుకు తాటిచెట్టంత ఎత్తులో కోపం ఎగిసిపడింది రంజనిలో. కానీ తమాయించుకుంది. “మీకు భార్యాభర్త రిలేషన్ గురించి ఏమీ తెలిసినట్టులేదు. దట్స్ వై యూ బోత్ ఆర్ డూయింగ్ ఆల్ దిస్ నాన్సెన్స్!” అని ఘాటుగా వ్యాఖ్యానించింది రంజని.

“అవునా? ఐతే మీకు తెలిసింది చెప్పండి మేడమ్. వింటాం! ఏం అనామికా?” అన్నాడా అబ్బాయి. “ఎస్ ఎస్” అని వంత పాడింది అనామిక. వాళ్ల వైపు వెర్రిగా చూసింది రంజని. “ఆర్ యూ సీరియస్?” అని నమ్మశక్యం కానట్టుగా అంది. “వి ఆర్ సీరియస్ మేడమ్!ఆ...నిలబడి కాళ్ళు పీకుతున్నాయి. కార్లో కూర్చొని మాట్లాడుకొందామా? కమాన్ అన్నూ!” అంటూ రంజని ప్రతిస్పందనకై ఎదురుచూడకుండా కారులోకి దూరాడాబ్బాయి. అనామిక అతన్ని అనుసరించింది. చేసేది లేక డ్రైవర్ సీట్లో కూర్చుంది రంజని. కూర్చున్నాక కూడా రంజని పెదవి విప్పకపోవడంతో “వి ఆర్ వైటింగ్ మేడమ్! ప్లీజ్ త్రో యువర్ పెర్ల్స్ ఆఫ్ విజ్‌డమ్!” అన్నాడా అబ్బాయి. చివాలున తలనెత్తి రియర్ వ్యూ మిరర్‌లో అతని మొహాన్ని చూసింది. అదిగో! మళ్ళీ అదే చిర్రెత్తించే చిరునవ్వు. మరోమారు కోపాన్ని తమాయించుకుంది రంజని. “ప్లీజ్ మేడమ్! మీరు చూస్తుంటే బాగా చదువుకొన్నవారిలా ఉన్నారు. మేమిద్దరం అంతగా చదువుకోలేదు. పల్లెటూర్లలో పుట్టిపెరిగాం. ప్లీజ్ చెప్పండి!” – డామేజ్ కంట్రోల్ చేస్తున్నట్టుగా ప్రాధేయపూర్వకంగా అడిగింది అనామిక.

“ఓకే! లెటజ్ స్టార్ట్– చెప్పిన పనిని భార్య చేయగానే ఆవిడని మర్చిపోవడం మగవాళ్ళకి సహజం! బట్, భార్య తన భర్తతో నిష్ఠూరంగా మాట్లాడకుండా ప్రేమతో మాట్లాడాలి...ఆల్వేస్!”

“ఓహ్! దిస్ ఈజ్ వన్ సైడెడ్ స్టేట్మెంట్!” అని అబ్బాయి అంటే “వెల్ సెడ్ మేడం! కంటిన్యూ చేయండి” అని అనామిక అంది. రంజని చెప్పుకుపోసాగింది – “అలా పని చేసిన వెంటనే భార్యను మర్చిపోయినా భర్తే భార్యకు బెస్ట్ ఫ్రెండ్!”

“వెల్! ఇందులో కొంత సెన్స్ వుంది” అన్నాడా అబ్బాయి. “నాన్సెన్స్!” అంది అనామిక.

ఏమీ పట్టించుకోనట్టు కొనసాగించింది రంజని – “భార్యాభర్తలు ఒకరితో ఒకరు మాట్లాడుకునేటప్పుడు మాటల్ని అదుపులో పెట్టుకుని మాట్లాడాలి. ఎందుకంటే ఏ ఒక్కరు అనరాని మాటలన్నా సంబంధం చెడిపోతుంది. భార్యాభర్తల మధ్య కొట్లాట ఎవ్వరికీ మంచిది కాదు. వాళ్ళిద్దరి  కాయకష్టంలో భర్తకు సుఖం దొరకాలి. అతణ్ణి చక్కగా చూసుకోవడంలో భార్యకు సుఖం దొరకాలి.”

“వన్ మినిట్ మేడమ్! అంటే భార్య స్లేవరీ చేయాలనా?” అడిగింది అనామిక.

“నో! ఎందుకలా అనుకొంటావ్? నువ్వు ఐ.బి.ఎంలో ఉద్యోగం చేస్తుంటే అదీ స్లేవరీనే అని అనుకొంటావా? లేక గొప్పగా చెప్పుకొంటావా?” ఎదురుప్రశ్న వేసింది రంజని.

“గాటిట్! ప్లీజ్ కంటిన్యూ!” అంది అనామిక.

“యూ నో, విడివిడిగా ఉన్న కట్టెలను మండిస్తే పొగ మాత్రమే వస్తుంది. కానీ వాటిల్ని గుంపుగా చేర్చినపుడు నిప్పు మండుతుంది. అలాగే భార్య–భర్త ఎడమొహం పెడమొహంగా ఉంటే అనుమానపు పొగలు పెరిగి ఒకరికొకరు అర్థం కాకుండా పోతారు. కలిసిమెలిసి ఉంటే అవే అనుమానాలు చకచకా కరిగిపోతాయి!”

“సూపర్....భలే చెప్పారు మేడమ్!” అని కోరస్‌గా అన్నారా కుర్రవాళ్ళు.

ఇక చెప్పడానికేమీ లేదన్నట్టుగా “దట్సిట్!” అని భుజాలు కుదిపింది రంజని. “ఇప్పుడు చెప్పండి! ఇలా పబ్లిగ్గా ముద్దులు పెట్టుకోవడాలు, పోట్లాడుకోవడాలూ మ్యానర్స్ కిందకు వస్తాయా?”

“నో...సర్టన్లీ నాట్!” అంది అనామిక.

“మరి, మీరిద్దరెందుకలా చేసారు?” టక్కున అడిగింది రంజని.

“అదా…అదీ…” అని నసిగింది అనామిక.

“ఏమీ లేదు మేడమ్! క్యూటీవీ ఛానెల్ వాళ్ళు ’ బకరాను చూడర బాబూ!’ అనే ప్రోగ్రాం చేస్తోంది. అందులో భాగంగానే ఈ డ్రామా" అన్నాడా కుర్రవాడు.

"వ్వాట్!?" అని ఆశ్చర్యపోతూ అడిగింది రంజని.

"ఎస్ మేడమ్! అదిగో అక్కడున్న మారుతీవ్యాన్లో మా కెమరా క్రూ ఉంది.....హాయ్ గైస్...." అంటూ చేయినూపాడతను. రంజని చూస్తుండగా రోడ్డుకు అవతలి వైపు వున్న మారుతీ వ్యాన్ డోర్ తెరుచుకుంది. ముగ్గురు వ్యక్తులు చేతులూపారు.

"ఈ వారం బకరా కోసం డేవిడ్ అంటే నేను, రోష్నీ అంటే మీ 'అనామిక' భార్యాభర్తలుగా నటించాం. మిమ్మల్ని బోల్తా కొట్టించాలని అనుకొని మేమే క్లీన్ బౌల్డయ్యాం!" అన్నాడు ఆ యువకుడు.

"మీరు క్లీన్ బౌల్డయ్యారా?" ప్రశ్నించింది రంజని.

"అవును మేడమ్! ఏవో పిచ్చి చేష్టలు చేసి మిమ్మల్ని విసిగించి ఆడుకోవాలని అనుకున్నాం. కానీ మీ మాటల ద్వారా కొత్త జంటలకు మంచి సందేశాన్ని చేరవేసాం. థాంక్స్ ఎ లాట్ మేడమ్!"

అన్నాడు డేవిడ్.

"మేడమ్, మీ పేరు చెప్పండి!" అంది రోష్నీ.

"రంజని!"

"వ్యూయర్స్! ఈనాటి బకరా చూడర బాబూ కార్యక్రమంలో అనుకోని ట్విస్ట్ ను చూసారు కదా! బకరాలు కాకూడదనుకొనే భార్యాభర్తలందరూ రంజనిగారు చెప్పిన సూత్రాల్ని పాటించాల్సింది. ఎంటర్టైన్మెంట్ కోసం చేస్తున్న ప్రోగ్రామ్ ఇన్ఫోటైన్మెంట్ గా మార్చివేసిన మేడమ్ రంజని గారికి మీ

అందరి తరపునా, క్యూటీవీ తరపున ధన్యవాదాలు తెలుపుతున్నాం!" అని నాటకీయంగా చెప్పి, రంజని షేక్ హ్యాండిచ్చింది రోష్నీ.

షూటింగ్ ముగిసాక రంజని ఫోన్ నెంబర్, చిరునామా తీసుకున్న రోష్నీ త్వరలోనే ఓ మంచి కార్యక్రమం కోసం ఆమెను కాంటాక్ట్ చేయనున్నట్టు చెప్పింది.

ఈలోపు అక్కడికి వచ్చిన రంజని స్నేహితురాలు టీవీలో కనబడే అవకాశాన్ని పోగొట్టుకున్నందుకు గానూ డ్రైవింగ్ చేస్తున్నప్పుడు, షాపింగ్ జరుగుతున్నపుడు, మళ్ళీ ఇంటికి మళ్ళుతున్నప్పుడు రంజని తల తింటూనే ఉండిపోయింది. ప్రజల్లో కీర్తి కాంక్ష ఎంతగా పెరిగిపోయిందోనని ఆశ్చర్యపోతునే ఇంటికి మళ్ళింది రంజని.

— — — — — — —

"రంజూ! రంజూ!" గట్టిగా అరుస్తూ లోనికొచ్చాడు అనంత్. అతని అరుపులకు ఉలిక్కిపడి హాల్లోకి పరుగెట్టుకొచ్చింది రంజని.

"రత్నమ్మ...అదే యూట్యూబ్ లో నేను వీడియోపెట్టానే....ఆమె గంట క్రితం యాక్సిడెంట్లో చనిపోయింది. వెంకటేసులు ఫోన్ చేసాడు." అన్నాడు అనంత్.

షాక్ తో అలా నిలబడిపోయింది రంజని.

"ఎవడో లారీవాడు తాగేసి బండి నడుపుతూ వాళ్ళున్న గుడిసె మీదకు ఎక్కించేసాడు. రత్నమ్మ స్పాట్లోనే చనిపోయింది. మనం వెళ్దామా?" అన్నాడు. అతని నుదుటి మీది చెమట చుక్కలు రత్నమ్మ కూతురి కన్నీళ్ళలా కనిపించింది రంజనికి. మరో మాట లేకుండా బయల్దేరింది.

అక్కడి దృశ్యం రంజని ఊహించుకొన్నట్టుగా లేదు. ఎంతోమంది గుమిగూడివుంటారనుకొన్న ఆమెకు వెంకటేసులు, అతని కూతురు, నలుగురు పోలీసులు, ఇంకో ఇద్దరు వ్యక్తులు మాత్రమే కనబడ్డారు. రత్నమ్మ శవం కాబోలు గుడ్డల్లో కప్పబడివుంది. ఆ ఇద్దరు వ్యక్తులూ లారీవాళ్ళైవుంటారని అనుకుంది

రంజని. వెంకటేసులుకు, ఆ ఇద్దరికీ మధ్యన గిరికీలు కొడుతున్నాడు సబ్ ఇన్స్పెక్టర్. కాసేపు అటు, కాసేపు ఇటూ మాట్లాడుతున్నాడు.

వెంకటేసులు వెనకాలే పెద్ద పెద్ద కళ్ళలో కారి, ఆరిపోయిన కన్నీటి ఛాయల్తో బిక్కుబిక్కుమని చూస్తున్న అతని కూతురుని పిలిచింది రంజని. అమ్మాయికిప్పుడు ఒకటిన్నర సంవత్సరం. అప్పుడప్పుడూ వస్తూవుండడం వల్ల రంజనితో పరిచయం ఏర్పడిందా అమ్మాయికి.

బుడిబుడి నడకలతో రంజని దగ్గరకొచ్చింది. హ్యాండ్ బ్యాగ్ లో ఉన్న బిస్కెట్ ప్యాకెట్ తీసి అమ్మాయి చేతికిచ్చింది రంజని. పెద్ద ప్యాకెట్ ను చూడగానే అమ్మాయి మొహం వెలిగిపోయింది. మౌనంగా అందుకుని తండ్రి వెనకాల చేరిపోయింది.

ఎడతెగకుండా సాగుతున్న పోలీసువాళ్ళ మాటల్ని వినడానికి వెళ్ళాడు అనంత్. కాసేపటికి వెనక్కు వచ్చి, రంజని చెవిలో గుసగుసగా "భార్య శవానికి రేటు మాట్లాడుతున్నాడు, వెధవ!" అన్నాడు.

ఆ మాటలకు కఅలా బిగుసుకుపోయి చూసింది రంజని – "నిజంగా?"

"నిజంగానే! పద, వెళ్ళిపోదాం!" అన్నాడు అనంత్.

మౌనంగా అతన్ని అనుసరించింది రంజని.

"అమ్మగారూ!" అంటూ పరుగెట్టుకొచ్చాడు వెంకటేసులు. "వెళ్తాన్నారా అమ్మా?" అన్నాడు.

"అవును. నువ్వు చేస్తున్న శవ బేరాన్ని చూడలేక!" అని ఘాటుగా అంది రంజని.

"లేదమ్మగారూ! నేను వద్దంటున్నా పోలీసోళ్ళు వినడంలేదు." అన్నాడు. అతని గొంతులో నిజాయితీ బరువుగా కదలాడింది. రంజని నుండి ఎలాంటి స్పందనా లేకపోవడంతో ఆమె నమ్మడంలేదని అనుకొన్న వెంకటేసులు – "నా బిడ్డ తోడు!" అంటూ చంకలో ఉన్న కూతురు తలపై చెయ్యి వేసాడు.

అనంత్ ఆగాడు. రంజని మనసు చలించింది.

"నాకు డబ్బొద్దమ్మా! చచ్చిపోయిన నా భార్య శవాన్నిచ్చేస్తే చాలు. మీరైనా చెప్పండి సార్!" – వెంకటేసులుకు దుఃఖం తన్నుకువచ్చింది.

అనంత్ చకచకా ఇన్స్పెక్టర్ దగ్గరకు వెళ్ళాడు. కాసింత ఇంగ్లీష్ లోనూ, కాసింత తెలుగులోనూ దబాయింపులు మొదలుపెట్టాడు. ఇన్స్పెక్టర్ లొంగకపోవడంతో తనకు తెలిసిన డీఎస్పీకి ఫోన్ చేసాడు. పెద్దాఫీసరు ఫోన్లోకి రాగానే నీరుగారిన ఇన్స్పెక్టర్ అనంత్ చెప్పినవిధంగా రత్నమ్మ శవాన్ని వెంకటేసులుకు అప్పగించి వెళ్ళిపోయాడు.

రంజని అనంత్ వైపుకు అభినందనపూర్వకంగా చూసింది. ఆ అభినందనను స్వీకరిస్తున్నట్టుగా తల పంకించాడు అనంత్. ఆపై కావల్సిన కార్యాలన్నింటినీ అనంత్ ముందుండి నడిపించాడు. బరువైన హృదయాలతో వెంకటేసుల్ని, అతని కూతుర్ని వదిలి బయల్దేరారు రంజని, అనంత్ లు.

– – – – – – –

ఇంటికి రాగానే తల తిరుగుతున్నట్టుగా అనిపించింది రంజనికి. మరో నాలుగు రోజులు గడచినా అలాగే ఉండడంతో డాక్టర్ వద్దకు తీసుకెళ్ళాడు అనంత్.

"కంగ్రాట్స్ అనంత్! షీ ఈజ్ ప్రెగ్నెంట్!" అంటూ అతని చేతుల్ని గట్టిగా పట్టుకుని ఊపింది లేడీ డాక్టర్. ఒక్క నిముషం స్థాణువుగా నిలబడిపోయాడు అనంత్. "థాంక్స్ డాక్టర్!" అని మాత్రం అనగలిగాడు.

"నౌ, యూ గో హోమ్ అండ్ టెల్ హర్ ద స్వీట్ న్యూస్!" అని ముక్కు పై నుంచి జారుతున్న కంటద్దాల నుంచి అనంత్ ను చూస్తూ అతని భుజం తట్టింది డాక్టర్. "తప్పకుండా!" అన్నట్టుగా తలను ఊపాడు అనంత్.

– – – – – – –

ఇంటికి రాగానే హాల్లో ఉన్న కృష్ణుని చిత్రపటానికి ఎదురుగా, సోఫా మీద రంజనిని కూర్చోబెట్టాడు అనంత్. తను నేలపై కూర్చుని ఆమె ఒడిలో తలపెట్టాడు.

"ఏయ్! ఏమిటిది చిన్నపిల్లాడిలా!" అని నీరసంగా నవ్వుతూ అంది రంజని.

"ఓ పాపా లాలీ జన్మకే లాలీ ప్రేమకే లాలీ..." అని పాడాడు అనంత్.

"అబ్బా! ఆ పాటవున్న రాగమేంటి నువ్వు పాడుతున్న రాగమేంటి?" అంది రంజని.

"చిన్ని పాపాయిలు ఇంకెలా పాడ్తారమ్మా!!" గోముగా అన్నాడు.

"చిన్న పిల్లలు పాడతారేంటి! ఉంగా ఉంగామని ఏడుస్తారు!" అంది రంజని.

"గుడ్! ఇంకో ఫైవ్, సిక్స్, సెవెన్ మంత్స్ లో ఓ పాపా లాలీ అంటూ నువ్వు, ఉంగా ఉంగా అంటూ పాపాయీ ఇల్లంతా గోల గోల చేస్తారు!" మెల్లగా, మెత్తగా పలికాడు అనంత్.

"ఆహా! కలగంటున్నావా?"

"ఆ సోడాబుడ్డి కళ్ళద్దాల డాక్టర్ పెద్ద ముత్తైదువ చెబితేనూ అప్పటినుంచి కొద్దికొద్దిగా కలగంటున్నా!" అన్నాడు కన్ను గీటుతూ.

అందమైన కళ్ళని పెద్దవి చేసింది రంజని.

"అబ్బా! ఇలాంటి కళ్ళే పాపకొస్తేనో! కొంచెం మామూలుగా చూద్దూ!" అన్నాడు అనంత్.

చప్పున అతన్ని ముద్దు పెట్టుకుంది రంజని. ఆమె మెత్తని కురుల్లోకి చేతుల్ని పోనిచ్చి తన వైపుకు లాక్కున్నాడు అనంత్.

★ ★ ★ ★ ★ ★

"మీరు దయతో ప్రసాదించిన ఈ అదనపు ఆటలో నా ఆటకాయల్లో మొదటిది పరమపదసోపాన పటపు పై వరుసను చేరగలిగింది. రెండోది అన్ని పాముల్ని దాటుకుంది." అంది జగన్మాత.

"దేవీ! ఉప్పుకే గతి లేని వారికి చక్కటి అంబలి దొరికితే అది అదృష్టమేగా!" అన్నాడు జగన్నాటకసూత్రధారి.

"తప్పకుండా స్వామీ!"

"స్థితస్య పరిపాలనం క్షేమం అని అన్నట్టుగా ఉన్నదాన్ని కాపాడుకోవడాన్నే 'క్షేమ'మని చెబుతారు. సంపూర్ణ లౌకిక వ్యవహారాల్లో మునిగి తేలే వారు రోజులో ఒక్కమారైనా హృత్పూర్వకంగా నన్ను స్మరిస్తే ఆ నిముషం వరకూ చేసిన వారి పాపసంచయాన్ని హరిస్తాను. గంటకోమారు స్మరించిన వారికి గత జన్మల సంచితాన్ని సైతం హరిస్తాను. నన్ను స్మరించకపోయినా పరుల దుఃఖాన్ని పరిహరించే వారికి తత్కాల లాభాన్ని పొందింపజేస్తాను." అన్నాడు సత్యసంధుడు.

"అందుకేగా మిమ్మల్ని కరుణాసముద్రుడని వేదాలు కీర్తిస్తున్నాయి. తమ నుదుటివ్రాతలో పరమపదానికి సమీపానికి కూడా వచ్చే అర్హతలేని నా పావులకు ఆ భాగ్యాని కల్గించిన మీకు నా నమోవాకాలు!" అని అరుణ కమల సదృశాలైన నారాయణుని పదపద్మాలను తాకి నమస్కరించింది మహాలక్ష్మి.

ఆ వినయశీలను సాదరంగా లేవనెత్తాడు భవదూరుడు.

"దేవీ! సంసారమనే పరమపదసోపానపటంలో జీవులు నిచ్చెనల నెక్కుతూ, పాముల బారిన పడుతూ జీవయాత్రను కొనసాగిస్తారు. రోజులో ఇరవైయొక్క వేల ఆరువందల సార్లు శ్వాసోచ్ఛ్వాసల్ని సాగిస్తూ బ్రతికే జీవులు ఒక్కసారి ఊపిరి పీల్చి వదిలేందుకు పట్టే సమయమంతైనా నీ 'మాయాశక్తి'ని, నా 'వైష్ణవమాయ'ను గుర్తించి, ఆలోచించి, స్మరించగల్గితే నిచ్చెలన్నీ నెచ్చెలులౌతాయి. పాములన్నీ ప్రతిహతమౌతాయి. ఈ సూక్ష్మాన్ని గ్రహించేందుకే ఈ ఆటను సృజించాను. నీవు కోరిన ఏకాంతం నీకు సంతోషాన్నే కలిగించిందనుకుంటాను?" అన్నాడు భూతభావనుడు.

"మీ సంకల్పానుసారం ఈ చరాచర జగత్తు నడుస్తోంది. సృష్టి, స్థితి, లయాత్మకమైన ఈ అనంత పరమపద సోపాన కేళిలో దేశతః, కాలతః మీతో కలిసివుండే నాకు మీ అనంత గుణాల సౌందర్యసారం లేశమైనా ఎరుక కాలేదు. నాలాంటి అల్పురాలికి మీరు కలిగించిన సంతోషం ఎన్నలేనిది." అంటూ హరిని కౌగిలించుకుంది ఆ వక్షస్థాంగన.

"నీకు ఇంత ఆనందాన్ని పంచిన ఈ నాలుగు పావుల్నీ ఏం చేద్దాం దేవీ?" అనునయంగా అడిగాడు అనసూయావరదుడు.

"మీరు సృజించిన పావులకు మీ ఇష్టానుసారమే గతిని ప్రసాదించండి!"

"ఊహూ! కోరుకోవడం జీవుల వంతు. కోరుకున్నది నడపడమే నా వంతు. ఈ పావుల తరపున నువ్వు కోరు, నేను నెరవేరుస్తాను!" అన్నాడు శేషపర్యంకశయనుడు.

"ఆలోచించాలి! కాస్త సమయాన్ని కనికరించండి!"

"అవశ్యం!"

వైకుంఠపురపు అంతఃపురంలోని చంద్రశాలలో చంద్రకిరణాలు నయనోత్సాహంగా మెరుస్తుంటే, తన ముందు పరచివున్న  పరమపదసోపాన పటం మీద తమ తమ నెలవుల్లో నిలబడివున్న పావుల వంక సాలోచనగా దృష్టి సారించింది మహామాయ.

ఆది దంపతుల హస్త స్పర్శను కోల్పోయిన పాచికలు మౌనం వహించిన ఆ క్షణంలో వారి కరుణారసప్లావిత దృక్కుల్లో తడుస్తున్న పావులు అమ్మ కోరబోయే కోరికను వినడానికై మనసుల్ని రిక్కించి నిలబడ్డాయి.

★ ★ ★ ★ ★

“ఏమిటి దేవీ ఇంకా ఆలోచిస్తున్నావా” అన్నాడు శతంజయ సఖుడు.

“అవును స్వామీ! ఒక్కో ఆటకాయ ఒక్కో వైవిధ్యాన్ని కలిగివుంది.” అంది శతదళసమానానన.

“అవునా! ఏమిటో ఆ వైవిధ్యాలు?”

“మొదటగా మీ మొదటి పావు గురించి. ఆట మొదలైనప్పటి నుండీ ఒక్క పాము నోట కూడా పడకుండా ప్రయాణం సాగించింది. స్వర్గలోకాన్నీ, మహర్లోకాన్నీ అవలీలగా చేరింది. చూస్తూ ఉంటే ఈ కాయకు సుమతిత్వం ఉన్నట్టుగా ఉంది. ఇక మీ రెండో కాయ...కేవలం ఒకే ఒక్క పాము నోట

బడింది. ఆ చిన్ని అపశ్రుతి తప్ప మిగతా ప్రస్థానాన్ని అమోఘంగా సాగించింది. అత్యంత క్లిష్టమయాలైన 'గురుబోధ'ను, 'వైరాగ్యా'న్నీ చేరడమే గాక అన్ని కాయలకంటే మొదటగా 'వైకుంఠా'న్ని చేరింది. చూడగా చూడగా, ఈ పావు కేశవప్రియగా కనబడుతోంది." అంది జ్ఞానాంబిక.

"బాగు బాగు! చక్కటి విశ్లేషణలే చేసావు. మరి నీ పావుల గురించి కూడా చెప్పు!"

"ప్రభూ! నా మొదటి పావు కూడా సుమతీయుక్తమైన మీ రెండో పావులానే ఒక్క పాము నోట కూడా పడకుండా నడిచింది. కానీ పరమపదాన్ని పూర్తిగా సాధించలేకపోయింది. నా మొదటి పావును పరికించి చూస్తే...స్వర్గలోకంలో మీ మొదటి పావుతో జట్టు కట్టి, నెమ్మదిగా ప్రయాణించినా స్థిరత్వంతో నడచి బ్రహ్మలోకాన్ని చేరుకోగలిగింది. అక్కడితో ఆగకుండా పరమపదానికి ఒక్క మెట్టు దగ్గరలో వచ్చి నిలబడింది. మొత్తం మీద ఈ పావు నడక మనోరంజకంగా నడచింది. ఇక నా రెండో పావు గురించి చెప్పాలంటే..."

"ఆగావేం దేవీ!" అంటూ చిరునవ్వు నవ్వాడు చిత్తజ జనకుడు.

"నిజానికి ఈ ఆటకాయ వైవిధ్యం దాని నడకలోనే ఉంది. ఈ కాయ దిగినన్ని పాముల్ని మరే కాయా దిగలేదు." అంది దేవవనితా శిరోమణి.

"ఆశ్చర్యకరమైన విషయం చెప్పనా? మొత్తం ఆటలో ప్రారంభ స్థానానికి దిగజారిన ఒకే ఒక్క కాయ ఇది. అలా దిగజారినా కూడా అన్ని పాముల్ని దాటుకుని పైకి ఎగబ్రాకింది. అదీ దాని వైవిధ్యం."

"అనంతుడిచే మ్రింగబడినా అదే అనంతుణ్ణి దాటుకు సాగిన ధీశాలి ఈ కాయ అంటారా?"

"అనుమానమా!"

"మీ అనుమోదమే నాకు సమ్మోదం! ఇప్పుడు మొత్తం ఆటను, ఆటకాయలనూ సమీక్షించి చూస్తే – అనంతమైన సంసారంలో మనోరంజకల్లా భ్రమింపజేసే లౌకికాకర్షణలకు లోను కాకుండా ఉండే సుమతులు కేశవప్రియులై పరమపదాన్ని చేరుతారు!" అంది పంచగంగాతీరవాసిని.

"చక్కగా సమీక్షించావు దేవీ!" అన్నాడు శ్వేతవరాహరూపి.

"మహాప్రభూ! నా బాలిశ పలుకుల్ని హర్షిస్తున్న మీరు దయాసముద్రులే! మీరు సర్వజ్ఞ శిఖామణులు. మీ నోట జాలువారే ఉపదేశామృతానికై ఈ పావులే కాదు, నేను సైతం ఎదురు చూస్తున్నాను. అనుగ్రహించండి!"

ఆహ్లాదంగా నవ్వాడు ప్రహ్లాదవరదుడు.

"అవశ్యంగా విను దేవీ! వర్షపు చినుకు ద్వారా భూమికి చేరిన జీవి, తండ్రి గర్భంలో మూడు నెలలు ఉండి, రేతస్సు ద్వారా తల్లి గర్భంలోకి ప్రవేశించి, అక్కడ తొమ్మిది నెలలు ఉండి ప్రసూతి వాయు తాడనం చే భూమి పైకి రావడం జరుగుతుంది. ప్రాణమున్నంత వరకూ ఈ దేహాన్ని శరీరమని పిలుస్తారు. 'శీర్యతేతి శరీరం'. శీర్య మంటే రోగాది ఉపద్రవాలని అర్థం. నానా విధాలైన దైహిక, మానసిక రుగ్మతలతో హింసపడే దేహాన్ని శరీరమంటారు. త్రిగుణాత్మకమైన ఈ శరీరంలో సాత్వికగుణం వల్ల దయ, క్షమ, శాంతి మొదలైనవి పుడతాయి. రజోగుణం వల్ల అనేక కర్మలను చేయడానికి బుద్ధి పుడుతుంది. తమోగుణం వల్ల కామ, క్రోధ, లోభ, మోహాది దుర్గుణాలు పుడతాయి.

ఈవిధంగా నుదుటిన వ్రాసిన విధంగా జీవించి ప్రాణవాయువు తొలగగానే శరీరం కాస్తా శవమౌతుంది. యోగ్యులైన, యోగులైనా, అయోగ్యులైనా, చనిపోయిన వారి దేహాన్ని శవమనే పిలుస్తారు. 'శం సుఖం వహతీతి శవం'. యోగులు, యోగ్యుల విషయంలో 'శవం' అన్నది సుఖాన్ని కొనిపోయేదిగా ఉంటుంది. అయోగ్యుల విషయంలో సంకటభూయిష్టమై, దుర్గంధభరితమై, జంతువుల కాహారమయ్యే పాంచభౌతిక దేహంగానే మిగిలిపోతుంది. నేడు ఉండి మరునాడు శిథిలమైపోయే ఈ శరీరాన్ని దేవాలయంగా మార్చగలగడమే సాధన." అన్నాడు విలయరహితుడు.

"అందుకేగా, 'పిబత భాగవతం రసం ఆలయం' – ఈ దేహం నాశనమయ్యేవరకూ భాగవత రసాన్ని ఆస్వాదించమని తద్వారా కుళ్ళుతో కూడుకున్న దేహం ఆలయమౌతుందని వ్యాసభగవానుని రూపంలో మీరే తెలిపారు!" అన్నది రూపలావణ్యగుణయుక్తురాలు.

"ప్రియా! భూమి, నీరు, అగ్ని, గాలి మరియు ఆకాశం – ఈ ఐదు తత్వాలు కలిసి జీవికి దేహంగా ఏర్పడతాయి. ఈ ఐదు భూతాలు విడివిడిగా ఉంటున్నట్టు కనబడుతున్న ఒకదానిలో ఒకటి మిళితమైవుంటాయి. అంటే నీటిలో భూతత్త్వముంటుంది. అలానే ఆకాశంలో మిగిలిన నాలుగు తత్త్వాలూ ఉంటాయి. కానీ అవి కంటికి కనబడనటువంటి సూక్ష్మాంశాలలో కలిసిపోయి ఉంటాయి. బొగ్గులోను, వజ్రంలోనూ ఉండే మూలభూత వస్తువు ఒక్కటే. అలాగని బొగ్గు నుండి వజ్రాన్ని మానవులు తయారు చేయలేరు. కానీ నీ స్వరూపమైన ప్రకృతి శక్తి ఈ మార్పును సాధించగలగుతుంది. బొగ్గులాంటి దేహాన్ని వజ్రసమానంగా మార్చగలిగేది భక్తి. శ్రవణంతో మొదలుపెట్టి ఆత్మనివేదనం దాకా వెళ్ళగలిగిన వారు జ్ఞానసంపన్నులై ప్రకాశిస్తారు. అంటే బొగ్గు నుండి వజ్రంగా రూపాంతరం చెందుతారు. ఈవిధంగా, వైకుంఠపాళి మొదటి గడి 'కోతి'లో ఉన్న ఆటకాయ ఆట ముగిసేసరికి పరమపదాన్ని అందుకుంటుంది.

అట్టడుగు వరసలో ఉండే కోతి ప్రాకృతిక లక్షణాలకు నిదర్శనమైతే, పై వరుసలో ఉన్న మరో కోతి...అదే...హనుమంతుడు పరమపద సోపాన సదృశమైన ఆధ్యాత్మిక శిక్షణకు నిదర్శనం. 'కపి చలనే' అన్న ధాతువు ప్రకారం చంచలమైన స్వభావం కలదాన్ని కోతిగా పిలుస్తారు. అస్థిరమైన బుద్ధిని 'సుగుణమూ, 'సత్ప్రవర్తనా, 'నిష్టా, 'యాగమూ, 'యోగమూ, 'భక్తీ, 'చిత్తశుద్ధీ, 'గురుబోధా, 'జ్ఞానము, 'వైరాగ్యమూ' అనే పది సోపానాలను ఎక్కించినపుడు మునుపు చెప్పుకున్న చంచలమైన కపి కాస్త 'కం సుఖం పిబతీతి కపి' గా మారుతుంది. అంటే శాశ్వతమైన మోక్షసుఖమనే అమృతాన్ని సేవించే 'కపి' గా రూపాంతరం చెందుతుంది. అలా కానప్పుడు, 'హిరణ్యాక్ష ', 'నరకాసుర ', 'బకాసుర ', 'దుర్యోధన', 'తనరథ ', 'కర్కోటక ', 'మాత్సర్య ', 'అర్కాసుర ', 'అహంకార ', 'శతకంఠ రావణ ' అనబడే పది రకాల పాముల నోట బడి అధ:పాతాళానికి తోయబడతారు.

'భోగేన పుణ్యం కుశలేన పాపం' అన్న చందాన కుశలబుద్ధితో పాముల్ని దాటుకుని, సుగుణాత్మకాలైన నిచ్చెనలను ఎక్కి పరమసుఖాన్ని భోగించడమే జీవుల జీవనోద్దేశ్యం. ఆ మహాసంకల్పానికి తొలిమెట్టుగా, చిన్నతనాననే దిశానిర్దేశం చేయడానికే ఈ వైకుంఠపాళిని సృజించాను. ఇప్పుడు నీతో

ఆడాను. అనంతకాలం నుండి అనంతకాలం వరకూ జీవుల చేత ఆడిస్తున్నాను...ఆడిస్తూనేవుంటాను!" అన్నాడు చరాచరజగన్నిర్మాతృ.

"అనూన్యంగా మీ నుండి అమోఘమైన ఉపదేశాలను వినిపింపజేసిన ఈ పావుల్ని శాశ్వత సుఖానుభూతిలో ఓలలాడించండి!" అంటూ  వినయశీలయై, వినమితగాత్రియై ఆ నీరజనేత్రి నమస్కరించింది. సత్యపూర్ణుడై, సుసత్యకాముడై, సత్యాభీష్టదాయకుడై ఆ పావులను అనుగ్రహించాడు భక్తాపరాధసహిష్ణుడైన శ్రీమన్మహావిష్ణువు.

★ ★ ★ ★ ★

**"మాతా చ కమలాదేవీ పితా దేవో జనార్దనః I**

**బాంధవా విష్ణుభక్తా చ నివాసం భువనత్రయం II"**

అంటూ మంగళాశాసనం చేసాడు కేశవ శర్మ.

ఒడిలో కూర్చునివున్న కవలల చేత నమస్కారం చేయించింది సుమతి.

★ ★ ★ ★ ★

"సుమతీ!" అని పిలిచింది రంజని.

బుడి బుడి నడకలతో వచ్చింది పాపాయి. 'జేజి'కి నమస్కరించింది.

కనకదుర్గమ్మ చిత్రం మనోజ్ఞంగా నవ్వింది.

★ ★ ★ ★ ★

గుడిగంట మ్రోగింది.

జ్ఞానానికీ, అజ్ఞానానికీ మధ్యనున్న తేడా ఒకే ఒక అక్షరమన్న సత్యం ప్రభాత సూర్యునిలా ప్రత్యుత్థానమౌతోంది.

ఆ వెలుగులో ఆ ఆలయ శిఖరం మరోమారు తళుక్కుమని మెరిసింది.

అకుంఠిత దీక్షాదక్షులకై వైకుంఠపాళి శబ్దార్థ సమన్వయ చాతుర్యభరితమై మరోమారు ఆయత్తమయింది..

**~~~ సమాప్తం ~~~**

# పాఠక స్పందనలు

రఘోత్తమరావుగారు రచించిన వైకుంఠపాళీ నవలిక పూర్తి చేశాను. ఆవకాయ.కామ్ లో ముప్పై భాగాలు కింద వచ్చింది.

తానాపత్రిక సంపాదకులు నారాయణస్వామి ఈ నవలకి లింక్ పంపారు.

పిల్లలకోసం తపించే ఇద్దరు దంపతుల జీవన యానంలో ఎదుర్కునే సమస్యలను, వైకుంఠపాళీ పావుల నడకలతో, పాచికల విన్యాసాలతో, గళ్లలోని బొమ్మల అర్థాలు.. అంతరార్థాలతో.. ఆధ్యాత్మక వివరణలతో, వేదాంతపరమైన విశ్లేషణలతో అద్భుతంగా చిత్రించారు రచయిత.

ఆట ఆడేది శ్రీమహావిష్ణువు, శ్రీమహాలక్ష్మి. వారే ఉదాహరణలతో వివరిస్తారు.

నాకు బాగా నచ్చినవి.....

వైకుంఠపాళీ ఆటలో పాచికలు వేసినప్పుడు.. అవి చేసే సవ్వడిని వర్ణించిన విధానం. ఒక్కొక్క సారి ఒక్కో ధ్వని.. దాన్ని విశ్లేషించుకుంటే జరగబోయే సంఘటనలు కొంతవరకూ ఊహించుకోవచ్చు.

పటంలోని ప్రతీ బొమ్మకీ ఇచ్చిన ఆధ్యాత్మిక విశ్లేషణ. రచయిత పాండిత్యాన్నీ, ప్రతిభనీ, పరిణతనీ తెలుపుతుంది.

నవలలో పాత్రల ఉదాత్తత. మధ్యలో పరిస్థితులకి, బలహీనతలకి లోనైనా.. మారడం.

స్త్రీ పాత్రలని చాలా ఉన్నతంగా తీర్చారు.

ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా.. పాముల నోట్లో పడినా.. లేచి తట్టుకుని నిలబడి మళ్లీ నిచ్చెనలెక్కగలగడం.. చివరికి పరమపదసోపానం చేరడం.. సహజంగా ఉంది. జీవితంలో ఎప్పుడూ కష్టాలే ఉండవు.. అపార్థాలు కలకాలం నిలవవు. చెడ్డవాళ్లు చెడ్డవాళ్లగానే ఉండరు..

ఈ నవలలో.. నాకు ఇబ్బంది కలిగించినది.. ఒకే ఒక విషయం. అదీ రెండుసార్లు. వేర్వేరు పరిస్థితులలో.. ఇద్దరు ఆత్మహత్య చేసుకుంటారు. వారి సమస్యలకి ఆత్మహత్యే పరిష్కారమా? ఎటువంటి క్లిష్ట సమస్య నేనా ఎదుర్కొని సాధించగలగే సందేశమివ్వాలని కోరుకుంటాను.

మొత్తానికి ఆలోచనాత్మకమైన రచన.

**మంథా భానుమతి**

వైకుంఠ పాళీ నవలికను 2012 లో మొదటిసారిగా చదివాను.

హృదయానికి హత్తుకుపోయింది. ఎంతగా అంటే నాల్గు సార్లు చదివినా తృప్తిగా అనిపించలేదు. అప్పట్లో అంటే 2012లో వారం వారం వస్తున్న భాగాలను ఒక చోట పోగేసి జాగ్రత్త పరిచాను. పేరు పేరునా అందరికి పంపాను – "మీరూ చదవండి!" అని.

మనం ఒక మంచి దృశ్యంను చూచినపుడు లేదా ఒక మంచి వంటకం వండినపుడు మనతో పాటు మనవాళ్ళు కూడా అదే ఆనందాన్ని, అనుభూతిని పొందాలనే ఓ చిన్న స్వార్థం వుంటుంది కదా! ఇదీ అలాంటిదే !

కథా రచన ఎంతో సరళం గా వుంది. కాని ఎన్నో విషయాలను విశదీకరించింది.

రచయితకు ఒకసారి అభినందనలను, కృతజ్ఞతను చెప్పాలి అనిపించేది. ఫేస్‌బుక్‌లో ఫ్రెండ్స్ అయ్యేవరకూ రఘోత్తమరావు గారు ఎవరో పూర్తిగా తెలియదు! అయితే, ఈ నాలుగు మాటల్ని వ్రాయడం ద్వారా నా అభినందనల్ని తెలిపే అవకాశాన్ని సాధించాను.

వైకుంఠపాళి మనం ఎలా బ్రతకాలో చెప్పే రచన.

మనలో చాలా మంది ఈ నవలికలో వచ్చే ప్రధాన పాత్రల్లో ఒకటైన 'రంజనీ'లమే! అందరికీ ఎంతో కొంత తెలుసు. కాని తెలియాల్సింది ఎంతో ఉంది. దాన్ని ఎలాగైనా సరే తెలుసుకోవాలి.

ఇందులో నచ్చిన మరో అంశం – సైనికుల గురించి కేశవశర్మ సుమతికి చెప్పిన వివరణ. తప్పనిసరిగా చదివి, గుర్తుపెట్టుకోవల్సిన అంశం ఇది.

నాకు భావ వ్యక్తీకరణ అంతగా రాదు. లేకుంటే నవలిక చదివిన తరువాత పొందిన అనుభూతిని వివరిస్తూ నేనూ ఒక చిన్నపాటి రచన చేసి వుండేదాన్ని.

వైకుంఠపాళి నవలికను వ్రాసిన రఘోత్తమ రావు గారికి కృతజ్ఞతలు.

రమణ చెన్నారెడ్డి

సమకాలీన లౌకిక సమస్యలనే రుగ్మతలకి భారతీయ సనాతన ధర్మం అనే అమృతంలో విశ్లేషణ అనే శొంటికొమ్ము రంగరించి ఈ వైకుంఠపాళి అనే మధురమైన ఔషధాన్ని తయారు చేశారు అభినవ భిషగ్వరులు, మిత్రులు రఘోత్తమరావు గారు.

సుమతి – శర్మల జంట ఒకటి; రంజని – అనంతుల జంట ఒకటి.

ఈ రెండు జంటలూ కలగలిసిన నలుగురు వ్యక్తులూ ఈ కథా ప్రపంచానికి నాలుగు స్తంభాలు. ఇక కథ నడిపించేది సాక్షాత్తూ ఆ జగన్నాటక సూత్రధారే అయినప్పుడు, పక్కన జగన్మాత ఉండి వంతపాడుతున్నప్పుడు కథ రక్తి కట్టడంలో ఆశ్చర్యమేముంది.

ఆసక్తికరమైన కథన చాతుర్యంతో పాటు, మకిలి పట్టిపోయిన మన మెదళ్ళని రుద్ది శుభ్రంచేసే పదునైన విశ్లేషణ జోడై ఏకకాలంలో బుద్ధికీ మనసుకూ సాంత్వన చేకూర్చినాయి. పాచికలు విసురుతున్న అమ్మవారి చేతి కంకణాల చప్పుడంత అందంగా ధ్వనించింది చిక్కనైన చక్కని తెలుగు.

వైకుంఠపాళి నవలికను వ్రాసిన రఘోత్తమరావుకు అభినందనలు.

.

ఎస్. నారాయణ స్వామి

"తానా" పత్రిక సంపాదకులు

# మనసులో మాట

వైకుంఠ పాళీ చదవడం మొదలు పెట్టాక తెలిసింది శ్రీ మహాలక్ష్మి తో నారాయణుడు వైకుంఠ పాళీ ఆడడం అనే ఒక చిన్న కాల్పనికతకు ఎంత శక్తి ఉంది అని. ఆ శక్తి కేవలం రచయితకు ఉన్న ఆధ్యాత్మిక జ్ఞానం ద్వారానే ఈ రచనకు చేకూరింది అని చెప్పడం లో అతిశయోక్తి లేదు.

ప్రతి రచనలోను ఎక్కువ మలుపులు, ఆశ్చర్యకరమైన సంఘటనలు ఉండి ఉత్కంఠ కలిగించనవసరం లేదు. ఒక సర్వ సాధారణ విషయాన్ని నవీనంగా ఆవిష్కరిస్తూ, సంక్లిష్ట విషయాలను సులభంగా ప్రతిపాదిస్తూ వ్రాయడం నిజానికి చాల కష్టమైన విషయం. వైకుంఠపాళిలో ఈ తరహా శైలిని చూడగలిగాను. ఉదాహరణకు తనకు పిల్లల్ని ఆ దేవుడు ఎందుకు ఇవ్వలేదని సుమతి ప్రశ్నించినపుడు కేశవ శర్మ చెప్పిన సమాధానం ఇందుకు తార్కాణం.

సుమతి – శర్మల దాంపత్యం పాఠకులకు ఎన్నో సున్నితమైన విషయాలను తెలియజేస్తుంది. దైవం పట్ల ఉన్న అచంచలమైన విశ్వాసం ద్వారానే ధర్మబద్ధమైన ప్రతి కోరిక నెరవేరుతుంది అని ఈ రచనలో చాలాసార్లు చెప్పడం జరిగింది.

రంజని – అనంత్ ల మధ్య జరిగిన సంఘటనలు ఆధునిక పోకడలకు దర్పణాలు. అలాగే ఈ ఆధునిక దంపతులలో దాగి ఉన్న అనాది నిత్య ఆధ్యాత్మిక ప్రకంపనలే వారిలో మార్పులను తెచ్చాయి. “ఈ వేద భూమిపై పుట్టడం వలెనే అటువంటి మార్పు సాధ్యం కదా!” అని ఆశ్చర్యమేస్తుంది.

జీవుల సాధన ఆగిపోతే ఫలితం అధోగతే.  ఈ విషయం రంజని ఆలోచనా విధానంలో కలిగిన మార్పు చెప్పక చెబుతోంది.

ఏమీ చేయకపోవడం కూడా ఒక కర్మనే. దానికీ  ఒక హేతువు, ఒక ఫలితం ఉంటుంది. అప్పుడు ఏది ఆలోచిస్తే, ఏది చేస్తే మన జీవితాన్ని సఫలం చేసుకోగలం అనే విషయం అంతర్లీనం గా ఈ రచనలో చెప్పబడింది. అందుకే ఇది మనోవైజ్ఞానిక రచన.

ఇలాంటి రచనలు ఈ మధ్య కాలం లో నేను చదువలేదు.

నాకు భాగవత బంధువయిన రఘోత్తమరావు గారికి ఆ శ్రీమన్నారాయణుడు ఆయురారోగ్య సుఖ సౌఖ్యాలను విరివిగా ఇచ్చి వారితో ఇంకా మంచి రచనలు చేయించాలని మనసారా కోరుతూ ....

**డా॥ ఐ.వి.ఎస్.ఎస్. రాజు**

